వ్యాస మహాభారతం

(తెలుగు వచనం)

ఆది పర్వం - 2

డాక్టర్ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి
డాక్టర్ సూరం శ్రీనివాసులు

శ్రీ లలితా త్రిపుర సుందరీ ధార్మిక పరిషత్
విజయవాడ - 12.

46352

వ్యాస
మహాభారతం

(తెలుగు వచనం)

ఆది పర్వం - 2

డాక్టర్ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి
డాక్టర్ సూరం శ్రీనివాసులు

894-82781
రామ - మహా

వ్యాస

మహాభారతం (తెలుగు వచనం)

ఆది పర్వం - 2

ప్రథమ ముద్రణ : వికృతి ఉగాది (మార్చి) 2010

18 సంపుటాల వెల : రూ. 720/-

C27437

సుందరయ్య గ్రంథాలయ పబ్లిక్
A.C.No 96352
గచ్చిబౌలి, హైదరాబాద్-500032

ప్రతులకు :
డాక్టర్ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి
శివాలయం వెనుక, **పోలకంపాడు,**
తాడేపల్లి పోస్టు, గుంటూరు జిల్లా - 522501,
ఫోన్ : 08645-272093, సెల్ : 9491727611

ప్రచురణ & ప్రతులకు :
శ్రీ లలితా త్రిపుర సుందరీ ధార్మిక పరిషత్
డోర్ నెం. 76-8/1-28, లలితానగర్,
భవానీపురం, విజయవాడ - 520 012.
ఫోన్ : 0866-2414322, సెల్ : 9440346287

అమ్మనాన్నలు : **కరెడ్ల గోపాలకృష్ణమూర్తి, కమలమ్మ**

జన్మనిచ్చిన తల్లిదండ్రులకు కృతజ్ఞతలతో....

వెంకట సీతారామశాస్త్రి, సుందరశర్మ, శ్రీనివాస్

టైటిల్ ముద్రణకు సహకరించినవారు

శ్రీ కమ్ముల వెంకటేశ్వరరావు దంపతులు

శ్రీనివాస ఆఫ్‌సెట్ ప్రింటర్స్, విజయవాడ.

కీ॥శే॥ పరుచూరు నాగేశ్వరరావు గారు

వారి జ్ఞాపకార్థం

టైటిల్ బోర్డు ఇచ్చినవారు

కుమారులు :

శ్రీయుతులు వెంకటమోహన్ బాబా

వెంకటరామ సురేష్

కీ॥శే॥ కోడిదాసు సోమేశ్వరరావు

వారి జ్ఞాపకార్థం

ప్రింటింగ్ ఖర్చులు ఇచ్చినవారు

కుమారులు :

శ్రీయుతులు శ్రీనివాస్, సత్యనారాయణ (చినబాబు)

భవాని, విశాలాక్షి

ఎందరో మహానుభావులు

ఆది పర్వం ఇలా సర్వాంగసుందరంగా సకల జనహితంగా తీర్చిదిద్దడానికి ప్రత్యక్షంగాను, పరోక్షంగాను మాకు సహకరించిన డాక్టర్ కాళ్లకూరి అన్నపూర్ణ, డాక్టర్ వైద్యుల కృష్ణారావు, డాక్టర్ నిష్ఠల వేంకట సుబ్రహ్మణ్యేశ్వర శాస్త్రి, డాక్టర్ రేమెళ్ల వేంకట రామకృష్ణ శాస్త్రి, డాక్టర్ పాలపర్తి శ్యామలానంద ప్రసాద్ గార్లకు మా హృదయపూర్వక కృతాజ్ఞతాంజలులు సమర్పిస్తున్నాము.

ఏ పనికైనా భగవంతుని ఆశీస్సులతో పాటు మానుషదైవముల సహాయ సహకారాలు కూడా అవసరమే. కొంతమంది అవ్యక్తముగా వెనక వుండి సత్ కార్యక్రమ నిర్వహణం చేయడంలో సిద్ధహస్తులై ఉంటారు. వారు భగవదాదేశాన్ని పాటిస్తున్నట్లు తమంతా తామే దైవం మానుషరూపేణా అన్నట్లు వచ్చి అవ్యక్తముగా సహకరిస్తారు. ఆది అభిగమ్యకృతే దానం అన్నట్లుగా నిర్వహింపబడుతుంది. అటువంటి అవ్యక్త సుందరులు మా కరెడ్ల సుందరశర్మ గారు. వారు దీనివెనుక వెన్నెముకలా వుండి సర్వంతానే అయి వ్యవహరించారు. ఈ విషయంలో మేము వారికి కృతాజ్ఞతాబద్ధులమై నిలుస్తున్నాము. అటువంటి పెద్దల సహకారంతో **శ్రీ లలితా త్రిపుర సుందరీ ధార్మిక పరిషత్** ఏర్పడినది.

పంచమవేదమూ, సకలశాస్త్రసారమూ, భారతీయ సంస్కృతికి మూలకందమూ అయిన వ్యాసభారతం మొత్తం పద్దెనిమిది పర్వాలు యథాతథంగా, ఉన్నదిఉన్నట్లుగా సరళమైన తెలుగు వ్యావహారిక భాషలో సామాన్యపాఠకులకు కూడా అర్థమయ్యేటట్లు **తక్కువ వెలలో** అందించాలని

మా సంకల్పం.

ఈ ఆశయాలతో భారతీయ తత్త్వానికి, ఆధ్యాత్మిక తత్త్వానికి, సాహిత్య వైభవానికి సంబంధించిన గ్రంథాలను ముద్రించి తక్కువ వెలలో ప్రజలకు అందివ్వాలని మా ఆకాంక్ష. దీనిని ఆదరించే అభిమానులందరు మా కృతజ్ఞతకు పాత్రులు. ఈ సంస్థ వివిధ పదవులలో పాలుపంచుకుంటున్న పెద్దలు...

1.	గౌరవాధ్యక్షులు	శ్రీ కరెడ్ల సుందరశర్మ
2.	అధ్యక్షులు	డా తిప్పాభట్ల రామకృష్ణమూర్తి
3.	ఉపాధ్యక్షులు	డా। సూరం శ్రీనివాసులు
4.	కార్యదర్శి	డా। పాలపర్తి శ్యామలానందప్రసాద్
5.	కోశాధికారి	డా ధూళిపాళ రామకృష్ణ
6.	సహాయకార్యదర్శి	డా। ఉపద్రష్ట వెంకట రమణమూర్తి
7.	కార్యవర్గసభ్యులు	శ్రీ యండూరి గోవిందరావు
8.	"	శ్రీ మల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తి
9.	"	శ్రీ జన్నాభట్ల వీరేశ్వరశాస్త్రి

అందరికీ వందనాలు

కార్యదర్శి
శ్రీ లలితా త్రిపుర సుందరీ ధార్మిక పరిషత్

చదివి ముందుకు సాగండి

మనిషికి కోరికలు సహజాతాలు. కోరికలు తీర్చుకొనే ప్రయత్నం సహజాతం. కోరికలు తీరినా, తీరకున్నా ఏదో ఒక దశలో ఏదో ఒక కారణం వల్ల కోరికలు దూరం కావాలన్న ఆలోచనా సహజం. ఈ ప్రవృత్తిని అధ్యయనం చేసి, ఆనుపానులు గ్రహించి మహర్షులే మార్గదర్శనం చేశారో, వారి బోధనలు గ్రహించి మనిషే అలా మారాడో కానీ భారతీయులు ఆ ప్రవృత్తికి అద్భుతంగా స్పష్టంగా రూపకల్పన చేసికొన్నారు. ఆ ప్రవృత్తినే నాలుగుగా విభజించి పురుషార్థాలని పేరు పెట్టుకొన్నారు. అవే ధర్మ - అర్థ - కామ - మోక్షాలు. వాఙ్మయమంతా ఏదో ఒక కోణంలో ఈ అంశాలనే ప్రస్తావిస్తుంది. ప్రస్తుతిస్తుంది. వాటిలో తలమానికం, ఆ వాఙ్మయానికి మూలకందం శ్రీమహాభారతం. దానికి స్రష్ట, ద్రష్ట, కర్త అన్నీ వ్యాసమహర్షియే. పురుషార్థాలకు సంబంధించి భారతంలో ఉన్నదే మరెక్కడయినా ఉంటుందని, ఇక్కడ లేనిది మరెక్కడ ఉండదని ఘంటాపథంగా చెప్పగలిగాడు వ్యాసమహర్షి.

వేదశాస్త్రాలు దేవఋణం, పితృఋణం, ఋషిఋణమని మూడు ఋణాలతో మనిషి జన్మిస్తాడని చెప్తే వ్యాసమహర్షి మనుమార్గంలో మనుష్యఋణాన్ని కూడా చెప్పారు. సామాజికదృష్టిలో ఇది చాలా అద్భుతమూ, ఆదరణీయమూ, ఆచరణీయమూ అయిన అంశం. ఆ మనుష్యఋణాన్ని తీర్చుకొనే మార్గంలో ఆనృశంస్యాన్ని (భూతదయ) ఉద్బోధించారు వ్యాసమహర్షి. ప్రాణులన్నింటిపై కరుణ చూపగలగటమే మనుష్య ఋణవిముక్తికి మార్గం. ఆ విలువను ప్రతిపాదించటానికి తనవారినే భీష్మ, ధర్మరాజు; ధృతరాష్ట్ర, దుర్యోధనులు ప్రతినిధులనుగా స్వీకరించి భారతాన్ని నిర్మించాడు. తానూ ఆ మహానిర్మాణంలో పాత్ర అయి, తన వారిలోని గుణదోషాలనే హేతుబద్ధంగా ప్రస్తావిస్తూ మనిషి ఎలా ఉండాలో, ఎలా ఉండకూడదో **స్పష్టారుంధతీన్యాయంగా** భారతంలో ప్రదర్శించాడు వ్యాసమహర్షి. అన్నమాటకు ఒదిగి ఉండటంతో పాటు అమ్మమాటకు విలువనివ్వటాన్ని కూడా మానవజాతికి నేర్పాడు. దానికి ఇబ్బంది కలుగుతున్న స్థితిలో తానే స్వయంగా వచ్చి పరిష్కరించాడు (పాండవులందరూ

ద్రౌపదిని పెళ్ళి చేసికొనే విషయంలో ద్రుపదుని ఒప్పించి). అమ్మమాటమేరకు తనకవసరం లేకున్నా బిడ్డలను కన్నాడు. తలచుకొంటే చాలు ప్రత్యక్షమవుతానని అమ్మకు మాట ఇచ్చి దాన్ని నిలబెట్టుకొన్నాడు. మానవుడు సంపాదించవలసిన వాటిల్లో ధనం ముఖ్యం అనుకొంటాం. అంతకన్న ముఖ్యం తపస్సు. లోకకళ్యాణంకోసం ఆ తపస్సును కూడా ఖర్చుచేయటానికి వెనుదీయనివాడు వ్యాసుడు. అందుకే అందరికీ కనువిప్పు కల్గించటానికి భారతమృతవీరులను కూడా చూపించారు.

మహాభారతం మానవజీవనగమనంలో కరదీపిక. ధర్మాధర్మనిర్ణయంలో ఒరపిడిరాయి. కర్తవ్యాకర్తవ్యజ్ఞానాన్ని ఉపదేశించడంలో ఒక ఉత్తమగురువు. నిరాశకు లోను కాకుండా మనిషి బ్రతకటానికి ఒక ఒరవడి. అదుపులేని, అలవిమాలిన ఆశలను తెంచుకోవటానికి ఒక కొడవలి. తనను తాను సజీవశిల్పంగా తీర్చిదిద్దుకొవటానికి ఒక ఉలి.

అయినా భాషకారణంగా దానిని ప్రేమించే వారు, సంశయించే వారు కూడా చాలామంది దానిని చదవలేకపోతున్నారు. అందుకే తెలుగు వారికి ఆ వ్యాసభావాలను యథాతథంగా అందించేందుకే ఈ ప్రయత్నం - వ్యాస మహాభారతం (తెలుగు వచనం).

రామాయణ మహాభారతాలను ఆధ్యాత్మికవాదులు నెత్తికెత్తుకొని మోయటం ప్రారంభమైన తరువాత ఇవి ముసలివాళ్ళకు సంబంధించినవి అన్న భావం లోకంలో ప్రబలింది. ఇది దురదృష్టకరం. యౌవనంలోనే వీటిని చదువగలిగితే జీవితాన్ని సరిగా నడుపుకొనే జవజీవాలు గలుగుతాయి. సర్వమానవసౌభ్రాత్రం, సర్వప్రాణిసమత్వం మనస్సులో మెదిలి నిష్కల్మషంగా నడువగల ప్రవృత్తి కలుగుతుంది. ఇహలోకానికి ఇంతకంటే ఏం కావాలి...?

ఇట్లు
అనువక్తలు

★ మహాభారతం యథాతథంగా అనగా అధికపాఠాలతో సహా ఇచ్చాం. అధికపాఠాలు చిన్నసైజులో బ్రాకెట్లలో ఇచ్చాం.

విషయసూచిక

అధ్యాయ సంఖ్య	విషయము	పుట సంఖ్య
108.	పాండుని రాజ్యాభిషేకము. (26+$\frac{1}{2}$)*	17
109	ధృతరాష్ట్రుని వివాహము. (19)	19
110	కర్ణ జననము. (31+3$\frac{1}{2}$)	20
111.	కుంతీ వివాహము. (13)	22
112.	మాద్రితో పాండురాజు వివాహము – దిగ్విజయము. (45)	23
113.	విదుర వివాహము. (14)	26
114	ధృతరాష్ట్ర సంతానోత్పత్తి. (44)	27
115.	దుశ్శల పుట్టుక. (18)	29
116.	ధృతరాష్ట్ర కుమారుల పేర్లు. (18)	30
117.	మృగరూపమున నున్న మహర్షి పాండురాజును శపించుట. (34)	31
118.	పాండురాజు అనుతాపము – వానప్రస్థ స్వీకారము. (50)	33
119.	పుత్రప్రాప్తికై ప్రయత్నించుమని పాండురాజు కుంతినాదేశించుట. (37)	36
120.	వ్యుషితాశ్వోపాఖ్యానము. (37)	39
121.	కుంతి పుత్రులను పొందుటకు ఉద్యమించుట. (21+3)	41
122.	ధర్మజ భీమార్జునుల పుట్టుక. (78+10$\frac{1}{2}$)	42
123.	నకుల సహదేవుల పుట్టుక – పాండవుల నామకరణము. (32+23)	47
124.	పాండురాజమరణము – మాద్రి సహగమనము. (31+50)	50
125.	ఋషులు కుంతిని పాండవులను హస్తినకు కొనిపోవుట. (35+4$\frac{1}{2}$)	53
126.	పాండురాజు అంత్యక్రియలు. (32+1)	56
127	పాండవ ధార్తరాష్ట్రుల బాల్యక్రీడలు. (72)	58
128.	నాగలోకము నుండి భీముడు మరలి వచ్చుట. (43)	62
129.	కృప – ద్రోణ – అశ్వత్థామల జననము – ద్రోణుడు పరశురాముని నుండి శస్త్రాస్త్రములు పొందుట. (67)	64

* బ్రాకెట్లలోని మొదటి సంఖ్య సంస్కృతంలో ఆ అధ్యాయంలోని శ్లోక సంఖ్య రెండవ సంఖ్య అధికపాఠశ్లోక సంఖ్య

అధ్యాయ సంఖ్య	విషయము	పుట సంఖ్య
130.	ద్రుపదుడు ద్రోణుని తిరస్కరించుట - ద్రోణుడు హస్తిన చేరుట. (79)	68
131.	కౌరవ పాండవుల విద్యాభ్యాసము - ఏకలవ్యుని గురుభక్తి. (79+1)	73
132.	అర్జునుడు బ్రహ్మశిరోనామకాస్త్రమును పొందుట. (22)	77
133.	రాజకుమారాస్త్ర విద్యా ప్రదర్శనము. (35+7 $\frac{1}{2}$)	79
134.	భీమసేన - దుర్యోధన - అర్జునులు అస్త్ర విద్యను ప్రదర్శించుట. (32+1 $\frac{1}{2}$)	81
135.	కర్ణప్రవేశము - రాజ్యాభిషేకము. (41+2 $\frac{1}{2}$)	83
136.	భీమసేనుడు కర్ణుని తిరస్కరించుట - సుయోధనుడు సత్కరించుట. (25+1)	86
137.	ద్రుపద పరాభవము. (77+7 $\frac{1}{2}$)	88
138.	యుధిష్ఠిరుని యౌవరాజ్యాభిషేకము - పాండవుల వృద్ధిని చూచి ధృతరాష్ట్రుడు చింతించుట. (27)	92
139.	కణికుడు ధృతరాష్ట్రునికి కూటనీతి నుపదేశించుట. (93)	94
	8. జతుగృహ పర్వము - 11	
140.	పాండవుల పట్ల పురజనుల ప్రేమను చూచి దుర్యోధనుడు విచారించుట. (38)	100
141.	పాండవులను వారణావతమునకు పంపవలెనని దుర్యోధనుని సూచన. (24)	103
142.	ధృతరాష్ట్రుడు పాండవులను వారణావతమునకు పంపుట. (19+2)	104
143.	పురోచనుడు వారణావతమున లక్కయిల్లు నిర్మించుట. (19)	105
144.	పాండవుల వారణావతప్రయాణము - విదురుని రహస్యోపదేశము. (34)	107
145.	పాండవులు లక్కయింట ప్రవేశించుట. (31)	109
146.	ఖనకుడు లక్కయింటిలో సురంగము నిర్మించుట. (20)	111
147.	లాక్షాగృహదహనము- పాండవులు సురంగము ద్వారా తప్పించుకొనుట. (22)	112
148.	విదురుడు పంపిన నావికుడు పాండవులను గంగానది దాటించుట. (15)	114
149.	ధృతరాష్ట్రాదులు పాండవుల కొరకు దుఃఖించుట - పాండవుల వనప్రవేశము. (26+29)	115
150.	తల్లికొరకు భీమసేనుడు నీరు తెచ్చుట. (45)	118

అధ్యాయ సంఖ్య	విషయము	పుట సంఖ్య
	9. హిడింబ వధ పర్వము - 5	
151.	భీమ హిడింబల సంవాదము. (36+2)	120
152.	భీమ హిడింబుల యుద్ధము. (45+5)	123
153.	భీముడు హిడింబుని వధించుట. (36)	126
154.	భీమ హిడింబల కలయిక - ఘటోత్కచుని పుట్టుక. (46+33)	128
155.	పాండవులు వ్యాసుని దర్శించుట - ఏకచక్రాపురమున ప్రవేశించుట. (19)	132
	10. బక వధ పర్వము - 8	
156.	బ్రాహ్మణకుటుంబమునకు వివత్తు. (41+4 $\frac{1}{2}$)	134
157.	బ్రాహ్మణి తానే మరణింతు ననుట. (38+1)	137
158.	బ్రాహ్మణ కన్య త్యాగమునకు సిద్ధపడుట. (24)	139
159.	కుంతికి బ్రాహ్మణుడు తన దుఃఖకారణము వివరించుట. (17+2)	141
160.	కుంతి - బ్రాహ్మణుల సంభాషణ. (20)	142
161.	కుంతీ యుధిష్ఠిరుల సంవాదము. (26)	144
162.	బక - భీమసేనుల యుద్ధము. (28+1)	145
163.	నగర జనులందరు సంతోషించుట. (21)	147
	11. చైత్రరథ పర్వము - 19	
164.	పాండవులకు బ్రాహ్మణుడు విచిత్ర కథలను వినిపించుట. (12)	149
165.	ద్రోణ ద్రుపదుల వృత్తాంతము. (28+4)	149
166.	ధృష్టద్యుమ్న ద్రౌపదుల జననము. (56+38)	151
167.	పాండవులు కుంతి ద్రుపదపురమునకు బయలుదేరుట. (11)	157
168.	ద్రౌపది పూర్వజన్మవృత్తాంతమును వ్యాసుడు చెప్పుట. (16)	157
169.	అర్జున చిత్రరథుల స్నేహము. (80)	158
170.	తపతిని చూచి సంవరణుడు మోహించుట. (44)	163
171.	తపతీ సంవరణుల సంభాషణము. (26)	166
172.	వసిష్ఠుని సహాయముతో తపతీ సంవరణుల వివాహము జరుగుట. (50+6)	167
173.	క్షత్రియులకు బ్రాహ్మణ బలము కావలెననుట. (15)	171

అధ్యాయ సంఖ్య	విషయము	పుట సంఖ్య
174.	వసిష్ఠుని క్షమాశక్తి - విశ్వామిత్రుని పరాభవము. (48+10)	172
175.	విశ్వామిత్రుని ప్రోత్సాహముతో కల్మాషపాదుడు వసిష్ఠ పుత్రులను భక్షించుట. (49)	175
176.	కల్మాషపాదుని శాపవిమోచనము - అశ్మక జననము. (47)	177
177.	పరాశరుని జనవము - ఔర్వోపాఖ్యానము. (29)	180
178.	ఔర్వుని కోపమును పితరులు నివారించుట. (22)	182
179.	ఔర్వుడు తనకోపమును బడబాగ్నిలో విడచుట. (23)	183
180.	పరాశరుడు రాక్షసయాగము చేయుట - సమాప్తి. (23)	185
181.	బ్రాహ్మణి ఆంగిరసుని శపించుట. (26)	186
182.	పాండవులు ధౌమ్యుని తమ పురోహితునిగా వరించుట. (12)	187
	12. స్వయంవరపర్వము - 9	
183.	పాండవులు పాంచాలదేశమునకు వెడలుట. (20)	188
184.	స్వయంవర సభావర్ణనము - ధృష్టద్యుమ్నుని ప్రకటన. (37)	189
185.	ధృష్టద్యుమ్నుడు స్వయంవరాగత రాజులను ద్రౌపదికి పరిచయము చేయుట. (24)	191
186.	స్వయంవరాగతులయిన రాజులు లక్ష్యమును భేదింపలేకపోవుట. (29+5 $\frac{1}{2}$)	192
187.	అర్జునుడు లక్ష్యమును భేదించి ద్రౌపదిని పొందుట. (28+5 $\frac{1}{2}$)	194
188.	ద్రుపదుని రక్షించుటకై భీమార్జునులు రాజులనెదుర్కొనుట. (24+2 $\frac{1}{2}$)	196
189.	భీమార్జునులు కర్ణ శల్యాదులను జయించి ద్రౌపదిని తీసికొనిపోవుట. (47)	198
190.	ద్రౌపదిని అయిదుగురు వివాహమాడుటను గూర్చి సమాలోచనము. (25)	200
191.	పాండవు లెరుంగకుండ ధృష్టద్యుమ్నుడు వారిని పరిశీలించుట. (18)	202
	13. వైవాహిక పర్వము - 7	
192.	ద్రుపద పురోహితుడు యుధిష్ఠిరాదులను కలియుట. (29)	203
193.	పాండవులు, కుంతి ద్రుపదునిచే సమ్మానితులగుట. (15)	205
194.	ద్రుపద యుధిష్ఠిర సంవాదము - వ్యాసాగమనము. (33)	206
195.	వ్యాసుని ఎదుట ద్రౌపదీ వివాహచర్చ. (23)	208

అధ్యాయ సంఖ్య	విషయము	పుట సంఖ్య
196.	ద్రౌపదీ పాండవుల పూర్వజన్మ వృత్తాంతము. (53)	210
197.	పంచపాండవులతో ద్రౌపదీ వివాహము. (18+1)	213
198.	కుంతి ద్రౌపదిని ఆశీర్వదించుట - శ్రీకృష్ణుడు పాండవులకు కానుకలు పంపుట. (19)	215
	14. విదురాగమన రాజ్యలంభపర్వము - 13	
199.	దుర్యోధనుని చింత - దురాలోచన. (31+39 ½)	216
200.	దుర్యోధన ధృతరాష్ట్రుల సంభాషణ. (20)	219
201.	పాండవులపై పరాక్రమమే ఉచితమని కర్ణుడు చెప్పుట. (25)	220
202.	పాండవులకు అర్ధరాజ్యమిమ్మని భీష్ముడు దుర్యోధనునకు చెప్పుట. (19)	222
203.	ద్రోణుడు పాండవులను పిలిపించుమనుట - కర్ణుని తిరస్కారము. (28)	223
204.	భీష్మ ద్రోణుల మాటలను విదురుడు సమర్థించుట. (30)	224
205.	పాండవులను తీసికొని వచ్చుటకు విదురుడు ద్రుపదుని కడకేగుట. (26)	226
206.	పాండవులు అర్ధరాజ్యము పొంది ఇంద్రప్రస్థనిర్మాణము చేయుట. (52+99)	227
207.	నారదుని రాక - సుందోపసుందుల కథ చెప్పుట. (24+25 ½)	233
208.	సుందోపసుందుల తపస్సు - వరప్రాప్తి. (33)	235
209.	సుందోపసుందులు ముల్లోకాలను బాధించుట. (27)	237
210.	తిలోత్తమ సుందోపసుందులను మోహింపజేయుట. (32)	239
211.	సుందోపసుందుల మరణము - ద్రౌపదిపట్ల పాండవుల నియమము. (30+3 ½)	240
	15. అర్జున వనవాస పర్వము - 6	
212.	అర్జునుడు నియమభంగమొనర్చుట. (35+1)	242
213.	అర్జునుడు ఉలూపిని కలియుట. (36+1)	244
214.	అర్జునుడు చిత్రాంగదను వివాహమాడుట పుత్రుని పొందుట. (27)	246
215.	వర్గ అను అప్సరసకు అర్జునుడు శాపమోక్షమిచ్చుట. (23)	247
216.	అర్జునుడు నలుగురు అప్సరసలను విడిపించుట. (35)	248
217.	ప్రభాసతీర్థమున కృష్ణార్జునుల కలయిక - ద్వారకానగరాగమనము. (21)	250

అధ్యాయ సంఖ్య	విషయము	పుట సంఖ్య
	16. సుభద్రాహరణ పర్వము - 2	
218.	అర్జునుడు సుభద్రను అపహరించుట. (25+1)	251
219.	యాదవులతో యుద్ధము - బలరాముని క్రోధవచనములు. (32)	253
	17. హరణాహరణ పర్వము - 1	
220.	సుభద్రావివాహము, అభిమన్యుని పుట్టుక, విద్యాభ్యాసము. (89+1 $\frac{1}{2}$)	254
	18. ఖాండవదాహ పర్వము -6	
221.	కృష్ణార్జునులు ఖాండవ వనమున అగ్నిదేవుని చూచుట. (33)	259
222.	అగ్ని ఖాండవవనము దహించుట, శ్వేతకి కథ. (83)	261
223.	అర్జునుడు అగ్నినుండి ధనుస్సు, రథము పొందుట. (21)	266
224.	అగ్ని శ్రీకృష్ణార్జునులకు ఆయుధము లిచ్చుట, ఖాండవ దహనము చేయుట. (37)	267
225.	ఖాండవదహనమున ఇంద్రుడు వర్షము కురిపించుట. (22)	269
226.	దేవతలతో కృష్ణార్జునుల యుద్ధము. (52)	270
	19. మయదర్శన పర్వము - 7	
227.	దేవతల పరాజయము - మయాసుర రక్షణ. (47)	273
228.	మందపాల జరితల వృత్తాంతము - అగ్నిస్తుతి. (34)	275
229.	జరిత తన పిల్లల కొరకు విలపించుట. (22)	277
230.	జరిత - ఆమె పిల్లల సంవాదము. (18)	278
231.	శార్ఙ్గకములు అగ్నిని పొగడి అభయము పొందుట. (25)	279
232.	మందపాలుడు తన పిల్లలతో కలియుట. (32)	281
233.	ఇంద్రుడు శ్రీకృష్ణార్జునులకు వరమిచ్చుట - యమునురుని యమునాతటమునకు చేర్చుట. (19)	283

శ్రీమాత్రే నమః

వ్యాస
మహాభారతం
(తెలుగు వచనం)
ఆది పర్వం - 2

108. పాండు రాజు రాజ్యాభిషేకము.

ధృతరాష్ట్రుడూ,పాండురాజు, మహాత్ముడైన విదురుడు జన్మించిన తర్వాత కురువంశమూ, కురురాజ్యమూ, కురుక్షేత్రమూ మూడూ చక్కగా వృద్ధిపొందాయి. భూమిపై పంటలు ఏపుగా పెరిగేవి. సస్యాలు రసవంతంగా ఉండేవి. సకాలంలో మేఘాలు కురిసేవి. చెట్లు పూలనూ, పండ్లనూ ఎక్కువగా ఇచ్చేవి. వాహనాలు(గుఱ్ఱాలు, ఏనుగులు మొ) తుష్టిగా పుష్టిగా ఉండేవి. మృగాలూ, పక్షులూ ఆనందంగా జీవించేవి. పూలు పరిమళభరితంగా, పండ్లు రసభరితంగా ఉండేవి. నగరాలు వ్యాపారులతోనూ, శిల్పులతోనూ వ్యాపించి ఉండేవి. శూరులూ, పండితులూ, మంచివారూ సుఖంగా జీవించేవారు. దొంగలు అసలు లేరు. అధర్మంపై మక్కువగల ప్రజలు లేరు. రాజ్యంలోని అన్ని ప్రాంతాలలోనూ కృతయుగలక్షణాలు ఉండేవి. అప్పుడు ప్రజలందరూ సత్యవ్రతపరాయణులై యాగాచరణస్వభావం గలిగి ధర్మకర్మలనాచరిస్తూ పరస్పర ప్రీతితో వర్ధిల్లుతున్నారు. మానవులు అహంకారాన్నీ, కోపాన్నీ విడిచిపెట్టి, లోభానికి దూరంగా నిలచి ఒకరినొకరు అభినందించుకొంటూ గడిపేవారు. వారి ప్రవర్తనలో ధర్మమే ప్రధానమై ఉండేది. ఆ నగరం మహాసముద్రంవలె నిండుగా ఉండేది. మేఘాల సమూహంతో సమానమైన ద్వారాలూ, తోరణాలూ, గోపురాలతో శోభిల్లేది. వందలభవనాలతో కూడి ఆ హస్తినపురం దేవేంద్ర నగరమయిన అమరావతివలె ప్రకాశించేది. జనులు ఆనందంగా నదులలో, తోటలలో, దిగుడుబావులలో, జలాశయాలలో, కొండచరియలలో అందమయిన అరణ్యప్రదేశాలలో విహరించేవారు. ఆ విధంగా కురురాజ్యంలోని దక్షిణప్రాంతజనులూ, దేవతలూ, మునులూ, చారణులూ అందరూ ఉత్తర కురుప్రాంతంలోని వారితో పోటీ పడుతూ ప్రవర్తించేవారు.

కురువంశస్థులు అభివృద్ధిపరుస్తున్న ఆ రమణీయ రాజ్యంలో దీనులెవ్వరూ లేరు.

స్త్రీలకు వైధవ్యం లేదు. ఆ రాజ్యంలో బావులూ, తోటలూ, సభాభవనాలూ, దిగుడుబావులూ, బ్రాహ్మణగృహాలూ సర్వసంపదలతో కూడి నిత్యోత్సవాలతో విలసిల్లేవి. జనమేజయా! భీష్మునిచేత అంతటా ధర్మమార్గంలో రక్షింపబడుతున్న ఆ రాజ్యం దేవస్థానాలతో, వందలకొద్దీ యజ్ఞస్తంభాలతో గుర్తింపబడుతూ రమణీయంగా ఉండేది. ఆ కురురాజ్యం ఇతరరాజ్యాలను కూడా పరిశీలిస్తూ నిరంతరంగా అభివృద్ధిపథంలో నిలువగలిగింది. భీష్ముడు ప్రవర్తింపజేస్తున్న ధర్మశాసనమే రాజ్యమంతా నడిచేది. మహాత్ములయిన ఆ కుమారులకు సమయోచిత సంస్కారాలను చేస్తున్నప్పుడు నగరవాసులూ, గ్రామీణులూ అందరూ నిత్యోత్సవాలుగా భావించేవారు. కురుముఖ్యుల భవనాలలోనూ, పౌరుల ఇళ్ళలోనూ ఎటుచూచినా "దానాలు చేయండి. అతిథులకు అన్నం పెట్టండి" అన్నమాటలే వినిపించేవి. ధృతరాష్ట్రునీ, పాండునీ, మహామతి అయిన విదురునీ పుట్టిననాటినుండి కన్నబిడ్డలవలె భీష్ముడు పెంచాడు. భీష్ముడు వారికి చేయవలసిన సంస్కారాల నన్నింటినీ జరిపించాడు. ఆ ముగ్గురూ బ్రహ్మచర్యవ్రతాన్నీ, వేదాధ్యయనాన్నీ కొనసాగిస్తున్నారు. పనిచేయటంలో, వ్యాయామం చేయటంలో కూడా వారు నేర్పు గడించారు. క్రమంగా యౌవనంలో ప్రవేశించారు. ధనుర్వేదంలో, గుఱ్ఱాల స్వారిలో, గదాయుద్ధంలో, కత్తి-డాలు ప్రయోగించటంలో, ఏనుగులను అదుపుచేయటంలో, నీతిశాస్త్రంలో పారంగతులు అయ్యారు. ఇతిహాసపురాణాలనూ, వివిధ శిష్టాచారాలను తెలిసికొన్నారు. వేద వేదాంగతత్త్వజ్ఞులూ, అన్ని విషయాలలోనూ నిశ్చయజ్ఞానం గలవారూ అయ్యారు. పాండుడు విలువిద్యలో ఆనాటి మనుష్యులందరినీ మించి ముందు నిలిచాడు. ధృతరాష్ట్ర మహారాజు శారీరకంగా ఇతరుల కన్న బలంగా ఉండేవాడు. రాజా! మూడులోకాలోనూ విదురునివలె ధర్మనిత్యుడై, ఆత్మదృష్ట అయినవాడు ఒక్కడు కూడా లేడు. నశించిన శాంతనువంశం మరల ఉద్ధరింపబడటాన్ని చూచి అన్నిరాజ్యాల ప్రజలూ ఇలా చెప్పుకొనేవారు- వీరమాతలలో అంబికా, అంబాలికలు; దేశాలలో కురుదేశమూ, సర్వధర్మవేత్తలతో భీష్ముడూ, నగరాలలో హస్తినపురమూ గొప్పవి. ధృతరాష్ట్రుడు కళ్ళులేనివాడు కాబట్టి రాజ్యాన్ని పొందలేదు. విదురుడు పారశవుడు కాబట్టి రాజ్యార్హత లేదు. పాండుడు రాజయినాడు. ఒకానొక సమయంలో సర్వనీతివేత్తలలో శ్రేష్ఠ డయిన భీష్ముడు ధర్మతత్త్వజ్ఞుడైన విదురునితో న్యాయోచితంగా ఒక మాట అన్నాడు.

109. ధృతరాష్ట్రుని వివాహము.

భీష్ముడిలా అన్నాడు. 'సద్గుణసంపన్న మయిన మన వంశం జగత్ప్రసిద్ధి నందినది. ఇతరరాజులను జయించి భూమండలంలో సామ్రాజ్యాన్ని పొందింది. పూర్వం ధర్మవేత్తలూ, మహాత్ములూ అయిన రాజులు పరిపాలించినదీ రాజ్యం. అందువలననే మనవంశ మెప్పుడూ నశించలేదు. నేనూ, సత్యవతీ, వ్యాసభగవానుడూ కలిసి మరల ఈ వంశాన్ని ఉద్ధరించాం. ఇప్పుడు సోదరులు మీరు ముగ్గురూ ఈ వంశానికి తంతువులూ, ప్రతిష్ఠాహేతువులూను. మరలా ఈ వంశం సముద్రంలా వృద్ధిచెందటానికి తగిన ఏర్పాట్లను నిస్సందేహంగా నేనూ, నీవూ చేయాలి. యదువంశానికి చెందిన కన్య మనవంశానికి అన్ని విధాలా తగినదని వింటున్నాం. అలాగే సుబలునికూతురు, మద్రరాజు కూతురు కూడా తగిన వారే. నాయనా! ఆ కన్యలు సద్వంశాలకు చెందినవారూ, రూపవతులూ. ఆ క్షత్రియశ్రేష్ఠులూ మనతో వియ్యమందటానికి అన్నివిధాలా తగిన వారు. ధీమంతులలో శ్రేష్ఠుడా! మన వంశప్రతిష్ఠాపనకోసం ఆ కన్యలను వరించాలని నేను అనుకొంటున్నాను. విదురా! నీ అభిప్రాయమేమి ?' విదురు డిలా అన్నాడు. 'మాకు నీవేతండ్రివి. నీవే తల్లివి. పరమగురువువు నీవే. కాబట్టి నీవే ఆలోచించి ఈ వంశానికి హితమైన దానిని చేయి.'

ఆ తర్వాత భీష్ముడు గాంధారరాజయిన సుబలుని కూతురు గాంధారిని గురించి బ్రాహ్మణుల ద్వారా విన్నాడు. ఆమె భగనేత్రహారి అయిన శంకరుని ఆరాధించి వందమంది కుమారులను వరంగా పొందిందని తెలిసింది. అది వాస్తవమని నిరూపణ చేసికొని కురుపితామహుడైన భీష్ముడు గాంధారరాజుకు కబురు పంపాడు. గాంధారరాజు సుబలుడు - ధృతరాష్ట్రుడు అంధుడు గదా - అని శంకించాడు. కానీ వంశాన్నీ, ప్రతిష్ఠను, ప్రవర్తనను బుద్ధితో సమీక్షించి సుబలుడు గాంధారిని ధృతరాష్ట్రునికి ధర్మచారిణిగా చేయటానికి మాట ఇచ్చాడు. ఆ తరువాత గాంధారి ధృతరాష్ట్రుడు అంధుడనీ, అతనికి తనను ఇవ్వాలని తల్లీ, తండ్రీ నిర్ణయించారనీ తెలిసికొని వస్త్రాన్ని తెప్పించి, మడతలు పెట్టి, కళ్ళకు కట్టుకొన్నది. భర్తను చూచి అతనిలోని దోషాన్ని ఎంచకూడదని ఆ పతివ్రత భావించింది. ఆ తరువాత గాంధార రాజుకొడుకు శకుని వయస్సుతో, శోభతో ప్రకాశిస్తున్న తన చెల్లెలిని తీసికొని కౌరవుల దగ్గరకు వచ్చి ఆమెను ధృతరాష్ట్రున కిచ్చాడు. సాదరంగా స్వాగతింపబడిన ఆమెకు భీష్ముని అనుమతితో వివాహం జరిపించారు. ఆ వీరుడు శకుని తన చెల్లెలిని ఇచ్చి, యథోచితంగా బట్టలుపెట్టాడు. భీష్ముని పూజలందుకొని, మరల తన నగరానికి వెళ్ళిపోయాడు. జనమేజయా! సుందరాంగి అయిన గాంధారి కూడా తనశీలం, ఆచారం, నడవడికలతో కురువంశస్థు లందరకూ ఆనందాన్ని కలిగించింది.

సత్ప్రవర్తనతో గురువుల నందరినీ పూజిస్తూ, పతియందే ఆసక్తి గల ఆ సువ్రత-గాంధారి-మాట మాత్రంగా కూడా పరపురుష ప్రస్తావన చేయకుండా గడిపింది.

110. కర్ణజననము.

యదువంశస్థులలో శ్రేష్ఠుడు శూరుడు. ఆయన కొడుకు వసుదేవుడు. శూరునకు ఒక కూతురు. ఆమె పేరు పృథ. సాటిలేని సౌందర్యవతి ఆమె. సత్యవచను డయిన శూరుడు అనపత్యుడై ఉన్న తన మేనత్తకొడుకుకు తనకు పుట్టబోయే తొలి సంతానాన్ని ఇస్తానని ముందుగానే మాట ఇచ్చాడు. శూరునకు ముందుగా ఆడపిల్ల పుట్టింది. మంచిమిత్రుడైన ఆ శూరుడు తన అనుగ్రహాన్ని కోరుతున్న మహనీయుడు, తన మిత్రుడూ అయిన కుంతిభోజునకు ఆ బిడ్డ నిచ్చాడు. తండ్రి ఇంటిలో దేవతలనూ, అతిథులనూ పూజించే బాధ్యత ఆమెది. ఒకసారి దుర్వాసుడనే ముని వారి ఇంటికి వచ్చాడు. ఆయన వ్రతదీక్షగలవాడూ, ఉగ్రస్వభావుడు కూడా. పృథ ఆయనను సేవించ నారంభించింది. అన్ని విధాలా ప్రయత్నించి ఆ ఉగ్రస్వభావుని సంతోషపరచింది. ఆ ముని పృథకు సంభవించబోయే ఆపదను గ్రహించి, ఆపద్ధర్మంగా ఉపయోగించుకొనటానికి వశీకరణమంత్రాన్ని ఉపదేశించాడు. ఆమెతో ఇలా అన్నాడు- 'ఈ మంత్రంతో నీవు ఏ దేవతల నాహ్వానించినా వారి అనుగ్రహంతో కుమారుని పొందగలవు.' ఆ బ్రాహ్మణుడు ఆ విధంగా చెప్పగా ఆ పృథ కుతూహలంతో కన్యగా ఉన్నప్పుడే సూర్యదేవుని ఆహ్వానించింది.

ఆహ్వానించగానే తన దగ్గరకు వస్తున్న లోకభావనుడయిన ఆ సూర్యుని ఆమె చూచింది. సర్వాంగసుందరి అయిన ఆమె ఆ మహాద్భుతాన్ని చూచి ఆశ్చర్యపడింది. సూర్యభగవానుడు ఆమెను సమీపించి ఇలా అన్నాడు- నేను వచ్చాను. నీకోసమేమి చేయాలి ?

(కళ్యాణీ! నీవు పిలవగానే నేను వచ్చాను. ఇది ఋషిమంత్ర ప్రేరణ. శుచిస్మితా! నేను సూర్యదేవుడను. నీకు పుత్రుని ఇవ్వటానికి వచ్చాను. గ్రహించు.)

కుంతి ఇలా అన్నది- 'శత్రుసంహర్తా! ఒక బ్రాహ్మణుడు నాకు ఈ విద్యనూ, వరాన్నీ అనుగ్రహించాడు. స్వామీ! దానిని పరీక్షించటానికి నిన్ను ఆహ్వానించాను. ఈ తప్పునకు నేను తలవంచి మిమ్ము ప్రార్థిస్తున్నాను. ప్రసన్నులు కండి. స్త్రీలు తప్పుచేస్తే ఉత్తమపురుషులు వారిని కాపాడాలి. సూర్యుడిలా అన్నాడు. దుర్వాసుడు వరమివ్వట మిదంతా నాకు తెలుసు. భయాన్ని విడిచి ఇక్కడ నాతో సమాగమించు. కళ్యాణీ! నాదర్శనం అమోఘమైనది. నీవు నన్ను పిలిచావు. పిరికిదానా! నిష్ప్రయోజకంగా ఆహ్వానిస్తే

అది కూడా తప్పే అవుతుంది.' ఈ విధంగా అనునయపూర్వకంగా సూర్యుడెంత చెప్పినా ఆ సుందరి 'తాను కన్య' అన్న భావంతో దానికంగీకరించలేదు. పేరుప్రతిష్ఠలు గల ఆకుంతికి బంధువులు ఏమనుకొంటారో అన్న భయం, సిగ్గూ కలిగాయి. మరలా సూర్యుడు ఆమెతో ఇలా అన్నాడు.

(సుందరీ! నీకు పుట్టబోయే కొడుకు అదితి ఇచ్చిన కుండలాలనూ, నేను అనుగ్రహించిన కవచాన్నీ ధరించి ఉంటాడు. ఆకవచం శస్త్రాస్త్రాలతో భేదించరానిది. శుచిస్మితా! దానిని బ్రాహ్మణుల కెప్పుడూ ఇవ్వగూడదు. నేనే చెప్పినా కూడా అకృత్యాలను తానెన్నడూ చేయడు. బ్రాహ్మణులు ఏదడిగినా ఇస్తాడు. ఆత్మాభిమాని అవుతాడు.)

యువరాణి! నా అనుగ్రహం వలన నీకే దోషమూ అంటదు.' ఆ రీతిగా చెప్పి వెలుగునూ, వేడినీ ప్రసాదించే ఆ సూర్యభగవానుడు కుంతీకుమారితో కలిశాడు. అప్పుడే ఆమెకొక కొడుకు పుట్టాడు. ఆ బాలుడు వీరుడూ, యోధులలో శ్రేష్ఠుడు. పుట్టుకతోనే కవచం ధరించిన శ్రీమంతుడు. దేవకుమారునివలె ప్రకాశిస్తున్నాడు. సహజమైన కవచాన్ని ధరించి, కుండలాలతో మొగాన వెలుగులను నింపుకొన్న సర్వలోకప్రసిద్ధిగల కొడుకు-కర్ణుడు-పుట్టాడు. పరమశోభగల ఆ సూర్యుడు ఆమెకు కన్యాత్వాన్ని మరలా అనుగ్రహించాడు. అనుగ్రహించి దేవలోకానికి వెళ్ళిపోయాడు.

వృష్ణివంశస్థురాలయిన ఆ కుంతి పుట్టినకొడుకును చూచి కలవరపడింది. ఏం చేస్తే బాగుంటుంది? అని ఒంటరిగా ఆలోచించింది. కుటుంబసభ్యులు ఏమంటారో అన్నభయంతో ఆమె తాను చేసిన తప్పును కప్పిపుచ్చుకొనటానికి బలిష్ఠుడైన ఆ బాలుని నీటిలో వదలివేసింది. నీటిలో విడువబడిన ఆపసికందును సూతనందనుడు, రాధభర్త(అధిరథుడు) స్వీకరించాడు. ఆ ఇద్దరూ ఆ బాలుని కొడుకుగా భావించారు. వారిద్దరు ఆ బాలునికి పేరుకూడా పెట్టారు. ధనంతో పాటు పుట్టాడు కాబట్టి వసుషేణుడనే పేరు ప్రసిద్ధిచెందాలి అనుకొన్నారు. బలిష్ఠుడయిన ఆ బాలుడు ఎదుగుతూ అస్త్రవిద్య లన్నింటిలో మేటి అయ్యాడు. సూర్యోదయం మొదలు సూర్యుడు వెన్ను కుదిరిగేదాకా ఆ పరాక్రమవంతుడు సూర్యుని ఉపాసించేవాడు. వీరుడూ, ధీమంతుడూ అయిన ఆ కర్ణుడు జపంచేస్తున్న వేళలో బ్రాహ్మణులు ఏమడిగినా దానంచేసేవాడు. ఇవ్వకూడనిదంటూ లోకంలో ఏదీ ఉండేది కాదు.

(ఆ తరువాత కొంతకాలానికి సూర్యుడు బ్రాహ్మణరూపాన్ని ధరించి కలలో కనిపించి వీరుడా! ఈ రాత్రి గడిచి తెలవారగానే ఇంద్రుడు నీదగ్గరకు వస్తాడు. విప్రరూపంలో నీ కవచకుండలాలను అపహరించాలన్న నిశ్చయింతో వస్తున్నాడు. అందుకని నీకు ముందే తెలియజేస్తున్నాను. నామాట గుర్తుంచుకో. ఆయనకు భిక్షనీయవద్దు." కర్ణుడిలా అన్నాడు. 'ద్విజా! ఇంద్రుడు విప్రరూపంలో వచ్చి

అడిగితే నీవు చెప్పావు గదా అని ఇవ్వకుండా ఎలా ఉండగలను. బ్రాహ్మణులు తమ మేలు కోరుతారు కాబట్టి దేవతలకు కూడా పూజనీయులు. దేవేంద్రుడే బ్రాహ్మణరూపంలో వచ్చాడని తెలిసినా కాదనలేను.' సూర్యుడిలా అన్నాడు- 'అలా అయితే వీరా! నామాటవిను. నీవు కూడా సకలశస్త్రాలనూ నిరోధించగల శక్తిని అడుగు. ఆయనకూడా వరమిస్తాడు.' ఈ విధంగా చెప్పి ఆ బ్రాహ్మణుడు కలలో అంతర్ధానమయ్యాడు. కర్ణుడు మేల్కొని ఆ కలను గురించియే ఆలోచించసాగాడు.)

ఇంద్రుడు బ్రాహ్మణరూపాన్ని ధరించి భిక్షకై కర్ణుని దగ్గరకు వచ్చాడు. ఆమహానుభావుడు కవచకుండలాలను కోరాడు. కర్ణుడు తనతో పుట్టుకతోనే ఉన్న కవచాన్ని శరీరం నుండి వేరు చేసి, కుండలాలను కోసి చేతులు జోడించి ఆయనకిచ్చాడు.

(దేవేంద్రుడు వాటిని స్వీకరించి కర్ణుని చేష్టతో సంతోషించి మనస్సులోనే అతని సాహసాన్ని అభినందించాడు. దేవదానవ యక్షులలో గానీ, గంధర్వ - ఉరగ రాక్షసులలో కానీ ఇటువంటి సాహసం గలవాడు కనిపించడని భావించాడు. "నీ సాహసకృత్యంతో సంతోషించాను. కావలసిన వరం కోరుకో" అన్నాడు. కర్ణుడిలా అన్నాడు - 'శత్రుసంహారం చేయగల దివ్యశక్తిని కోరుతున్నాను.' దేవేంద్రుడు శక్తినిచ్చి ఈ విధంగా పలికాడు.)

దేవదానవ మనుష్య గంధర్వనాగ రాక్షసులలో నీవు గెలువదలచుకొన్న ఏ ఒక్కని మీదనైనా ఇది పనిచేస్తుంది. ఇంతకుముందే లోకంలో వసుషేణుడని ఆయనకు పేరని చెప్పాను. ఇంద్రునకు కవచకుండల దానమనే ఘోరకృత్యంతో ఆయన కర్ణుడూ, వైకర్తనుడూ కూడా అయ్యాడు.

111. కుంతీ వివాహము.

కుంతిభోజుని కుమార్తె పృథ విశాలమయిన కన్నులు కలది. సత్త్వం, రూపం, ఉత్తమగుణాలు కలది. ధర్మాన్ని ఆశ్రయించి మహావ్రతాలను పాటించేది. అందం, యౌవనం, తేజస్సు గలిగి, స్త్రీకి తగిన గుణాలు మిక్కుటంగా ప్రకాశిస్తున్న ఆ కన్యను ఎంతోమంది రాజులు వరించారు. రాజోత్తమా! ఆ తరువాత కుంతిభోజుడు స్వయంగా రాజులనందరినీ ఆహ్వానించి పృథ యొక్క స్వయంవరాన్ని ఏర్పాటుచేశాడు. అప్పుడా మనస్విని ఆ రాజసమూహం మధ్యలో నున్న భరతవంశోత్తముని పాండురాజును చూచింది. అతడు సింహం వలె దర్పం గలిగి విశాలమైన వక్షస్థలం, వృషభనేత్రాలవంటి నేత్రాలూ గలిగి మహాబలుడై సూర్యునివలె వెలుగుతూ ఇతరరాజుల కాంతులను కప్పివేశాడు. మరొక దేవేంద్రుని వలె రాజుల మధ్యలో నున్న నరవరుడైన ఆ పాండురాజును చూచి శుభలక్షణాలు, నిర్దోషమైన శరీరమూ కల కుంతి మనసులో వ్యాకులపడింది. ఆమె శరీరాన్ని కామం చుట్టుముట్టింది. మనస్సు ఒక్క మాటుగా చలించింది. ఆ కుంతి సిగ్గుపడుతూ పాండురాజు

మెడలో పూలమాల వేసింది. పాండురాజును ఆమె వరించిందన్న మాట విని అక్కడ రాజులంతా ఏనుగులనూ, గుఱ్ఱాలనూ, రథాలనూ ఎక్కి వచ్చిన రీతిలోనే వెళ్ళిపోయారు. ఆ తరువాత ఆమెతండ్రి కుంతిభోజుడు వివాహం జరిపించాడు. ఆ విధంగా పాండురాజు దేవేంద్రుడు శచితో కలిసినట్టు కుంతిభోజుని కుమార్తెతో కలిశాడు. కుంతిభోజుడు కుంతికీ, పాండురాజుకూ వివాహం జరిపించి అనేకధనాలతో అర్చించి పాండురాజును తన నగరానికి పంపించాడు. అప్పుడు పాండురాజు నానాధ్వజ పతాకాలు గల గొప్పసేనతో కలిసి, బ్రాహ్మణుల, మహర్షుల ఆశీస్సులు పొందుతూ, అభినందింపబడుతూ తన నగరానికి వచ్చి కుంతిని తన భవనంలో ప్రవేశింపజేశాడు.

112. మాద్రితో పాండురాజు వివాహము: దిగ్విజయము.

ఆ తరువాత భీష్ముడు యశస్వి అయిన పాండురాజుకు మరొక పెండ్లి జరిపించటాన్ని గురించి ఆలోచించాడు. ఆ భీష్ముడు వృద్ధామాత్యులతో బ్రాహ్మణులతో మహర్షులతో కలిసి చతురంగ బలాన్ని కూడగట్టి మద్రరాజు నగరానికి వెళ్ళాడు. బాహ్లీకవంశశ్రేష్ముడయిన ఆ మద్రరాజు భీష్ముని రాకను విని, ఎదురేగి, అర్చించి, నగరానికి తోడుకొనివచ్చాడు. మద్రరాజు భీష్మునకు మంచి ఆసనాన్ని, పాద్యాన్ని, అర్ఘ్యాన్ని, మధుపర్కాన్ని ఇచ్చి రాకకు కారణాన్ని అడిగాడు. అప్పుడు కురూద్వహుడైన భీష్ముడు ఇలా అన్నాడు. 'అరిందమా! కన్యార్థినై నేను వచ్చాను. తెలిసికో. మాద్రి అనేపేరుతో నీకొక సోదరి ఉన్నదనీ ఆమె మంచితనానికి పేరుపొందినదనీ వింటున్నాం. పాండురాజు కోసం ఆమెను నేను కోరుతున్నాను. రాజా! మాతో వియ్యమందటానికి నీవు తగినవాడవే. నీకు మేము తగిన వారం. మద్రరాజా! దీనిని ఆలోచించి మమ్ములను శాస్త్రోక్తంగా స్వీకరించు.'

ఈ విధంగా మాటాడిన భీష్మునకు మద్రరాజు ఇలా సమాధానం చెప్పాడు- 'తమవంటి వారినుండి ఇంతకన్నా కోరదగినదీ, శ్రేయస్కర మయినదీ లేదని నా భావన. అయితే మా పూర్వీకులయిన రాజులు మా వంశంలో ఏర్పాటుచేసిన శుల్కవిధి ఒకటున్నది. మంచో, చెడో ఇప్పుడు దాన్ని నేను అతిక్రమించలేను. ఇది అందరకూ తెలిసినదే. నిస్సంశయంగా నీకు కూడా తెలిసియే ఉంటుంది. సత్పురుషా! అది తెలిసి కూడా కన్య నివ్వమని అడగటం మీకు తగదు. వీరా! అది మా కులధర్మం. మాకు అదే పరమప్రమాణం. ఆ కారణంగా అసందిగ్ధంగా నీకు నేను చెప్పలేకున్నాను.' జనపాలకుడైన భీష్ముడు మద్రరాజుకిలా బదులిచ్చాడు- 'రాజా! ఇది సద్ధర్మమే. సాక్షాత్తు బ్రహ్మదేవుడే దీనిని ధర్మమన్నాడు. దీనిలో తప్పేమీలేదు. ఈ ఏర్పాటు మీ పూర్వీకులు చేసినది. శల్యరాజా!

సజ్జనసమ్మతమయిన మీ కులమర్యాద మాకు తెలిసినదే.' ఆ మాటలు పలికి తేజస్సంపన్నుడైన భీష్ముడు శల్యరాజుకు బంగారం, బంగారునగలూ, విచిత్ర రత్నాలూ వేలకొద్దీ ఇచ్చాడు. ఏనుగులనూ, గుఱ్ఱాలనూ, రథాలనూ. వస్త్రాలనూ. ఆభరణాలనూ, మణులనూ, ముత్యాలనూ, పగడాలనూ కానుక చేశాడు. ఆ ధనాన్నంతా తీసికొని శల్యుడు మనసా ఆనందించి తన చెల్లెలిని అలంకరించి కౌరవరాజుకు సమర్పించాడు. ధీమంతుడు, గాంగేయుడైన భీష్ముడు ఆ మాద్రిని తీసికొని హాస్తినపురానికి వచ్చాడు.

ఆ తరువాత బ్రాహ్మణసమ్మతమై నచ్చిన ముహూర్తంలో పాండురాజు మాద్రిపాణిగ్రహణం చేశాడు. వివాహవిధి ముగిసిన పిమ్మట పాండురాజు తన భార్యను శ్రేయస్కరమయిన అంతఃపురంలో ప్రవేశపెట్టాడు. ఆ పాండురాజు కుంతి - మాద్రి అనే ఆ ఇద్దరు భార్యలతో స్వేచ్ఛగా, సుఖంగా విహరించాడు. ఆ తరువాత ఆ పాండురాజు ఒక నెలపాటు విహరించి, సుఖించి భూవిజయం కోసం నగరం నుండి నిష్క్రమించాడు. పాండురాజు భీష్ముడు మొదలుగా గల పెద్దలకు వందన మాచరించి, అన్నయైన ధృతరాష్ట్రునకు నమస్కరించి, ఇతర కురుప్రముఖుల ఆమోదంతో బయలు దేరాడు. మంగళాచారయుక్తమయిన ఆశీస్సులను పొంది ఏనుగులు, గుఱ్ఱాలు, రథాలతో కూడిన పెద్దసేనతో కూడి నిర్గమించాడు. ఆ పాండురాజు దేవకుమారులవలె తేజోమూర్తి. వసుంధరను జయించాలన్న కోరికతో ఆనందంగా బలిష్ఠంగా ఉన్న సేనతో ఎందరో రాజులపై దాడి చేశాడు.

కౌరవవంశకీర్తిని వృద్ధిపొందించగల నరశ్రేష్ఠుడైన ఆ పాండురాజు ముందుగా అంతకుముందే అపరాధులయిన దశార్ణదేశంపై దాడి చేసి వారిని ఓడించాడు. ఆ తరువాత పాండురాజు వివిధ ధ్వజాలతోనూ, లెక్కలేనన్ని ఏనుగులు, గుఱ్ఱాలతోనూ, పదాతులతోనూ, రథాలతోనూ కోలాహలంగా ఉన్నసేనను మగధదేశం పైకి నడిపించాడు. అక్కడ ఎందరో రాజులకు కీడుచేసి బలగర్వంతో ఉన్న మగధదేశరాజు దీర్ఘుని రాజగృహంలోనే సంహరించాడు. పాండురాజు ఆ తరువాత భూరిధనాన్ని, వాహనాలనూ తీసికొని మిథిలకు పోయి అక్కడ విదేహరాజును ఓడించాడు. అదేవిధంగా కాశిరాజ్యంలో, సుహ్మరాజ్యంలో, పుండ్రరాజ్యంలో కూడా పాండురాజు తన బాహుబల పరాక్రమాలతో కురువంశస్థులకు కీర్తిని కల్గించాడు. అరిందమమై, బాణసమూహమనే జ్వాలలూ, ఆయుధాలనే కాంతులుగల పాండురాజరూప మయిన అగ్నిని సమీపించి ఎందరో రాజులు దగ్ధమయ్యారు. సేనతో కూడివెళ్తున్న పాండురాజు సేనలతో ఎదురువచ్చిన రాజుల సేనలను ధ్వంసం చేసి వారిని లోబరచుకొని కౌరవుల

అధీనంలో పాలించేటట్లు నియోగించాడు. ఆ పాండురాజు ఓడించిన రాజులందరూ దేవతలలో దేవేంద్రునివలె భూలోకంలో ఒక్కపాండురాజునే శూరునిగా భావించారు. భూలోకంలోని రాజు లందరూ చేతులు జోడించి, తలలు వాల్చి ధనాన్ని, వివిధరత్నాలనూ తీసికొని పాండురాజును సమీపించారు. ఆ రాజులిచ్చిన మణులనూ, ముత్యాలనూ, పగడాలనూ, బంగారాన్నీ, వెండినీ, గోరత్నాలనూ, అశ్వరత్నాలనూ, శ్రేష్ఠరథాలనూ, ఏనుగులనూ, గాడిదలనూ, ఒంటెలనూ, దున్నపోతులనూ, మేకలనూ, గొఱ్ఱెలనూ, కంబళ్లనూ, మృగచర్మాలనూ, రత్నాలనూ, జింకచర్మంతో చేసిన పరుపులనూ– హస్తినపురాధిపతి అయిన పాండురాజు స్వీకరించాడు. అదంతా తీసికొని పాండురాజు స్వరాజ్యప్రజలను ఆనందింపజేస్తూ హస్తినపురానికి వెళ్ళాడు. ఆసమయంలో అశ్వాదివాహనాలు కూడా ఆనందించాయి. రాజశ్రేష్ఠ డయిన శంతనుడూ, ధీమంతుడైన భరతుడు–వీరి కీర్తికథలు లోకంలో లోపించే పరిస్థితిలో పాండురాజు మరల వాటిని ఉజ్జీవింపజేశాడు.

హస్తినాపురసింహమయిన పాండురాజు అంతకుముందు కురురాజ్యభాగాలనో, కురుధనాన్నో అపహరి పంచిన రాజులందరూ తిరిగి కప్పం చెల్లించేటట్టు చేశాడు. రాజులూ, రాజామాత్యులూ ఒకచోట చేరినపుడు ఇటువంటి మాటలే అనుకొనేవారు. పౌరులూ, జానపదులూ కూడా వారితో జతకలిపేవారు. అందరి మనసుల్లోను పాండురాజుపై నమ్మకం, ఆనందం వెల్లివిరిసేవి. భీష్ముడు మొదలుగా గల కురుప్రముఖులు పాండురాజును స్వాగతించటానికి ఎదురువెళ్ళారు. పాండురాజూ, ఆయనసేనలూ చాలా ఆనందంగా రావటాన్ని గమనించారు. హస్తినపురం నుండి ఏ కొద్దిదూరమో వెళ్ళి తిరిగివస్తున్న వారిలా వారు కనిపించారు. వారితోపాటు బహువిధ ధనాలూ, ఎన్నోబండ్లలో వేసికొనివచ్చిన గొప్పగొప్ప రత్నాలూ, ఏనుగులూ, గుఱ్ఱాలూ, రథాలూ, గోవులు, ఒంటెలు గొఱ్ఱెలు కూడా ఉన్నాయి. భీష్ముడూ, కౌరవులూ వాటిని చూస్తుంటే అవి అంతం లేకుండా కనిపించాయి. అంబాలికకు ఆనందవర్ధకుడైన పాండురాజు భీష్ముని పాదాలకు నమస్కరించి పౌరులనూ, జానపదులనూ తగినరీతిగా సత్కరించాడు. శత్రురాజ్యాలను మట్టిలోకలిపి కృతార్థుడై తిరిగి వచ్చిన కుమారుని కౌగలించుకొని భీష్ముడు కూడా ఆనందబాష్పాలు రాల్చాడు. ఆ పాండురాజు వందలకొలది తూర్యనాదాలూ, శంఖనాదాలూ, భేరీధ్వనులతో సహా అంతటా పౌరులను ఆనందింపజేస్తూ హస్తిన పురంలోనికి ప్రవేశించాడు.

113. విదుర వివాహము.

ఆ పాండురాజు తాను తన బాహుబలంతో గెలిచి తెచ్చిన ఆ ధనాన్ని ధృతరాష్ట్రుని అనుమతితో తన తల్లి సత్యవతికీ, భీష్ముడికీ కానుక చేశాడు. పాండురాజు విదురునకు కూడా ఆ ధనాన్ని పంపాడు. ధర్మాత్ముడయిన పాండురాజు ఆ ధనంతో మిత్రులను కూడా తృప్తిపరచాడు. భారతా! ఆ తరువాత సత్యవతి భీష్మునీ, యశస్విని అయిన కోడలిని కూడా పాండురాజు తెచ్చి ఇచ్చిన శుభధనంతో సంతోషింపజేసింది. తల్లి అయిన అంబాలిక అసమానతేజస్వీ, నరశ్రేష్ఠుడూ అయిన పాండురాజును జయంతుని శచీదేవివలె కౌగలించుకొని ఆనందించింది. వీరుడైన ఆ పాండురాజుపరాక్రమంతో ధృతరాష్ట్రుడు వంద అశ్వమేధయాగాలు చేశాడు. ప్రతియాగంలో లక్షసువర్ణముద్రికలను దానంచేశాడు. పాండురాజు అలసతను జయించాడు. కుంతితోనూ, మాద్రితోనూ కలిసి భవనాలలో నివాసాన్నీ సుఖశయ్యలను విడిచి ఎప్పుడూ అరణ్యసంచారాన్నే ఇష్టపడుతూ వేటాడ నారంభించాడు. ఆయన రమణీయమయిన హిమవత్పర్వత దక్షిణప్రాంతంలో సంచరిస్తూ గిరిశిఖరాలపై వేగిసచెట్లతో శోభలతో ఉన్న వనాలలో నివసించేవాడు. పాండురాజు కుంతీమాద్రులతో కలిసి అరణ్యంలో సంచరిస్తూ రెండు ఆడయేనుగుల మధ్యవిహరిస్తున్న శ్రీమంతమైన ఐరావతంవలె ప్రకాశించాడు. కత్తినీ, బాణాలనూ, వింటినీ, విచిత్రకవచాన్నీ ధరించి సంచరిస్తున్న పరమాస్త్రవేత్త అయిన ఆ పాండురాజును చూచి ఆటవికులు ఆయనను దేవునిగా భావించారు. ధృతరాష్ట్రుడు ఏర్పాటుచేసిన మనుషులు ఏ పాటి ఏమరుపాటూ లేక అడవులలో ఆ పాండురాజుకు అవసరమైన భోగసామగ్రిని సమకూర్చేవారు. తరువాత దేవకమహారాజు దగ్గర రూపయౌవనసంపన్న అయిన ఒక పారశవికన్య ఉన్నట్లు భీష్ముడు విన్నాడు. భీష్ముడు ఆమెను తీసికొనివచ్చి మహామతి అయిన విదురునికి ఆమెతో వివాహం జరిపించాడు. కురునందనుడైన విదురుడు ఆమె యందు గుణాలలో తనతో సమానమైన కొడుకులను కన్నాడు.

114. ధృతరాష్ట్రసంతానోత్పత్తి.

ఆ తరువాత ధృతరాష్ట్రునకు గాంధారి యందు వందమంది కొడుకులు పుట్టారు. వైశ్యజాతికి చెందిన మరొక భార్యయందు మరొక కొడుకు పుట్టాడు. పాండురాజుకు కుంతీమాద్రుల యందు మహారథు లయిన అయిదుగురు కొడుకులు పుట్టారు. వారు కురువంశాభివృద్ధికై దేవతలద్వారా పుట్టినవారు. జనమేజయుడిలా అడిగాడు. 'బ్రాహ్మణోత్తమా! గాంధారి యందు వందమంది కొడుకులు ఎలా పుట్టారు? ఎంత కాలానికి పుట్టారు?

వారి అయువు ఎంత? వైశ్యకాంతయందు ధృతరాష్ట్రునకు కొడుకు ఎలా పుట్టాడు? ధర్మచారిణియై తనకు తగినదై, అనుకూలంగా ప్రవరిస్తున్న ధర్మపత్ని గాంధారితో ధృతరాష్ట్ర డెలా ప్రవర్తించేవాడు? మహాత్ముడైన కిందమునిచే శపింపబడిన పాండురాజుకు దేవతల ద్వారా మహారథులయిన అయిదుగురు కొడుకులు ఎలా జన్మించారు? ఇదంతా సవిస్తరంగా యథాతథంగా వివరించి చెప్పు. మా బంధువులను గురించి సంక్షేపంగా వినటం నాకు తృప్తిగా లేదు.' వైశంపాయనుడిలా చెప్పాడు. 'ఒకప్పుడు కృష్ణద్వైపాయనుడు ఆకలితో, అలసటతో ధృతరాష్ట్రుని దగ్గరకు వచ్చాడు. గాంధారి పరిచర్యలతో ఆయనను సంతోషపెట్టింది. వ్యాసుడు ఆమెకు వరమీయదలచాడు. ఆమె తన భర్తతో సమానమైన కొడుకులు వందమందిని కోరింది. ఆ తరువాత ధృతరాష్ట్రుని ద్వారా ఆమె గర్భవతి అయినది. రెండుసంవత్సరాల పాటు ఆ గర్భాన్ని ఆమె ధరించినా కాన్పు రాలేదు. అంతలో కుంతికి సూర్యతేజస్సుగల కుమారుడు పుట్టాడని విన్నది. దానితో ఆమె దుఃఖించింది. తన గర్భం ప్రసవం కానందుకు ఎంతో విచారించింది. ఆ తరువాత ధృతరాష్ట్రునకు తెలియకుండా ఎంతో ప్రయత్నించి తన గర్భంపై కొట్టుకున్నది. దుఃఖంతో మూర్ఛిల్లింది. అప్పుడు ఆమె గర్భంనుండి ఒక మాంసపిండం బయటపడింది. అది లోహగోళంలా ఉంది.

తన కడుపులో రెండు సంవత్సరాలు భరించినా ఫలించని ఆ మాంసపిండాన్ని ఆమె పారవేయదలచింది. అంతలో దానిని గ్రహించిన వ్యాసమహర్షి వేగంగా అక్కడకు వచ్చాడు. తాపసశ్రేష్ముడయిన వ్యాసుడు మాంసమయమయిన ఆ పిండాన్ని చూచి గాంధారితో 'ఎందుకిలా చేస్తున్నా" వని అడిగాడు. ఆమె తన అభిప్రాయాన్ని ఆ మహర్షికి ఉన్నదున్నట్లు చెప్పింది. గాంధారి ఇలా అన్నది. 'కుంతికి సూర్యతేజస్సుతో సమానమయిన తేజోమూర్తి మొదటికొడుకు పుట్టాడని విని భరించరాని దుఃఖంతో నేను కడుపుకొట్టుకొన్నాను. నీవు నాకు వందమంది కొడుకులను వరంగా ఇచ్చావు. ఇది చూడు. వందమంది కొడుకుల స్థానంలో మాంసపుముద్ద పుట్టింది.' వ్యాసుడిలా అన్నాడు. 'గాంధారీ! నేనిచ్చిన వరం మేరకే జరుగుతుంది. మరొకవిధంగా జరగదు. నేను సరదాకు కూడా ఇంతవరకు అసత్యమాడలేదు. ఇక వరదానం చేసేటప్పుడు అసత్యానికి అవకాశమెక్కడిది? వెంటనే నూరు నేతికుండలను ఏర్పాటుచేయించు. బాగా చాటుగా దాచి వాటిని కాపాడే ఏర్పాటు చేయి. ఈ మాంసపిండాన్ని చల్లటి నీటితో తడుపు అన్నాడు. అప్పుడు ఆ మాంసపిండాన్ని తడుపుతుంటే అది నూరు ముక్కలయింది. బొటనవేలంత పరిమాణంతో నూరు గర్భాలుగా విడివిడిగా ఏర్పడింది. రాజా! కొంతకాలం గడవగా క్రమంగా వాటిని ఆయా కుండలలో పెట్టి, బాగా గోప్యంగా ఉన్న ప్రదేశంలో ఉంచి, వాటిని రక్షించే ఏర్పాటు చేశారు. వ్యాసుడు

"మరలా ఇంతకాలం తరువాతనే ఈ కుండలను తెరవా"లని గాంధారికి గట్టిగా చెప్పాడు. ఈవిధంగా పలికి ధీమంతుడైన వ్యాసభగవానుడు తాను ఆదేశించినట్లుగా వాటి ఏర్పాట్లు చేయించి, తపస్సుకోసం హిమాలయపర్వతానికి వెళ్ళిపోయాడు. తరువాత రెండు సంవత్సరాలు గడిచిన తర్వాత, కుండలలో మాంసపిండాల నుంచిన క్రమంలోనే ముందుగా దుర్యోధనుడు పుట్టాడు. జన్మకాలప్రమాణాన్ని అనుసరించి దుర్యోధనుని కన్న ధర్మరాజు పెద్దవాడు. దుర్యోధనుడు జన్మించిన విషయాన్ని భీష్మవిదురులకు తెలియజేశారు. ఎదిరించరాని వీరుడు దుర్యోధనుడు పుట్టిన రోజునే మహాబాహువూ, పరాక్రమవంతుడూ అయిన భీముడు కూడా పుట్టాడు. దుర్యోధనుడు పుట్టగానే గాడిదలు అరిచినట్టుగా అరుస్తూ ఏడ్చాడు. గాడిదలూ, గ్రద్దలూ, నక్కలూ, కాకులూ దానికి ప్రతిగా అరిచాయి. పెనుగాలులు వీచాయి. దిక్కులు మండిపోయాయి. రాజా! దానికి బెదరిపోయిన ధృతరాష్ట్రుడు భీష్మునీ, విదురునీ, అనేక బ్రాహ్మణులనూ, మిత్రులనూ, కురువంశ ప్రముఖులనూ పిలిపించి వారితో ఇలా అన్నాడు. 'మన వంశాన్ని వృద్ధిచేయగల రాజకుమారుడు యుధిష్ఠిరుడు జ్యేష్ఠుడు. తన గుణాలతో రాజ్యాధికారాన్ని పొందాడు. అతని విషయంలో ఎత్తి చూపవలసినది ఏదీలేదు.

యుధిష్ఠిరుని తర్వాత దుర్యోధనుడు పెద్దవాడు. దుర్యోధనుడు కూడా రాజు కాగలడా? ఈవిషయాన్ని ఆలోచించి నాకు వాస్తవాన్ని వివరించండి. జరుగవలసిన దానిని స్పష్టంగా చెప్పండి.' భారతా! ఆమాటలు ముగియగానే అన్ని దిక్కుల నుండి క్రూరజంతువులన్నీ ఘోరంగా అరవసాగాయి. అమంగళాన్ని సూచిస్తూ నక్కలు కూతపెట్టాయి. రాజా! అంతటా భయంకరమైన ఆ అశుభశకునాలనూ గుర్తించి విదురుడూ, ఆ బ్రాహ్మణులూ ఇలా అన్నారు. 'మహారాజా! నరోత్తమా! నీపెద్ద కుమారుడు పుట్టగానే భీకరశకునాలు పుట్టాయి. దీనిని బట్టి నీకొడుకు వంశాన్ని మొత్తాన్నీ నాశనం చేయబోతున్నాడనిపిస్తోంది. ఇతనిని పరిత్యజించటమే విఘ్నశాంతి కారణమవుతుంది. ఇలాగే కాపాడితే తీవ్రమయిన ఉపద్రవం కలుగుతుంది. భారతా! మహారాజా! నీకు తొంబది తొమ్మిదిమంది కొడుకులనే ఉండనీ, వంశ శాంతిని కోరుకొనేటట్లయితే ఈ ఒక్కడినీ విడిచిపెట్టు. **ఈఒక్కడిని విడిచిపెట్టి నీవంశానికీ, లోకానికీ క్షేమాన్ని కలిగించు. వంశంకోసం వ్యక్తినీ, గ్రామం కోసం వంశాన్నీ, జనపదం కోసం గ్రామాన్నీ, ఆత్మరక్షణకోసం దేశాన్నీ విడిచిపెట్టాలి.'** *

---

* **త్యజేదేకం కులస్యార్థే గ్రామస్యార్థే కులం త్యజేత్ ॥ 38**
గ్రామం జనపదస్యార్థే ఆత్మార్థే పృథివీం త్యజేత్।

విదురుడూ, బ్రాహ్మణులూ ఆరీతిగా చెప్పినా కూడా పుత్రస్నేహబంధంవలన ధృతరాష్ట్రుడు ఆపని చేయలేదు. తరువాత ధృతరాష్ట్రునకు నూరుగురు కొడుకులూ పుట్టారు. ఆ తరువాత ఒకనెలకు నూటఒకటవదిగా ఒక ఆడపిల్ల పుట్టింది. పెరుగుతున్న గర్భంతో గాంధారి లేవలేని సమయంలో ఒక వైశ్యకాంత ధృతరాష్ట్ర మహారాజుకు పరిచర్యలు చేసింది. రాజా! ఆ సంవత్సరంలో ధృతరాష్ట్రుడు ఆ వైశ్యకాంతయందు కొడుకును కన్నాడు. అతనిపేరు యుయుత్సుడు. యుయుత్సుడు కరణుడు. ఈ ప్రకారంగా వందమంది కొడుకులూ, నూటొకటవదిగా ఒక కూతురూ, తేజస్వీ, ప్రతాపవంతుడూ, వైశ్యాపుత్రుడూ అయిన యుయుత్సుడూ పుట్టారు.

115. దుఃశల పుట్టుక.

జనమేజయుడిలా అన్నాడు. 'మహర్షి అనుగ్రహంవలన ధృతరాష్ట్రునకు వందమంది కొడుకులు పుట్టడాన్ని మొదటినుండీ చెప్పావు. కానీ ఆసమయంలో కూతురు విషయాన్ని ప్రస్తావించలేదు. అనఘా! ఇప్పుడు వైశ్యాపుత్రుడు యుయుత్సుని గురించీ, ఇంకొక కూతురు గురించీ కూడా చెప్పావు. మహాతేజస్వి అయిన వ్యాసమహర్షి గాంధారికి వందమంది కొడుకులనే కదా! వరంగా ఇచ్చాడు. పూజనీయా! ఈ కూతురు ఎలా కలిగింది? నాకు తెలపాలి. విప్రర్షీ! ఆ మహర్షి మాంసపిండాన్ని నూరుముక్కలే చేసి ఉంటే, గాంధారి, మరలా గర్భవతి కాలేదుగదా! మరి దుఃశల ఎలా పుట్టింది? ఉన్నదున్నట్లుగా చెప్పు. నాకు చాలా కుతూహలంగా ఉంది.' వైశంపాయనుడిలా అన్నాడు. 'పాండవేయా! చక్కగా అడిగావు. సమాధానం చెపుతా విను. మహాతపస్వి అయిన వ్యాసుడు ఆ మాంసపు ముద్దను స్వయంగా నీళ్లతో తడిపి ముక్కలు చేశాడు. ఆముక్కలను దాదిచేత నేతితో నిండిన పాత్రలలో పెట్టించాడు. ఆ సమయంలో దృఢవ్రతశీల అయిన ఆ సుందరి - గాంధారి కుమార్తెలతోడి అనుబంధాన్ని భావించుకొని ఈ విధంగా ఆలోచించింది. 'ఈ మాంసపు ముద్దనుండి నాకు నూర్గురు కొడుకులు పుట్టడంలో అనుమానం లేదు. మహర్షి వ్యాసుడు అసత్యమాడడు. ఒక కూతురు కూడా పుడితే నాకు చాలా ఆనందంగా ఉంటుంది. ఈవందమంది కొడుకులు కాక మరొక చిన్నకూతురు కూడా పుడితే నా భర్త దౌహిత్రులవలన కలగబోయే పుణ్యలోకాలను కూడా పొందగలుగుతాడు. స్త్రీలకు అల్లుళ్ళపై ఆదరమెక్కువ. నూరుగురు కొడుకులు కాక మరొక కూతురు కూడా నాకుంటే కొడుకులూ, దౌహిత్రులతో కలిసి ధన్యురాలను కాగలను. నేను యథార్థంగా

తపోదానహోమాలను నిర్వర్తించి ఉంటే, గురుజనులను సేవించి ఉంటే నాకు కూతురు కూడా తప్పక పుట్టగలదు.' అంతలోనే మునిసత్తముడూ, పూజ్యుడూ అయిన వ్యాసభగవానుడు మాంసపు ముద్దను స్వయంగా విభజించి నూరువరకు ఆ ముక్కలను లెక్కించి గాంధారితో ఇలా అన్నాడు. 'వీరు నూర్గురు కొడుకులు. నేను అసత్యమాడను. అయితే ఇంకొక మాంసపు ముద్ద మిగిలి ఉన్నది. అది దౌహిత్రసంబంధి. దీని నుండి నీవుకోరినట్లుగా సౌభాగ్యవతి అయిన కూతురు నీకు కలుగుతుంది.' ఆ తపస్సంపన్నుడు మరొక నేతి కుండను తెప్పించి ఆ కన్యాభాగాన్ని దానిలో ఉంచాడు. మహారాజా! ఇదిగో ఈరీతిగా దుఃశలా జన్మ వృత్తాంతాన్ని చెప్పాను. చెప్పు. నీకు ఇంకా ఏం చెప్పాలి?

116. ధృతరాష్ట్రకుమారులపేర్లు.

జనమేజయుడిలా అన్నాడు. 'ధృతరాష్ట్రుని కొడుకులను పెద్దవాడితో ప్రారంభించి వరుసలో వారి వారి పేర్లతో కూడా తెలియజేయి.' వైశంపాయనుడిలా అన్నాడు. (ధృతరాష్ట్రుని కొడుకుల పేర్లు జ్యేష్ఠానుపూర్వంగా ఇవి) 1. దుర్యోధనుడు, 2. యుయుత్సుడు, 3. దుశ్శాసనుడు, 4. దుస్సహుడు, 5. దుశ్శలుడు, 6. జలసంధుడు, 7. సముడు, 8. సహుడు, 9. విందుడు, 10. అనువిందుడు, 11. దుర్ధర్షుడు, 12. సుబాహుడు, 13. దుష్ప్రధర్షణుడు, 14. దుర్మర్షణుడు, 15. దుర్ముఖుడు, 16. దుష్కర్ణుడు, 17. కర్ణుడు, 18. వివింశతి, 19. వికర్ణుడు, 20. శలుడు, 21. సత్త్వుడు, 22. సులోచనుడు, 23. చిత్రుడు, 24. ఉపచిత్రుడు, 25.చిత్రాక్షుడు, 26. చిత్రచాపుడు, 27. దుర్మదుడు, 28. దుర్విగాహుడు, 29. వివిత్సుడు, 30. వికటాననుడు, 31. ఊర్ణనాభుడు, 32. సునాభుడు, 33. నందుడు, 34. ఉపనందుడు, 35. చిత్రబాణుడు, 36. చిత్రవర్మ్మడు, 37. సువర్మ్మడు, 38. దుర్విరోచనుడు, 39. అయోబాహుడు, 40. చిత్రాంగుడు, 41. చిత్రకుండలుడు, 42. భీమవేగుడు, 43. భీమబలుడు, 44. బలాకి, 45. బలవర్ధనుడు, 46. ఉగ్రాయుధుడు, 47. సుషేణుడు, 48. కుండోదరుడు, 49. మహోదరుడు, 50. చిత్రాయుధుడు, 51. నిషంగి, 52. పాశి, 53. వృందారకుడు, 54. దృఢవర్మ, 55. దృఢక్షత్రుడు, 56. సోమకీర్తి, 57. అనూదరుడు, 58. దృఢసంధుడు, 59. జరాసంధుడు, 60. సత్యసంధుడు, 61. సదస్సువాక్కు, 62. ఉగ్రశ్రవుడు, 63. ఉగ్రసేనుడు, 64. సేనాని, 65. దుష్పరాజయుడు, 66. అపరాజితుడు, 67. పండితకుడు, 68. విశాలాక్షుడు, 69. దురాధరుడు, 70. దృఢహస్తుడు, 71. సుహస్తుడు, 72. వాతవేగుడు, 73. సువచుడు, 74. ఆదిత్యకేతువు, 75. బహ్వాశి, 76. నాగదత్తుడు, 77. అగ్రయాయి, 78. కవచి, 79. క్రథనుడు, 80. దండి, 81. దండధారుడు,

82. ధనుర్గ్రహుడు, 83. ఉగ్రుడు, 84. భీమరథుడు, 85. వీర బాహువు, 86. అలోలుపుడు, 87. అభయుడు, 88. రౌద్రకర్మ, 89. దృఢరథుడు, 90, అనాధృష్యుడు, 91. కుండభేది, 92. విరావి, 93. ప్రమథుడు, 94. ప్రమాథి, 95. దీర్ఘరోముడు, 96. దీర్ఘబాహువు, 97. వ్యూఢోరువు, 98. కనకధ్వజుడు, 99. కుండాశి, 100. విరజుడు. రాజా! వీరే నూరుగురు కొడుకులు. మరొకకూతురు. వీరి పేర్లక్రమంలోనే వీరిపుట్టుక. వీరందరూ అతిరథులూ, శూరులు. అందరు యుద్ధనైపుణ్యం గలవారు. అందరూ వేదవేత్తలు. అందరూ అస్త్రవిద్యలన్నింటిలో కోవిదులు. రాజా! ధృతరాష్ట్రుడు తగిన వయస్సులో వీరందరికీ బాగా విచారించి తగిన వారినిచ్చి పెళ్ళి జరిపించాడు. ధృతరాష్ట్రమహారాజు దుశ్శలకు కూడా తగినసమయంలో శాస్త్రోక్తంగా జయద్రథునితో వివాహం జరిపించాడు.

117. మృగరూపమున నున్న మహర్షి పాండురాజును శపించుట.

జనమేజయుడిలా అన్నాడు. 'వ్యాసమహర్షి అనుగ్రహం చేత కలిగిన ధార్తరాష్ట్రుల ఉత్తమజన్మను గురించి తెలిపినారు. తమరు బ్రహ్మవేత్తలు. ఈ ధార్తరాష్ట్ర పుత్రజననం మానవీయమయినా మనుష్యుల విషయంలో కని, విని ఎరుగనిది. బ్రహ్మస్వరూపా! విడివిడిగా నీవు తెలిపిన ధృతరాష్ట్రుని కుమారుల పేర్లను కూడా విన్నాను. పాండవుల జననాన్ని గురించి కూడా విశదపరచవలసినది. ఆ మహాత్ములందరూ దేవేంద్రుని వంటి పరాక్రమం కలవారు. అంశావతరణప్రసంగంలో వారు దైవాంశసంభూతులని నీవు ప్రకటించావు. వైశంపాయనా! మానవాతీతమయిన కర్మలు చేయగల పాండవుల జననవృత్తాంతాన్ని పూర్తిగా వినగోరుతున్నాను. వివరించవూ!' వైశంపాయనుడిలా అన్నాడు 'పాండురాజు జంతువులు, పాములు సంచరించే మహారణ్యంలో సంచరిస్తూ జతకట్టి ఉన్న ఒక మృగరాజును చూశాడు. వెంటనే పాండురాజు బంగారు రెక్కలుగల అయిదు తీక్ష్ణమయిన బాణాలతో ఆ ఆడజింకనూ, మగజింకనూ కొట్టాడు. రాజా! ఒకానొక మహాతేజస్వి, తపోధనుడూ అయిన ఋషికుమారుడు తాను మృగరూపాన్ని ధరించి, మృగరూపధారిణి అయిన భార్యతో సంగమించాడు. ఆ మృగపతి మృగరూపిణి అయిన భార్యతో సహా క్షణకాలంలోనే మానవులవలె మాటాడుతూ నేలగూలాడు. ఇంద్రియాలు నలిగిపోవటం వల్ల విలపించాడు. మృగమిలా అన్నది. "కామక్రోధాలతో నిండినవాడైనా, బుద్ధిహీనుడైనా, పాపకర్మాసక్తుడైనా కూడా ఏ నరుడూ ఇంత క్రూరకర్మలు చేయడు. **విధి ప్రజ్ఞను అతిక్రమించగలదు.** విధివశంగా సంభవించే పదార్థాలను ప్రాజ్ఞుడు కూడా గ్రహించలేడు. భారతా! నిత్యమూ ధర్మాత్ములైన క్షత్రియుల ప్రధానవంశంలో పుట్టినవాడవు నీవు. కాని కామలోభాలకు

అధీనమైన నీ బుద్ధి ధర్మాన్ని తప్పింది. వెంటనే పాండురాజు అన్నాడు. 'రాజు తన శత్రువుల పట్ల ప్రవర్తించిన రీతిగానే మృగాల పట్లకూడా ప్రవర్తించవచ్చు. కాబట్టి మృగమా! మోహవశుడవై నన్ను నిందింపదగదు. ప్రత్యక్షంగా కానీ చాటుగా కానీ మృగాలను చంపవచ్చు. అది రాజులకు ధర్మమే. కానీ, నీవు దానిని ఎందుకు నిందిస్తున్నావు? అగస్త్యుడు యాగదీక్షితుడై ఉండికూడా వేటాడాడు. సర్వదేవతాహితాన్ని అభిషిషిస్తూ ఆయన యాగానికి విఘ్నాలు కలిగిస్తున్న పశువులను అరణ్యాలలోనికి తరిమివేశాడు. అగస్త్యుని మార్గాన్ని అనుసరిస్తే నిన్ను సంహరించటం కూడా నాకు ధర్మమే. నేను ధర్మబద్ధంగానే ప్రవర్తిస్తున్నాను అయినా నీవు నన్ను ఎందుకు నిందిస్తున్నావు?' మృగమిలా అన్నది. 'నరులు తమ శత్రువుల మీదనయినా వారు కష్టాలలో ఉన్నప్పుడు బాణాలు ప్రయోగించరు. తగిన కాలంలోనే శత్రుసంహారం అభినందనీయ మవుతుంది.' పాండురాజిలా అన్నాడు. 'మృగమా! రాజులు వివిధోపాయాలతో పరాక్రమంతో ఆక్రమించి మృగాలను చంపుతున్నారు. అవి ప్రమత్తంగా ఉన్నా, అప్రమత్తంగా ఉన్నా భేదమేమీ లేదు. కానీ నీవు నన్ను నిందిస్తున్నావు.'

మృగమిలా అన్నది. 'రాజా! నీవు నన్ను కొట్టావు కాబట్టి నీవు మృగాలను హింసిస్తున్నావని నిన్ను నిందించటం లేదు. కానీ నీవు దయామయుడవై మైథున కర్మ విరమించునంతవరకు ఆగి ఉండవలసినది అన్నదే నా భావం. సర్వప్రాణులకూ హితకరమైన, అభీష్టమైన వేళలో వనంలో జతగట్టి ఉన్న మృగాన్ని వివేకవంతు డెవడైనా సంహరిస్తాడా? రాజేంద్రా! నేను కామరూపమయిన పురుషార్థాన్ని సఫలం చేసికోవాలని ఆనందంతో ఈ ఆడుజింకతో జతగట్టి ఉన్న వేళలో - దాన్ని నిష్ఫలం చేశావు. కౌరవ్యా! మహారాజా! ఇతరులను ఇబ్బంది పెట్టని పనులనే చేయటంలో ప్రసిద్ధిచెందిన పూరువంశంలో పుట్టిన నీకు ఈ పని తగినది కాదు. భారతా! అత్యంతమూ క్రూరమైన పనిని లోకమంతా నిందిస్తుంది. అది స్వర్గాన్నీ, కీర్తినీ కూడా దూరం చేస్తుంది. అది పాపకృత్యం కూడా. దేవసమాను డవయిన మహారాజా! నీవు స్త్రీభోగాలను గురించి బాగా తెలిసినవాడవు. శాస్త్రీయమైన ధర్మార్థాల తత్త్వమెరిగినవాడవు. అటువంటి నీవు నరకప్రాప్తి హేతువయిన ఇటువంటి పనిని చేయదగదు. రాజశ్రేష్ఠా! నీవు ధర్మార్థకామాలను విడనాడి క్రూరకర్మల నాచరించే పాపిష్ఠమానవులను దండించాలి. మానవోత్తమా! రాజా! వేళ్ళనూ, పండ్లనూ తిని జీవించే ముని నేను. మృగవేషాన్ని ధరించి నిత్యమూ శమపరాయణుడనై అరణ్యాలలో నివసించేవాడిని. ఏ తప్పు చేయనివాడను. నన్ను కొట్టి నీవు ఏమి సాధించావు? నీవు నన్ను హింసించావు. కాబట్టి దానికిప్రతిగా నిన్ను శపిస్తున్నాను. నీవు జతగూడిన ఒక జంటను హత్యచేశావు. నీవు కూడా అవశుడవై, కామమోహితుడవైన వేళలో ఇదేవిధంగా మైథునాసక్తిని ప్రకటించినప్పుడే

జీవితాన్ని ముగింపు జేయగల మృత్యువు నిన్ను ఆక్రమిస్తుంది.

నాపేరు కిందముడు. నేను తపోదీక్షితుడను. కాబట్టి మానవశరీరంతో ఈపని చేయటానికి సిగ్గుపడ్డాను. అందుకనే మృగరూపాన్ని ధరించి నాభార్యతోనే జతకట్టాడు. మృగరూపంతో మృగాలతో కలిసి ఈ కీకారణ్యంలో తిరుగుతున్నాను. ఈవిషయం నీవెరుగవు కాబట్టి నన్ను చంపినందువలన బ్రహ్మహత్యాపాతకం నీకంటదు. కానీ మృగరూపాన్ని ధరించి, కామమోహితుడనై ఉన్న నన్ను సంహరించావు. కాబట్టి దాని ఫలితాన్ని మాత్రం తప్పక అనుభవిస్తావు. మూర్ఖుడా! నీవు చేసిన ఈపనికి ఇటువంటి ఫలితాన్నే పొందగలవు. నీవు కూడా కామమోహితుడవై భార్యతో సంగమించబోవు వేళలో - ఇప్పటి నా అవస్థవంటి అవస్థలో యమలోకానికి వెళ్ళుదువు గాక! బుద్ధిమంతులలో శ్రేష్ఠుడా! నీవు చరమదశలో ఏభార్యతో సంగమిస్తావో, ఆమెయే సమస్తప్రాణులకు దుర్గమమయిన యమలోకానికి నీవు వెళ్ళినపుడు భక్తితో నిన్ను అనుసరించగలదు. సుఖంగా ఉన్న నన్ను దుఃఖానికి చేరువ చేశావు. ఇదే విధంగా నీవుకూడా సుఖాన్ని అనుభవించబోవు వేళలో దుఃఖం నిన్ను ముంచెత్తుతుంది. ఈమాటలు అని మృగరూపధారి అయిన ఆ ముని దుఃఖితుడై ప్రాణాలు విడిచాడు. ఆ క్షణంలోనే పాండురాజు కూడా దుఃఖార్తుడయ్యాడు.

118. పాండురాజు అనుతాపము - వానప్రస్థస్వీకారము.

ఆ కిందమముని మరణించిన తర్వాత పాండురాజు ముందుకు సాగుతూ తన బంధువులే దూరమైనట్లుగా ఇల్లాండ్రతో కలిసి దుఃఖిస్తూ ఈ విధంగా విలపించసాగాడు. 'సజ్జనుల వంశంలో పుట్టినవాడయినా ఆత్మనియంత్రణను కోల్పోయి, కామునివలలో చిక్కి విమోహితుడై దుఃస్థితికి లోనవుతున్నాడు. అయ్యో! నిత్యమూ ధర్మబద్ధమయిన మనస్సుగల శాంతనునకు జన్మించికూడా నాతండ్రి విచిత్రవీర్యుడు కామాసక్తి కారణంగానే చిన్న వయస్సులోనే మరణించాడని అంటుంటారు. ఆ విధంగా కామాసక్తుడయిన నరపాలుని భార్య యందే వాఙ్మయతిగల వ్యాసమహర్షి - భగవత్స్వరూపుడు - నన్ను కన్నాడు. నేను వేట అనే వ్యసనంలో పడ్డాను. ఆ కారణంగా దేవతలు నన్ను వదిలి వేశారు. అటువంటి ఉన్నత వంశంలో జన్మించిన నాబుద్ధికూడా మృగయాసక్తి వలన అధమస్థాయికి దిగజారింది.

మోక్షమార్గమే నాకిప్పుడు తగినదని భావిస్తున్నాను. బంధాలే మహాదుఃఖాలు. కాబట్టి నేను నాతండ్రివలె అక్షయమై, పుణ్యహేతువయిన వృత్తినే ఆశ్రయిస్తాను (అనుసరిస్తాను). నేను పూర్తిగా తపస్సులోనే లీనమవుతాను. దీనిలో సందేహం లేదు. కాబట్టి నేను ఒంటరినై, కుటుంబానికి కూడా దూరమై, ఒక్కొక్కచెట్టు నుండి భిక్షను పొందుతాను. తలగొరిగించుకొని,

మౌనసంన్యాసినై వానప్రస్థుల ఆశ్రమాలలో సంచరిస్తాను. అప్పుడు నాశరీరం ధూళిధూసరిత మవుతుంది. ఏకాంతప్రదేశం నా నివాసస్థాన మవుతుంది. లేదా చెట్లక్రిందనే నివసిస్తాను. ఇష్టానిష్టాల నన్నింటినీ వదలివేస్తాను. నష్టపడినా దుఃఖించను. లాభపడినా ఆనందించను. నిందాస్తుతులను సమానంగానే స్వీకరిస్తాను. నాకు ఆశీస్సులూ అవసరం లేదు, నమస్కారాలూ అవసరం లేదు. సుఖదుఃఖాది ద్వంద్వాలతో నిమిత్తంలేదు. దేనినీ యాచించను. ఎవ్వరినీ హేళన చేయను. ఎప్పుడూ కోపంగా బొమముడి వేయను కూడా. నేను ప్రసన్నవదనంతో సర్వప్రాణిహితాన్ని కోరుతూ ప్రవర్తిస్తాను. స్వేదజాలు, భూజాలు, అండజాలు, జరాయుజాలు అనే నాల్గురకాల చరాచరప్రాణులనూ హింసించకుండా చరిస్తాను. తండ్రి తన బిడ్డలను అందరినీ సమభావంతో చూచినట్లు ప్రాణు లన్నింటినీ సమాన దృష్టితో చూస్తాను. ఒక్కసారి మాత్రమే భిక్షను చెట్లనుండీ స్వీకరిస్తాను. లేకపోతే అయిదు లేక పది ఇళ్ళ నుండి మాత్రమే భిక్షను స్వీకరిస్తాను. భిక్ష దొరకకపోతే ఉపవాస ముంటాను. భిక్ష దొరికినప్పుడు కూడా చాలా తక్కువగానే భుజిస్తాను. మొదటి పద్ధతిలో భిక్ష దొరకనప్పుడు మాత్రమే మార్గాంతరాన్ని స్వీకరిస్తాను. ఆశకొద్దీ ఇంటింటికీ తిరిగి బిచ్చమెత్తను. ఎప్పుడైనా, ఎక్కడైనా తరువులనుండి భిక్ష దొరకనప్పుడు ఏడు ఇండ్ల దగ్గరకే భిక్షకై వెళతాను. భిక్ష దొరికినా దొరకకపోయినా సమానంగానే భావిస్తూ తీవ్రంగా తపస్సు చేస్తాను.

కత్తితో చేతిని నరికినవానినైనా, చందనంతో చేతిని అలంకరించినవానినైనా సమానంగానే చూస్తాను. చెడ్డవాడు, మంచివాడు అన్న భేదదృష్టితో చూడను. జీవించాలన్న కోరిక గానీ, మరణించాలన్న తపన గానీ లేకుండా జీవిస్తాను. జీవితాన్ని అభినందించను. మరణాన్ని ద్వేషించను. మనిషి తాను జీవిస్తూ అభ్యుదయప్రాప్తికై కామ్యకర్మల నెన్నింటినో చేస్తుంటాడు. అవి కాలానికి అధీనమైనవి. అటువంటి వాటి నన్నింటినీ విడిచివేస్తాను. అనిత్యఫలాల నిచ్చే ఇంద్రియకర్మల నన్నింటినీ పరిత్యజిస్తాను. ధర్మఫలాన్ని కూడా విడిచిపెడతాను. అంతకరణమాలిన్యాన్ని తొలగించుకొని జీవిస్తాను. సర్వపాప విముక్తుడనై,సర్వబంధాలను వదిలించికొని, ఎవ్వరి అదుపులోనూ నిలువక వాయుదేవునివలె సంచరిస్తాను. ఎల్లప్పుడూ సర్వవిధాలా ధైర్యాన్ని వహించి, నిర్భయమయిన మోక్షమార్గాన్ని ఆశ్రయించి, ఈ శరీరాన్ని పరిత్యజిస్తాను.

నేను బిడ్డలను కనే శక్తిని కోల్పోయాను. నాజీవితం, నాగృహస్థాశ్రమం కూడా దయనీయస్థితికి వచ్చాయి. స్వధర్మానికి దూరమయిన ఈ శోచనీయదశలో నేను నడవలేను.

గొప్పవాడయినా, సామాన్యుడయినా సరే దీనభావంతో జీవికమిది ఆశతో ఇతరులను ఆశ్రయించినవాడు కుక్కవంటివాడు.

పాండురాజు ఈవిధంగా పలికి దుఃఖిస్తూ, నిట్టూర్చుతూ కుంతిని, మాద్రిని చూపిస్తూ ఇలా అన్నాడు. (మీరు హస్తినకు పోయి) అంబిక, అంబాలికలను, విదురుని, సంజయుని, సబాంధవుడైన ధృతరాష్ట్రునీ, సత్యవతిని, భీష్మునీ, రాజపురోహితులనూ, దీక్షితులూ, సోమయాజులూ మహాత్ములూ అయిన బ్రాహ్మణులనూ, వృద్ధపౌరులనూ, మనల నాశ్రయించి జీవిస్తున్న అందరినీ ప్రసన్నులను చేసికొని 'పాండురాజు సన్యాసియై అడవులకు వెళ్ళాడ'ని చెప్పండి. వానప్రస్థానికై గట్టిగా నిశ్చయించుకొనిన భర్త మాటలను విని కుంతీ, మాద్రి ఆయన మాటలకు తగినట్లుగా ఇలా సమాధానమిచ్చారు. 'భరతశ్రేష్ఠా! సంన్యాసం కాక ఇతరాశ్రమాలు కూడా ఉన్నాయి. వాటి నాశ్రయించి ధర్మపత్నులమయిన మాతో బాటు మీరు తీవ్రతపస్సును చేయవచ్చు. ఆ తపస్సు స్వర్గదాయక మయిన మహాఫలంతో పాటు మోక్షాన్ని కూడా కలిగించవచ్చు. నీవే స్వర్గాధిపతివి కూడా కాగలవు. దానిలో అనుమానం లేదు. మేము కూడా ఇంద్రియాలను నియంత్రించి, భర్తృ సాన్నిధ్యాన్నే లక్ష్యంగా చేసికొని కామసుఖాలను పరిత్యజించి, మిక్కిలి తపస్సు చేస్తాము. మహాప్రాజ్ఞా! మహారాజా! నీవు మమ్ములను విడిచిపెట్టేటట్లయితే ఈరోజే మేము ప్రాణపరిత్యాగం చేస్తాం. ఇది నిస్సంశయం.'

పాండురాజు ఇలా అన్నాడు. 'మీరు ఈవిధంగా దీనినే ధర్మయుక్తంగా భావిస్తే నేను కూడా మాతండ్రి అయిన వ్యాసుని మార్గంలో అక్షయఫలితాన్నివ్వగల వానప్రస్థాశ్రమాన్నే స్వీకరిస్తాను. సుఖభోగాలనూ, గ్రామంలో దొరికే ఆహారాన్నీ విడిచి గొప్ప తపస్సు చేస్తాను. అరణ్యంలో ఫలమూలాలు తింటూ, నారచీరలు కట్టి జీవిస్తాను. ఉభయసంధ్యలలోనూ స్నాన సంధ్యానుష్ఠానాల నాచరిస్తూ, అగ్నిహోత్రాన్ని వ్రేల్చుతూ నారచీరలనూ, మృగచర్మాన్నీ, జటలనూ ధరించి పరిమితాహారంతో దేహాన్ని కృశింపజేస్తూ జీవిస్తాను. చలికీ, గాలికీ, ఎండకూ తట్టుకొంటాను. ఆకలిదప్పులను పరిగణించను. దుష్కరతపస్సుతో ఈ శరీరాన్ని కృశింపజేస్తాను. ఒంటరినై పర్యాలోచన చేస్తాను. కందమూలాలతోనూ, పండ్లతోనూ బ్రతుకుతాను. పితరులనూ, దేవతలనూ అడవులలో దొరికే పదార్థాలతోనూ, నీటితోనూ, మంత్రాలతోనూ తృప్తి పరుస్తాను. వానప్రస్థాశ్రమంలోని వారిని కానీ, గృహస్థులను కానీ చూడను. వారికి అప్రియమయిన పనులు చేయను. ఇక గ్రామవాసుల విషయం చెప్పేదేముంది? ఈరీతిగా నేను వానప్రస్థాశ్రమానికి సంబంధించిన కఠిన నియమాలను అన్నింటినీ పాటిస్తూ, దేహయాత్ర ముగిసేవరకూ వానప్రస్థాశ్రమంలోనే జీవిస్తాను. వైశంపాయనుడిలా అన్నాడు. పాండురాజు తన భార్యలతో ఆ విధంగా పలికి తన చూడామణిని, వక్షోలంకారాన్నీ, అంగదాలనూ, కుండలాలనూ, విలువయిన వస్త్రాలనూ, కుంతీమాద్రుల ఆభరణాలనూ

బ్రాహ్మణులకు దానంచేసి, మరలా ఇలా అన్నాడు. 'మీరు హస్తినాపురానికి వెళ్ళి కురునందనుడైన పాండురాజు అర్థకామాలనూ, విషయసుఖాన్నీ, స్త్రీ సంబంధమయిన రతిసుఖాన్నీ, అన్నీ విడిచి భార్యలతో కలిసి వానప్రస్థుడు అయ్యాడని చెప్పండి.'

అప్పుడు అతని అనుయాయులు, పరిచారకులూ అందరూ ఆ పాండురాజుయొక్క విషణ్ణవచనాలను విని పెద్దగా ఆర్తనాదం చేస్తూ హాహాకారాలు చేశారు. వారు వేడికన్నీటిని విడుస్తూ, ఆ పాండురాజిచ్చిన ధనమంతా తీసికొని, ఆయనను వీడి, వెంటనే హస్తినాపురానికి బయలుదేరారు. వారు నగరానికి పోయి, మహాత్ముడైన పాండురాజు వృత్తాంతాన్ని అంతా ధృతరాష్ట్రమహారాజుకు తెలిపి ఆ ధనమంతా ఇచ్చారు. అరణ్యంలో జరిగిన సమాచారమంతా వారు చెప్పగా విన్న ధృతరాష్ట్రమహారాజు పాండురాజును గూర్చి చాలా దుఃఖించాడు. ఆ పాండురాజు సంగతినే ఆలోచిస్తూ, భ్రాతృశోకంతో ధృతరాష్ట్రుడు శయ్యాసౌఖ్యాన్ని కానీ, ఆసనసౌఖ్యాన్నీ కానీ, ఇతరసుఖాలను కానీ బొత్తిగా ఇష్టపడలేదు. కౌరవ్యా! రాజకుమారుడయిన పాండురాజు ఫలమూలాలను తింటూ భార్యలతో సహా నాగశతపర్వతానికి వెళ్ళిపోయాడు. ఆ తర్వాత చైత్రరథమనే అరణ్యంలో కాలకూట, హిమవత్పర్వతాలను దాటి గంధమాదన పర్వతాన్ని చేరాడు. అక్కడ మహాభూతాలు, సిద్ధులూ, మహర్షులూ అయనకు రక్షకులయ్యారు. ఆ మహారాజు మిట్టపల్లాలపై నివసించ సాగాడు. మహారాజా! ఆపై ఇంద్రద్యుమ్న సరస్సు చేరి, హంసకూటాన్ని అతిక్రమించి, శతశృంగ పర్వతాన్ని చేరి, తాపసియై తపస్సు చేయసాగాడు.

119. పుత్రప్రాప్తికై ప్రయత్నించుమని పాండురాజు కుంతి నాదేశించుట.

ఆ శతశృంగ పర్వతంపై కూడా గొప్ప తపస్సు చేస్తున్న పాండురాజు సిద్ధచారణ సమూహాలకు కన్నుల పండువు అయ్యాడు. ఆపాండురాజు పెద్దలనూ సేవిస్తూ, అహంకారాన్ని వీడి, మనస్సునూ ఇంద్రియాలనూ అదుపులో నిలిపికొని, తన శక్తితోనే స్వర్గలోకాన్ని పొందటానికి ఉద్యుక్తుడయ్యాడు. కొందరికి తోబుట్టువులా కనిపించాడు. కొందరికి మిత్రుడయ్యాడు. మరికొంతమంది మహర్షులు ఆయనను కన్నబిడ్డగా భావించి కాపాడసాగారు. ఆ పాండురాజు చాలాకాలం నిష్కల్మషంగా తపస్సు చేసి బ్రహ్మర్షులతో సమానుడయ్యాడు. ఒక అమావాస్యనాడు వ్రతదీక్షలు గల మహర్షులు అందరూ కలిసి బ్రహ్మను సందర్శించాలన్న కోరికతో బ్రహ్మలోకానికి బయలుదేరారు. ప్రయాణమయిన ఋషులను చూసి పాండురాజు "ప్రవక్తలలో శ్రేష్ఠులయిన మీరు ఎక్కడకు వెళ్తున్నారు" అని వారిని అడిగాడు. ఋషులు ఇలా అన్నారు. 'నేడు బ్రహ్మలోకంలో పెద్దసభ జరుగుతోంది. మహాత్ములయిన దేవతలు, ఋషులు, పితరులు అందరూ కలుస్తున్నారు. బ్రహ్మదేవుని చూడాలని మేముకూడా

అక్కడకు వెళ్తున్నాము. వెంటనే పాండురాజు లేచి మహర్షులతో కూడా వెళ్ళదలచుకొన్నాడు. స్వర్గలోకపు అంచులను దాటి పోవాలనుకొని శతశృంగం నుండి భార్యలతో పాటు ఉత్తరాభిముఖుడై బయలుదేరాడు. అది చూచి ఉత్తరానికి వెళ్తున్న మహర్షులు ఆయనతో ఇలా అన్నారు. 'మహారాజా! ఈ రమణీయ పర్వతంపై మేము చొరరాని ప్రదేశాలను ఎన్నింటినో చూశాము. ఇది దేవతలకు, గంధర్వులకు, అప్సరసలకు విహారభూమి. వందలకొలది విమానాలు ఇక్కడ తిరుగుతుంటాయి. మధురగీతాలు నినదిస్తుంటాయి. కుబేరుని ఉద్యానవనాలు ఇక్కడ ఉంటాయి. అవి మిట్టపల్లాలుగా ఉంటాయి. పెద్దపెద్ద నదుల తీరాలూ, గహనమైన కొండగుహలు ఇక్కడుంటాయి. ఎప్పుడూ మంచుతో నిండి చెట్లు, పక్షులూ, జంతువులు కూడా లేని ప్రదేశాలుంటాయి. కొన్నిచోట్ల పెద్దపెద్ద గుహలు. వాటిని దాటటం కష్టం. కొన్ని గుహల దగ్గరకు వెళ్ళటం కూడా కష్టం. పక్షులు కూడా వాటి నతిక్రమించలేవు. ఇక ఇతరజంతువుల గూర్చి చెప్పవలసిన దేముంటుంది? గాలి మాత్రమే అక్కడ చొరబడగలదు. సిద్ధులూ, పరమ ఋషులు కూడా ప్రవేశించగలరు. అటువంటి ఈ కొండపై ఈ రాజకుమారికలు - కుంతిమాద్రులు ప్రయాణిస్తూ తట్టుకోవటం కష్టం. భరతశ్రేష్ఠా! వీరిని కష్టపెట్టవద్దు. ప్రయాణం మానుకో.'

పాండురాజు ఇలా అన్నాడు. 'మహానుభావులారా! సంతానహీనునకు స్వర్గలోక ద్వారం మూయబడి ఉంటుందని అంటారు. నేను కూడా సంతానం లేనివాడిని. అది నన్ను బాధిస్తోంది. నేనింత వరకు పితృణం నుండి విముక్తిని పొందలేదు. దానితో కలత పడుతున్నాను. మీకు నివేదిస్తున్నాను. నా శరీరం నశించిన తర్వాత నా పితరులు కూడా పతితులు కాగలరు. మనిషి నాల్గు ఋణాలతో కలిసి ఈ లోకంలో జన్మిస్తాడు. అవి పితృ ఋణం, దేవ ఋణం, ఋషి ఋణం, మనుష్య ఋణం. ధర్మబద్ధంగా వాటినుండి విముక్తిని పొందాలి. తగిన వేళలో వాటి గురించి తెలుసుకొనని మనుష్యునకు పుణ్యలోకాలు లేవని ధర్మవేత్తలు నిర్ణయించారు. యాగాలతో దేవతలను తృప్తి పరచాలి. స్వాధ్యాయ తపస్సులతో మునులను తృప్తి పరచాలి. సంతానంతో, శ్రాద్ధకర్మలతో పితరులను తృప్తిపరచాలి. ఆనృశంస్యంతో (దయతో) మానవులను తృప్తి పరచాలి. ధర్మబద్ధంగా ఋషి, దేవ, మనుష్య ఋణాలనుండి విముక్తిని పొందాను. ఈశరీరం నశించినా పితృణం మాత్రం మిగిలిపోయే పరిస్థితి వచ్చింది. మహర్షులారా! పితృణం తీర్చుకోలేని స్థితిలో ఇప్పుడున్నాను. ఈలోకంలో ఉత్తమమానవు లందరూ పితృఋణవిముక్తి కొరకే సంతానాన్ని కంటున్నారు. తామే పుత్రరూపంలో తిరిగి జన్మిస్తున్నారు. మాతండ్రి ద్వారా మా అమ్మ మమ్ములను

కన్నట్లు నాభార్యకు కూడా సంతానం కలిగే మార్గమేది?' మునులు ఇలా అన్నారు. 'ధర్మాత్మా! మేము దివ్యదృష్టితో చూస్తున్నాం. నీకు నిష్కల్మషమై దైవ సమానమైన సంతానం కలిగే అవకాశమున్నది. నరశ్రేష్ఠా! అదృష్టమందజేస్తున్న ఆ శుభఫలితాన్ని పురుషప్రయత్నంతో సాధించు. బుద్ధిమంతుడైన నరుడు సావధానంగా పెద్దకష్టం లేకుండానే ఫలితాన్ని పొందగలడు. రాజా! ఈ దృష్టఫలితం కోసం నీవు ప్రయత్నించాలి. నీవు తప్పక గుణవంతులు, ఆనందదాయకులూ అయినపిల్లలను పొందగలవు.

తాపసుల ఆ మాటలను విని, పాండురాజు ఆలోచనలో పడ్డాడు. మృగశాపం వలన తాను తన పుంస్త్వాన్ని కోలుపోవటాన్ని స్మరించి, పాండురాజు ఒకనాడు ఏకాంతంలో యశస్వినీ అయిన ధర్మపత్ని కుంతితో ఇలా అన్నాడు.

'ఇది మనకు గడ్డుకాలం. సంతానాన్ని పొందటానికి అవసరమయిన ప్రయత్నాన్ని నీవు అంగీకరించి ఆచరించాలి. కుంతీ! లోకంలో సంతానమన్నది ధర్మసహితమైన ప్రతిష్ఠ. ధర్మవాదు లయిన ధీరులంతా ఆ విధంగానే భావిస్తున్నారు. సంతానంలేనివాడు యాగాలు చేసినా, దానాలుచేసినా, తపస్సు చేసినా చక్కగా విధుల నాచరించినా అవేవీ పవిత్రమైనవి కావు. కుంతీ! ఆ విషయాన్ని గ్రహించి సంతానహీనుడనైన నేను శుభలోకాలు పొందలేనని భావించి నిరంతరమూ ఆలోచిస్తున్నాను. నేను దురదృష్టవంతుడను. మృగశాపం వలన పిల్లలను కనలేని స్థితికి వచ్చాను. మైథునంలో ఉన్న మృగాన్ని చంపినందువలన నేను సంతానోత్పాదన శక్తిని కోలుపోయాను. కుంతీ! ధర్మశాస్త్రాన్ని అనుసరించి ఆరుగురు బంధుదాయాదులూ, ఆరుగురు అబంధుదాయాదులూ ఆస్తికి వారసులు కాగలరు. సొంతకొడుకూ, తన భార్యకే ఇతరుల వలన పుట్టిన వాడూ, దౌహిత్రుడూ (కూతురుకొడుకు), పౌనర్భవుడూ (మారుమనువు చేసికొన్న స్త్రీకొడుకు), కానీనుడు (తాను వివాహమాడిన స్త్రీకి వివాహానికి ముందే పుట్టినవాడు), సోదరికొడుకు - ఆరుగురూ బంధుదాయాదులు. దత్తపుత్రుడూ, కొనబడినవాడూ, స్వయంగా 'నేను నీకుమారుడ' నంటూ వచ్చినవాడూ, సహోడుడు (గర్భవతి ఆయిన స్త్రీని పెండ్లాడగా పుట్టినవాడూ), తన వంశంలో పుట్టినవాడూ, తనకన్న తక్కువ కులం గల స్త్రీకి తనద్వారా పుట్టినవాడు - వీరు అబంధుదాయాదులు. ఈక్రమంలో ముందుముందు వారు లభించకపోతే తర్వాత తర్వాత వారికి ప్రాధాన్యం. అపత్కాలంలో తనకన్న ఉత్తము డయిన పురుషుని ద్వారానే సామాన్యులు సంతానాన్ని కోరుకొంటారు. కుంతీ! మానవుడు తన ద్వారా కాకపోయినా మరొక, ఉత్తమనరునిద్వారా పుత్రులను పొందవచ్చు. అది ధర్మఫలితాన్నే ఇస్తుంది. స్వాయంభువమనువు ఈవిషయాన్ని

చెప్పారు. కాబట్టి యశస్వినీ! నేను పిల్లలను కనలేను. కాబట్టి నిన్ను మరొకరి దగ్గరకు పంపుతాను. నా అంతటి వాని ద్వారా గానీ నాకన్న శ్రేష్ఠుని ద్వారా గానీ నీవు సంతానాన్ని పొందు.'

120. వ్యుషితాశ్వోపాఖ్యానము.

పాండురాజు ఇలా అన్న తరువాత తన భర్తతో కుంతి ఇలా అన్నది. ధర్మజ్ఞా! నీవు నాతో ఇటువంటి మాటలు అనవచ్చునా? నేను నీ ధర్మపత్నిని. నీయందే అనురాగ మున్నదానను. నీవు నాయందు ధర్మబద్ధంగా వీరులైన పిల్లలను కనగలవు. మానవశ్రేష్ఠా! కురునందనా! నీతో పాటే స్వర్గానికి వెళతాను. నీవే సంతానం కోసం నాతో సంగమించు. నేను మనస్సులో కూడా నిన్ను తప్ప మరొకరిని భావించను. లోకంలో నీకన్న గొప్పవాడైన మానవు డెవడున్నాడు? ధర్మాత్మా! పురాతనమయిన ఈ కథను విను. విశాలనేత్రా! నేను చెప్పబోవు ఈ కథ అందరికీ తెలిసినదే.

ఒకప్పుడు వ్యుషితాశ్వుడనే మహారాజు ఉండేవాడు. అతడు పరమధర్మాత్ముడు. పూరువంశ వివర్ధనుడు కూడా. ఆధర్మాత్ముడు యాగం చేస్తుండగా దేవతలు దేవేంద్రునితోనూ, దేవర్షులతోనూ కలిసి అక్కడకు వచ్చారు. ఇంద్రుడు సోమపానంతో ఉన్మత్తు డయ్యాడు. బ్రాహ్మణులు దక్షిణలతో సంతృప్తు లయ్యారు. మహాత్ముడూ, రాజర్షీ అయిన ఆ వ్యుషితాశ్వుని యాగంలో దేవతలూ, బ్రహ్మర్షులూ తామే అన్ని పనులూ చేశారు. రాజా! దానితో వ్యుషితాశ్వుడు సర్వమానవులకన్నా మిన్నయై ప్రకాశించాడు. శిశిరం ముగిసిన తరువాత సూర్యునివలె ఆ వ్యుషితాశ్వుడు సర్వప్రాణులకూ ప్రీతిపాత్రు డయ్యాడు. ఆయన అశ్వమేధయాగం చేసి తూర్పు, దక్షిణం, పడమర, ఉత్తరదిక్కులలో ఉన్న రాజుల నందరినీ పరాక్రమశాలియై జయించి లోబరచుకున్నాడు. ఆ వ్యుషితాశ్వమహారాజు పదియేనుగుల బలం కలవాడు. కురుశ్రేష్ఠా! పురాణవేత్తలు యశోవృద్ధుడై మానవోత్తము డైన ఆ వ్యుషితాశ్వుని గూర్చి ఇలా చెప్పుకొంటుంటారు - వ్యుషితాశ్వుడు సాగరపర్యంతమయిన ఈ భూమిని జయించి తండ్రి తన పిల్లలను కాపాడినట్లు సర్వవర్ణాలవారినీ పరిపాలించాడు. మహాయాగాలను చేసి బ్రాహ్మణులకు భూరి దక్షిణల నిచ్చాడు. అనంతరత్నాలను కొనివచ్చి ఆ వ్యుషితాశ్వుడు ఎన్నో మహాక్రతువులను ఆచరించాడు. అనేక సోమయాగాలను సమకూర్చి ఎంతో సోమరసాన్ని సంగ్రహించి అగ్నిష్టోమం మొదలుగా గల ఏడు విధాలయిన సోమయాగాలనూ అనుష్ఠించాడు. రాజా! వ్యుషితాశ్వునకు కాక్షీవంతుని కుమార్తె అయిన భద్ర ఇల్లాలు. ఆమె ఆయనకు మరీ ఇష్టమైనది. రాజా! ఆ రోజులలో ఆమె అంత అందగత్తె లోకంలో లేదట. వారు

ఒకరినొకరు బాగా ఇష్టపడేవారట. భార్యతో మితిమీరిన కామప్రవృత్తి వలన ఆ వ్యుషితాశ్వుడు క్షయవ్యాధికి గురి అయ్యాడు. దానితో స్వల్పవ్యవధిలోనే సంధ్యాసూర్యునివలె ఆ వ్యుషితాశ్వుడు అస్తమించాడు. ఆ రాజు మరణించగా అతని భార్య తీవ్రంగా దుఃఖించింది. నరోత్తమా! ఆమె సంతానహీన. ఆ కారణంగా ఆమె విలపించిందని విని ఉన్నాను. రాజా! పరమదుఃఖానికి లోనయిన ఆ భద్ర విలపించిన తీరును గమనించండి.

"ధర్మజ్ఞా! విధవ అయిన స్త్రీ భర్త లేకుండా జీవిస్తున్నా దుఃఖంలోనే మునిగి ఉంటుంది. కాబట్టి ఆమె జీవిస్తున్నట్లు కనిపించినా మరణించినట్లే. భర్తను కోల్పోయిన స్త్రీకి మరణమే మంచిది. నేనుకూడా నీ మార్గాన్నే అనుసరింపదలచాను. దయతో నన్ను కూడా తీసికొనిపో. నీవు లేకుండా క్షణకాలం కూడా నాకు బ్రతకాలని లేదు. రాజా! దయచూపించు. ఇక్కడనుండి వెంటనే నన్ను తీసికొనిపో. నరశార్దూలా! తిరిగివచ్చే ప్రసక్తి లేకుండా వెళ్తున్న నీదారి సమమయినా, విషమమయినా నీవెంటే నేనూ నడుస్తాను. రాజా! నిత్యమూ నీకు లోబడి నీడలా నిన్ను అనుసరిస్తాను. నరశ్రేష్ఠా! ఎల్లప్పుడూ నీకు ప్రియమయిన, హితమయిన వాటి యందే ఆసక్తిని ప్రదర్శిస్తాను. రాజీవలోచనా! రాజా! నీవిరహంతో నేటినుండి హృదయాన్ని ఎండింపజేసే కష్టాలూ, మనోవ్యథలూ నన్ను చుట్టుముట్టుతాయి. దురదృష్టవంతురాలను నేను. ఎన్ని జంటలను విడదీశానో? ఆకారణంగానే నీతో నాకు ఈ వియోగమేర్పడినది. రాజా! భర్తలేకుండా రెండు గడియలు జీవించినా ఆ పాపాత్మురాలు నరకంలో ఉన్నట్లు దుఃఖమయమైన జీవితాన్నే గడుపుతుంది. గతజన్మలో నేను కలిసి ఉన్న వారి నెందరినో విడదీసి ఉంటాను. ఆ పాపకర్మల ద్వారా గత జన్మలోని సంచితమే ఈరీతిగా నాకు నీ వియోగంతో దుఃఖాన్ని కల్పించింది. రాజా! దుఃఖంలో మునిగిన నేను నేటినుండీ నీ దర్శనానికై నిరీక్షిస్తూ దర్భలమీదనే శయనిస్తాను. నరశ్రేష్ఠా! నాకు కనిపించు. నరేశ్వరా! దీనంగా, జాలిగా విలపిస్తూ దుఃఖానికే నోచుకొన్న నాకు కర్తవ్యాన్ని ఉపదేశించు."

ఆమె ఆ శవాన్ని కౌగిలించుకొని పదేపదే ఆ విధంగా విలపిస్తుండగా అశరీరవాణి ఇలా పలికింది. "కళ్యాణీ! లేచి వెళ్ళు. నీకు వరమిస్తున్నాను. నీ యందు నేను సంతానాన్ని కలిగిస్తాను. వరారోహా! ఋతుస్నానం తర్వాత ఎనిమిదవ రాత్రి గానీ, పదునాలుగవ రాత్రి కానీ నీ శయ్యపై ఈ నా శవంతో నిదురించు." ఆ మాటలు విని పతివ్రత ఆమె ఆ విధంగానే చేసింది. సంతానాన్ని కోరుతున్న ఆమె ఆ వాక్యాన్ని యథాతథంగా పాటించింది. భరతశ్రేష్ఠా! ఆ శవంతో పాటు శయనించి ఆ భద్ర ఏడుగురు కొడుకులను కన్నది. వారిలో ముగ్గురు శాల్వదేశాన్ని, నలుగురు మద్రదేశాన్ని పరిపాలించగలిగారు.

భరతశ్రేష్ఠా! అదేవిధంగా నీవుకూడా తపోబలసమన్వితుడవై మనస్సంకల్పంచేతనే నాయందు పుత్రులను కనగలవాడవు.'

121. కుంతి పుత్రులను పొందుటకు ఉద్యమించుట.

కుంతి ఆ విధంగా మాటాడగా ధర్మవేత్త అయిన పాండురాజు ఉత్తమమూ, ధర్మసహితమూ అయినట్లు ఆమెతో ఈ మాటలు పలికాడు. కుంతీ! గతంలో వృషితాశ్వుడు నీవు చెప్పినట్లుగా ఆ విధంగా చేయగలిగాడు. నిజమే! కళ్యాణీ! ఆయన దేవతల వంటివాడు. ఇప్పుడు నేను మహాత్ములూ, ధర్మవేత్తలూ అయిన ప్రాచీనమహర్షులు దర్శించిన ధర్మతత్త్వాన్ని నీకు చెప్పబోతున్నాను. నామాట విను. సజ్జనులు దీనిని పురాతన మయిన ధర్మ మంటున్నారు. రాజకుమారీ! ధర్మమయినా, అధర్మమయినా భర్త చెప్పినట్లుగా భార్య చేయాలని వేదవేత్తలు తెలిపారు. విశేషించి సంతానాన్ని అపేక్షిస్తూ, స్వయంగా పిల్లలను కనలేని స్థితిలో ఉన్న భర్తమాటను తప్పక మన్నించాలి. నేను పుత్రదర్శనం కోసం ఉవిళ్ళూరుతున్నవాడిని. నీ అనుగ్రహం కోసం ఎట్టని వ్రేళ్ళు కొనలు గలిగి తామరాకులవలె ప్రకాశిస్తున్న ఈ అంజలిని శిరస్సుపై నుంచి చెప్తున్నాను. నా ఆదేశాన్ని మన్నించి తపోబల సంపన్నుడయిన బ్రాహ్మణుని ద్వారా గుణవంతులయిన కుమారులను కను. నీ కారణంగానే నేను పుత్రవంతులు పొందే సద్గతులను పొందగలను.' పాండురాజు అలా మాటాడగా భర్తకు ప్రియాన్నీ, హితాన్నీ కల్గించటంలో ఆసక్తి గల కుంతి పాండురాజుతో ఇలా అన్నది.

('భరతశ్రేష్ఠా! క్షత్రియోత్తమా! భర్త భార్యను బ్రతిమిలాడవలసి వచ్చుట స్త్రీ పక్షంలో పెద్ద అధర్మం, స్త్రీయే భర్తను అనునయించగలగాలి. మహాబాహూ! నాకు ఇష్టమయిన మాట చెపుతాను విను.)

మా పుట్టినింట నా చిన్నతనంలో అతిథిపూజకు నన్ను నియోగించారు. సంశితవ్రతుడై, కోపస్వభావం గల బ్రాహ్మణునకు నేను పరిచర్యలు చేశాను. ఆయన పేరు దుర్వాసుడు. ధర్మవిషయంలో ఆయన జ్ఞానం ఇతరులకెరుగ రానిది. అటువంటి జితేంద్రియుని నేను సర్వప్రయత్నాలతో సంతోషింపజేశాను. అప్పుడు ఆ పూజనీయమహర్షి ప్రయోగవిధాన సహితంగా నాకొక మంత్రాన్ని వరరూపంగా ఉపదేశించి నాతో ఇలా అన్నాడు. ఈ మంత్రంతో నీవు ఏదేవతల నాహ్వానించినా, ఇష్టమున్నా లేకపోయినా ఆ దేవతలు నీకు లొంగుతారు. వారి అనుగ్రహంతో నీకు పుత్రులు జన్మిస్తారు. అది మా పుట్టినింట ఆ మహర్షి నాతో అన్నమాట. బ్రాహ్మణుని మాట యథార్థం. దాని అవసరం ఇప్పుడు

కలిగింది. రాజా! నీవు అనుమతిస్తే నేను దేవతల నాహ్వానిస్తాను. ఆ మంత్ర ప్రభావంతో మనం పిల్లలను పొందవచ్చు.

(మహారాజా! ఆ మహాత్ముడు నాకు ఉపదేశించిన విద్య వలన నేను ఆహ్వానించిన దేవతలు దేవతాసమానులయిన కుమారులను అనుగ్రహిస్తారు. పిల్లలు లేరన్న నీబాధ తొలగిపోతుంది. నాకు సంతతి కలుగుతుంది. పుత్రులు కావాలన్న నీ కోరికా తీరుతుంది.)

దేవతలలో ఎవరిని ఆహ్వానించమంటావు? నీ ఆనందంకోసం నేనీ పనికి సిద్ధమై ఉన్నాను. నీ ఆదేశం కోసం నిరీక్షిస్తూ ఉన్నాను.

పాండురాజు ఇలా అన్నాడు.

('ధన్యుడను. నీవు నన్ను అనుగ్రహించావు. నావంశాన్ని నీవే నిలుపుతున్నావు. నీకు వరమిచ్చిన ఆమహర్షికి నమస్కారం. ధర్మజ్ఞా! అధర్మంతో ప్రజలను పాలించలేము.)

నేడే నీవు యథావిధిగా ప్రయత్నాన్ని ఆరంభించు. యమధర్మరాజును ఆహ్వానించు. అతడే లోకంలో పరమపుణ్యాత్ముడు. ఈ పనిచేయటం వలన మన ధర్మానికి అధర్మంతో కలయిక కలుగదు. లోకం కూడా దీనిని ధర్మమనే భావిస్తుంది. ధర్మునివలన పుట్టబోయే బిడ్డ కురువంశస్థులలో ధార్మికుడు కాగలడు. ధర్ముని బిడ్డకు అధర్మంపై మనస్సు పుట్టదు. కాబట్టి ధర్మాన్ని దృష్టిలో ఉంచుకొనియే నిన్ను నియోగిస్తున్నాను. శుచిస్మితా! ఉపచారాలతో, మంత్రప్రయోగంతో ధర్ముని ఆహ్వానించు.' అలా అంటే పాండురాజు కుంతి భర్త మాటలనంగీకరించి, ఆయనకు నమస్కరించి, అనుమతి తీసికొని' ఆయనకు ప్రదక్షిణం చేసింది.

122. ధర్మజభీమార్జునుల పుట్టుక.

గాంధారి సంవత్సరకాలం గర్భాన్ని మోసిన తరువాత కుంతి గర్భధారణకై ఆచ్యుతుడయిన ధర్ముని ఆహ్వానించింది. ఆ కుంతీదేవి ధర్మదేవతకై పూజాదికాలను అర్పించింది. గతంలో దుర్వాసుడు ఉపదేశించిన మంత్రాన్ని యథావిధిగా జపించింది. ఆ తరువాత ఆ మంత్రబలం వలన సూర్యతేజస్సు గల విమానంలో ధర్మదేవత కుంతి జపిస్తున్న ప్రదేశానికి వచ్చాడు. ధర్ముడు చిరునవ్వు నవ్వి "కుంతీ! నీకు నేనేమి ఇవ్వాలి" అని అడిగాడు. సరదాకు అడిగినట్లున్నా కుంతి "నాకు కుమారుని ప్రసాదించు" అని ధర్ముని అడిగింది. ఆ వరారోహ యోగమూర్తిని ధరించిన ఆ ధర్మునితో కలిసి సమస్తప్రాణులకూ హితకరుడయిన కుమారుని పొందింది. చంద్రుడు జ్యేష్ఠానక్షత్రంలో ఉండగా, సూర్యుడు తులారాశి యందుండగా శుక్లపక్షంలో పంచమి నాడు అభిజిల్లగ్నంలో

కుంతీదేవి ఉత్తముడైన కుమారుని కన్నది. అతడు యశస్వి. ఆ కుమారుడు పుట్టగానే అశరీరవాణి ఇలా పలికింది. 'ఈ కుమారుడు నరోత్తముడై ధర్మాత్ములలో మేటి కాగలడు. పరాక్రమవంతుడు, సత్యవచనుడూ అయిన మహారాజు కాగలడు. పాండురాజు యొక్క ఈ జ్యేష్ఠకుమారుడు యుధిష్ఠిరు డనే పేర ప్రఖ్యాతుడై, మహారాజై మూడు లోకాలలోనూ ప్రసిద్ధిని పొందుతాడు. యశస్సు, తేజస్సు, సత్ప్రవర్తనలతో విరాజిల్లుతాడు.' ధార్మికుడైన ఆ కుమారుని పొంది పాండురాజు కుంతితో మరలా ఇలా అన్నాడు. 'క్షత్రియులకు బలమే మిన్న కాబట్టి బలిష్ఠుడైన కుమారుని కోరుకో.

(యాగాలలో అశ్వమేధం గ్రహాలలో సూర్యుడూ, మనుజులలో బ్రాహ్మణుడూ, గొప్పవారైనట్లు బలిష్ఠులలో వాయుదేవుడు గొప్పవాడు. సమస్తప్రాణులూ దేవతలలో వాయుదేవునే మిన్నగా ప్రస్తుతిస్తాయి. కాబట్టి పుత్రునికోసం ఆ వాయుదేవుని ఆహ్వానించు. ఆయన మనుజులందరినీ మించిన ప్రాణశక్తి, బలమూ గల కుమారుని మనకు ప్రసాదిస్తాడు.)

భర్త అలా అనగానే ఆమె వాయుదేవుని ఆహ్వానించింది. మృగాన్ని అధిరోహించి మహాబలవంతుడు అయిన వాయుదేవుడు ఆమె దగ్గరకు వచ్చి "కుంతీ! నీ మనస్సులోని కోరికను చెప్పు. నీకేమి ఇవ్వగలను" అని అడిగాడు. ఆమె సిగ్గుతో నవ్వుతూ "సురోత్తమా! మహాబలవంతుడూ, మహాకాయుడూ, అందరి దర్పాన్ని అణచగలవాడూ అయిన పుత్రుని ప్రసాదించు" అని వాయుదేవుని అడిగింది. ఆ వాయుదేవుని ద్వారా భయంకరపరాక్రమశాలి, మహాబాహువూ అయిన భీముడు జన్మించాడు. జనమేజయా! ఆ భీముని ఉద్దేశించి అశరీరవాణి 'ఇతడు బలవంతులందరి లోనూ శ్రేష్ఠు'డని పలికింది. అప్పుడే అద్భుతమయిన సంఘటన జరిగింది. భీముడు పుట్టీపుట్టగానే తల్లి ఒడినుండి జారి ఒక బండరాయిపై పడ్డాడు. దానితో అది చూర్ణమై పోయింది.

(కుంతి ప్రసవించిన పదవనాడు భీమునితో పాటు ఒక అందమైన సరస్సు దగ్గరకు పోయి స్నానం చేసి మరలి వచ్చి దేవతాసమారాధనకై పర్ణశాలనుండి వెలుపలికి వచ్చింది. భరతశ్రేష్ఠా! ఆమె ఒక పర్వతానికి దగ్గరగా నడుస్తుండగా ఒకపులి ఆమెను చంపాలని కొండగుహనుండి వెలుపలికి దూకింది. మీదికి వస్తున్న ఆ పులిని చూచి కురూత్తముడూ, దేవతాపరాక్రమవంతుడూ అయిన పాండురాజు మూడు బాణాలను బాగా లాగి దానిపై ప్రయోగించి దానిని ఖండించాడు. అది గుహలు ప్రతిధ్వనించేటట్లు పెద్దగా అరుస్తూ నేలకూలింది)

ఆదివిని భయపడి కుంతి వెంటనే పడిపోయింది. తన ఒడిలో నిదురిస్తున్న భీమసేనుడు ఆమెకు గుర్తురాలేదు. అప్పుడు ఆ కుమారుడు పిడుగుపాటులా కొండపై పడ్డాడు. పడుతూనే ఆ కొండను తన శరీరంతో వందముక్కలుగా చేశాడు. ఆ శిల చూర్ణమైపోవటాన్ని చూసి పాండురాజు ఆశ్చర్యపడ్డాడు. చంద్రుడు మఘానక్షత్రంలో ఉండగా, గురువు

సింహరాశిలో ఉండగా, సూర్యుడు నడినెత్తిన ఉండగా త్రయోదశ తిథియందు మైత్రముహూర్తంలో కుంతి భీముని ప్రసవించింది. భరతశ్రేష్ఠా! మహారాజా! భీముడు జన్మించిన రోజునే అక్కడ హస్తినాపురంలో దుర్యోధనుడు కూడా జన్మించాడు.

భీమసేనుడు పుట్టిన తరువాత మరలా పాండురాజు ఇలా ఆలోచించసాగాడు 'సర్వలోకాలలోనూ శ్రేష్ఠుడైన గొప్పకొడుకు ఎలా పుట్టగలడు? ఈలోకం దైవంమీదా, పురుష ప్రయత్నం మీదా ఆధారపడి ఉన్నది. **సమయానికి తగినట్లుగా ప్రవర్తించగలిగినప్పుడు మాత్రమే దైవిక ఫలం లభిస్తుంది.** దేవతలందరిలో ప్రధానుడు ఇంద్రుడని వింటున్నాము. లెక్కింపరాని బలోత్సాహాలూ, పరాక్రమమూ, తేజస్సూ గలవాడు ఆ ఇంద్రుడు. తపస్సుతో ఆయనను సంతోషపెట్టి మహాబలవంతుడైన కొడుకును పొందాలి. ఆయన అనుగ్రహించిన కుమారుడు గొప్పవాడు కాగలుగుతాడు. మానవులనూ, మానవేతరులనూ కూడా యుద్ధంలో చంపగలడు. కాబట్టి మనోవాక్కాయాలతో తీవ్రతపస్సు నాచరిస్తాను.' ఆ తరువాత పాండురాజు మహర్షులతో సంప్రదించి సంవత్సరకాల మాచరింపవలసిన ఒక శుభవ్రతాన్ని కుంతికి ఉపదేశించాడు. జనమేజయా! మహాబాహువూ, ధర్మాత్ముడూ అయిన ఆ పాండురాజు కూడా దేవాధినాథుడయిన ఇంద్రుని ఆరాధింప గోరి మనస్సును ఏకాగ్రతతో ఉంచి, ఒంటికాలిపై నిలిచి సూర్యుడున్నంతసేపూ అలాగే ఉండి తీవ్రతపస్సు చేయసాగాడు. కొంతకాలం గడచిన తరువాత ఇంద్రుడు సాక్షాత్కరించి ఇలా పలికాడు. 'మూడులోకాలలోనూ ప్రసిద్ధికెక్కిన కుమారుని నీకు అనుగ్రహిస్తాను. బ్రాహ్మణులు, గోవులు, మిత్రులు – వీరి మనోరథాలను సిద్ధింపజేయగలవానిని, దుర్మార్గులకు శోకాన్నీ, సకల బంధువులకూ ఆనందాన్నీ కల్గించి, శత్రువుల నశింపజేసే వానిని నీకు కుమారునిగా అనుగ్రహిస్తాను. అతడు అన్నిటా ముందు నిలువగలవాడు.' దేవేంద్రుడు పాండురాజుతో అలా అంటే ఆ మాటలను తలచుకొంటూ ధర్మాత్ముడైన పాండురాజు కుంతితో ఇలా అన్నాడు – 'కళ్యాణీ! నీకు శుభం కలుగబోతున్నది. దేవేంద్రుడు సంతోషించాడు. నీవు సంకల్పించినట్లు మానవాతీతమయిన కర్మలు చేయగలవాడూ, యశస్వీ, శత్రుసంహారకుడూ, నీతిమంతుడూ, మహాత్ముడూ, సూర్యతేజస్వీ, ఎదిరింపరాని వాడు, క్రియాశీలుడూ, అద్భుతదర్శనుడూ అయిన కుమారుని నీకివ్వగోరుతున్నాడు. క్షాత్రతేజానికి నిధి అయిన కుమారుని కను. శుచిస్మితా! దేవేంద్రుడు ప్రసన్నుడైనాడు. ఆయనను ఆహ్వానించు. పాండురాజు ఆదేశించగానే యశస్విని అయిన కుంతి దేవేంద్రుని ఆహ్వానించింది. దేవేంద్రుడు వచ్చి అర్జునునకు జన్మనిచ్చాడు. ఫాల్గున మాసంలో పూర్వఫల్గునీ, ఉత్తర ఫల్గునీ నక్షత్రాల సంధికాలంలో పగలు అర్జునుడు జన్మించాడు. అందువలన ఆయన

ఫాల్గును డయ్యాడు.

అర్జునుడు జన్మించగానే మిగుల గంభీరమైన నాదంతో ఆకాశాన్ని ప్రతిధ్వనింపజేస్తూ, ఆశ్రమవాసులయిన సమస్తప్రాణులూ వింటుండగా శుచిస్మిత అయిన కుంతితో విస్పష్టంగా అశరీరవాణి ఇలా పలికింది. 'కుంతీ! ఈ కుమారుడు కార్తవీర్యతుల్యుడై, శివపరాక్రమం వంటి పరాక్రమం గలిగి ఇంద్రునివలె జయింపరానివాడై నీకీర్తిని విస్తరింపజేస్తాడు. విష్ణువు అదితి ఆనందాన్ని అభివృద్ధి చేసినట్లు ఈ అర్జునుడు విష్ణుసమానుడై నీ ఆనందాన్ని వర్ధిల్లజేస్తాడు. ఈ కుమారుడు మద్ర, కురు, సోమక, చేది, కాశి, కరూశ దేశాలను లొంగదీసికొని కురువంశలక్ష్మిని పాలించగలడు.

(వీరుడైన ఈ పాండుసుతుడు ఉత్తర దిక్కుపై దండెత్తి యుద్ధంలో రాజులను ఓడించి అనంతధనరత్నరాసులను కొనివస్తాడు.)

ఈతని భుజపరాక్రమం చేతనే ఖాండవవనంలో అగ్నిహోత్రుడు సమస్తప్రాణుల మేదస్సుతో మిక్కిలిగా తృప్తినొందగలడు. మహాబలుడైన ఈవీరబాలకుడు క్షత్రియులకు నాయకుడై భూపాలుర నందరనూ జయించి, సోదరులతో కూడి మూడు అశ్వమేధయాగాలను నిర్వహించగలడు. కుంతీ! ఈబాలుడు పరశురాముని తో సమానుడై, విష్ణుతుల్యపరాక్రముడై, బలవంతులలో శ్రేష్ఠుడై గొప్పకీర్తిని పొందగలడు. ఇతడు యుద్ధంలో మహాదేవుడైన శంకరుని ఆనందింపజేసి, అతని నుండి పాశుపతాస్త్రాన్ని పొందగలడు. నివాతకవచులనే రాక్షసులు దేవతలకు శత్రువులు. మహాబాహువయిన ఈ నీకుమారుడు దేవేంద్రుని ఆదేశంతో ఆ నివాతకవచులను సంహరింపగలడు. పురుషశ్రేష్ఠుడైన ఈ అర్జునుడు దివ్యాస్త్రజ్ఞానాన్ని సంపూర్ణంగా పొందగలడు. కోలుపోయిన సంపదల నన్నింటినీ మరల కొనిరాగలడు.' కుంతి సూతికాగృహం నుండియే ఈ అద్భుత వాక్యాలను విన్నది. పెద్దగా వినిపించిన ఆ మాటను విని శతశృంగనివాసు లయిన మహర్షులు పరమానందాన్ని పొందారు. గగనచారు లయిన దేవతాసమూహాలూ, ఇంద్రుడూ కూడా మిక్కిలి ఆనందించారు. ఆకాశంలో పుష్పవృష్టితో పాటు భీకరమయిన దుందుభిధ్వని కూడా పెద్దగా ఘోషించింది.

దేవగణాలూ, కాద్రవేయులూ, వైనతేయులూ, గంధర్వులూ, అచ్చరలూ, ప్రజాపతులూ, సప్తర్షులూ అందరూ ఒక్కటిగా కూడివచ్చి పార్థుని ప్రశంసించారు. మరీచి, అంగిరసుడూ, పులస్త్యుడూ, పులహుడూ, క్రతువూ, దక్షప్రజాపతీ, గంధర్వులూ, అచ్చరలూ వచ్చారు. అచ్చరలు దివ్యమాల్యాలనూ, దివ్యవస్త్రాలనూ ధరించి, సర్వాలంకారాలనూ అలంకరించుకొని నాట్యంచేస్తూ అర్జునుని కీర్తించసాగారు. అదేవిధంగా మహర్షులు కూడా అన్నివైపులా నిలిచి శుభమంత్రాలను జపించసాగారు. గంధర్వులతో కలిసి శ్రీమంతుడైన తుంబురుడు

గొప్పగా గానం చేశాడు. రాజా! భీమసేనుడు, ఉగ్రసేనుడు, ఊర్ణాయువు, అనఘుడు, గోపతి, ధృతరాష్ట్రుడు, సూర్యవర్చస్కుడు, యుగపుడు, తృణపుడు, కార్ష్ణి, నంది, చిత్రరథుడు, శాలిశిరస్కుడు, పర్జన్యుడు, కలి, నారదుడు, బుత్వ, బృహత్త్వ, బృహకులు, కరాలుడు, సువర్ణుడు (బ్రహ్మచారి, విఖ్యాత గుణుడు ఇతడు) విశ్వావసువు, భుమన్యువు, సుచంద్రుడు, శరుడు, గీతమాధుర్య సంన్నలయిన హాహా, హూహూలు – వీరంతా అక్కడకు వచ్చారు. విశాలనేత్రలు, సౌభాగ్యశాలినులు అయిన అచ్చరలు సర్వాలంకారాలను అలంకరించుకొని ఆనందంగా నాట్యాలు చేసి, పాటలు పాడారు. అనూచాన, అనవద్య, గుణముఖ్య, గుణావర, అద్రిక, సోమ, మిశ్రకేశి, అలంబుష, మరీచి, శుచిక, విద్యుత్పర్ణ, తిలోత్తమ, అంబిక, లక్షణ, క్షేమ, దేవి, రంభ, మనోరమ, ఆసిత, సుబాహువు, సుప్రియ, వపువు, పుండరీక, సుగంధ, సురస, ప్రమాథిని, కామ్య, శారద్వతి – ఈ అప్సరసలు బృందనాట్యాలు చేశారు. ఈ అప్సరసలలో పేరుమోసిన మేనక, సహజన్య, కర్ణిక, పుంజికస్థల, ఋతుస్థల, ఘృతాచి, విశ్వాచి, పూర్వచిత్తి, ఉమ్లోచ, ప్రమ్లోచ అను పదిమంది కూడా ఉన్నారు. వారిలో పదకొండవ అప్సర ఊర్వశి. ఈవిశాలనేత్రలంతా గానం చేశారు. ధాత, అర్యముడు, మిత్రుడు, వరుణుడు, అంశుడు, భాగుడు, ఇంద్రుడు, వివస్వంతుడు, పూష, త్వష్ట, సరిత, పర్జన్యుడు, విష్ణువు, ద్వాదశాదిత్యులు – వీరంతా అర్జునుని మహిమను వర్ణిల్లజేస్తూ గగనతలంపై నిలిచారు. మృగవ్యాధుడు, సర్పుడు, మహాయశస్వి అయిన నిర్ఋతి, అజైకపాదుడు, అహిర్బుధ్న్యుడు, పినాకి, దహనుడు, ఈశ్వరుడు, కపాలి, స్థాణువు, పూజ్యుడైన భగుడు – ఈ రుద్రులంతా అక్కడ నిలిచారు. అశ్వినులు, అష్టవసువుల, బలవంతు లయిన మరుత్తులు, విశ్వేదేవులు, సాధ్యులు, వీరంతా చుట్టూ చేరారు. నాగులైన కర్కోటక వాసుకులు, కశ్యపుడు, కుండుడు, తక్షకుడు – ఈనాగులే కాక తపస్సంపన్నులూ, మహాక్రోధులూ, మహాబలులూ అయిన నాగులెందరో అక్కడకు చేరారు. తార్క్ష్యుడు, అరిష్టనేమి, గరుడుడు, అసితధ్వజుడు, అరుణుడు, ఆరుణి, వినతానందనులు కూడా అక్కడకు వచ్చారు. ఈదేవగణాలన్నీ విమానాలపై, పర్వతశిఖరాలపై నిలిచాయి. తపస్సిద్ధు లయిన మహర్షులు మాత్రమే వారిని చూడగలిగారు. ఇతరులు చూడలేకపోయారు. మిగుల ఆశ్చర్యకరమయిన ఆ సన్నివేశాన్ని చూచి ముని సత్తములంతా చకితులయ్యారు. దానితో పాండవులపై అంతకుముందుకన్న ప్రేమాదరాలతో ప్రవర్తించసాగారు. మహాయశస్సుగల పాండురాజు పుత్రలోభంతో కుంతితో ఇంకా ఏదో చెప్పబోయాడు. కాని కుంతి అతనిని నిరోధిస్తూ ఇలా అన్నది. 'ఆపత్కాలంలో కూడా ముగ్గురిని మించి కనటానికి శాస్త్రాలు అంగీకరింపవు. నాలుగవ సంతానాన్ని కోరిన దానిని స్వైరిణి అనీ, అయిదవ సంతానాన్ని

కోరిన దానిని బంధకి అనీ వ్యవహరిస్తారు. విద్వాంసుడా! నీవు ఈవిషయం తెలిసికూడ ఏమరిన వానివలె ధర్మలోపాన్ని అంగీకరిస్తూ మరలా సంతానం కోసం నన్నెందుకు ప్రోత్సాహించదలచావు?'

(పాండురాజిలా అన్నాడు. 'నిజమే. ధర్మశాస్త్రం అలాగే ఉంది. నీవు చెప్పినది వాస్తవమే.')

123. నకుల సహదేవుల పుట్టుక - పాండవుల నామకరణము.

కుంతికి (ముగ్గురు) కొడుకులు పుట్టారు. ధృతరాష్ట్రునకు (నూర్గురు) కొడుకులు పుట్టారు. ఆ తరువాత మాద్రి ఏకాంతంలో పాండురాజుతో ఇలా అన్నది. 'కురునందనా! నీవు పిల్లలను కనలేని స్థితిలో ఉన్నా నేను బాధపడటంలేదు. నేను కుంతీదేవి కన్న మిన్న అయిన దానను. కాని మహారాణి కాలేకపోయాను. దానికి కూడా నేను బాధపడటం లేదు. రాజా! గాంధారికి వందమంది కొడుకులు పుట్టారు. అది వినికూడా నేను బాధపడలేదు. అయితే నన్ను బాగా బాధిస్తున్న విషయమిది. నేను, కుంతీదేవి పత్నులమయినా నాకు సంతానం లేకపోవటం మాత్రం దుఃఖకారణ మవుతోంది. అయితే భాగ్యవశాన నాభర్తకు కుంతిగర్భంనుండి సంతతి కలిగింది. కుంతి దయతలచి నాకు కూడా పిల్లలను కనే అవకాశం కల్పిస్తే అది నాకు ఎంతో మేలు చేసినట్లవుతుంది. నీకు కూడా అది హితకరమే కాగలదు. కుంతి నాకు సవతి కాబట్టి ఈ విషయాన్ని నేను ఆమె నడగటానికి అభిమానం అడ్డువస్తోంది. నాపై మీకు ఆ ఆదరమంటే నాకోసం కుంతీదేవిని మీరే ప్రోత్సహించాలి.' పాండురాజిలా అన్నాడు.

"మాద్రీ! నామనస్సులో కూడా ఈ భావం నిరంతరంగా మెదులుతూనే ఉంది. అయితే నీకిష్టమున్నదో లేదో అని సంశయించి నీకు నేను ఈవిషయం చెప్పలేదు. నీ అభిప్రాయం కూడా ఇదే అని తెలిసింది కాబట్టి ఇకపై నేను ప్రయత్నిస్తాను, నేను చెపితే కుంతి తప్పక నామాట వింటుందని అనుకొంటున్నాను." ఆ తరువాత పాండురాజు ఏకాంతంలో కుంతితో ఇలా అన్నాడు - "కళ్యాణీ! నా వంశానికి సంతానాన్నీ, నా ప్రజలకు ప్రియాన్నీ నీవు కల్పించాలి. నాకు, నా పూర్వీకులకు పిండంలేని స్థితి కలుగకూడదు. నా కోసం నీవు ఒక కళ్యాణకరమైన మంచిపని చేయాలి. నాయశస్సును విస్తరింపజేయటానికి నీవు దుష్కరమయిన పని ఒకటి చేయాలి. ఇంద్రుడు కూడా స్వర్గాధిపత్యాన్ని పొందిన తర్వాత కూడా కీర్తికోసం ఎన్నో యాగాలు చేశాడు. మంత్రవేత్తలయిన బ్రాహ్మణులు కూడా ఘోరతపస్సులను చేసిన తర్వాత కూడా కీర్తికోసం గురువుల నాశ్రయిస్తున్నారు. అదేవిధంగా రాజర్షులందరూ, తపోధనులయిన బ్రాహ్మణులూ కీర్తికోసం, పెద్దవో, చిన్నవో-

దుష్కర కార్యాల నెన్నింటినో చేశారు. అదేవిధంగా నీవు కూడా ఈ మాద్రిని పడవనెక్కించుకొని గట్టుకు చేర్చు. ఆమెకు కూడా సంతానాన్ని కల్గించి ఘనకీర్తిని పొందు.''

పాండురాజు ఇలా అన్న తరువాత కుంతి మాద్రితో ఇలా అన్నది - ''ఒక్కసారి ఏ దేవతనయినా మనస్సులో తలచుకో. దానితో నీకు తగిన సంతతి కలుగుతుంది. సందేహించ నవసరం లేదు.'' ఆపై మాద్రి బాగా ఆలోచించి మనస్సులో అశ్వినీ దేవతలను తలచుకొన్నది. వారు వచ్చి ఆ మాద్రికి కవలపిల్లలను అనుగ్రహించారు. వారు నకులుడూ, సహదేవుడూ. లోకంలో అందంతో వారికి సాటిరాగలవారు లేరు. ఆ కవలపిల్లలను గురించి కూడా అశరీరవాణి ఇలా పలికింది. ''ఈ కవలలు బుద్ధి, రూప, గుణాలలో అశ్వినీ దేవతలను కూడా మించిపోగలరు. తమ తేజస్సు, రూపసంపదలతో ఎంతో ప్రకాశిస్తారు.'' శతశృంగనివాసులయిన మహర్షులు వారికి నామకరణం చేశారు. వారిని ఆశీర్వదిస్తూ వారి భక్తినీ, చేష్టలనూ అనుసరించి పేర్లు పెట్టారు. కుంతి పెద్దకొడుకు యుధిష్ఠిరుడు, మధ్యముడు భీమసేనుడు, మూడవవాడు అర్జునుడు అని కుంతిపుత్రులకు పేర్లు పెట్టారు. ప్రీతమనస్కులయిన ఆ విప్రులు మాద్రి కొడుకులలో పెద్దవాడిని నకులుడనీ, రెండవవాడిని సహదేవుడనీ వ్యవహరించారు. కురుశ్రేష్ఠులైన ఆ పాండవులు సంవత్సరానికి ఒక్కొక్కరుగా పుట్టారు. అయినా దేవతారూపులు కాబట్టి అయిదు సంవత్సరాలవలె సమానంగానే శోభించేవారు. ఆ పాండవులంతా గొప్పధైర్యం, గొప్ప వీర్యం, గొప్ప బలపరాక్రమాలూ కలవారు. మహాతేజస్వులూ, దేవస్వరూపులూ అయిన ఆ కొడుకులను చూచి పాండురాజు ఎంతో ఆనందాన్ని పొందాడు. శతశృంగనివాసు లయిన మహర్షులకూ, మునిపత్నులకూ కూడా ఆ పాండవులు ఎంతో ముచ్చట గొలిపేవారు.

ఆ తర్వాత పాండురాజు మరలా మాద్రికి సంతానాన్ని కల్గించాలని కుంతిని ప్రేరేపించారు. ఏకాంతంలో పాండురాజు కుంతిని అడగగానే ఆమె ఇలా అన్నది - 'రాజా! నేను ఒక్కబిడ్డను కనమని ఆమెను నియోగించాను. కానీ ఆమె ఇద్దరిని పొందింది. నన్ను మోసగించింది. నాకు భయం కలుగుతోంది. ఆమె నన్ను పరాభవించే అవకాశమున్నది. అశ్వినీదేవతలను ఇద్దరిని ఆహ్వానించటంవలన ఇద్దరు కొడుకులను పొందగలదని నేను ఊహించలేకపోయాను. కాబట్టి మరలా నన్ను ఆపనికై నియోగించవద్దు. నాకు ఆ వరమివ్వండి.' ఇలా పాండురాజుకు అయిదుగురు కొడుకులయ్యారు. వారు దేవతలు అనుగ్రహించి ఇచ్చినవారు. మహాబలులూ, కీర్తిమంతులూ, కురువంశ వివర్ధనులూ, శుభలక్షణ సంపన్నులూ, చంద్రునివలె చూడముచ్చటైనవారు. వారు సింహాలవలె పౌరుషం, కంఠం, గంభీరగమనం గలవారు. మహాధనుర్ధరులు. దేవపరాక్రములు. మనుజశ్రేష్ఠులు. ఆ పవిత్రహిమలయపర్వతంపై

ఎదుగుతూ అక్కడున్న మహర్షులకు అందరకూ ఆశ్చర్యాన్ని కల్గించారు.

(శతశృంగనివాసు లయిన తాపసులు పాండుకుమారులు పుట్టినప్పటి నుండీ వారిని సొంత బిడ్డలవలె భావించి లాలించసాగారు. ఆ తర్వాత ద్వారకలో వసుదేవుడు మొదలయిన వృష్ణివంశజులు పాండురాజును గురించి ఇలా అనుకోసాగారు- పాండురాజు మునిశాపంవలన భయపడి శతశృంగాన్ని చేరాడు. అక్కడ తాపసులతో కలిసి తపస్సు చేస్తూ తాపసి అయ్యాడు. శాకమూల ఫలాలను ఆహారంగా స్వీకరిస్తూ, నియతేంద్రియుడై, ధ్యానయోగపరాయణుడై సాధకుడుగా రూపొందాడని వార్తాహరులు అంటున్నారు. ఆ మాటలు విని యదువంశస్థులు ఎందరో పాండురాజు మీద గల ఆదరంవలన ఖిన్నులయ్యారు. ఆయనను గురించి శుభసమాచారాలను ఎప్పుడు వినగలమా అని ఎదురు చూడసాగారు. ఈవిధంగా వృష్ణివంశజులు అనుకొంటున్న సమయంలోనే పాండురాజుకు సంతానం కలిగిన విషయం తెలిసింది. వారంతా ఆనందమగ్నులై ఒకరినొకరు అభినందించుకొంటూ వసుదేవునితో ఇలా అన్నారు. వసుదేవా! పాండుకుమారులు బాలసంస్కారాలను కోలుపోరాదు. పాండురాజుకు ఇష్టుడవు, హితకాంక్షివి అయిన నీవు పురోహితుని పంపించు. వసుదేవుడు అలాగే అని అంగీకరించి పురోహితుని పంపించాడు.కుమారులకు తగిన వస్త్ర భూషణాలనూ, కుంతికీ, మాద్రికీ అవసరమయిన దాసదాసీ జనాలనూ ఆభరణాలను, గోవులనూ, వెండినీ, బంగారాన్నీ కూడా పంపించాడు. వాటినన్నింటినీ వెంటతీసికొని పురోహితుడు వెళ్ళాడు. పరపురంజయుడైన ఆ పాండురాజు తన దగ్గరకు వచ్చిన ఆ పురోహితుని-ద్విజశ్రేష్ఠుడైన కాశ్యపుని - శాస్త్రోక్తంగా అర్చించాడు. కుంతి, మాద్రి కూడా ఆనందించి, వసుదేవుని ప్రశంసించారు. ఆ తర్వాత పాండురాజు తన కొడుకులకు గర్భాధానం నుండి చౌలోపనయనాల వరకు సర్వసంస్కారాలనూ జరిపించాడు. పురోహితుడైన ఆ కాశ్యపుడే అంతా జరిపించాడు. పెద్దపెద్ద కన్నులు గలవారూ, కీర్తిమంతులూ అయిన ఆ పాండవులు చౌలోపనయనాల తర్వాత ఉపాకర్మను ముగించుకొని వేదాధ్యయనం ప్రారంభించి దానిలో పారంగతులయ్యారు.

భారతా! శర్యాతివంశస్థుడైన ఒకరాజు పృషత్కుడు. ఆయన కొడుకు శుకుడు. పరంతపుడైన ఆ శుకుడు విలువిద్యతో సాగరపర్యంతమయిన ఈ భూమిని జయించి, వంద అశ్వమేధయాగాలను చేసి ఆ యాగాలతో సమస్తదేవతలనూ, పితరులనూ ఆరాధించి శాకమూలఫలాశనుడై శతశృంగపర్వతంలో తపస్సు చేశాడు. ఆ తాపసి శ్రేష్ఠమయిన ఉపకరణాలతోనూ, అధ్యాపనతోనూ పాండవులను వృద్ధిపొందింపజేశాడు. ఆయన అనుగ్రహం వలన పాండవులు ధనుర్విద్యాపారంగతు లయ్యారు. భీముడు గదాయుద్ధంలోనూ, ధర్మరాజు తోమరాలు విసరటంలోనూ, సత్యసంపన్నులయిన నకులసహదేవులు కత్తిడాలూ పట్టడంలోనూ, పరంతపుడయిన అర్జునుడు ధనుర్విద్యలోనూ పారంగతు లయ్యారు. శుకుడు తన అంతటివానిగా అర్జునుని భావించాడు. ఆపై మహాదాత అయిన ఆ శుకుడు ఆనందించి శక్తినీ, ఖడ్గాన్నీ, బాణాలనూ, తాటిచెట్టువలె ఉన్నతమై మెరిసిపోయే ధనుస్సునూ, విపారినీ, చురకత్తినీ అర్జునున కిచ్చాడు. ఆ బాణాలు గ్రద్ద ఈకలు గలవి. అలంకరింపబడినవీ పెద్దపెద్ద పాములవలె ప్రకాశించేవి. ఆ శస్త్రాలన్నీ పొంది అర్జునుడు ఆనందించాడు. రాజులందరూ కూడా తన తేజస్సుకు చాలరని భావించాడు. ఆ కుంతీ పుత్రులు ఒక్కొక్క యేడు తేడా గలవారు. ఆ కౌంతేయులూ, మాద్రేయులూ కూడా వర్ధిల్లసాగారు.)

ఈ విధంగా కురువంశవర్ధనులయిన నూట ఆయిదుగురు బాలురు కూడా నీటిలో తామరలవలె స్వల్పకాలంలోనే వృద్ధిపొందారు.

124. పాండురాజమరణము - మాద్రి సహగమనము.

పాండురాజు చూడముచ్చటయిన అయిదుగురు కుమారులనూ చూస్తూ ఆ మహారణ్యంలో అందమయిన పర్వతంపై తన బాహుబాలాన్ని ఆసరాగా చేసికొని జీవించ సాగాడు.

(అర్జునునకు పదునాలుగేండ్లు నిండిన తర్వాత ఉత్తరఫల్గుని నక్షత్రదినాన బ్రాహ్మణులు స్వస్తి పలుకుతున్న సందర్భంలో బ్రాహ్మణభోజనాల ఎర్పాట్లలో నిమగ్న అయిన కుంతి పాండురాజసంరక్షణను విస్మరించింది. పురోహితునితో కలిసి బ్రాహ్మణులకు వడ్డన చేయించ సాగింది.)

ఆ సమయంలో మదనమోహితుడైన పాండురాజు మాద్రిని పిలిచి, తోటలన్నీ చక్కగా పూచిన ఆ మధుమాసవేళలో వసంతుడు ప్రాణులను మోహింపజేస్తున్న సమయంలో మాద్రితో కలిసి విహరించసాగాడు. మోదుగలు, తిలకాలు, మామిడి చెట్లు, చంపక వృక్షాలూ, పారిభద్రక తరువులు - మరెన్నో విధాలయిన చెట్లు ఫల పుష్పాలతో సమృద్ధాలై ఉన్నాయి. వివిధజలాశయాలలో పద్మలతలు ప్రకాశిస్తున్నాయి. అది చూచిన పాండురాజు మనస్సులో మన్మథుడు మెదలసాగాడు. మనస్సును ఉల్లాసంతో నింపుకొని దేవతల వలె సంచరిస్తున్న ఆ పాండురాజును అందమైన వస్త్రం ధరించి మాద్రి అనుసరించింది. వయస్సులో ఉండి, సన్నని వలువలు ధరించి ఉన్న ఆ మాద్రిని చూచిన తర్వాత పాండురాజులోని కోరిక అరణ్యంలో అగ్నిలాగా పైకెగసింది. ఆ పాండురాజు మన్మథునికి లోబడి ఏకాంతంలో ఆ పద్మనయనను చూచి తన్ను తాను నియంత్రించుకొనలేక పోయాడు. ఆ పై ఒంటరిగా ఉన్న ఆ మాద్రిని పాండురాజు బలవంతంగా పట్టుకొన్నాడు. తన శక్తినంతా వినియోగించి ఆమె ఆయనను వారించింది. కామంతో నిండిన మనసు గల ఆ పాండురాజు తనకున్న శాపాన్ని గుర్తుంచుకొనలేకపోయాడు. బలవంతంగా మాద్రితో కలిశాడు. జనమేజయా! ఆ పాండురాజు కామునకు లోబడినాడు. విధిప్రేరితుడై శాపభయాన్ని లెక్క చేయకుండా ప్రాణాల మీదకు తెచ్చుకొన్నాడు. సాక్షాత్తూ కాలమే కామాత్మకమై పాండురాజు బుద్ధిని మోహింపజేసింది. అది ఇంద్రియసమూహాన్ని అణచి, ఆలోచించే శక్తితో పాటు తాను కూడా నశించింది. పరమధర్మాత్ముడైన ఆ పాండురాజు ఆ భార్యతో సంగమించి కాలధర్మం చెందాడు. ఆపై మాద్రి ప్రాణాలు కోల్పోయిన ఆ పాండురాజును కౌగిలించుకొని, దుఃఖంతో మాటిమాటికీ పెద్దగా ఏడవసాగింది. అంతలో పాండురాజు

ఆ విధంగా కాలధర్మాన్ని పొందిన ఆ తావునకు కుంతి తన కుమారులతోనూ, మాద్రి పుత్రులతోనూ కలిసి వచ్చింది. రాజా! అపుడు శోకార్త అయిన మాద్రి కుంతితో "పిల్లలను అక్కడే ఉంచి నీవు ఒక్కదానివే ఇటు రా" అన్నది. ఆ మాద్రిమాట విని కుంతి పిల్లలను అక్కడే విడిచి "అయ్యో! చచ్చాను" అని అరుస్తూ వెంటనే వచ్చింది. భూమిపై శయనించి ఉన్న పాండురాజునూ, మాద్రినీ చూచి కుంతి తనువంతా శోకాన్ని నింపుకొని, దుఃఖంతో ఏడవసాగింది. 'నేను నిత్యమూ వీరుడూ, జితేంద్రియుడూ అయిన మహారాజును రక్షిస్తున్నాను. మృగశాపం తెలిసికూడా నీతో బలవత్సమాగమం ఎలా జరిగింది? మాద్రీ! మహారాజును రక్షించవలసిన కర్తవ్యం నీకు కూడా ఉంది. అటువంటి నీవు ఏకాంతంలో మహారాజును లోభానికెందుకు గురిచేశావు? ఎప్పుడూ ఆ శాపాన్నే తలచుకొంటూ దీనంగా ఉండే మహారాజుకు ఏకాంతంలో నీ దగ్గర అంత ఉల్లాసమెలా కలిగింది? నీవు ధన్యురాలవు. నాకన్నా అదృష్టవంతురాలవు. అందువలననే సంతోషంతో నిండిన మహారాజ ముఖాన్ని చూడగలిగావు.' మాద్రి ఇలా అన్నది. 'దేవీ! నేను విలపిస్తూ పదేపదే అడ్డగిస్తున్నా శాపాన్ని సత్యం చెయ్యాలన్న సంకల్పంతోనో ఏమో తనను తాను నియంత్రించుకొనలేకపోయాడు.

(మాద్రి పలికిన ఆమాటలు విని కుంతి శోకాగ్ని సంతప్తయై మొదలంట నరికిన చెట్టులాగా నేలకూలింది. ఆమె స్పృహ కోల్పోయి కదలలేకపోయింది. మోహంతో చైతన్యాన్ని కోల్పోయిన ఆ కుంతిని మాద్రి లేవదీసి 'రారమ్మ'ని కొనిపోయి పాండురాజును చూపించింది. జనమేజయా! కుంతి పాండురాజు పాదాలపై బడి, నవ్వుమొగంతో ఏదో చెపుతున్నట్లు ఉన్న పాండురాజును కౌగిలించుకొని మోహంతో విలపించసాగింది. మాద్రి కూడా పాండురాజును కౌగిలించుకొని విలపించసాగింది. ఆ విధంగా మరణించి ఉన్న పాండురాజు దగ్గరకు చారణులతో సహా మహర్షు లందరూ గుమిగూడివచ్చారు. శోకంతో కన్నీరు పెట్టుకొన్నారు. అస్తమించిన ఆదిత్యునివలె, ఎండిపోయిన సముద్రంవలె ఉన్న పాండురాజును చూచి మహర్షులు శోకించారు. పాండవులూ, మహర్షులూ కూడా సమానంగానే శోకాన్ని అనుభవించారు. కళంక రహితులయిన కుంతీమాద్రులు దుఃఖాన్ని ఆపుకొనలేకపోయారు. కుంతి ఇలా అన్నది. 'రాజా! మమ్ములను ఎవరికి అప్పగించి స్వర్గానికి వెళ్తున్నావు. రాజా! నేనెంత దురదృష్టవంతురాలను ! నా భాగ్యాలు మందగించినందువలన ఒంటరిగా మాద్రితో కలిసి మరణించావు. రాజా! యుధిష్ఠిరుడు, భీమసేనుడు, అర్జునుడు, నకుల సహదేవులు - ఈ ప్రియ పుత్రులనందరినీ ఎవరికి అప్పగించి వెళ్ళావు? భారతా! బ్రాహ్మణుల సమక్షంలో నీవు చేసిన తీవ్రతపస్సును తప్పనిసరిగా త్రిదశులైన దేవతలు అభినందిస్తారు. అజమీఢకులనందనా! నీ పూర్వీకులు తమ పుణ్యకర్మల వలన పొందిన పుణ్యస్వర్గలోకాలను నీవు మా ఇద్దరితో కలిసి పొందుతావు.' ఈ విధంగా ఎంతగానో విలపించి కుంతీ మాద్రులు నిశ్చేష్టులై నేలబడినారు. వేదపారగులయిన యుధిష్ఠిరాది పాండవులు కూడా వచ్చి పితృసన్నిధిలో నిశ్చేతనులై పడినారు. తండ్రి పాదాలను కౌగిలించి, పాండవులు విలపించసాగారు.)

కుంతి ఇలా అన్నది 'మాద్రీ! నేను పెద్ద భార్యను. ధర్మ ఫలితంలో పెద్దభాగం

9632

కూడా నాదే. తప్పక జరగవలసిన పనిలో నన్ను ఆపవద్దు. మరణించిన భర్తను అనుసరించి నేను వెళతాను. నీవు ఈయనను వదలివెళ్ళు. ఈ పిల్లలను చూచుకో. పుత్రులను పొందటంతో నా కోరిక తీరింది. ఇప్పుడు భర్త ననుసరించి వీరపత్నిని కాగోరుతున్నాను.' మాద్రి ఇలా అన్నది. 'రణభూమిలో వెన్నుచూపి ఎరుగని భర్తను నేను అనుసరిస్తాను. నా కోరికలింకా తృప్తి చెందలేదు. నీవు పెద్దదానవు. సహగమనానికి నాకు అనుమతి నివ్వు. ఈ భరతశ్రేష్ఠుడు కామంతో నాతో సంగమించి మరణించాడు. కాబట్టి నేను యమసదనానికి అయినా వెళ్ళి ఆ కామవాసనను నివర్తింపజేయాలి. ఆర్యా! నేను నాకుమారులను చూచినట్టుగా నీకుమారులను చూడలేను. దానివలన నాకు పాపం కూడా చుట్టుకుంటుంది. కుంతీ! అందువలన నీకుమారులను చూచినట్లే నాపిల్లలను కూడా చూడాలి. ఈ పాండురాజు మృత్యువాత పడినది నన్ను కోరియే గదా.'

(మహర్షులు సత్యవిక్రములయిన పాండవులనూ, కుంతీ మాద్రులను ఓదార్చి వారితో ఇలా అన్నారు. 'సౌభాగ్యవతులారా! పిల్లలందరూ చిన్న వాళ్ళు. వారిని వదలి వెళ్ళరాదు. ఈ పాండవులను కురురాజ్యానికి కొనిపోతాం. ధృతరాష్ట్రుడు అధర్మప్రయోజనాలను పొందటంలో ఆశ గలవాడు. పాండవులతో తగినట్లుగా ఆయన వ్యవహరించలేకపోవచ్చు. వృష్ణివంశస్థులు, కుంతిభోజుడు కుంతికి రక్షణగా నిలుస్తారు. మహారథుడు, బలిష్ఠుడూ అయిన శల్యుడు-మాద్రి సోదరుడు ఆమెకు అండగా ఉంటాడు. భర్తతో సహగమించుట స్త్రీలకు సత్ఫలదాయకమే. అనుమానం లేదు. కానీ మీ ఇద్దరకూ ఇది దుష్కర మయిన దని బ్రాహ్మణులు అంటున్నారు. భర్త మరణించిన తరువాత బ్రహ్మచర్యవ్రతాన్ని పాటిస్తూ, యమనియమాలను అనుసరిస్తూ, త్రికరణాలతోనూ శుభకర్మలను అనుష్ఠిస్తూ, కష్టసాధ్యమైన చాంద్రాయణాది వ్రతాలను, ఉపవాసాదులనూ పాటించే స్త్రీయే పతివ్రత. ఆమె క్షారలవణాలను వీడి, ఏకభుక్తం చేస్తూ నేలపై పరుండాలి. ఏదో ఒకరీతిగా ఆమె శరీరాన్ని శుష్కింపజేసుకోవాలి. విషయవాసనలచేత బుద్ధిని కోల్పోయి దేహపోషణ యందే ఆసక్తిగల స్త్రీ దేహానంతరం తప్పక నరకానికే పోతుంది. కాబట్టి దేహాన్ని శుష్కింపజేయాలి. విషయాసక్తిని విడిచిపెట్టాలి. అటువంటి నిష్ఠగల పతివ్రత భర్తను గూర్చియే ఆలోచిస్తూ ఆయనను తరింపజేయగలదు. కాబట్టి ఆమె ఆవిధంగా తననూ, తనభర్తనూ, తన సంతతిని కూడా ఉద్ధరించగలుగుతుంది. కాబట్టి మీ ఇద్దరూ బ్రతికి ఉండటమే తగినదని అనుకొంటున్నాం, కుంతి ఇలా అన్నది. 'పాండురాజు ఆదేశాన్ని పాటించినట్లుగానే బ్రాహ్మణుల ఆదేశాన్ని కూడా శిరసావహించాలి. మీరు చెప్పినట్లే చేస్తాను. పూజ్యులయిన మీరు చెప్పినదే నాకూ, నాభర్తకూ, నాకుమారులకూ శ్రేయోదాయకమని భావిస్తాను. దీనిలో సందేహం లేదు, మాద్రి ఇలా అన్నది. పుత్రుల యోగక్షేమాలను గమనించటంలో కుంతి సమర్థురాలు. ఏ స్త్రీ కూడా కడకు అరుంధతి అయినా బుద్ధిలో కుంతికి సాటి రాలేదు. కుంతికి వృష్ణులూ, కుంతిభోజుడూ అండగా ఉంటారు. కుంతీ! పిల్లలను పెంచటంలో నీవలె నేను సమర్థురాలను కాను. భర్తసమాగమసుఖంతో నాకు తృప్తి కూడా కలగలేదు. కాబట్టి భర్త ననుసరించి పతిలోకానికి వెళ్ళటానికి పెద్దదానవు నీవు నన్ను అనుమతించాలి. కళ్యాణి అయిన మాద్రి ఈరీతిగా పలికి, కుంతికి తలవాల్చి, నమస్కరించి,

నకులసహదేవుల నప్పగించింది. మహర్షులకందరకు నమస్కరించి, పాండవులనందరనూ కౌగిలించుకొని, కౌంతేయులనూ తనకుమారులనూ మాటిమాటికీ శిరస్సున మూర్కొని యుధిష్ఠిరుని చేయిపట్టుకొని ఇలా అన్నది. 'మీకు అసలు తల్లి కుంతియే. నేను దాదిని మాత్రమే. మీ తండ్రి గతించాడు. ఇప్పుడు పెద్దవాడైన యుధిష్ఠిరుడే మీ నలుగురికి తండ్రి వంటివాడు. సత్యధర్మపరాయణులై పెద్దలమాటలను పాటించినవారు నశించరు. పరాభవాలకు కూడా లోనుకారు. కాబట్టి మీరందరూ అలసత్వాన్ని వీడి గురు జనులను సేవించాలి. వార్ష్ణేయీ! నీవు ధన్యురాలవు. నీ వంటి స్త్రీ మరొకతె లేదు. యశోవంతులు, కీర్తిమంతు లయిన ఈ అయిదుగురు కుమారుల బలాన్ని తేజస్సునూ, యోగాన్నీ, మాహాత్మ్యాన్నీ నీవు చూస్తావు. మహర్షుల సన్నిధిలో నేనీమాట అంటున్నాను. స్వర్గానికి వెళ్ళగోరుతున్న నా ఈ మాటలు వ్యర్థంకావు. నీవు నా కన్నా పెద్దదానవు. నమస్కరింపదగిన దానవు. పూజింపదగినదానవు. గొప్పదానవు శుభగుణాలతో వెలుగుతున్నదానవు. యాదవకుమారీ! నీ అనుమతిని కోరుతున్నాను. నేను ధర్మాన్నీ, స్వర్గాన్నీ, కీర్తినీ పొందటానికి తగిన సహకారాన్ని నీవందించు. నీ ప్రయత్నం ద్వారా అది లభిస్తుంది. మనస్సులో మరొక ఆలోచన వద్దు. అప్పుడు యశస్విని అయిన కుంతి కన్నీటితో గద్గదమయిన గొంతుతో ఇలా అన్నది- 'కళ్యాణీ! నీకు అనుమతినిస్తున్నాను. విశాలాక్షీ! స్వర్గంలో నేడే నీకు భర్తృ సమాగమం లభిస్తుంది. భామినీ! నీవు స్వర్గంలో భర్తతో కలిసి అనంతకాలం సుఖంగా క్రీడించు.')

అప్పుడు మాద్రి ఇలా అన్నది - 'ఈ నా శరీరాన్ని కూడా మహారాజు శరీరంతో పాటు చక్కగా పేర్చి దహించాలి. అక్కా! నాకు ప్రియమైన ఈ కార్యాన్ని జరిపించాలి. నా పిల్లల హితాన్ని కోరుతూ అప్రమత్తంగా చూచుకోవాలి. ఇంతకన్నా నీకు చెప్పవలసినది నాకేదీ తోచటం లేదు.' ఆ విధంగా పలికి కీర్తిమతి అయిన మాద్రి - పాండురాజ ధర్మపత్ని - వెంటనే చితాగ్నిపై నున్న పాండురాజుననుగమించింది.

(ఆ తర్వాత ప్రేతకర్మలను చేయించటంలో పారంగతుడైన ఆ కాశ్యపపురోహితుడు బంగారు ముక్కలనూ, నేతినీ, నువ్వులనూ, పెరుగును, బియ్యాన్ని, నీటితో నిండిన కుండనూ, గొడ్డలినీ సమకూర్చుకొని మహర్షుల ద్వారా అశ్వమేధాగ్నిని తెప్పించి శాస్త్రోక్తంగా నాల్గువైపులా అంటింపచేసి పాండురాజుదహనసంస్కారాన్ని పూర్తిచేయించాడు. అనఘుడైన యుధిష్ఠిరుడు సోదర సహితుడై నూత్నవస్త్రాలను ధరించి పురోహితుని ఆదేశాలను అనుసరిస్తూ జలాంజలిని సమర్పించాడు. శతశృంగనివాసులయిన మహర్షులు, చారణులూ, ఇతరమునులూ కలిసి పాండురాజుకు పారలౌకిక క్రియల నన్నింటినీ యథావిధిగా పూర్తిచేశారు.)

125. ఋషులు కుంతిని, పాండవులను హస్తినకు కొనిపోవుట.

పాండురాజ మరణాన్ని చూచి అక్కడున్న మంత్రవేత్తలు, దేవతుల్యులయిన మహర్షులు తమలో తాము చర్చించుకొన్నారు. తాపసులిలా అన్నారు. 'ఈ పాండురాజు రాజ్యాన్నీ, రాష్ట్రాన్నీ వీడి ఈ ప్రదేశంలోనే తపస్సు చేసి తాపసుల శరణుకోరాడు. ఈ

పాండురాజు తన భార్యనూ, పసి వయస్సులోని కుమారులనూ మీకు అప్పగించి ఇక్కడనుండియే స్వర్గలోకానికి వెళ్ళిపోయారు. ఈ పాండురాజ కుమారులను, మాద్రీ పాండురాజుల అస్థికలను, ఈ మహాత్ముని భార్య అయిన కుంతిని తీసికొని, వారి రాష్ట్రానికి వెళదాం. ప్రస్తుతమిదే మనకు తగిన ధర్మం.'

ఈ విధంగా పరస్పరం సంప్రదించుకొని దేవసమానులు, ఉదార హృదయులూ అయిన ఆ సిద్ధ మహర్షులు పాండుకుమారులను తీసికొని హస్తినకు వెళ్ళి భీష్మ ధృతరాష్ట్రులకు పాండవులను అప్పగించాలని ప్రయాణానికి సంకల్పించారు. ఆ క్షణంలోనే పాండు రాజకుమారులనూ, కుంతిని, మాద్రీ పాండురాజుల అస్థికలను తీసికొని ఆ తాపసులు బయలుదేరారు. నిరంతరమూ పుత్రవాత్సల్యం గలిగినదీ, ఒకప్పుడు సుఖంగా జీవించినదే కుంతి. కాని ఇప్పుడు ప్రపన్నురాలు. ఆ కుంతి ఆ సుదీర్ఘమార్గాన్ని కూడా స్వల్పంగానే భావించింది. యశస్విని అయిన కుంతి స్వల్ప వ్యవధిలోనే కురుజాంగల దేశాన్ని చేరి వర్ధమాన మనేపేరుగల నగరద్వారాన్ని సమీపించింది. తమరాకను ప్రభువున కెరిగించమని తాపసులు ద్వారపాలకునితో అన్నారు. వారు వెళ్ళి క్షణకాలంలోనే ఆ విషయాన్ని సభలో తెలియజేశారు. వేలకొలది చారణులు, మహర్షులూ అక్కడకు రావటాన్ని విని, హస్తినాపురిలోని రాజులు ఆశ్చర్యపడ్డారు. రెండు గడియల కాలంలోనే నగరవాసులంతా స్త్రీలనూ, పిల్లలనూ కూడా వెంటబెట్టుకొని తాపసులను చూడటానికి బయటకు వచ్చారు. స్త్రీలూ, క్షత్రియసమూహాలూ వివిధవాహనాలను అధిరోహించి బయలుదేరారు. బ్రాహ్మణులతో బాటు బ్రాహ్మణ స్త్రీలు కూడా బయలుదేరి వచ్చారు. అదే విధంగా వైశ్య శూద్ర సముదాయాలు పెద్దగా గుమిగూడాయి. ఎవ్వరి మనస్సులలోనూ ఈర్ష్యలేదు. అందరూ ధర్మబుద్ధులు. ఆ ప్రకారంగా శాంతనుసుతు డయిన భీష్ముడూ, సోమదత్తుడూ, బాహ్లీకుడు, ప్రజ్ఞానేత్రుడు రాజర్షీ అయిన ధృతరాష్ట్రుడూ, విదురుడూ స్వయంగా వచ్చారు. రాణి అయిన సత్యవతి, కీర్తిమతి అయిన కౌసల్య, అంతఃపురకాంతలతో గూడి గాంధారి వెలుపలకు వచ్చారు. ధృతరాష్ట్రుని కొడుకులు వందమందీ దుర్యోధనుని ముందు నిలిపికొని, విచిత్రాభరణాలను ధరించి వచ్చారు. ఆ మహర్షిగణాలను చూచి శిరసా నమస్కరించి, పురోహితులతో సహా కౌరవులంతా వారికి సమీపంగా కూర్చున్నారు. ఆ ప్రకారంగానే పౌరులూ, జానపదులూ అందరూ నేలకు తల తాకించి, నమస్కారం చేసి, సమీపంలో కూర్చున్నారు. జనమేజయా! ఆ తర్వాత ప్రజలంతా నిశ్శబ్దంగా కూర్చొని ఉండటాన్ని గమనించి, భీష్ముడు యథావిధిగా పాద్యాన్ని, అర్ఘ్యాన్నీ ఇచ్చి మహర్షులను అర్చించి రాజ్యాన్నీ, రాష్ట్రాన్నీ మహర్షులకు నివేదించాడు. ఆ మహర్షు లందరిలో వృద్ధుడై జటాజినాలను

ధరించి ఉన్న మహర్షి లేచి ఇతరమహర్షుల అనుమతితో ఇలా అన్నాడు.

'నీకుమారుడు పాండుమహారాజు కామభోగాలను విసర్జించి ఇక్కడనుండి శతశృంగ పర్వతానికి వెళ్లాడు.

(ఆ ధర్మాత్ముడు అక్కడ కందమూలాలను ఆహారంగా తీసికొని తన భార్యలతో సహా అలసట లేకుండా కొంతకాలం యథావిధిగా తపస్సు చేశాడు. ఆయన స్వభావమూ, నడవడీ, తపస్సూ చూచి శతశృంగనివాసులూ, తపోమూర్తులు అయిన మహర్షులందరూ ఆనందించారు.)

బ్రహ్మచర్యవ్రతంలో ఉన్న ఆయనకు ఏదో దివ్యమైన కారణంవలన సాక్షాత్తూ ధర్మరాజు ద్వారా ఈ కుమారుడు యుధిష్ఠిరుడు పుట్టాడు. అదే విధంగా మహాత్ముడైన ఆ రాజునకు బలవంతులలో శ్రేష్ఠుడూ, మహాబలుడూ అయిన ఈ భీముని వాయుదేవుడు కుమారునిగా ఇచ్చారు. ఈ కుమారుడు ధనంజయుడు ఇంద్రుని ద్వారా కుంతికి జన్మించినవాడు. ఇతని కీర్తి ధనుర్ధారులందరినీ తిరస్కరింపగలది. ఇదిగో ఈ కుమారులను చూడండి. వీరు పురుషోత్తములు, మేటి విలుకాండ్రు, వీరిని మాద్రి అశ్వినీ దేవతల ద్వారా కన్నది.

(వీరిపేర్లు నకులుడూ, సహదేవుడూ. వీరు అమిత తేజోవంతులు, నరశ్రేష్ఠులూ, ఓటమిలేనివారు.)

కీర్తిమంతుడై, నిత్యమూ ధర్మబద్ధంగా జీవిస్తున్న పాండురాజు నశించిపోయిన పితామహవంశాన్ని పునరుద్ధరించాడు. పాండుకుమారుల జన్మమూ, అభివృద్ధినీ, వైదికాధ్యయనాదులను చూచి మీరంతా ఎంతో సంతోషించండి. సజ్జనుల బాటలో జీవించి, పుత్రలాభాన్ని పొంది, పాండురాజు నేటికి పదిహేడు రోజులముందు పితృలోకాన్ని పొందాడు. పాండురాజును చితిపై కెక్కించి దాహకర్మను నిర్వర్తిస్తున్న వేళలో మాద్రి జీవనమోహాన్ని విడిచి తాను కూడా అగ్నికి ఆహుతైనది. పతివ్రత అయిన ఆ మాద్రి భర్తతో సహగమించి పతిలోకానికే చేరింది. ఇకపై మాద్రీ పాండురాజులకు నిర్వర్తించవలసిన కార్యాలను నిర్వర్తించండి.

(శరణుకోరి వచ్చిన కుంతినీ, కీర్తిమంతులను పాండవులనూ తగినరీతిగా మీరు అనుగ్రహించి స్వీకరించండి. ఇది సనాతనధర్మం.)

ఇవి మాద్రీ పాండురాజుల అస్థికలు. వీరు ఆ పాండురాజు వరపుత్రులు, శత్రువులను అణచగలవారు. మాద్రి పాండురాజుల శ్రాద్ధక్రియల నిర్వహించటంతో పాటు ఈ కుమారులనూ, కుంతినీ అనుగ్రహించండి. సపిండీకరణపర్యంతం ప్రేతకార్యాన్ని నిర్వహించిన తరువాత సర్వధర్మజ్ఞుడూ, మహాయశస్కుడూ, కురుకుల శ్రేష్ఠుడూ అయిన ఈ పాండురాజు పితృమేధఫలాన్ని పొందవలసి ఉన్నది.' కౌరవులందరితో ఈవిధంగా పలికి వారు చూస్తూండగానే క్షణకాలంలో ఆ తాపసులంతా చారణులతో సహా అంతర్ధానమయ్యారు. గంధర్వనగరం

వలె ఋషులూ, సిద్ధులూ ఆ ప్రకారంగా అంతర్ధానం కావటం చూచి అంతా పరమాశ్చర్యాన్ని పొందారు.

(వెంటనే కౌరవులు లేచి "భళీ-భళీ' అని విస్మయాన్ని ప్రకటించారు)

126. పాండురాజు అంత్యక్రియలు.

ధృతరాష్ట్రుడిలా అన్నాడు. 'విదురా! రాజశ్రేష్ఠుడయిన ఈ పాండురాజుకూ, విశేషించి మాద్రికి రాజోచితంగా ప్రేతకార్యాలను నిర్వహింప జేయవలసినది. మాద్రీపాండురాజులకొరకు పశువులనూ, వస్త్రాలనూ, రత్నాలనూ, వివిధధనాలనూ దానంచేయి. ఎవరు ఎంత కోరితే వారికంత ఇవ్వు. కుంతి మాద్రికి చేయవలసిన సత్కారాలకు అనుగుణంగా ఏర్పాట్లు చేయించు. మాద్రి అస్థికలను వాయువూ, ఆదిత్యుడూ కూడా చూడలేనివిధంగా చక్కగా కప్పి ఉంచు. పాపరహితుడైన పాండురాజును గూర్చి జాలిపడనవసరం లేదు. అతడు గొప్పరాజు. దేవతాసమానులయిన వీరులను - అయిదుగురు కొడుకులను పొందాడు.' విదురుడు 'అలాగే' అని ధృతరాష్ట్రునితో పలికి, భీష్మునితో కలిసి, పరమపవిత్రప్రదేశంలో పాండురాజుకు అంతిమసంస్కారాలకు ఏర్పాట్లు చేయించాడు. వెంటనే పాండురాజదహన సంస్కారం కోసం పురోహితులు నగరం నుండి నేయి, గంధం మొదలయిన సామగ్రితో పాటు జ్వలిస్తున్న అగ్నిని కూడా తీసికొనివచ్చారు. ఆ తరువాత ఆ (వసంత) ఋతువులో పూచిన వివిధ శ్రేష్ఠపుష్పాలతోనూ, గంధాలతోనూ ఒక పల్లకిని అలంకరించి దానిని నాలుగువైపులా వస్త్రాలతో కప్పివేశారు. ఆ విధంగా విలువయిన వస్త్రాలతోనూ, పూలదండలతోనూ ప్రకాశిస్తున్న ఆ పల్లకి దగ్గరకు మంత్రులూ, జ్ఞాతులూ, మిత్రులూ అందరూ వచ్చి చేరారు. దానిలో మాద్రీపాండురాజుల అస్థికల నుంచారు. అందంగా అలంకరింపబడి మనుష్యులచే మోయబడుతున్న ఆ పల్లకిలోనికి వాటిని చేర్చారు. తెల్లని గొడుగుతోనూ, వింజామరలతోనూ, వివిధ మంగళవాద్యాలతోనూ దాని శోభను వర్ధిల్లజేశారు. పాండురాజునకు ఆ విధంగా ఔర్ధ్వదైహికక్రియను నిర్వహిస్తున్న ఆ వేళలో వందలమంది ప్రజలు ఎన్నో రత్నాలను తెచ్చి, కోరినవారందరికీ ఇచ్చారు. ఆపై ఆ పాండురాజుకోసం శుభ్రమయిన గొడుగులనూ, పెద్దపెద్ద చామరాలనూ, అందమయిన వస్త్రాలను తీసికొని వచ్చారు.

ఆ పల్లకి ముందు తెల్లని బట్టలు ధరించిన యాజకులు అగ్నిహోత్రంలో ఆహుతులను వేస్తూ నడవసాగారు. ఆ అగ్నిహోత్రాలు చక్కగా అలంకరింపబడి ప్రజ్వరిల్లుతున్నాయి.

శోకసంతప్తులయిన బ్రాహ్మణులూ, క్షత్రియులూ, వైశ్యులూ, శూద్రులూ వేలకొలదిగ చేరి విలపిస్తూ పాండురాజు అస్థికలున్న పల్లకిని అనుసరించారు. 'ఈ మహారాజు మనలనువీడి, మనలను శాశ్వత దుఃఖంలో ముంచి, అనాథులను చేసి ఎక్కడికి వెళ్తున్నాడు?' అని ఆక్రోశిస్తున్నారు. పాండవులందరూ, భీష్ముడూ, విదురుడూ ఆక్రోశిస్తూ పల్లకి వెంట నడిచారు. గంగాతీరంలోని ఒక సమతల శుభ ప్రదేశంలో అందమయిన తోటలో సత్యవాదియై, అనాయాసకార్యసాధకుడైన ఆ పాండురాజు, మాద్రుల అస్థికలున్న ఆ పల్లకిని నిలిపారు. ఆ తరువాత ఆ పాండురాజు అస్థికలను సర్వవిధ సుగంధాలతో అలంకరించి, బంగారు కలశాలతో తెచ్చిన నీటితో అభిషేకించారు. ఆపై పసుపు తుంగరసం కలిపిన గంధాన్నీ, శ్వేత చందనాన్నీ వాటిపై పూశారు. ఆపై తెల్లని స్వదేశవస్త్రాలతో వాటిని కప్పారు. గొప్పగొప్ప పడకలపై శయనించదగిన ఆ నరశ్రేష్ఠుడైన పాండురాజు యొక్క అస్థికలు వస్త్రాచ్ఛాదనచేత సజీవ మనుష్యునివలె శోభిల్లసాగాయి.

(యాజకులూ, పురోహితులూ అందరూ సమంత్రకంగా వేదోక్తవిధానంతో అశ్వమేధాగ్నితో సర్వక్రియలనూ ముగించారు.)

ప్రేతకర్మను ప్రారంభించే సమయంలో యాజకుల అనుమతితో చక్కగా అలంకరింపబడిన ఆ మాద్రి పాండురాజుల అస్థికలను నేతితో అభిషేకించారు. తుంగపద్మకంతో కలిసి పరిమళిస్తున్న గంధంతోనూ, అనేక గంధద్రవ్యాలతోనూ విధ్యుక్తప్రకారంగా దహనసంస్కారం జరిపించారు. ఆ సమయంలో ఆ ఇద్దరి అస్థికలనూ చూచి అంబాలిక 'అయ్యో కుమారా' అని అంటూ మూర్ఛిల్లి నేలపై పడిపోయింది. ఆర్తయై ఆ రీతిగా పడిపోయిన అంబాలికను చూసి పురజనులూ, గ్రామీణులూ అందరూ రాజభక్తితో, జాలితో శోకసంతప్తులై రోదించసాగారు. కుంతి ఆర్తనాదంతో పశుపక్ష్యాదులకు సంబంధించిన సమస్తప్రాణులతో సహా మనుష్యులు అందరూ ఆక్రోశించారు. ఆ రీతిగానే శాంతనుసుతుడైన భీష్ముడూ, మహామతి అయిన విదురుడూ, సమస్తకౌరవులు మహాశోకనిమగ్నులై ఏడవసాగారు. ఆ తరువాత భీష్ముడూ, విదురుడూ, ధృతరాష్ట్రుడూ, పాండవులు, కౌరవకుల కాంతలూ అందరూ పాండురాజుకు ధర్మోదకాలను సమర్పించారు. ఆ సమయంలో పాండవులంతా ఆక్రోశించారు. శాంతనుసుతుడైన భీష్ముడూ, విదురుడూ ఇతరజ్ఞాతులూ విలపించి, జలాంజలిని సమర్పించారు. రాజా! జలాంజలిని సమర్పించి శోకంతో బలహీనపడిన పాండవులను అమాత్యాదిప్రజలందరూ తాము దుఃఖంలో ఉండి కూడా ఓదార్చారు. పండ్రెండు రాత్రులవరకూ పాండవులు బంధువులతో పాటు నేలమీదనే నిద్రించారు. అదేవిధంగా నాగరికులయిన బ్రాహ్మణాదులు కూడా నేలమీదనే నిదురించారు.

పాండవులతో బాటు హస్తినాపురమంతా ఆనందానికి దూరమైంది. చిన్నాపెద్దా అందరూ దుఃఖంలో మునిగిపోయారు. నగరమంతా అస్వస్థతకు లోనయింది.

127. పాండవ ధార్తరాష్ట్రుల బాల్యక్రీడలు.

ఆ తరువాత కుంతి, ధృతరాష్ట్రుడూ, భీష్ముడూ, ఇతరబంధువులూ కలిసి పాండురాజుకూ అమృతమయమై, స్వధామయమయిన శ్రాద్ధాన్ని పెట్టారు. ఆ సందర్భంలో కౌరవులకూ, వేలకొలది బ్రాహ్మణులకూ భోజనం పెట్టి రత్నాలరాసులను పంచిపెట్టారు. విప్రులలో ప్రధానమైన వారికి మంచి గ్రామాలను దానం చేశారు. భరతశ్రేష్ఠులైన పాండవులు మృతాశౌచం, నుండి బయటపడి శుద్ధిస్నానం చేసిన తరువాత పాండవులను తీసికొని అందరూ హస్తినాపురికి చేరారు. పౌరజానపదులందరూ ఆ పాండురాజునే నిత్యమూ తలచుకొంటూ తమ బంధువే మరణించినట్లు శోకావిష్ట లయ్యారు. శ్రాద్ధం ముగిసినపిమ్మట జనులందరి దుఃఖాన్ని గమనించి వ్యాసుడు దుఃఖశోకాతురయై నిశ్చేతనలో ఉన్న తల్లితో ఇలా అన్నాడు. **సుఖాల నమభవించే కాలం గడచిపోయింది. భయంకర సమయం సమీపిస్తోంది. రాను రానూ చెడ్డరోజులు రాబోతున్నాయి. నేల యౌవనాన్ని కోల్పోయింది.*** రాబోవు కాలంలో అందరూ కపటంగా, మాయావులుగా జీవిస్తారు. **అనేక దోషాలు రూపుదిద్దుకొంటాయి. ధర్మక్రియలూ, సదాచారాలూ నశిస్తాయి. కాలం భయంకరంగా ఉంటుంది. కౌరవుల అవినీతివలన భూమండలమంతా వినాశమై పోతుంది.** కాబట్టి నీవు యోగమార్గాన్ని ఆశ్రయించు. ఇక్కడ నుండి వెళ్ళిపో. తపోవనంలో నివసించు. ఈ వంశానికి కలిగే ఘోరసంక్షోభాన్నీ, వినాశనాన్నీ నీవు చూడలేవు. అప్పుడు సత్యవతి ఆ మాటను అంగీకరించి, లోనికి ప్రవేశించి కోడలితో ఇలా అన్నది. 'ఆంబికా! నీపౌత్రుని దుర్నీతి వలన భరతవంశమూ, ఈ పౌరులూ బంధుమిత్రులతో సహా నశిస్తారని విన్నాను. కాబట్టి నీకిష్టమయితే పుత్రశోకంతో బాధపడుతున్న ఈ అంబాలికను తీసికొని అరణ్యానికి వెళ్తున్నాను. నీకు శుభమగు గాక.' అంబిక అలాగే అని అంగీకరించింది. ఆపై సువ్రత అయిన సత్యవతి భీష్మునితో సంప్రదించి, తన కోడళ్ళనిద్దరినీ తీసికొని అరణ్యానికి వెళ్ళిపోయింది. భరతశ్రేష్ఠా! మహారాజా! ఆ రాణులు ఘోరతపస్సు చేసి, శరీరాలను విడిచి అభీష్టగతులను పొందారు.

---

* అతిక్రాంతసుఖాః కాలాః పర్యుపస్థితదారుణాః ।
శ్వః శ్వః పాపిష్ఠదివసాః వృథివీ గతయౌవనా ॥ 6

పాండవులు వేదోక్తమైన సంస్కారాలను పొందారు. తండ్రియింట వివిధభోగాలను అనుభవిస్తూ చక్కగా ఎదగసాగారు. ధార్తరాష్ట్రులతో సుఖంగా ఆడుకొంటూ ఆనందంగా ఉండేవారు. బాలక్రీడ లన్నింటిలో తమ తేజస్సువలన వారే గొప్పగా రాణించేవారు. పరుగెత్తటంలో, లక్ష్యాన్ని ముందుగా తీసికొని రావటంలో, తినటంలో, మట్టిని వెదజల్లే ఆటలో (ఉప్పన బట్టెలు మొ) భీమసేనుడే ధార్తరాష్ట్రులందరినీ ఓడించేవాడు. రాజా! ధార్తరాష్ట్రులు ఆనందంగా ఆడుకొంటుంటే వారిని పట్టుకొని ఎక్కడో దాగిఉండేవాడు. వారిని పట్టుకొని పాండవులతో పోరించేవాడు. మహాతేజస్సుగల నూటొక్కమంది ధార్తరాష్ట్రులనూ వృకోదరుడొక్కడే తేలికగా లొంగదీసికొనేవాడు. బలిష్ఠుడైన భీమసేనుడు ధార్తరాష్ట్రుల జుట్టుపట్టుకొని బలవంతంగా ఒకరితో ఒకరిని మోదించేవాడు. వారు ఆక్రోశిస్తున్నా లెక్కచేయకుండా నేలమీద పడవేసి, ఈడ్చేవాడు. అపుడు వారి మోకాళ్ళు, తలలూ, భుజాలు దోక్కొనిపోయేవి. జలక్రీడ లాడేటప్పుడు పదిమంది ధార్తరాష్ట్రులనూ తన భుజాలతో పట్టుకొని నీటిలో మునిగి ఉండేవాడు. వారిప్రాణాల మీదకు వచ్చినప్పుడే విడిచి పెట్టేవాడు. ధార్తరాష్ట్రులు చెట్టెక్కి పండ్లుకోసుకొంటున్న సమయంలో భీముడు కాలితో తన్ని ఆ చెట్లను కంపింపజేసేవాడు. భీముడు తీవ్రవేగంతో ఆ చెట్లను కొట్టడం వలన అవి నిలువెల్లా కంపించేవి. భయపడిన ఆ ధార్తరాష్ట్రులు పళ్ళతోపాటు చెట్టునుండి పడేవారు. కుస్తీ పట్టడంలోగానీ, పరుగెత్తటంలో గానీ, చదువులో గానీ ధార్తరాష్ట్రులు భీమసేనునితో పోటీపడేవారే కానీ ఎప్పుడూ సమానం కాలేకపోయేవారు. ఈ రీతిగా భీమసేనుడు ధార్తరాష్ట్రులతో పోటీపడి నెగ్గుతూ వారికి ఇష్టంలేని పనులెన్నో చేసేవాడు. అయితే అవి బాల్యచేష్టలే కానీ ద్రోహచింతనతో చేసినవి కావు.

అపుడు ప్రతాపవంతు డయిన దుర్యోధనుడు భీముసేమునిలోని బలవిశేషాన్ని గ్రహించి, అతని విషయంలో చెడుగా ప్రవర్తించేవాడు. దుర్యోధనుడు ధర్మానికి దూరమైన వాడూ, పాపదృష్టి గలవాడు కూడా. మోహంవలన ఐశ్వర్యలోభం వలనా అతనికి పాపబుద్ధి పుట్టింది. 'కుంతీకుమారుడూ, పాండవమధ్యముడూ అయిన భీమసేనుడు బలవంతులలో శ్రేష్ఠుడు. వాడిని మోసగించి బంధించాలి. వీడు బలవంతుడూ, పరాక్రమవంతుడూ, మహాశూరుడు కూడా. మనమంతా కలిసి ఉన్నా ఆ భీమసేనుడొక్కడే మనతో పోటీకి రాగల్గుతున్నాడు. ఆ భీమసేనుడు నగరోద్యానవనంలో నిదురించే సమయంలో పట్టుకొని గంగానదిలో పడవేద్దాం. ఆ తర్వాత అతని తమ్ముడు అర్జునుని, అన్న యుధిష్ఠిరునీ బలాత్కారంగా బంధించి ఈ భూమిని పరిపాలిస్తాను.' ఈవిధంగా పాపాత్ముడైన దుర్యోధనుడు నిశ్చయించుకొని, భీమసేనునకు కీడు చేయటానికి తగిన అవకాశం

కోసం అనుక్షణం ఎదురుచూడసాగాడు. తరువాత దుర్యోధనుడు జలవిహారం కోసం ఉన్ని, నూలు బట్టలతో విచిత్రమైన పెద్దపెద్ద గుడారాలు వేయించాడు. ఆ గుడారాలు అవసరమయిన సర్వసామగ్రితో నిండి ఉన్నాయి. ఎత్తైన పతాకలతో అలరారుతున్నాయి. వాటిలో వేరేవేరు గదులను ఎన్నింటినో ఏర్పాటు చేశారు. గంగా తీరంలోని ప్రమాణకోటి అనేపేరుగల తీర్థంలో ఒకానొక ప్రదేశంలో ఈ ఏర్పాట్లన్నీ చేయించి దానికి ఉదకక్రీడనమని పేరుపెట్టాడు. వంటపనిలో నేర్పుగల వంటలవారు అక్కడ భక్ష్య, భోజ్య, పేయ, చోష్య, లేహ్యరూపంలో సకలపదార్థాలను ఏర్పాటుచేశారు.

ఆ తరువాత అన్ని ఏర్పాట్లు పూర్తి అయినట్లు రాజపురుషులు దుర్యోధనునకు తెలియజేశారు. అప్పుడు దుర్మతి అయిన దుర్యోధనుడు పాండవులతో ఇలా అన్నాడు. 'సోదరుల మందరమూ కలిసి ఉద్యానవన శోభితమైన గంగాతీరానికి వెళ్దాం. అక్కడ మనమంతా జలక్రీడలాడుదాం.' యుధిష్ఠిరుడు అలాగే అని దుర్యోధనునితో అన్నాడు. శూరులయిన ఆ కౌరవులు పాండవులతో కలిసి నగరాకారంలో ఉన్న రథాలనూ, స్వదేశంలో పుట్టిన గొప్ప ఏనుగులనూ ఎక్కి బయలుదేరారు. ఉద్యానవనాన్ని సమీపించి తమను వెన్నంటి వచ్చిన మహాజనాన్ని వదిలిపెట్టి ఆ సోదరులందరూ కొండగుహలోనికి సింహం ప్రవేశించినట్లు ఉద్యానవనశోభను తిలకిస్తూ దానిలోనికి ప్రవేశించారు. ఆ ఉద్యానవనం శుభ్రమయిన కొలువుకూటాలతో, చంద్రశాలలతో, గవాక్షాలతో, చిన్నచిన్న గూళ్ళతో, యంత్రాలతో, జలయంత్రాలతో విరాజిల్లుతోంది. తాపీపనివారు ఆ ఉద్యానవనాన్ని శుభ్రం చేశారు. చిత్రకారులు చిత్రించారు. నిండుగా నీరున్న దిగుడు బావులతోనూ, కొలనులతోనూ ఆతోట ప్రకాశిస్తోంది. విరబూచిన తామరల మాటుగా ఉన్న ఆ నీరు ఎంతో అందగించింది. ఆ ఋతువులో పుష్పించే పూలు ఆ నేలనంతా కప్పివేశాయి. పాండవులూ, కౌరవులూ అందరూ అక్కడ కూర్చొని తమ చెంతకు చేరిన సకలభోగాలనూ అనుభవించసాగారు. ఆ శ్రేష్ఠోద్యానవనంలో ఆటలకై అరుదెంచిన ఆ కౌరవపాండవులు ఒకరినోటికొకరు భక్ష్యాలను అందించారు. అప్పుడు పాపి అయిన దుర్యోధనుడు భీమసేనుని చంపదలచి అతనికి అందిస్తున్న భక్ష్యంలో కాలకూటవిషాన్ని కలిపించాడు. ఆపై కత్తిలాంటి మనసు, అమృతం వంటి మాటలు గల ఆ పాపి దుర్యోధనుడు తానే లేచి స్వయంగా ఒక సోదరుని వలె, మిత్రునివలె భీమసేనునకు ఎక్కువ ఎక్కువగా ఆ భక్ష్యాన్ని అందించాడు. దానిలో విషమున్నదని తెలియని భీమసేనుడు దుర్యోధనుడు అందిస్తున్నవన్నీ తినసాగాడు. అప్పుడు పురుషాధము డయిన దుర్యోధనుడు లోలోన నవ్వుకొంటూ తనను తాను కృతార్థునిగా భావించాడు. ఆ తరువాత ప్రహృష్టమనస్కులైన ఆ పాండవులూ, ధార్తరాష్ట్రులూ అందరూ

కలిసి జలక్రీడ నారంభించారు. ఆటలు ముగిసిన తర్వాత సాయంకాలం అలసిపోయిన వీరులు కౌరవపాండవులు విహారాన్ని చాలించి, శుభ్రమయిన బట్టలు కట్టుకొని, చక్కగా అలంకరించుకొని, క్రీడాభవనాలలోనే ఆరాత్రి విశ్రమింపదలచారు. ఆసమయంలో బలిష్ఠుడైన భీమసేనుడు అధికవ్యాయామం చేత బాగా అలసిపోయాడు. అప్పుడు ఆ భీమసేనుడు జలక్రీడకోసం వచ్చిన కుమారులను వెంటబెట్టుకొని విశ్రాంతికై ప్రమాణకోటికి చేరి అక్కడ ఒక ప్రదేశంలో నిదురపోయాడు. భీమసేనుడు బాగా అలసిపోయాడు. విషమదంతో అచేతనుడయ్యాడు. విషం శరీరమంతా ప్రాకింది. చల్లగాలికి నిశ్చేష్టుడై పడుకొన్నాడు. ఆపై దుర్యోధనుడు స్వయంగా లతాపాశాలతో భీమసేనుని బంధించి మృతకల్పుడై ఉన్న ఆవీరుని ఎత్తైన తీరప్రదేశం నుండి నీటిలో పడవేశాడు. ఆ భీమసేనుడు నిశ్చేతనస్థితిలోనే నీటిలోపల మునిగిపోయి పాతాళలోకానికి చేరాడు. ఆ పడటంలో ఎందరో నాగకుమారులు ఆ శరీరం క్రింద నలిగిపోయారు. అప్పుడు భయంకరవిషంగల నాగులు అంతా ఒక్కటై విషం నిండిన తమకోరలతో భీముని కరిచారు. భీముడు ఆ రీతిగా కాటు తినగానే లోనున్న కాలకూట విషమంతా నశించిపోయింది. పాములద్వారా ఎక్కిన ఆ జంగమవిషం వలన స్థావరంగా ఉన్న కాలకూటవిషం నిస్సారమైంది. ఆ నాగుల కోరలు మర్మస్థానాలపై కూడా పడ్డాయి. అయినా కూడా విశాలవక్షఃస్థలం గల భీముని చర్మం లోహసమానమైనందువలన ఆ చర్మాన్ని కూడా ఆ కోరలు భేదించలేకపోయాయి. ఆ తరువాత మేల్కొన్న భీమసేనుడు బంధనాల నన్నింటినీ త్రెంపుకొని ఆ నాగుల నన్నింటినీ పట్టుకొని నేలకేసి కొట్టాడు. కొందరు నాగులు భయపడి పారిపోయారు. భీముడు చంపగా మిగిలిన నాగులు అందరూ వాసుకి దగ్గరకు పోయారు. సర్పరాజు, ఇంద్రసమానుడూ అయిన ఆ వాసుకితో ఇలా పలికారు. నాగరాజా! ఒకానొక నరుని ఎవరో బంధించి నీటిలో పడవేశారు. వీరా! అతడు విషం త్రాగిఉంటాడని మేమనుకొంటున్నాం. స్పృహలేని దశలో మనలోకానికి వచ్చాడు. మా కాటు తిని మేల్కొన్నాడు. స్పృహలోనికి వచ్చాడు. వెంటనే కట్లు త్రెంపుకొని ఆ మహాబాహువు మామీదకు వచ్చాడు. నీవే అతనిని గూర్చి తెలిసికోవాలి.' ఆపై నాగులు అనుసరిస్తూండగా వాసుకి అక్కడకు వెళ్ళాడు. భీమపరాక్రముడూ, మహాబాహువూ అయిన భీముని చూశాడు. ఆ సమయంలో ఆర్యకుడనే నాగరాజు కూడా భీముని చూచాడు. ఆ ఆర్యకుడు పృథతండ్రి అయిన శూరసేనునకు మాతామహుడు. ఆ ఆర్యకుడు తన దౌహిత్రదౌహిత్రు డయిన ఆ భీముని గట్టిగా కౌగిలించుకొన్నాడు. మహాయశస్వి అయిన వాసుకి భీముని చూచి ప్రసన్నుడై ఇలా అన్నాడు- 'అతనికి ఏ ప్రియాన్ని సమకూర్చగలం? ధనరాసులూ, రత్నరాసులూ, ధనమూ ఇవ్వండి.' వాసుకి

అలా అనగానే ఆర్యకుడు "నాగరాజా! మీరు ప్రసన్నులయితే ఈ బాలునకు ధనరాసులతో పనేమున్నది ? నీ విష్టపడితే వేయి ఏనుగులబలం నిక్షిప్తమై ఉన్న ఆ కుండలోని రసాన్ని మహాబలుడైన ఈకుమారునకు త్రాగటానికివ్వు. ఈ బాలుడెంత త్రాగగలడో అంత ఇవ్వవలసినది' అన్నాడు. 'అలాగే కానీ!' అని వాసుకి ఆర్యకునితో అన్నాడు. అప్పుడు నాగులు భీమునికై స్వస్తివాచకాలు పలికారు. భీముడు శుచియై, తూర్పు దిక్కువైపు ముఖముంచి కూర్చొని ఆ కుండలోని రసాన్ని త్రాగసాగాడు. ఆ భీముడు ఒక్కగ్రుక్కలోనే కుండెడు రసాన్ని త్రాగివేశాడు. ఆ విధంగా ఎనిమిది కుండలరసాన్ని ఆ పాండుకుమారుడు త్రాగాడు. ఆ తర్వాత మహాభుజుడూ, అరిందముడూ అయిన భీమసేనుడు నాగులు ఏర్పాటుచేసిన దివ్యశయ్యపై సుఖంగా నిదురించాడు.

128. నాగలోకమునుండి భీముడు మరలివచ్చుట.

తర్వాత భీముడు తప్ప మిగిలిన పాండవులూ, కౌరవులూ క్రీడావిహారాలను ముగించుకొని హస్తినాపురికి బయలుదేరారు. వారు రథాలు, ఏనుగులూ, గుఱ్ఱాలూ, తదితరమయిన అనేకవాహనాలలో బయలుదేరారు. భీముడు తమ కన్నాముందే వెళ్ళి ఉంటాడని చెప్పుకొంటూ పయనించారు. ఆ తర్వాత పాపాత్ముడైన దుర్యోధనుడు భీమసేనుడు కనిపించనందుకు ఆనందించి, తన సోదరులతో కూడి నగరానికి వచ్చాడు. యుధిష్ఠిరుడు ధర్మాత్ముడు. ఆయన మనస్సులో దుర్యోధనుని పాపబుద్ధి స్ఫురించలేదు. తనవలె అందరూ పొదుస్వభావులే అని భావించే వాడు. సోదరులపై వాత్సల్యం గల ఆ ధర్మరాజు కుంతిదగ్గరకు వెళ్ళి ఇలా అడిగాడు 'అమ్మా! భీమసేనుడు ఇటువచ్చాడా? అమ్మా! ఎక్కడకు వెళ్ళి ఉంటాడు? ఇక్కడ కూడా కనిపించటం లేదు. తోటలో, అరణ్యంలో అంతా భీమునికోసం వెదికాం. కాని కనిపించలేదు. దానితో మనకంటె ముందు వెళ్ళి ఉంటాడనుకొన్నాం. కలతపడిన మనస్సులతో తిరిగివచ్చాం. ఇక్కడకు వచ్చి ఎక్కడకైనా వెళ్ళాడా? నీవు ఎక్కడికయినా పంపించావా? యశస్వినీ! మహాబాహువయిన ఆ భీమసేను డెక్కడున్నాడో చెప్పు. భీముడి విషయంలో నామనస్సు ఏదో శంకిస్తోంది. 'భీముడు నిదురిస్తున్నాడని నేను అనుకొన్నాను? అక్కడే ఎవరైనా అతనిని చంపలేదు కదా!' ధీమంతుడగు ధర్మరాజు' ఆలా ఆడగగానే కలతపడ్డ కుంతి హాహాకారాలు చేసి యుధిష్ఠిరునితో ఇలా అన్నది- 'నాయనా! భీముడు నాకు కనిపించలేదు. నాదగ్గరకు రానేలేదు.

వెంటనే తమ్ముళ్ళతో కలిసి వెదికే ప్రయత్నం చేయండి.' దుఃఖిత హృదయంతో కుంతి పెద్దకొడుకుతో ఆలా పలికి వెంటనే విదురుని పిలిపించి ఇలా అన్నది - 'పూజనీయా!

భీమసేనుడు కనిపించటం లేదు. ఎక్కడకు వెళ్ళి ఉంటాడు? సోదరు లందరూ ఉద్యానవనం నుండి బయలుదేరి వచ్చేశారు. కానీ భీము డొక్కడే నాదగ్గరకు రాలేదు. భీముని చూస్తే దుర్యోధనుడికి కంటగింపుగానే ఉంటుంది. ఆ దుర్యోధనుడేమో క్రూరుడూ, దుర్మార్గుడూ, నీచుడూ, సిగ్గులేనివాడూ, రాజ్యలోభం గలవాడు. సుయోధనుడు కోపం వచ్చి భీమసేనుని చంపినా చంపవచ్చు. అందువలన నామనస్సు కలత పడుతోంది. దహించుకొని పోతోంది.' విదురుడిలా అన్నాడు. 'కళ్యాణీ! అలా అనవద్దు. మిగిలిన పిల్లలను చూడు. దుష్టుడైన ఆ దుర్యోధనుని మనం విచారిస్తే వాడు మిగిలిన నీ కుమారులను కూడా దెబ్బతీయవచ్చు. వ్యాసమహర్షి ముందే చెప్పినట్లు నీకుమారులంతా దీర్ఘాయుష్కులు. నీకొడుకు తప్పక వస్తాడు. నీకు ఆనందాన్ని కలిగిస్తాడు.' విద్వాంసుడైన విదురుడు ఈవిధంగా మాటాడి తన ఇంటికి వెళ్లిపోయాడు. కుంతి చింతాక్రాంతయై తన పిల్లలతోపాటు ఇంట్లోనే ఉంది. ఆ తర్వాత ఎనిమిదవనాడు (నాగలోకంలో) నిదురిస్తున్న భీమసేనుడు నిదురలేచాడు. స్వతహాగా బలవంతుడైన ఆ భీముడు ఆ రసం శరీరంలో జీర్ణం కాగానే లెక్కలేనంత బలాన్ని పొందాడు. మేల్కొంటున్న ఆ భీమసేనుని చూచి నాగులందరూ ప్రసన్నులై ఆయనను కుదుటపరచి ఇలా అన్నారు. 'మహాబాహూ! శక్తిసంపన్నమైన ఈరసాన్ని నీవు త్రాగావు. దీనితో నీకు పదివేల ఏనుగుల బలం సిద్ధిస్తుంది. యుద్ధంలో నిన్నెవ్వరూ గెలవలేరు. ఈరోజు నీవు ఈ దివ్యజలంతో స్నానం చేసి, ఇంటికి వెళ్ళు. కురుశ్రేష్ఠా! నీవు కనిపించనందువలన నీ సోదరులంతా బాధపడుతున్నారు.'

ఆ తరువాత మహాబాహువయిన భీమసేనుడు స్నానం చేశాడు. శుభ్రమయిన తెల్లని బట్టలను, తెల్లని పూలమాలలనూ ధరించాడు. నాగరాజు భవనంలో భీమునికై ఔత్సాహిక శుభకార్యాలను నిర్వర్తించారు. ఆపై విషాన్ని హరించగల ఓషధులతోనూ, పరిమళద్రవ్యాలతోనూ కూడిన పరమాన్నాన్ని నాగులు భీమున కిచ్చారు. దానిని భీముడు ఆరగించాడు. నాగులు భీముని అర్చించి ఆశీస్సులతో అభినందించారు. దివ్యాభరణాలు దాల్చి అరిందముడైన ఆ భీమసేనుడు నాగులను వీడ్కొని ప్రసన్నహృదయుడై లేచాడు. కురునందనా! పద్మనయనుడైన ఆ భీమసేనుని ఒకానొక పాము నీటినుండి పైకిలేపి, ఆ వనప్రాంతంలోనే దింపింది. భీముడు చూస్తుండగానే నాగులందరూ అంతర్ధాన మయ్యారు. ఆపై మహాబాహువూ, మహాబలుడూ అయిన భీముడు లేచి వెంటనే తల్లి దగ్గరకు వచ్చాడు. ఆపై భీమసేనుడు తల్లికీ, అన్నకూ నమస్కరించి తమ్ముళ్ళను మూర్కొన్నాడు. కుంతీ, సోదరులూ భీముని కౌగిలించు కొన్నారు. ఒకరిపై ఒకరికున్న సౌహార్దం కారణంగా భీమసేనుని రాకను తమ భాగధేయంగా చెప్పుకొన్నారు. మహాబలపరాక్రము డయిన

భీముడు తన సోదరులకు దుర్యోధనుని దుశ్చేష్టను సాంతంగా వివరించాడు. నాగలోకంలో జరిగిన మంచి చెడూ అంతా కొరవలేకుండా భీమసేనుడు వివరించాడు. అప్పుడు ధర్మరాజు "భీమా! మౌనంగా ఉండు. ఈ విషయాన్ని ఎవ్వరికీ, ఏవిధంగా కూడా చెప్పవద్దు" అని అర్ధవంతంగా సూచించాడు. ధర్మరాజు భీమునితో ఆ విధంగా పలికి సోదరులతో సహా అప్రమత్తుడయ్యాడు. ఆ భీమసేనుని ప్రియసారధిని కూడా దుర్యోధనుడు పెడచేతిదెబ్బతో చంపివేశాడు. ధర్మాత్ముడైన విదురుడు ఆ పాండవులకు స్థైర్యాన్ని అందజేశాడు(మౌనంగా అంతా సహించవలసినదిగా సూచించాడు). దుర్యోధనుడు మరలా భీమసేనుని భోజనపదార్థాలలో కాలకూటవిషాన్ని కలిపించాడు. అది క్రొత్తది, తీవ్రమయినదీ, సత్వరూపంగా పరిణమించి రోమాలు నిక్కబొడుచుకొనేటట్లు చేయగలది. వైశ్యాపుత్రుడైన యుయుత్సుడు పాండవుల మేలుకోరి ఆ విషయాన్ని వారికి తెలియజేశాడు. భీమసేనుడు దానిని కూడా తిని, ఏ వికారాన్నీ పొందకుడా జీర్ణంచేసికొనగలిగాడు. ఆ విషం ఎంత తీవ్రమైనదైనా భీమునిలో ఎటువంటి మార్పునూ తేలేకపోయింది. భీకరమైన శరీరంగల ఆ భీమునిలో అదికూడా జీర్ణమైపోయింది. ఈ విధంగా దుర్యోధనుడూ, కర్ణుడూ, సుబలపుత్రుడైన శకునీ వివిధోపాయాలతో పాండవులను చంపాలని కోరుకొనేవారు. పాండవులు కూడా ఇదంతా తెలిసినప్పటికీ, కోపం వచ్చినప్పటికీ విదురుడు చేసిన సూచనను పాటిస్తూ వారి కోపాన్ని వెడలగ్రక్కలేదు. ఈరీతిగా ఆటలపై ఆసక్తితో దుడుకుతనాన్ని పెంచుకొంటున్న కుమారులను చూచి, ధృతరాష్ట్రుడు వారికి శిక్షణ నిప్పించటానికి కృపాచార్యున కప్పగించాడు. ఆ కృపాచార్యుడు గౌతమగోత్రీయుడు. తెల్లుపాదలో పుట్టినవాడు, వేదశాస్త్రాలలో గొప్పవాడు, పండితుడూ. కౌరవ పాండవులు ఆకృపుని దగ్గర ధనుర్వేదాన్ని అభ్యసించసాగారు.

129. కృప-ద్రోణ -అశ్వత్థామల జననము - ద్రోణుడు పరశురాముని నుండి శస్త్రాస్త్రముల పొందుట.

జనమేజయుడిలా అన్నాడు. 'బ్రాహ్మణోత్తమా! కృపుడెలా జన్మించాడు? దానిని వివరించవలసినది. తెల్లుపాదలో ఎలా పుట్టాడు? శస్త్రాస్త్రవిద్యల నెలా అభ్యసించాడు?' వైశంపాయనుడిలా అన్నాడు. 'గౌతమమహర్షికి శరద్వద్ గౌతముడనే పేరుగల కుమారుడుండేవాడు. మహారాజా! ఆ కుమారుడు రెల్లుతో పాటు జన్మించాడు. ఆ శరద్వద్ గౌతమునకు ధనుర్వేదాధ్యయనంపై ఉన్న ఆసక్తి వేదాధ్యయనం పై లేదు. బ్రహ్మచారులు తపస్సు ద్వారా వేదజ్ఞానాన్ని పొందినట్లు ఆ శరద్వద్ గౌతముడు తపస్సు ద్వారా సర్వశాస్త్రాలనూ పొందగలిగాడు. తన ధనుర్విద్యాపారంగతత్వం చేతా, విస్తరమైన

తపస్సు చేతా ఆయన దేవేంద్రునకు ఎంతో ఖేదాన్ని కల్గించాడు. కౌరవా! ఆ తరువాత దేవేంద్రుడు జానపది అను పేరు గల ఒక దేవకన్యను ఆ శరద్వద్ గౌతముని తపస్సునకు విఘ్నం కలిగించమని పంపించాడు. ఆ జానపది అందమైన ఆ శరద్వద్ గౌతముని ఆశ్రమానికి పోయి ధనుర్బాణాలు ధరించి ఉన్న ఆ గౌతమునిలో లోభాన్ని రేకెత్తించింది. గౌతముడు ఆ వనంలో ఏకవస్త్రధారిణి అయిన ఆమెను చూచి, అసాధారణమైన ఆమె సౌందర్యానికి ఆశ్చర్యపోయాడు. ఆయన కన్నులు వికసించాయి. ఆయన చేతినుండి ధనుర్బాణాలు నేలపడిపోయాయి. ఆమెను చూచి ఆ గౌతముని శరీరం కూడా కంపించింది. ఆయన జ్ఞానం చేత గొప్పవాడు. తపశ్శక్తి గలవాడు. కాబట్టి ఆ మహాప్రాజ్ఞుడు అత్యంత ధైర్యంతోనే నిలువగలిగాడు. కానీ రాజా! ఆయన మనస్సులో వికారం కలిగిన వెంటనే వీర్యపతనం జరిగింది. అయితే ఆయన దానిని గమనించలేదు. ఆ ముని ధనుర్బాణాలను వీడి, కృష్ణాజినాన్ని త్యజించి ఆ ఆశ్రమాన్నీ, అప్సరసను వీడి అక్కడినుండి వెళ్ళిపోయాడు. రాజా! ఆయన వీర్యం తెల్లుపొదలో పడింది. శరస్తంబంలో పడిన ఆవీర్యం రెండు ముక్క లయింది.

ఆ రీతిగా ఆ శరద్వద్ గౌతమునకు ఇద్దరు పిల్లలు పుట్టారు. ఆ సమయంలో శంతనుమహారాజు యాదృచ్ఛికంగా అక్కడ వేటాడుతున్నాడు. ఆయన సేనలలో ఒకడు ఆ పిల్లలను చూచాడు. అక్కడ ధనుర్బాణాలనూ, కృష్ణాజినాన్నీ గమనించి ధనుర్వేద పారంగతుడైన ఏ మహర్షికో పుట్టిన పిల్లలని వారిని భావించి ఆ పిల్లలనూ, ధనుర్బాణాలనూ మహారాజునకు చూపించాడు. దయాళువయిన ఆ మహారాజు ఆ పిల్లలజంటను తీసికొని ఇంటికి వచ్చి వారు తన బిడ్డలే అని చెప్పసాగాడు. ఆపై ప్రతీపుని కుమారుడయిన ఆ శాంతనుమహారాజు గౌతముని ఆ బిడ్డలను పెంచుతూ, సమయోచిత సంస్కారాలను కూడా జరిపించసాగాడు. శరద్వద్ గౌతముడు ఆ ఆశ్రమం నుండి వెళ్లి మరొకచోట ధనుర్వేదాన్ని అభ్యసించసాగాడు. కృపతో తాను ఆపిల్లలను పెంచాడు కాబట్టి శంతనుమహారాజు కృపుడు, కృపి అని వారికి ఆ పేర్లనే పెట్టాడు. శరద్వద్ గౌతముడు తన తపశ్శక్తిచేత తన బిడ్డలను శాంతనుడు రక్షించినట్లు గ్రహించగలిగాడు, ఆ తరువాత రహస్యంగా వచ్చి తన కుమారునకు తన గోత్రంతో పాటు మొత్తం విషయాన్ని చెప్పాడు. నాల్గువిధాలయిన (ముక్తం, అముక్తం, ముక్తాముక్తం, మంత్రముక్తం) ధనుర్వేదాన్నీ వివిధశస్త్రాలనూ, వాటి నిగూఢ రహస్యాలను కూడా సంపూర్ణంగా తెలియజేశాడు. స్వల్పవ్యవధిలోనే ఆ కృపుడు ధనుర్వేదంలో గొప్ప ఆచార్యుడు కాగలిగాడు. ఆ కృపుని నుండియే మహారథులైన

ధార్తరాష్ట్రులూ, పాండవులూ, యాదవులూ అందరూ ధనుర్వేదాన్ని నేర్చుకొన్నారు. వృష్ణివంశస్థులు, వివిధదేశాలనుండీ వచ్చిన ఇతరరాజులు కూడా కృపుని దగ్గర ధనుర్విద్య నభ్యసించారు. కృపాచార్యుని దగ్గర కౌరవపాండవులు ధనుర్విద్య నభ్యసించిన తరువాత భీష్ముడు తన పౌత్రులను అధ్యాపనం ద్వారా విశేషజ్ఞులను చేయదలచి విలువిద్యలో మేటియై పరాక్రమ వంతుడయిన ఆచార్యుని కొరకు విచారణ ప్రారంభించాడు. బుద్ధిమంతుడూ, మహాభాగ్యశాలీ, నానాస్త్ర కోవిదుడూ, దేవతాశక్తిశాలి మాత్రమే తనవారిని అస్త్రవిద్యలో గొప్పవారిని చేయగలడని భావించి గాంగేయుడు భరద్వాజవంశస్థుడై వేదవేత్త అయిన ద్రోణునకు పాండవకౌరవులను శిష్యులను చేశాడు. మహాత్ముడైన భీష్మునిచే యథావిధిగా అర్చించబడి ధనుర్విద్యావేత్తలలో శ్రేష్ఠుడైన ఆ మహనీయుడు- ద్రోణుడు ఎంతో సంతోషించాడు. మహాయశస్వి అయిన ద్రోణుడు వారినందరినీ శిష్యులుగా స్వీకరించి ధనుర్వేదాన్ని సంపూర్ణంగా బోధించాడు. మహాతేజస్సుగల ఆ కౌరవపాండవులు అచిరకాలంలోనే సమస్త శస్త్రాలలో నేర్పుగడించారు.

జనమేజయుడిలా అడిగాడు. 'బ్రాహ్మణోత్తమా! ద్రోణుడు ఎలా జన్మించాడు? అస్త్రవిద్యనెలా నేర్చుకొన్నాడు? కౌరవదేశానికి ఎలా వెళ్ళాడు? అసలాయన ఎవరికొడుకు? విలుకాండ్రలో మేటి అయిన అశ్వత్థామ - ఆయన కొడుకు-ఎలా పుట్టాడు? ఇదంతా వినాలని ఉంది. విస్తరంగా చెప్పు.' వైశంపాయనుడిలా అన్నాడు. 'గంగాద్వారంలో పూజ్యుడయిన ఒక మహర్షి ఉండేవాడు. ఆయనపేరు భరద్వాజుడు. నిత్యమూ వ్రతదీక్షలో ఉండేవాడు. ఒకసారి ఒక విశేషయజ్ఞాన్ని ఆచరిస్తూ ఆ భరద్వాజుడు ఇతరమహర్షులను వెంటబెట్టుకొని స్నానానికై గంగానది దగ్గరకు వెళ్లాడు. అక్కడ అద్భుతరూపవతీ, యౌవనమదంతో గర్వించివదీ అయిన ఘృతాచి అనే అప్సరసను చూచాడు. ఆ నదీతీరంలో ఆమె స్నానాంతరం బట్టలను మార్చుకొంటోంది. ఆమె బట్ట తొలగిన సమయంలో ఆ ఋషి ఆమెను చూచి, కామించాడు. ఆమెపై మనస్సు తగుల్కొని ఆ ధీమంతుడైన భరద్వాజునకు వీర్యపతనమైనది. ఆ ముని దానిని యజ్ఞ కలశంలో ఉంచాడు. ఆ తరువాత ఆ మహాత్మునకు కలశం నుండి ద్రోణుడు జన్మించాడు. ఆ ద్రోణుడు వేదవేదాంగాలను పూర్తిగా అభ్యసించాడు. ప్రతాపవంతుడైన భరద్వాజమహర్షి అస్త్రవిద్యావంతులలో మేటి. ఆయన మహనీయుడైన అగ్నివేశునకు ఆగ్నేయాస్త్రాన్ని ఉపదేశించాడు. అగ్నివేశముని అగ్ని కుమారుడు. ఆ అగ్నివేశుడు తన గురుపుత్రుడైన ద్రోణునకు గొప్పదైన ఆ ఆగ్నేయాస్త్రాన్ని బోధించాడు. పృషతుడు అనేరాజు భరద్వాజునకు మిత్రుడు. ఆయనకు ఒక కొడుకు పుట్టాడు. వాడిపేరు ద్రుపదుడు.

క్షత్రియశ్రేష్ఠుడైన ఆ ద్రుపదుడు అనుదినమూ ఆశ్రమానికి వెళ్ళి ద్రోణునితో పాటు ఆడుకొనేవాడూ, అధ్యయనం చేసేవాడు. రాజా! ఆ పృషతుడు మరణించిన తరువాత ద్రుపదుడు ఉత్తరపాంచాల దేశానికి రాజు అయ్యాడు. కొంతకాలానికి భరద్వాజ మహర్షి కూడా మరణించాడు. ద్రోణుడు ఆ ఆశ్రమంలోనే ఉంటూ ఘోరతపస్సు చేశాడు.

వేదవేదాంగ పారంగతు డయిన ఆ ద్రోణుడు తన తపస్సుతో పాపాలనన్నింటినీ పోగొట్టుకొన్నాడు. కీర్తిమంతు డయ్యాడు. పితరుల ఆదేశంగా భావించి పుత్రులను కనాలన్న ఆశతో శరద్వద్ గౌతముని పుత్రిక అయిన కృపిని ద్రోణుడు పెండ్లాడాడు. ఆ కృపి సంతతమూ అగ్నిహోత్రంమీదనూ, ధర్మాచరణం మీదనూ, సంయమనం మీదనూ ఆసక్తి గలది. గౌతమి అయిన కృపి కొడుకును కన్నది. వాడే అశ్వత్థామ. వాడు పుట్టిన వెంటనే ఉచ్చైఃశ్రవం సకిలిస్తున్నట్లు అరిచాడు. ఆ సకిలింతను విని అదృశ్యంగా ఉన్న అశరీరవాణి ఇలా పలికింది- 'ఈబాలుడు శబ్దం చేస్తుంటే అది అన్ని దిక్కులా గుఱ్ఱపు సకిలింతలా వినిపిస్తోంది. కాబట్టి ఇతనికి అశ్వత్థామ అనియే పేరు.' ఆ కుమారుని చూచి ద్రోణుడు ఆనందించాడు. బుద్ధిమంతుడైన ద్రోణుడు ఆ ఆశ్రమంలోనే నివసిస్తూ ధనుర్వేదంలో నిష్ణాతుడయ్యాడు. రాజా! ఆ సమయంలోనే ద్రోణుడు పరశురాముని గూర్చి విన్నాడు. ఆ పరశురాముడు మహాత్ముడూ, పరంతపుడూ, సర్వమూ తెలిసినవాడూ, శస్త్రధారులలో శ్రేష్ఠుడూ, బ్రాహ్మణుడూను, తన సంపద నంతా అప్పుడు బ్రాహ్మణులకు ఇవ్వగోరుతున్నాడు. ఆ ద్రోణుడు పరశురాముని ధనుర్వేద దివ్యాస్త్రాలను గూర్చి విని వాటిపై మనసుపడ్డాడు. ఆయన దగ్గర నీతిశాస్త్రాన్ని నేర్చుకోవాలనికూడా ఉబలాటపడ్డాడు. తరువాత మహాబాహువూ, మహాతపస్వీ అయిన ఆ ద్రోణుడు తపస్సంపన్నులూ, బ్రహ్మచర్యవ్రత నిష్ఠులూ అయిన శిష్యులతో కలిసి మహేంద్ర పర్వతానికి వెళ్ళాడు. మహాతపస్వి అయిన ద్రోణుడు మహేంద్ర పర్వతాన్ని చేరి అక్కడ దమాది గుణాలకు ఆశ్రయుడూ, శత్రుసంహర్త అయిన పరశురాముని చూశాడు. ఆపై శిష్యులతో కలిసి ద్రోణుడు పరశురాముని సమీపించి తన పేరునూ, ఆంగీరసవంశంలో తనపుట్టుకనూ తెలియజేశాడు. నేలపై తలను వాల్చి, పాదాలకు నమస్కరించి, ఆ సమయంలోనే అన్నింటినీ పరిత్యజించి వనాలకు వెళ్లగోరుతున్న మహాత్ముడైన ఆ పరశురామునితో ద్రోణుడిలా అన్నాడు. 'బ్రాహ్మణశ్రేష్ఠా! నేను భరద్వాజునకు పుట్టిన కొడుకును. అయోనిజుడను. ధనాన్ని కోరి నీ దగ్గరకు వచ్చినవాడను, ద్రోణుడను.' అప్పుడు సర్వక్షత్రియులనూ మర్దించిన ఆ మహాత్ముడు-పరశురాముడు - ఇలా అన్నాడు. 'ద్విజోత్తమా! స్వాగతం.

నీకేమి కావలెనో చెప్పు.' పరశురాముడలా అడగగానే ద్రోణుడు మేటిశూరుడూ, సమస్తధనాన్నీ దానం చేయసంకల్పించిన వాడైన పరశురామునితో ఇలా అన్నాడు – 'విపులవ్రతా! నేను అనంతధనాన్ని కోరుతున్నాను.' రాముడిలా అన్నాడు– 'తపోధనా! నాదగ్గరున్న బంగారాన్నీ, ఇతరధనాన్నీ బ్రాహ్మణుల కిచ్చి వేశాను. అలాగే గ్రామనగరాలతో సముద్రపర్యంతమై ప్రకాశిస్తున్న నా ఈ భూమండలాన్నంతా కశ్యపునకు ఇచ్చాను. ఇప్పుడు నాశరీరమూ, అస్త్రాలు, వివిధశస్త్రాలు మాత్రం మిగిలి ఉన్నాయి. కాబట్టి నీవు అస్త్రపరిజ్ఞానాన్నో, నా శరీరాన్నో కోరుకో. ఈ రెండు ఇవ్వటానికి నేను సిద్ధంగా ఉన్నాను. ద్రోణా! త్వరగా చెప్పు. నేనేమిచ్చేది?' ద్రోణుడిలా అన్నాడు. భార్గవా! ప్రయోగరహస్యాలతో, ఉపసంహారవిశేషాలతో అస్త్రాల నన్నింటినీ నాకీయవలసినది. అలాగే అని పరశురాముడు ద్రోణునకు సమస్తాస్త్రాలను ఇచ్చి రహస్యాలతో, వ్రతపాలన నియమాలతో సహా ధనుర్వేదాన్ని సంపూర్ణంగా ఉపదేశించాడు. వాటిని గ్రహించి ద్విజశ్రేష్ఠుడైన ద్రోణుడు అస్త్రవిద్యలో నిష్ణాతు డయ్యాడు. పరమానందంతో తన ప్రియమిత్రుడైన ద్రుపదుని దగ్గరకు వెళ్ళాడు.

130. ద్రుపదుడు ద్రోణుని తిరస్కరించుట - ద్రోణుడు హస్తిన చేరుట.

ప్రతాపవంతుడైన ద్రోణుడు ద్రుపదుని దగ్గరకు పోయి "రాజా! నేను నీ మిత్రుడను. నిన్ను కలవాలని వచ్చాను" అన్నాడు. మిత్రుడైన ద్రోణుడు ప్రేమపూర్వకంగా అలా అన్న తరువాత పాంచాలరాజు అయిన ద్రుపదుడు ఆయన మాటలను సహించలేకపోయాడు. కోపంతో అసహనంతో బొమముడివేసి, కన్నెర్రజేసి ఐశ్వర్యమదంతో ద్రుపదరాజు ద్రోణునితో ఇలా అన్నాడు. 'బ్రాహ్మణా! నీ బుద్ధి అపరిపక్వం. ద్విజా! నీకు నేను మిత్రుడ నని ఇంతగట్టిగా నీవు మాటాడటం అసమంజసం. బుద్ధిహీనుడా! పెద్దపెద్ద రాజులకు సంపదలూ, డబ్బులేని నీవంటి నరులతో ఎక్కడా స్నేహం కుదరదు. కాలం గడచిపోతుంటే స్నేహాలు కూడా నశించిపోతుంటాయి. గతంలో మనమిద్దరమూ సమానులం కాబట్టి నాకు నీతో స్నేహ ముండేది. ఈలోకంలో ఎవ్వడికీ శాశ్వతమైన సఖ్యం మనస్సులో నిలువదు. కాలమే ఇద్దరినీ వేరుచేస్తుంది. లేదా క్రోధం స్నేహాన్ని హరిస్తుంది. ఈవిధంగా నశ్వరమయిన స్నేహంమీద నమ్మకం వద్దు. మనం మిత్రులమన్న భావాన్ని మనస్సులో నుండి తొలగించుకో. ద్విజోత్తమా! గతంలో మనం కలిసి ఆడుతూ, చదువుకొనే వారం కాబట్టి నీతో మైత్రి ఉండేది. **ధనవంతుడికి దరిద్రుడూ, పండితునకు పామరుడూ, పరాక్రమశాలికి పిరికివాడూ మిత్రులుగా ఉండగలరా?** గతంలోని మైత్రి గురించి ఇప్పుడెందుకు?

సమానధనంగలవారిలో ఒకరితో ఒకరికి, సమాన పాండిత్యం గల వారిలో ఒకరితో ఒకరికి వియ్యమైనా, స్నేహమైనా కుదురుతుంది. అంతేకానీ ధనికదరిద్రుల మధ్య మైత్రి కుదరదు.* శ్రోత్రియునికి అశ్రోత్రియుడు, రథికి రథంలేనివాడూ, రాజునకు రాజుకానివాడూ మిత్రులు కాలేరు. గతంలోని మైత్రిని గురించి ఇప్పు డెందుకు?'

ద్రుపదుడు ఇలా అనగానే ప్రతాపవంతుడైన ద్రోణుడు కోపంతో నిండి కొద్దిసేపు ఆలోచనలో పడ్డాడు. బుద్ధిమంతుడు కాబట్టి పాంచాలునిపై - ద్రుపదునిపై- ప్రతీకారం చేయటానికి మనస్సులో నిర్ణయించుకొని కౌరవరాజధాని అయిన హస్తినాపురికి బయలుదేరాడు. ద్విజసత్తముడైన ఆ ద్రోణుడు హస్తినాపురానికి వచ్చి కృపాచార్యుని ఇంటిలో అజ్ఞాతంగా నివసించసాగాడు. ఆ తరువాత అక్కడ అశ్వత్థామ కృపునితర్వాత తాను రాజకుమారులకు అస్త్రవిద్యను నేర్పసాగాడు. ప్రజలు అతనిని గుర్తించలేదు. ఈవిధంగా అక్కడ నిగూఢంగా కొంతకాలం గడిపాడు ద్రోణుడు. ఆ తరువాత ఒకసారి కౌరవ పాండవులు హస్తినాపురం నుండి దూరంగా వెళ్ళి, ఎంతో ఉత్సాహంగా (బంతి) ఆట ఆడుకొనసాగారు. వారు ఆట ఆడుకొనే సమయంలో ఆ బిళ్ళ నూతిలో పడిపోయింది. అప్పుడు వారందరూ దానిని పైకి తీయాలన్న తపనతో ఎంతో ప్రయత్నించారు. కానీ ఆ బిళ్ళను పైకి తెచ్చుకొనగల ఉపాయం వారికి తెలియలేదు. దానితో వారు ఒకరినొకరు చూచుకొంటూ సిగ్గుతో ముఖాలు దించుకొన్నారు. ఆ బిళ్ళను పొందే దారి తెలియక ఎంతో ఉత్కంఠకు గురి అయ్యారు. అప్పుడు వారు తమకు దగ్గరలోనున్న ఒక బ్రాహ్మణుని చూచారు. అతడు నల్లగా ఉన్నాడు. అతడు అగ్నిహోత్రాన్ని ముగించి అక్కడ నిలిచి ఉన్నాడు. తెల్లని వెంట్రుకలతో, కృశించిన శరీరంతో ఆపన్ననివలె కనిపిస్తున్నాడు. ఉత్సాహాన్ని కోల్పోయి ఏం చేయాలో తెలియని స్థితిలోనున్న ఆ కుమారులు మహాత్ముడైన ఆ బ్రాహ్మణుని చూచి, దగ్గరకు చేరి చుట్టుముట్టారు. ఆ తరువాత పరాక్రమవంతుడైన ఆ ద్రోణుడు వారిని చూసి వారికిష్టమయినదేదో జరగలేదనీ, ఆపని కోసమే తనదగ్గరకు వచ్చార, గ్రహించి చిరునవ్వు నవ్వి నేర్పుగా ఇలా అన్నారు.

'అరే! ఏమి మీబలం? ఏమి మీ క్షాత్రం? ఎందుకు మీవిద్యాభ్యాసం? భరతవంశంలో పుట్టారు. కానీ బావిలో పడిన బిళ్ళను తెచ్చుకోలేక పోతున్నారు? చూడండి. నేను మీ బిళ్ళనూ, ఈ నా ఉంగరాన్నీ రెండింటినీ బాణాలతో పైకి తీయగలను. నాకు ఉద్యోగ

---

* **యయోరేవ సమం విత్తం యయోరేవ సమం శ్రుతమ్ ।**
తయోర్వివాహ: సఖ్యం చ న తు పుష్టవిపుష్టయోః ॥ 10

మిప్పించగలరా?' ఆ విధంగా ఆ కుమారులతో పలికి అరిందముడైన ఆ ద్రోణుడు తన వ్రేలికున్న ఉంగరాన్ని నీరులేని ఆ బావిలో పడవేశాడు. అప్పుడు యుధిష్ఠిరుడు ద్రోణునితో ఇలా అన్నాడు? 'బ్రాహ్మణా! కృపుని అనుమతిని పొంది ఇక్కడ శాశ్వతమైన ఉద్యోగాన్ని పొందవచ్చు.' యుధిష్ఠిరుడు అలా అనగానే ద్రోణుడు నవ్వి ఆ కుమారులతో ఇలా అన్నాడు. 'ఇదిగో! ఇవి పిడికెడు బాణాలు. నేను అస్త్రమంత్రాలతో మంత్రించినవి. వీటి బలాన్ని చూడండి. మరెక్కడా ఇటువంటి బలముండదు. ఒక బాణంతో బిళ్ళను గ్రుచ్చుతాను. మరొక బాణంతో ఆ మొదటి బాణాన్ని గ్రుచ్చుతాను. ఆ బాణాన్ని మరొకబాణంతో గ్రుచ్చుతాను. ఈవరుసతో బిళ్ళను నేను అందుకొనగలను.' ఆపై ద్రోణుడు తాను చెప్పినదంతా తేలికగా పూర్తిచేశాడు. అది చూసి ఆ కుమారుల కళ్ళు ఆశ్చర్యంతో వికసించాయి ఇది మహాద్భుతమని భావించి కుమారులిలా అన్నారు. 'బ్రహ్మర్షీ! ఆ అంగుళీయకాన్ని కూడా త్వరగా పైకి తీయండి.' ఆపై మహాయశస్వి అయిన ద్రోణుడు ధనుర్బాణాలను తీసికొని ఆ అంగుళీయకాన్ని బాణంతో గ్రుచ్చి పైకి తీశాడు. బాణంతో పాటుగా ఆ ఉంగరాన్ని బావిలోనుండి పైకితీసి ఆశ్చర్యచకితులైన ఆ కుమారులకు అలవోకగా ఇచ్చాడు. ఉంగరాన్ని కూడా పైకి తీసిన తర్వాత ఆ కుమారులు ద్రోణునితో ఇలా అన్నారు.

'బ్రాహ్మణా! మీకు నమస్కరిస్తున్నాం. మరెవ్వరిలోనూ ఇంత నేర్పు ఉండదు. తమరెవరు? చెప్పండి. మేమేం చేయాలో ఆదేశించండి.' వైశంపాయనుడిలా అన్నాడు. కుమారకులు ఆ రీతిగా అడిగిన తర్వాత ద్రోణుడు వారితో ఇలా అన్నాడు. "నారూపాన్ని గురించి, గుణాలను గురించి భీష్మునకు వివరించండి. మహాతేజస్వి అయిన ఆయనే ఏం చేయాలో గ్రహించగలడు." అలాగేనని వెళ్లి కుమారులు భీష్మునితో ద్రోణుని సత్యవచనాలను అద్భుతమైన ఆ పనితనాన్ని గూర్చి చెప్పారు. కుమారులు చెప్పినది విని భీష్ముడు ఆయన ద్రోణాచార్యుడే అని గ్రహించాడు. కుమారులకు తగిన గురువు ద్రోణుడే అని ఆలోచించి శ్రేష్ముడయిన భీష్ముడు తానే స్వయంగా వచ్చి చాలా నేర్పుగా ద్రోణుని రాకకు కారణాన్ని అడిగాడు. ద్రోణుడు జరిగినదంతా చెప్పాడు. 'అచ్యుతా! ఒకప్పుడు నేను అస్త్రవిద్యనూ, ధనుర్వేదాన్నీ అభ్యసింపగోరి అగ్నివేశ మహర్షి దగ్గరకు వెళ్ళాను. బ్రహ్మచారినై, జటాధారినై, గురు శుశ్రూషా తత్పరుడనై అక్కడ చాలా సంవత్సరాలు గడిపాను. అదే సమయంలో మహాబలుడూ, పాంచాలరాజ కుమారుడూ అయిన యజ్ఞసేనుడు (ద్రుపదుడు) కూడా విలువిద్యకై ఆ గురువు దగ్గరే ఉండేవాడు. ఆ గురుకులంలో అతడు నాకు ఎంతో ఉపకారం చేసేవాడు, ప్రియమిత్రు డయ్యాడు. రాజా! వానితో

పాటు నేను అక్కడ చాలా కాలం గడిపాను. కురువంశశ్రేష్ఠా! చిన్నతనం నుండీ మేమిద్దరం సహాధ్యాయులం. అతడు అక్కడ నామిత్రుడు. నాతో ప్రియంగా మాటాడేవాడు. నాకిష్టమైన పనులు చేసేవాడు.

భీష్మా! ఒకసారి అతడు నాకు పరమానందాన్ని కల్గించే మాట ఒకటన్నాడు 'ద్రోణా! మహాత్ముడైన నా తండ్రికి నేను ప్రియతమకుమారుడను. నాతండ్రి నాకు రాజ్యాభిషేకం చేసిననాడు ఆరాజ్యం నీ అనుభవంలోనికి వస్తుంది. మిత్రమా! సత్యప్రమాణంగా చెప్తున్నాను. నాభోగాలు, నాధనం, నాసుఖాలూ అన్నీ నీకు లోబడినవే.' ఈవిధంగా పలికి ఆ ద్రుపదుడు ఆస్త్రవిద్యను ముగించుకొని, నా సత్కారాన్ని పొంది వెళ్ళిపోయాడు. ఆ మాటను నేను అనుదినమూ తలచుకొనేవాడిని. మాపితరుల ప్రేరణవలనా, పుత్రులు కావాలన్న కోరికవలనా నేను యశస్విని, హ్రస్వకేశి, మహాబుద్ధిమతి, వ్రతపాలన తత్పర అయిన కృపిని పెండ్లాడాను. ఆమె అగ్నిహోత్రమందు, యాగాలయందు, సంయమనమందూ నిత్యమూ ఆసక్తిగలది. ఆకృపి సూర్యునివంటి తేజస్సుతో భయంకరంగా పరాక్రమించగల కుమారుని కన్నది. వాడిపేరు అశ్వత్థామ. నాపుట్టుకతో మాతండ్రి భరద్వాజుడు ఆనందించినట్లు అశ్వత్థామపుట్టుకతో నేను సంతసించాను. ఒకసారి ధనవంతుల పిల్లలు ఆవుపాలను త్రాగుతుంటే చూచి అశ్వత్థామ ఆవుపాలకోసం ఏడవసాగాడు. నాకు దిక్కు తోచలేదు. స్వధర్మాన్ని నిర్వహిస్తున్న స్నాతకుడెవడూ (నేనభ్యర్థించిన కారణంగా ఉన్న ఆ కొంచెం పాలనో లేదా గోవునో నాకు ఇచ్చి) తన కర్మలకు విఘాతం కల్గించుకొనకూడదు' అని భావించి నేను గోసంపద బాగా కలవారికోసం, వారినుండి పవిత్రంగా, ధర్మబద్ధంగా గోదానాన్ని స్వీకరించాలని ఆ దేశంలో చాలాసార్లు తిరిగాను. గాంగేయా! ఆ చివరనుండీ ఈ చివరవరకూ తిరిగి కూడా నేను గోవును పొందలేకపోయాను. నేను తిరిగివచ్చి అశ్వత్థామను పిండినీళ్ళతో ఏడిపిస్తున్న బాలకులను చూశాను. వారు పిండినీటిని ఇచ్చి పాలు అని చెప్పి అశ్వత్థామను ఆడిస్తున్నారు. చిన్నతనం వలన అది తెలియని అశ్వత్థామ పిండినీళ్లనే త్రాగి "నేను కూడా పాలు త్రాగాను" అని మోహంతో, ఆనందంతో ఎగరసాగాడు. చుట్టుముట్టిన బాలకులమధ్య అలా ఎగురుతూ నవ్వుల పాలవుతున్న అశ్వత్థామను చూసి నామనస్సు కలత పడింది. డబ్బు సంపాదించని నా దరిద్రజీవితంపై రోత కలిగింది. 'ఈయన కొడుకే పాలకు ఆశపడి పిండినీళ్ళు త్రాగి నేను కూడా పాలుత్రాగానని ఆనందంతో గంతులువేసింది' అని లోకులనుకొనే మాటలు విని నా బుద్ధి చలించింది. నన్ను నేనే నిందించుకొని ఇలా ఆలోచించాను - గతంలోనే నేను దరిద్రుడ నని

బ్రాహ్మణులు నన్ను విడిచిపెట్టారు. నన్ను చిన్నచూపు చూస్తున్నారు. కానీ ధనప్రాప్తికై పాపిష్ఠమైన పరోపసేవను నేను అంగీకరించ లేకపోతున్నాను.

భీష్మా! ఆ విధంగా ఆలోచించి నేను నా భార్యనూ, కుమారునీ తీసికొని గతంలోని స్నేహానురాగాలను దృష్టిలోనుంచుకొని ద్రుపదుని దగ్గరకు వెళ్లాను. ద్రుపదునికి పట్టాభిషేకం జరిగిందని విని నేను నాపని నేరవేరుతుందని తలచి ఆనందంతో రాజసింహాసనంపై ఉన్న ప్రియమిత్రుని దగ్గరకు వెళ్ళాను. రాజా! ద్రుపదునితో ఉన్న స్నేహాన్నీ, నాడు తాను చెప్పిన మాటను మాటిమాటికీ తలచుకొంటూ ఒకనాటి మిత్రుడైన ద్రుపదుని దగ్గరకుపోయి "నరోత్తమా! నేను నీ మిత్రుడను. గుర్తున్నదా" అంటూ ఒక మిత్రుని సమీపించినట్లు నేను ద్రుపదుని దగ్గరకు వెళ్ళాను. ఆ ద్రుపదుడు నన్ను మనిషిగా కూడా లెక్క చేయకుండా పరిహసిస్తూ 'బ్రాహ్మణా! నీబుద్ధి చాలా అసంగతంగానూ, అసమంజసంగానూ కనిపిస్తోంది. బ్రాహ్మణా! మాటిమాటికీ నేను నీ మిత్రుడ నని నాతో అంటున్నావు. కాలం గడిచేకొలదీ స్నేహాలు కూడా నశించి పోతాయి. గతంలో మనం సమానస్థాయిలో ఉన్నాం కాబట్టి నేను నీతో స్నేహం చేశాను. కానీ శ్రోత్రియునకు అశ్రోత్రియుడూ, రథికునకు రథంలేనివాడూ మిత్రులు కాలేరు. సమానత్వంతో స్నేహమేర్పడుతుంది. అసమానతతో అది కుదరదు. లోకంలో ఎప్పుడూ ఎవరికీ శాశ్వతమైత్రి ఉండదు. కాలమైనా మిత్రులను విడదీస్తుంది. క్రోధమైనా మైత్రిని నశింపజేస్తుంది. ఈ విధంగా నశ్వరమైన స్నేహంమీద నమ్మకం వద్దు. ద్విజోత్తమా! గతంలో నీతో నాకున్న మైత్రి స్వప్రయోజనానికి సంబంధించినది. బలవంతుడికి బలహీనుడూ, పండితునకు పామరుడూ, శూరునకూ పిరికివాడూ మిత్రులు కాలేరు. ఎప్పటిదో మనస్నేహం! ఇప్పుడు అది నిరుపయోగం. నేను నారాజ్యవిషయంలో నీకేదో మాట ఇచ్చిన విషయం నాకసలు గుర్తు కూడా లేదు. బ్రాహ్మణా! నీకిష్టమయితే ఒకరాత్రిమాత్రం నీకు మంచిభోజనాన్ని అందించగలను' అతడామాట అనగానే నేను నా భార్యతో సహా బయలుదేరి వచ్చేశాను.

మరలివచ్చే సమయంలో నేను ఒక ప్రతిజ్ఞ చేశాను. దానిని త్వరలోనే నెరవేర్చుకొంటాను. ద్రుపదుడు ఆ విధంగా తిరస్కరించగానే నేను క్షోభించాను. భీష్మా! సద్గుణాలు గల శిష్యులద్వారా నా అభీష్టాన్ని నెరవేర్చుకోవా లనుకొంటున్నాను. అందువలన నీమనోరథాన్ని తీర్చాలని పాంచాలదేశం నుండి కురుదేశంలో రమణీయమైన ఈ హస్తినాపురికి వచ్చాను. మీకోసం నేనేమి చేయాలో చెప్పండి.' ద్రోణుడు అలా చెప్పగానే భీష్ముడు ఆయనతో ఈవిధంగా పలికాడు. 'తమధనుస్సు నుండి అల్లెత్రాటిని దించండి. కౌరవపాండవులకు

చక్కగా అస్త్రవిద్యను నేర్వండి. కౌరవుల ఆశ్రయంలో వారి సత్కారాలు పొందుతూ పరమానందంగా అభీష్టభోగాలను అనుభవించండి. కౌరవుల సంపదా, దేశమూ, ఈ రాజధానీ వీటికన్నింటికీ నీవే అధిపతివి. కౌరవులు అందరూ నీ అధీనంలోనివారే. బ్రహ్మర్షీ! మీరు కోరుకొన్నది ఏదయినా నెరవేరినట్లే భావించండి. మాభాగ్యం కొద్దీ మీరు దొరికారు. ఇక్కడకు వచ్చి మీరు మమ్ములను అనుగ్రహించారు.'

131. కౌరవపాండవుల విద్యాభ్యాసము - ఏకలవ్యుని గురుభక్తి.

తరువాత మనుజశ్రేష్ఠుడైన ఆ బ్రాహ్మణుడు భీష్మునిచే సత్కరింపబడ్డాడు. కౌరవుల ఆశ్రయంలో అర్చింపబడి ఆ మహాతేజస్వి విశ్రమించాడు. ద్రోణాచార్యుడు విశ్రమించిన తర్వాత భీష్ముడు కురువంశస్థు లయిన తన మనవళ్ళను శిష్యులుగా ద్రోణున కప్పగించాడు. వారితోపాటు వివిధ ధనరాసులను, చక్కని సామగ్రి కలిగి ధనధాన్యాలతో నిండిన మంచి ఇంటిని ఆనందంగా ద్రోణునకు అందించాడు. మేటి విలుకాడైన ద్రోణుడు ముదితహృదయుడై కురువంశస్థులైన పాండవధార్తరాష్ట్రులను శిష్యులుగా స్వీకరించాడు. వారినందరినీ శిష్యులనుగా స్వీకరించిన తరువాత ఒకనాడు ఏకాంతంగా నిండు మనస్సుతో తనదగ్గర కూర్చొని ఉన్న ఆ శిష్యులతో ఇలా అన్నాడు. 'అనఘులారా! నామనస్సులో ఒక కోరిక ఉన్నది. అది మీరు తీర్చవలసినది. అస్త్రవిద్య ముగిసిన పిమ్మట మీరు దానిని సాధించిపెట్టాలి. దాని విషయంలో మీ అభిప్రాయమేమిటి?' అన్నాడు. ఆ మాట విని కౌరవులంతా మిన్నకుండిపోయారు. అయితే అర్జునుడు గురుకార్యాన్ని నెరవేరుస్తానని ప్రతిజ్ఞ చేశాడు. అప్పుడు ద్రోణుడు పదే పదే అర్జునుని శిరస్సు మూర్కొని, ప్రీతిపూర్వకంగా కౌగిలించుకొని ఆనందంతో కన్నీరు విడిచాడు. ఆ తరువాత పరాక్రమశాలి అయిన ద్రోణుడు దివ్య, మానుషాలయిన అనేకాస్త్రాలను పాండవులకు నేర్పాడు. ఆ సమయంలో ఇతరరాజకుమారులు కూడా చాలామంది అస్త్రవిద్య నభ్యసించాలని ద్రోణుని సన్నిధికి వచ్చారు. అప్పుడు వృష్ణివంశజులు, అంధకవంశస్థులూ వివిధ దేశాల రాజులూ, సూతపుత్రుడైన రాధేయుడూ కూడా ద్రోణుని దగ్గరకు వచ్చారు. సూతపుత్రు డయిన కర్ణుడు అర్జునునితో ఎప్పుడూ ఘర్షణ పడుతూ, అసహనశీలుడై దుర్యోధనుని ప్రాపు పొంది పాండవులను అవమానించేవాడు. పాండుకుమారుడైన అర్జునుడు ధనుర్వేదాసక్తి, అధ్యయనం, బలం, ప్రయత్నశీలతల దృష్ట్యా శిష్య లందరిలో శ్రేష్ఠుడై ద్రోణాచార్యునికి సాటియై నిలిచాడు. అర్జునుడు తనకున్న అస్త్రవిద్యానురాగంవలన సమానంగా, అనాయాసంగా, నిక్కచ్చిగా అస్త్రాలను ప్రయోగించటంలో

సర్వశిష్యులలోను అగ్రగణ్యు డయ్యాడు. ఉపదేశసమయంలో అర్జునుడు సాటిలేనివాడని ద్రోణుడు భావించాడు. ఈవిధంగా కుమారు లందరికీ అస్త్రవిద్యను నేర్పాడు ద్రోణుడు. నీటిని తెచ్చేందుకు శిష్యులు అందరికీ ఆలస్యం కావాలన్న ఆలోచనతో కమండలాల నిచ్చేవాడు. తన కుమారుడు త్వరగా రావాలన్న భావనతో కుండ నిచ్చేవాడు. మిగిలిన వారు తిరిగి వచ్చేలోగా ద్రోణుడు తన కుమారునకు ధనుర్విద్యావిశేషమేదో ఒకటి బోధించేవాడు. అర్జునుడు ద్రోణుని చర్యను గమనించాడు. ఆ తరువాత అర్జునుడు వారుణాస్త్రంతో కమండలాన్ని నింపుకొని అశ్వత్థామతో పాటే ద్రోణుని దగ్గరకు వచ్చేవాడు. అందువలన మేటివిలుకాడైన అర్జునుడు విశేషవృద్ధిలో అశ్వత్థామతో సమానంగా ఉంటూ ఏమీ తీసిపోయేవాడు కాదు. అర్జునుడు గురువును సేవించటంలో కూడా పరిపూర్ణంగా ప్రయత్నం చేసేవాడు. అస్త్రవిద్యాభ్యాసంలో కూడా పూర్తిగా ఆసక్తిని చూపేవాడు. అందుకే ద్రోణునకు ప్రియశిష్యు డయ్యాడు.

ధనుర్బాణాభ్యాసంలో నిరంతరమూ ఆసక్తుడైన అర్జునుని గమనించి ద్రోణాచార్యుడు రహస్యంగా వంటవానిని పిలిపించి ఇలా ఆదేశించాడు- 'అర్జునుడికి ఎప్పుడూ చీకట్లో అన్నంపెట్టవద్దు. అంతేకాదు. ఈ నామాటను అర్జునున కెప్పుడూ చెప్పవద్దు.' ఆ తరువాత ఒకప్పుడు అర్జునుడు అన్నం తింటుంటే గాలి పెద్దగా వీచింది. దానితో అక్కడ వెలుగుతున్న దీపం ఆరిపోయింది. అర్జునుడు భోజనం చేస్తూనే ఉన్నాడు. అభ్యాసమున్నందు వలన తేజస్వి అయిన ఆ అర్జునుని చేయి చీకటిలో కూడా నోటిలోనికే వెళ్ళింది. అది అభ్యాసం వలన జరుగుతున్న పని అని గ్రహించి మహాబాహువైన అర్జునుడు రాత్రివేళ కూడా ధనుర్విద్యను అభ్యసించసాగాడు. జనమేజయా! ఆ అర్జునుని అల్లెత్రాటి ధ్వనిని నిదురిస్తున్న ద్రోణుడు విన్నాడు. లేచి అర్జునుని దగ్గరకు వచ్చి కౌగిలించు కొని ఇలా పలికాడు. 'విలువిద్యలో లోకంలో మరెవ్వరూ నీకు సమానులుగా కూడా నిలువలేనట్లు నిన్ను తీర్చటానికి ప్రయత్నిస్తాను. నేను నీకీ సత్యవచనాన్ని చెప్తున్నాను.' ద్రోణుడు అర్జునునకు ఏనుగులపై, గుఱ్ఱాలపై, రథాలపై, నేలపై నిలిచి యుద్ధం చేయటాన్ని నేర్పించాడు. ద్రోణుడు గదాయుద్ధంలో, ఖడ్గయుద్ధంలో తోమరాలనూ, ప్రాసాలనూ, శక్తులను ప్రయోగించటంలో, ఒక్కడే అనేకులతో యుద్ధం చేయటంలోనూ కౌరవులకు శిక్షణనిచ్చాడు. ద్రోణుని ఆచార్యత్వంలోని ఆ నేర్పును విని, ధనుర్వేదాన్ని అభ్యసించగోరిన రాజులు, రాజకుమారులు వేలకొలది ఆయన దగ్గరకు వచ్చారు.

ఆ తర్వాత నిషాదరాజైన హిరణ్యధన్వుని కొడుకు ఏకలవ్యుడు ద్రోణుని దగ్గరకు వచ్చాడు. ధర్మజ్ఞుడైన ద్రోణుడు బోయవాడన్న కారణంగా ఏకలవ్యుని శిష్యునిగా స్వీకరించలేదు.

ఆయన దృష్టి అంతా కౌరవులమీదనే ఉన్నది. అయితే పరంతపుడైన ఆ ఏకలవ్యుడు ద్రోణునకు శిరసా పాదాభివందనం చేసి, అరణ్యానికి మరలివచ్చి, మట్టితో ద్రోణుని ప్రతిమను చేసి, దానిపైనే పరమోన్నతంగా ఆచార్యభావాన్ని నిలుపుకొని తీవ్రమయిన నియమాలను పాటిస్తూ, ధనుర్విద్యను అభ్యసించ నారంభించాడు. అత్యంత శ్రద్ధతో తీవ్రమయిన అభ్యాసంతో ఆ ఏకలవ్యుడు బాణాలను విడవటంలోనూ, స్వీకరించటంలోనూ ఎంతో నైపుణ్యాన్ని సాధించాడు. తరువాత ఒకసారి ద్రోణుని అనుమతితో కౌరవపాండవు లందరూ రథాలపై వేటకు బయలుదేరారు. వేట కవసరమయిన సామగ్రిని తీసికొని ఒక వ్యక్తి కూడా తన ఇచ్ఛననుసరించి ఒక కుక్కను తీసికొని ఒంటరిగా పాండవుల ననుసరించి వెళ్ళాడు. వారంతా తమతమ పనులను చేయాలనుకొని అటు ఇటూ తిరగసాగారు. ఆసమయంలో ఆ కుక్క తిరుగుతూ తిరుగుతూ ఏకలవ్యుని దగ్గరకు వెళ్ళింది. ఆ ఏకలవ్యుడు నల్లనివాడు. శరీరమంతా మలినమై ఉన్నది. జటలు, జింకతోలు ధరించి ఉన్నాడు. అటువంటి ఏకలవ్యుని చూచి ఆ కుక్క మొరుగుతూ అక్కడే నిలిచిపోయింది. అప్పుడు తన అస్త్రలాఘవాన్ని ప్రదర్శిస్తూ ఏకలవ్యుడు మొరిగే ఆ కుక్క ముఖంమీద ఒకేసారి ఏడుబాణాలను ప్రయోగించాడు. ముఖం నిండా బాణాలతో ఆ కుక్క పాండవుల దగ్గరకు వచ్చింది. దానిని చూచి వీరులయిన ఆ పాండవులు ఎంతో ఆశ్చర్యపడ్డారు. ఆ హస్తలాఘవాన్నీ, శబ్దాన్ని అనుసరించి లక్ష్యాలను భేదించగల అపారనైపుణ్యాన్నీ చూచి వారంతా సిగ్గుపడ్డారు. ఆ విలుకాని బహువిధాలుగా ప్రశంసించారు. రాజా! ఆ తరువాత ఆ విలుకానికై వెదకుతూ పాండవులు అరణ్యంలో సదా బాణాలు వేస్తున్న ఆ ఆటవికుని చూశారు. అప్పుడు ఆ ఏకలవ్యునిలో మార్పు వచ్చి ఉన్నందువలన పాండవులు అతనిని గుర్తించలేకపోయారు. "నీవెవడవు? ఎవరి కొడుకువు?" అని ఏకలవ్యుని అడిగారు.

ఏకలవ్యుడిలా అన్నాడు. 'వీరులారా! నేను నిషాదరాజైన హిరణ్యధన్వుని కొడుకును. విలువిద్యలో పరిశ్రమ చేసినవాడను. ద్రోణశిష్యుడను.' ఆ పాండవులు ఆ ఏకలవ్యుని గురించి యథార్థాన్ని గ్రహించి తిరిగి వచ్చి అరణ్యంలో జరిగిన ఆ అద్భుత వృత్తాంతాన్ని యథాతథంగా ద్రోణునకు వివరించారు. అర్జునుడు ఏకలవ్యునే తలచుకొంటూ ఏకాంతంగా ద్రోణాచార్యుని దగ్గరకుపోయి చనువుతో ఇలా అన్నాడు. 'ఆనాడు నన్ను కౌగిలించుకొని ప్రేమపూర్వకంగా "నాశిష్యులలో నిన్ను మించిపోగల వాడెవ్వడూ ఉండడు" అని తమరు నాతో అన్నారు. కానీ తమశిష్యుడు నిషాదరాజకుమారుడు అయిన ఏకలవ్యుడు నన్నూ లోకాన్నీ మించిన వీరుడు ఎలా కాగలిగాడు?'

ద్రోణుడు ఏకలవ్యుని గురించి రెండు గడియలు ఆలోచించి, ఒక నిర్ణయానికి

వచ్చి, అర్జునుని వెంటబెట్టుకొని ఏకలవ్యుని దగ్గరకు వెళ్ళాడు. వెళ్ళి మలినశరీరుడై, జటిలుడై, నారబట్టలు కట్టుకొని, విల్లుచేత బట్టుకొని బాణాలను విసురుతున్న ఏకలవ్యుని చూశాడు. ఏకలవ్యుడు తనదగ్గరకు వస్తున్న ద్రోణాచార్యుని చూచి ఎదురేగి, పాదాలు అంటి నేలకు తల ఆనించి నమస్కరించాడు. ఆ తరువాత యథావిధిగా ఆ ద్రోణుని పూజించి ఏకలవ్యుడు తనను ద్రోణుని శిష్యునిగా తెలియజెప్పుకొని చేతులు జోడించి ఎదుట నిలిచాడు. రాజా! ఆ తర్వాత ద్రోణుడు ఏకలవ్యునితో "వీరుడా! నీవు నా శిష్యుడివే అయితే నాకు గురుదక్షిణ నిమ్ము" అని అడిగాడు. ఆమాట విని ఏకలవ్యుడు ఆనందంగా ఇలా అన్నాడు. 'స్వామీ! నేను మీకేమివ్వాలి? గురువుగా తమరు ఆదేశించండి. గురువున కీయరానిదంటూ నాకు ఏదీలేదు.' వైశంపాయను డిలా అన్నాడు. అప్పుడు ద్రోణుడు కుడిచేతి బొటనవ్రేలి నిమ్మని అడిగాడు. ద్రోణుని ఆ భయంకరవచనాన్ని విని, సంతతమూ సత్యవాక్పాలన చేసే ఏకలవ్యుడు తన ప్రతిజ్ఞను నిలుపుకొంటూ, దిగాలుపడకుండా ప్రసన్నముఖంతో ఏమాత్రమూ ఆలోచించకుండా తన బొటనవ్రేలిని ద్రోణున కిచ్చాడు. సత్యసంధుడైన ఏకలవ్యుని చూచి ఆనందించిన ద్రోణుడు ఈరీతిగా అభ్యసింపుమని ఏకలవ్యునకు ఒకమార్గాన్ని సూచించాడు. దానినిబట్టి ఏకలవ్యుడు మిగిలిన వ్రేళ్ళతో బాణాన్ని ఆకర్షించాడు. కానీ రాజా! అప్పుడు ఆ బాణం అంతకుముందులా వేగంగా వెళ్ళలేదు

దానితో అర్జునుడు దిగులువదలి సంతసించాడు. ద్రోణుడు సత్యవచనుడయ్యాడు. అర్జునుడు ఎదురులేని వాడయ్యాడు. అప్పుడు దుర్యోధనుడూ, భీముడూ గదాయుద్ధంలో ద్రోణునకు మంచి శిష్యులయ్యారు. కానీ ఎప్పుడూ ఒకరిపై ఒకరు క్రోధంతో ఉండేవారు. అశ్వత్థామ ధనుర్వేదంలోని మెలుకువల నెరుగుటలో అందరినీ మించిపోయాడు. నకులసహదేవులు కత్తిపట్టడంలో అందరినీ మించిపోయారు. యుధిష్ఠిరుడు రథంపై నిలిచి యుద్ధం చేయటంలో నేర్పు గడించాడు. కానీ ధనంజయుడు ఈవిద్యలన్నింటిలో సముద్రపర్యంతమున్న భూమండలంలో రథశ్రేష్ఠులందరిలో శ్రేష్ఠుడుగా ప్రసిద్ధికెక్కాడు. బుద్ధి, ఏకాగ్రత, బలం, ఉత్సాహం బాగా ఉన్నందువలన అర్జునుడు సర్వాస్త్రవిద్యలలో ఆరితేరాడు. అస్త్రాభ్యాసంలోనూ, గురువుపై ప్రేమను ప్రదర్శించటంలోనూ అర్జునుడు అందరినీ మించిపోయాడు. అస్త్రవిద్యోపదేశం అందరికీ సమానమే అయినా పరాక్రమవంతు డయిన అర్జునుడు తన ప్రతిభవలన కుమారులందరిలో తానొక్కడే అతిరథు డయ్యాడు. భీమసేనుడు బలంలో మిన్న. అర్జునుడు అస్త్రవిద్యలో మేటి. దురాత్ములైన ధార్తరాష్ట్రులు వారిని చూచి సహింపలేకపోయారు.

ధనుర్విద్యలోనూ, అస్త్రప్రయోగంలోను వారు సుశిక్షితులయిన తరువాత ద్రోణుడు వారందరినీ ఒక్కచోట చేర్చి, అస్త్రప్రయోగజ్ఞానాన్ని పరీక్షించా లనుకొన్నాడు. ఆ ద్రోణుడు శిల్పులచేత ఒక గ్రద్ద బొమ్మను చేయించి, దానిని కుమారులకు తెలియకుండా చెట్టుకొమ్మపై పెట్టించి, దానిని లక్ష్యంగా వారి కందరకూ చూపించాడు. ద్రోణుడిలా అన్నాడు. 'వెంటనే మీరందరూ ధనుస్సులను తీసికొని ఈ గ్రద్దకు గురిచూచి బాణాలను ఎక్కుపెట్టి నిలవండి. నేను చెప్పిన వెంటనే దాని తలను పడగొట్టాలి. ఒక్కొక్కరినే విడివిడిగా ఆదేశిస్తాను. కుమారులారా! ఆ విధంగా చెయ్యాలి.' ఆ తర్వాత ద్రోణుడు ముందుగా యుధిష్ఠిరునితో "దుర్ధర్షా! బాణాన్ని సంధించు. నేను చెప్పగానే వదులు" అన్నాడు. ఆపై యుధిష్ఠిరుడు గురువాక్యాన్ని అనుసరించి వింటిని తీసికొని గ్రద్దకు గురిపెట్టి నిలిచాడు. ఆ తరువాత యుధిష్ఠిరుడు ధనుస్సు నాకర్షించి నిలిచిన క్షణకాలం తర్వాత ద్రోణుడు అతనితో ఇలా అన్నాడు. 'రాజకుమారా! చెట్టుపైనున్న ఆ గ్రద్దను చూడు.' చూస్తున్నానని యుధిష్ఠిరుడు ద్రోణునితో అన్నాడు. క్షణకాలం తర్వాత ద్రోణుడు అతనితో మరలా ఇలా అన్నాడు. 'ఇప్పుడు ఈచెట్టునూ, నన్నూ, నీసోదరులనూ కూడా చూస్తున్నావా?' యుధిష్ఠిరుడు ఈ చెట్టునూ తమనూ, సోదరులనూ, గ్రద్దను కూడా చూస్తున్నానని పదేపదే పలికాడు. ఆ సమాధానాన్ని విని ద్రోణుడు చిరాకు పడుతూ, నిందిస్తూ "తప్పుకో, ఈ లక్ష్యాన్ని నీవు కొట్టలేవు" అని యుధిష్ఠిరునితో అన్నాడు. ఆ తర్వాత మహాయశస్వి అయిన ఆ ద్రోణుడు దుర్యోధనుడు మొదలుగా గల ధార్తరాష్ట్రులను కూడా వారి పరిస్థితిని తెలిసికొనగోరి అదేమాదిరిగా, క్రమంగా అడిగాడు. భీముడు మొదలుగా గల ఇతరశిష్యులను, విదేశీయు లయిన రాజులను కూడా అదేవిధంగా అడిగాడు. యుధిష్ఠిరునివలెనే అందరూ అంతా చూస్తున్నామని చెప్పారు. వారిని కూడా నిందించి ద్రోణుడు తప్పించాడు.

132. అర్జునుడు బ్రహ్మశిరోనామకాస్త్రమును పొందుట.

ఆ తరువాత ద్రోణుడు నవ్వుతూ అర్జునునితో ఇలా అన్నాడు- "ఇప్పుడు నీవు భేదించాలి. లక్ష్యానికి గురిపెట్టు. నేను చెప్పిన వెంటనే నీవు బాణాన్ని వదలాలి. నాయనా! ధనుస్సు నాకర్షించి క్షణకాలం నిలువు." ద్రోణుడిలా చెప్పగానే గురువాక్యప్రేరణతో అర్జునుడు ధనుస్సును గోలాకారంగా లాగి గ్రద్దకు గురిపెట్టి నిలిచాడు. క్షణకాలం తర్వాత ద్రోణుడు అంతకుముందు వలెనే 'ఆ గ్రద్దనూ, నన్నూ, చెట్టునూ కూడా చూస్తున్నావా' అని అడిగాడు. "గ్రద్దను మాత్రమే చూస్తున్నాను. చెట్టును, కానీ తమరిని కానీ చూడటం లేదు" అని అర్జునుడు ద్రోణునితో అన్నాడు. దానితో ద్రోణుని మనస్సు

ప్రసన్నమైనది. క్షణకాలం తర్వాత ఆ ద్రోణుడు పాండవులలో మహారథి అయిన అర్జునునితో మరలా ఇలా అన్నాడు. "గ్రద్దను చూస్తున్నట్లయితే దాని శరీరమెలా ఉన్నదో చెప్పు." ఆ మాటవిని అర్జునుడు 'తలను మాత్రమే చూస్తున్నాను. శరీరం కనిపించటం లేదు' అన్నాడు. అర్జునుడు అలా అనగానే ఆనందంతో ద్రోణునకు శరీరం పులకించింది. 'బాణాన్ని వదులు' అని అర్జునుని ఆదేశించాడు. ఆలోచించకుండా అర్జునుడు బాణం వదిలాడు. ఆ విధంగా అర్జునుడు వాడి అయిన బాణంతో చెట్టుపైనున్న పక్షితలను వేగంగా ఖండించి నేలగూల్చాడు. ఆ పని ముగియగానే అర్జునుని కౌగిలించుకొన్నాడు ద్రోణుడు. ద్రుపదుని అనుచరులతో సహా అర్జునుడు యుద్ధంలో ఓడించగలడని విశ్వసించాడు.

ఆ తర్వాత కొంతకాలానికి ద్రోణుడు శిష్యులతో కలిసి స్నానానికై గంగానదికి వెళ్ళాడు. ద్రోణుడు నీటిలో లోతుగా వెళ్ళిన తర్వాత నీటిలో తిరుగుతున్న ఒక బలిష్ఠమైన మొసలి కాలప్రభావంతో ద్రోణుని పిక్కను పట్టుకొన్నది. ఆ ద్రోణుడు స్వయంగా తనను తాను విడిపించుకొనగలిగి కూడా' మొసలిని చంపి, నన్ను విడిపించండి' అని త్వరపెడుతూ శిష్యులందరినీ ఆదేశించాడు. ఆ మాట ముగియకముందే అర్జునుడు అయిదు తిరుగులేని వాడిబాణాలతో నీటమునిగి ఉన్న ఆ మొసలిని కొట్టాడు. మిగిలిన శిష్యులంతా దిక్కుతోచక ఎక్కడి వారక్కడ నిలిచిపోయారు. అర్జునుడు సమయోచితంగా ప్రవర్తించటాన్ని చూసి ద్రోణుడు అర్జునుని సర్వోత్తమశిష్యునిగా భావించి ఆనందించాడు. ఆ మొసలి అర్జునుని బాణాల తాకిడికి ముక్కలు ముక్కలై ద్రోణుని పిక్కను వీడి మరణించింది. అప్పుడు ద్రోణుడు మహారథుడైన అర్జునునితో ఇలా అన్నాడు "బ్రహ్మశిరోనామకమైన ఈ అస్త్రాన్ని ప్రయోగోపసంహారాలతో పాటు నీకిస్తున్నాను. స్వీకరించు. ఇది విశిష్టమైనది. దీనిని ధారణచేయటం కూడా చాలా కష్టం. ఎట్టి పరిస్థితులలోనూ దీనిని మానవులపై ప్రయోగించరాదు. అల్పతేజస్కులమీద దీనిని ప్రయోగిస్తే ప్రపంచాన్నే దహించివేస్తుంది. నాయనా! లోకంలో ఇది అసాధారణమైన అస్త్రం. మనస్సునూ, ఇంద్రియాలనూ నిగ్రహించుకొని దీనిని ధారణచేయి. మరొక మాట విను. వీరుడా! యుద్ధంలో మానవుడు కాని, శత్రువు ఎవరైనా నిన్ను బాధించినప్పుడు వాడిని చంపటానికి నీవీ అస్త్రాన్ని ప్రయోగించాలి." అలాగే అని మాట ఇచ్చి అర్జునుడు కృతాంజలియై ఆ మేటిఅస్త్రాన్ని స్వీకరించాడు. మరలా ద్రోణుడు "లోకంలో నీసాటిరాగల విలుకాడు ఎవ్వడూ ఉండడు" అని అర్జునునితో పలికాడు.

133. రాజకుమారాస్త్ర విద్యా ప్రదర్శనము.

అస్త్రవిద్యాభ్యాసాన్ని ముగించిన పాండవులనూ, ధార్తరాష్ట్రులనూ చూసి కృపుడూ, సోమదత్తుడూ, బాహ్లీకుడూ, భీష్ముడూ, వ్యాసుడూ, విదురుడూ దగ్గరున్న సమయంలో ద్రోణుడు ధృతరాష్ట్రమహారాజుతో "రాజా! కురుసత్తమా! నీ కుమారుల అధ్యయనం పూర్తి అయినది. తమ అనుమతితో వారు తమ విద్యను ప్రదర్శిస్తారు." అన్నాడు. అప్పుడు ధృతరాష్ట్రమహారాజు పరమానందపడి ఇలా అన్నాడు. "భారద్వాజా! తమరెంతో ఘనకార్యం చేశారు. అస్త్ర విద్యాప్రదర్శనకై అనువైన సమయాన్నీ, అనువైన ప్రదేశాన్నీ, నిర్వహించవలసిన విధానాన్నీ, నిర్ణయించి నన్ను ఆదేశించండి. నేను ఆ విధంగా ఏర్పాటు చేయిస్తాను. నేను అంధుడనైనందున కలతపడుతున్నాను. కానీ అస్త్రవిద్యాప్రదర్శనకై ఒకరినొకరు మించిపోయే ప్రయత్నం చేసే నాకుమారులను చూడగల అదృష్టం గల ఇతరులకోసం ఆశపడుతున్నాను." ద్రోణునితో ఆవిధంగా పలికి ధృతరాష్ట్రుడు "ధర్మవత్సలా! విదురా! ద్రోణాచార్యులు చెప్పినట్లు చేయి. మనకు ఇంతకన్నా ప్రియమైనది మరొకటి లేదనుకొంటున్నాను." ఆ తరువాత రాజు దగ్గర సెలవు తీసికొని విదురుడు ద్రోణునితోపాటు బయటకు వచ్చాడు. మహాప్రాజ్ఞుడైన ద్రోణుడు రంగమంటపానికై స్థలాన్ని ఎంపికచేసి, కొలిపించాడు. సమతలమై పొదలులేక ఉత్తరదిక్కుపల్లంగా ఉన్న స్థలాన్ని నిర్ణయించి, మంచినక్షత్రంగల తిథిలో వాస్తుపూజ జరిపించాడు. వాగ్మి అయిన ద్రోణుడు వాస్తుపూజా కార్యక్రమాన్ని ముందే ఘోషింపజేసి వీరులను ఆహ్వానించాడు. తర్వాత ఆ మహారాజశిల్పులు రంగభూమిపై వాస్తుశాస్త్రానుసారం యథావిధిగా విశాలమైన ప్రేక్షాగృహాన్ని చక్కగా సమకూర్చారు. రాజూ, అంతఃపురకాంతలూ కూర్చొని చూడటానికి అన్నివిధాల అస్త్రశస్త్రాలతో కూడిన భవనాన్ని ఏర్పాటుచేశారు. జానపదులు తాము కూర్చొని తిలకించటానికి వీలుగా ఎత్తైన పెద్దపెద్ద మంచెలను ఏర్పాటు చేయించారు. విలువైన పల్లకీలను కూడా తయారు చేయించారు. ఆ తర్వాత నిర్ణయించినరోజు రాగానే ధృతరాష్ట్ర మహారాజు మంత్రులతోపాటు భీష్మని, ఆచార్యశ్రేష్ఠుడైన కృపుని, బాహ్లీకుని, సోమదత్తుని, భూరిశ్రవసుని, ఇతరకౌరవులనూ, మంత్రులనూ వెంటపెట్టుకొని నగరానికి వెలుపల ఉన్న ఆ ప్రేక్షాగృహానికి వచ్చాడు. ఆ ప్రేక్షాగృహం ముత్యాల జాలర్లతో, వైడూర్యమణులతో అలంకరింపబడి ఉన్నది. స్వర్ణమయమై దివ్యంగా శోభిస్తోంది. సౌభాగ్యవతి అయిన గాంధారి, కుంతి, అంతఃపురకాంతలందరూ ఆభరణాలు ధరించి, దాసీజనంతో కలిసి, ఆనందంగా దేవతాకాంతలు మేరు పర్వతంపై నిలిచినట్లు మంచెలపైకెక్కారు. కుమారుల అస్త్రవిద్యానైపుణ్యాన్ని చూడాలని బ్రాహ్మణ,

క్షత్రియులతో పాటు నాలుగువర్ణాలవారూ నగరం నుండి వేగంగా అక్కడకు వచ్చి చేరారు. క్షణకాలంలో అక్కడ పెద్ద జనసముదాయం గుమిగూడింది. మ్రోయింపబడిన వివిధవాద్యధ్వనుల వలనా, ప్రజల కుతూహలం వలనా ఆ జనసముదాయం ఘోషించే మహాసముద్రమే అయింది. అప్పుడు తెల్లని బట్టలు కట్టి, తెల్లని యజ్ఞోపవీతాన్ని ధరించి తెల్లనిపూలమాలలనూ, చందనాలనూ అలంకరించుకొని పుత్రునితో కూడా ద్రోణాచార్యుడు రంగస్థల మధ్యభాగంలోనికి వచ్చాడు. ఆయన తల,మీసాలు తెల్లబడి ఉన్నాయి. అగ్నితో కూడిన ఆదిత్యుడు నిర్మలగగనం మీదకు వచ్చినట్టు ఆ ద్రోణుడు కుమారునితో సహా రంగమధ్యానికి వచ్చాడు. బలవంతులలో శ్రేష్ఠుడైన ఆ ద్రోణుడు సకాలంలో దేవపూజ చేశాడు. బ్రాహ్మణులచే మంత్రపూర్వకంగా మంగళవిధి నిర్వర్తింపజేశాడు.

ధృతరాష్ట్రమహారాజు సువర్ణమణి పుష్పాలనూ, వివిధవస్త్రాలనూ దక్షిణగా ద్రోణకృపుల కిచ్చాడు. సుఖప్రాప్తికోసం పుణ్యాహవాచనమూ, దానహోమాది పుణ్యకర్మలూ ముగిసిన తరువాత వివిధశస్త్రాస్త్రసామగ్రిని తీసికొని చాలామంది రంగస్థలం ప్రవేశించారు. ఆ తరువాత భరతశ్రేష్ఠ లయిన ఆ వీరులంతా వ్రేళ్ళతొడుగులను ధరించి, నడుం బిగించి, అమ్ములపొదులను ధరించి, ధనుస్సులు చేతబట్టి, పెద్దపెద్ద రథాలనెక్కి రంగస్థలంపైకి వచ్చారు.

(యుధిష్ఠిరుడు మొదలయిన ఆ నరశ్రేష్ఠులు పెద్దవారి వరుసలో వచ్చి రంగమధ్యంలో ఉన్న ద్రోణునకు నమస్కరించి యథావిధిగా ద్రోణాచార్యునీ, కృపాచార్యునీ అర్చించారు. వారిచ్చిన దీవెనలతో కుమారులంతా సంతుష్ట మనస్కులైనారు. ఆ తరువాత బలిపుష్పాలతో అలంకరింపబడి ఉన్న శస్త్రాలకు నమస్కరించి, రక్తచందనంతో కూడిన పూలతో మరలా స్వయంగా అర్చించారు కౌరవులు. వారంతా ఎఱ్ఱచందనాన్ని పూసికొని, ఎఱ్ఱని పూలమాలలను ధరించి, ఎఱ్ఱని పతాకలను రథాలపై నిలుపుకొని ఉన్నారు. వారి కన్నులకొనలు ఎఱ్ఱబడి ఉన్నాయి. ఆ తరువాత మేలిమిబంగారునగలు ధరించి ఉన్న పరంతపు లయిన ఆ కురుకుమారులు ద్రోణుని అనుమతితో ముందుగా తమ ధనుర్బాణాలను చేతబట్టి, అల్లెత్రాటిని బిగించి, ఉన్న బాణాలను ఎక్కుపెట్టి టంకారంతోనూ, చప్పట్లతోనూ, సమస్తభూతాలనూ అర్చించారు.)

ఆపై ఆ కుమారులంతా ఆశ్చర్యకరంగా అస్త్రవిద్యను ప్రదర్శించారు. కొందరు మనుష్యులు బాణాలు మీదపడతాయన్న భయంతో తలలు వంచారు. మిగిలినవారు పరమాశ్చర్యంతో ఏమాత్రం భయపడకుండా అదంతా చూశారు. వారు గుఱ్ఱాలపై స్వారీచేస్తూ తమతమ నామధేయాలతో ప్రకాశిస్తున్న వివిధ బాణాలను చాలా నేర్పుగా వదలుతూ, వేగంగా లక్ష్యాలను బ్రద్దలుకొట్టసాగారు. ధనుర్బాణాలు ధరించిన ఆ రాజకుమారుల సముదాయాన్ని గంధర్వనగరంగా భావించి చూస్తూ, ఆ ప్రేక్షకులంతా ఆశ్చర్యచకితులయ్యారు.

జనమేజయా! వందలు, వేల కొలదిగ గుంపులు గుంపులుగా కూడి ఉన్న కొందరు మనుష్యులు ఆశ్చర్యంతో కన్నులు వికసింపజేసి చూస్తూ, హఠాత్తుగా 'భళీభళీ' అని అరవసాగారు. ఆ కుమారసముదాయం అస్త్రవిద్యాప్రదర్శనను ముగించి రథాలను వివిధమార్గాలలో నడిపించే విన్యాసాలను చూపారు. ఆపై ఏనుగులనెక్కి, గుఱ్ఱాలనెక్కి యుద్ధం చేయటాన్నీ, కుస్తీ పట్టటంలోని నేర్పును కూడా ప్రదర్శించారు. ఆ తరువాత కత్తిడాలూ ధరించి ఒకరిపై ఒకరు దాడిచేస్తూ కత్తి త్రిప్పటంలోని శాస్త్రీయమార్గాలను ప్రదర్శించారు. ఈవిధంగా రథాలు, ఏనుగులు, గుఱ్ఱాలు ఎక్కి, పాదచారులైకూడా ప్రదర్శనలిచ్చారు. అక్కడున్న ప్రేక్షకులు కత్తిడాలూ పట్టడంలో అందరి ప్రయోగాలనూ; వాటిలోని లాఘవాన్నీ, సౌష్ఠవాన్నీ, కళను, స్థిరత్వాన్ని, గట్టిపట్టును కూడా గమనించారు. ఆ తరువాత నిరంతరమూ ఒకరినొకరు గెలవాలన్న కోరికగల దుర్యోధన, భీమసేనులు గదలు చేతబట్టి రంగభూమిపైకి వచ్చారు. అప్పుడు వారు ఒక్కొక్క శిఖరంగల రెండు పర్వతాలవలె కనిపించారు. ఆ మహాబాహు లిద్దరూ నడుం బిగించి, పౌరుషాన్ని ప్రదర్శించటానికి సన్నద్ధులై గర్జిస్తూ, ఆడయేనుగుకోసం పోరాడబోతున్న రెండు మదపుటేనుగులవలె కన్పించారు. ఆ మహాబలు లిద్దరూ తమ గదలను ప్రదక్షిణంగానూ, అప్రదక్షిణంగానూ మండలాకారంలో త్రిప్పుతూ రెండు మదపుటేనుగులవలె రంగమండపంపై తిరుగసాగారు. విదురుడు ధృతరాష్ట్రునకూ, కుంతి గాంధారికీ ఆ కుమారుల చేష్టలన్నింటినీ నివేదించసాగారు.

134. భీమసేన-దుర్యోధన-అర్జునులు అస్త్రవిద్యను ప్రదర్శించుట.

కురురాజు సుయోధనుడూ, బలవంతులలో శ్రేష్ఠుడైన భీమసేనుడూ రంగంలోనికి దిగి, గదలతో పోరాడుతున్నప్పుడు ప్రేక్షకులంతా ఆ ఇద్దరిపై పక్షపాతంతో కూడిన స్నేహంవలన రెండుగా చీలిపోయారు. "ఆహా! వీరా" అని సుయోధనునీ, "ఓహో!భీమా" అని భీమసేనుని అభినందిస్తున్న ప్రేక్షకుల విస్తృతనినాదాలు వెంటవెంటనే చెలరేగసాగాయి. కలతపడిన కడలిలా కనిపిస్తున్న రంగమంటపాన్ని గమనించి, బుద్ధిమంతుడైన ద్రోణాచార్యుడు తన ప్రియపుత్రుడైన అశ్వత్థామతో ఇలా అన్నాడు. "ఈ ఇద్దరూ మహాపరాక్రమశాలులూ, యుద్ధవిద్యలో నిష్ణాతులు. వారినిక ఆపు. ఆ భీమదుర్యోధనుల కారణంగా రంగస్థలమంతా కోపోద్రిక్తం కాకూడదు."

(అశ్వత్థామ వేగంగాలేచి భీమదుర్యోధనులను వారిస్తూ "భీమా! ఇది గుర్వాజ్ఞ. సుయోధనా! ఇదిగురువు ఆదేశం. ఇక యుద్ధం చాలు. మీరిద్దరూ యోగ్యులే. ఒకరిపై ఒకరు త్వరపడవలదు. పరాక్రమణం కూడా వద్దు" అని పలికి)

ప్రళయకాలమారుతంచేత కలతపెట్టబడిన మహాసముద్రాల వలె గదలనెత్తి ఉన్న ఆ దుర్యోధనభీమసేనులను వారించాడు. ఆ తరువాత ద్రోణుడు రంగంలోనికి ప్రవేశించి, మేఘాడంబరంలాగా కోలాహలం కల్గిస్తున్న వాద్యఘోషలను ఆపి, ఇలా అన్నాడు. "నాకు నాకుమారునికన్నా ఇష్టమైన వాడూ సర్వశస్త్రనిపుణుడూ, సాక్షాత్ నారాయణసమానుడూ అయిన ఇంద్రకుమారుడు ఈ అర్జునుడు. ఇతని నైపుణ్యాన్ని గమనించండి." ఆ తరువాత ద్రోణాచార్యుని మాటమేరకు అర్జునునకు స్వస్తివచనాలు పలికారు. అప్పుడు యువకుడైన అర్జునుడు ఉడుముచర్మంతో చేసిన వ్రేలితొడుగులను ధరించి, అమ్ములపొదినిండా బాణాలు నింపుకొని, వింటిని చేతబట్టి, బంగారు కవచాన్ని ధరించి, రంగస్థలంపై కనిపించాడు. అప్పుడు అర్జునుడు సూర్యునితో, ఇంద్రధనుస్సుతో, మెరుపుతో, సంధ్యతో కూడిన మేఘంవలె కనిపించాడు. అప్పుడు రంగస్థలమంతా ఉప్పొంగిపోయింది. అన్ని వైపులనుండీ శంఖధ్వనులూ, వివిధవాద్యధ్వనులూ వినిపించసాగాయి. 'ఇతడే శ్రీమంతుడైన కుంతికొడుకు. ఇతడే పాండవులలో నడిమివాడు. ఇతడు దేవేంద్రుని కొడుకు. ఇతడే కురువంశరక్షకుడు. ధనుర్విద్యావేత్తలలో ఇతడే మేటి. ధార్మికులలోనూ శీలవంతులలోనూ శ్రేష్ఠ డితడే. ఇతడే శీలజ్ఞాననిధి" అంటూ ప్రేక్షకులు అంటుంటే ఆ కోలాహంలో కూడా ఆ మాటలు వినిన కుంతికి రొమ్ము స్రవించింది. కళ్ళనీళ్ళు వచ్చాయి. ఈరెండింటితో గుండె తడిసిపోయింది. ఆ రణగుణధ్వని ధృతరాష్ట్రుని చెవిని కూడా పడింది. దానితో ఆనందించిన ధృతరాష్ట్రనరశ్రేష్ఠుడు విదురునితో ఇలా అన్నాడు. "విదురా! కలతపడిన సముద్రంలాగా ఈ పెద్దకోలాహల మేమిటి? గగనతలాన్ని చీల్చివేస్తున్నట్లు హఠాత్తుగా రంగస్థలం నుండి పైకెగసింది." విదురుడిలా అన్నాడు. "మహారాజా! అదిగో! పాండుకుమారుడైన అర్జునుడు కవచాన్ని ధరించి, రంగస్థలంపైకి వచ్చాడు. దానితో ఈ కోలాహలం." ధృతరాష్ట్రుడిలా అన్నాడు. "మహామతీ! కుంతి అనే అరణినుండి పుట్టిన పాండవులనే మూడుఅగ్నులతో ధన్యుడ నయ్యాను. వారిచే అనుగ్రహింపబడి సురక్షితుడనై ఉన్నాను. "

ఆ విధంగా ఆనందకోలాహలంలో నిలిచిన ఆ రంగస్థలి ఎట్టకేలకు ప్రశాంతం అయింది. అర్జునుడు ద్రోణాచార్యునకు తన అస్త్రలాఘవాన్ని ప్రదర్శించాడు. ఆగ్నేయాస్త్రంతో నిప్పునూ, వారుణాస్త్రంతో నీటినీ, వాయవ్యాస్త్రంతో గాలినీ, పర్జన్యాస్త్రంతో మేఘాలనూ సృష్టించాడు. భౌమాస్త్రంతో నేలనూ, పార్వతాస్త్రంతో పర్వతాలనూ సృజించాడు. అంతర్ధానాస్త్రంతో తనంత తాను అదృశ్యమయ్యాడు. ఒక్కక్షణం పొడవుగా కనిపించి మరుక్షణంలో పొట్టిగా కనిపిస్తున్నాడు. రథం నొగలిపై క్షణకాలం కనిపించి, మరుక్షణంలో రథమధ్యంలో కనిపిస్తున్నాడు. వెంటనే క్షణంలో నేలపైకి దిగుతున్నాడు. ఆచార్యద్రోణునకు

ప్రియశిష్యుడైన అర్జునుడు పరిపూర్ణమైన లాఘవంతో సుకుమార, సూక్ష్మ, గురు (పెద్దవి) లక్ష్యాలను వివిధబాణాలతో భేదించాడు. రంగమండపంలో లోహనిర్మితమైన పందిని ఉంచారు. అది తిరుగుతోంది. తిరుగుతున్న దానిముఖంపై అర్జునుడు ఒక్కమారే విడివిడిగా ఉన్న అయిదుబాణాలను ప్రయోగించాడు. అవి అయిదు అయినా ఒక్కటే అనిపించాయి. రంగమండపంలో ఒకవైపు ఎద్దుకొమ్మును త్రాటితో కట్టారు. అది కదులుతోంది. ఆ కొమ్మురంధ్రంలో అర్జునుడు ఇరువదియొక్క బాణాలను నాటేటట్లు విసిరాడు. అనఘా! ఈ విధంగా గొప్ప ప్రదర్శన నిచ్చాడు అర్జునుడు. కత్తి, విల్లు, గద-మొదలయిన వాటితో కూడా శస్త్రకుశలు డైన అర్జునుడు అనేకవ్యూహాలను ప్రదర్శించాడు. ఆ తరువాత అర్జునుని అస్త్రవిద్యాప్రదర్శనం సమాప్తం కాగా మనుష్యుల కోలాహలమూ, వాద్యధ్వనీ మందగిస్తోంది. అపుడు ద్వారదేశం నుండి మాహాత్మ్యాన్నీ, బలాన్నీ సూచిస్తూ వెలువడి జబ్బచరిచిన చప్పుడు వినిపించింది. ఆ ధ్వని వజ్రాలను పొడిచేస్తున్న శబ్దంవలె ఉన్నది. ఆ చప్పుడు విని ప్రజలిలా భావించారు 'పర్వతాలు బ్రద్దలవుతున్నాయా? భూమి చీలిపోతోందా? జలధారలతో నిండిన మేఘాల గర్జనలు ఆకాశాన్ని నింపివేస్తున్నాయా?' క్షణకాలం రంగస్థలమంతా పైవిధంగా భావించింది. వెంటనే ప్రేక్షకులంతా ద్వారంవైపు దృష్టి సారించారు. కౌంతేయులయిన అయిదుగురు సోదరులు చుట్టూ నిలువగా అయిదుతారల సమూహమైన హస్తానక్షత్రంతో కూడికొనిన చంద్రునిలె ప్రకాశించాడు ద్రోణుడు. దుర్యోధనుడు కూడా లేచి నిలబడ్డాడు. దుర్యోధనుని నూర్గురు సోదరులూ అశ్వత్థామతో కలిసి సుయోధనుని చుట్టూ నిలిచారు. చేత ఆయుధాలు ధరించి, తన చుట్టూ సోదరులు నిలువగా, గద చేతబట్టి నిలిచిన దుర్యోధనుడు గతంలో దానవసంహారంలో దేవగణాలు పరివేష్టించిన దేవేంద్రునివలె ప్రకాశించాడు.

135. కర్ణప్రవేశము - రాజ్యాభిషేకము.

ఆశ్చర్యంతో వికసించిన కన్నులతో ద్వారపాలకులు అవకాశమిచ్చిన తరువాత శత్రుపురవిజేత అయిన కర్ణుడు విశాలమైన ఆ రంగస్థలంమీదకు వచ్చాడు. ఆ కర్ణుడు శరీరంతో పాటే పుట్టిన కవచాన్ని ధరించి ఉన్నాడు. చెవులకున్న కుండలాలు ముఖాన్ని వికసింపజేస్తున్నాయి. చేత ధనుస్సును పట్టి, నడుముకు కత్తిని కట్టుకొని వస్తున్న ఆ కర్ణుడు కదిలివస్తున్న కొండలా కనిపించాడు. ఆ కర్ణుని కుంతి కన్యావస్థయందే గర్భాన ధరించింది. విశాలమయిన కీర్తి, పెద్దకన్నులూ కలవా డతడు. కర్ణుడు వాడి కిరణాలు గల సూర్యుని అంశగా (ద్వారా) జన్మించాడు. అతడు సింహం, ఎద్దు, ఏనుగుల వలె

బలవీర్యపరాక్రమాలు కలవాడు. దీప్తిలో సూర్యునితోనూ, కాంతిలో చంద్రునితోనూ, తేజస్సులో అగ్నితోనూ సమానమైన వాడు. పొడగరి అయిన ఆ కర్ణుడు బంగారు తాటిచెట్టువలె కనిపిస్తున్నాడు. యువకు డైన అతని శరీరనిర్మాణం సింహాన్ని పోలి ఉంది. సూర్యభగవానుని కుమారుడు కాబట్టి దివ్యశోభతో వెలుగుతున్న అతడు లెక్కకందని మంచిలక్షణాలు గలవాడు. మహాబాహు డైన ఆ కర్ణుడు రంగమండపమంతా కలయజూచి ద్రోణుకృపులకు నమస్కరించాడు. అయితే ఆ నమస్కృతిలో పెద్దగా గౌరవభావంలేదు. అక్కడున్న ప్రేక్షక సముదాయమంతా రెప్పవాల్చకుండా నిశ్చలంగా చూస్తున్నారు. "ఇత నెవరు"? అన్న ఆలోచనతో ఆ ప్రేక్షకులలో కుతూహలమూ, వ్యాకులపాటూ కూడా కలిగాయి. అంతలోనే మాటకారులలో మేటి అయిన సూర్యసుతుడు-కర్ణుడు-మేఘగంభీరమైన కంఠంతో తానెరుగని సోదరుడైన అర్జునునితో ఇలా అన్నాడు. "కౌంతేయా! నీవు ఈ రంగస్థలంపై ప్రదర్శించిన దానికన్న విశిష్టమైన విన్యాసాలను ఈ ప్రేక్షకుల సమక్షంలో ప్రదర్శించగలను. నీగురించి నీవు గర్వపడవలదు." ఆ కర్ణుని మాటలు ముగియకుండానే అన్నివైపులా ఉన్న ప్రేక్షకజనులు వెంటనే యంత్రంతో పైకెత్తినట్టుగా లేచి నిలబడ్డారు. దుర్యోధనునకు ఎంతో ఆనందం కలిగింది. క్షణకాలంలో సిగ్గూ, కోపమూ అర్జునుని ఆవేశించాయి.

కర్ణుడు ఎప్పుడూ పోరాడటాన్ని ఇష్టపడేవాడు. ఆ మహాబలుడు ఆ సమయంలో ద్రోణుని అనుమతితో అర్జునుడు ప్రదర్శించిన అస్త్రవిద్యాకౌశలం అంతా తానూ ప్రదర్శించాడు. జనమేజయా! అప్పుడు దుర్యోధనుడు సోదరులతో సహా ఆనందంతో కర్ణుని కౌగిలించుకొని ఇలా అన్నాడు. "మహాబాహూ! నీకు స్వాగతం. నా అదృష్టం కొద్దీ వచ్చావు. నేనూ, ఈ కురురాజ్యమూ అంతా నీదే-స్వేచ్ఛగా అనుభవించు." కర్ణుడిలా అన్నాడు. "ప్రభూ! తమరు చెప్పినదంతా జరిగినట్లుగానే భావిస్తున్నాను. తమతో మైత్రిని కోరుతున్నాను. అర్జునునితో ద్వంద్వయుద్ధం చేయగోరుతున్నాను." దుర్యోధనుడిలా అన్నాడు. "అరిందమా! నాతోపాటు భోగాల ననుభవించు. నీబంధువుల అభీష్టాలు తీర్చు. సమస్తశత్రువుల శిరస్సులపై పాదాలు నిలుపు." అప్పుడు కర్ణుడు తననే తిరస్కరిస్తున్నట్లు భావించి అర్జునుడు దుర్యోధనాది సోదరసమూహంలో నిశ్చలంగా నిలిచి ఉన్న కర్ణునితో ఇలా అన్నాడు. "కర్ణా! పిలువని పేరంటానికి వచ్చినవారూ, అడగకుండా మాటాడేవారూ ఏ లోకాలకు పోతారో ఆ లోకాలకే నాచేత చచ్చి నీవు కూడా పోతావు." కర్ణుడిలా అన్నాడు. "అర్జునా! ఈరంగస్థలం అందరికీ చెందినది కానీ నీ ఒక్కడిదీ కాదు. బలపరాక్రమసంపన్నులయిన వారే రాజులు. ధర్మంకూడా బలాన్నే అనుసరిస్తుంది." నిష్ఠురంగా మాటాడటం బలహీనుల మార్గం. శక్తి ఉంటే బాణాలతో మాటాడు. ఇప్పుడు గురువు సమక్షంలోనే

నా బాణాలతో నీ తలను ఆపహరిస్తాను. ఆ తరువాత అర్జునుడు ద్రోణుని ఆదేశంతో వెంటనే తన సోదరులతో కూడి యుద్ధానికై కర్ణుని సమీపించాడు. అప్పుడు సోదరులతో సహా దుర్యోధనుడు కూడా ధనుస్సు చేతబట్టి, యుద్ధసన్నద్ధుడై నిలిచిన కర్ణుని కౌగిలించుకొన్నాడు.

అప్పుడు ఆడుకొంగల వరుసలను పరిహసించే మేఘాలు మెరుపులతో, ఉరుములతో, ఇంద్రధనుస్సుతో సహా గగన తలమంతా కప్పివేశాయి. ఆ తరువాత అర్జునుని మీది ప్రేమతో రంగస్థలంవైపు చూపు సారించిన ఇంద్రుని చూచి, సూర్యుడు కూడా తన దగ్గరగా వచ్చిన మేఘాలను నశింపజేశాడు. అప్పుడు అర్జునుడు మేఘాల నీడలో దాగి కనిపించాడు. కర్ణుడు సూర్యుని కాంతిచే ప్రకాశిస్తూ కనిపించాడు. కర్ణుడున్నవైపు ధృతరాష్ట్రుని కొడుకులంతా నిలిచారు. ద్రోణుడు, కృపుడు, భీష్ముడూ అర్జునుడున్న వైపు నిలిచారు. రంగస్థలంలోని ప్రేక్షకులు స్త్రీలతో సహా కర్ణార్జునుల వైపు మొగ్గుచూపుతూ రెండుగా చీలిపోయారు. కుంతి ఆ (ఇద్దరూ తన కుమారులే అన్న) వాస్తవాన్ని గుర్తించి మూర్ఛపోయింది. మోహానికి లోనైన కుంతిని సర్వధర్మవేత్త అయిన విదురుడు దాసీజనం ద్వారా చందనజలాన్ని చిలకరింపజేసి తెప్పరిల్లజేశాడు. స్పృహలోనికి వచ్చిన కుంతి యుద్ధానికి సన్నద్ధులైన తన కుమారుల నిద్దరినీ చూచి కంగారుపడింది. కానీ వారిని వారించే ఉపాయ మేమీ ఆమెకు తోచలేదు. పెద్దపెద్ద ధనుస్సులను ధరించిన ఆ ఇద్దరినీ చూచి ద్వంద్వయుద్ధనీతినెరిగి సర్వధర్మవేత్త అయిన శరద్వంతుని కొడుకు కృపుడు ఇలా అన్నాడు. "కర్ణ ఇతడు కుంతి చిన్నకొడుకు. పాండునందనుడు. కురువంశస్థుడు. నీతో ద్వంద్వయుద్ధం చేస్తాడు. మహాబాహూ! నీవు కూడా ఇలాగే నీతల్లినీ, తండ్రినీ, కులాన్నీ ఈ రాజలోకానికి తెలియజేయి. నీవు ఏ వంశానికి భూషణ మయ్యావు? అది తెలిసిన తర్వాత అర్జునుడు నీతో యుద్ధం చేస్తాడో, లేదో నిర్ణయమవుతుంది. రాజకుమారులు కులం తక్కువ వారితోనూ, ఆచారంలో తక్కువయిన వారితోనూ యుద్ధం చేయరు." ఆ మాట విని కర్ణుని వదనం సిగ్గుతో వాలిపోయింది. వర్షపునీటితో తడిసి, వాలిపోయిన పద్మంలా కనిపించింది. దుర్యోధను డిలా అన్నాడు.

"ఆచార్యా! శాస్త్రానుసారంగా రాజు అనటానికి మూడు కారణాలు ఉన్నాయి. ఉత్తమకులంలో పుట్టినవాడూ, శూరుడూ, సేనాధిపతి -ఈ ముగ్గురూ రాజులే. ఈ అర్జునుడు రాజుకాని వానితో యుద్ధంచేయటానికి ఇష్టపడకపోతే ఇప్పుడే ఈ కర్ణుని అంగరాజ్యాధిపతిగా అభిషేకిస్తున్నాను."

(ఆ తరువాత దుర్యోధనుడు ధృతరాష్ట్రునితోనూ, భీష్మునితోనూ సంప్రదించి బ్రాహ్మణుల

ద్వారా పట్టాభిషేకానికి అవసరమైన సామగ్రిని తెప్పించాడు.)

ఆ క్షణంలోనే మహాబలుడూ, మహారథుడు అయిన కర్ణుని స్వర్ణసింహాసనంపై అధివసింపజేసి, మంత్రవేత్త లయిన బ్రాహ్మణులద్వారా వేలాలు, పూలూ కలిపి స్వర్ణకలశాలతో నింపిన నీటితో అభిషిక్తుని చేశాడు.

(అప్పుడు కిరీటం, హారాలు, కేయూరాలూ, కంకణాలూ, అంగదాలు-మొదలయిన సమస్తరాజోచిత చిహ్నాలను, శుభకరమైన ఆభరణాలను కర్ణునకు అలంకరింపజేశాడు.)

గొడుగును, వింజామరలనూ ఏర్పాటుచేశాడు. అవి ధరించిన కర్ణుని జయజయరావాలతో శోభిల్లజేశాడు.

(బ్రాహ్మణులచే ఆదరింపబడిన కర్ణుడు వారికి అంతులేని ధనాన్ని ఇచ్చి, దుర్యోధనునితో ఇలా అన్నాడు.)

"రాజశ్రేష్ఠుడా! నాకు రాజ్యప్రదానం చేశావు. దీనికి సాటిగా నేను నీకేమివ్వగలను? ఆదేశించు. చేయటానికి సిద్ధంగా ఉన్నాను." అప్పుడు సుయోధనుడు "నీతో ఎడతెగని మైత్రిని కోరుతున్నాను" అని కర్ణునితో అన్నాడు. దుర్యోధనుడు అలా అనగానే కర్ణుడు 'అలాగే' అని సమాధానమిచ్చాడు. సంతోషంగా ఒకరినొకరు కౌగిలించుకొని, పరమానందాన్ని పొందారు.

136. భీమసేనుడు కర్ణుని తిరస్కరించుట - సుయోధనుడు సత్కరించుట.

ఆ తరువాత కొరడాయే తన ప్రాణమైన అధిరథుడు కర్ణుని పిలుస్తూ రంగస్థలంమీదకు ప్రవేశించాడు. ఆయన ఉత్తరీయం జారిపోతోంది. చెమటపట్టి శరీరం కంపిస్తోంది. తండ్రిని చూచి ఆయనమీదున్న గౌరవంతో కర్ణుడు వింటిని విడిచి, పట్టాభిషేకంతో తడిసిఉన్న తన తలను ఆయన పాదాలపై ఉంచి నమస్కరించాడు. ఆపై అధిరథుడు తన పాదాలను ఉత్తరీయపు అంచుతో కప్పుకొని "కుమారా" అని తడబాటుతో పిలుస్తూ తనను కృతార్థునిగా భావించాడు. ఆ అధిరథుడు వాత్సల్యంతో కర్ణుని గుండెలకు హత్తుకొని అంగరాజ్యాభిషేకంతో అప్పటికే తడిసిన అతనిని కన్నీటితో మరలా తడిపాడు. అధిరథుని చూచి భీమసేనుడు కర్ణుని సూతపుత్రునిగా గ్రహించి నవ్వుతూ ఇలా అన్నాడు. "సూతపుత్రా! యుద్ధంలో అర్జునుని చేతిలో చావటానికి కూడా నీకు అర్హత లేదు. నీ కులానికి తగినట్టుగా వెంటనే కొరడాను చేత బట్టు. నరాధమా! అంగరాజ్యాన్ని అనుభవించటానికి కూడా నీవు అర్హుడవు కావు. యాగంలో అగ్నిహోత్రునికి దగ్గరగా ఉన్న పురోడాశాన్ని కుక్క పొందలేదు గదా!"

భీమసేనుని ఆ మాటలువిని కర్ణుని పెదవి కొంచెం కంపించింది. పెద్ద నిట్టూర్పు విడిచి గగనతలంపై నున్న సూర్యుని చూశాడు. దుర్యోధనుడు కోపంతో సోదరులు అనే పద్మాకరం నుండి మదపుటేనుగు బయటకు వచ్చినట్టు ముందుకురికాడు. ఆ దుర్యోధనుడు అక్కడనిలిచి ఉన్న భీమసేనునితో ఇలా అన్నాడు- "వృకోదరా! ఈవిధంగా మాటాడటం నీకు తగదు. క్షత్రియులకు బలమే ప్రధానం. బల ముంటే హీనక్షత్రియునితో నయినా పోరాడవలసినదే. శూరులపుట్టుక, ఏరులపుట్టుకలలోని వాస్తవాలను తెలిసికొనటం చాలా కష్టం. చరాచరప్రపంచ మంతా వ్యాపించి ఉన్న అగ్ని నీటినుండి పుట్టింది. రాక్షససంహారం చేయగల వజ్రాయుధం దధీచి వెన్నెముక నుండి తయారయినది. సమస్తగుహ్యస్వరూపుడైన స్కందభగవానుడు అగ్ని, కృత్తిక, రుద్రుడు, గంగ-వీరందరి కొడుకు అని అంటుంటారు. ఎంతోమంది బ్రాహ్మణులు క్షత్రియులకు పుట్టిన వాళ్ళున్నారు. నీవు కూడా వినే ఉంటావు. విశ్వామిత్రుని వంటి క్షత్రియులు కూడా బ్రాహ్మణత్వాన్ని పొందారు. శస్త్రధారులలో మేటి అయిన ద్రోణాచార్యుడు కలశం నుండి పుట్టినవాడు. గౌతమమహర్షివంశంలోని కృపాచార్యుడు తెల్లుపొదనుండి పుట్టినవాడే. మీసోదరులందరి పుట్టుక ఎటువంటిదో అది కూడా, నాకు తెలుసు. సర్వశుభలక్షణాలతో కూడి కవచకుండలాలతో పుట్టిన ఈ సూర్యతేజస్కుడు కర్ణుడు సూతస్త్రీకి ఎలా పుట్టగలడు? **జింక పులిని కనలేదు గదా!**

(సూర్యతేజస్కుడై, క్షత్రియగుణసంపన్నుడై, యుద్ధాలంకారుడై, శూరుడైన ఇటువంటి వానిని సూతు డెట్లు కనగలడు?)

తన బాహుబలం వలనా, ఆదేశాలను శిరసావహించ సిద్ధపడిన నావంటి మిత్రుని తోడ్పాటువలనా ఈ అంగరాజు అంగదేశానికే కాదు, సమస్తభూమండలానికీ రాజు కాదగినవాడు. ఎవరికైనా నేను చేసిన ఈపని నచ్చకపోతే రథాన్ని అధిరోహించి కానీ, పాదచారులై కాని వింటిని ఎక్కుపెట్టవచ్చు."

అప్పుడు రంగస్థలమంతా సుయోధనునకు అభినందనలతోపాటు యుద్ధం జరుగుతుందన్న భయంతో హాహాకారాలు చెలరేగాయి. అంతలో సూర్యుడు అస్తమించాడు. అప్పుడు దుర్యోధనసరపాలుడు కర్ణుని చేతివ్రేళ్ళను పట్టుకొని దీపాలకాంతిలో ఆ రంగస్థలం నుండి నిష్క్రమించాడు. పాండవులు కూడా ద్రోణునితో, కృపునితో, భీష్మునితో కలిసి ఎవరి ఇంటికి వారు వెళ్ళిపోయారు. ప్రేక్షకులు కొందరు అర్జునుని గురించి, కొందరు కర్ణుని గురించీ, మరికొందరు దుర్యోధనుని గురించి మాటాడుకొంటూ బయలుదేరారు. దివ్యలక్షణాలతో కనిపిస్తున్న అంగరాజు కర్ణుని కుంతి తన కుమారునిగా గుర్తించింది.

దానితో ఆమె ఇతరులు తెలిసికొనలేని రీతిలో ఆనందించింది. కర్ణుని చేరిక తరువాత దుర్యోధనునికి కూడా అర్జునుని కారణంగా కలిగిన భయం వెంటనే అంతరించి పోయింది. అస్త్రవిద్యలో చాలా పరిశ్రమచేసిన ఆ వీరుడు-కర్ణుడు కూడా సుయోధనునితో ప్రేమగా వ్యవహరించసాగాడు. కర్ణునితో సమాను డయిన విలుకాడు భూమిపై లేడని ధర్మరాజు కూడా భావించాడు.

137. ద్రుపదపరాభవము.

పాండవులూ, ధార్తరాష్ట్రులూ అస్త్రవిద్యలో నిష్ణాతు లయ్యారని నిశ్చయించుకొన్న ద్రోణాచార్యుడు గురుదక్షిణను స్వీకరించటానికి తగిన సమయ మాసన్నమైన దని భావించాడు. ద్రోణాచార్యుడు తన శిష్యుల నందరినీ పిలిపించి గురుదక్షిణ కోరుతూ ఇలా పలికాడు. "పంచాలరాజయిన ద్రుపదుని యుద్ధంలో బంధించి తీసికొనిరండి. మీకు మేలు కలుగుతుంది. ఇదే నాకివ్వదగిన గొప్ప గురుదక్షిణ అన్నాడు." 'అలాగే' అని, దెబ్బతీయగల ఆ రాజకుమారులంతా త్వరగా రథాలనెక్కి గురుదక్షిణను ఇవ్వటానికి ద్రోణాచార్యునితో సహా బయలుదేరారు. ఆ తరువాత దుర్యోధనుడూ, కర్ణుడూ, బలిష్ఠుడైన యుయుత్సుడూ, దుఃశాసనుడూ, వికర్ణుడూ, జలసంధుడూ, సులోచనుడూ - ఇంకా పరాక్రమశాలులూ, క్షత్రియశిరోమణులూ అయిన అనేక రాజకుమారులు అహమహమికతో యుద్ధానికి సిద్ధపడి పంచాలరాజ్యంలో ప్రవేశించారు. అక్కడున్న ప్రజలను దండిస్తూ, మహాతేజస్వి అయిన ద్రుపదుని రాజధానివైపు దూసుకొనిపోయారు. రథాలనధిరోహించి ఆ రాజకుమారులంతా ఆశ్వికులతో పాటు నగరంలో ప్రవేశించి రాజమార్గాన్ని పట్టారు. రాజా! ఆ సమయంలో పంచాలరాజు ద్రుపదుడు ఆ ఆక్రమణనుగూర్చి విని, ఆ మహాసేనను చూచి, సోదరులతో కలిసి వేగంగా రాజభవనం నుండి వెలుపలికి వచ్చాడు. ఆ తరువాత ద్రుపదుని సహోదరులు అందరూ కవచాలు ధరించి శరవర్షాలు కురిపిస్తూ సింహనాదాలు చేయసాగారు. ఆ ద్రుపదమహారాజు తెల్లని రథాన్ని అధిరోహించి కౌరవుల దాపునకు పోయి భయంకరమైన బాణవృష్టిని కురిపించాడు. కౌరవులూ, ఇతరరాజకుమారులూ ప్రదర్శిస్తున్న బలపరాక్రమోద్రేకాన్ని గమనించి అర్జునుడు ముందుగానే బాగా ఆలోచించి ద్రోణాచార్యునితో ఇలా పలికాడు. "వీరి పరాక్రమప్రదర్శన ముగిసిన తరువాత మేము యుద్ధం చేస్తాము. పాంచాలరాజు ద్రుపదుని యుద్ధంలో బంధించటం వీరికి అసాధ్యం." ఆచార్యునితో అలా పలికి అర్జునుడు తన సోదరులతో సహా నగరానికి వెలుపల ఆరక్రోసు దూరంలోనే నిలిచాడు.

ద్రుపదుడు కౌరవులను చూచి అన్నివైపులనుండీ వారిపైకి ఉరికి బాణాలతో పెద్ద వలను వేసి, కౌరవసేనను మూర్ఛిల్లజేశాడు. ఒంటరియై రథంపై యుద్ధంలో వేగంగా పరాక్రమిస్తున్న ద్రుపదుని చూచిన కౌరవులు భయపడి ఆ ద్రుపదుడు ఒంటరివాడైనా చాలామంది ఆక్రమిస్తున్నట్టు భావించారు. ద్రుపదుని తీవ్రబాణాలు అన్నిదిక్కులా ప్రసరింపసాగాయి. ద్రుపదుని విజయాన్ని భావించి పాంచాలప్రజల ఇళ్ళలో వేలకొలదిగా శంఖాలూ, భేరులూ, మృదంగాలూ మ్రోగాయి. ఆత్మబల సంపన్నులైన పాంచాలసైనికుల సింహనాదాలు కూడా చెలరేగాయి. వారి ధనుష్టంకారధ్వని కూడా గొప్పగా గగన తలాన్ని స్పృశించింది. అప్పుడు దుర్యోధనుడు, వికర్ణుడు, సుబాహువు, దీర్ఘలోచనుడు, దుశ్శాసనుడు తీవ్రకోపంతో శరవృష్టిని కురిపించారు. మేటివిలుకాడూ, దుర్జయుడూ అయిన ద్రుపదుడు తీవ్రంగా గాయపడి, వెంటనే కౌరవసేనలను చితకగొట్టాడు. మండుతున్న కొరివిచక్రంవలె అంతటా తిరుగుతూ దుర్యోధనునీ, వికర్ణునీ, కర్ణునీ, అనేక రాజకుమారులనూ, వివిధసేనలనూ బాణాలతో తృప్తి పరచసాగాడు.

(ఆ ద్రుపదుడు దుశ్శాసనుని పది బాణాలతోనూ, వికర్ణుని ఇరవై బాణాలతోనూ, శకునిని ఇరవై తీక్ష్ణశరాలతోనూ గాయపరిచాడు. యుద్ధంలో శత్రుదమను డైన ద్రుపదుడు ఆ తరువాత కర్ణదుర్యోధనుల శరీరావయసంధులన్నింటి మీద విడివిడిగా ఇరవై యెనిమిది బాణాలతో కొట్టాడు. సుబాహుని ఐదుబాణాలతోనూ, ఇతరయోధులను వివిధ బాణాలతోనూ బాధించి వెంటనే సింహనాదం చేశాడు. శస్త్రధారులలో మేటి అయిన ద్రుపదుడు కోపంతో గర్జిస్తూ శత్రువుల ధనుస్సులనూ, రథాలను, అశ్వాలను, చిత్రవిచిత్రపతాకలను ఖండించాడు. పాంచాలసేనలు అన్నీ సింహనాదాలు చేశాయి.)

ఆ తరువాత నగరవాసులందరూ కురుస్తున్న మేఘాలవలె కౌరవులందరిపై రోకళ్ళనూ, కర్రలనూ విసిరారు. నగరంలోని పౌరులు తీవ్రయుద్ధం జరుగుతోందని విని ఆబాలవృద్ధంగా కౌరవుల నెదిరించారు. కౌరవులు సాటిగా నిలువలేక అరుస్తూ, ఆక్రోశిస్తూ పాండవులవైపు పరుగెత్తారు.

(పాంచాలరాజబాణాలతో శరీరం చిన్నాభిన్నంకాగా కర్ణుడు భయపడి, రథం దిగి పారిపోసాగాడు.)

రోమాంచం కలిగేటట్లు సైనికులు చేస్తున్న ఆర్తనాదాలను విని, పాండవులు ద్రోణునకు నమస్కరించి, తమ రథాల నెక్కారు. నీవు యుద్ధం చేయనవసరం లేదని యుధిష్ఠిరుని నివారించారు. అర్జునుడు నకులసహదేవులను తన రథచక్ర- రక్షకులనుగా నిలిపాడు. భీమసేనుడు గదను చేతబట్టి సేనకు ముందు నిలిచాడు. అప్పుడు శత్రువుల గర్జనలను విని, అనఘుడైన అర్జునుడు తన సోదరులతో సహా రథధ్వనితో దిక్కులను ప్రతిధ్వనింపజేస్తూ

వేగంగా వచ్చాడు. ద్రుపదునిసేన ఎగసిపడే సముద్రంవలె ఘోష పెడుతోంది. భీమసేనుడు దండధరుడైన యమధర్మరాజువలె గద పట్టి, సముద్రంలోనికి మొసలి ప్రవేశించినట్లు ఆ మహాసేనలోనికి ప్రవేశించాడు. గదాధారియై గజసమూహంపై విరుచుకొని పడ్డాడు భీమసేనుడు. అసమానమైన బాహుపరాక్రమం గలిగి యుద్ధకుశలు డైన ఆ భీమసేనుడు మృత్యురూపాన్ని ధరించి గదతో గజసమూహాలను సంహరించసాగాడు. పర్వతాకారంతో ఉన్న ద్రుపదుని ఏనుగులు భీమసేనుని గదదెబ్బలకు తలలు పగిలి, నెత్తురోడుతూ వజ్రపుదెబ్బలకు నేలగూలిన పర్వతాలవలె భూమిపై పడసాగాయి. భీముడు ఏనుగులనూ, గుర్రాలనూ, రథాలనూ కూడా పడగొట్టాడు. పదాతిసైనికులనూ, రథికులనూ కూడా కూల్చాడు. గోపాలుడు దండం చేతబట్టి పశుగణాలను తోలినట్లు వృకోదరుడు రథాలనూ, ఏనుగులనూ తరుముతూ వెంటబడ్డాడు.

ఆ సమయంలో ద్రోణునకు ప్రియాన్ని కల్గించటానికి ఉద్యమించిన అర్జునుడు శరజాలంతో ద్రుపదుని తరుముతూ ఆక్రమించాడు. అన్నిదిక్కులా అశ్వసమూహాలనూ, రథసముదాయాన్నీ, ఏనుగులగుంపునూ నేలగూల్చుతూ ప్రళయకాలాగ్ని వలె ప్రజ్వరిల్లాడు. ఆ విధంగా దెబ్బతిన్న పాంచాలురూ, సృంజయులూ అర్జునుని వివిధ బాణాలతో వెంటనే అన్ని వైపులా చుట్టుముట్టి సింహనాదాలు చేస్తూ అర్జునుని ఎదిరించారు. ఆ యుద్ధం ఘోరంగా, చూచేవారికి అద్భుతంగా కనిపించింది. అర్జునుడు ఆ సింహనాదధ్వని విని సహించలేకపోయాడు. వేగంగా అర్జునుడు బాణసమూహంతో పాంచాల సేనలను కప్పుతూ, వారిని మూర్ఛిల్లజేస్తూ రణరంగాన్ని ఆక్రమించాడు. యశస్వి అయిన అర్జునుడు తీవ్రవేగంతో నిరంతరంగా బాణాలు విడుస్తున్నాడు. బాణాలను సంధించటానికీ, విడవటానికీ మధ్య వ్యవధానమే కనిపించటం లేదు.

(గాండీవధారి అయిన అర్జునుడు బలిష్ఠుడై బాణప్రయోగంద్వారా చీకటి క్రమ్మజేస్తుంటే ఆ రణరంగంలో భూమి, ఆకాశం, దిక్కులూ ఏవీ కనిపించకుండాపోయాయి.)

అప్పుడు అర్జునపక్షంలో అభినందనలూ, సింహనాదాలూ చెలరేగాయి. అటు పాంచాలరాజు సత్యజిత్తును తోడు తీసికొని శంబరాసురుడు దేవేంద్రుని ఆక్రమించినట్లు అర్జునుని ఆక్రమించాడు. తీవ్రబాణవర్షంతో అర్జునుడు ద్రుపదుని కప్పేశాడు. మహాసింహం గజరాజును నిలువరించినట్లు అర్జునుడు ద్రుపదుని ఆక్రమించాడు. పాంచాలరాజ సేనలలో హాహాకారాలు చెలరేగాయి. ద్రుపదుని బంధించటానికి బాగా దగ్గరకు వస్తున్న అర్జునుని చూచి, పాంచాల రాజసంరక్షణకై సత్యవిక్రము డైన సత్యజిత్తు అర్జునునిపైకి ఉరికాడు. అప్పుడు ఇంద్ర బలిచక్రవర్తులవలె యుద్ధానికి సన్నద్ధులైన అర్జున సత్యజిత్తులు ఆసేనలను

బాగా కలతపెట్టారు. ఆ పై అర్జునుడు మర్మచ్ఛేదన చేయగల పదిబాణాలతో సత్యజిత్తును బలంగా, గాఢంగా గాయపరిచాడు. అది ఎంతో అద్భుతంగా కనిపించింది. ఆ పై సత్యజిత్తు వెంటనే వందబాణాలతో అర్జునుని బాధించాడు. అయితే పార్థుడు ద్రుపదుని శరవర్షం తనను కప్పినా నారి సారించి, వేగంగా బాణాలను విడిచి సత్యజిత్తుని ధనుస్సును ఖండించి, ద్రుపదునిపై కురికాడు. అప్పుడు సత్యజిత్తు తీవ్రవేగంతో మరొక వింటిని తీసికొని, త్వరత్వరగా అర్జునునీ, అతని గుఱ్ఱాలనూ, సూతునీ గాయపరిచాడు. సత్యజిత్తు తనను బాధించటాన్ని సహించని ఆ అర్జునుడు వెంటనే సత్యజిత్తును నశింపజేయటానికి బాణాలను విడిచాడు. సత్యజిత్తు గుఱ్ఱాలనూ, ధ్వజాన్నీ, వింటినీ, పిడికిలినీ, రధరక్షకునీ, సారథినీ కూడా అర్జునుడు గాయపరిచాడు. అలా ధనుస్సులు మాటిమాటికీ విరుగుతున్నాయి. అశ్వాలు మరణిస్తున్నాయి. సత్యజిత్తు రణరంగం నుండి పారిపోయాడు. రాజా! పారిపోతున్న సత్యజిత్తును గమనించి ద్రుపదుడు మరీ వేగంతో అర్జునునిపై బాణవృష్టిని కురిపించాడు. జయశీలు డయిన అర్జునుడు ఘోరయుద్ధాన్ని ప్రారంభించాడు.

అర్జునుడు ఆ ద్రుపదుని వింటిని ఖండించి, ధ్వజాన్ని నేలగూల్చి అయిదు బాణాలతో గుఱ్ఱాలనూ, సారథినీ బాధించాడు. ద్రుపదుడు విరిగిన ధనుస్సును విడిచి, మరొక వింటిని తీసికొనే లోపులో అర్జునుడు కత్తిని చేతబట్టి సింహనాదం చేశాడు. అర్జునుడు వెంటనే పాంచాలరాజు రధం నొగలిపైకి సముద్రాన్ని కలతపెట్టి పాములను పట్టుకొనే గరుత్మంతుని వలె దూకాడు. ద్రుపదుని రథంపై నిర్భయంగా నిలిచి అర్జునుడు ఆ ద్రుపదుని లోబరచుకొన్నాడు. దానితో పాంచాలసైనికు లందరూ పది దిక్కులకూ పారిపోయారు. ఆ అర్జునుడు సర్వసైన్యాలకూ తన బాహుబలాన్ని ప్రదర్శిస్తూ సింహనాదాన్ని చేసి నిష్క్రమించాడు. అర్జునుని రాకను చూచి కుమారులంతా ఒక్కటై మహాత్ముడైన ద్రుపదుని నగరాన్ని ధ్వంసం చేయసాగారు.

అర్జును డిలా అన్నాడు. "భీమసేనా! రాజశ్రేష్ఠుడైన ద్రుపదుడు కురువీరులకు బంధువు. ఆయన సేనను సంహరించవద్దు. గురుదక్షిణగా ద్రుపదుని మాత్రమే ద్రోణున కివ్వాలి. ఆ విధంగా అర్జునుడు వారించగా మహాబలుడైన భీమసేనుడు జరిగిన యుద్ధంతో తృప్తిపడకపోయినా వెనుదిరిగాడు. ఆ పాండవులు రణరంగంలో అమాత్యులతో సహా ద్రుపదుని బంధించి, ద్రోణాచార్యునకు కానుకజేశారు. గర్వాన్నీ, ధనాన్నీ కూడా కోలుపోయి తనకు వశమైన ద్రుపదుని చూచి గతవైరాన్ని మనస్సులో తలచి, ద్రోణుడు అతనితో ఇలా అన్నాడు. "నేను నీ రాష్ట్రాన్ని చితకగొట్టాను. నీ నగరాన్ని మట్టిజేశాను. నీ ప్రాణాలిప్పుడు శత్రువుల చేతిలో ఉన్నాయి. ఆలనాటి మైత్రిని నీవు కోరుతున్నావా?" అలా అని ద్రోణుడు

ఒక నవ్వు నవ్వి మరల ద్రుపదునితో ఇలా అన్నాడు- "వీరుడా! ప్రాణభయం వద్దు. మేము బ్రాహ్మణులం క్షమాశీలురం. క్షత్రియశ్రేష్ఠా! బాల్యంలో నీవు నాతో కలిసి ఆశ్రమంలో క్రీడించావు. దానితో నీతో స్నేహం, నీపై ప్రేమా కలిగాయి. రాజా! నేను మరలా నీతో స్నేహాన్నే కోరుతున్నాను. నీకొక వరమిస్తున్నాను. ఈరాజ్యంలో అర్ధభాగాన్ని నీవే స్వీకరించు. యజ్ఞసేనా! రాజాకానివాడు రాజుకు మిత్రుడు కాలేడన్నావు గదా. అందువలననే నేను నీ రాజ్యాన్ని అధీనం చేసికొనేందుకు ప్రయత్నించాను. భాగీరథికి దక్షిణభాగానికి నీవు రాజువు. ఉత్తరభాగానికి నేను రాజును. పాంచాలా! నీకు నచ్చితే నన్ను నీ మిత్రునిగానే భావించు." ద్రుపదుడిలా అన్నాడు. "బ్రాహ్మణా! నీవంటి పరాక్రమవంతునకు ఇటువంటి ఔదార్యముండటం ఆశ్చర్యకరం. నేను నిన్ను ఇష్టపడుతున్నాను. నీతో శాశ్వతమైత్రిని కోరుతున్నాను."

ద్రుపదు డలా అన్నతరువాత ద్రోణుడు ద్రుపదుని విడిచిపెట్టాడు. ఆయనను సత్కరించి, ఆనందంగా రాజ్యంలో అర్ధభాగాన్ని ఇచ్చివేశాడు. ఆ తరువాత ద్రుపదుడు దీనహృదయుడై గంగానదీ తీరంలో అనేకజనపదాలతో కలిసి ఉన్న మాకందీపురాన్నీ, శ్రేష్ఠనగరమైన కాంపిల్యనగరాన్ని నివాసంగా ఏర్పాటు చేసికొని, చర్మణ్వతీనదికి దక్షిణతీరాన ఉన్న పాంచాలదేశాన్ని పరిపాలించసాగాడు. ఈవిధంగా ద్రోణుడు ద్రుపదుని పరాభవించి, ఆపై అనుగ్రహించాడు. ద్రుపదుడు తన క్షాత్రబలంతో ద్రోణుని ఓడించలేకపోయాడు. బ్రాహ్మణబలం కన్న తనను తక్కువగా భావించుకొని, శక్తిమంతుడైన కుమారుని పొందగోరి భూమిపై తిరగసాగాడు. ద్రోణుడు గంగానదికి ఉత్తరంవైపున్న అహిచ్ఛత్రరాజ్యాన్ని తన పాలనలో నిలుపుకొన్నాడు. రాజా! ఈవిధంగా జనపదాలతో కూడిన అహిచ్ఛత్ర నగరాన్ని యుద్ధంలో గెలుచుకొని అర్జునుడు ద్రోణాచార్యునకు గురుదక్షిణగా ఇచ్చాడు.

138. యుధిష్ఠిరుని యౌవరాజ్యాభిషేకము - పాండవుల వృద్ధిని చూచి ధృతరాష్ట్రుడు చింతించుట.

ఒక సంవత్సరకాలం గడిచిన తర్వాత ధృతరాష్ట్రుడు పాండుకుమారు డైన యుధిష్ఠిరుని యువరాజును చేశాడు. యుధిష్ఠిరునిలోని ధైర్యం, స్థైర్యం, సహనం, దయాళుత, ఋజువర్తనం, స్థిరమైన సౌహార్దం కారణంగా పరిపాలకుడై ప్రజలను అనుగ్రహించటానికి ఆ ఏర్పాటు జరిగింది. ఆ తరువాత స్వల్పకాలంలోనే తన శీలం, వర్తనం, ఏకాగ్రతలచే యుధిష్ఠిరుడు తన తండ్రి కీర్తిని మరపింపజేశాడు. వృకోదరుడు ప్రతిదినమూ బలరాముని దగ్గర కత్తియుద్ధాన్ని, గదాయుద్ధాన్నీ, రథయుద్ధాన్నీ అభ్యసింపసాగాడు. విద్యాభ్యాసం ముగిసిన

తర్వాత భీమసేనుడు బలంలో ద్యుమత్సేనునితో సము డయ్యాడు. పరాక్రమసంపన్నుడై సోదరుల అదుపులో ప్రవర్తించసాగాడు. అర్జునుడు పిడికిలి బిగించి వింటిని పట్టడంలోనూ, హస్తలాఘవంలోనూ, లక్ష్యాన్ని భేదించటంలోనూ, క్షుర నారాచ భల్ల విపారాలనబడే సరళ, వక్ర, విశాల బాణాలను ప్రయోగించటంలోనూ నేర్పరి అయ్యాడు. లాఘవంలోనూ, స్థైర్యంలోనూ అర్జునునితో సాటిరాగలవాడు లోకంలో మరెవ్వడూ లేడని ద్రోణుడు విశ్వసించాడు. ఒకరోజు ద్రోణుడు కౌరవసభలో అర్జునునితో ఇలా అన్నాడు.

"అర్జునా! నా గురువు అగ్నివేశుడు. ఆయన అస్త్రవిద్యలో ఒకప్పుడు అగస్త్యుని శిష్యుడు. ఒక యోగ్యుని నుండి మరొక యోగ్యునకు సంక్రమింపజేయాలన్న ప్రయత్నంతో నేను నీకు బ్రహ్మశిరోనామకమైన అస్త్రాన్ని ఇచ్చాను. అది నా తపస్సాధన. అది వజ్రాయుధంవలె ప్రకాశిస్తుంది. అది సమస్తభూమండలాన్నీ దహింపగలది. ఈ అస్త్రాన్ని నాకు ప్రసాదిస్తూ నా గురువు అగ్నివేశుడు "ద్రోణా! దీనిని మానవులపై ప్రయోగించరాదు" అని చెప్పి ఇచ్చాడు. వీరా! అర్జునా! దీనిని నానుండి నీవు పొందావు. మరెవ్వరికీ ఇది లభించదు. ఈ అస్త్రాన్ని అనుగ్రహిస్తూ ఆ మహర్షి చెప్పిన నియమాన్ని నీవు కూడా పాటించాలి. ఇప్పుడు నీజ్ఞాతుల సమక్షంలో నీవు నాకు గురుదక్షిణను ఇవ్వాలి." ఇవ్వటానికి అర్జునుడు అంగీకరించిన తరువాత ద్రోణుడు ఇలా అన్నాడు.- "అనఘా! అర్జునా! యుద్ధభూమిలో నేను నీకు ఎదురు నిలిస్తే నీవు నాతో పోరాడాలి." 'అలాగే' అని ద్రోణునకు మాట ఇచ్చి కురుశ్రేష్ఠుడైన అర్జునుడు ఆచార్యుని పాదాలకు నమస్కరించి గురువునుండి సర్వోత్తమమైన ఉపదేశాన్ని పొందాడు. సాగరమేఖల అయిన ఈ భూమండలంలో అర్జునునకు సాటిరాగల విలుకాడు ఎవ్వడూ లేడన్న మాట తనంతతానుగా వ్యాపించింది.

అర్జునుడు గదాయుద్ధంలోనూ, ఖడ్గయుద్ధంలోనూ, రథయుద్ధంలోనూ, విలువిద్యలోనూ నిష్ణాతుడయ్యాడు. ఆ సమయంలోనే నీతిమంతుడైన సహదేవుడు ద్రోణుని రూపంలో ఉన్న దేవగురువు నుండి నీతిశాస్త్రాన్ని గ్రహించి సోదరులకు వశవర్తి అయి ఉన్నాడు. సోదరులకు ఇష్ట డైన నకులుడు ద్రోణుని దగ్గరే అస్త్రశస్త్రవిద్యలు గ్రహించి, చిత్రంగా యుద్ధం చేయటంలో ప్రసిద్ధికెక్కి అతిరథుడు అనిపించుకొన్నాడు. సౌవీరదేశాధిపతి గంధర్వులు ఇబ్బందిపెడుతున్నా, ఏకంగా మూడు సంవత్సరాలు విఘాతం లేకుండా యజ్ఞాలను అనుష్ఠించినవాడు. ఆయన అర్జునాదులతో యుద్ధంచేస్తూ మరణించాడు. పరాక్రమసంపన్నుడైన పాండురాజుకు కూడా లొంగని యవనదేశపు రాజు అర్జునునకు లోబడ్డాడు. విపులుడనే సౌవీరరాజు మిగుల బలసంపన్నుడు. అభిమానవంతుడు. కౌరవుల విషయంలో ఎప్పుడూ పాగరుగా ప్రవర్తించేవాడు. ఆయనను కూడా అర్జునుడు యుద్ధంలో చంపివేశాడు.

మరొక సౌవీరరాజు సుమిత్రుడు. దత్తామిత్రు డని అతనికి మరొకపేరు. ఎప్పుడూ యుద్ధానికి సంకల్పించేవాడు. ఆయనను కూడా అర్జునుడు బాణాలతో అణచివేశాడు. అర్జునుడు భీమసేను నొక్కడినే తోడు తీసికొని ఒంటరిగా రథంపై నిలిచి, తూర్పుదిక్కునున్న వీరులనూ, పదివేలమంది రథికులనూ జయించాడు. అదేవిధంగా అర్జునుడు ఒంటరిగా దక్షిణదిక్కును జయించాడు. కురురాజధానికి ధనరాసులను కొనితెచ్చాడు. ఈవిధంగా మహాత్ములూ, మానవోత్తములూ అయిన పాండవులు శత్రురాజధానులను, గెలిచి తమ రాజధానిని అభివృద్ధి చేసికొన్నారు. గట్టిగా విల్లుపట్టగలిగిన ఆ పాండవుల బలపరాక్రమాలను తెలిసికొనినవెంటనే ధృతరాష్ట్రునిలో పాండవుల పట్ల చెడుతలపులు కలిగాయి. ఆ చింతతో ధృతరాష్ట్రునికి రాత్రి నిదురపట్టలేదు.

139. కణికుడు ధృతరాష్ట్రునకు కూటనీతినుపదేశించుట.

పాండవులు వీరులూ, బలసంపన్నులూ, తేజోమూర్తులూ అని విని ధృతరాష్ట్రమహారాజు కలతపడి చింతాక్రాంతు డయ్యాడు. ఆపై మంత్రవేత్తా, మంత్రిశ్రేష్ఠుడూ, రాజనీతివేత్తలలో అగ్రగణ్యుడూ అయిన కణికుని పిలిపించి ధృతరాష్ట్ర డిలా అన్నాడు. "ద్విజశ్రేష్ఠా! పాండవులు అనుదినమూ వృద్ధినందుతున్నారు. వారిపై నాకు అసూయ కలుగుతోంది. కాబట్టి ఈ విషయంలో బాగా నిశ్చయించి సంధి తగినదో, విగ్రహం తగినదో నాకు చెప్పు." ధృతరాష్ట్ర డిలా అడగగానే ప్రసన్నమనస్కుడై ఆ బ్రాహ్మణశ్రేష్ఠుడు-కణికుడు-రాజనీతిసిద్ధాంతాలను దర్శింపజేస్తూ తీక్ష్ణంగా ధృతరాష్ట్రునితో ఇలా అన్నాడు. "రాజా! ఈవిషయంలో నా అభిప్రాయం చెపుతాను విను. ఇది విని, నన్ను తప్పు పట్టగూడదు. రాజు ఎప్పుడూ దండాన్ని ఎత్తిపట్టియే ఉండాలి. నిత్యమూ పౌరుషాన్ని ప్రకటిస్తూనే నిలవాలి. తనలోపాలను బయటపడనీయకూడదు. శత్రువుల లోపాలను దర్శించగలగాలి. ఇతరుల దుర్బలతను గ్రహించి తదనుగుణంగా ఉద్యమించాలి. రాజు అనుక్షణమూ దండాన్ని ఎత్తి ఉన్నప్పుడే ప్రజలు భయపడతారు. కాబట్టి అన్ని పనులనూ దండం ద్వారానే సాధించాలి. శత్రువు తన లోపాలను గ్రహించలేనంత జాగరూకుడై రాజు మెలగాలి. శత్రువుల లోపాలు బయటపడితే తప్పక అతనిపై దండెత్తాలి. తాబేలు అంగాలను ముడుచుకొనినట్లు రాజు తన సప్తాంగాలనూ రక్షించుకోవాలి. ప్రారంభించిన పనిని ఎప్పుడూ మధ్యలోనే వదలివేయదగదు. ముల్లునైనా సరే సగం తీసి, మిగిలిన భాగాన్ని శరీరంలోనే విడిస్తే చాలాకాలం వరకు ఆ గాయం మానదు.

అపకారం చేసిన శత్రువులను చంపటమే అభినంద నీయమైన పని. గొప్ప

పరాక్రమంగల శత్రు వయినా ఇబ్బందులలో పడినప్పుడు తేలికగా నష్టపరచవచ్చు. మేటి యోధు డైనా విపత్తికాలంలో తేలికగా చంపవచ్చు. విపత్కాలంలో ఉన్న శత్రువులపై తప్పక దాడిచేయాలి. ఆ సమయంలో సౌహార్దచర్యలు చేయరాదు. నాయనా! శత్రువు దుర్బలు డయినా ఏ రీతిగానూ అతనిని ఉపేక్షించకూడదు. చిన్న నిప్పురవ్వ అయినా ఆశ్రయం దొరికితే మొత్తం అడవినే తగులబెడుతుంది. తనకు అనువుగానపుడు శత్రువుల దోషాలను చూడకుండా గ్రుడ్డిగానే ఉండాలి. తగని వేళలో నిందావచనాలనైనా విననట్లే నిలవాలి. అవసరపడినపుడు తన వింటిని తృణమయంగానే భావించాలి. అల్పజంతువులకు నమ్మకం కలిగేదాకా నిద్ర నటిస్తున్న మృగం లాగా అసమర్థునివలెనే కనిపించాలి. శత్రువు తనను సమీపించిన తరువాత సాంత్వనం మొదలయిన ఉపాయాలతో నమ్మించి, సంహరించాలి. ఆ శత్రువు శరణుగోరినా జాలిపడరాదు. శత్రువును చంపినపుడే రాజుకు కలత ఉండదు. చంపకపోతే నిత్యమూ భయం భయంగానే ఉంటుంది. సహజశత్రువును దానాదులచేత నమ్మకం కలిగించి, చంపాలి. ఒకప్పుడు అపకారం చేసి, ప్రస్తుతం ఆశ్రయించి ఉన్నవానిని కూడా సంహరించాలి. శత్రుపక్షం యొక్క పురుషార్థరూప త్రివర్గాన్నీ, ప్రకృతిరూప పంచవర్గాన్నీ, సాధన రూపసప్తవర్గాన్నీ నశింపజేయాలి. ఎప్పుడూ శత్రుపక్షం యొక్క మూలాన్నే ముందు నరకాలి. ఆ తరువాత శత్రు సహాయకులను చంపాలి. ఆపై ఆ పక్షానికి చెందిన అందరినీ సంహరించాలి. మూలాధారం నశిస్తే దాని నాశ్రయించి ఉన్న వారంతా నశించినట్లే. చెట్టుమొదలు నరికిన తరువాత కొమ్మలు నిలువలేవు గదా! రాజా! నిత్యమూ శత్రుగమనాన్ని తెలిసికొనటంలో ఏకాగ్రత కావాలి. తన రాజ్యాంగాలను రహస్యంగా నిలుపుకోవాలి. శత్రువుల లోపాలను నిరంతరమూ గమనించాలి. వారి విషయంలో నిత్యమూ ఉద్విగ్నుడై చరించాలి. అగ్నిహోత్రాలనూ, యజ్ఞాలనూ ఆచరిస్తూ; కాషాయాలనూ, జటలను, మృగచర్మాలను ధరిస్తూ లోకానికి నమ్మకాన్ని కలిగించాలి. ఆ తర్వాత తోడేలు వలె మొత్తం నాశనం చేయాలి. అర్థసిద్ధికై శౌచాన్ని పాటించటాన్ని అంకుశంగా భావిస్తారు. ఫలించిన చెట్టుకొమ్మను వంచి, పండిన పండును ఒక్కొక్కటీ కోసికోవాలి. లోకంలో పండితులైన వారి ప్రయత్నాలన్నీ ఫలసిద్ధికోసమే. కాలం తనకు **అనుకూల మయ్యేంతవరకూ అవసరమయితే శత్రువును భుజాన మోయాలి. తరువాత కాలం అనుకూలించినప్పుడు రాతిమోద కుండను బ్రద్దలు కొట్టివట్లు శత్రువును నశింపజేయాలి.** శత్రువు ఎంత దీనంగా మాటాడినా అతనిని వదలరాదు. అతనిపై జాలి చూపదగదు. అపకారిని చంపి తీరవలసినదే. శత్రువును సాంత్వనంతో కానీ, దానంతో కానీ నమ్మకం కలిగించి చంపాలి. అలాగే అవసరాన్ని బట్టి భేదదండో పాయాలతో నరికివేయాలి."

ధృతరాష్ట్రుడిలా అన్నాడు. "శత్రువును సామ, దాన, భేద, దండోపాయాలతో ఎలా చంపగలం? దానిని నాకు యథాతథంగా చెప్పు." కణికుడిలా చెప్పాడు. "మహారాజా! ఈ సందర్భంలో నీతిశాస్త్రవేత్తయై అడవిలో నివసిస్తున్న ఒక నక్క కథను చెపుతా విను. ఒక అడవిలో స్వార్థసాధనలో నిపుణత్వం గల ఒక తెలివైన నక్క ఉండేది. దానికి నలుగురు మిత్రులు-పులి, ఎలుక, తోడేలు, నెమలి. వాటితో కలిసి అది నివసించేది. అవి ఆ అడవిలో ఒక జింకలరాజును చూశాయి. అది బలిష్ఠమైనది. దానిని పట్టుకోవటం కుదరక అవన్నీ కలిసి ఆలోచించాయి. జంబుకం ఇలా అన్నది. 'పులీ! అడవిలో దీనిని చంపటానికి నేను ఎన్నో సార్లు ప్రయత్నించాను. అది తెలివైనది, వయస్సులోనున్నది, యౌవనంలో ఉన్నది కాబట్టి వేగంగా పరుగెత్తగలదు. పట్టుకోవటం వీలుకాలేదు. అది నిదురించేటప్పుడు ఈ ఎలుక వెళ్ళి దాని పాదాలను కొరకాలి. అందువల్ల అది వేగంగా పరుగెత్తలేదు. ఆపై పులి దానిని పట్టుకోవాలి. అప్పుడు అందరమూ ఆనందంగా దానిని తిందాము.' నక్క మాటలు విని సావధానులై అవన్నీ అలాగే చేశాయి. ఎలుక కాళ్ళను కొరకగా, పరగెత్తలేని స్థితిలో ఉన్న ఆ జింకను పులి చంపివేసింది. జింకశరీరం నిశ్చేష్టంగా భూమిపై పడిపోగానే నక్క అది చూచి "బాగా చేశారు. స్నానం చేసి రండి. అప్పటిదాకా దీనిని నేను కాపాడుతాను" అని పలికింది. ఆపై నక్క మాట విని, మిగిలిన జంతువులన్నీ నది దగ్గరకు వెళ్లాయి. తీవ్రంగా ఆలోచిస్తూ నక్క అక్కడే ఉండిపోయింది. ఆ తరువాత స్నానంచేసి అందరికన్న ముందుగా బలశాలి అయిన పులివచ్చింది. మనస్సులో కలతపడుతున్న నక్కను చూచింది. పులి ఇలా అన్నది. 'మహాప్రాజ్ఞా! ఏమాలోచిస్తున్నావు? మనఅందరిలో నీవే తెలివైనవాడవు. మనం ఈ రోజు ఈ మాంసం తిని హాయిగా తిరగవచ్చు.'

నక్క ఇలా అన్నది. మహాబాహూ! ఒకమాట చెపుతా విను. ఎలుక నాకీ మాట చెప్పింది. "ఛీ! ఏం బల మీపులిది! ఈరోజు ఈజింకను నేనే చంపాను." నా బాహుబలం మీద ఆధారపడియే ఈరోజు ఆ పులి ఆకలి తీరుతోంది. అది ఆవిధంగా ప్రగల్భాలు పలుకుతుంటే దాని సహాయంతో పొందిన ఈ మాంసం తినాలనిపించటం లేదు.' పులి ఇలా అన్నది. 'అది ఆరీతిగా అని ఉంటే, సకాలంలో నన్ను మేల్కొలిపినట్లే. నా బాహుబలాన్ని ప్రదర్శించి వాటి నన్నింటినీ చంపి, వాటి మాంసాన్నే తింటాను. ఆ విధంగా పలికి పులి అడవిలోకి వెళ్ళిపోయింది. ఆ సమయంలోనే ఎలుక అక్కడకు వచ్చింది. దానిని చూచి నక్క ఇలా అన్నది. 'మూషికమా! నీకు మేలగుగాక! నెమలి ఒక మాట అన్నది. దానిని చెపుతా విను. నేను జింకమాంసాన్ని తినను. ఇది విషప్రాయం. కాబట్టి తమరు అనుమతిస్తే నేను ఎలుకను తింటాను.' ఆ మాట విని, భయపడి ఎలుక పారిపోయి కలుగులో

దూరింది. ఆ తర్వాత తోడేలు స్నానం చేసి అక్కడకు వచ్చింది. దగ్గరకు వచ్చిన తోడేలుతో నక్క ఇలా అన్నది. 'మృగరాజుకు నీ మీద బాగా కోపంగా ఉంది. నీకేదో కీడు మూడుతోంది. అది భార్యతో సహా ఇక్కడకు రాబోతోంది. ఏం చేస్తే బావుంటుందో ఆలోచించి చేయి.' నక్క ఆవిధంగా అనగానే పచ్చిమాంసం తినే ఆ తోడేలు ఎగిరి దూకి పారిపోయింది. అంతలోనే నెమలి అక్కడకు వచ్చింది. అప్పుడు నక్క ఆ అడవిలో నెమలితో ఇలా అన్నది- 'నాబాహుబాలనికి ఓడిపోయి మిగిలిన వారంతా ఎటో వెళ్లిపోయారు. నీవు నాతో యుద్ధం చేసి గెలిచి స్వేచ్ఛగా మాంసం తినవచ్చు.' నెమలి ఇలా అన్నది- 'మృగరాజా, తోడేలూ, తెలివిగల ఎలుక - ఈవీరుల నందరినీ నీవు ఓడించావు కాబట్టి నీవు మహావీరుడవు. నీతో యుద్ధం చేసే ఉత్సాహం నాకు లేదు.' ఆ మాట అని నెమలి కూడా వెళ్ళిపోయింది. ఈవిధంగా అవన్నీ వెళ్ళిపోతే తన ఆలోచన ఫలించినందుకు ఆనందించి నక్క అప్పుడు ఒంటరిగా మాంసాన్ని భుజించింది.

నిత్యం ఈ విధంగా ప్రవర్తిస్తూ రాజు సుఖంగా ఉంటూ వృద్ధిచెందవచ్చు. పిరికివారిని భయపెట్టాలి. వీరులకు మ్రొక్కి లొంగదీసికోవాలి. పేరాస గలవానిని డబ్బుతో వశపరచుకోవాలి. తక్కువ వారినీ, తనంతవారినీ పరాక్రమంతో లొంగదీయాలి. రాజా! ఇంత వివరంగా నీకు చెప్తున్నాను. మరొక మాట కూడా విను. రాజు ఐశ్వర్యాన్ని కోరుతుంటే కుమారుని అయినా, మిత్రునయినా, సోదరునైనా, తండ్రినయినా, గురువునయినా సరే శత్రుస్థానంలో నిలిస్తే సంహరించాలి. ధనమిచ్చి కానీ, విషంపెట్టి కానీ, మాయలు పన్ని కానీ, మాటలతో బెదిరించి కానీ శత్రువును చంపవలసినదే. ఏవిధంగానూ ఉపేక్షించతగదు. ఇద్దరు రాజుల మధ్య గెలుపు అటుఇటుగా ఉన్నప్పుడు శ్రద్ధగలవాడే గెలుస్తాడు. అహంకరించి, కర్తవ్యాకర్తవ్యాలను గ్రహించక దారితప్పి ప్రవర్తిస్తే గురువునైనా దండించవలసినదే. కోపం ఉన్నా లేనట్టు కనిపించాలి. చిరునవ్వుతో పలుకరించాలి. కోపంతో ఎప్పుడూ ఎవ్వరినీ తిరస్కరించకూడదు. ధృతరాష్ట్రా! శత్రువును దెబ్బతీయదలచినపుడు, దెబ్బతీస్తున్నప్పుడూ కూడా ప్రియంగానే మాటాడాలి. దెబ్బ తీసిన తరువాత కూడా దయచూపాలి. అతనికై దుఃఖించాలి, రోదించాలి కూడా. శత్రువును అనునయించి, ధర్మాన్ని బోధించి, ధనాన్ని ఇచ్చి, మంచిగా వ్యవహరించి, బాగా నిదానింపజేయాలి. సమయం వచ్చినపుడు ఆ శత్రువు దారి తప్పి ఉంటే సంహరించాలి. ధర్మాన్ని అనుసరించి ప్రవర్తిస్తుంటే తీవ్రమయిన అపరాధం చేసినా నీలిమేఘాలు పర్వతాన్ని కప్పివేసినట్టు ఆ దోషం మరుగున పడిపోతుంది. ఎవరినైనా సత్వరమే చంపవలసి వస్తే అతని ఇంటిని తగులబెట్టాలి. దరిద్రులనూ, నాస్తికులనూ, దొంగలనూ తన రాజ్యంలో నిలువనీయరాదు.

శత్రువు దగ్గరకు వస్తే ఎదురేగటం, ఆసనభోజనాదులతో ఆదరించటం, ఏదైనా వస్తువును కానుకగా ఇవ్వటం అతనిలో నమ్మకాన్ని కలిగిస్తాయి. నమ్మకం కలిగిన తర్వాత అవసరమైతే చంపివేయాలి. పాము కర్కశమైన కోరలతో కాటువేసినట్టు దెబ్బతీయాలి. ఇబ్బంది లే దనుకొనే వారినికూడా అనుమానిస్తూనే ఉండాలి. ఇబ్బంది పెడతా డనుకొనే వారి విషయంలో ఇంకా జాగరూకతతో ఉండాలి. అనుమానించదగిన వాడు భయానికి కారకుడయితే సర్వనాశనం చేయగలుగుతాడు. **నమ్మదగని వానిని నమ్మరాదు. నమ్మినవారిని కూడా పూర్తిగా నమ్మరాదు. నమ్మినవాడిద్వారా కలిగే భయం సమూలంగా నాశనంచేస్తుంది.*** తనరాజ్యంలో కానీ, శత్రురాజ్యంలో కానీ చక్కని గూఢచారులను ఏర్పాటు చేసికోవాలి. శత్రుక్షేత్రంలో వేదబాహ్యమైన ఆచారాలు గల సంన్యాసులనూ, తాపసులనూ గూఢచారులుగా నియమించుకోవాలి. ఉద్యానవనాలలో, విహారక్షేత్రాలలో, దేవాలయాలలో, పానగృహాలలో, సందుగొందులలో, సమస్తతీర్థాలలో, చౌరస్తాలలో, బావులదగ్గరా, పర్వతాలమీదా, అడవులలో, నలుగురూ కలిసే ప్రదేశాలలో, నదులలో గూఢచారులు సంచరిస్తూ ఉండాలి.

రాజు బాగా వినయశీలుడై మాటాడాలి. మనస్సుమాత్రం కత్తిలా ఉండాలి. ఎంత భీకరకార్యాన్ని తలపెట్టినా చిరునవ్వు నవ్వుతూనే మాటాడుతూ ఉండాలి. అవసర మయితే చేతులు జోడించాలి. శపథాలు చేయాలి. అనునయించాలి. తలవాల్చి కాళ్ళకు మ్రొక్కాలి. ఆశ చూపాలి. ఐశ్వర్యాన్ని పొందగోరిన రాజుకు ఇవన్నీ కర్తవ్యాలే. పుష్పించినా ఫలించదు. ఫలించినా అవి అందవు. పచ్చివయినా పండులా కనిపిస్తాయి. అటువంటి వృక్షంలాగానే రాజు ప్రవర్తించాలి. ఎట్టి పరిస్థితిలోనూ తాను మాత్రం శిథిలం కాకూడదు. ధర్మార్థకామరూపమైన పురుషార్థాలను సేవించటంలో మూడు బాధలూ ఉంటాయి. మూడు ఫలితాలూ ఉంటాయి. ఫలితాలు శుభకరాలే. కానీ బాధలను వదిలించుకొనగలగాలి. ధర్మాన్ని పాటిస్తున్నవానికి అర్థకామాల ద్వారా బాధ కలుగుతుంది. అర్థాసక్తుడైన వానికి ధర్మకామాల ద్వారా పీడ ఏర్పడుతుంది. భోగాసక్తి అధికమైన వానికి ధర్మార్థాల ద్వారా ఇబ్బంది వస్తుంది. రాజు అహంకారాన్ని పరిత్యజించి, సావధానుడై, అనునయపూర్వకంగా మాటాడుతూ, అసూయను వీడి, సర్వవిషయాలనూ పరిశీలిస్తూ, శుద్ధచిత్తుడై బ్రాహ్మణులతో కలిసి ఆలోచించాలి. కష్టంవస్తే తనను తాను ఉద్ధరించుకోవాలి. దానికై మృదుకర్మ

---

* వ విశ్వసేదవిశ్వస్తే విశ్వస్తే వాతివిశ్వసేత్ ।
విశ్వాసాద్ భయముత్పన్నం మూల్యాన్యపి నికృంతతి ॥ 62

కయినా, దారుణకర్మ కయినా సిద్ధపడాలి. సామర్థ్య ముంటే మాత్రం ధర్మమార్గాన్నే అవలంబించాలి. **కష్టపడనివాడు సుఖాలను పొందలేడు.** ప్రాణసంకటంలో పడినప్పుడు బ్రతికి బయటపడితే సుఖభోగాలను చవిచూడగలుగుతాడు.

మనస్సు కలతపడినవారిని గతాన్ని గుర్తుచేస్తూ ఓదార్చాలి. దుర్బుద్ధిని భవిష్యత్తు మీద ఆశ చూపి, శాంతింపజేయాలి. పండితుని సమయోచిత కృత్యాలతో ఆదరించాలి. **శత్రువుతో సంధిచేసికొని పని ముగిసిపోయినట్టుగా పడుకొన్నవాడు చెట్టుకొమ్మపై నిదురిస్తున్న వాడితో సమానం. పడితే కానీ మెలకువ కలుగదు.** రాజు ఇతరులలోని దోషాలను ఎత్తిచూపకూడదు. తన మంత్రాంగాన్ని ఎప్పుడూ రహస్యంగా ఉంచుకోవాలి. శత్రుగూఢచారులకు తన ఆనుపానులు తెలియనీయరాదు. తన గూఢచారులతో కూడా తాను బయటపడకుండానే వ్యవహరించాలి. రాజు మత్స్యకారుని వంటివాడు. శత్రువుల మర్మాలను విచ్ఛిన్నం చేయకుండా, దారుణకర్మలు చేయకుండా మహైశ్వర్యాన్ని పొందాలంటే వీలుకాదు. శత్రుబలం దుర్బలమో, రోగ్రగ్రస్తమో అయి కలతపడి, తిండీ, నీరూ దొరకని స్థితిలో ఉండి, అంతా బాగానే ఉందని నమ్మి నిశ్చేష్టంగా ఉన్నప్పుడు దానిపై దాడిచేయాలి. ధనవంతుడు మరొక ధనవంతుని దగ్గరకు పోడు. పనిలో కృతార్థుడైన వాడు పరుల మైత్రిని కోరడు. కాబట్టి ఏ పని నయినా సరే సగం మాత్రమే చేయాలి. సంపదలు కోరే రాజు అసూయకు లోను కాకుండానే సంధికైనా, యుద్ధానికైనా ప్రయత్నించాలి. తానెప్పుడూ ఉత్సాహంగా ఉండేందుకే ప్రయత్నించాలి. మిత్రు లయినా, శత్రువులయినా రాజు ఎప్పుడేమి చేస్తాడో తెలియగూడదు. ప్రారంభించిన పని లేదా సమాప్తమయిన పని మాత్రమే వారికి కనిపించాలి.

తనమీదకు ఏదీ రానంతవరకూ ఏమి వస్తుందో అని భయపడుతూ ఏర్పాట్లు, చేసికోవాలి. భయకారణం దగ్గర పడ్డప్పుడు మాత్రం నిర్భయంగా దాని నెదిరించి శత్రువును దెబ్బతీయాలి.* దండనీతితో లోబరుచుకొన్న శత్రువుపై దయ చూపటమంటే రాజు మృత్యువును ఒడిగట్టుకొన్నట్టే. అది కంచరగాడిద గర్భాన్ని ధరించటం వంటిది. భవిష్యత్తులో చేయవలసిన పనిని గూర్చి ముందుగానే ఆలోచించి తదనుకూలంగా ఏర్పాట్లు చేసికోవాలి. సమాపించిన పని విషయంలో కూడా ఆరీతిగానే ప్రవర్తించాలి. బాగా ఆలోచించకుండా ఏ పనినీ పరిత్యజించదగదు. ఐశ్వర్యాభిలాష గల రాజు దేశకాలాల

---

* **భీతవత్ సంవిధాతవ్యం యావద్ భయమనాగతమ్ ।**
ఆగతం తు భయం దృష్ట్వా ప్రహర్తవ్యమభీతవత్ ॥ 82

ననుసరించియే ప్రయత్నపూర్వకంగా కర్తవ్యోన్ముఖుడు కావాలి. దేశకాలాలకు అను గుణంగానే దైవ, ధర్మ, అర్థ, కామాలను సేవించాలి. నీతిశాస్త్రానుసారంగా దేశకాలాలే శ్రేయస్సాధనలో ప్రధాన హేతువులు. శత్రువు చిన్నవాడు కదా అని ఉపేక్షిస్తే వాడే తాటిచెట్టులా ఎదిగి, అడవిలో పుట్టిన అగ్నిలాగా అచిరకాలంలోనే మహావినాశనాన్ని కల్గించగలడు.

నిప్పురవ్వను మెల్లగా రాజుకొననిచ్చినట్లు తనను కూడా క్రమంగా వృద్ధిపరచుకొనిన రాజు ఎదిగి, ఆదనులో శత్రువు లనే ఎంత ఇంధనాన్ని అయినా మ్రింగివేయగలడు. పెట్టిన ఆశను కాలాధీనం చేయాలి. కానీ వెంటనే తీర్చకూడదు. తీర్చవలసిన సమయం వచ్చినపుడు ఏదో ఒక ఆటంకాన్ని కల్పించి వ్యవధిపెంచాలి. తగిన కారణాన్ని చూపి ఆటంకాలు కల్పించాలి. ఆ కారణం యుక్తియుక్తం కావాలి. లోహంతో చేసిన చురకత్తిని పదునుపెట్టి చర్మంలో చుట్టిపెడితే అవసరపడినపుడు అది వెంట్రుకలు ఖండించగలుగుతుంది. అదేవిధంగా రాజు సర్వసన్నద్ధుడై ఉండి తగినవేళలో శత్రువులను సమూలంగా నరికివేయాలి. కురుశ్రేష్ఠా! పాండవుల విషయంలో అయినా ఇతరుల విషయంలో అయినా ఈ రాజనీతి ననుసరించియే ప్రవర్తించాలి. నీవు మునిగిపోకుండా ఉండేటట్లు వ్యవహరించాలి. నీవు సర్వకళ్యాణసాధన సంపన్ను డవని అందరూ భావిస్తున్నారు. కాబట్టి మహారాజా! నిన్ను నీవు పాండుకుమారుల నుండి రక్షించుకోవాలి. మహారాజా! నీతమ్ముని కొడుకులు పాండవులు మిక్కిలి బలవంతులు. కాబట్టి నీవు పశ్చాత్తాపపడవలసిన అవసరం కలుగకుండేటట్లు నీతిమార్గాన్ని అనుసరించు." ఈవిధంగా పలికి కణికుడు తననివాసానికి వెళ్ళిపోయాడు. కురువంశోత్థుడైన ధృతరాష్ట్రుడు శోకంతో కలతపడ్డాడు.

140. పాండవుల పట్ల పురజనుల ప్రేమమచూచి దుర్యోధనుడు విచారించుట.

తరువాత శకుని, దుర్యోధనుడు, దుఃశాసనుడు, కర్ణుడు, దుర్మార్గమైన రహస్యసమాలోచన చేశారు. వారు ధృతరాష్ట్రుని ఒప్పించి, కుంతిని కుమారులతో సహా అగ్నికి ఆహుతి చేయాలని తలచారు. తత్త్వవేత్త అయిన విదురుడు వారి చేష్టల భావాన్ని గ్రహించగల వాడవటం చేత దుర్మార్గులైన వారి ఆకారం చేతనే వారి రహస్యసమాలోచనను తెలిసికొన్నాడు. తర్వాత జ్ఞాని అయిన విదురుడు పాండవులకు మేలుచేయగోరి, తనకుమారులతో కుంతిని ఆ ప్రదేశంనుండి తప్పింపవలెనని భావించాడు. తరువాత గాలితాకిడికి, తరంగాల ఒత్తిడికి, తట్టుకొనగల్గిన యంత్రాలతో కూడి; జెండాలుకల

దృఢమైన నౌకను తయారు చేయించి కుంతితో విదురు డిలా అన్నాడు. "దేవీ! ధృతరాష్ట్రుడు కురువంశ కీర్తిప్రతిష్ఠలనూ, వంశాన్నీ, నశింపచేసేవాడు. తన కుమారులమీది పక్షపాత బుద్ధిచేత శాశ్వతమైన ధర్మాన్ని విడుస్తున్నాడు. అమ్మా! ఈ నౌక వాయుతరంగాల ధాటికి నిల్వగల్గినది. జలమార్గాన చక్కగా ప్రయాణిస్తుంది. ఈనౌకద్వారా, మీరు మృత్యుపాశంనుండి బయట పడతారు." యశస్వినియగు కుంతి, ఇది విని, మిక్కిలి బాధపడింది. ఆమె తన కుమారులతో కూడా ఆ నౌకలో గంగానదిలో ప్రయాణం సాగించింది. పిదప విదురుని మాటచొప్పున, పాండవులు తాము ప్రయాణించిన నౌకను ధ్వంసం చేసి, వారు సమకూర్చిన ధనాన్ని తీసికొని, నిరపాయంగా అరణ్యానికి వెళ్ళారు. వారణావతంలో ఉన్న లక్క ఇంటిలో, కారణాంతరాలవల్ల నిలిచియున్న బోయస్త్రీ, ఏతప్పు చేయకపోయినా, తన ఐదుగురు పుత్రులతో పాటు కాలిపోయింది. పాపి, మ్లేచ్ఛాధముడు అయిన పురోచనుడు లక్కయింటిలో కాలిపోయాడు. దుర్మార్గులైన ధృతరాష్ట్రపుత్రులు, వారి అనుచరులు, మోసగింపబడ్డారు. విదురుని సలహాతో, మహాత్ములైన కుంతికుమారులు తల్లితో సహా విముక్తిని పొందారు. వారు ఏవిధమైన హానీ పొందలేదు. జనసామాన్యానికి వారివివరాలు తెలియలేదు. వారణావతంలోని జనమంతా కాలిపోయిన లక్క యింటిని చూచి, దుఃఖితులై పాండవుల కోసం పరితపించారు. ధృతరాష్ట్రా! నీ గొప్పకోరిక నెరవేరింది. పాండవులను బూడిద చేశావు. ఇక నీవు రాజ్యాన్ని పుత్రులతోపాటు అనుభవించు, ఆనందించు! అంటూ జరిగిన దానిని యథాతథంగా ధృతరాష్ట్రునకు చెప్పిపంపారు. అది విన్న ధృతరాష్ట్రుడు, తనపుత్రులతోపాటు శోకిస్తూ.... బంధువులతో కూడి, విదురుడు, కురుశ్రేష్ఠ డయిన భీష్ముడు, పాండవులకు ప్రేతకార్యాలను (దహనం, శ్రాద్ధం మొదలైనవాటిని)జరిపించారు.

జనమేజయుడిలా అన్నాడు. బ్రాహ్మణోత్తమా! లక్కయిల్లు మాత్రమే దహింపబడటం, పాండవులు విముక్తిని పొందటం–ఈవిషయాలను సవిస్తరంగా వినాలని ఉన్నది. కౌరవులు చేసిన ఈ పని మిక్కిలి క్రూరమైనదీ, నీచమైనది. దీన్నంతటినీ యథాతథంగా వివరించు. నాకు దీన్ని వినాలనే కుతూహలం అమితంగా ఉంది.' వైశంపాయనుడిలా అన్నాడు. 'రాజా! లక్కయిల్లు కాలిపోవటం, పాండవులు బయటపడటం అనే విషయాలను విపులంగా వివరిస్తాను, శ్రద్ధగా విను. భీముడు అందరిలో బలాధికుడు. అర్జునుడు శస్త్రవిద్యలో నేర్పరి. అది తలచుకొంటూ దుర్మనస్కుడయిన దుర్యోధనుడు పరితపించిపోయాడు. అప్పుడు సూర్యపుత్రుడు కర్ణుడు, సుబల సుతుడు శకుని, వివిధోపాయాలతో పాండవులను చంపాలని భావించారు. పాండవులుకూడా విదురుని సలహా సంప్రదింపులతో, కౌరవుల

చర్యలకు ప్రతీకారాన్ని చేస్తూ వచ్చారు. కాని జరిగే విషయాలను మాత్రం బయటపెట్టలేదు. భారతా! ఆ రోజుల్లో పురజనులు పాండవుల గుణ సంపదను చూసి, సభల్లో సమావేశాల్లో వారి గుణగణాలను ప్రస్తుతించడం ప్రారంభించారు. వారు వీథుల్లోకూడా, పాండుపుత్రుల్లో పెద్దవాడైన ధర్మరాజుకు రాజ్యాన్ని అప్పగించే కాలం దగ్గరలో ఉందని చెప్పుకోసాగారు. ధృతరాష్ట్ర మహారాజు కన్నులులేనికారణంగా పూర్వం రాజ్యాధికారాన్ని పొందలేక పోయాడు. ప్రజ్ఞయే కన్నులుగాకల అతడు ఇప్పుడు మాత్రం రాజు ఎలా అవుతాడు? సత్యసంధుడై గొప్పవ్రతనిష్ఠకల శంతనుపుత్రుడు భీష్ముడు, పూర్వమే రాజ్యాన్ని తిరస్కరించాడు. అతడెప్పటికీ రాజ్యాన్ని తిరిగి స్వీకరించడు. పాండు సుతులలో జ్యేష్ఠుడు ధర్మరాజు. యువకుడైనా పెద్దరికం కలవాడు, సత్యమూ,దయ కలవాడు. వేదవేత్త. ఇపుడతనికి రాజ్యాభిషేకం చేద్దాం. అతడు సకలధర్మవేత్త. శంతను పుత్రుడు భీష్మునీ, పుత్రులతోసహా ధృతరాష్ట్రునీ పూజిస్తూ వారికి సకలభోగాల్నీ సమకూరుస్తాడు.

యుధిష్ఠిరుని ప్రేమించే ప్రజల ఈమాటలు విన్న దుర్యోధనుడు దురాలోచనలతో పరితపించాడు. దుర్మార్గుడు, పరితప్తుడు అయిన దుర్యోధనుడు, వారిమాటలు సహించలేక పోయాడు. అసహనంతో దుఃఖితుడై ధృతరాష్ట్రుని దగ్గరకు వెళ్ళాడు. తండ్రి ఏకాంతంగా ఉండటాన్ని గమనించి ఆయనను గౌరవించి, పౌరులు ధర్మరాజుపై ప్రకటిస్తున్న అనురాగాన్ని చూచి బాధపడుతూ దుర్యోధనుడు తండ్రితో ఇలా అన్నాడు. తండ్రీ ! పురజనుల సంభాషణల్లో వారి అభిప్రాయాలను విన్నాను. అవి మనకెంతో కీడు కల్గించేవి. వారు నిన్నూ, భీష్మునీ కాదని ధర్మరాజును రాజుగా చేయాలని భావిస్తున్నారు. భీష్ముడు రాజ్యాన్ని స్వీకరించరాదని నిర్ణయించుకొన్నాడు. కాని పురజనులు మనకు మిక్కిలి బాధ కలిగే విధంగా చేయాలని ఆలోచిస్తున్నారు. పాండురాజు తన సద్గుణాలవల్ల తండ్రినుండి రాజ్యాన్ని పొందగలిగాడు. నీవు మాత్రం గ్రుడ్డితనంవల్ల రాజ్యాన్ని పొందలేకపోయావు. ధర్మజుడు పాండురాజురాజ్యాన్ని ఉత్తరాధికారిగా పొందితే, మళ్ళీ రాజ్యాధికారం ధర్మరాజు కొడుక్కీ, అతని నుండి అతనికుమారునికీ పరంపరగా సంక్రమిస్తుంది. రాజా! మన మీ విధంగా పుత్రపౌత్రులతో సహా రాజ్యాధికారాన్ని కోల్పోతాం. లోకమంతా మనల్ని చులకనగా చూస్తుంది. మహారాజా! మనమంతా పరపిండం కోసం ప్రాకులాడకుండా ఉండేటట్లు, నరకంలాంటి దాస్యంలో పడిపోకుండా ఉండేటట్లు మీరు నీతిని అవలంబించవలసి ఉన్నది. రాజా! నీవు ముందుగానే ఈ రాజ్యాన్ని పొందగలిగితే, మేమూ నీకుమారులుగా రాజ్యాన్ని పొందుగలుగుతాము. అప్పుడు అవశులైన లోకులు మనల్ని ఏమీ చేయలేరు.

141. పాండవులను వారణావతమునకు పంపవలెనని దుర్యోధనుని సూచన.

ప్రజ్ఞా నేత్రుడు ధృతరాష్ట్రుడు, తన కుమారుని మాటలు విన్నాడు. కణికుడు చెప్పిన మాటలన్నిటినీ గుర్తు చేసుకొన్నాడు. అతని మనస్సు రెండువిధాలుగా చీలింది. అతడు దుఃఖించాడు. దుర్యోధనుడు, కర్ణుడు, శకుని, దుఃశాసనుడు వీరు నల్గురూ రహస్యంగా మంతనాలు సాగించారు. తర్వాత దుర్యోధనుడు ధృతరాష్ట్రునితో "నాయనా! మనకు పాండవుల భయం ఉండకూడదు. నీవు వారిని ఏదో ఒక మంచి ఉపాయంతో వారణావతపురానికి పంపించు." అన్నాడు. ధృతరాష్ట్రుడు మాత్రం కొడుకు చెప్పిన మాటలు విని, కొద్దిసేపు ఆలోచించుకొని, దుర్యోధనునితో ఇలా అన్నాడు. "పాండురాజు తనజీవితమంతా ధర్మాన్ని గూర్చి యోచించాడు. ధర్మాన్నే ఆచరించాడు. సమస్తబంధువులపట్ల, మిాదుమిక్కిలి నాపట్ల ధర్మంగా ప్రవర్తించాడు. అతడు తనకు సంబంధించిన భోజనాదుల విషయంలో కూడా ఏమీా పట్టించుకొనేవాడు కాదు. ఉత్తమమైన వ్రతంగా ప్రతిరోజు రాజకార్యాలను నాకు నివేదించేవాడు. పాండురాజకుమారుడు యుధిష్ఠిరుడు కూడా తండ్రివలె ధర్మపరాయణుడు. గుణవంతుడుగా లోకంలో ప్రసిద్ధి చెందాడు. పూరువంశీయుల ఆమోదం పొందాడు. అటువంటి యుధిష్ఠిరుని తండ్రితాతలనుండి సంక్రమించిన రాజ్యాన్నుండి మన మెలా దూరం చేయగలం? అందునా అతడు సహాయసంపదలున్నవాడు. పాండురాజు మంత్రులను, సైన్యాన్ని అన్నివేళలా ఆదరించాడు, పోషించాడు. ముఖ్యంగా వారినే కాక, వారిపుత్రులను, మనుమలను కూడా పోషించాడు. నాయనా! సుయోధనా! నగరజనులందరూ పాండురాజుచే అనేకసత్కారాలు పొందారు. వారందరూ యుధిష్ఠిరుని ప్రయోజనం కోసం మనకు, మనబంధువులకు ద్రోహం చేయటానికి వెనుకాడరు."

"తండ్రీ! నీవు చెప్పింది నిజమే. ప్రజావిరోధమనే దోషం గూర్చి నేనూ ఆలోచించాను. కనుకనే ధనంతో, సత్కారాలతో ప్రజలతో మంచి సంబంధాలను నెలకొల్పుకొన్నాను. వారందరూ మనకు ముఖ్యసహాయకు లౌతారు. రాజా! ఈ సమయంలో మంత్రివర్గం, ధనంతో నిండిన కోశాగారం నా అధీనంలో ఉంది. సహాయసంపదలున్న నీవు, వెంటనే మెత్తని ఉపాయంతో పాండవులను వారణావతనగరానికి పంపించు. మహారాజా! రాజ్యమంతా పూర్తిగా నా అధీనంలోకి వచ్చాక కుంతీదేవి తన కుమారులతో పాటు ఈ నగరానికి వస్తుంది." ధృతరాష్ట్రుడిలా అన్నాడు. "దుర్యోధనా! నామనస్సులో కూడా ఈ భావన వస్తూనే ఉంది. కాని ఈ అభిప్రాయం పాపిష్ఠిది కావటం చేత నీలా నేను వివరించలేదు. భీష్ముడు గాని, ద్రోణుడు కాని, విదురుడు కానీ, కృపాచార్యుడు గాని, కుంతీపుత్రుల

ప్రవాసాన్ని ఎన్నడూ అనుమతించరు. కుమారా! కురువంశజు లందరికీ వారూ, మనమూ సమానులమే. అభిమానవంతులు, ధార్మికులు అయిన కురుశ్రేష్ఠులు, మనలో తరతమ భావాన్ని(పక్షపాతాన్ని) అంగీకరించరు. నాయనా! దుర్యోధనా! మనం పాండవులపట్ల భేదభావంతో వ్యవహరిస్తే, మహానుభావులైన కురుకుల శ్రేష్ఠులకు, ప్రపంచానికి కూడా మనం వధ్యుల మవుతాము." వెంటనే దుర్యోధనుడన్నాడు. "తండ్రీ! భీష్ముడెపుడూ మధ్యస్థుడే. ఒక పక్షం పట్టేవాడు కాడు. ద్రోణపుత్రుడు అశ్వత్థామ నాయందు అభిమాన మున్నవాడు. ద్రోణుడూ తనకుమారుని పక్షంలోనే ఉంటా డనటంలో సందేహంలేదు. వీరిద్దరు ఎటుంటే కృపాచార్యుడు అటే ఉంటాడు. అతడెన్నడూ తన బావ ద్రోణుని, మేనల్లుడు అశ్వత్థామను విడిచి పెట్టడు. విదురుని ఆర్థికప్రయోజనాలు మనతో ముడిపడి ఉంటాయి. అతనికి శత్రువులతో రహస్య మైత్రి ఉంది. కాని తానొక్కడే పాండవులకోసం, మనల్ని బాధించడానికి సమర్థుడు కాదు. కనుక నీవు అన్ని శంకలూ వదలి, వెంటనే తల్లితోసహా పాండవులను వారణావతం పంపించే ఏర్పాట్లు చెయ్యి. రాజా! ఈపని చేసి, నాశోకాగ్నిని చల్లార్చు. ఈ శోకాగ్ని నిద్రను దూరంచేస్తుంది, హృదయంలో దిగిన శల్యం వంటిది, మిక్కిలి భయంకర మైనది."

142. ధృతరాష్ట్రుడు పాండవులను వారణావతమునకు పంపుట.

పిదప దుర్యోధనుడు తన తమ్ములతో కూడి, ముఖ్యులైన ప్రజలను, నాయకులను ధనసత్కారాలతో లోబరుచుకొన్నాడు. ధృతరాష్ట్రుని ప్రోత్సాహంతో కొందరు మంత్రులు వారణావతనగరం అందచందాలను నేర్పుగా వర్ణించసాగారు. వారణావత నగరం పరమశివుని క్షేత్రం. ఇంత అందమైన ప్రదేశం మరెచ్చటా కానరాదు. అక్కడ త్వరలో గొప్ప ఉత్సవం జరుగబోతోంది. ఆ పవిత్రనగరం రకరకాల రత్నాలతో నిండినది. ఆ ప్రదేశం మానవుల మనస్సులను మురిపిస్తుంది." ఈ విధంగా ధృతరాష్ట్రుని ప్రేరణతో మంత్రులు అనేక కథలను ప్రచారం చేశారు. రాజా! ఈ విధంగా చెప్పబడుతున్న అందాలనగరం వారణావతాన్ని చూడాలని పాండవులకు కోరిక కలిగింది. ధృతరాష్ట్రుడు "పాండవులకు వారణావతం మీద మక్కువ కల్గింది" అని భావించాడు. అప్పుడు అంబికాసుతుడు వారిని పిలిపించి ఇలా చెప్పాడు.

("బిడ్డలారా!మీరు సకల శాస్త్రాలను చదివారు సమస్త మైన అస్త్రాలను ద్రోణునినుండి కృపాచార్యులనుండి విశేషంగా గ్రహించారు. నేను రాజ్యహితం, రాజకీయవ్యవహారాలు, రక్షణ విషయాలు అన్ని వైపులా ఆలోచిస్తున్నాను.)

మంత్రులు నిత్యం వారణావతం అందచందాలను, నాకు వివరిస్తున్నారు. నాయనలారా! మీరు వారణావతంలో జరుగబోయే ఉత్సవాన్ని చూడాలని భావిస్తే, అందరూ సకుటుంబంగా సేవక గణాలతో కలసి, ఆ నగరంలో దేవతల్లా విహరించండి. అక్కడ మీరు, బ్రాహ్మణులకు గాయకులకు మీకోరిక మేరకు రత్నాలను విలువైన వస్తువులను, తేజస్సులైన దేవతల్లా దానం చేయవచ్చు. ఈవిధంగా కొంత కాలం విహరించి, పరమానందాన్ని అనుభవించి, తిరిగి హస్తినాపురానికి సుఖంగా రావచ్చు." అన్నాడు. యుధిష్ఠిరుడు ధృతరాష్ట్రుని కోరికను గ్రహించాడు. తనకు సహాయం లేకపోవటాన్ని గమనించాడు. అలాగే నంటూ, తన సమ్మతిని ధృతరాష్ట్రునికి తెలియచేశాడు.

పిదప యుధిష్ఠిరుడు భీష్ముని, బుద్ధిశాలి విదురుని, ద్రోణుని, బాహ్లికుని, కురువంశజుడైన సోమదత్తుని కృపాచార్యుని, ద్రోణాచార్యపుత్రుడైన అశ్వత్థామను, భూరిశ్రవుని, ముఖ్యులైన మిగిలిన వారిని, మంత్రులను, తపోధనులైన బ్రాహ్మణులను, పురోహితులను, పౌరులను, కీర్తిశాలినియగు గాంధారిని, (విడివిడిగా) సమీపించి, మెల్లమెల్లగా దీనంగా ఇలా అన్నాడు. "జనాలతో నిండిన సుందరమైన వారణావతనగరానికి ధృతరాష్ట్రుని ఆజ్ఞమేరకు సకుటుంబంగా వెడుతున్నాను. మీరందరూ నిర్మలమైన మనస్సుతో మాకు మేలు జరగాలని ఆశీర్వదించండి. మీ ఆశీస్సులతో మేము వృద్ధిని పొందుతాము. ఏ పాపాలు మాదరికి చేరవు." పాండుసుతుడైన ధర్మజుని పలుకులు విని, కురుశ్రేష్ఠ లందరూ ప్రసన్నులై పాండుకుమారులారా! మార్గంలో మీకంతా మేలే జరగాలి. సమస్తప్రాణులకు శుభం జరగాలి. మీకు అన్నివిధాలా ఎట్టి పరిస్థితుల్లోను చిన్నపాటి కీడుకూడా జరుగకుండుగాక!" అని ఆశీర్వదించారు. పిదప రాజ్యలాభం కోసం శుభాశీస్సులను పొంది, అవసరమైన పనులను పూర్తిచేసుకుని, పాండవులందరూ వారణావతానికి పయనమయ్యారు.

143. పురోచనుడు వారణావతమున లక్కఇల్లు నిర్మించుట.

ధృతరాష్ట్రుడు పాండుకుమారుల కీ విధంగా చెప్పగానే, దుర్మార్గుడైన దుర్యోధనుడు పరమానందాన్ని పొందాడు. దుర్యోధనుడు తన మంత్రియైన పురోచనుని ఏకాంతప్రదేశానికి తీసుకు వెళ్ళి, అతని కుడి చేయి పట్టుకొని, ఇలా అన్నాడు. "పురోచనా! ధనధాన్యాలతో తులతూగుతున్న ఈ భూమండలం నాకు సొంతమైనట్లే నీకూ సొంతం అవుతుంది. కనుక దీన్ని మనం జాగ్రత్తగా రక్షించుకోవాలి. నాకు నీఅంత విశ్వాసపాత్రుడు మరొకడు లేడు. కనుకనే నీతో ఇంత ముఖ్యమైన విషయాన్ని సంప్రదిస్తున్నాను. నీసహాయాన్ని

అర్థిస్తున్నాను. పురోచనా, నారహస్యాన్ని రక్షించు. నా శత్రువులను నాశనం చెయ్యి. నేను చెప్పిన దాన్ని నీవు నేర్పుగా సాధించాలి. ధృతరాష్ట్రుడు పాండవులు వారణావతానికి పంపాడు. ధృతరాష్ట్రుని ఆజ్ఞ మేరకు అచట ఉత్సవాల్లో వారు విహరిస్తారు. కంచర గాడిదలను పూన్చి వేగంగా పయనించే రథం ఎక్కి, నేడే వారణావతం చేరుకునేటట్లు ప్రయాణం సాగించు. అక్కడకు వెళ్ళి, నాల్గువైపులా గదులు కల్గిన సురక్షితమైన ఒక గృహాన్ని కట్టించు. అది నగరానికి సమీపంలో ఉండాలి, ఎంతఖర్చు చేసినాసరే, మిక్కిలి అందంగా ఉండాలి.

జనుము, మద్దిచెట్టు జిగురు మొదలైన తేలికగా మండే స్వభావం ఉన్న ద్రవ్యాల నన్నిటినీ ఆ భవననిర్మాణంలో ఉపయోగించు. నెయ్యి, నూనె, కొవ్వు, లక్క వంటి వస్తువులను అధికంగా ఉపయోగించి, వాటిని మట్టిలో కలగలిపి గోడలన్నిటి తయారీకి, పైపూతలకు ఉపయోగించు. ఆగృహం అంతటా ఎక్కడ పట్టినా జనుము, నూనె, నెయ్యి, లక్క, చెక్కలు మొదలైన మండే వస్తువులే ఉండేటట్టు చూడు. పాండవులు కానీ, ఇతరులు కానీ ఎంత పరీక్షించినా, ఆ ఇల్లు తగలబడే వస్తువులతో తయారు అయినట్లు తెలియకుండా కట్టించు. అలా కట్టించిన ఇంటిలో పాండవులు, కుంతి బంధుమిత్రులతో కూడి, నివసించే విధంగా ప్రణాళికను సిద్ధం చేయాలి. వారందరినీ నీ సపర్యలతో సమ్మోహపచేయాలి. ఆ భవనంలో కుర్చీలు, ప్రయాణసాధనాలు, తల్పాలు అన్నీ దివ్యంగా ఉండాలి. వాటిని గూర్చి విన్న నా తండ్రి పరమానందపడాలి. పాండవులు సంతోషించాలి. వారణావతనగరం లోని ప్రజలు, ఎంత మాత్రం దీన్ని గమనించ కుండా ఉండేవిధంగా పని అంతా సాగిపోవాలి, ఇదంతా అనుకొన్న సమయానికి పూర్తి కావాలి. పాండవులు నిన్ను పరిపూర్ణంగా నమ్మిన తరువాత, వారందరూ నిర్భయంగా నిద్రించి ఉన్న సమయంలో, అన్ని ద్వారాలనుండీ లోనికి ప్రవేశించేవిధంగా నీవు ఆ ఇంటికి నిప్పు పెట్టాలి. జను లందరూ, ప్రమాదవశాత్తు పాండవులు సొంత ఇంటిలో అగ్నికి ఆహు తయ్యారని భావించాలి. పాండవుల ఆపదలో మన ప్రమేయం ఉన్నట్లు ఎవరూ భావించరాదు. మనను అసహ్యించుకోరాదు." పురోచనుడు అలానే చేస్తానని దుర్యోధనుని ముందు శపథం చేసి, కంచర గాడిదలు పూన్చిన వేగవంతమైన రథం ఎక్కి వారణావతం వెళ్ళాడు. ఆ పురోచనుడు, దుర్యోధనుని వ్యూహం ప్రకారం, చెప్పింది చెప్పినట్లు అంతా పూర్తిచేశాడు.

144. పాండవుల వారణావత ప్రయాణము-విదురుని రహస్యోపదేశము.

పాండవులు వాయువేగంకల మంచి గుర్రాలు పూన్చిన రథాలను అధిరోహించడానికి ముందు, దుఃఖితులవలె, భీష్మునికి పాదాభివందనం చేశారు. అదేవిధంగా ధృతరాష్ట్రమహారాజు, ద్రోణాచార్యుడు, కృపాచార్యుడు, విదురుడు, ఇతరులైన పెద్దల పాదాలకు నమస్కరించారు. ఈవిధంగా నియమదీక్షకల పాండవులు, కురువృద్ధులందరికీ నమస్కరించి, సమానులను కౌగలించుకొని, బాలురచే నమస్కరింపబడుతూ బయలుదేరారు. పాండవులు తల్లులందరికీ ప్రదక్షిణం చేశారు. వారివద్ద, మంత్రులు, ప్రజాముఖ్యుల వద్ద సెలవు తీసుకొని వారణావతానికి బయలు దేరి వెళ్ళారు. గొప్ప ప్రజ్ఞగల విదురుడు, కొందరు కురుశ్రేష్ఠులు, పౌరులు దుఃఖితులై పురుషశ్రేష్ఠులైన పాండవులను అనుసరించారు. భయపడని కొందరు బ్రాహ్మణులు, పాండవులదైన్యాన్ని చూచి, మిక్కిలి దుఃఖితులై ఇలా అన్నారు.

'మందమతి, కురువంశజుడు అయిన ధృతరాష్ట్రమహారాజు పాండవులను పక్షపాతబుద్ధితో చూస్తున్నాడు. ధర్మం గురించి ఎంతమాత్రమూ ఆలోచించటం లేదు. పుణ్యాత్ముడు యుధిష్ఠిరుడు, బలవంతుడు భీమసేనుడు, అర్జునుడు పాపకార్యాలను ఇష్టపడరు. మహాత్ములైన నకులసహదేవులు కూడా పాపాన్ని ఎలా చేస్తారు? తండ్రినుండి సంక్రమించిన రాజ్యాన్ని పాండవులు పొందటం ధృతరాష్ట్రుడే సహించలేకున్నాడు. ఇందులో వారిపాపం లేదు. ఇది చాలా అధర్మం. ఆ సమయంలో కానిప్రదేశానికి పాండవులు పంపించబడుతుంటే భీష్ముడు, ఈ అధర్మాన్ని ఎలా అంగీకరిస్తాడు? శంతనుపుత్రుడు, రాజర్షి అయిన విచిత్రవీర్యుడు, కురునందనుడు పాండురాజు, పూర్వం మాకు(ప్రజలకు) తండ్రివలె ఉండి పరిపాలన సాగించారు. అటువంటి పురుషశ్రేష్ఠుడైన పాండురాజు కీర్తిశేషుడు కాగానే, బాలురైన పాండవులను ధృతరాష్ట్రుడు చూసి సహించలేక పోతున్నాడు. ఇది మాకు సమ్మతం కాదు. కనుక ఈ హస్తినాపురాన్ని, మాఇళ్ళను వదలి మేమందరం యుధిష్ఠిరుడున్న చోటికే వెళ్ళిపోతాము.'

ఆ విధంగా దుఃఖితులై మాట్లాడుతున్న పురజనులతో, ధర్మప్రభువైన యుధిష్ఠిరుడు బాగా ఆలోచించి, ఇలా అన్నాడు. "ఆర్యా! తండ్రి, గౌరవించదగ్గవాడు, పెద్దవాడు, శ్రేష్ఠుడు అయిన ధృతరాష్ట్రమహారాజు ఏమిచెపితే అది సందేహించకుండా నెరవేర్చాలన్నది మా వ్రతం. అయ్యా! మీరందరూ మాకు మిత్రులు. మీహృదయాలు మంచివి. మమ్మల్ని ఆశీర్వదించండి. మా మీద గౌరవం చూపించారు. బాగుంది. ఇక మీతో సాధించవలసిన పని ఏర్పడినప్పుడు, మీరు మాకు ప్రియాన్ని, మేలును తప్పక చెయ్యగలరు." యుధిష్ఠిరుని మాటలు విన్న పౌరులు, వారికి గౌరవ సూచకంగా ప్రదక్షిణంచేసి, వారిని ఆశీస్సులతో

ఆనందపరిచి, తిరిగి నగరానికి వెళ్ళారు. పురజనులందరూ మరలిపోగానే, సత్యధర్మాలు తెలిసిన విదురుడు, పాండవ శ్రేష్ఠుడైన ధర్మరాజుకు హితబోధ చేయసాగాడు. ముందు వెనుకల నెరిగి బుద్ధిమంతుల మాటలలోని మర్మాన్ని గ్రహించగల విదురుడు, ముందు వెనుకలు తెలిసి, బుద్ధిమంతుల మాటలలోని మర్మాన్ని గ్రహించగలిగిన ధర్మరాజుతో, సామాన్యులకు సామాన్యంగాను, మర్మవిదులకు విశేషంగాను అర్థాన్ని ఇచ్చే విధంగా ఇలా అన్నాడు. "నీతిశాస్త్రానికి అనుగుణమైన పరుల బుద్ధిని ఎరిగినవాడు, దాన్ని తెలుసుకొని, ఆపదలనుండి తప్పించుకొనేవిధంగా ప్రవర్తించవలసి ఉంటుంది.

లోహాలతో నిర్మించబడి, శరీరాన్ని కోసే వాడియైన ఆయుధాన్ని తెలుసుకొనే నేర్పున్నవారిని, శత్రువు హింసించలేడు. ఎండుగడ్డిని, ఎండిన అరణ్యాల్ని, చలిని సంహరిస్తుంది అగ్ని. కాని పరులకు, కానరాని కలుగులోనున్న ఎలుకలను దహించలేదు. తనను తాను రక్షించుకోగలవాడు మాత్రమే జీవించగలడు. కళ్ళు లేనివాడు మార్గాన్ని తెలుసుకోలేడు. **నేత్రం లేనివాడికి దిక్కులు తెలియవు. ధైర్యం లేనివాడు బుద్ధిమంతుడు కాలేడు.** ఈప్రబోధాన్ని జాగ్రత్తగా అర్థంచేసుకో. ఆప్తులు కానివారు ఇచ్చిన, అలోహమైన ఆయుధాన్ని ఏనరుడు స్వీకరిస్తాడో, వాడు కుక్క స్వభావాన్నెరిగి ప్రవర్తించినపుడే అగ్నినుండి బయటపడగల్గుతాడు.(కుక్క రాత్రివేళతక్కువగా నిద్రిస్తుంది. అప్రమత్తంగా ఉంటుంది). తిరుగుతూ ఉంటే మార్గాలు తెలుస్తాయి. నక్షత్రాల్ని చూసి దిక్కులను గ్రహించవచ్చు. తాను తన జ్ఞానేంద్రియాలను అప్రమత్తంగా ఉంచుకొంటే పరులచే బాధింపబడడు." విదురుని మాటలు విన్న ధర్మప్రభువు పాండుకుమారుడు యుధిష్ఠిరుడు, విద్వాంసులలో మిన్నయైన విదురునితో **'నీవు చెప్పింది నాకు తెలిసింది'** అని చెప్పాడు.

ఈ విధంగా శిక్షణనిచ్చి, కొంతదూరం అనుసరించి, పాండవులకు మర్యాద సూచకంగా ప్రదక్షిణం చేసి, వారికి ప్రయాణానుమతిని ప్రసాదించి, విదురుడు తన ఇంటికి వెళ్ళాడు. భీష్ముడు, పురజనులు, విదురుడు అందరూ మరలి వెళ్ళిన తరువాత యుధిష్ఠిరుని సమీపించి కుంతి ఇలా అన్నది. "నాయనా! జనులమధ్యలో విదురుడు స్పష్టాతిస్పష్టంగా కొన్ని మాటలు చెప్పాడు. నీవుకూడా **తెలిసింది** - అని సమాధానమిచ్చావు. కానీ ఆవిషయాలేవీ మాకు బోధపడలేదు. ఈ విషయం మాకు తెలియదగినదయితే, తెలుసు కోవటంలో తప్పు లేనట్లయితే, నీకూ విదురునకూ మధ్య జరిగిన మాటలు (మర్మాన్ని) వినాలనుకొంటున్నాను." యుధిష్ఠిరుడిలా అన్నాడు. "అమ్మా! గృహాల్లో అగ్ని ప్రమాదం జరగవచ్చుననీ, పయనించబోయేమార్గం లోగడ తెలిసినది కాక పోవచ్చని, కొత్త మార్గంలో పయనించవలసివస్తుందని ధర్మాత్ముడు విదురుడు వివరించాడు. ఇంద్రియ

నిగ్రహంకలవాడు భూమిని తప్పక పొందగలడని విదురుడు చెప్పాడు. నీవు చెప్పిన దాన్ని నేను గ్రహించానని విదురునికి నేను సమాధానం చెప్పాను." జనమేజయా! పాండవులు ఫాల్గున మాసంలో, శుక్ల అష్టమి తిథిలో, రోహిణీ నక్షత్రంలో చంద్రుడున్నపుడు వారణావతానికి బయలుదేరారు. అక్కడ నగరవాసుల్ని చూశారు.

145. పాండవులు లక్క యింట ప్రవేశించుట.

పాండవులు వస్తున్నారనే వార్తను విన్న వారణావతపురప్రముఖులు సర్వమంగళ వాద్యాలతో, మంగళద్రవ్యాలతో ఆలసట విడిచి, అనేక విధాలైన వాహనాల్లో వచ్చి, శాస్త్రప్రకారం పాండవులకు ఎదురేగారు. వారణావతంనుండి వచ్చిన పురజనులు పాండవులను చూచి పరమానందపడ్డారు. వారంతా అక్కడకు వేలసంఖ్యలో వచ్చారు. వారణావతంనుండి వచ్చిన పురప్రముఖులు పాండవులను సమీపించి, జయజయ ధ్వానాలు చేస్తూ, ఆశీస్సుల నందిస్తూ, వారిచుట్టూ గుమిగూడారు. పురప్రముఖులతో కూడిన యుధిష్ఠిరుడు, దేవతలతో పరివేష్టింపబడిన దేవేంద్రునివలె దివ్యంగా ప్రకాశించాడు. పాండవులు పురప్రముఖులచే సన్మానింపబడ్డారు. పాండవులుకూడా పురప్రముఖులను గౌరవించారు. తర్వాత వారందరూ సాలంకృతమై, జనగణాలతో నిండిన వారణావత నగరంలోకి ప్రవేశించారు. పాండవులు, వారణావతంలో ప్రవేశించి, వెంటనే తమతమ ధార్మిక క్రియాకలాపాల్లో నిమగ్నులైన బ్రాహ్మణోత్తముల ఇళ్ళను సందర్శించారు. పాండవులు క్రమంగా నగారాధికారుల ఇళ్ళనూ,రథిక యోధుల ఇళ్ళనూ, వైశ్యుల, శూద్రుల ఇళ్ళనూ కూడా సందర్శించారు. పాండవులందరూ పురప్రముఖుల పూజ లందుకొని పురోచనునితో కూడి, తమకు నివాసమైన ఇంటివద్దకు వెళ్ళారు. పురోచనుడు వారందరికీ తినుబండారాలను, పానీయాలను, శ్రేష్ఠమైన ఆసనాలను, ఆందమైన తల్పాలను, సమకూర్చాడు.

పాండవులు పురోచనునిచే సన్మానింపబడ్డారు. విలువైన వస్తువుల నుపయోగించే పాండవులు నగర జనులచే సేవింపబడి అక్కడ సుఖంగా కాలక్షేపం చేశారు. పాండవులు అక్కడే పదిరోజులు గడిపారు. పదకొండవ రోజున పురోచనుడు 'శివ'మనే పేరుగల అశుభంకరమైన ఇంటిని గూర్చి పాండవులకు నివేదించాడు. పురోచనుడు చెప్పిన మాటల్ని అనుసరించి, పురుషశ్రేష్ఠులైన పాండవులు తమ సంభారాలన్నిటితోను, గుహ్యకులు కైలాసాన్ని ప్రవేశించినట్లు ఆ కొత్త ఇంటిలో ప్రవేశించారు. సమస్త ధర్మాలనూ ఆచరించేవాళ్ళలో శ్రేష్ఠుడు యుధిష్ఠిరుడు. ఆ కొత్త ఇంటిని పరిశీలించి, ఇది అగ్ని గృహమని (తగలబడే స్వభావంకల వస్తువులతో నిర్మించబడ్డఇల్లు) భీమసేనునికి చెప్పాడు. "భీమసేనా! నెయ్యి

లక్కలతో కలగలిసిన కొవ్వు వాసనను పరిశీలిస్తే, ఇది మండే లక్షణాలుగల గృహంగా తెలిసిపోతోంది" అన్నాడు యుధిష్ఠిరుడు. "భీమసేనా! జనుము, గుగ్గిలం, వెదురు, గడ్డి, లక్క జమ్ములాంటి ద్రవ్యాలను నేతితోతడిపి ఈ గృహాన్ని నిర్మించారు. ఈ గృహనిర్మాణశిల్పులు నిర్మాణ కళలో ఆరితేరిన వారు. పురోచనునికి పరమాప్తులు వారు. దీన్ని చాలా నేర్పుగా నిర్మించారు. సుయోధనుని వశవర్తియైన పాపాత్ముడీ పురోచనుడు నమ్మిన నన్ను అగ్నితో బూడిద చేయాలని సంకల్పించాడు. పార్థా! ఈ విషయాన్ని ఆపదను ముందే గ్రహించిన మహాబుద్ధి విదురుడు, ముందుగానే నన్నీవిషయంలో హెచ్చరించాడు. ఎల్లవేళలా మన యోగక్షేమాలు కోరేవాడు విదురుడు. దుర్యోధన విధేయులై రహస్యంగా సంచరించే దుర్మార్గులు ఈ గృహాన్ని నిర్మించారు." భీమసేనుడిలా అన్నాడు. "యుధిష్ఠిరా! ఈ ఇల్లు అగ్నిసంబంధమైనదిగా నీవు భావిస్తే, మనం దీన్ని వదలి పూర్వం మనం నివసించిన ఇంటిలోకే వెళ్ళి ఉందాం!"

యుధిష్ఠిరుడిలా అన్నాడు. "మనం ఇక్కడే నివసించాలని నాకు అనిపిస్తోంది. అయితే మనం దీన్ని అనుమానిస్తున్నట్లు తెలియకూడదు. అప్రమత్తంగా ఉండాలి. ఈ ప్రదేశం నుండి మనకిష్టమైన ప్రాంతానికి చేరుకోవడానికి మనం మార్గాన్ని అన్వేషిస్తూ ఉండాలి. మన ఆకారంలో అనుమానం కన్పిస్తే, ఆ పురోచనుడు, అనుకొన్న దానికంటే ముందుగానే, ఏదో ఒక వంకతో ఇంటిని తగల పెట్టవచ్చు. ఈ పురోచనుడు ధర్మానికి భయపడేవాడుకాదు, నిందకు వెరచేవాడు కాదు. ఈ మూర్ఖుడు సుయోధనుని అదుపులో ఉన్నాడు, కనుక ఏమి చెయ్యటానికైనా వెనుదీయడు. మనం ఇచట దహింపబడితే, తాతగారు భీష్ముడు కౌరవులమీద కోపం చూపిస్తాడు. అలా కాకపోతే, తాతగారికి కౌరవులమీద కోపం ఎందుకు కలుగుతుంది? మనం ఈ లక్క యింటిలో తగల బడితే తాతగారు భీష్ముడు, ఇతర కురుప్రముఖులు, తమ ధర్మంగా భావించి, కౌరవులమీద కోపాన్ని చూపుతారు. మనం ఒకవేళ గృహదహనానికి భయపడి, బహిరంగంగా పారిపోతే, రాజ్యమోహ మున్న దుర్యోధనుడు మనను గూఢచారులద్వారా రహస్యంగా చంపించే ప్రయత్నాలు చేయవచ్చు. అధికారం, అనుయాయులు, ధనబలం ఉన్నవాడు సుయోధనుడు. మనం ఆపదల్లో ఉన్నాం. అనుయాయులు లేరు. ధనమూ లేదు. కాబట్టి అతడు మనను వివిధోపాయాలతో నిశ్చయంగా చంపించి తీరుతాడు. అందువల్ల ఈ పాపి పురోచనుని, ఆ దుర్మార్గుడు సుయోధనుని, మోసగిస్తూ ఇక్కడే మనం నివసించాలి. రహస్యంగా అక్కడక్కడ మరొక నివాసాన్ని ఆశ్రయించాలి. కనుక మనం వేటకోసంగా భూమండలంలో సంచరిస్తూ ఉండాలి. అప్పుడు మనకు ఎక్కడనుండి ఎక్కడకు ప్రయాణించాలన్నా అనేక

మార్గాలు తెలుస్తాయి. ఆ మార్గాలు, మనం ఇక్కడ నుండి బయటపడటానికి ఉపయోగపడతాయి. కనుక మనం భూమిలో సురక్షితమైన ఒక సొరంగాన్ని తయారు చేసుకొందాం. అక్కడ ఊపిరాడటానికి తగిన అవకాశం ఏర్పాటు చేసుకొందాం. అప్పుడు ఈ లక్క ఇల్లు తగలపడినా అగ్నిబాధ మనకు ఉండదు. మనం ఈ పనిని రహస్యంగా సాగించాలి, పురోచనుడు కానీ, ఇతర పౌరులు కాని ఈ విషయాన్ని ఎంత మాత్రం గ్రహించకుండా ఉండేటట్లు మనం అప్రమత్తులుగా ఉండాలి."

146. ఖనకుడు లక్క ఇంటిలో సురంగము నిర్మించుట.

విదురునిమిత్రుడు, సురంగనిర్మాణం పనుల్లో ఆరితేరినవాడు ఒకడు, ఏకాంత సమయంలో పాండవులను సమీపించి ఇలా అన్నాడు. "నన్ను విదురుడు పంపాడు. సురంగ నిర్మాణంలో నాకు మంచి నేర్పు ఉంది. నేను పాండవులకు ప్రియం చెయ్యాలని వచ్చాను. నేను మీకు ఏమి చెయ్యాలో చెప్పండి. విదురుడు నాతో రహస్యంగా చెప్పాడు. పాండవులకు విశ్వాసంతో మేలు చెయ్యాలని విదురుని అభిమతం. ఏం చెయ్యాలో చెప్పండి. కృష్ణపక్షంలో, చతుర్దశినాడు, రాత్రివేళలో, మీ భవనద్వారానికి పురోచనుడు నిప్పు అంటించబోతున్నాడు. పురుషశ్రేష్ఠ లైన పాండవులను, తల్లితో సహా మంటలకు ఆహుతి చెయ్యాలని, దుర్బుద్ధికల దుర్యోధనుడు ప్రయత్నిస్తున్నాడు. యుధిష్ఠిరా! విదురుడు, మ్లేచ్ఛభాషలో కొన్ని విషయాలు నీకు చెప్పాడు. నీవు కూడా విదురుడు చెప్పినదానికి 'అది నిజమే' అంటూ సమాధానం ఇచ్చావు. ఈవిషయం నీవు నన్ను నమ్మటానికి పనికివస్తుంది." సత్యవాది, కుంతీపుత్రుడు అయిన యుధిష్ఠిరుడు ఖనకునితో ఇలా అన్నాడు. "సౌమ్యా! నిన్ను నేను విశ్వసిస్తున్నాను. నీవు విదురునికి మిత్రుడవు, నిర్మలుడవు, విశ్వాసపాత్రుడవు, ఇష్టుడవు. నీకు ఎల్లవేళలా విదురునిపట్ల నిశ్చలమైన భక్తి ఉంది. మాకు చెయ్యవలసిన ఉపకారమేదో, విదురునికి తెలియనిదికాదు.

నీవు విదురునికి ఎలా ఆప్తుడవో అలాగే మాకూ ఆప్తుడవు. మేము విదురునీ, నిన్నూ సమానంగా భావిస్తున్నాం. మేము విదురునికి ఎటువంటివారమో, నీకూ అటువంటివారమే. విదురుడు మమ్మల్ని రక్షిస్తున్నట్లే, నీవు కూడా మమ్మల్ని ఆదుకోవాలి. దుర్యోధనుని ఆజ్ఞమేరకు పురోచనుడు ఈయింటిని అగ్నిని పెంపొందిచే వస్తువులతో మా నాశనం కోసం తయారు చేశాడని నేను భావిస్తున్నాను.

దుర్మతియైన దుర్యోధనుడు పాపాత్ముడు. ఆతనికి సహాయకులు ఉన్నారు. ధనబలం

ఉంది. ఆ పాపి మమ్ము ఎల్లప్పుడూ బాధిస్తూనే ఉన్నాడు. మేము ఈ లక్క్యింటలో కాలిపోతే సుయోధనుడి కోరిక నెరవేరుతుంది. కనుక నీవు ప్రయత్నంచేసి మేము ఈ అగ్ని బాధనుండి తప్పించుకునేటట్లు చెయ్యి. ఈ ఇల్లు దుర్మార్గుడైన ఆ దుర్యోధనుని ఆయుధాగారం. పునాది నుండి ప్రాకారం దాకా ఆర్పటానికి వీలుకాని పదార్థాలతో నిర్మించబడింది. దుర్యోధనుని ఈ దురాలోచనను ముందుగానే విదురుడు పసిగట్టాడు. కనుకనే ముందుగా మమ్ములను హెచ్చరించాడు. విదురుడు పూర్వమే ఊహించిన ఆపద, ఇప్పుడు ఎదురయింది. పురోచనునికి తెలియనివిధంగా మమ్ములను ఈ ఆపదనుండి విడిపించు." ఖనకుడు ఆ విధంగానే చేస్తానని శపథం చేసి ప్రయత్నాన్ని ప్రారంభించాడు. ఆవరణాన్ని పరిశుభ్రం చేసే నెపంతో గొప్ప సురంగాన్ని నిర్మించాడు. ఖనకుడు ఆ యింటి మధ్యలో మరీపెద్దదికాని సురంగాన్ని నిర్మించి, దానికి ద్వారాన్ని ఏర్పాటు చేశాడు. ఆ ద్వారం ఉన్నట్లు ఎవరికీ తెలియనివిధంగా భూమికి సమాంతరంగా నిర్మించాడు. దుర్మార్గుడైన పురోచనుడు పాండవుల ఇంటిద్వారం వద్దనే ఎప్పుడూ నివసిస్తుంటాడు. అతని భయంవల్లనే సురంగం ముఖద్వారం మూసివేయబడింది. పాండవులు రాత్రివేళల్లో అయుధాలు ధరించి అప్రమత్తులుగా ఉంటున్నారు. పగలుమాత్రం ఒక అరణ్యం నుండి మరొక అరణ్యానికి వేటకు వెడుతున్నారు. పురోచనుని మోసగించటానికి పాండవులు, అపమ్మకంతో ఉన్నా నమ్ముతున్నట్లు, దుఃఖంతో ఉన్నా సంతోషంగా ఉన్నట్లు, ఆశ్చర్యకరంగా జీవించసాగారు. ఆ నగరంలో నివసించే పురజనులు పాండవుల విషయాలను ఎంతమాత్రం గమనించలేదు. విదురుని మంత్రియైన ఖనకశ్రేష్ఠునికి మాత్రమే పాండవుల విషయాలు తెలుసు.

147. లాక్షాగృహదహనము - పాండవులు సురంగము ద్వారా తప్పించుకొనుట.

దాదాపు సంవత్సరకాలం పాండవులు అక్కడ నివసించారు. వారందరూ తనను నమ్ముతున్నారని భావించి పురోచనుడు పరమానందపడ్డాడు. పురోచను డా విధంగా సంతోషిస్తుండగా, ధర్మవిదుడు, కుంతీపుత్రుడు అయిన యుధిష్ఠిరుడు భీమార్జున నకుల సహదేవులతో ఇలా అన్నాడు. "పాపాత్ముడైన పురోచనుడు, మనం వానిని పరిపూర్ణంగా నమ్మినట్లు తలుస్తున్నాడు. ఈ నీచుడు చక్కగా మోసగింపబడ్డాడు. ఇది మనం పారిపోవటానికి తగిన కాలం అనుకొంటున్నాను. ఆయుధాగారాన్ని(ఇంటిని), పురోచనుని కూడా తగులబెట్టి,

ఆరుగురిని ఈ ఇంటిలో ఉంచి, ఎవరూ గుర్తించకుండా మనం పారిపోదాము." తర్వాత ఒకరాత్రి దానం నెపంగా కుంతి బ్రాహ్మణులకు భోజనాలు పెట్టింది. అప్పుడు అక్కడకు అనేకమంది స్త్రీలు వచ్చారు. వారందరూ స్వేచ్ఛగా తిని, తాగి, రాత్రి కుంతి అనుమతితో తమ తమ ఇళ్ళకు చేరుకొన్నారు. ఆ విందుభోజనానికి తన ఐదుగురు కుమారులతో కలిసి, ఒక బోయస్త్రీ అన్నంకోసం కాలచోదితురాలై వచ్చింది. ఆమె తన కుమారులతో కూడి మద్యాన్ని అతిగా సేవించింది. మత్తుచే వివశురాలై శరీర స్పృహలేనిదై ఆ గృహంలోనే నిద్రించింది. వారందరూ చచ్చినవారివలె పడిఉన్నారు. జనమంతా నిద్రించిన ఆ సమయంలో పెద్ద సుడిగాలి వీచింది. అప్పుడు భీముడు పురోచనుడు నిద్రించిన ఇంటికి ముందుగా నిప్పుపెట్టాడు. తర్వాత లక్కఇంటి ద్వారానికీ నిప్పంటించాడు. తర్వాత భీముడు, ఆ ఇంటికి అన్నివైపులా నిప్పుపెట్టాడు. ఆ ఇల్లు అన్నివైపులనుండి కాలిపోతుండటం గమనించి శత్రుహంతకులైన పాండవులు, తల్లితోకూడి వేగంగా సురంగంలోకి ప్రవేశించారు. తర్వాత పెద్ద పెద్ద మంటలు, కాలుతున్న శబ్దాలు అంతటా వ్యాపించాయి. అప్పుడు జన సమూహమంతా మేల్కొంది. కాలుతున్న ఇంటిని చూచి దీనమైన ముఖాలతో పురజనులు ఇలా అన్నారు.

"బుద్ధిహీనుడు, పాపాత్ముడు ఐన పురోచనుడు దుర్యోధనుని ప్రేరణతో ఈ ఇంటిని నిర్మించాడు. తగులబెట్టాడు. ఇది అతడి నాశనం కోసమే జరిగింది. అయ్యో! ధృతరాష్ట్రునికి మంచిబుద్ధి కలుగలేదు. అతడు విశుద్ధులైన పాండుపుత్రులను శత్రువులనువలె తగులబెట్టించాడు. పాపాత్ముడూ, దుర్బుద్ధి అయిన పురోచనుడు, ఏపాపం తెలియని పాండవులను - తనను నమ్మిన నరశ్రేష్ఠులను - తగులబెట్టాడు. దైవవశాత్తు వీడు కూడా కాలిపోయాడు." వారణావతంలోని జనులందరూ, ఆ రాత్రివేళ కాలిపోయిన ఇంటిచుట్టూ గుమిగూడి ఈ విధంగా విలపించారు. పాండవులందరూ కూడా తల్లితో కూడి, మిక్కిలి దుఃఖిస్తూ ఆ సురంగం ద్వారా బయటకు వచ్చి, ఎవరూ గుర్తుపట్టకుండా వెళ్ళిపోయారు. శత్రుమర్దనులైన పాండవులు నిద్రలేక పోవటంచేత, తడబాటువల్ల, తల్లితోకూడి వేగంగా ప్రయాణించ లేకపోయారు. భయంకరమైన వేగమూ, పరాక్రమమూ కల భీమసేనుడు మాత్రం తల్లినీ, సోదరులందరినీ మోసుకొనిపోయాడు. ఆమహాబలుడు తల్లిని భుజంమీద, కవలలను తొడలమీద, యుధిష్ఠిరార్జునులను చేతులమీద ఎక్కించుకుని అందరినీ మోసుకుపోయాడు. వాయువేగంకల వృకోదరుడు తన రొమ్ముతో చెట్లను విరుస్తూ, పాదాలతో భూమిని చీలుస్తూ అమితవేగంతో ప్రయాణం సాగించాడు.

148. విదురుడు పంపిన నావికుడు పాండవులను గంగానదిని దాటించుట.

ఇదేసమయంలో పరమజ్ఞాని విదురుడు తన అంతరాత్మ ప్రబోధానుసారం, విశుద్ధచరిత్ర కల ఒకానొక పురుషుని పాండవులున్న అరణ్యానికి పంపాడు. కురునందనా! అతడు అరణ్యంలో సూచింపబడిన ప్రదేశానికి వెళ్ళి, నదీజలం ఎంతలోతుగా ఉన్నదో పరిశీలిస్తున్న పాండవులను, కుంతిని చూశాడు. బుద్ధిశాలి, మహాత్ముడు అయిన విదురునకు, తన చారులద్వారా పాపబుద్ధికల పురోచనుని, దుర్మార్గపు చేష్టలు తెలుస్తూనే ఉన్నాయి. ఆ కారణంగా విదురునిచేత విద్వాంసుడైన పురుషుడొకడు పాండవుల వద్దకు పంపబడ్డాడు. అతడు గంగానదీ తీరంలో, ఒక నౌకను పాండవులకు చూపించాడు. విశ్వసింపదగిన పురుషులచే నిర్మింపబడి, వాయువేగమనోవేగాలతో ప్రయాణిస్తుంది, అన్ని విధాలైన గాలులను తట్టుకొంటూ జెండాలతోను యంత్రాలతోను కూడినది అది. 'మీరు నన్ను విశ్వసించడానికి పనికివచ్చే, విదురుని వచనాన్ని వినవలసింది. పూర్వం మీకు విదురుడు చెప్పిన మాటల్ని జ్ఞాపకంగా చెపుతున్నాను. మహారణ్యంలో కార్చిచ్చు, సమస్తమునూ దహిస్తుంది. చలినీ పోగొట్టుతుంది. అయినా కలుగుల్లో నివసించే ప్రాణులను(ఎలుకలను) చంపలేదు. ఈ విధంగా ఎవడు తన్ను తాను రక్షించుకొంటాడో, వాడు జీవిస్తాడు.

ఈ సంభాషణ రూపంలో ఉన్న గుర్తుచేత, నన్ను విదురుడు పంపిన నమ్మకమైన వ్యక్తిగా భావించండి. సర్వార్థవిదుడు విదురుడు మరొక్కవిషయం కూడా చెప్పమన్నాడు. యుధిష్ఠిరా! నీవు యుద్ధరంగంలో, కర్ణుని, సోదరులతో కూడిన దుర్యోధనుని, శకునిని కూడా జయిస్తావనటంలో సందేహం లేదు. ఈ నౌక జలమార్గంలో ప్రయాణానికి చాలా అనుకూలంగా ఉంటుంది. ఇది నీళ్ళలో సుఖంగా ప్రయాణిస్తుంది. మిమ్మల్నందరినీ ఈ ప్రదేశం నుండి బయటకు చేరుస్తుంది. అన్నాడు ఆ మనిషి ఆ నావికుడు, దుఃఖితులైన వారిని చూసి, తల్లితో సహా పాండవులను నావపై ఎక్కించి, గంగలో ప్రయాణాన్ని కొనసాగిస్తూ, ఈ విధంగా అన్నాడు. "విదురుడు మీఅందరి శిరస్సులను ఆఘ్రాణించి, కౌగిలించుకొని, ఆదరపూర్వకంగా మీ యాత్ర కుశలంగాను, నిర్విఘ్నంగాను జరగాలని పదేపదే కోరుకొన్నాడు. మీఅందరినీ ఆశీర్వదించాడు." ఈ విధంగా నరశ్రేష్ఠులు, వీరులు అయిన పాండవులతో పలికి, నౌకద్వారా వారిని గంగా నదిని దాటించాడు. పిదప అతడు గంగను దాటిన వారందరికీ విజయాశీస్సులు పలికి, ఎలా వచ్చాడో అలాగే తిరిగి వెళ్ళిపోయాడు. మహాత్ములైన పాండవులు తగువిధంగా విదురునికి సందేశం పంపి, గంగను దాటి, ఎవరికంటా పడకుండా వేగంగా, రహస్యంగా ప్రయాణం సాగించారు.

149. ధృతరాష్ట్రాదులు పాండవుల కొఱకు దుఃఖించుట - పాండవుల వనప్రవేశము.

ఆ రాత్రి గడిచాక, వారణావతంలోని పురజను లందరూ పాండవులను చూడటానికి హడావుడిగా లక్క యింటివద్దకు వచ్చారు. అచటి మంటలను ఆర్పుతూ జను లందరూ లక్కయిల్లు, మంత్రిపురోచనుడూ పూర్తిగా తగులబడినట్లు గ్రహించారు. పాపకర్ముడైన దుర్యోధనునిచే, పాండవుల నాశనానికి లక్కయిల్లు తగులబెట్టబడింది. ఇది నిజం' అంటూ అచట చేరిన పురజనులందరూ ఆక్రోశించారు. 'ధృతరాష్ట్రునికి తెలియజేసియే, దుర్యోధనుడు, దాయాదులైన పాండవులను తగులబెట్టాడు. ఇందులో ఎంతమాత్రం సందేహం లేదు. ధృతరాష్ట్రుడు ఈ దుష్కర్మను నిషేధించలేదు గదా! ఈవిషయంలో శంతనుపుత్రుడు భీష్ముడు కూడా ధర్మాన్ని పాటించలేదు. ద్రోణుడు, విదురుడు, కృపుడు ఇతర కౌరవులు కూడా ధర్మాన్ని పాటించలేదు. కనుక మనం దుర్మార్గుడైన ధృతరాష్ట్రునకు "నీవు కోరుకొన్నది జరిగింది. పాండవులను తగులబెట్టావు" అని సందేశాన్ని పంపుదాం.' అనుకొన్నారు. పిదప పాండవుల కోసం అగ్నిశేషాన్ని కదిలించి, పురజనులు తన ఐదుగురు కుమారులతో సహా కాలిపోయిన నిరపరాధను - బోయస్త్రీని చూశారు. ఆ గృహాన్ని శుభ్రపరిచే ఖనకుడు సురంగమార్గం ధూళితో పూడ్చివేశాడు. దానిని పురజనులు చూడలేదు. పిదప పురజనులు పాండవులు, మంత్రి పురోచనుడు అగ్నిప్రమాదంలో కాలిపోయినట్లు ధృతరాష్ట్రునికి తెలియచేశారు. ధృతరాష్ట్రమహారాజు మిక్కిలి అప్రియమైన పాండుపుత్రుల మరణవార్తను విని, మిగుల దుఃఖితుడై ఆక్రోశించాడు. "ఆయ్యో! వీరులు పాండవులు తల్లితో సహా కాలిపోయారు. కీర్తిశాలి నా సోదరుడు పాండుమహారాజు నేడు మళ్ళీ చనిపోయినట్లు అనిపిస్తోంది. పురుషులారా! వేగంగా వారణావతనగరానికి వెళ్ళండి. ఆ వీరులను, కుంతిభోజుని కూతురుని గౌరవించండి. వారందరికీ కులోచితాలూ, శుభప్రదాలూ అయిన పార లౌకికకర్మలను పెద్దపెట్టున జరిపించండి. అక్కడ వారితోపాటు చనిపోయిన వారి మిత్రులందరికీ, తగిన కర్మలు చేయించండి. ఈవిధంగా జరిగినపుడు పాండవులకు కుంతికి మేలుకోసం ఏమేమికర్మలు చేయించటానికి వీలవుతుందో, వాటినన్నింటినీ ఎంత డబ్బు ఖర్చు అయినా సరే జరిపించండి." ధృతరాష్ట్రుడు ఇలా చెప్పి జ్ఞాతులతో కూడి పాండుపుత్రులందరికీ తిలోదకాలు ఇచ్చాడు.

(పిదప ధృతరాష్ట్రుడు, అతనిపుత్రులు కౌరవులందరూ, భీష్మునితో కలసి గంగానదివద్దకు వెళ్ళారు. వారందరూ మహాత్ములైన పాండవులకు తిలోదకాలివ్వడానికి వెళ్ళారు. వారందరూ ఆభరణాలను కిరీటాదులను విసర్జించారు. ఏకవస్త్రులై దుఃఖంతో గంగదగ్గరకు చేరారు.)

వారందరూ పరమదుఃఖితులై పరిపరివిధాల ఆక్రోశించారు. అయ్యో! కురుశ్రేష్ఠ యుధిష్ఠిరా! అని కొందరు, అయ్యో! భీమా! అంటూ కొందరూ శోకించారు. మరికొందరు అయ్యో! అర్జునా! అన్నారు. మరికొందరు నకులసహదేవులను గూర్చి శోకించారు. కొందరు దుఃఖితులై కుంతిమరణానికి విలపించారు. అచట చేరిన జను లందరూ పాండవులకు తిలోదకాలిచ్చారు. పురజను లందరూ పాండవులను గూర్చి రకరకాలుగా దుఃఖించారు. పూర్వాపరాలు తెలిసిన విదురుడు మాత్రం కొంచెంగా శోకించాడు.

(పిదప పాండుసుతులు కుంతితో సహా మరణించారని వార్తను విన్న భీష్ముడు మిక్కిలి శోకించాడు. పలువిధాలుగా వారికోసం ఆక్రోశించాడు. అలమటించాడు. భీష్ముడిలా అన్నాడు- 'భీమసేన ధనంజయులు శీఘ్రంగా తప్పించుకోవాలనుకొంటే ఆ నివాసాన్ని బద్దలుకొట్టడానికైనా సమర్థులే. వారు ఆలాంటి ఉత్సాహాన్ని చూపించలేదు. పాండవులూ, కుంతి మరణించారని నాకు తోచటం లేదు. అదే జరిగితే ఇంతకంటె చెడ్డవార్త మరొకటి ఉండదు. ధర్మరాజు-విప్రులచే అనేకవిధాలుగా ప్రశంసింపబడ్డాడు. అతడు సత్యవ్రతుడు. ఎప్పుడూ సత్యాన్నే పలికేవాడు. అతడు తనను తాను ధర్మానికి అర్పించుకొన్నాడు. అతనిలో అన్నీ మంచిలక్షణాలే ఉన్నాయి. అటువంటి పాండునందనుడు-యుధిష్ఠిరుడు-ఎలా చనిపోయాడు ? తనపట్ల తాను ఏవిధంగా ప్రవర్తిస్తాడో, ఇతరులవిషయంలో కూడా అంత ప్రేమగాను యుధిష్ఠిరుడు ప్రవర్తించేవాడు. అతడు తల్లితో సహా ఎలా చనిపోయాడు? యువరాజుగా అభిషిక్తుడైన యుధిష్ఠిరుడు, సత్య ధర్మాలను పాటిస్తూ తనకీర్తిని, తండ్రికీర్తిని పెంచిపోషించాడు. అటువంటివాడు కాలునిచే చంపబడ్డాడు. యముడెంత చెడ్డవాడు! పాపం! కుంతి బహుకాలం అరణ్యవాసం అనుభవించింది. దుఃఖాలను పొందింది. కేవలం కొడుకుల మీద ప్రేమతో, ఆమె భర్తతో పాటు మరణించకుండా ప్రాణాలను కాపాడుకొన్నది. గొప్ప వంశంలో పుట్టిన కుంతి కొద్దికాలం మాత్రమే భర్తతో సుఖించింది. అటువంటి కుంతి ఏ కోరికలు తీరకుండానే పుత్రులతోపాటు కాలిపోయింది. బలిసిన భుజాలతో అందమైన చేతులతో మేరుపర్వతంలా కన్పించే భీమసేనుడు మరణించాడనే విషయాన్ని నమ్మలేకపోతున్నాను. అర్జునుడు సవ్యసవ్యవర్తన కలవాడు. చురుకుగా చేతుల్ని కదిలించేవాడు. అతడు గొప్ప ఆయుధాల నుపయోగించేవాడు. వినయశీలి. రథం నడపడంలో ప్రవీణుడు. ఎంతదూరమైనా ప్రయాణించేవాడు. అతనికి తొట్రుపాటులేదు. గొప్ప అస్త్రాలు తెలిసినవాడు. మహా బలశాలి. ఆ శూరుడు తూర్పుదేశాలవారిని, సౌవీరులను, దక్షిణదేశాల రాజులను జయించి ముల్లోకాల్లోను తన పౌరుషాన్ని ప్రకటించాడు. అర్జునుని పుట్టుకతో పాండురాజు, కుంతి పరమానందపడ్డారు. ఆ ఇంద్రసముడైన విజేత అర్జునుడు ఎలా మరణించాడు?" ఎద్దుమూపురం వంటి భుజాలతో సింహంలాంటి గంభీరమైన నడవడికతో, శోభించే కవలలు నకులసహదేవులు శత్రుసంహారకులు. అటువంటి వారు ఎలా మరణించారు? తిలోదకాలిస్తూ, భీష్ముడు చేస్తున్న విలాపాలను విని, విదురుడు దేశకాలాలను గమనించి ఇలా అన్నాడు. "బ్రహ్మచర్య నిష్ఠాగరిష్ఠ పురుష శ్రేష్ఠ! నీవు దుఃఖించరాదు. శోకాన్ని విడిచిపెట్టు. పాండవులకు ఏకీడూ రాదు. సమయానికి తగ్గట్టు నేను చేయవలసింది చేశాను. వారికోసం నీవు తిలోదకాలు ఇవ్వనవసరంలేదు" అప్పుడు భీష్ముడు కొద్దిగా పక్కకు తొలగి, విదురుని పట్టుకొని, ఆనందబాష్పం

కారణంగా అస్పష్టమైన తియ్యనిస్వరంతో, కౌరవులు వినకుండా, విదురునితో ఇలా అన్నాడు. "నాయనా! మహారథులు పాండుపుత్రులు ఎలా జీవించగల్గారు? పాండవులు మన అదృష్టం కొద్దీ ఎలా పతనాన్నుండి తప్పుకొన్నారు? నాలాంటి వారందరూ మహాపాపభయంనుండి ఎలా తప్పుకోగలిగారు? గరుడుని కారణంగా అతనితల్లి వినత దాస్యాన్నుండి తప్పుకొన్నట్లు నీవల్ల పాండవులు పతనాన్నుండి తప్పుకొన్నారు కదా!' ఇలా భీష్ముడు అడిగితే విదురుడు కౌరవులు వినకుండా భీష్మునితో ఇలా చెప్పాడు. "రాజు ధృతరాష్ట్రుడు శకుని, దుర్యోధనుడు కలసి పాండవులను నాశనం చెయ్యాలని నిశ్చయించుకొన్నారు. దుర్యోధనుని ఆజ్ఞమేరకు కుమారులతో సహా కుంతిని చంపడానికి లక్కయింటికి నిప్పుపెట్టడానికి పురోచనుడు నియమింపబడ్డాడు. పిదప నేను ఒక ఖనకుని పిలిచి, లక్క ఇంటిలో ఒక సురంగాన్ని తవ్వించి గుహను నిర్మింపచేశాను. దానిద్వారా పాండవులు, కుంతి బయటకు దాటింపబడ్డారు. వారి విషయంలో శోకింప నవసరం లేదు. శత్రువిమర్దనులైన పాండవులు మహాభయంకరమైన గృహాగ్నినుండి ఈ ఉపాయంతో రక్షింపబడ్డారు. నీవు శోకించవద్దు. పాండవులు బ్రతికే ఉన్నారు. కాలం పరిపక్వమయ్యేవరకు పాండవులు రహస్యంగా తిరుగుతూ ఉంటారు. సరియైన సమయంలో రాజులందరూ యుధిష్ఠిరుని చూస్తారు.')

తల్లితో కూడి ఆర్గురు మహాబలులు పాండవులు, వారణావత నగరంనుండి బయటకు వచ్చి, గంగానదిని చేరుకొన్నారు. పాండవులందరూ నావికుల బాహువేగంవల్ల, నదీప్రవాహంలోని వేగంవల్ల, గాలి ప్రయాణానికి అనుకూలంగా వీస్తుండటంవల్ల శీఘ్రంగా గంగ ఆవలి గట్టును చేరుకొన్నారు. తర్వాత వారు పడవను విడిచిపెట్టి, రాత్రిసమయంలోనే నక్షత్రసమూహాలవల్ల దిక్కులను తెలుసుకొంటూ దక్షిణదిక్కునకు ప్రయాణం సాగించారు. రాజా! పాండవులు ఎంతో శ్రమించి, ఒక దట్టమైన అడవిని సమీపించారు. వారు మిక్కిలి శ్రమచెంది, దాహంతో నిద్రతో బాధపడుతూ, భీమసేనునితో ఇలా అన్నారు. "ఇంతకన్న కష్ట మేముంటుంది? ఈ అరణ్యం చాలా దట్టంగా ఉంది. దిక్కులు కూడ తెలియటంలేదు. ముందుకు ప్రయాణించటానికి సామర్థ్యం సన్నగిల్లింది. దుర్మార్గుడైన పురోచనుడు కాలిపోయాడో లేదో తెలియదు. మనం ఎవ్వరికీ తెలియకుండా ఈ శత్రుభయం నుండి ఎలా బయటపడతామో తెలియటం లేదు అన్నారు." అపుడు ధర్మజుడు "భీమసేనా! మాలో నీవే బలవంతుడవు. వాయువు వలె బలశాలివి. నీవు పూర్వం మమ్ములను మోసుకొని పోయినట్లు, ఇప్పుడుకూడా మమ్మల్ని మోసుకొని తీసుకుపోవలసింది" అన్నాడు ధర్మరాజు. చెప్పిన మాట విని, మహాబలుడు భీమసేనుడు కుంతిని, ఇతరసోదరులను ఎత్తుకొని, మోసుకుంటూ శీఘ్రంగా అరణ్యంలోకి ప్రయాణించాడు.

150. తల్లి కొఱకు భీమసేనుడు నీరు తెచ్చుట.

భీమసేనుడు వేగంగా అరణ్యంలో ప్రయాణిస్తుంటే, చెట్లుకొమ్మలతో సహా వనమంతా కాళ్ళవేగానికి కదలిపోయి పెద్దరొద చేస్తున్నట్లు అయింది. జ్యేష్ఠ ఆషాఢమాసాల సంధికాలంలో పెనుగాలులు వీచినట్లు భీమసేనుని కాలిపిక్కలనుండి పెనుగాలులు వీచాయి. దానితో ఆ మహాబలుని ప్రయాణమార్గంలోని చెట్లు, లతలు నేలకొరిగాయి. భీమసేనుడు నడుస్తున్న బాటకు దగ్గరగా పూలూ, పండ్లతోకూడిన చెట్లున్నాయి. వాటిని అణగద్రొక్కుతూ, పాదలను నాశనం చేస్తూ వేగంగా ప్రయాణించాడు భీముడు. శరీరావయవాలనుండీ మదాన్ని స్రవించే కోపించిన ఆరవై ఏళ్ల మత్తగజంలా, భీమసేనుడు పెద్దపెద్ద చెట్లను కూడ కూలగొడుతూ ప్రయాణించాడు. గరుడునిరెక్కల వాయువులతో సమాన వేగంకల్గిన, భీమసేనుని ప్రయాణవేగంచేత మిగిలిన పాండవులకు ఇంద్రియజ్ఞానం నశించినట్లయింది. ఆ సమయంలో పాండవులు దుర్యోధనుని భయంవల్ల, తరచుమార్గంలో ఎదురయ్యే సుదీర్ఘమైన జలప్రవాహాలను చేతులతో ఈదుతూ రహస్యస్థలానికి చేరుకొన్నారు. భీమసేనుడు ప్రవాహాలు అడ్డువచ్చినప్పుడు, ఎత్తుపల్లాలుగా ఉన్న ప్రదేశాలలోను, కష్టంవచ్చినప్పుడు సుకుమారి, యశస్విని అయిన కన్నతల్లిని, తన వీపుమీద మోస్తూ ఉన్నాడు. వారు, ఆ సాయంకాలానికి దుంపలు పళ్ళు నీళ్ళు స్వల్పంగా ఉండి, భయంకరమైన పక్షులూ, మృగాలతో నిండిన అరణ్యానికి చేరుకొన్నారు. సంధ్యాకాలం పరమ భయంకరంగా ఉంది. మృగాలు పక్షులు కూడా దారుణంగా ఉన్నాయి. కాలం కానప్పటికీ వీస్తున్న భయంకరమైన వాయువులతో దిక్కులన్నీ చీకట్లు క్రమ్ముకొన్నాయి. అప్పుడు వీచిన గాలులతాకిడికి ఆకులు పళ్ళు క్రిందపడిపోయాయి. చెట్లు పొదలు ఎగిరిపోయాయి. అనేక వృక్షాలు పూర్తిగాను, కొన్ని పాక్షికంగాను విరిగిపోయాయి. ఆ అరణ్యమంతా కకావికలయింది. కురుశ్రేష్ఠులు ప్రయాణంవల్ల కల్గిన అలసటచేత, దాహంచేత, ముంచుకొస్తున్న నిద్రచేత ఇంకా ప్రయాణించ లేకపోయారు. వారందరూ నీరసమైన మహారణ్యంలో ఒకచోట కూలబడ్డారు. పిదప దాహార్తితో కుంతి తన కుమారులతో ఇలా అంది.

"నేను ఐదుగురు పాండవులకు తల్లిని. అందరి మధ్యలో ఉన్నాను. అయినా దాహంతో అలమటిస్తున్నాను." తల్లి అన్న ఆ మాటలు విన్న భీమసేనుని మనస్సు తల్లిపట్ల ప్రేమతోను, దురవస్థపట్ల జాలితోను పరితపించింది. వెంటనే భీమసేనుడు నీళ్ళు తేవటానికి బయలుదేరాడు. భీముడు భయంకరమై, నిర్జనమైన మహారణ్యంలోకి ప్రవేశించి, విశాలమైన నీడనిచ్చే అందమైన మర్రిచెట్టును చూశాడు. పాండవులందరినీ

చెట్టుక్రింద ఉంచి, భీమసేనుడు "నేను నీళ్ళకోసం వెతుకుతాను. మీరందరూ విశ్రమించండి. ఇక్కడ కొంగలు, నీటి పక్షులు మధురంగా ధ్వని చేస్తున్నాయి. కనుక తప్పకుండా ఇక్కడ పెద్ద జలాశయ ముందని నాకనిపిస్తోంది" - అన్నాడు. యుధిష్ఠిరుడు వెళ్ళిరమ్మని అనుమతించిన తర్వాత భీమసేనుడు జలపక్షులైన కొంగలు సంచరిస్తున్న ప్రదేశానికి వెళ్ళాడు. భీము డక్కడ నీరు త్రాగి, స్నానం చేసి, సోదరప్రేమతో వారికోసం, తన ఉత్తరీయంతో నీటినిపట్టుకొని తీసుకువచ్చాడు. రెండు క్రోసుల దూరాన్ని తల్లికోసం త్వరత్వరగా దాటివచ్చి, శోకం దుఃఖం కమ్ముకోగా భీమసేనుడు పాములాగా బుసకొట్టాడు. అలా వచ్చిన వృకోదరుడు, కటికనేలపై నిద్రిస్తున్న కన్నతల్లిని, సోదరులను చూసి, మిక్కిలి శోకించాడు.

"నేను దురదృష్టవంతుడిని. ఇంతకంటె బాధ కల్గించే దృశ్యం ఏముంటుంది? నాసోదరులందరూ కటికనేలపై నిద్రిస్తూంటే చూడవలసి వచ్చింది" అనుకొన్నాడు భీముడు. వారణావతనగరంలో, పూర్వం మిక్కిలి విలువైన గొప్ప పడకలపై శయనించినా నిద్రరాని పాండవులు నేడు నేలమీద నిద్రిస్తున్నారు. శత్రుసమూహనాశకుడైన వసుదేవుని సోదరి, కుంతిభోజమహారాజపుత్రి, శుభలక్షణాలచే పూజార్హురాలు, విచిత్రవీర్యుని కోడలు, మహాత్ముడు పాండురాజు భార్య, పాండవులమైన మాకు తల్లి, కమలోదరవర్ణ, పరమసుకుమారి, అమూల్యమైన గొప్ప శయనంమీద నిద్రింపతగిన కుంతి అనుచితమైన భూమిపై నిద్రించవలసివచ్చింది. చూడండి. ఎంత దురదృష్టం. యమధర్మరాజు, ఇంద్రుడు, వాయుదేవులవల్ల సుతులను కన్నకుంతి, మేడలమీద పరుండదగినది నేడు మిక్కిలి అలసి, భూమిమీద నిద్రిస్తోంది. ఇంతకంటె గొప్ప దుఃఖకరమైన దృశ్యం ఏముంటుంది? పురుషశ్రేష్ఠులు పాండవులు భూమిమీద పరుండి ఉండగా నేడు చూడవలసి వచ్చింది. ధర్మవ్రతుడు, ముల్లోకాలను పరిపాలించే అర్హత కల యుధిష్ఠిరుడు సామాన్యునివలె అలసిపోయి కటికనేలమీద ఎలా నిద్రిస్తున్నాడో కదా! నీలమేఘశ్యాముడు, మానవుల్లో సరిజోడు లేనివాడు ఈ అర్జునుడు అతిసామాన్యునివలె భూమిమీద నిద్రిస్తున్నాడు. ఇంతకంటె దుఃఖాన్ని కలిగించేది ఏముంటుంది? దేవతల్లో అశ్వినీదేవతలవలె, అందమైన రూపసంపదకల కవలలు నకుల సహదేవులు సామాన్యుల్లాగా భూమిమీద నిద్రిస్తున్నారు.

ఎవరికి కులనాశకులైన జ్ఞాతు లుండరో, ఒంటరిగా రచ్చబండదగ్గరుండే చెట్టులా ఎవరుంటారో, వారే సుఖంగా ఈ లోకంలో జీవించగల్గుతున్నారు. గ్రామంలో ఆకులు పూలతో నిండిన ఒకే ఒక్క చెట్టుంటే, అది దేవతావృక్షంలా అందరిచే పూజింపబడుతుంది. ఆరాధింపబడుతుంది. అలాగే జ్ఞాతులు లేనివాడు మాత్రమే గౌరవం పొందగల్గుతాడు.

ఎవరికి ధర్మమార్గంలో ప్రయాణించే శూరులైన జ్ఞాతులు చాలామంది ఉంటారో, వారు కూడా ఏ మనోవ్యథలూ లేకుండా సుఖంగా జీవిస్తున్నారు. **బలవంతులు, వస్తుసంపదలున్నవారు, మిత్రులకు బంధువులకు ఆనందం కల్గించేవారు, ఒకరినొకరు ఆశ్రయించుకొని అరణ్యంలోని చెట్లలాగా ఆనందంగా జీవిస్తారు.*** మేము మాత్రం పుత్రునితో కుట్రజరిపిన దుర్మార్గుడు – ధృతరాష్ట్రునిచే బహిష్కరింపబడ్డాం. దైవానుగ్రహంవల్ల అతికష్టం మీద తగలబడకుండా బయటపడ్డాం. ఆ గృహాగ్ని నుండి బయటపడ్డ మేము ఈ చెట్టును ఆశ్రయించాం. ఇంత ఆపదను పొందిన మేము చివరకు ఏదిక్కుకు పోవలసివస్తుందో అర్థం కావటంలేదు. దుర్బుద్ధి, హ్రస్వదృష్టి కల్గిన దుర్యోధనా! నీవిషయంలో దేవతలు అనుగ్రహం చూపిస్తున్నారు. కనుకనే యుధిష్ఠిరుడు నిన్ను చంపడానికి నాకు అనుమతి నివ్వలేదు. అందుకే నీవు ఇంకా బ్రతికిఉన్నావు. ఈ రోజే నిన్ను, నీమంత్రులనూ, కర్ణుని, సోదరులను, శకునితో సహా యమలోకానికి పంపించగలను. నాకోపం అంతటిది. పాపాత్ముడా! ధర్మాత్ముడు యుధిష్ఠిరుడు నీమీద కోపం తెచ్చుకోవటం లేదు. కనుకనే నిన్ను ఏమీ చెయ్యలేకపోతున్నాను." అంటూ క్రోధంతో కాలిపోతున్న మనస్సు కల భీముడు ఒక చేతితో మరొకచేతిని అప్పళిస్తూ పెద్దగా నిట్టూర్చాడు. మళ్ళీ వృకోదరుని మనస్సు దైన్యంతో నిండిపోయింది. జ్వాలలు లేని అగ్నిలా ప్రశాంతు డయ్యాడు. సామాన్యుల్లా భూమిమీద ఎంతో ఆదమరిచి నిద్రిస్తున్న తన సోదరులను చూశాడు. భీముని మనస్సు విచారంతో నిండిపోయింది. ఇక్కడికి చాలా దగ్గరలోనే ఒక నగరం ఉన్నట్లు అన్పిస్తోంది. వీరందరూ అప్రమత్తంగా మెలకువగా ఉండవలసిన సమయంలో ఆదమరచి నిద్రిస్తున్నారు. కనుక నేనే రక్షణకోసం మెలకువతో ఉంటాను. వారు నీటిని నిద్రనుంచి మేల్కొన్నతర్వాత అలసట తీరిన తర్వాత త్రాగుతారు. ఈ విధంగా నిశ్చయించుకొని భీముడు స్వయంగా జాగరణ చేశాడు.

151. భీమ హిడింబల సంవాదము.

ఆ మర్రిచెట్టుక్రింద పాండవులు నిద్రిస్తూ ఉన్నారు. వారున్న అరణ్యానికి దరిదాపుల్లో ఒక మద్ది చెట్టుమీద హిడింబుడు అనే రాక్షసుడు ఉన్నాడు. అతడు క్రూరుడు, మనుష్యమాంసాన్ని తినేవాడు, గొప్పబలమూ, పరాక్రమమూ ఉన్నవాడు. ఆకారంలో

* బలవంతః సమృద్ధార్థాః మిత్రబాంధవనందనాః ।
జీవంత్యన్యోన్యమాశ్రిత్య ద్రుమాః కాననజా ఇవ ॥ 35

నీలమేఘంవలె నల్లనివాడు. ఎర్రనినేత్రాలు, భయంకరమైన శరీరాకృతి కలవాడు. అతడు పెద్దకోరలతో భయంకరమైన ముఖంతో మాంసానికి అర్రులు చాస్తున్నాడు. ఆకలితో పీడింపబడుతున్నాడు. అతని పిరుదులు, పొట్ట వ్రేలాడుతూ ఉన్నాయి. అతని మీసాలు, వెంట్రుకలు ఎర్రగా ఉన్నాయి. అతని కంఠం, భుజాలు మహావృక్షాల్లాగా ఉన్నాయి. అతని చెవులు శంకువుల్లా ఉన్నాయి. భయంకరంగా ఉన్నాడు. అతడు అనుకోకుండా మహారథులైన ఆ పాండుపుత్రులను చూశాడు. వికృతమైన రూపం, ఎర్రనికళ్లు, భయంకరమైన చూపు, అన్నిటితో భయంకరంగా ఉన్నాడు. ఒకవైపు ఆకలిబాధ, మరొక వైపు మాంసంమీద కోరికతో ఉన్న ఆ రాక్షసుడు అనుకోకుండా పాండవులను చూశాడు. అతడు వేళ్ళువైకెత్తి కరుకు వెంట్రుకలను విదిలిస్తూ, దురదతో గోక్కుంటూ, తన పెద్ద ముఖంతో ఆవలిస్తూ మళ్ళీ మళ్ళీ పరిశీలించి చూశాడు. గొప్పబలం, పెద్దశరీరం కల ఆ హిడింబుడు మానవ మాంసం దొరికిందని చాలా సంతోషించాడు. మనుష్య వాసనను పీల్చి, తన సోదరితో ఇలా అన్నాడు. 'చాలా కాలానికి నాకు మిక్కిలి ఇష్టమైన భక్ష్యం మనుష్యమాంసం దొరికింది. నా నాలుక ప్రీతిసూచకంగా లాలాజలాన్ని స్రవిస్తోంది (నోరూరుతోంది). మిక్కిలివాడియై, సహింపశక్యగాని నాఎనిమిది కోరలను వారి శరీరాల్లో, నిగనిగలాడుతున్న మాంసంలో లోతుగా దింపుతాను. ఈ అదృష్టం ఎంతో కాలానికి కల్గింది. మనుష్యకంఠాన్ని ఆక్రమించుకొని రక్తనాళాలను తెంపి, నురగలు కక్కుతున్న కొత్త వేడి రక్తాన్ని అపారంగా త్రాగుతాను. హిడింబా! వెళ్లు. ఈ అరణ్యంలో నిద్రించిన వాళ్ళు ఎవరో తెలుసుకో! దట్టంగా వీస్తున్న నరవాసన నా ముక్కుకు ఎంతో తృప్తి నిస్తున్నట్లుంది. వీరు మనప్రదేశంలో నిద్రిస్తున్నారు. వీరివల్ల నీకు ఏభయమూ ఉండదు. కనుక వీరందర్నీ చంపి, నాదగ్గరకు తీసుకొనిరా. ఈ మనుష్యుల యొక్క మాంసాన్ని బయటకు పెల్లగించి, స్వేచ్ఛగా మనమిద్దరం తిందాం. వెంటనే నేను చెప్పినట్లు చెయ్యి. ఈ మనుష్యుల మాంసాన్ని కోరుకొన్నంత తిని, రకరకాలుగా తాళం వేస్తూ మన మిద్దరం నృత్యం చేద్దాం.'

హిడింబుని ఆజ్ఞమేరకు హిడింబ, త్వరగా పాండవులున్న ప్రదేశానికి వెళ్ళింది. హిడింబ కుంతితో సహా నిదురించిన పాండవులను చూసింది. ఓటమి నెరుగని భీమసేనుడిని కూడా చూసింది.అతడు మేలుకొని ఉన్నాడు. నిలుచున్న గున్నమద్ది చెట్టులా, సాటిలేని అందంతో విలసిల్లే భీమసేనుని చూడగానే రాక్షసి హిడింబ అతనిని కోరుకొంది. 'ఇతడు శ్యామలవర్ణుడు, పెద్ద బాహువులున్నవాడు, ఇతని భుజాలు సింహభుజాల్లా ఉన్నాయి. శంఖం వంటి కంఠం, పద్మాల వంటి నేత్రాలు, గొప్ప తేజస్సు కల్గిన ఈతడు నాకు భర్త అయితే ఎంత బాగుంటుంది ? నేను సోదరుని క్రూరమైన మాటను ఎప్పటికీ వినను.

భర్తమీద స్నేహం బలవత్తరమైనది. సోదర(ప్రేమ అంతటిది కాదు. వీళ్ళను చంపి తినటం వల్ల, నాకూ సోదరునికీ కొద్దిసేపు సుఖంగా ఉండవచ్చు. వీళ్ళను చంపకుండా, ఇతడిని పెళ్ళి చేసుకుంటే చిరకాలం సుఖాన్ని పొందగల్గుతాను' అనుకొంది. కామరూపిణి అయిన హిడింబ శ్రేష్ఠమైన మానుషరూపాన్ని ధరించింది. మెలమెల్లగా మహాబాహు డయిన భీమసేనుని సమీపించింది. దివ్యమయిన అలంకారాలు ధరించి, సిగ్గుపడుతున్నట్లు కన్పిస్తూ, చిరునవ్వుతో ఆ యువతి భీమసేనునితో ఇలా అంది. "పురుషశ్రేష్ఠా! నీవెవ్వరవు? ఎక్కడ నుండి ఇచటకు వచ్చావు? ఇచట నిద్రించిన దేవతారూపులు ఈ పురుషు లెవ్వరు? అనఘా! వయస్సులో పెద్దదై, బంగారురంగుతో ఉన్న యీ సుకుమారి ఎవ్వతె? ఈమహారణ్యంలో కూడా సొంత ఇంటిలో ఉన్నట్లు నమ్మకంగా నిద్రిస్తోంది. ఈమహారణ్యం రాక్షసులకు నిలయమని ఈమెకు తెలియదనుకొంటాను. ఇక్కడ పాపాత్ముడు హిడింబుడనే రాక్షసుడు నివసిస్తున్నాడు కదా! దేవసమానా! మీ మాంసాన్ని తినా లనుకొనే పాపభావనలున్న రాక్షసుడైన నా సోదరునిచే, నేను మీవద్దకు పంపబడ్డాను. కాని దేవునివలె వెలిగిపోతున్న నిన్ను మనసార చూసి, నేను మరొకని భర్తగా భావించ లేకపోతున్నాను. నామాట నిజం. ధర్మమెరిగినవాడా! దీన్ని బాగా యోచించి, నావిషయంలో తగినట్లు వ్యవహరించు. నీమీద కోరికతో నామనశ్శరీరాలు వివశ మయ్యాయి. నిన్నే సేవించా లనుకొంటున్నాను. నన్ను స్వీకరించు. మహాబాహూ! మనుషుల్ని తినే ఈ రాక్షసునినుండి నిన్ను రక్షిస్తాను. పుణ్యాత్ముడా! పర్వతాల్లో, గుహల్లో మనమిద్దరం హాయిగా విహరిద్దాం. నాకు భర్తవై ఉండు.

(నీకు శుభం కలుగుగాక - ప్రాణాలు గాలిలో కలసిపోకుండా చూడు. శత్రునాశన! నీవు నన్ను పరిత్యజిస్తే నేను జీవించలేను.)

నేను ఆకాశంలో విహరించేదాన్ని. స్వేచ్ఛగా ఎక్కడికైనా సంచరిస్తుంటాను. ఆయా ప్రదేశాల్లో నాతో పాటు విహరిస్తూ సాటిలేని ఆనందాన్ని పొందు."

(భీమసేనుడిలా అన్నాడు. "రాక్షసీ! ఇతడు నా జ్యేష్ఠ సోదరుడు. నాకు గౌరవించతగినవాడు, గొప్ప గురువు. ఇతనికింకా వివాహం కాలేదు. పెద్దవాడి వివాహం కాకుండా చిన్నవాడు పెళ్ళి చేసుకోవటం అధర్మం. అలా చేసుకున్నవానిని పరివేత్త అంటారు. నేను ధర్మాన్ని విడిచిపెట్టలేను.)

తల్లిని, అన్నను, సుఖంగా నిద్రించిన సోదరులను, సమర్థుడై ఉండి కూడా ఎవడు విడిచిపెడతాడు? నామీద నమ్మకంతో హాయిగా నిద్రించిన సహోదరులను, తల్లిని రాక్షసునికి ఆహారంగా వదలి, నావంటివాడు కామార్తునివలె ఎలా వెళ్ళిపోతాడు?" రాక్షసి ఇలా అంది. "నీకు ఇష్టమైనట్లు నేను చేస్తాను. వీరందరినీ నిద్రనుండి మేలుకొలుపు. ఈపురుషభక్షక రాక్షసుని నుండి నేను అందరినీ విడిపిస్తాను." భీమసేనుడిలా అన్నాడు.

రాక్షసీ! అరణ్యంలో హాయిగా నిద్రిస్తున్న సోదరులను, కన్నతల్లినీ దుర్మార్గుడైన నీసోదరుని భయంవల్ల నిద్రలేపను. పిరికిదానా! నాపరాక్రమాన్ని రాక్షసులు తట్టుకొని నిలబడలేరు. సోగకనులదానా! మనుష్యులు, గంధర్వులు, యక్షులు కూడా నాకు సరి రారు. శుభాంగీ! నీవు వెళ్ళినాసరే, ఉన్నాసరే. నీవు ఏం చెయ్యాలనుకొంటే అది చెయ్యి. పురుషుల్ని తినే నీ సోదరుని పంపించినా సరే."

152. భీమ హిడింబుల యుద్ధము.

రాక్షసరాజు హిడింబుడు, తన సోదరి వెళ్ళి చాలా సేపు అయిందని భావించి, ఆ చెట్టునుండి క్రిందకు దిగి, వేగంగా పాండవులవైపు వచ్చాడు. హిడింబుడు ఎర్రని కళ్ళు, పెద్ద పెద్ద భుజాలు, నిక్కబొడుచుకొన్న జుట్టు కలిగి మేఘసమూహంలా నల్లని శరీరంతో ఉన్నాడు. వాడికోరలవాడు. అతని ఆకారం మిక్కిలి భయంకరంగా ఉంది. ఆ విధంగా వికృతమైన రూపంతో వచ్చిపడుతున్న హిడింబుని చూచి, భయపడి, హిడింబ భీమసేనునితో ఇలా అంది. "ఈ దుర్మార్గుడు పురుష భక్షకుడు, చాలా కోపంతో వస్తున్నాడు. కనుక నీవు, నీసోదరులు నేను చెప్పినట్లు చెయ్యండి. వీరా! నేను స్వేచ్ఛగా ఎక్కడికైనా వెళ్ళగలను. నాకు రాక్షసబలముంది. మీరందరూ నా నడుంమీద ఎక్కండి. మిమ్మల్ని ఆకాశమార్గంలో తీసుకుపోతాను. శత్రుమర్దనా! నిద్రిస్తున్న సోదరులను, తల్లిని మేల్కొలుపు. మీ అందరినీ తీసుకుని ఆకాశమార్గంలో వెళ్ళిపోతాను." భీముడన్నాడు. "సుశ్రోణి! నీవు భయపడకు. నాఎదుట ఈ రాక్షసుడు నిలబడలేడు. సుమధ్యమా! నీవు చూస్తుండగానే వీడిని చంపేస్తాను. పిరికిదానా! ఈ నీచరాక్షసుడు నాకు సరిజోడు కాడు. యుద్ధంలో నాతాకిడిని వీడే కాదు, రాక్షసులందరూ కలిసినా సహించలేరు. కండలు తిరిగి గుండ్రంగా ఉన్న ఏనుగు తొండాల్లాంటి నా బాహువులు చూడు. కోటగడియల్లాంటి తొడలను చూడు. నా విశాలమైన వక్షస్థలాన్ని చూడు. సుందరీ! ఇంద్రుని పరాక్రమంలాంటి నాపరాక్రమాన్ని నేడు నీవు చూస్తావు. నన్ను కేవలం మనుష్యునిగా భావించి చిన్నచూపు చూడవద్దు." హిడింబ అన్నది. "నరోత్తమా! దేవతారూపుడవు. నేను అవమానించను. కాని మనుష్యుల విషయంలో ఈ రాక్షసుడు హిడింబుడు ఎన్నోసార్లు తన ప్రతాపాన్ని చూపించాడు." భీమసేను డీ విధంగా మాట్లాడుతుండగా, ఆ మాటల్ని నరమాంస భక్షకుడైన హిడింబుడు విన్నాడు.

హిడింబుడు తన సోదరి యొక్క మనుష్యరూపాన్ని చూశాడు. ఆమె కొప్పులో పూలమాలను తురుముకొంది. ముఖం పూర్ణచంద్రునిలా వెలిగిపోతోంది. కనుబొమలు,

ముక్కు, వాలుజడ చూడముచ్చటగా ఉన్నాయి. గోళ్ళు చర్మం ఎంతో మృదువుగా ఉన్నాయి. ఆమె అన్ని అలంకారాలనూ ధరించింది. సన్నని జిలుగు చీర ధరించింది. ఆ నరమాంసభక్షకుడు చక్కని మనుష్యరూపం ధరించిన హిడింబను చూసి, భీముడిని కామిస్తున్నదని భావించి, తన సోదరి విషయంలో మిక్కిలి కోపించాడు. తన విశాలమైన కళ్ళను పైకెగరేశాడు. తర్వాత ఆమెతో ఇలా అన్నాడు. "(ఆకలితో) భోజనం చెయ్యాలని కోరుకొంటున్న నాకు ఆటంకం కల్గిస్తున్న దుర్బుద్ధి ఎవరు? హిడింబా! కామంతో కళ్ళు మూసుకొన్న నీవు నాకోపానికి భయపడటంలేదా? దుర్మార్గులారా! మనుష్యుని కామించి, నాకు అపకారం చేస్తావా? మన పూర్వీకులైన రాక్షసశ్రేష్ఠ లందరికీ నీవల్ల అపకీర్తి వచ్చింది. నీవు పరమ నీచురాలివి. ఈమానవమాత్రుల్ని ఆశ్రయించుకుని, నాకు గొప్ప అపకారం తలపెట్టావు. హిడింబా! వారందరినీ నీతోపాటు ఇప్పుడే చంపేస్తాను." హిడింబతో ఇలా చెప్పి, ఎర్రని చూపులతో హిడింబుడు పళ్ళు పటపట కొరుకుతూ హిడింబతో సహా అందరినీ చంపటానికి బయల్దేరాడు. తనమీదకు వస్తున్న హిడింబుని చూసి, పరాక్రమశాలి భీముడు 'నిలబడరా నిలబడు' అంటూ హిడింబుని వారించాడు. సోదరిపట్ల మిక్కిలి కోపించిన రాక్షసుని చూసి, భీమసేనుడు పరిహాస మాడుతున్నట్లు ఇలా అన్నాడు. "దుర్మార్గుడా! హాయిగా నిద్రపోతున్న వీరితో నీకేం పని? నామీద నీప్రతాపం చూపించు. స్త్రీని చంపటం భావ్యంకాదు. అందునా ఈమె చేసిన అపకారం లేదు. ఈ అపకారం పరులు చేసింది. ఈ బాలిక హిడింబ తన వశంలో లేదు. నన్ను ఇప్పుడు కామిస్తోంది. ఈమె శరీరంలోపల సంచరించే అనంగుని చేత (మదనునిచే) ప్రేరేపింపబడింది. దుర్మార్గుడా! ఈమె నీసోదరి. నీవు పంపబట్టే ఈమె నావద్దకు వచ్చింది. ఈపిరికిది నారూపాన్ని చూసి నన్ను కామిస్తోంది. ఈమె నీకేమీ అపకారం చెయ్యలేదు. మన్మథుడు అపకారం చేస్తే ఈమెను నిందించటం తగదు.

నేను ఎట్టఎదుట నిలిచి ఉండగా, స్త్రీని చంపటం తగదు. నాఒక్కడితో నీవొక్కడివే తలపడు. ద్వంద్వయుద్ధం చేద్దాం. నేడు నేనొక్కడనే నిన్ను యమలోకానికి పంపిస్తాను. బలమైన ఏనుగుపాదంతో త్రొక్కబడినట్లు నాబలంచే పిండి చేయబడిన నీశిరస్సు ముక్కముక్కలైపోతుంది. ఈ రోజు యుద్ధరంగంలో నాచే చంపబడిన నీశరీరావయవాలను గద్దలు, డేగలు, నక్కలు పరమానందంతో స్వీకరిస్తాయి. పూర్వం మానవులను నిత్యం భుజిస్తూ ఉండే నీవు అపవిత్రం చేసిన ఈ అరణ్యాన్ని, క్షణకాలంలో రాక్షసరహితం చేస్తాను. రాక్షసా ! పర్వతంలాంటి గొప్ప ఏనుగును సింహం చీల్చి చెండాడినట్లు, నాచేత ఎన్నోసార్లు పొర్లించబడే నీ శరీరాన్ని నీ సోదరి చూస్తుంది. దుష్టరాక్షసా! నేను

నిన్ను చంపగానే ఏమాత్రం భయాందోళనలు లేకుండా ఆటవికులందరూ ఈ వనంలో సుఖంగా సంచరిస్తారు." హిడింబుడన్నాడు. "ఓరిమానవా! అనవసరంగా ఆరుస్తా వెందుకు? నీవు చెప్పిందంతా చేసి చూపించు, అప్పుడు పొగడుకుందువుగాని, ఆలస్యం చెయ్యకు. దుర్మతీ! నీవు బలవంతుడ ననుకొంటున్నావు. పరాక్రమవంతుడి ననుకొంటున్నావు. నాతో యుద్ధం చేసి ఎవరు బలాధికులో తెలుసుకొంటావు. వీరెవ్వరినీ నేను ముందుగా చంపను. వీళ్ళు హాయిగా నిద్రపోవచ్చు. పరుషంగా మాట్లాడే నిన్నే ముందుగా నేడు చంపుతాను. నీశరీరాన్నుండి రక్తాన్ని త్రాగి, ఆపై వీళ్ళందర్నీ చంపుతాను. ఆ తర్వాత నాకు అపకారం చేసిన ఈ హిడింబను సంహరిస్తాను."

ఇలా అంటూనే ఆ మనుష్యభక్షకుడు హిడింబుడు తనచేయి పైకెత్తి, కోపంతో భీమసేనుని మీదకు దూసుకొని వచ్చాడు. అలా వేగంగా మీదకు వస్తున్న హిడింబుని చేతిని, భీమసేనుడు నవ్వుతూ హేలగా పట్టుకొన్నాడు. భీముడు గుంజుకొంటున్న ఆ రాక్షసుని బలంగా లాగాడు. సింహం చిన్న జింకను లాగుకొని వెళ్లినట్లు హిడింబుని ఎనిమిది ధనుస్సుల దూరానికి (20హస్తాలు) ఈడ్చుకొనిపోయాడు. భీమునిచేత బలంగా బాధింపబడిన రాక్షసుడు కోపించాడు. వెంటనే భీమసేనుని పట్టుకుని భయంకరంగా గర్జించాడు. సుఖంగా నిద్రించిన సోదరులకు, శబ్దం చేస్తే నిద్రాభంగం కలుగుతుందని భావించి, మహాబలుడైన భీమసేనుడు మళ్ళీ హిడింబుని దూరంగా విసిరికొట్టాడు. హిడింబుడు, భీమసేనుడు ఒకరినొకరు బలంగా విసురుకొన్నారు. పరస్పరం కలియబడ్డారు. గొప్ప పరాక్రమం ప్రదర్శించారు. అరవై ఏళ్ళ వయస్సున్న మత్తగజాల్లా వారిద్దరూ ఒకరితో ఒకరు తలబడ్డారు. చెట్లను విరగ్గొట్టారు. తీగలను లాగి పారేశారు.

(భీమసేన హిడింబులకు ఘోరమైన యుద్ధం జరిగింది. చెట్లను పెకలించి వేగంగా ఒకరిమీద ఒకరు విసురుకొన్నారు. అంతటా ఉన్న లతా సమూహాలను తమ పాదాలతో, తొడలతో అణగద్రొక్కారు. అపుడు పుట్టిన పెద్ద పెద్ద శబ్దాలతో మృగాలను పక్షులను భయపెట్టారు. వారిద్దరూ బలవంతులే. ఇద్దరూ మదించినవారే! ఇద్దరూ పరస్పరం చంపుకోవాలనుకొంటున్నవారే. ఒకసారి చేతులను మరొకసారి తొడలను పరస్పరం పీడించుకొన్నారు. ఒకరినొకరు పడద్రోసుకొన్నారు. ఇద్దరూ సింహనాదాలు చేస్తూ, రాళ్ళతో కొట్టుకొన్నట్లు నొప్పించే ప్రహారాలతో ఒకరినొకరు హింసించుకున్నారు. పరస్పరం కలియబడ్డారు. మళ్ళీ దూరంగా విసురుకొంటున్నారు. ఆ యుద్ధం చాలా భయంకరంగా ఉంది.)

వారిద్దరి పెద్దగర్జనలతో పాండవులు, కుంతి మేలుకొన్నారు. ఎదురుగా నిలబడి ఉన్న హిడింబను చూశారు.

153. భీముడు హిడింబుని వధించుట.

పురుషశ్రేష్ఠులైన పాండవులు, కుంతి మేలుకొని, హిడింబ యొక్క మానవాతీతమైన రూపసంపదను చూచి ఆశ్చర్యపోయారు. పిదప కుంతి హిడింబయొక్క అందచందాలను చూసి మిక్కిలి ఆశ్చర్యపడి, మెల్లగా అనునయపూర్వకంగా తియ్యని మాటలతో ఆమెతో ఇలా అంది. 'దేవకన్యా! నీవెవరి పిల్లవు? ఎవ్వతెవు? నీవు ఏ పనిమీద వచ్చావు? ఎక్కడ ఉండి వచ్చావు? నీవు ఈ వనదేవతవా? అప్సరసవా? ఇక్కడ ఎందుకున్నావు? అంతా నాకు వివరించు.' హిడింబ ఇలా అంది. 'ఎదురుగా నల్లని పెద్ద మేఘంలా కన్పిస్తున్న ఈ వనం, హిడింబు డనే రాక్షసునికీ, నాకూ నివాసస్థానం. అమ్మా! నేను ఆ హిడింబరాక్షసుని సోదరిని. పూజ్యురాలా! నిన్ను పుత్రసహితంగా చంపాలని భావించిన సోదరుని ఆజ్ఞతో నేను మీవద్దకు వచ్చాను. బంగారు కాంతితో వెలిగిపోతున్న నీకుమారుని మహాబలుని, చూశాను. శుభాంగీ! నేను, సమస్తప్రాణుల హృదయాంత రాళాల్లో తిరుగాడే మన్మథుని చేత ప్రేరేపింపబడి, నీ కుమారునికి వశమయ్యాను. ఆ కారణంగా మహాబలుడైన నీకుమారుని భర్తగా వరించాను. ఇచట నుండి దూరంగా తీసుకుపోవటానికి (మిమ్మందరినీ) ప్రయత్నం చేశాను. కానీ నీపుత్రుడు అంగీకరించలేదు. తర్వాత నేను చాలా ఆలస్యం చేస్తుండటం చూచి, నరభక్షకుడైన హిడింబుడు ఈ నీ కుమారు లందరినీ స్వయంగానే సంహరించాలని వచ్చాడు. ఆ హిడింబుని నా ప్రియుడూ, నీ కుమారుడూ, అయిన భీముడు బలాత్కారంగా దూరంగా తీసుకుని వెళ్లాడు. యుద్ధంలో పరాక్రమిస్తున్న ఈ నర, రాక్షసులను చూడు. గర్జించుకొంటూ, మహావేగంతో ఒకరినొకరు దూరంగా విసిరేసుకొంటున్నారు.'

ఆమె మాటలు విన్నవెంటనే యుధిష్ఠిరుడు, అర్జునుడు, నకుల సహదేవులు ఒక్క ఉదుటన పైకి లేచారు. ఒకరితో మరొకరు కలుస్తూ, పడద్రోసుకొంటూ, మహాబలులైన సింహాల్లా పోరాడుతూ జయాన్ని కోరుకొంటున్న భీమ హిడింబులను మిగిలిన పాండవులు చూశారు. వారిద్దరూ ఒకరినొకరు గట్టిగా ఒడిసి పట్టుకొంటున్నారు. మళ్ళీ ఒకరినొకరు దూరంగా విసురుకొంటున్నారు. వారి యుద్ధవిన్యాసాల వల్ల లేచిన ధూళి, అరణ్యంలో దావాగ్నిలోని పొగలాగా వ్యాపించింది. పర్వతాకారులు, ధూళిధూసరితులు ఆ భీమహిడింబులు, మంచుతోకప్పబడిన పర్వతాల్లా ప్రకాశించారు. రాక్షసునిచే బాధింపబడుతున్న భీమసేనుని చూచి, మెల్లగా నవ్వుతూ అర్జునుడిలా అన్నాడు. 'భీమసేనా! నీవు భయపడవద్దు. నీవు భయంకరుడైన రాక్షసునితో యుద్ధం చేస్తున్నా వని, అలసట చెందావని, ఇంతవరకు తెలుసుకోలేకపోయాం. భీమా! నీకు నేను సహాయంగా వచ్చాను. ఈ రాక్షసుని నేను

సంహరిస్తాను. నకులుడు, సహదేవుడు అమ్మను రక్షిస్తారు భీముడు." "అర్జునా! నీవు కంగారుపడవద్దు. ఉదాసీనంగా చూస్తూ ఉండు. నాబాహువుల మధ్యపడిన ఈ రాక్షసుడు ఎంతమాత్రం జీవించి బయటపడడు." అర్జునుడిలా అన్నాడు. "భీమసేనా! వీడు పాపాత్ముడు, రాక్షసుడు. వీడు చాలాసేపు బ్రతకరాదు. శత్రుమర్దనా! మనం ప్రయాణం కొనసాగించవలసి ఉంది. ఇక్కడే చాలాకాలం ఉండిపోవటం తగని పని. భీమసేనా! తూర్పు దిక్కు ఎర్రబడుతోంది. పూర్వసంధ్యాకాలం ప్రారంభమవుతోంది. భయంకరమైన ముహూర్తంలో రాక్షసుల బలం పెరుగుతుందంటారు కదా! భీమా! తొందరపడు. వీడితో ఆడుకోకు. వెంటనే ఈ భయంకరమైన రాక్షసుని సంహరించు. ఇంకా ఆగితే వీడు మాయలు పన్నుతాడు. వెంటనే నీ భుజబలం చూపించు." అర్జునుని హెచ్చరికతో భీముడు మండిపడుతూ ప్రళయకాలంలో వాయుదేవున కుండే అసాధారణమైన బలాన్ని కూడదీసుకొన్నాడు. భీముడు కోపంతో మేఘంలాంటి రాక్షసుని శరీరాన్ని పైకెత్తి వందరెట్లు వేగంగా త్రిప్పటం ప్రారంభించాడు.

భీముడు హిడింబునితో ఇలా అన్నాడు. "రాక్షసా! నీమాంసం వ్యర్థం. నీపుష్టి వ్యర్థం. నీవు వ్యర్థంగానే వృద్ధిని పొందావు. నీబుద్ధి నిరుపయోగమైనది. నీవు నిష్ప్రయోజనంగా చావడానికి తగినవాడవు. నీబ్రతుకే వ్యర్థం. నేటితో నీకథ ముగుస్తుంది. రాక్షసా ! ఈఅరణ్యానికి క్షేమం కల్గిస్తాను. ఈవనం నిష్కంటకం అవుతుంది. జీవితంలో ఇంకెప్పుడూ మనుష్యులను చంపి తినే అవకాశం నీకు ఉండదు." అర్జునుడిలా అన్నాడు. "భీమసేనా! ఈ రాక్షసుని యుద్ధంలో చంపటం నీకు కష్టమనిపిస్తే చెప్పు. నీకు నేను సహాయం చేస్తాను. వీడిని మాత్రం ఆలస్యం చెయ్యకుండా వెంటనే చంపు. లేదా! సహాయమెందుకు, నేను వాడిని సంహరిస్తాను. ఇంతవరకు చాలా శ్రమించావు. నీవు విశ్రాంతిని పొందు." జనమేజయా! అర్జునుని మాటలు విన్న భీమసేనుడు మిక్కిలి కోపించి, హిడింబుని బలంగా భూమి మీద విసిరికొట్టి, పిండి పిండి చేసి, పశువును చంపినట్లు చంపాడు. భీమునిచే చంపబడుతున్న హిడింబుడు పొలికేక పెట్టాడు. నీటితో తడిసిన దుందుభి మ్రోగినట్లు ఆ కేక వనమంతా వ్యాపించింది. మహాబాహుడు భీమసేనుడు, హిడింబుని రెండు బాహువులతో బంధించి, మధ్యకు విరిచి, పాండవుల కానందాన్ని కల్గించాడు. హిడింబుడు చనిపోవటం చూచి, చురుకైన పాండవులు శత్రునాశకుడూ, పురుషశ్రేష్ఠుడూ అయిన భీమసేనుని పరిపరివిధాల ప్రశంసించారు. భీమసేనుని పూజించి, అర్జునుడు భీమసేనునితో మళ్లీ ఇలా అన్నాడు. "భీమా! ఈ అరణ్యానికి చాలా దగ్గరగా నగరం ఏదో ఉందని భావిస్తున్నాను. నీకు శుభం జరగాలి. మనం వెంటనే ఇక్కడ నుండి వెళ్ళిపోదాం. సుయోధనుడికి మనజాడ

తెలియరాదు." మహారథులు పాండవులందరూ, అలాగే చేద్దామన్నారు. పురుషశ్రేష్ఠులైన పాండవులు తల్లితో బయలుదేరారు-వెంట హిడింబ వచ్చింది.

154. భీమ హిడింబల కలయిక - ఘటోత్కచుని పుట్టుక.

(హిడింబ మాట్లాడకుండా పాండవులను శీఘ్రంగా అనుసరించటం ప్రారంభించింది. వారిని సమీపించింది. మిగిలిన వారినందరినీ గౌరవిస్తూ భీమసేనునితో ఇలా అంది. 'నేను మిమ్మల్ని చూసినప్పటి నుండీ మన్మధుని వశమయ్యాను. క్రూరమైన సోదరుని మాటను కాదని మిమ్మల్నే అనుసరిస్తున్నాను. అతి భయంకరుడైన రాక్షసునిపై మీరు చేసిన పరాక్రమాన్ని చూశాను. నేను మిమ్మల్ని, నీశరీరాన్ని సేవిస్తాను.")

భీమసేనుడిలా అన్నాడు. "హిడింబా! రాక్షసులు మోహాన్ని కల్గించే మాయతో ప్రవర్తిస్తారు. అయినా వారి మనస్సుల్లో వైరం ఎప్పటికీ మాసిపోదు. కనుక నీవు కూడా నీ అన్నగారి మార్గాన్ని ఆశ్రయించటం మంచిది." యుధిష్ఠిరుడన్నాడు - "పురుషశ్రేష్ఠా! భీమసేనా! ఎంత కోపం ఉన్నా స్త్రీని చంపవద్దు. పాండవా! **శరీర రక్షణం కంటె ధర్మరక్షణ ముఖ్యం.** చంపడానికి వస్తున్న మహాబలుని హిడింబుని నీవు చంపనే చంపావు. అతని సోదరి ఈమె. ఈమెకు కోపం వస్తే మనల నేం చెయ్యగలదు?" వెంటనే హిడింబ చేతులు జోడించి, కుంతికి, యుధిష్ఠిరునికీ నమస్కరిస్తూ ఇలా పలికింది. "పూజ్యురాలా! స్త్రీలు అనంగుని వల్ల ఎంత దుఃఖిస్తారో నీకు తెలుసు. శుభాంగీ! భీమసేనుని మీద ప్రేమతో నాకలాంటి దుఃఖం ఏర్పడింది. ఆ మహాదుఃఖాన్ని సరియైన సమయం కోసం ఎదురుచూస్తూ సహించాను. ఆ శుభతరుణం ఇప్పుడు వచ్చింది. నాకు సుఖం లభించే కాలం వచ్చిం దనుకొంటున్నాను. నేను స్నేహితులను, స్వధర్మాన్ని, నావారిని విడిచిపెట్టాను. పవిత్రురాలా! నీపుత్రుని- పురుషశ్రేష్ఠుని -భర్తగా వరించాను. యశస్వినీ! ఈ వీరునిచేత, నీచేత నేను తిరస్కరింపబడితే ఇక నేను జీవించలేను. ఇది ముమ్మాటికీ నిజం. నీవు నావిషయంలో దయచూపాలి. మార్ఖురాలనో, భక్తురాలనో, సేవకురాలనో అనుకొని నామీద దయచూపించు. పూజ్యురాలా! నీకుమారుడైన భీమసేనుని నాకు భర్తగా అనుగ్రహించు. దేవరూపుడైన ఆయనను తీసుకొని నేను స్వేచ్ఛగా విహరిస్తాను. నన్ను విశ్వసించు. నీ ఆనతి ప్రకారం తిరిగి భీముని వెనక్కు తీసుకొని వస్తాను. నేను ఎల్లవేళలా మీరు స్మరించగానే మీ ముందుకు వస్తాను. మీరు కోరుకొన్న ప్రదేశానికి అందరినీ చేరుస్తాను. ఆర్యా! నన్ను యాతుధానిగా, నిశాచరిగా భావించవద్దు. మహారాణీ! నేను రాక్షసజాతిలో పుట్టిన కన్యకను. మంచి శీలవతిని. నా పేరు సాలకటంకటి. నేను

యువతిని. దివ్యమైన రూపసంపద కలదానిని. నీ పుత్రుని వృకోదరుని వరించాను. అతనితోపాటు మీ అందరికీ సేవలు చేయాలని భావిస్తున్నాను. మీరందరూ అజాగ్రత్తగా ఉన్నప్పుడు కూడా నేను అప్రమత్తంగా మిమ్మల్ని రక్షిస్తాను. ఎల్లవేళలా మీకు సేవ చేస్తాను. మీరు దుర్గమప్రదేశాల్లో, ఎత్తుపల్లాల్లో శీఘ్రంగా ప్రయాణించాలనుకొన్నప్పుడు మీ అందరినీ మోసుకొని పోతాను. మీరు అనుగ్రహించండి. భీమును అంగీకరింపచేయండి. ఆపదలను తొలగించుకోవటానికి, ప్రాణాలను నిలబెట్టు కోవటానికి, ఏదో ఒక ఉపాయాన్ని స్వీకరించాలి. ధర్మమార్గాన్ని అనుసరించేవారు తప్పక అవసరమైన ఉపాయాన్ని అంగీకరించాలి. ఎవడు ఆపదల్లోకూడా ధర్మాన్ని పాటిస్తాడో వాడు ధర్మవేత్తలలో శ్రేష్ఠు డవుతాడు. **ధర్మానికి అపాయంవీర్పడటమే ధర్మాత్ములకు గొప్ప ఆపద అవుతుంది. చేసుకున్న పుణ్యమే ప్రాణాన్ని కాపాడుతుంది. కనుకనే పుణ్యానికి ప్రాణదం - అనిపేరు** వచ్చింది. ధర్మసాధనకు అనుసరించే ఉపాయం ఏదయినా దానిని అనుసరించాలి. అలా చేస్తే నిందరాదు.

(అమ్మా! అతి తీవ్రమైన కోరికతో నేను బాధపడుతున్నాను. ఆలాంటి ప్రీని నన్ను రక్షించు. సాధుశీలులు ధర్మార్థ-కామమోక్షాల విషయంలో దయతో ప్రవర్తిస్తారు. ధర్మాదుల విషయంలో వరుల పట్ల దయతో ప్రవర్తించటం గొప్పధర్మమని ధర్మవిదులు చెపుతున్నారు. నాకు దివ్యజ్ఞానం ఉంది. జరిగిపోయిన వాటిని, జరగబోయే సంఘటనలను నేనుచూడగలను. కనుక చెప్పగలుగుతున్నాను. మీకు శ్రేయస్సు కల్గబోతున్నది. ఇచ్చట ఒక గొప్ప సరస్సున్నది. దానిలో మీరు స్నానం చేసి, ప్రక్కనే ఉన్న చెట్టువద్ద విశ్రాంతిని పొందండి. అక్కడ మీరు పద్మలోచనుడైన వ్యాసుని దర్శిస్తారు. మీ బాధలన్నీ తొలగిపోతాయి. దుర్యోధనుడు మిమ్మల్ని నగరాన్నుంచి బహిష్కరించటం, వారణావతనగరంలో ఇల్లు తగులబడటం, విదురునివల్ల మీరందరూ రక్షించబడడం, ఈ విషయాలను నేను జ్ఞాననేత్రంతో చూడగల్గుతున్నాను. వ్యాసమహర్షి శాలిహోత్రుని ఆశ్రమంలో ఉంటాడు. అచటనున్న వృక్షం వరమ పవిత్రమైనది. అది వర్షం, ఎండ, గాలులు అన్నింటినుండీ మిమ్మల్ని రక్షిస్తుంది. అచటి సరస్సులో నీరు త్రాగితే చాలు, ఆకలి దప్పులు నశిస్తాయి. శాలిహోత్రమహర్షి తన తపఃఫలంతో ఆ సరస్సును, వృక్షాన్ని నిర్మించాడు. బూడిదరంగుహంసలు, బెగ్గురుపక్షులు, హంసలు, గొరైల జంటలు అక్కడ తియ్యని గంధర్వగానం చేస్తుంటాయి." హిడింబమాటలను విన్న కుంతి గొప్పవిజ్ఞత కల్గి, సమస్త శాస్త్రాల్లో పండితుడయిన యుధిష్ఠిరునితో ఇలా అంది. 'భారతా! నీవు ధర్మాత్ములలో శ్రేష్ఠుడవు. నేను చెప్పింది శ్రద్ధగా విను. ఈమె రాక్షసస్త్రీ అయినా ధర్మాన్ని చక్కగ వివరించింది. ఒక వేళ ఈమె భావంలో ఏదైనా దోషం ఉన్నా, ఈమె భీముణ్ణి ఏమి చేయగల్గుతుంది? నీవు సమ్మతిస్తే వీరుడైన భీమసేనుని ఈమె సంతతికోసం భర్తగా స్వీకరిస్తుంది.")

యుధిష్ఠిరుడన్నాడు. 'హిడింబా! నీవు చెప్పినదంతా నిజమే. అందులో సందేహంలేదు.

కానీ సుమధ్యమా! నేను చెప్పినవిధంగా నీవు ప్రవర్తించాలి. సత్యాన్ని ఒప్పందాన్ని అతిక్రమించరాదు. హిడింబా! స్నానం చేసి, నిత్యకర్మలను ఆచరించి, మంగళకరవేషభాషలతో ఉన్న భీమసేనునితో నీవు విహరించవచ్చు. కానీ సూర్యాస్తమయం కాకుండా నీవు భీమసేనుని తిరిగి పంపించాలి. పగలంతా భీమునితో స్వేచ్ఛగా విహరించు. మనోవేగం కల్గిన నీవు రాత్రిమాత్రం ప్రతిరోజు మావద్దకు తీసుకొనిరావాలి.

("నీవు ఇతడిని ఎల్లవేళలా రక్షిస్తూ ఉండాలి. సంధ్యాకాలానికి ముందే ఇతనిని విడిచిపెట్టాలి. ఇలా నీవు ప్రసవవేదన వరకు విహరించవచ్చు. భద్రా! ఇది నీవు పాటించవలసిన నియమం. భీముని అప్రమత్తంగా సేవించు. నిరంతరం మనస్సుకు అనుకూలంగా వ్యవహరించు. అతనికి మేలు చేయటానికి ప్రయత్నించు." యుధిష్ఠిరుని మాటలు విన్నది హిడింబ. కుంతిచేత గారవింపబడింది. యుధిష్ఠిరుడు ముందుగా నడుస్తున్నాడు. తరువాత నకులసహదేవులు, ఆ తర్వాత భీమసేనుడు అతనివెనుక హిడింబ, హిడింబ వెనుక అర్జునుడు నడుస్తూ వారందరూ నీటికోసం శాలిహోత్రుని సరస్సు చేరుకొన్నారు. అక్కడకు చేరిన పిదప హిడింబ యుధిష్ఠిరుడు చెప్పినట్లే చేస్తానని ప్రతిజ్ఞ చేసింది. పిదప అచటి చెట్టును సమీపించి హిడింబ, ఆ ప్రదేశాన్ని చక్కగా బాగుచేసి, పాండవులందరికీ నివసించటానికి ఆకులతో పర్ణశాలను నిర్మించింది. తనకూ, కుంతికి వేరే ఒకచోట పర్ణశాల ఎర్పరచింది. తర్వాత పాండవులందరూ సరస్సులో స్నానాలు చేశారు. పరిశుద్ధులై సంధ్యావందనం చేశారు. ఆకలిదప్పులతో నీటితోనే కాలక్షేపం చేస్తున్నారు. శాలిహోత్రుడు పాండవులను ఆకలిగొన్నవారినిగా తెలిసికొని, గొప్ప భోజనాన్ని, వివిధ పానీయాలను వారికి కల్పించాడు. తర్వాత పాండవులందరూ, కుంతి విశ్రమించారు. పిదప లక్క్యిల్లు తగలబడటం, హిడింబుని వృత్తాంతం, ఇంకా అనేక విషయాలు మాట్లాడుకొన్నారు. చివరకు కుంతీదేవి భీమసేనునితో ఇలా అంది. "నీకు పాండురాజు ఎలా మాన్యుడో యుధిష్ఠిరుడూ అంతే. ధర్మమాలోచిస్తే తల్లినైన నేను అంతకంటె మాన్యురాలను. కనుక పాండురాజు మేలుకోసం, యువరాజా! నేను చెప్పినట్లు చెయ్యి. వృకోదరా! పాపి దుర్బుద్ధి అయిన దుర్యోధనుడు అవమానించాడు. అతనికి ప్రతీకారం ఎలా చెయ్యాలో అర్థంకాదు. అయితే కొద్దికాలంలో మనకు యోగక్షేమాలు కల్గుతాయి. ఈ నివాసం మనకు మంచిది. అన్యులకీ ప్రదేశం దుర్గమం. ఇక్కడే మనం సుఖంగా కాలక్షేపం చేద్దాం. వృకోదరా! నేడు మనకు ధర్మసంకటం వచ్చింది. మహాప్రాజ్ఞా! నిన్ను చూడగానే యీ హిడింబ మదనవరవశ అయింది. దాని కారణంగా దుఃఖిస్తోంది. ధర్మప్రకారం నన్ను, యుధిష్ఠిరుని ప్రార్థించింది. నిన్ను పెళ్ళాడాలని కోరింది. ధర్మంకోసం నీవు ఈమెకు పుత్రుని ప్రసాదించు. అతనివల్ల మనకు మేలు జరుగుతుంది. నీవు వాదించవద్దు. నేను, యుధిష్ఠిరుడు చెప్పినట్లు చెయ్యి.)

భీమసేనుడు తల్లిచెప్పినమాటను అంగీకరించాడు. తర్వాత హిడింబతో అన్నాడు. "రాక్షసీ! నీకు నేను ఒక నియమాన్ని చెప్తాను. శ్రద్ధగా విను. నిష్ఠగా పాటించు. సుందరీ! నీకు కొడుకు పుట్టేవరకు మాత్రమే నీతో నేను కలిసిఉంటాను." అప్పుడు హిడింబ, నీవు

చెప్పినట్లే చేస్తానని ప్రతిజ్ఞ చేసి భీమసేనుని తీసుకొని ఆకాశంలోకి ఎగిరిపోయింది. ఆ హిడింబ భీమసేనునితో చక్కగా విహరించింది. అతనిని పరిపరివిధాల ఆనందపరిచింది. అందమైన కొండకొమ్ములలో, దేవాలయప్రాంతాల్లో, మృగాలు పక్షులతో నిండిన సుందరప్రదేశాల్లో వారు సంచరించారు. హిడింబ సర్వాభరణాలు, అందమైన రూపాన్ని ధరించి, తియ్యతియ్యగా మాట్లాడుతూ భీమని ఆలరించింది. తీగలు, చెట్లు పుష్పించిన దుర్గమారణ్యాల్లో, పద్మాలతో కలువలతో శోభించే అందమైన సరస్సుల్లో, నదుల్లో, ద్వీపాల్లో, వైదూర్యమణుల్లా భాసించే ఇసుకతిన్నెల్లో, మంచి తీర్థాల్లో, కొండవాగుల్లో, పుష్పించిన తీగలు చెట్లతో నిండిన ఆశ్చర్యకరమైన అడవుల్లో, హిమవత్పర్వతం మీది పొదరిళ్ళలో, పలువిధాలైన గుహల్లో, స్వచ్ఛమైన నీటితో వికసించిన శతపత్రపద్మసరోవరాల్లో, అందమైన నీటి చెలమల్లో, మద్ది వనాల్లో, దేవతలకు ప్రసిద్ధమైన అడవుల్లో, పుణ్యప్రదేశాల్లో, కొండచరియల్లో, యక్షులనివాస ప్రదేశాల్లో, తాపసాశ్రమాల్లో, అన్ని ఋతువుల ఫలాలతో అందమైన మానస సరోవరప్రాంతాల్లో, అద్భుతమైన అందమైన రూపాన్ని ధరించి హిడింబ, భీముడిని ఆనందంలో ఓలలాడించింది. ఆయా ప్రదేశాల్లో మనోవేగాలతో ప్రయాణించింది. ఆ రాక్షసి .భీమసేనునివల్ల ఒక పుత్రుడిని కన్నది. అతడు భయంకరలోచనుడు, పెద్దనోరు, శంకువుల్లాంటి చెవులు ఉన్నవాడు. భయంకరుడు. అతని కంఠధ్వని భయంకరమైనది. అతడు ఎర్రని పెదవులు, వాడియైన కోరలు, గొప్పబలం, ధనుస్సు, పరాక్రమం, అమితమైనబలం, ఎగుభుజాలు, మహావేగం, పెద్దశరీరం, గొప్పమాయలు, పొడవైన ముక్కు, విశాలమైన వక్షఃస్థలం, భయంకరమైన పిక్కలు వీటితో శత్రుమర్దనుడుగా ఉన్నాడు. అతనివేగం భయంకర మైనది. అతనిబలం చాలా గొప్పది. మనుష్యునికి పుట్టినా, అమానుషమైన శక్తికలవాడు. పిశాచాలను, రాక్షసులను అందరినీ జయించే శక్తి కలవాడు. రాజా! అతడు బాలుడైనా, మనుష్యుల్లో యువకునిలా ఉన్నాడు. అతడు గొప్పవీరుడు. అన్నిఅస్త్రాల విషయంలో గొప్ప ప్రజ్ఞను కలిగి ఉన్నాడు. అతడు ఎంతో బలవంతుడు. రాక్షసస్త్రీలు గర్భాన్ని ధరించిన వెంటనే ప్రసవిస్తారు. స్వేచ్ఛగా కావలసిన రూపాన్ని ధరిస్తారు. వారు అనేక రూపాలతో ఉండగలరు. గొప్ప విలుకాడైన ఆ బాలుడు ఆనందంగా తల్లితండ్రుల పాదాలకు నమస్కారం చేశాడు. తల్లితండ్రులు అతనికి పేరు పెట్టారు. హిడింబ వీడి **శిరస్సు జుట్టులేకుండా (పైకి లేచిన జుట్టుతో) ఉంది అన్నది. తల్లి ఇలా అనటంవల్ల వాడికి ఘటోత్కచుడని పేరు వచ్చింది.** ఆ ఘటోత్కచుడు పాండవులందరిపట్ల ప్రేమాభిమానాలు పెంచుకొన్నాడు. వారందరికీ ప్రీతిపాత్రు డయ్యాడు. పాండవులకు

వాడు నిత్యం సేవాపరాయణుడుగా ఉన్నాడు. పిదప హిడింబ, భీమసేనునితో కలిసి ఉండే సమయం అయిపోయిందని పాండవులతో చెప్పి, (ఎప్పుడు స్మరించినా వస్తాను) ప్రతిన చేసి తాను కోరుకొన్నచోటుకు వెళ్ళింది. పెద్ద శరీరంకల ఘటోత్కచుడు కుంతితోసహా పాండవు లందరికీ తగినవిధంగా నమస్కరించి, వారితో ఇలా అన్నాడు. 'పుణ్యాత్ములారా! పూజ్యులైన మీకు నేను ఏమిసేవ చెయ్యగలనో నిస్సందేహంగా సెలవివ్వండి.' అప్పుడు కుంతి భీమసేనుని కుమారునితో ఇలా పలికింది. "ఘటోత్కచా! నీవు కురువంశంలో పుట్టావు. సాక్షాత్తుగా భీమసేనునితో అన్నివిధాలా సరిపోలి ఉన్నావు. పాండవులైదుగురికీ నీవు జ్యేష్ఠ పుత్రుడవు కనుక అందరికీ సహాయంగా ఉండవలసింది". కుంతి ఇలా అనగానే ఘటోత్కచుడు నమస్కారం చేసి ఇలా అన్నాడు. 'రావణుడు, ఇంద్రజిత్తు ఇద్దరూ గొప్పబలవంతులు. అదేవిధంగా నేను కూడా మానవుల్లో ప్రత్యేకమైన వాడిని, దేహబలపరాక్రమాల్లో తండ్రి అంతటి వాడను. మీకు నాతో పని ఉన్న కాలంలో మీముందుకు వస్తాను' అని తండ్రులవద్ద సెలవు తీసుకుని, ఆ రాక్షసశ్రేష్ఠుడు ఉత్తరదిక్కుగా బయలుదేరి వెళ్ళాడు. అతడు, మహాత్ముడైన ఇంద్రుని చేత, 'శక్తి' ఆయుధం దెబ్బను తట్టుకునే వానిగా, అసమానపరాక్రమశాలి కర్ణునికి సరిజోడుగా, మహారథునిగా సృష్టింపబడ్డాడు.

155. పాండవులు వ్యాసుని దర్శించుట - ఏకచక్రాపురమున ప్రవేశించుట.

మహారథులైన పాండవులు ఒక అరణ్యం నుండి మరొక అరణ్యానికి ప్రయాణం సాగిస్తూ, మధ్యలో ఎన్నో మృగసమూహాలను హింసిస్తూ, (వ్యాస దర్శనం కోసం) త్వరపడుతూ, ముందుకు సాగారు. పాండవులు మత్స్య, త్రిగర్త, పంచాల, కీచక దేశాలకు సంబంధించిన అందమైన అరణ్యప్రదేశాలను, సరస్సులను చూసుకొంటూ ముందుకు సాగిపోయారు. పాండవులు తమజుట్టును జడలుగా చుట్టుకొని, నారబట్టలను చర్మాలను ధరించారు. ఆ మహాత్ములందరూ కుంతితో సహా తాపసవేషం ధరించారు. కొన్నిచోట్ల ఆ మహారథులు తమతల్లిని మోసుకొంటూ వేగంగా ప్రయాణించారు. కొన్ని చోట్ల ఇష్టానుసారం మెల్లగా ముందుకు వెళ్ళారు. మళ్ళీ వారు కొన్నిచోట్ల వేగంగా ప్రయాణించారు. పాండవులు ఉపనిషత్తులను, వేదవేదాంగాలను నిత్యం అధ్యయనం చేసేవారు. నీతిశాస్త్రాన్ని అధ్యయనం చేస్తున్న సర్వజ్ఞులైన పాండవులు ఒకానొకరోజున తాతగారైన వ్యాసుని దర్శించారు. అప్పుడు శత్రుమర్దనులైన పాండవులు మహాత్ముడైన కృష్ణద్వైపాయనునికి నమస్కరించి, తల్లితో

సహా అందరూ అంజలి ఘటించారు.

వ్యాసుడన్నాడు. "భరతోత్తములారా! మీకు వచ్చిన ఈ కష్టం గురించి నాకు ముందుగానే తెలిసింది. మీరు ధృతరాష్ట్ర కుమారులచేత అధర్మంగా బహిష్కరింపబడ్డారు. అది తెలిసి నేను మీకు పరమహితాన్ని కలుగచేయాలని వచ్చాను. ఈవిషయంలో మీరు విచారించవద్దు. ఇదంతా మీ యొక్క సుఖానికే వచ్చింది. నాకు మీరు, వారు సమానులే. అందులో సందేహంలేదు. **మానవులు దైన్యాన్ని, బాలత్వాన్ని పరిగణించి స్నేహం చేస్తారు. ఆ కారణంగానే మీయందు నాకు ఇప్పుడు ఎక్కువ స్నేహం ఏర్పడింది.** ఆస్నేహంతోనే నేను మీకొక మేలు చేయా లనుకొంటున్నాను. దాన్ని గ్రహించండి. ఇదుగో సమీపంలోనే ఆరోగ్యకరమూ, రమణీయమూ అయిన నగరం ఉన్నది. మీరందరూ మారువేషాల్లో నేను తిరిగి వచ్చేవరకు ఇచ్చటనే ఉండండి." ఈవిధంగా వ్యాసుడు వారందరినీ అనునయించి, ఏకచక్రాపురం వైపు బయలుదేరుతూ కుంతిని ఇలా అనునయించాడు. వ్యాసుడన్నాడు. "జీవత్పుత్రీ! కుంతీ! నిత్యం ధర్మపరాయణుడైన నీకుమారుడు యుధిష్ఠిరుడు మహాత్ముడు, పురుషశ్రేష్ఠుడు. ధర్మబద్ధంగానే ఈ భూమండ లాన్నంతటినీ జయిస్తాడు. సమస్తరాజులను జయించి ధర్మరాజుగా ఈ భూమినంతటినీ పాలిస్తాడు. ఇతడు సముద్రమే ఒడ్డాణమైన ఈ భూమండలాన్ని అంతటినీ భీమార్జునుల బలంతో జయించి, అనుభవిస్తాడు. ఇందులో సందేహం లేదు. కుంతీ! నీపుత్రులు, మాద్రికుమారులు, అందరూ మహారథులే. అందరూ తమదైనదేశంలో ఎల్లవేళలా దేవతల్లాగా సుఖంగా విహరిస్తారు (చక్కని మనసుతో విహరిస్తారు). ఈ పురుషశ్రేష్ఠులు భూమండలాన్నంతటినీ జయించడమే కాకుండా, రాజసూయ అశ్వమేధాదియాగాలను చేస్తారు. ఆ యాగాల్లో భూరిదక్షిణలను సమర్పిస్తారు. ఈ నీ కుమారులు, తమ తమ మిత్రవర్గాలను అనుగ్రహిస్తారు. సమస్తభోగాలను, అధికారాలను సుఖాలను అనుభవిస్తారు. తాతముత్తలనుండి వచ్చిన ఈ రాజ్యాన్ని అనుభవిస్తారు." ఈవిధంగా చెప్పి వేదవ్యాసుడు, పాండవులను ఒక బ్రాహ్మణుని ఇంటిలో నివసింపచేసి, యుధిష్ఠిరునితో ఇలా అన్నాడు. "ఇక్కడ ఒక్క మాసంపాటు గడపండి. నేను మళ్ళీవస్తాను. దేశకాలాలు తెలిసికొని జీవిస్తూ పరమానందాన్ని పొందండి." పాండవులందరూ చేతులు జోడించి, వ్యాసుడు చెప్పినదానికి సమ్మతించారు. సమర్థుడు, భగవానుడైన వ్యాసమహర్షి ఎలా వచ్చాడో అలాగే తిరిగి వెళ్ళిపోయాడు.

156. బ్రాహ్మణ కుటుంబమునకు విపత్తు.

జనమేజయుడడిగాడు. 'ద్విజశ్రేష్ఠా! మహారథులు కుంతీపుత్రులు పాండవులు ఏకచక్రాపురాన్ని ప్రవేశించి, ఏంచేశారు?' వైశంపాయను డిలా చెప్పాడు 'మహారథులు కుంతీపుత్రులు ఏకచక్రాపురంలో ప్రవేశించి, ఆ బ్రాహ్మణుని ఇంటిలో ఎంతోకాలం నివసించలేదు. అప్పుడు పాండవులందరూ భిక్షమెత్తుకొని జీవించారు. నగరంలో ఉండే జనులందరూ వారిని చూడాలని తహతహలాడే వారు. వారు ఆ సమయంలో అవకాశాన్ని బట్టి అందమైన ప్రదేశాలను, అరణ్యాలను, రాజసంబంధమైన ప్రదేశాలను, నదులను సరస్సులను, చూస్తుండేవారు.

(ఆ నగరంలోని జనులు పాండవులను గూర్చి ఇలా అనుకొనేవారు. 'వీరు చూడముచ్చటైనవారు, బ్రాహ్మణులు, పరిశుద్ధులు, దేవతల్లా ఉన్నారు. శుభులు, బిచ్చమెత్తుకోవలసిన వారు కారు. రాజ్యాన్ని పాలించదగ్గవారు. సుకుమారులు తపశ్శీలురు. అన్ని మంచిలక్షణాలు ఉన్నవారు. నిత్యం బిచ్చమెత్తుకోవటం వీరికి తగనిపని. బహుశా వీరు ఏదో పనిమీద ఈ విధంగా సంచరిస్తున్నారేమో!' ఇలా ఆలోచిస్తూ ఆ నగరజనులు నిత్యం బంధువులు వస్తున్నారనే భావనతో రకరకాల భక్ష్యాలతో, భోజ్యపదార్థాలతో పాత్రలన్నీ నిండుగా ఉంచేవారు పాండవులు మౌనవ్రతాన్ని స్వీకరించి, భిక్షాటన చేసేవారు. తల్లిమీదుండే ప్రేమతో పాండవులు, ఆలస్యం చేస్తే అమ్మ బాధపడుతుందనుకొంటూ, వేగంగా ఇంటికి తిరిగివస్తుండేవారు.)

నిత్యం రాత్రివేళలో తాము సంపాదించిన భిక్షలో వచ్చిన పదార్థాలను కుంతికి సమర్పించేవారు. ఆవిడ పంచి యిచ్చినట్లు పాండవులు ఎవరి భాగాలను వారు విడివిడిగా భుజించేవారు. ఆ వీరులందరూ తల్లితో కలిసి ఒక సగభాగాన్ని మాత్రం తినేవారు. మిగిలిన సగభాగాన్ని మహాబలుడు భీమసేనుడు భుజించేవాడు. కాలక్షేపం చేస్తున్న పాండవులకు ఆ దేశంలోనే చాలాకాలం గడిచిపోయింది.

ఒకరోజున పాండవులు భిక్షకు బయలుదేరి వెళ్ళారు. భీమసేనుడు మాత్రం ఏవో మాట్లాడుతూ కుంతితోపాటు ఇంటిలోనే ఉండిపోయాడు. అపుడు బ్రాహ్మణుని నివాసంలోంచి ఆర్తస్వరం వినపడింది. భయంకరమైన ఆరోదన ధ్వనిని కుంతి విన్నది. రోదిస్తూ పరిపరివిధాల పరితపిస్తున్న ఆ బ్రాహ్మణ గృహంలోని వారిని చూసి, దయతో మంచితనంతో కుంతి జాలిపడింది. కుంతి జాలిగా భీమసేనునితో ఇలా అంది. కుమారా! ఈ బ్రాహ్మణుని ఇంటిలో మనమంతా, ధృతరాష్ట్రకుమారులకు తెలియకుండా, కోపతాపాలకు దూరంగా, గౌరవంగా సుఖంగా జీవిస్తున్నాం. ఇలాంటి భావనవల్ల నేను ఎప్పుడూ ఈ బ్రాహ్మణునికి ఏమి ప్రత్యుపకారం చెయ్యాలా అని ఆలోచిస్తూ ఉంటాను. ఎందుకంటే వారివల్ల మనం సుఖంగా జీవిస్తున్నాం కదా! **నాయనా! ఎవరికి చేసిన ఉపకారం**

నిరుపయోగం కాదో వాడే నిజమైన పురుషుడు. ఉపకారం చేసినవానికి అంతకంటె ఎక్కువ మేలు చేయటం మానవత్వం అవుతుంది.* ప్రస్తుతం ఈ బ్రాహ్మణునికి గొప్ప దుఃఖం వచ్చింది. ఇది నిజం. మనం ఈ విషయంలో ఏమైనా ఉపకారం చేయగల్గితే చాలా బాగుంటుంది." భీమసేనుడన్నాడు. "అమ్మా! వారికి ఏమి దుఃఖం వచ్చిందో, ఎవరివల్ల వచ్చిందో తెలుసుకో. అది ఎంతటి కష్టసాధ్యమైన పని అయినా దాన్ని చేయటానికి ప్రయత్నిస్తాను."

ఇలా వీరిద్దరూ మాట్లాడుకొంటుండగానే, మరొకసారి బ్రాహ్మణుని గృహం నుండి రోదనధ్వని విన్పించింది. బ్రాహ్మణుని భార్య స్వరం కూడా విన్పించింది. వెంటనే కుంతి, దూడను బంధిస్తే ఆవు కంగారు పడినట్లుగా కంగారుపడుతూ, మహాత్ముడైన బ్రాహ్మణుని ఇంటిలోనికి ప్రవేశించింది. ఆమె అక్కడ భార్య, కొడుకు, కుమార్తెలతో కూడి, తలవంచుకొని దుఃఖిస్తున్న బ్రాహ్మణుని చూసింది.

బ్రాహ్మణుడంటున్నాడు. "ఈ లోకంలో జీవితం ఎంత నీచమైనది! ఇంత సారరహితమూ, నిష్ప్రయోజనమూ అయినది మరొకటి లేదు. జీవితం దుఃఖానికి కారణం, పరాధీనమైనది. ఈ జీవితంలో అన్నీ అప్రియాలే ఉంటాయి. బ్రతికితే ఎంతో దుఃఖం అనుభవించాలి. జీవిస్తే మనస్సు, శరీరం తపిస్తాయి. జీవించి ఉన్నవానికి దుఃఖాలు రాక తప్పదు. జీవు డొక్కడే ధర్మార్థకామాలను సేవిస్తాడు. అయితే వీటితో వియోగం అంతులేని దుఃఖాన్ని కల్గిస్తుంది. కొంతమంది మోక్షం చాలా గొప్పదంటారు. నిజానికి అలాంటిది లేనేలేదు. అర్థాన్ని సాధించాలంటే పరిపూర్ణమైన నరకాన్ని అనుభవించక తప్పదు. డబ్బు కోరుకోవడమే గొప్పదుఃఖం, డబ్బు దొరికితే అంతకన్నా దుఃఖం. డబ్బు పట్ల ప్రేమ కలిగాక దానితో వియోగం వస్తే అంతకంటె దుఃఖం మరొకటి ఉండదు. ఈ ఆపదల్లోంచి బయటపడే ఉపాయం ఏదీ కన్పించటం లేదు. అలాంటిదే ఉంటే భార్యాపుత్రులతో బాధారహితమైన ఆ ప్రదేశానికి పారిపోయి ఉండేవాడిని. బ్రాహ్మణీ! లోగడ నేనీవిషయంలో గట్టిగా ప్రయత్నించాను. మనకు క్షేమం లభించే చోటికి వెళ్ళిపోదామని నీకు చెప్పాను. కానీ నీవు నామాట వినలేదు. తెలివితక్కువదానా! నేను పదేపదే కోరినా నీవు అంగీకరించలేదు. 'నాతండ్రి ఇక్కడే పెరిగాడు. నేనూ ఇక్కడే పెరిగి పెద్దదాన్నయాను' అన్నావు. నీ తండ్రి వృద్ధుడై స్వర్గానికి వెళ్ళిపోయాడు. అలాగే తల్లికూడా ఏనాడో చనిపోయింది. బంధువులందరూ

---

* **ఏతావాన్ పురుషస్తాత కృతం యస్మిన్ న నశ్యతి।**
యావచ్చ కుర్యాదన్యోఽన్య కుర్యాదభ్యధికం తతః ॥ 14

కూడా ఇప్పుడు లేరు. అలాంటి ప్రదేశంలో ఉండాలనే కోరిక నీకు ఎలా కల్గింది. బంధువులంటే పడిచచ్చే నీకు, నామాటను లక్ష్యపెట్టని నీకు, నిజమైన బంధువినాశం ఇప్పుడు వచ్చింది. ఇది నాకెంతో బాధాకరమైన విషయం. అయినా ఇది బంధువినాశం కాదు. నాకే వినాశం. ఎందుకంటే పరమక్రూరునిలాగా నేను మాత్రం జీవించి ఉండి, ఆత్మీయులను విడిచిపెట్టలేను. నీవు నా సహధర్మచారిణివి. ఎంతో సహనం కలదానివి. నాకు తల్లితో సమానంగా బాగోగులు చూస్తున్నదానివి. దేవతలు నిన్ను నాకు స్నేహితురాలిగా పంపారు. నిత్యమూ సుఖ దుఃఖాల్లో నీవే నాకు దిక్కు. నీకు ఇప్పుడు తల్లి తండ్రులు లేరు. నిత్యం గృహకృత్యాల్లో ములిగితేలుతూ ఉంటావు. నిన్ను న్యాయంగా నేను వరించాను. మంత్రపూర్వకంగా వివాహం చేసుకొన్నాను. నిన్నెలా విడిచిపెట్టను?

నీవు గొప్పవంశంలో పుట్టావు. మంచి శీలమున్నదానివి. నాకు బిడ్డల్ని ప్రసాదించావు. పతివ్రతవు. నాకు ఎన్నడూ అపకారం చేసి ఎరుగవు. నీవు నాభార్యవు. నాకోసమే జీవిస్తున్నావు. అలాంటి నిన్ను నేను నాజీవితంకోసం విడిచిపెట్టలేను. అలాంటిది నేను కుమారుని మాత్రం ఎలా విడిచిపెట్టగలను? నాకొడుకు బాలుడు. ఇంకా యౌవనం రాలేదు. రూపురేఖలింకా స్పష్టంకానివాడు. వాడిని స్వయంగా ఎలా విడిచిపెట్టను? అలాగే ఈ కుమార్తెనూ విడిచిపెట్టలేను. మహాత్ముడు బ్రహ్మ ఒక అయ్య చేతిలో పెట్టడానికి, న్యాసంగా ఆమెను నాకిచ్చాడు. నేను, నాపితృదేవతలు ఈమె సంతతివల్ల గొప్పలోకాలను పొందాలని ఆకాంక్షిస్తున్నాం. అలాంటి బాలికను, స్వయంగా కన్నదానిని ఎలా విడిచిపెట్టగలను? కొంతమంది అంటుంటారు. తండ్రికి కొడుకు మీద ఎక్కువ ప్రేమ ఉంటుందని, మరికొంతమంది కూతురిమీద తండ్రికి ఎక్కువ ప్రేమ ఉంటుందంటారు. నాకు మాత్రం ఇద్దరిమీద సమానమైన ప్రేమ ఉంది. ఏ కుమార్తె లోకస్థితికి, సంతానానికి, సుఖసంతోషాలకు కారణమైనదో అటువంటి కుమార్తెను, ఏ పాపమెరుగనిదానిని, బాలికను నేను ఏవిధంగా విడిచిపెట్టగలను? నన్ను నేను విడిచిపెట్టుకొని పరలోకానికి వెళ్ళిపోతాను. నాబాధేదో నేనే పడతాను. కానీ నావియోగాన్ని పొందిన వీరు, ఈ లోకంలో జీవించలేరుకదా! వీళ్ళలో ఏ ఒక్కరినో విడిచిపెట్టడ మనేది చాలా నీచమైన పని. పండితలోకం అసహ్యించుకొనేది. నేను ప్రాణాలర్పిద్దా మంటే.... నేను లేకపోతే వీరందరూ జీవించ లేరు. ఇలాంటి ఆపదలో నేనున్నాను. దీన్ని దాటే ఉపాయం లేదు. అయ్యయ్యో! నేడు బంధువులతో సహా నాకెలాంటి దుర్గతి కలగనున్నదో! అందరితో కలసి చనిపోవటమే మేలు. అంతే కాని నేను మాత్రం జీవించి ఉండటం మంచిది కాదు."

157. బ్రాహ్మణి తానే మరణింతు ననుట.

బ్రాహ్మణి ఇలా అన్నది. "మీరు సామాన్యుల్లా ఎప్పుడూ విచారించవద్దు, దుఃఖపడవద్దు. పండితులైన మీకు ఇది బాధపడవలసిన సమయం కాదు. మానవులందరూ ఏదో ఒకరోజున వచ్చిన చోటికి పోవలసినవారే.. **ఎలాగూ తప్పనిసరిగా జరిగితీరే విషయంలో దుఃఖించవలసిన అవసరం ఏమీ లేదు.** భార్య కాని, పుత్రుడు కాని, పుత్రిక కాని, ఎవరైనా తనకోసమే కావాలని కోరుకొంటారు. నీవు బాధపడవద్దు. నీవు మంచిబుద్ధితో ఆలోచించు. నేను స్వయంగా అక్కడకు వెడతాను. ఈలోకంలో ఏస్త్రీకయినా ఇదే పరమార్థం, సనాతన ధర్మం కూడా. ప్రాణాలను అర్పించి అయినా భర్తకు మేలు చెయ్యాలి. అలాంటి పనిని నేను చెయ్యటం మంచిది. నీకు కూడా ఈ పని సుఖాన్నిస్తుంది. దీనివల్ల పరలోకంలో ఎంతో మేలు కల్గుతుంది. ఈ లోకంలో అఖండమైన కీర్తి లభిస్తుంది. నేను నీకు చెపుతున్న ఈ ధర్మం గొప్పది. దీనివల్ల నీకు ధర్మార్థాలు పుష్కలంగా లభిస్తాయి. ఎవరైనా ఎందుకు వివాహం చేసుకొంటారో ఆ ప్రయోజనం ఇప్పటికే నెరవేరింది. ఒక కుమార్తెను, ఒక కుమారుని కన్నాను. ఆ విధంగా నేను నీ ఋణం తీర్చుకొన్నాను. నీవు పిల్లలను చక్కగా పెంచటానికి, వారిని అన్నివిధాలా రక్షించటానికి సమర్థుడవు. నీలాగ, నాకు పిల్లలను పోషించి రక్షించే శక్తి లేదు. సమస్తప్రాణాలకు ధనాలకు ప్రభువైనవాడా! నీవు లేకపోతే, బాలురైన ఈ పిల్లలను నేను ఏ విధంగా పోషించగల్గుతాను?

భర్తలేని దానను, రక్షకుడు లేనిదానను, నీవు లేకపోతే ఈ చిన్నపిల్లల జంటను, సరియైన మార్గంలో నడుస్తూ ఎలా రక్షించగలను? అహంకారంతో, గర్వంతో అనర్థులు ఈ కుమార్తెను కోరుకొంటే, వారి బారినుండి ఈమెను ఎలా రక్షించగలను? **భూమిమీద పడ్డ మాంసంముద్దను పక్షులన్నీ కోరుకొన్నట్లు భర్తలేని స్త్రీని ప్రతివాడూ కోరుకొంటాడు.*** బ్రాహ్మణోత్తమా! దుర్మార్గులచే ప్రార్థింపబడ్డ నేను, వారిచే పరిపరివిధాల ప్రలోభపెట్టబడి, సజ్జనుల మార్గంలో ఎలా ప్రయాణం చెయ్యగల్గుతాను? ఏ పాపం తెలియని, నీవంశంలో ఒక్కగానొక్క కుమార్తెను, ఈ బాలికను తండ్రితాతల మార్గమైన స్వర్గానికి పంపించటానికి నామనస్సు ఎలా ఒప్పుకొంటుంది. మీరు ధర్మ మెరిగినవారు. నిరాశ్రయురాల నైన నేను, అన్నివిధాలా లోపించిన నేను, ఈ బాలకునికి కావలసిన గుణసంపదను ఎలా అలవర్చగలను. అనాథనైన నన్ను పరాభవించి, ఈ నీకుమార్తెను కూడా, అనర్థులు

---

* **ఉత్పుష్టమామిషం భూమౌ ప్రార్థయంతి యథా ఖగాః।**
ప్రార్థయంతి జనాః సర్వే పతిహీనాం తథా స్త్రియమ్ ॥ 12

కోరుకొంటారు. నీ సద్గుణాలతో పెరిగే ఈమెను, వారికి నేను ఇవ్వకపోతే, యజ్ఞహవిస్సును కాకులు తన్నుకుపోయినట్లు, నన్ను సంక్షోభింపచేసైనా సరే అపహరించుకొనిపోతారు. బ్రాహ్మణోత్తమా! ఈ నీ కుమారుని నీకు తగ్గట్టుగా పెంచలేక, ఈ నీ కుమార్తెను, అయోగ్యులకు అప్పగించి, లోకమంతటితో అవమానాలను భరిస్తూ, చివరకు నన్ను నేను కూడా రక్షించకోలేని దాననై, మదమత్తులచేతిలో ప్రాణాలను వదలిపెట్టటం ఖాయం. ఈ పిల్లలు నీవు లేక, నేనూ లేక, చివరకు నీళ్ళులేని సరస్సులోని చేపల్లాగా నిస్సందేహంగా నశించి పోతారు.

ఏవిధంగా చూసినా నేను, కుమారుడు, కుమార్తె ముగ్గురం నీవు లేకపోతే నశించకతప్పదు. కనుక నీవు నన్ను ఒక్కదాన్నీ పరిత్యజించటం మంచిది. బ్రాహ్మణా! పుత్రవంతులైన స్త్రీలకు భర్తకంటె పూర్వం సౌభాగ్యవతిగా పరలోకానికి పోవటమన్నది మిక్కిలి కోరుకోదగ్గ విషయమని ధర్మవిదులు సెలవిస్తున్నారు.

(ఏస్త్రీకయినా తండ్రి పరిమితమైనదాన్నే ఇస్తాడు. తల్లి కూడా అంతే, కొడుకు కూడా పరిమితంగానే ఇవ్వగల్గుతాడు. అన్నింటినీ అమితంగా అందించే భర్తను ఏ స్త్రీ ఆరాధించదు?)*

ఈకొడుకును నేను విడిచిపెట్టినట్లే, కుమార్తెనూ విడిచిపెట్టాను. బంధువు లెప్పుడో విడువబడ్డారు. ప్రస్తుతం నీకోసం నా జీవితాన్ని విడిచిపెడతాను. ఎల్లవేళలా భర్తకు ప్రియాన్ని, హితాన్ని కలిగించట మనేది, స్త్రీకి పరమధర్మం. ఇది వివిధతపస్సులకంటె, నియమాల కంటె, దానాలకంటె విశిష్టమైన ధర్మం. ఇది చాలా గొప్పది. నేనిప్పుడు చేయాలనుకొంటున్న ఆ పని ధర్మబద్ధ మైనది. అందరికీ ఆమోదయోగ్య మైనది. మీకు, మీ కులానికి ప్రియాన్ని, హితాన్ని కలిగించేది. ఇష్టమైన పిల్లలు, వస్తువులు, స్నేహితులు ఆప్తులు, భార్య వీరందరూ ఆపత్కాలంలో ధర్మసంకటాన్నుంచి బయటకు చేర్చే వారని సత్పురుషులు భావిస్తారు. **ఆపదల నుండి బయటపడడానికి ధనాన్ని రక్షించుకోవాలి. ధనాన్ని విడిచిపెట్టి, అయినాసరే భార్యను రక్షించుకోవాలి. భార్య పోయినా, ధనంపోయినా సరే, తనను తాను అన్నివేళలా రక్షించుకోవాలి.**** భార్య, పుత్రుడు, ధనం, ఇల్లు ఇవన్నీ సంపాదించుకోవటం ఇహపరప్రయోజనాలను సాధించుకోవటానికే.

---

* మితం దదాతి హి పితా మితం మాతా మితం సుతః ।
అమితస్య హి దాతారం కా పతిం నాభినందతి ॥

**ఆపదర్థే ధనం రక్షేత్ దారాన్ రక్షేద్ ధనైరపి ।
ఆత్మానం సతతం రక్షేత్ దారైరపి ధనైరపి ॥ 27

ఇది పండితులు చెప్పిన సిద్ధాంతం. ఒకవైపున కులమంతా ఉన్నప్పటికీ, మరొకవైపున కులాన్ని వృద్ధిచేసే తాను ఉన్నప్పుడు, తననే రక్షించుకోవాలి కాని అన్యాన్ని కాదు. ఇది పండితులు చెప్పిన సిద్ధాంతం. పూజ్యుడా! నన్ను అనుమతించు. నాసుతులను రక్షించు. నేను చేయవలసిన పోషణను నీవే నిర్వహించు. నీకు మరొకరూపమైన నాతో నిన్ను నీవు రక్షించుకో. ధర్మాభిజ్ఞులు, ధర్మనిశ్చయ సందర్భంలో, స్త్రీ అవధ్యురాలని చెప్పారు. రాక్షసులు ధర్మవిదు లని చెప్తారు. కనుక ఆ రాక్షసుడు నన్ను సంహరించకపోవచ్చు కూడా. పురుషుడు చంపబడతాడనటంలో సందేహం లేదు. స్త్రీ చంపబడవచ్చు, చంపబడకపోవచ్చు. ఇక్కడ సంశయం ఉంది. కనుక ధర్మజ్ఞా! నన్నే అతనివద్దకు పంపటం మంచిది. నేను పొందవలసిన అనుభవాలను పొందాను. ఇష్టాలను పొందాను. ధర్మాన్ని చక్కగా ఆచరించాను. నీకు ఇష్టమైన సంతతిని ఇచ్చాను. కనుక ప్రాణాలు పోవటం, నన్నేమీ బాధించదు. నాకు పుత్రులు కలిగారు. వయస్సు ఉడిగింది. నీకు ఎప్పుడూ ప్రియం చేయాలని భావిస్తుంటాను. ఇదంతా ఆలోచించుకొనే, నేను ఈ ప్రయత్నం చేస్తున్నాను. పూజ్యుడా! నీవు నన్ను పరిత్యజించినా, కావాలనుకొంటే మరొక స్త్రీని వివాహమాడవచ్చు. తర్వాత నీవు చేయవలసిన ధర్మకార్యాలకు ఆటంకం ఏర్పడదు. పురుషులకు అనేక స్త్రీలను వివాహం చేసుకోవటం వల్ల వచ్చే అధర్మమేమీ లేదు. కానీ స్త్రీలకు మొదటి భర్తను అతిక్రమించి ప్రవర్తిస్తే పెద్ద అధర్మం ఏర్పడుతుంది. దీన్నంతటినీ చక్కగా ఆలోచించి, ఆత్మత్యాగం పెద్దలచే గర్హింపబడింది – అనే విషయాన్ని గుర్తించి, నేడు ఈ ఆపదనుండి నీవు గట్టెక్కవలసింది. వంశాన్ని ఈ పుత్రులను కూడా రక్షింపవలసింది." ఆ బ్రాహ్మణిచేత ఈ విధంగా అనునయింపబడి, బ్రాహ్మణుడు ఆమెను కౌగిలించుకొని, భార్యతో సహా కన్నీళ్ళు విడుస్తూ మిక్కిలిగా దుఃఖించాడు.

158. బ్రాహ్మణకన్య త్యాగానికి సిద్ధపడుట.

ఆ విధంగా మిక్కిలి దుఃఖిస్తున్న తల్లితండ్రుల మాటలు విన్న కుమార్తె, ఎంతగానో విలపిస్తూ వారితో ఇలా అన్నది. "మీరెందుకు అనాధల్లా, ఇంతగా దుఃఖంతో రోదిస్తున్నారు? నేను చెపుతున్న మాటలు కూడా వినండి. విని ఏది బాగుం దనుకొంటే దానిని చెయ్యండి. ధర్మం ప్రకారం, మీకిద్దరికీ, నేను విడిచిపెట్టవలసిన దానినే. అందులో సందేహంలేదు కదా! విడిచిపెట్టకతప్పని నన్ను, విడిచిపెట్టండి. నాఒక్క దానితో అంతటినీ రక్షించండి. ఎవరైనా ఆపదనుండి రక్షిస్తారనే కదా సంతానాన్ని కోరుకొంటారు. అలాంటి ఆపత్సమయం

ఇప్పుడు వచ్చింది. ఇప్పుడు నన్ను పడవగా చేసుకొని మీరు దుఃఖసాగరాన్ని దాటండి. ఆర్యా! పుత్రుడన్నవాడు ఇహ లోకంలో గాని, పరలోకంలో గాని దుర్గమమైన కష్టాన్నుండి తల్లితండ్రులను దాటించాలి. అలా చేస్తాడు కనుకనే పుత్రు డని పండితులంటారు. నాతాతలు నానుండి దౌహిత్రుని కోరుకొంటారు. వారు దేనికోసం దౌహిత్రుని కోరుకొంటారో, ఆ భయం నుండి వారిని, నాతండ్రిజీవితాన్ని పరిరక్షించటం ద్వారా స్వయంగానే రక్షిస్తాను. నా సోదరుడు బాలుడు. మీరు లోకాంతరానికి పోతే ఇతడు కూడా అనతికాలంలో నశిస్తా డనటంలో సందేహం లేదు. తండ్రి ముందే స్వర్గాన్ని పొందగా, నాసోదరుడు కూడా నశించిపోతే పితృదేవతలకు పిండప్రదానం ఎవరు చేస్తారు? వారికి పెద్ద అప్రియం జరుగుతుంది.

తండ్రిచేత, తల్లిచేత, సోదరుని చేత కూడా విడిచిపెట్టబడ్డ నేను, ఒక దుఃఖాన్నుండి, మరొక క్రొత్త దుఃఖాన్ని పొందుతూ చివరకు దిక్కులేని చావును పొందుతాను. నీవు ఏ హానీ లేకుండా జీవించినట్లయితే తల్లి, బాలుడైన సోదరుడు, వాడికి పుట్టబోయే సంతతి, పితృదేవతల కర్పించవలసిన పిండం ఇవన్నీ స్థిరంగా నిలుస్తాయి. సందేహం లేదు. పుత్రుడు తన స్వరూపమే అంటారు. భార్యను స్నేహితురా లంటారు. కుమార్తెను సంకటంగా చెప్తారు. కనుక ముందుగా నాసంకటాన్ని వదిలించుకో. నన్ను ధర్మమార్గంలో ముందుకు సాగనియ్యి. నాయనా! నీవు నన్ను విడిచిపోయినట్లయితే, నేను అనాథను, దీనురాలిని అవుతాను. ఎల్లప్పుడు ధైన్యంతో జీవించవలసివస్తుంది. చివరకు ఎక్కడో ఒకచోట తిరిగే దుర్దశను పొందవలసివస్తుంది. అయినా ఇన్ని మాట లెందుకు? ఈవంశానికి ఆపదనుండి విముక్తిని కల్పిస్తాను. దుష్కరమైన ఈ పనిని సాధించి పుణ్యఫలాన్ని పొందుతాను. బ్రాహ్మణోత్తమా! ఇన్ని చెప్పినా వినకుండా నీవే అక్కడకు వెళ్ళినట్లైతే నేను చాలా బాధపడతాను. నేను చెప్పిన విషయాన్ని ఆలోచించు. కనుక తండ్రీ! మాకోసం, ధర్మంకోసం, రాబోయే తరంకోసం, నిన్ను నీవు రక్షించుకోవాలి. ఎలాగూ విడిచిపెట్టక తప్పని నన్ను విడిచిపెట్టు. ఎలాగైనా ఈ పని చెయ్యకతప్పదు. ఆలస్యం చేస్తే సమయం మించిపోతుంది. నీవు మరణిస్తే మేమంతా ఇతరులనుండి అన్నాన్ని అడుక్కొంటూ కుక్కల్లా బ్రతకవలసి వస్తుంది. ఇంతకంటె గొప్ప దుఃఖం ఏముంటుంది? నీవు రోగరహితంగా బంధువులతోపాటు ఆపదనుండి బయటపడితే నేను అమృతలోకంలో నివసిస్తూ సుఖంగా ఉంటాను. ఇలాంటి దానంవల్ల దేవతలు, పితృదేవతలు సంతోషించారని విన్నాను. అయినా నీవుచేసే తర్పణాలతో వారు సంతసించి, మన కుటుంబానికి క్షేమాన్ని కల్గిస్తారు."

ఇలా పలువిధాలైన ఆమె ఆక్రోశాన్ని విని, తల్లి, తండ్రి, కుమార్తె ముగ్గురు కూడా మిక్కిలిగా శోకించారు. అప్పుడు ఏడుస్తున్న అందర్నీ చూస్తూ వికసించిన కన్నులతో, స్పష్టాస్పష్టంగా తియ్యని మాటలతో బాలుడైన కొడుకు ఈవిధంగా అన్నాడు. "అమ్మా! ఏడవకు! నాన్నా ఏడవకు! అక్కా బాధపడకు." అంటూ వారందరినీ పరిహసిస్తున్నట్లు ఒక్కొక్కరి దగ్గరకు వెళ్ళి వారించాడు. ఆ తర్వాత ఆ బాలుడు ఒక గడ్డిపరకను పట్టుకొని ఆనందంతో ఇలా అన్నాడు. 'ఈ గడ్డిపరకతో మనుష్యుల్ని తినే రాక్షసుడిని నేను చంపేస్తాను.' ఎంతో దుఃఖంతో ఉన్నప్పటికీ, బాలుని అస్పష్టమైన తియ్యని మాటలు విన్నవారందరికీ గొప్ప సంతోషం కల్గింది. ఇదే సరియైన సమయమని భావించి, కుంతి వారి వద్దకు వెళ్ళి, ప్రాణాలు పోయా యనుకొంటున్న వారిని, తిరిగి బ్రతికిస్తూ వారితో ఇలా అంది.

159. కుంతికి బ్రాహ్మణుడు తన దుఃఖకారణమును వివరించుట.

కుంతి పలికింది. 'అయ్యా! మీకు ఈ దుఃఖం ఏకారణంగా కల్గింది? ఉన్నదున్నట్లుగా తెలుసుకోవాలనుకొంటున్నాను. తెలుసుకొని ఈ దుఃఖాన్ని తొలగించటం సాధ్యమయితే దాన్ని పోగొట్టటానికి ప్రయత్నం చేస్తాను.' బ్రాహ్మణుడన్నాడు. 'తపోధనురాలా! నీవు మాట్లాడిన మాట మంచివారికి తగినట్లుగా ఉంది. కానీ ఈ దుఃఖాన్ని మనుష్యమాత్రుడు పోగొట్టటం సాధ్యంకాదు.

ఈ నగరానికి సమీపంలో బకుడనే రాక్షసుడున్నాడు.

(భయంకరుడు, మానవమాంసభక్షకుడు అయిన ఆ రాక్షసుడు ఇక్కడకు రెండు క్రోసుల దూరంలో ఉన్న యమునా తీరంలో ఒక గుహలో నివసిస్తున్నాడు.)

అతడు ఈ దేశానికీ, నగరానికీ రాజు. దుర్బుద్ధి కలవాడు. మనుష్యమాంసం తినేవాడు. దానితోనే వాని శరీరం బలిసింది.

(పురుషభక్షకుడైన ఆ దుర్మార్గుని చేత తినబడుతున్న ఈ నగరం ఇంతవరకు రక్షకుడైన రాజును పొందలేకపోయింది)

ఈ దేశాన్నీ, నగరాన్ని కూడా ఆ రాక్షసరాజే తన రాక్షసబలంతో రక్షిస్తుంటాడు. ఆ కారణంగా శత్రువులనుండి గానీ, ఇతర ప్రాణులనుండి కాని మాకు భయం లేదు. అతడికి వేతనంగా, ఒక బండెడు భోజనం, రెండు దున్నపోతులు, వాటిని తీసుకొని పోయే ఒక పురుషుడు, ఆహారంగా నిర్ణయింపబడ్డారు. ప్రతిగృహస్థు ఈ ఆహారాన్ని సమర్పించవలసి ఉంటుంది. అలాంటి రోజు చాలా సంవత్సరాలకు ఒక్కసారి మాత్రమే

వచ్చినప్పటికీ మానవులకు అది ఆచరించటానికి కష్టంగా ఉన్నది. దీన్నుండి విడిపించడానికి, ఏ కొందరో పురుషులు ఎప్పుడో ఒకసారి ప్రయత్నం చేస్తూ వచ్చారు. కాని ఆరాక్షసుడు వారినే కాకుండా వారి భార్యాపుత్రులను కూడా చంపి తినేస్తున్నాడు. వాస్తవానికి ఈదేశానికి రాజు వేత్రకీయగృహమనే ప్రదేశంలో నివసిస్తుంటాడు. మందబుద్ధియై ఆ రాజు ఏదో ఒక నీతినో, ఉపాయాన్నో ఆలోచించి గట్టి ప్రయత్నం చేయటం లేదు. అలాచేసి ఉంటే ఈ నగరంలోని జనులందరికీ ఈ బకుని పీడ శాశ్వతంగా వదలిపోయి ఉండేది.

మేము ఇటువంటి దురవస్థలకు తగినవారమే. ఎందుకంటే చెడ్డరాజును ఆశ్రయించాము. దుర్బలు డైన రాజు కల దేశంలో శాశ్వతంగా నివసిస్తున్నాము. బ్రాహ్మణుల్ని ఎవరు ఆదేశిస్తారు? వీరు ఎవరి ఆధీనంలో ఉంటారు? పక్షులు ఏవిధంగా స్వేచ్ఛగా తమకు నచ్చిన ప్రదేశంలో నివసిస్తాయో, అదేవిధంగా బ్రాహ్మణులు కూడా రాజు గుణగణాల్ని బట్టి ఆదేశంలో నివసిస్తుంటారు. **ముందుగా మంచిరాజును పొందాలి. తర్వాత భార్యను, పిదప ధనాన్ని పొధించుకోవాలి. ఈ మూడు సంపాదించుకొన్న పిదప బంధువులను, పుత్రులను ఉద్ధరించే ప్రయత్నం చెయ్యాలి.*** నేను ఈ మూడింటిని సాధించాను కానీ అవన్నీ తారుమారుగా చేశాను. ఆ కారణంగానే మేము ఈ ఆపదను పొంది, అందరం దుఃఖిస్తున్నాం. కులాన్ని నాశనం చేసే వంతు మాకు ఇప్పుడు వచ్చింది. నేను ఇప్పుడు భోజనాన్ని, ఒక పురుషుని, ఆ రాక్షసునికి వేతనంగా సమర్పించవలసి ఉన్నది. ఎక్కడో ఒకచోట పురుషుని కొనితేవటానికి తగిన డబ్బు నాకు లేదు. అలాగని నా ఆప్తుల్లో ఒకరిని ఆహారంగా పంపించే సామర్థ్యమూ లేదు. ఆ రాక్షసుని నుండి బయటపడటానికి పనికివచ్చే ఉపాయమేదీ నాకు కనపడటం లేదు. ఆ స్థితిలో ఉన్న నేను, గొప్ప దుఃఖసముద్రంలో మునిగిపోయాను. ఈపని మరొకరు చెయ్యటానికి తేలికయినదీ కాదు. కనుక నేడు నేను నాబంధువులందరితోపాటు ఆ రాక్షసుని వద్దకు వెడతాను. తర్వాత ఆ రాక్షసుడు మమ్మందర్నీ కలిపి తినేస్తాడు."

160. కుంతి - బ్రాహ్మణుల సంభాషణ.

కుంతి ఇలా అంది. 'బ్రాహ్మణా! రాక్షసుని భయంవల్ల నీవు దుఃఖింపపనిలేదు. ఆ రాక్షసుని నుండి విముక్తిని పొందటానికి తగ్గ ఉపాయం నాకు కన్పిస్తోంది. బ్రాహ్మణా!

* రాజానం ప్రథమం విందేత్ తతో భార్యాం తతో ధనమ్ ।
త్రయవ్య పంచమేనాప్య జ్ఞాతీన్ పుత్రాంశ్చ తారయేత్ ॥ 12

నీకు ఒక్కడే కొడుకు, బాలుడు. ఒక్కగానొక్క కుమార్తె, దీనురాలు. వీరిద్దరూ గాని, నీ భార్య గాని, నీవు గాని రాక్షసుని వద్దకు ఆహారంగా వెళ్ళడం నాకు సమ్మతం కాదు. విప్రా! నాకు ఐదుగురు కొడుకులున్నారు. వారిలో ఒకడు మీ బదులు, ఆహారపదార్థాన్ని తీసుకొని పాపాత్ముడైన ఆ రాక్షసుని వద్దకు వెడతాడు.' బ్రాహ్మణు డన్నాడు. 'నే నీపని చెయ్యను. నాజీవితం కోసం, అతిథియైన బ్రాహ్మణుని యొక్క జీవితాన్ని బలి చెయ్యను. కులహీనులు, అధర్మపరులు కూడా ఇలాంటి పనులు చెయ్యరు. ఒక బ్రాహ్మణుని ప్రయోజనం కోసం తనను గాని, తన కుమారుని గాని విడిచిపెట్టడమే ఉచితం. నాకు ఏది మేలు కల్గిస్తుందో, దానిని నిశ్చయించు కోవాలి. బ్రహ్మహత్యకు ఒప్పుకోవటమా, ఆత్మహత్యకు అంగీకరించడమా? ఈరెంటిలో నాకు ఆత్మవధయే మేలు చేస్తుంది. బ్రహ్మహత్య మహాపాపం. దాన్నుండి బయట పడలేము. ఆత్మహత్య బుద్ధిపూర్వకంగా చేయటం లేదు. కనుక ఆత్మవధకు అంగీకరించడమే నాకు మేలు. భద్రా! నేను నాకుగా మృత్యువును కోరటం లేదు. పరులు నన్ను చంపితే, దానివల్ల నాకు పాపం ఎంతమాత్రం రాదు. బుద్ధిపూర్వకంగా నేను బ్రాహ్మణవధకు అంగీకరిస్తే అంతకంటె నీచమైన, క్రూరమైన పని మరొకటి ఉండదు. దీనికి ప్రాయశ్చిత్తం కూడా లేదు. **ఇంటికి వచ్చిన వాడిని, శరణు వేడుకున్నవాడిని, ప్రాణాలకోసం ప్రార్థిస్తున్నవాడిని, చంపటం చాలా నీచమైనది. పండితులు అసహ్యించుకొంటారు.** నలుగురూ నిందించే పని చేయరాదు. నీచమైన పనిని ఎట్టిపరిస్థితుల్లోనూ చెయ్యకూడదు. ఈవిధంగా ఆపత్కాలంలో చేయదగిన ధర్మాలను తెలిసిన మహాత్ములు చెపుతున్నారు. కనుక భార్యాపుత్రసహితంగా నేను స్వయంగా మరణించటమే మంచిది. ఏ పరిస్థితుల్లోనూ బ్రాహ్మణవధకు నేను అనుమతించను.'

'విప్రా! బ్రాహ్మణుల్ని రక్షించాలన్నదే నా స్థిరమైన అభిప్రాయం. నాకు వందమంది కుమారులున్నా, ఏ కుమారుడూ అనిష్టమైనవాడు కాదు. కానీ ఈ రాక్షసుడు నా కుమారుని చంపటానికి సమర్థుడు కాదు. నా కొడుకు చాలా శక్తికలవాడు, మంత్రసిద్ధిని పొందినవాడు. తేజశ్శాలి. మీరు పంపిన భోజనాన్ని నాకొడుకు రాక్షసుని వద్దకు చేరుస్తాడు. రాక్షసుని నుండి తాను విముక్తిని కూడా పొందుతాడు. ఇది నా నిశ్చితాభిప్రాయం. నాపుత్రుడు చాలా మంది రాక్షసుల్ని ఢీకొన్నాడు. ఎంతో మంది రాక్షసుల్ని చూశాడు. వారెంతో బలవంతులు. మహాశరీరులు. కాని వారందరూ నాకొడుకుచేతిలో చచ్చిపోయారు. ఈవిషయం మీరు ఎవ్వరితోను చెప్పవద్దు. కుతూహలంతో విద్యల్ని ఆశించేవారు, నాకొడుకులను నాకు దూరం చేసే ప్రమాద మున్నది. ఒకవేళ నాసుతులు గురువు ఆజ్ఞను పొందకుండా, ఏదైనా విద్యను ఉపదేశించినా, ఆ విద్య ఆశించిన ఫలితాన్నివ్వదని పెద్దలంటారు.'

కుంతి ఇలా చెప్పగానే ఆ విప్రుడు, భార్య పరమానంద పడ్డారు. అమృతసమానమైన కుంతి మాటలు విని, వారు ఆమెను గౌరవించారు. తర్వాత కుంతి, బ్రాహ్మణుడు కలసి భీమసేనునితో చెయ్యవలసినది చెప్పారు. భీముడు అలాగే చేస్తానని వారిద్దరకు చెప్పాడు.

161. కుంతీ యుధిష్ఠిరుల సంవాదము.

నేనీపని చేస్తానని భీమసేనుడు ప్రతిజ్ఞ చేశాడు. తర్వాత పాండవు లందరూ భిక్షను తీసుకుని ఇంటికి తిరిగివచ్చారు. యుధిష్ఠిరుడు భీమసేనుని ఆకారాన్ని చూడగానే ఏదో చేయబోతున్నాడని గ్రహించాడు. పిదప రహస్యంగా తల్లిని సమీపించి ఇలా ప్రశ్నించాడు. భీమసేనుడు ఏమి చేయబోతున్నాడు? ఆ పనిని నీ అనుమతితో చేస్తున్నాడా? లేక తనకు తానే చేయబోతున్నాడా?' కుంతి అన్నది. 'బ్రాహ్మణుని ప్రయోజనం కోసమూ, ఈ నగరానికి విముక్తిని కల్పించటానికీ, భీమసేనుడు, నా ఆదేశం తోనే ఈ పనిని చేస్తున్నాడు.' యుధిష్ఠిరుడన్నాడు. 'అమ్మా! నీవు అసాధ్యమైన, తీవ్రమైన ఈ సాహసకార్యాన్ని ఎందుకు తలపెట్టావు? సత్పురుషులు కుమారుని పరిత్యజించటాన్ని ఎంతమాత్రం ప్రశంసించరు. అమ్మా! పరుని కుమారుని కోసం నీ సొంతకొడుకుని బలిపెట్టాలని ఎలా అనుకొన్నావు? నీవు పుత్రత్యాగం ద్వారా లోకానికి, వేదానికి విరుద్ధమైన పనిని చేస్తున్నావు కదా! మనమంతా భీమసేనుని పరాక్రమాన్ని నమ్ముకొనే కదా, సుఖంగా నిద్రపోగలుగుతున్నాం. భీముని పరాక్రమం ద్వారానే కదా, నీచులు అపహరించిన రాజ్యాన్ని తిరిగి సాధించాలని కోరుకొంటున్నాం. అసామాన్య పరాక్రమశాలి అయిన భీముని బలాన్ని తలుచుకొనే కదా, దుర్యోధనుడు, శకునితోపాటు, దుఃఖంతో రాత్రులన్నీ నిద్రలేకుండా గడుపుతున్నాడు. మనమంతా భీముని పరాక్రమం వల్లేకదా లక్క్యింటి నుండి, ఇతర పాపాత్ములనుండి బయటపడగలిగాము. అతని చేతనే కదా దుర్మార్గుడైన పురోచనుడు చంపబడ్డాడు. భీముని బలం మీద నమ్మకంతోనే కదా, సంపదలతో నిండిన ఈ భూమిని, ధృతరాష్ట్రసుతులను సంహరించి, తిరిగి పొందాలని భావించగల్గుతున్నాం. అటువంటి భీమసేనుని ఏమి ఆలోచించి నీవు విడిచిపెట్టాలనుకొన్నావు? అనుభవించిన దుఃఖాలవల్ల మనస్సుతోపాటు నీబుద్ధికూడా నశించిపోలేదు కదా!"

కుంతి అన్నది. యుధిష్ఠిరా! నీవు భీముని విషయంలో బాధపడాల్సిన పనిలేదు. ఈ నాప్రయత్నం తెలివి తక్కువతనం వల్ల చేస్తున్నది కాదు. కుమారా! ఈ బ్రాహ్మణుని ఇంటిలో మనం అందరం చాలా సుఖంగా బ్రతుకుతున్నాం. దుర్యోధనాదులకు తెలియకుండా, క్రోధాదులకు అతీతంగా, గౌరవంగా మనమంతా జీవించగల్గుతున్నాం. పార్థా! బ్రాహ్మణుని

ఉపకారానికి ప్రత్యుపకారం చెయ్యాలని ఈ పనికి పూనుకొన్నాను. నశించిపోని ఉపకారం చేసినవాడే నిజమైన మానవుడు. ఉపకారాన్ని పొందినవాడు, దానికి ఎన్నో రెట్లు ప్రత్యుపకారం చెయ్యాలి. భీముని పరాక్రమం చూశాను. లక్కఇంటిలో గొప్పపని చేశాడు. హిడింబుని సంహరించాడు. నాకు ఈ కారణాలవల్ల వృకోదరుని మీద నమ్మకం ఏర్పడింది. భీమునియొక్క బాహుబలం చాలాగొప్పది. పదివేల ఏనుగుల బలం కలవాడు. కనుకనే ఏనుగులవంటి మిమ్మందరినీ వారణావతాన్నుండి బయటకు తీసుకొని రాగలిగాడు భీమసేనుడు. బలంలో వృకోదరునితో సమానుడు మరొకడు లేడు. యుద్ధంలో సాక్షాత్తు వజ్రపాణియైన ఇంద్రుడే వచ్చినా ఎదుర్కొనగల సమర్థుడు భీముడు.

పుట్టిన వెంటనే ఒకసారి భీముడు నా ఒడినుండి జారి పర్వతం మీద పడ్డాడు. ఇతని శరీరభారం వల్ల నల్లరాయి నుగ్గయిపోయింది. కాని భీమునికి ఏ మాత్రం గాయం కాలేదు. యుధిష్ఠిరా! ఈ విషయాన్నంతటినీ పర్యాలోచించే, భీముని బలాన్ని అంచనా వేసుకొని, బ్రాహ్మణునికి ప్రత్యుపకారం చెయ్యాలని నేను నిశ్చయించాను. ఈ నిర్ణయం లోభంచేత గాని, అజ్ఞానం చేత గాని, భ్రాంతివల్ల కాని చేసిందికాదు. బుద్ధిపూర్వకంగానే ధర్మాన్ని నిర్వహించడానికి నేను ఈ ప్రయత్నం చేస్తున్నాను. యుధిష్ఠిరా! ఈ పని చెయ్యటం వల్ల రెండు ప్రయోజనాలు నెరవేరుతాయి. బ్రాహ్మణునికి ప్రత్యుపకారం చెయ్యటం ఒకటి, ధర్మాన్ని ఆచరించటం రెండవది. బ్రాహ్మణునికి, అవసరమైన ప్రయోజనాన్ని సమకూర్చే క్షత్రియుడు శుభప్రదమైన లోకాలను పొందుతాడని నేను నమ్ముతున్నాను. ఒక క్షత్రియుడు మరొక క్షత్రియుని ప్రాణాలను రక్షిస్తే, అతడు ఈ లోకంలోను, పరలోకంలోను కూడా గొప్పకీర్తిని సంపాదిస్తాడు. ఈ లోకంలో వైశ్యునకు సహాయం చేసిన క్షత్రియుడు అన్నిలోకాల్లోను ప్రజలను సంతోషింపచేస్తాడు. సందేహం లేదు. శరణన్న శూద్రుని ప్రాణభయం నుండి రక్షించిన రాజు తిరిగి ఈ లోకంలో ధనధాన్యాలున్న, రాజులచే పూజింపబడే వంశంలో జన్మిస్తాడు. పురువంశప్రదీపా! ప్రజ్ఞాశాలి వ్యాసభగవానుడు, నాకీ విషయాన్ని తెలియచేశాడు. కనుక ఈ విధంగా చెయ్యాలని నేను భావించాను."

162. బక భీమసేనుల యుద్ధము.

యుధిష్ఠిరుడిలా అన్నాడు. 'అమ్మా! దుఃఖితుడైన బ్రాహ్మణుని పట్ల దయతో, నీవు బుద్ధిపూర్వకంగా చేస్తున్న ఈ పని ఎంతో చక్కగా ఉంది. నీ దయను పొందిన బ్రాహ్మణుని రక్షించడానికి, మన భీమసేనుడు వెడతాడు. మానవభక్షకుడైన ఆ రాక్షసుని చంపి తిరిగివస్తాడు. ఇది నిజం. అమ్మా! ఈవిషయాన్ని నగరంలోని జను లెవరికీ

తెలియకుండా పూర్తిచేయాలి. దానికి తగినట్లు ఈ బ్రాహ్మణునితో నీవు మాట్లాడి, అతనికి విషయం అర్థమయ్యేటట్లు చెప్పాలి.'

(బ్రాహ్మణుని కోసం యుధిష్ఠిరునితో ఈ విధంగా సమాలోచన చేసి కుంతి, లోనికి వెళ్ళి బ్రాహ్మణపరివారాన్నంతటినీ ఓదార్చింది.)

తర్వాత కొంత రాత్రి గడిచాక, పాండుపుత్రుడు భీమసేనుడు ఆహారాన్ని తీసుకొని, (మానవభక్షకుడు) రాక్షసుడుండే ప్రదేశానికి వెళ్ళాడు. బలశాలి అయిన భీముడు, ఆ రాక్షసుని వనాన్ని సమీపించి, అతనికి పంపిన అన్నాన్ని తింటూ, పేరు పెట్టి రాక్షసుడిని పిలిచాడు. అప్పుడు ఆ రాక్షసుడు భీమసేనుని పిలుపు విని కోపించి, భీముడున్న ప్రదేశానికి, మిక్కిలి క్రోధంతో చేరుకొన్నాడు. ఆ రాక్షసుడు పెద్దశరీరంతో ఉన్నాడు. గొప్పవేగ మున్నవాడు. అతడు నడుస్తుంటే భూమి బ్రద్దలవుతున్నట్లుగా ఉంది. ఎర్రనికళ్ళు, భయంకరాకారం, గడ్డం మీసాలు జుట్టు ఎర్రగా ఉన్నాయి. అతడినోరు చెవులదాకా వ్యాపించింది. చెవులు మేకుల్లా నిటారుగా ఉన్నాయి. అతడు కోపంతో కనుబొమల్ని మూడు శిఖరాల్లా విరిచాడు. పెదవుల్ని కొరుక్కొంటూ భయంకరంగా ఉన్నాడు. ఆ రాక్షసుడు తన ఆహారాన్ని తింటున్న భీమసేనుని చూశాడు. మిక్కిలి కోపంతో కళ్ళుపెద్దవి చేసి భీమునితో ఇలా అన్నాడు. 'ఎవడ్రా నువ్వు? నాకోసం తయారు చేసిన ఆహారాన్ని నేను చూస్తుండగానే తింటున్నావు? నీవు దుర్బుద్ధివి, యమలోకానికి పోతావు.' భీమసేనుడు ఆ మాటలు విన్నాడు. వెక్కిరింతగా నవ్వాడు. ఆ రాక్షసుని లెక్క చేయలేదు. ముఖం ప్రక్కకు తిప్పుకొని భోజనం చేస్తూనే ఉన్నాడు.

ఆ మానవభక్షకుడు - రాక్షసుడు భయంకరంగా గర్జించాడు. రెండుచేతులను పైకెత్తాడు. భీమసేనుని చంపాలని అతనివైపు పరుగెత్తాడు. అయినా కూడా శత్రుమర్దనుడూ, పాండుకుమారుడూ అయిన వృకోదరుడు, ఆ రాక్షసుని చూస్తూనే, ఏమాత్రం లెక్కచేయకుండా, భోజనం చేస్తూనే ఉన్నాడు. ఆ రాక్షసుడికోపం తారస్థాయికి చేరింది. భీముని వెనుకకు వచ్చి రెండు చేతులూ బిగించి, గట్టిగ వీపుమీద కొట్టాడు. అంతటి బలశాలి రెండుచేతులతోనూ గట్టిగా కొట్టినా, భీమసేనుడు రాక్షసునివైపు చూడనేలేదు. భోజనం చేస్తూనే ఉన్నాడు. తర్వాత బలవంతుడైన ఆ రాక్షసుడు మిక్కిలి కోపంతో మళ్ళీ ఒక వృక్షాన్ని పెకలించి, భీమసేనుని కొట్టడానికి పరుగుపెట్టాడు. ఇంతలో పురుషశ్రేష్ఠుడైన భీమసేనుడు మెల్లగా మిగిలిన ఆహారాన్ని భుజించి, నీళ్ళు త్రాగి, కాళ్ళు చేతులు కడుక్కొని, మహాబలుడై యుద్ధరంగంలో నిలబడ్డాడు.

శక్తిశాలి అయిన భీముడు, కోపించిన రాక్షసుడు విసరిన ఆ వృక్షాన్ని, ఎడమచేత్తో పట్టుకొని అవహేళనగా నవ్వాడు. ఆ రాక్షసుడు ప్రయత్నపూర్వకంగా అనేక వృక్షాలను పెకలించి, భీమసేనునిమీదకు విసిరాడు. అలాగే భీముడు కూడా చెట్లను రాక్షసునిపైకి విసిరాడు. నరశ్రేష్ఠునికి, రాక్షసశ్రేష్ఠునికి మధ్య గొప్ప వృక్షయుద్ధం జరిగింది. చెట్ల వినాశానికి కారణమైన ఆ యుద్ధం భయంకరంగా సాగింది. అప్పుడు బకుడు తనపేరును ప్రకటించుకొంటూ, భీమునిమీదకు లంఘించి, తన బాహువులతో గట్టిగా పట్టుకొన్నాడు. భీమసేనుడు కూడా, ఆ రాక్షసుని, గట్టిగా కౌగలించుకొని, పెనగులాడుతున్న వానిని విరవడం ప్రారంభించాడు. ఆ నరమాంసభక్షకుడు భీమునిచేత పరిపరివిధాల అటూ ఇటూ లాగబడ్డాడు. అతడు భీమని కూడా అటూ ఇటూ లాగడం ప్రారంభించాడు. కొంతసేపటికి రాక్షసుడు చాలా అలసట చెందాడు. వారిద్దరూ యుద్ధంలో గొప్పవేగాన్ని ప్రదర్శిస్తుంటే భూమి అంతా కంపించిపోయింది. కొంతసేపటికి ఆ మహాకాయులు అక్కడున్న చెట్లన్నింటినీ నుగ్గునుగ్గు చేశారు. నరమాంసభక్షకుడైన ఆ రాక్షసుని బలం సన్నగిల్లటం గమనించిన వృకోదరుడు, అతడిని గట్టిగా భూమిమీద విసిరి కొట్టి, మోకాళ్ళతో గట్టిగా పొడిచాడు. తర్వాత భీముడు మోకాలితో ఆ రాక్షసుని నడుంవిరిచి, కుడిచేతితో బలంగా కంఠాన్ని పట్టుకొని, ఎడమచేత్తో కటివస్త్రాన్ని పట్టుకొని, భయంకరంగా అరుస్తున్న ఆ రాక్షసుని రెండుగా విరిచాడు. రాక్షసుని ముఖంనుండి రక్తం బయటకు రావటం ప్రారంభించింది.

163. నగరజనులందరు సంతోషించుట.

అప్పుడు ఆ బకుడు ప్రక్కటెముకలు విరుగుతుండగా, భయంకరంగా అరుస్తూ పర్వతంలా విరుచుకు పడిపోయాడు. బకుని ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. ఆ రాక్షసుని ఆర్తనాదం విన్న అతని అనుచరులు, పరివారమూ కూడా వారి నివాసప్రదేశాన్నుండి భయంతో పారిపోవటం ప్రారంభించారు. భీముడు భయంతో అచేతను లవుతున్న వారందరినీ ఓదార్చాడు. వారిని నియమానికి కట్టుబడేటట్లు చేశాడు. 'మీరెవ్వరూ ఎన్నడూ మనుష్యులను తిరిగి హింసించరాదు. ఎవరైనా హింసిస్తే వారిని కూడా ఈ విధంగానే వెంటనే సంహరించటం జరుగుతుంది'. అని భీముడు హెచ్చరించాడు. భీముని మాటలు విన్న ఆ రాక్షసులందరూ, అలాగే చేస్తామని చెప్పారు. ఆ ఒడంబడికకు వారు అంగీకరించారు. రాజా! ఆ నాటినుండి అచ్చటి రాక్షసు లందరూ సౌమ్యులుగా మారిపోయారు. నగరవాసు లందరూ ఈ విషయాన్ని

గ్రహించారు. భీముడు చనిపోయిన ఆ నరభక్షకుని శవాన్ని మోసుకొని వచ్చి, నగరద్వారం ముందుంచి, ఎవరికీ కనపడకుండా అక్కడనుండి వెళ్ళిపోయాడు. భయంకరబలశాలి అయిన బకుడు చావటం చూసి, అతని బంధువు లందరూ భయంతో కంపిస్తూ ఇటూ అటూ పారిపోయారు. భీముడు బకుని చంపి, బ్రాహ్మణగృహం ప్రవేశించి, యుధిష్ఠిరునికి, జరిగింది జరిగినట్లు అంతా చెప్పాడు. తెల్లవారగానే, బయటకు వచ్చిన నగరజనులు రక్తసిక్తుడై, చచ్చి పడిఉన్న రాక్షసుని చూశారు. అక్కడి నగరజను లందరూ పర్వతసమానుడు, భయంకరుడు అయిన ఆ రాక్షసుడు చచ్చి భూమిమీద పడి ఉండటం చూశారు. ఆనందంతో వారి శరీరాలు గగుర్పొడిచాయి. చూసినవారు, ఏకచక్రపురంలోనికి ప్రవేశించి, జనులందరికీ ఈ వార్తను తెలియపర్చారు. రాజా! ఆ నగరంలో ఉండే జనులందరూ, బాలురు, స్త్రీలు, వృద్ధులు కూడా చచ్చిపడిన బకుడిని చూడటానికి తండోపతండాలుగా వచ్చారు. మనుష్యులు సాధించనలవికాని ఈ గొప్పపనిని చూసి వారందరూ ఆశ్చర్యపోయారు. వారి వారి ఇష్టదైవాలకు పూజలు చేశారు. వారందరూ ఈ రోజు బకుని దగ్గరకు వెళ్ళవలసిన వంతు ఎవరిదా అని లెక్కించారు. తెలిసిన వెంటనే ఆ బ్రాహ్మణుని ఇంటికి వచ్చి పరిపరివిధాల ప్రశ్నించారు. ఈవిధంగా అనేక ప్రశ్నలను ఎదుర్కొన్న ఆ బ్రాహ్మణుడు పాండవుల గుట్టు ఎంతమాత్రం బయటకు రాకుండా, నగరప్రజ లందరినీ ఉద్దేశించి ఇలా చెప్పాడు. "నేను బకునికి ఆహారంగా వెళ్ళటానికి ఆజ్ఞాపించబడ్డాను. ఆ దుఃఖంతో నేను కుటుంబసభ్యులు ఏడుస్తున్నాం. ఆసమయంలో గొప్పమనస్సున్న మంత్రసిద్ధుడైన బ్రాహ్మణుడు కనపడ్డాడు. ఆ బ్రాహ్మణశ్రేష్ఠుడు, నన్ను ప్రశ్నించి, నాకుటుంబానికి నగరానికి ఏర్పడిన కష్టాన్ని తెలుసుకుని, నన్ను నమ్మించి, నవ్వుతూ ఇలా అన్నాడు. 'నేను ఈ అన్నాన్ని ఆ దుర్మార్గుని వద్దకు చేరుస్తాను. నా విషయంలో మీరు ఎంతమాత్రం భయపడవలసిన పనిలేదు'. అని అతడు ఆ అన్నాన్నంతా తీసుకుని బకుడున్న అరణ్యానికి వెళ్ళాడు. లోకానికి శ్రేయస్సునందించే ఈ పనిని అతడే చేసి ఉంటాడు.' ఇందులో సందేహంలేదు.' ఆ నగరంలో ఉన్న బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులూ అందరూ కూడా చాలా ఆశ్చర్యపోయారు. మిక్కిలిగా సంతోషించారు. వారు గొప్ప ఉత్సవాన్ని చేసుకొన్నారు. ఆ తర్వాత పల్లెల్లో నివసించే జనమంతా కూడా, ఆశ్చర్యకరమైన ఆ సన్నివేశాన్ని చూడటానికి నగరానికి వచ్చారు. పాండవులు మాత్రం ఆ ఇంటిలోనే ఉండిపోయారు.

164. పాండవులకు బ్రాహ్మణుడు విచిత్రకథలను వినిపించుట.

ఆ రీతిగా పురుషశ్రేష్ఠులైన పాండవులు బకరాక్షసుని సంహరించిన తరువాత ఆ నగరంలోనే, ఆ బ్రాహ్మణుని ఇంటిలోనే పరబ్రహ్మను బోధించే ఉపనిషత్తుల నధ్యయనం చేస్తూ నివసించసాగారు. తరువాత కొన్నిరోజులకు కఠోరనియమాలు గల ఒక బ్రాహ్మణుడు విడిదిచేయటానికి పాండవుల కాశ్రయమిచ్చిన బ్రాహ్మణుని ఇంటికి వచ్చాడు. ఆ బ్రాహ్మణ శ్రేష్ఠునకు ఇంటికి వచ్చినవారిని సేవించటం ఒకవ్రతం. అందుచేత ఆ బ్రాహ్మణాతిథిని కూడా చక్కగా అర్చించి, ఆశ్రయమిచ్చాడు. ఆపై మంచిమంచి కథలు వినిపిస్తున్న బ్రాహ్మణుని సన్నిధికి నరశ్రేష్ఠ లయిన ఆ పాండవులు కుంతితో కూడా వచ్చారు. ఆయన రాజుల గురించి ఆశ్చర్యకర దేశాలను గూర్చి, తీర్థాలను గురించీ, నదులను గురించీ, నగరాల గురించీ చెప్పసాగాడు. వారి సమావేశం ముగిసే సందర్భంలో ఆ బ్రాహ్మణుడు పంచాలదేశంలో యజ్ఞసేనకుమారి ద్రౌపదికి అద్భుతస్వయంవరం జరగబోతోందని చెప్పాడు. శిఖండీ ధృష్టద్యుమ్నుల పుట్టుకను గురించి, ద్రుపదుని యాగంలో అయోనిజగా ద్రౌపది జన్మించటాన్ని గురించీ వినిపించాడు. లోకాద్భుతంగా కనిపిస్తున్న బ్రాహ్మణుడు చెప్పిన వృత్తాంతాన్ని వినినంతనే పురుషశ్రేష్ఠులైన పాండవులు దానిని వివరంగా చెప్పమని ఇలా అడిగారు. 'ద్రుపదకుమారుడైన ధృష్టద్యుమ్నుడు అగ్నినుండీ, ద్రౌపది యజ్ఞవేది మధ్యనుండీ అద్భుతరీతిలో ఎలా జన్మించారు? మేటి విలుకాడైన ద్రోణునిదగ్గర ధృష్టద్యుమ్ను డెలా అస్త్రవిద్య నేర్చుకొన్నాడు. బ్రాహ్మణా! ద్రోణద్రుపదులకు సఖ్యమెలా కుదిరింది? ఏ కారణంగా వారు విడిపోయారు?' పాండవులు ఆ విధంగా ప్రశ్నించితే ఆ బ్రాహ్మణుడు ద్రౌపది జన్మవృత్తాంతాన్ని ఇలా వివరంగా చెప్పాడు.

165. ద్రోణ ద్రుపదుల వృత్తాంతము.

గంగాద్వారంలో భరద్వాజుడనే మహర్షి ఉండేవాడు. ఆయన మహాప్రాజ్ఞుడు, మహాత్ముడు, మహాతపస్సంపన్నుడు, ఎల్లప్పుడూ వ్రతదీక్షలలో ఉండేవాడు. ఆయన స్నానానికై గంగకు వెళ్ళాడు. అప్పటికే అక్కడకు వచ్చి ఉన్న ఘృతాచి అనే అప్సరసను ఆయన చూశాడు. ఆమె స్నానం చేస్తోంది. ఆమె నది ఒడ్డున బట్టలు మార్చుకొంటుంటే అక్కడి గాలి ఆమె వస్త్రాన్ని అపహరించింది. దిసమొలతో నున్న ఆమెను చూచి భరద్వాజ మహర్షి అప్పుడు కామించాడు. ఆ భరద్వాజుడు కుమారావస్థనుండి బ్రహ్మచారియే. ఆయనకు ఆమెపై మనస్సు తగులుకొనగానే వీర్యం పతనమైంది. ఆ ఋషి దానిని గిన్నెలోనికి సేకరించాడు. ఆ ధీమంతునకు దానినుండి ద్రోణు డనే కొడుకు పుట్టాడు.

ద్రోణుడు వేద వేదాంగాలు మొత్తం చదివాడు. పృషతుడు అనే రాజు భరద్వాజుని మిత్రుడు. ఆ పృషతునకు కూడా ఒక కొడుకు పుట్టాడు. అతని పేరు ద్రుపదుడు. క్షత్రియశ్రేష్ఠుడైన ఆ పార్షతుడు ప్రతిదినమూ భరద్వాజుని ఆశ్రమానికి పోయి ద్రోణునితో కలిసి ఆడుకొనేవాడు, చదువుకొనేవాడు కూడా. పృషతుడు మరణించగానే ద్రుపదుడు రాజయ్యాడు. ఆ సమయంలోనే పరశురాముడు తన సంపదనంతా దానం చేస్తున్నాడనీ, తాను అరణ్యాలను వెళ్ళగోరుతున్నాడనీ ద్రోణుడు విని ఆయన దగ్గరకు పోయి "ద్విజోత్తమా! నేను ద్రోణుడను. ధనం కోసం వచ్చాను" అని పలికాడు. పరశురాముడిలా అన్నాడు. 'బ్రాహ్మణా! ఇప్పుడు శరీరం మాత్రమే మిగిలింది. కాబట్టి ఈ శరీరాన్నో, అస్త్రాలనో ఏదో ఒకటి కోరుకో.' ద్రోణుడిలా అన్నాడు. 'అస్త్రాలనన్నింటినీ వాటి ప్రయోగోపసంహారమంత్రాలతో పాటు తమరు నాకు అనుగ్రహించండి.' పరశురాముడిలా అన్నాడు- 'అలాగే తీసుకో!' అంటూ ద్రోణునకు అస్త్రవిద్యను దానం చేశాడు. అప్పుడు ద్రోణుడు వాటిని గ్రహించి ధన్య డయ్యాడు. ద్రోణుడు పరశురాముని దగ్గరనుండి గొప్పగా ప్రశంసింపబడే బ్రహ్మాస్త్రాన్ని పొంది, పరమానందాన్ని పొంది నరులందరికన్న గొప్పవాడు అయ్యాడు. ఆ తరువాత ద్రోణుడు ద్రుపదుని దగ్గరకు పోయి "నేను నీ మిత్రుడను" అన్నాడు.

ద్రుపదుడిలా అన్నాడు- "శ్రోత్రియుడు కానివాడు శ్రోత్రియునకు మిత్రుడు కాలేడు. రథంలేని వాడు రథికునకు మిత్రుడు కాడు. రాజుకానివాడు రాజునకు మిత్రుడు కాలేడు. ఒకనాటి చెలిమి గూర్చి ఇప్పుడెందుకు?" బుద్ధిమంతుడైన ద్రోణుడు ద్రుపదునిపై పగ సాధించాలని మనస్సులో నిశ్చయించుకొని కురువంశస్థుల రాజధాని అయిన హస్తినాపురికి వెళ్ళాడు. ధీమంతుడైన ద్రోణుడు అక్కడకు వెళ్ళగా భీష్ముడు వివిధ ధనాలతో పాటు తన పౌత్రులను ఆయనకు శిష్యులుగా అప్పగించాడు. ఆ తరువాత ద్రోణుడు పాండవులతో బాటు శిష్యుల నందరినీ సమావేశ పరచి ద్రుపదుని కష్టాలపాలు చేయదలచి ఇలా అన్నాడు. 'అనఘులారా! నేను మీనుండి కొంత గురుదక్షిణను ఆశిస్తున్నాను. అస్త్రవిద్యలో కృతార్థ లయ్యారు. కాబట్టి మీరు దక్షిణ నివ్వవలసి ఉన్నది. నాకు మాట ఇవ్వండి'. అలాగే అని అర్జునుడు మొదలగు వారన్నారు. పాండవులంతా కృతాస్త్రులై గురుదక్షిణ చెల్లించటానికి నిశ్చయించుకొన్న తరువాత ద్రోణుడు గురుదక్షిణకై మరలా ఇలా అన్నాడు. "అహిచ్ఛత్రనగరానికి పృషతుని కుమారుడు ద్రుపదుడు రాజు. అతని నుండి రాజ్యాన్ని కొల్లగొట్టి వెంటనే నాకు గురుదక్షిణగా సమర్పించాలి."

(పాండవులు ధార్తరాష్ట్రులతో కలిసి పాంచాలదేశానికి వెళ్ళారు. అప్పుడు కర్ణదుర్యోధనాదులు

ఇతర క్షత్రియశ్రేష్ఠులూ ద్రుపదునితో యుద్ధం చేసి ఓడిపోయి, వెనుదిరిగారు.)

ఆ తర్వాత పాండవులు అయిదుగురూ యుద్ధంలో ద్రుపదుని ఓడించి, అమాత్యులతో సహా బంధించి ద్రోణుని సమక్షానికి తీసికొని వచ్చారు.

(అర్జునుడు మహేంద్రపర్వతం వలె ఎదిరింపరానివాడు. మహేంద్రుడు దానవులను జయించినట్లు అతడు ద్రుపదునిపై గెలిచాడు. మహాతేజస్వి అయిన అర్జునుని ఆ పరాక్రమాన్ని చూచి, ద్రుపదుని బంధుజను లందరూ మిక్కిలి ఆశ్చర్యపడ్డారు. రాజకుమారులలో అర్జునుని వంటి పరాక్రమవంతుడు లేడని కొనియాడారు.)

ద్రోణుడిలా అన్నాడు. 'రాజా! నేను మరలా నీతో మైత్రినే కోరుతున్నాను. యజ్ఞసేనా! రాజు కానివాడు రాజుకు మిత్రుడు కాలేడన్నావు గదా! అందుకోసమే -రాజ్యంకోసమే- నేను నీతో యుద్ధం చేసే ప్రయత్నం చేశాను. నీవు గంగానది దక్షిణపుఒడ్డున రాజుగా ఉండు. ఉత్తర దిక్కునకు నేను రాజును.' ధీశాలి అయిన ద్రోణుడిలా పలుకగానే మేటివిలుకాడైన ద్రుపదుడు బ్రాహ్మణసత్తముడైన ద్రోణునితో ఇలా అన్నాడు. 'ద్రోణా! అలాగే కానీ! మహామతీ! నీ కిష్టమైనరీతిగా మన పూర్వస్నేహాన్ని శాశ్వతంగా ఉండనీ!' ఈరీతిగా పరస్పరం మాటాడుకొని అరిందము లయిన ద్రోణద్రుపదులు పరమోన్నత స్నేహభావంతో ఎవరి స్థానానికి వారు వెళ్ళిపోయారు. ఆ తీవ్రపరాభవం ద్రుపదుని మనస్సులో నుండి క్షణకాలం కూడా తొలిగిపోవటం లేదు. మానసికంగా, శారీరకంగా కూడా ద్రుపదుడు కృశించిపోయాడు.

166. ధృష్టద్యుమ్న, ద్రౌపదుల జననము.

బ్రాహ్మణుడిలా అన్నాడు. 'ద్రుపదమహారాజు అసహనంతో కర్మసిద్ధిగల బ్రాహ్మణోత్తముల నన్వేషిస్తూ బ్రహ్మర్షుల ఆశ్రమాల కెన్నింటికో తిరిగాడు. కొడుకు కావాలని కోరుతూ శోకాకులితమనస్కుడై తనకు మంచిబిడ్డలు లేరని ఎప్పుడూ విచారిస్తూ ఉండేవాడు. అప్పటికే ఉన్న పిల్లలను గానీ, బంధువులను గానీ తనలోని నిర్వేదంవలన ద్రుపదుడు సహకరింపగలవారుగా పరిగణించలేదు. ద్రోణునిపై పగ సాధించాలని పెద్ద నిట్టూర్పులు విడిచేవాడు. జనమేజయా! రాజశ్రేష్ఠుడైన ద్రుపదుడు ద్రోణాచార్యునకు ప్రతీకారం చేయాలని ప్రయత్నం చేసికూడా ద్రోణుని ప్రభావం, వినయం, అధ్యయనం, చరితం కారణంగా క్షాత్రబలంతో దానిని సాధించే ఉపాయం కనిపించలేదు.

ఆ రాజు ఒకసారి గంగాయమునల ఒడ్డున సంచరిస్తూ బ్రాహ్మణనివాసస్థానమైన ఒక ప్రదేశానికి వచ్చాడు. అక్కడ బ్రహ్మచర్యాన్ని పాటిస్తూ అధ్యయనశీలుడు కాని

బ్రాహ్మణు డొక్కడు కూడా లేడు. ఆ రీతిగా ఆ మహనీయుడు (ద్రుపదుడు) యాజుడు, ఉపయాజుడు అనే ఇద్దరు బ్రహ్మర్షులను చూచాడు. వారు దీక్షితులు, శమసంపన్నులు, బ్రహ్మస్వరూపులూ. ఆ బ్రాహ్మణులు వేదాధ్యయనంలో లగ్నమైనవారు, కాశ్యపగోత్రులు, సూర్యోపాసకులు, సర్వవిధాలా యోగ్యులు, ఋషిశ్రేష్ఠులు. ఆ ఇరువురి శక్తినీ గ్రహించిన ద్రుపదుడు ఆలస్యం లేకుండా వారి సంకల్పాల నన్నింటినీ నెరవేర్చగోరి ఆహ్వానించాడు. వారిలో చిన్నవాడు ఉపయాజి వ్రతశీలి. ద్రుపదుడు ఏకాంతంలో అతనిని కలిసి కావలసినవి అందజేస్తూ తనకు అనుకూలంగా మలచుకొనే ప్రయత్నం ప్రారంభించాడు. పాదసేవలు చేస్తూ ప్రియంగా మాటాడుతూ శాస్త్రోక్తరీతిని పూజిస్తూ ఇలా అడిగాడు- "బ్రాహ్మణా! ఉపయాజా! ద్రోణాచార్యుని చంపగల కొడుకు నాకెలా పుట్టగలడు? అది నెరవేరిస్తే తమకు పదికోట్ల ఆవులను ఇస్తాను. ద్విజోత్తమా! తమ మనస్సులో మరే కోరిక ఉన్నా తీర్చగలను. కోరిన దివ్వగలను. సంశయించనవసరం లేదు." ద్రుపదుడు అలా అడగగానే ఆ ఋషి 'నేనా పని చేయ నన్నాడు.' అయినా ద్రుపదుడు మరలా ఆయనను సేవింపనారంభించాడు.

రాజా! ఆపై ఒక సంవత్సరం గడచిన తర్వాత తగినవేళలో ఉపయాజుడు ద్రుపదునితో మధురవాక్కులతో ఇలా అన్నాడు-'మా అన్న ఒకసారి అరణ్యంలో సంచరిస్తూ నేలపై రాలి ఉన్న ఒకపండును తీసికొన్నాడు. కానీ దానిని ఎలా శుద్ధిచేయాలో ఆయనకు తెలియదు. అప్పుడు నేనుకూడా మాఅన్న వెన్నంటి వెళ్తున్నాను. ఆయన చేసిన ఆ అకృత్యాన్ని చూచి నేను ఇలా అనుకొన్నాను- అపవిత్రవస్తువును స్వీకరించటానికి కూడా ఈయన ఎప్పుడూ వెనుకాడడు. పండును చూచి కూడా పాపకారణం కాగల దానిలోని దోషాన్ని గుర్తించలేదు. శుచిత్వాన్ని, అశుచిత్వాన్ని పరిశీలించటం లేదు. కాబట్టి ఏవిషయమైనా ఈయన ఇలాగే ఉంటాడేమో! గురుకులంలో ఉండి వేదాధ్యయనం చేస్తూకూడా అప్పుడప్పుడు ఇతరులు వదలిపెట్టిన భిక్షను తినేవాడు. పైపెచ్చు సిగ్గులేకుండా పదేపదే ఆ అన్నంలోని రుచిని మెచ్చుకొనేవాడు. దానినిబట్టి ఆలోచిస్తే నాసోదరుడు కేవలం ఫలాసక్తుడని నాకనిపించింది. రాజా! నీవు ఆయనదగ్గరకు వెళ్ళు. నీచేత యాగం చేయించగలడు.' ఇది విని ద్రుపదమహారాజు యాజుని మనస్సులో అసహ్యించుకొని కూడా తన పని ముఖ్యమని ఆలోచించి ఉపయాజుని మాటమేరకు యాజుని ఆశ్రమానికి వెళ్ళాడు. పూజనీయుడయిన ఆయనను పూజించి ఇలా పలికాడు.

'స్వామీ! తమకు ఎనిమిదివేల ఆవులను ఇస్తాను. నాచేత యాగం చేయించండి. ద్రోణునిమీది పగతో తపించిపోతున్న నాకు ఆనందాన్ని కల్గించండి. ఆ ద్రోణుడు

బ్రహ్మజ్ఞులలో శ్రేష్ఠుడు. బ్రహ్మాస్త్రప్రయోగంలో అందరినీ మించినవాడు. మిత్రుడు గౌరవించలేదన్న ఆలోచనతో నన్ను పరాభవించాడు. ద్రోణుడు బుద్ధిమంతుడు. కౌరవుల గురువులలో ముఖ్యుడు. ఆయనను మించిపోగల క్షత్రియుడు లోకంలో ఒక్కడు కూడా లేడు. ఆ ద్రోణుని బాణసమూహాలు శరీరాన్నీ, ప్రాణాలనూ కూడా అపహరించగలవి. ఆయన విల్లు చాలా పెద్దది. ఆరుమూరల పొడవు గలది. బ్రాహ్మణవేషంలో ఉన్న క్షాత్రమే ద్రోణుడు. మహాత్ములైన మేటివిలుకాండ్రను ఆయన తేలికగా అణచివేయగల డనడంలో అనుమానం లేదు. పరశురామునివలె క్షత్రియులను సంహరించటానికే ఆయన పుట్టినట్టుంది. ఆయన అస్త్రబలం భీకర మైనది. నరులందరూ కలిసి కూడా ఎదిరించరానిది. ఆజ్యహోమంతో జ్వలింపజేయబడిన అగ్నివలె ఆయన బ్రాహ్మతేజాన్ని ధరించి, యుద్ధంలో క్షాత్రధర్మాన్ని ముందుంచుకొని, శత్రువులను చుట్టుముట్టి దహించగలడు. ద్రోణాచార్యునిలో బ్రాహ్మక్షాత్రతేజస్సులు రెండూ ఉన్నా బ్రాహ్మతేజస్సే కొంత ఎక్కువ. కేవలం క్షాత్రబలం కారణంగా నేను ఆయన కన్న తక్కువ. కాబట్టి బ్రాహ్మతేజస్సు అయిన మీ శరణుకోరుతున్నాను. బ్రహ్మవేత్తలలో శ్రేష్ఠులై, ద్రోణునికన్నా మిన్న అయిన తమరిని ఆశ్రయించి, యుద్ధంలో గెలువరానివాడై, ద్రోణుని సంహరించగల కుమారుని పొందాలని ఆశ. కాబట్టి యాజా! నామనోరథాన్ని సఫలంచేయగల యాగాన్ని చేయించండి. పదికోట్ల గోవులనిస్తాను.' ఆమాటలు విని, అంగీకరించి, యాజుడు దానికవసరమైన యజ్ఞాన్నీ, సాధనాలనూ స్మరించాడు.

కార్యభారం ఎక్కువన్న భావంతో యాజుడు ఏ కోరికలూ లేని ఉపయాజుని కూడా ప్రేరేపించి, ద్రోణవినాశానికి తగినట్టి కుమారుని కలిగిస్తానని ప్రతిజ్ఞ చేశాడు. అప్పుడు మహాతపస్వి అయిన ఉపయాజుడు పుత్రసంప్రాప్తికి అనువైన యజ్ఞకర్మను ద్రుపదమహారాజుకు ఉపదేశించాడు. "రాజా! ఈ యజ్ఞం ద్వారా నీవు కోరుకొన్న లక్షణాలుగల కొడుకు జన్మిస్తాడు. ఆ కుమారుడు మహాపరాక్రమవంతుడూ, మహాతేజస్వి మహాబలుడు కూడా కాగలడు.' ద్రుపదమహారాజు ద్రోణుని సంహరించగల కొడుకు కావాలని మనసా భావించి, ఉపయాజుడు ఉపదేశించిన ఆ యాగవిధికి మొత్తం ఏర్పాటు చేశాడు. యాగసమాప్తివేళలో యాజుడు ద్రుపదుని రాణిని ఇలా ఆజ్ఞాపించాడు-'ద్రుపదరాజ్ఞీ! నాదగ్గరనుండి త్వరగా హవిస్సును స్వీకరించు. నీకు ఒక కొడుకూ, ఒక కూతురూ జన్మిస్తారు. వారు పితృవంశవృద్ధికి హేతువు కాగలరు.' రాణి ఇలా అన్నది - 'బ్రాహ్మణా! నానోట తాంబూలరాగం తగిలి ఉన్నది. దివ్యగంధాలు నాశరీరాన్ని కప్పిఉన్నాయి. ఇప్పుడు పుత్రార్థమై హవిస్సును స్వీకరింపలేను. కాబట్టి యాజా! నా ఇష్టసిద్ధిని కలిగించడానికి

కొంతసేపు ఆగండి.' యాజుడిలా అన్నాడు. 'ఈ హవిస్సును నేను తయారు చేశాను. ఉపయాజుడు మంత్రపూతం చేశాడు. కాబట్టి నీవు వచ్చినా, రాకపోయినా ఇది యజమాని కోరికను తప్పక తీరుస్తుంది.' ఈమాట అని యాజుడు సుసంస్కృతమైన హవిస్సుతో హోమం ముగించాడు. అప్పుడు ఆ హోమాగ్ని నుండి దేవసమానుడైన ఒక కుమారుడు పైకి లేచాడు. ఆ కుమారుని శరీరచ్ఛాయ అగ్నిజ్వాలలవలె ఉన్నది. రూపం భీకరంగా ఉన్నది. తలపై కిరీటం, తనువుపై మంచి కవచం ఉన్నాయి. కత్తినీ, ధనుర్బాణాలనూ ధరించి పదేపదే సింహనాదం చేస్తూ వెలువడ్డాడు. ఆ కుమారుడు అప్పుడే రథాన్నెక్కి యుద్ధయాత్రకు బయలుదేరాడు. పంచాలదేశీయులు ఆనందంతో "భళీ ! భళీ" అని నినాదాలు చేశారు.

అప్పుడు ఆనందంతో బరువెక్కిన ఆ పంచాలదేశభారాన్ని భూమి భరించలేకపోయింది. గగనతలం నుండి అశరీర భూతం ఇలా ప్రకటించింది- **'పంచాలుర భయాన్ని పోగొట్టి వారి కీర్తిని పెంచగలవాడూ, ద్రోణుని వధకు కారణం కాగలవాడూ, ద్రుపదుని శోకాన్ని దూరం చేయగలవాడు ఈ కుమారుడు.'** తరువాత ఆ వేదిమధ్యనుండి ఒక కన్య పైకి వచ్చింది. ఆమె సౌందర్యసౌభాగ్యాలతో కూడినది. ఆమె నేత్రాలు నల్లగా, విశాలంగా ఉన్నాయి. ఆమె నల్లగా ఉన్నది. తామరరేకులవంటి కన్నులు, ఉంగరాలు తిరిగిన నల్లని జుట్టు, ఎత్తైన ఎట్టిటి గోరులు, అందమై ఉన్నతమైన వక్షోజాలు కలిగి ఉన్నది. మానుషరూపాన్ని ధరించిన సాక్షాత్తు దేవకాంతవలె ఉన్నది. ఆమె శరీరం నుండి వెలువడుతున్న నల్లకలువల వంటి సౌరభం క్రోసెడు దూరం వ్యాపిస్తోంది. ఆమె మహాసుందరమైన రూపాన్ని ధరించి ఉన్నది. భూలోకంలో ఆమెకు సాటి లేదు. దివ్యరూపంగల ఆమెను దేవతలూ, రాక్షసులూ, యక్షులూ కూడా కోరుతున్నారు. ఆమె జన్మించిన తర్వాత అశరీరవాణి ఇలా వినిపించింది. 'ఈమె పేరు కృష్ణ. స్త్రీలందరిలో శ్రేష్ఠయైన ఈమె క్షత్రియులనందరినీ నాశనం చేస్తుంది. తగినవేళలో ఈ సుమధ్యమ దేవకార్యాన్ని పూర్తిచేస్తుంది. ఈమె కారణంగానే కౌరవులకు తీవ్రభయం కలుగుతుంది.' ఆ మాటవిని పాంచాలదేశస్థులు సింహసమూహంలాగా గర్జించారు. ఆనందనిర్భరులైన వారిని ఈ భూమి భరించలేక పోయింది. ఆ ఇద్దరినీ చూచి సంతానార్థిని అయిన ద్రుపదుని భార్య యాజనితో "ఈ ఇరువురూ నన్నే తల్లిగా భావించాలి" అని అభ్యర్థించింది. అప్పుడు ద్రుపదుని అభీష్టాన్ని తీర్చదలచిన యాజుడు 'అలాగే' అని ద్రుపదునితో అన్నాడు. అక్కడి బ్రాహ్మణులు పూర్ణమనస్కులై వారికి నామకరణం చేశారు. ఈ ద్రుపదకుమారుడు ధృష్టుడూ, అమర్షశీలుడూ, తేజఃకవచాన్ని ధరించి పుట్టినవాడూ కాబట్టి ఇతని పేరు

ధృష్టద్యుమ్నుడు. కుమార్తె నల్లనిరంగు గలది కాబట్టి కృష్ణ అని వ్యవహరించారు. ఆ విధంగా ద్రుపదుని యాగఫలంగా ఆ పిల్లలిద్దరూ జన్మించారు. ధీమంతుడూ, ప్రతాపవంతుడూ అయిన ద్రోణుడు కాగలదాని నుండి బయటపడటం అసాధ్యమని ఆలోచించి పాంచాలదేశీయుడైన ధృష్టద్యుమ్నుని అస్త్రవిద్యాభ్యాసానికై తన ఇంటికే తీసికొనివచ్చాడు. తనపేరును నిలుపుకొనటానికై ద్రోణుడు ఆవిధంగా వ్యవహరించాడు.

బ్రాహ్మణుడిలా అన్నాడు. లక్క ఇంటిలో జరిగిన వృత్తాంతాన్ని విని బ్రాహ్మణులూ, పురోహితులూ ద్రుపదునితో ఇలా అన్నారు - "ధృతరాష్ట్రకుమారులు మంత్రులతో కూడి సంప్రదించుకొని పాండవుల వినాశానికై ఆలోచించారు. దుర్యోధనుడు పంపిన పురోచనుడు వారణావతానికి వెళ్ళి పెద్దలక్కఇంటిని నిర్మించాడు. ఆ ఇంటిలో నమ్మకంగా నిదురిస్తున్న కుంతినీ, పాండవులనూ నడిరేయి తగులబెట్టాడు. ఆ నీచుడు తానుకూడా ఆ నిప్పులోనే బూడిదయ్యాడు. పాండవులు దగ్ధ మయ్యారని విని ఆంబికేయు డయిన ధృతరాష్ట్రుడు సబాంధవంగా పరమానందాన్ని పొందాడు. పైకి మాత్రం కొంత దుఃఖాన్ని ప్రకటిస్తూ విదురుని ఇలా శాసించాడు. 'మహాప్రాజ్ఞా! పాండవులకు అంత్యక్రియలు జరిపించు. పాండవులంతా చనిపోయినందువల్ల ఇప్పుడు పాండురాజు మరణించి నట్లయినది. గంగా తీరానికి వెళ్ళి పిండప్రదానాది క్రియలు ముగించు. వారు మరణించటం విధిలీల.' ఇలా అని ధృతరాష్ట్రుడూ, ఆయనతో పాటు శకునీ రోదించారు. ఇది తెలిసి భీష్ముడు యథావిధిగా పాండవుల అంత్యక్రియలు జరిపించాడు. పాండవ వినాశానికై ఈ దుష్కర్మను జరిపించాడు దుర్యోధనుడు. ఇంత ఘోరకృత్యాన్ని ఇంతకు ముందెవరూ చేయగా చూడలేదు. చేసినట్లు విననూ లేదు. పాండవులను గురించి మేమీరీతిగా విన్నాం. ఆమాటలు విని యజ్ఞసేనుడు(ద్రుపదుడు) సొంతబిడ్డలు చనిపోతే తండ్రి దుఃఖించినట్లు పాండవుల మరణానికి దుఃఖించాడు. తన బంధువులతోపాటు ప్రజలందరినీ పిలిపించి ఈ విధంగా ప్రకటించాడు. ద్రుపదుడిలా అన్నాడు. బంధువులారా! అర్జునుడి రూపం అద్భుతమైనది. ఆయన ధైర్యం ఆశ్చర్యకరం. ఆ పరాక్రమం, ఆ అస్త్రవిద్య అనన్యసామాన్యం. పగలూ, రేయీ ఆయనను గురించియే నా ఆలోచన.

ఆ అర్జునుడు తల్లితో సహా అగ్నికి ఆహుతయ్యాడు. లోకంలో ఇంతకన్నా ఆశ్చర్య మేముంది? కాలాన్ని ఎవ్వరూ అతిక్రమించలేరు. నా ప్రతిజ్ఞ వ్యర్థమైంది. లోకులకు ఏం చెప్పగలను? పగలూ, రేయీ నాలో నేనే కుమిలిపోతున్నాను. నేను అనఘు లయిన యాజోపయాజులను అర్చించి ద్రోణుని చంపగల కొడుకును, అర్జునుని పట్టమహిషి కాగల కూతురును కోరాను. లోకులందరికీ అది తెలుసు. స్వయంగా యాజమహర్షి

కూడా దానిని ప్రకటించాడు. యాజుడు పుత్రకామేష్టి చేసి ధృష్టద్యుమ్ననీ, కృష్ణను కలిగించాడు. వారి పుట్టుక నాకు ఆనందదాయకమే కానీ ఇప్పుడేమి చేయగలను? ఆ అర్జునుడు మరణించాడు.' ఆవిధంగా పలికి ద్రుపదుడు దుఃఖించి, రోదించాడు. ఆది చూచి సత్త్వసంపన్నుడూ, విద్యావిశేషవేత్తా అయిన పంచాలరాజపురోహితుడు ఇలా అన్నాడు. 'మహారాజా! **పాండవులు పెద్దలమాటను మన్నించేవారూ, ధర్మాత్ములు. అటువంటి వారు నశించరు. పరాజితులూ కారు.** నరేశ్వరా! నేను గ్రహించిన సత్యాన్ని ఆలకించండి. బ్రాహ్మణులు ఈ సత్యాన్ని ప్రతిపాదించారు. వేదమంత్రాలలో కూడా నేను దానిని విన్నాను. గతంలో ఇంద్రాణి బృహస్పతిద్వారా ఉపశ్రుతి మహిమను విన్నది. ఆ ఉపశ్రుతి అదృశ్యుడైపోయిన ఇంద్రుని తామరతూటిముడిలో దర్శింపజేసింది. ఈవిధంగా పాండవుల విషయంలో కూడా నేను ఉపశ్రుతిని విన్నాను. వారు ఎక్కడో ఒకచోట జీవించియే ఉంటారు. అనుమానం లేదు. పాండవులు తప్పక తిరిగి వచ్చే సూచనలు నాకు కనిపిస్తున్నాయి- కారణం చెపుతాను విను. క్షత్రియులకు స్వయంవరమే కన్యాదానానికి శ్రేష్ఠమైన మార్గమని చెప్పబడుతుంది. అందుచేత రాజా! నగరంలో స్వయంవరం చాటించు. దూరంగా ఉన్నా, దగ్గరగా ఉన్నా, స్వర్గస్థులయినా, ఎక్కడ ఉన్నాసరే కుంతీ సహితంగా పాండవులు స్వయంవరం విని, తప్పక వస్తారు. ఆలస్యం చేయక స్వయంవరం ప్రకటించు.' పురోహితుని మాటలు విని ద్రుపదుడు పరమానందపడ్డాడు. ఆయన నగరంలో ద్రౌపది స్వయంవరాన్ని ప్రకటించాడు. పుష్యమాసంలో, శుక్లపక్షంలో ఏకాదశినాడు రోహిణీ నక్షత్రంలో ఆ స్వయంవరం జరుగుతుంది. ఇక డెబ్బది అయిదు రోజులున్నది. కుంతీ! దేవతలు, గంధర్వులు, యక్షులు, తపస్సంపన్నులయిన ఋషులు అక్కడకు చేరుతారు ఆ స్వయంవరాన్ని చూడాలని. మహాత్ములయిన నీ కొడుకులందరూ చూడచక్కని వారు. వీరిలో ఎవరినైనా పాంచాలరాజపుత్రి వరించవచ్చు. బహుశా అర్జునునే వరించవచ్చు. విధి నిర్ణయాన్ని ఎవ్వరమూ గ్రహింపజాలము గదా! నీకు నామాట నచ్చితే నీ కుమారులందరితో నీవు అక్కడకు వెళ్ళు. తపోధనా! పంచాలదేశం ఎప్పుడూ సుభిక్షంగా ఉంటుంది. పంచాలరాజు యజ్ఞసేనుడు సత్యసంధుడూ, బ్రాహ్మణ భక్తుడూ. అక్కడి ప్రజలు కూడా బ్రాహ్మణులపై శ్రద్ధాభక్తులు గలవారు. అతిథులను ఆదరించేవారు. ప్రతిదినమూ అడగకపోయినా ఆతిథ్యమిచ్చేవారు. నేనుకూడా నాశిష్యులతో కలిసి అక్కడకు వెళ్తున్నాను.' నీకిష్టమయితే మనమంతా కలిసే వెళ్ళవచ్చు. ఈమాటలు చెప్పి ఆ బ్రాహ్మణుడు మిన్నకున్నాడు.

167. పాండవులు కుంతి ద్రుపదపురమునకు బయలుదేరుట.

మహాబలులైన ఆ కౌంతేయులు సంశితవ్రతు డయిన ఆ బ్రాహ్మణుని మాటలు విని చలించిపోయారు. సత్యవాదిని అయిన కుంతి తన పుత్రులందరూ ద్రౌపదిపై మనస్సు పడినట్టు గమనించి, యుధిష్ఠిరునితో ఇలా అన్నది. "అందమైన ఈ నగరంలో మహాత్ముడైన ఈ బ్రాహ్మణుని ఇంటిలో ఇక్కడ చాలారోజులనుండి ఆనందంగా ఉంటున్నాం. భిక్ష కూడా లభిస్తోంది. అరిందమా! ఇక్కడున్న అందమైన వనాలనూ, ఉద్యానవనాలనూ అన్నింటినీ చాలాసార్లు చూచాం. మరల వాటినే చూడాలంటే మనస్సుకు నచ్చదు. కురుకుమారా! వీరా! భిక్ష కూడా అంతకు ముందువలె దొరకకపోవచ్చు. కాబట్టి నీకిష్టమయితే మనమంతా పంచాలదేశానికి వెళదాం. వీరా! క్రొత్తప్రదేశాలను చూడటం ఆనందదాయక మవుతుంది. పంచాలదేశస్థులు చక్కని భిక్షపెట్టగల వారని కూడా వింటున్నాం. యజ్ఞసేన మహారాజు కూడా బ్రాహ్మణుల పట్ల మంచిగా ప్రవర్తిస్తాడని విని ఉన్నాం. ఒకేతావున ఎక్కువకాల ముండటం మంచిదికాదని నాకనిపిస్తోంది. కాబట్టి కుమారా! నీకు కూడా ఇష్టమయితే హాయిగా అక్కడకు వెళదాం." యుధిష్ఠిరుడిలా అన్నాడు. "నీకిష్టమయినదే మాకు హితకరమయినది. తమ్ములళ్ళు వెళదామంటారో లేదో తెలియదు." అప్పుడు కుంతి భీమార్జునులతో నకులసహదేవులతో, ప్రయాణాన్ని గురించి ప్రస్తావించింది. వారు కూడా 'అలాగే' అని అంగీకరించారు. రాజా! ఆపై కుంతి తమకు ఆశ్రయమిచ్చిన బ్రాహ్మణుని వద్ద వీడ్కోలు తీసుకొని, మహాత్ము డయిన ద్రుపదుని రమణీయనగరానికి కొడుకులతో పాటు బయలుదేరింది.

168. ద్రౌపది పూర్వజన్మవృత్తాంతమును వ్యాసుడు చెప్పుట.

పాండవులు గూఢంగా నివసిస్తూ ఉండగా వ్యాసుడు వారిని చూడటానికి వచ్చాడు. అప్పుడు పాండవులు తమచెంతకు వచ్చిన వ్యాసుని చూసి, ఎదురేగి నమస్కారపురస్సరంగా పలుకరించి, చేతులు జోడించి, నిలిచారు. పాండవులచే ప్రచ్ఛన్నంగా పూజింపబడిన వ్యాసుడు వారినందరినీ కూర్చొనమని ఆదేశించి, వారు కూర్చున్న తరువాత ప్రీతిపూర్వకంగా ఇలా పలికాడు. "పరంతపులారా! మీరు శాస్త్రవిధి ననుసరించి ధర్మానుసారంగా ప్రవర్తిస్తున్నారు గదా! పూజింపదగిన బ్రాహ్మణుల పూజలలో లోపం చేయటం లేదుగదా!" అని వ్యాసభగవానుడు ధర్మార్థయుక్తమైన విషయాలు చెప్పాడు. విచిత్రకథలను ఎన్నో చెప్పాడు. మరలా ఇలా అన్నాడు. ఒకానొక తపోవనంలో మహాత్ముడైన ఒక ఋషికి ఒక కూతురుండేది. ఆమె సన్నని నడుము, అందమైన కటి, కనుబొమలు గలిగి సకల సద్గుణాలతో కూడినది.

తన పురాకృతకర్మలవలన ఆమె దౌర్భాగ్యానికి లోనయినది. రూపవతి, సత్ప్రవర్తన గలది. అయినా ఆమెకు వివాహం కాలేదు. ఆపై పెళ్ళి కాలేదన్న దుఃఖంతో ఆమె భర్తకోసం తపస్సుచేయ నారంభించింది. తీవ్రమయిన తపస్సుతో శంకరుని మెప్పించింది.

ఆమె తపస్సునకు సంతోషించిన ఆ శంకరుడు "నీకు మేలు జరుగుతుంది. వరాన్ని కోరుకో. నీకు వరమిస్తాను" అని ఆ యశస్వినితో అన్నాడు. అప్పుడు ఆమె తనకు హితకరమైన మాటగా "సర్వగుణాలతో కూడి ఉన్న భర్త నాకు కావాలి" అని చాలాసార్లు ఈశ్వరునితో పలికింది. వాగ్మి అయిన ఈశ్వరుడు "కళ్యాణీ! నీకు అయిదుగురు భర్తలు లభిస్తారు" అని ఆమెతో అన్నాడు. ఈశ్వరుడు అలా అంటే ఆమె "ప్రభూ! నీ అనుగ్రహం వలన నేను ఒక్కభర్తనే కోరుతున్నాను" అని వరదుడైన ఆ శివునితో అన్నది. శివుడు మరలా ఈ మాట అన్నాడు - నీవు అయిదుసార్లు "భర్తకావాల"ని నాతో అన్నావు. నీవు దేహాంతరాన్ని పొందినప్పుడు నేను చెప్పినట్లు జరుగుతుంది." అన్నాడు. దేవరూపిణి అయిన ఆ కన్యయే ద్రుపదుని ఇంట జన్మించింది. పృషతుని మనుమరాలైన ఆ సతి - కృష్ణ - మీకుభార్యగా నిర్ణయింపబడినది. కాబట్టి మహాబలులయిన మీరు పాంచాల నగరంలో నివసించండి. ఆమెను పొంది మీరు సుఖంగా జీవించగలరు. అనుమానం లేదు." మహాతపస్వి, మహానుభావుడైన తాత వ్యాసభగవానుడు ఈ విధంగా పలికి పాండవులదగ్గర, కుంతిదగ్గర సెలవు తీసికొని వెళ్ళిపోయాడు.

169. అర్జున చిత్రరథుల స్నేహము.

వ్యాసభగవానుడు నిష్క్రమించిన తరువాత నరశ్రేష్ఠ లయిన పాండవులు సంతుష్టమనస్కులై తల్లిని ముందు నిలుపుకొని బయలుదేరారు. ఆ పాండవులు బ్రాహ్మణుని నుండి సెలవుతీసికొని ఆయనకు నమస్కరించి, అనుమతిని పొంది ఉత్తరదిక్కుకు సరాసరి వెళ్ళేమార్గాన్ని పట్టుకొని పంచాలదేశంవైపు పయనించసాగారు. ఒకపగలూ, ఒకరాత్రీ ప్రయాణంచేసి ఆ పాండవులు గంగా తీరంలోని 'సోమాశ్రయ'మనే తీర్థాన్ని చేరారు. అర్జునుడు వారి రక్షణకొరకూ, వెలుతురు కొరకూ ఒక కొరివికట్టెను ఎత్తిపట్టుకొని వారిముందు నడిచాడు. ఆ గంగాజలంలో ఒకగంధర్వరాజు తన కాంతలతో జలక్రీడలాడుతున్నాడు. ఆయన ఈర్ష్యాళువు. జలక్రీడ కొరకే అక్కడకు వచ్చినవాడు.

ఆయన నదికి దగ్గరగా వస్తున్న పాండవుల అలికిడిని విన్నాడు. బలిష్ఠుడైన గంధర్వుడు ఆ శబ్దంవలన తీవ్రంగా కోపించాడు. తల్లితో సహా అక్కడున్న ఆ పాండవులను చూచి గంధర్వరాజు భీకరమైన వింటిని ధ్వనింపజేస్తూ వారితో ఇలా అన్నాడు. "రాత్రి

ప్రారంభమయ్యే ముందు పశ్చిమ దిక్కున భయంకర సంధ్యారాగం ఏర్పడినప్పుడు ఎనభై లవాల కాలాన్ని వదలగా మిగిలిన కాలం కామచారు లయిన యక్షగంధర్వ రాక్షసులకు నిశ్చయింపబడింది. రోజులో మిగిలిన భాగమంతా మనుష్యులకు వారిపనులు చేసికొనటానికి కేటాయించబడింది. లోభంవలన ఏ మానవులయినా మాకై నిర్ణయింపబడిన ఆ సమయంలో సంచరిస్తూ సమీపిస్తే ఆ మూర్ఖులను రాక్షసులూ, మేమూ బంధిస్తాం. అందువలననే రాత్రివేళలో నీటిలో ప్రవేశించిన మనుష్యులనందరనూ, వారు బలవంతులయిన రాజులైనా సరే వేదవేత్తలు నిందిస్తున్నారు. దూరంగానే నిలవండి. దగ్గరకు రాకండి. నేను అంగారపర్ణుడనే గంధర్వరాజును. గంగాజలంలో దిగి ఉన్న నన్ను ఎందుకు గమనించలేదు? నేను నా బలాన్నే నమ్మినవాడను, అభిమానవంతుడను. ఈర్ష్యాళువును, కుబేరుని ప్రియమిత్రుడను కూడా. ఈ వనం కూడా నాదే. దీనిపేరు అంగారపర్ణం. నేను గంగాతీరంలో సంచరిస్తూ ఈ వనంలో విచిత్రక్రీడలతో కాలం గడుపుతుంటాను. నేనుండగా రాక్షసులు కానీ, యక్షులు కానీ, దేవతలు కానీ, మానవులు కానీ దగ్గరకు రాలేరు. మరి మీరు దగ్గరకెలా వస్తున్నారు ?" అన్నాడు. అర్జునుడు "దుర్మతీ! సముద్రంలో, హిమాలయ సన్నిధిలో, గంగాతీరంలో రాత్రి అయినా, పగలయినా సంజెవేళనైనా ఎవరి అధికారం నిలిచి ఉంటుంది? గంధర్వా! నదీమతల్లి అయిన గంగను సమీపించటానికి కాలనియమం లేదు. తిని అయినా రావచ్చు. తినకుండా అయినా రావచ్చు. పగలు కావచ్చు. రాత్రి కావచ్చు. మేము శక్తిసంపన్నులం, వేళకాని వేళవచ్చినా నిన్ను అణచగలం. క్రూరుడా! యుద్ధం చేయటానికి శక్తిలేని మానవులు మిమ్ములను పూజిస్తారు. తొలుత హిమాలయం స్వర్ణశిఖరం నుండి వెలువడిన గంగ ఏడు పాయలుగా విడిపోయి కడలిలో కలిసిపోయింది. గంగ, యమున, సరస్వతి, రథస్థ, సరయు, గోమతి, గండకి -ఇవి ఆ ఏడుపాయలు. ఈ ఏడు నదులలోని నీటిని త్రాగిన వారి పాపాలు పటాపంచలవుతాయి. ఈగంగ చాలా పవిత్రమైనది. ఆకాశమొక్కటే దాని ఒడ్డు, గంధర్వా! ఆకాశమార్గాన చరించే ఈగంగకు దేవలోకంలో అలక అని పేరు. ఈ గంగయే వైతరణి పేరుతో పితృలోకంలో ప్రవహిస్తుంది. పాపాత్ములు దానిని దాటడం చాలా కష్టం. ఈలోకంలో దీనిపేరు గంగ. కృష్ణద్వైపాయనుడు ఈవిషయాన్ని చెప్పాడు. కళ్యాణకారిణి అయిన ఈ దేవనది నిర్విఘ్నంగా స్వర్గప్రాప్తిని కల్గించగలది. అటువంటి నదిని నిరోధించతగదు. ఇది సనాతన ధర్మం కాదు. ఈ గంగను ఎవ్వరూ నివారించలేరు. నదీప్రవేశాన్ని ఎవ్వరూ అడ్డగించరాదు. ఇటువంటి పవిత్రగంగాజలాన్ని నీ మాటను బట్టి మేము స్వేచ్ఛగా స్పృశించకుండా ఎలా ఉండగలం?" అన్నాడు.

ఆ మాట విని అంగారపర్ణుడు కోపించి, ధనుస్సును ఎక్కుపెట్టి, విషసర్పాలవంటి వాడిబాణాలను విడువనారంభించాడు. వెంటనే పాండుకుమారుడు అర్జునుడు కొరివికట్టెను త్రిప్పుతూ, మంచి డాలును అడ్డుపెడుతూ ఆ బాణాల నన్నింటినీ తప్పించాడు. అర్జునుడిలా అన్నాడు. "గంధర్వా! అస్త్రవిద్యావేత్తల దగ్గర నీ బెదిరింపులు పనికిరావు. అస్త్రవిద్యాసంపన్నులపై వినియోగిస్తే నీ మాయ నురుగులా అంతరించిపోతుంది. గంధర్వా! గంధర్వులందరూ మానవులకన్న శక్తివంతులని నేనెరుగుదును. కాబట్టి నేను దివ్యాస్త్రాలతో యుద్ధం చేస్తాను. మాయతో కాదు. గంధర్వా! ఈ ఆగ్నేయాస్త్రాన్ని గతంలో ఇంద్రుడు కూడా గౌరవించే బృహస్పతి భరద్వాజముని కిచ్చాడు. భరద్వాజుడు అగ్నివేశ్యునకూ, అగ్నివేశ్యుడు మా గురువైన ద్రోణునకూ ఇచ్చారు. ఆ బ్రాహ్మణోత్తముడు ఈ దివ్యాస్త్రాన్ని నాకు ప్రసాదించాడు." ఈమాట అని అర్జునుడు కోపంతో ఆ గంధర్వునిపై ప్రజ్వలిస్తున్న ఆగ్నేయాస్త్రాన్ని ప్రయోగించాడు. అది గంధర్వుని రథాన్ని తగులబెట్టింది. రథహీనుడైన ఆ గంధర్వుడు కలతపడి, అస్త్రశక్తివలన దిక్కుతోచక నేలకొరగబోయాడు. అప్పుడు మహాబలు డయిన అర్జునుడు పూలమాలలతో ప్రకాశిస్తున్న ఆ అంగారపర్ణుని జుట్టుపట్టుకొని సోదరుల దగ్గరకు తెచ్చాడు. అంగారపర్ణుడు బాణాఘాతంతో చైతన్యాన్ని కోలుపోయాడు. ఆ అంగారపర్ణుని భార్య కుంభీనసి, ఆమె భర్తను రక్షించుకొనదలచి వినమ్రయై శరణుకోరుతూ యుధిష్ఠిరుని దగ్గరకు వచ్చి "మహానుభావా! నన్ను కాపాడండి. నాభర్తను విడిచిపెట్టండి. స్వామీ! నేను ఈ గంధర్వుని పత్నిని. పేరు కుంభీనసి. శరణు కోరుతున్నాను." అంది. యుధిష్ఠిరుడు "నాయనా! రిపుసూదనా! ఈ గంధర్వుడు యుద్ధంలో ఓడిపోయాడు. కీర్తిని కోలుపోయాడు. పరాక్రమహీనుడు. ఇప్పుడు భార్యయే ఈయనకు దిక్కైనది. ఇటువంటి శత్రువును చంపకూడదు. వదలిపెట్టు." అన్నాడు. అర్జునుడిలా అన్నాడు. "గంధర్వా! బాధపడవద్దు. ఇప్పుడు కురురాజైన యుధిష్ఠిరుడు నీకు అభయమిస్తున్నాడు." అనగానే గంధర్వుడిలా అన్నాడు. "నేను ఓడిపోయాను. అందువలన అంగారపర్ణు డనే నా పేరును వదలివేస్తున్నాను. ఇక జనసమూహంలో నా బలాన్ని శ్లాఘించుకొనను. కనీసం పేరు కూడా చెప్పుకొనను. నేనీనాడు ఓడిపోయి కూడా దివ్యాస్త్రధారి అయిన అర్జునుని మైత్రిని పొందగలిగాను. ఇది నాకు లాభమే. అర్జునునకు గంధర్వమాయను ఇవ్వదలచుకొన్నాను. విచిత్రమూ, శ్రేష్ఠమూ అయిన నా రథం దివ్యాస్త్ర వహ్నిచే దగ్ధమైంది. చిత్రరథుడనైన నేను ఇప్పుడు దగ్ధరథుడనయ్యాను. నేను గతంలో నా తపశ్శక్తితో ఈ విద్యను పొంది ఉన్నాను. నాకు ప్రాణదానం చేసిన ఈ మహాత్మునకు ఆ విద్యను నివేదిస్తున్నాను. వేగంగా శత్రువును నిర్వీర్యుని చేసి, అతడు శరణుకోరిన వెంటనే ప్రాణదానం

చేసినవాడు ఏ శుభాలకు అర్హుడు కాడు? ఇది **చాక్షుషి** అనబడే విద్య. దీనిని మనువు సోముని కిచ్చాడు. సోముడు విశ్వావసువున కిచ్చాడు. విశ్వావసువు నాకు ఇచ్చాడు. గురువు దానం చేసిన ఈ విద్య దుర్జనుని చేరితే నశిస్తుంది. ఇంతవరకు ఇది సంప్రాప్తించిన క్రమం వివరించాను. దీని ప్రభావం కూడా చెపుతా విను. దీని ప్రభావంతో మూడులోకాలలో నున్న వస్తువులలో దేనినైనా ఏ రూపంలో చూడాలని కోరినా ఆ వస్తువును ఆ రూపంలో చూడవచ్చు. ఆరుమాసాలు ఒంటికాలిపై నిలిచి తపస్సు చేసినవాడే ఈవిద్యను పొందగలడు. ఈ వ్రతాన్ని చేయకపోయినా నీకు నేనీ విద్యను ప్రవర్తింపజేయగలను. రాజా! ఈవిద్య కారణంగానే మేము మానవులకన్న గొప్పవారమైనాం. దేవతలతో సమానంగా ప్రభావాన్ని ప్రదర్శించగలుగుతున్నాము. పురుషశ్రేష్ఠా! నీకూ, నీసోదరులకూ ఒక్కొక్కరికి వంద వంద గంధర్వజాతి హయాలను నేను కానుక చేస్తున్నాను." అవి దేవతలకూ, గంధర్వులకూ వాహనాలు. మహావేగమూ, దివ్యవర్ణమూ గలవి. అవి అవసరాన్ని బట్టి దుర్బలాలూ, బలిష్ఠాలూ కూడా కాగలవు.

పూర్వకాలంలో మహేంద్రుడు వృత్రాసురుని సంహరించటానికి ఆయన తలపై వజ్రాయుధాన్ని ప్రయోగించాడు. అది పదిపెద్దముక్కలూ, వంద చిన్నముక్కలూ అయింది. అప్పటినుండి ముక్కలయిన ఆ వజ్రాయుధపు ముక్కల నన్నింటినీ దేవతలు ఉపాసిస్తున్నారు. లోకంలో ఉత్కృష్టమైన కీర్తి, డబ్బు మొదలయినవన్నీ వజ్రస్వరూపాలుగానే భావింపబడుతున్నాయి. **బ్రాహ్మణుని చేయి వజ్రం. క్షత్రియుని రథం వజ్రం. వైశ్యుని దానం వజ్రం. శూద్రుని పని వజ్రం.** క్షత్రియుని వజ్రభాగమైన రథానికి అంగాలు కాబట్టి అశ్వాలను చంపకూడదు. గంధర్వదేశానికి చెందిన అశ్వం రథాంగాలయిన అశ్వాలకు జన్మనిస్తుంది. అవి అశ్వజాతిలో శూరులలాగా లెక్క. నేను కానుక చేస్తున్న ఈ గంధర్వజాతికి చెందిన గుఱ్ఱాలు రంగు మార్చుకొనగలవి. వేగాన్ని సవరించుకొనగలవి. కోరుకొన్న సమయంలో వచ్చి చేరగలవి. కాబట్టి ఇవి మీ కోరికలను పూర్తిచేయగలవి" అర్జునుడిలా అన్నాడు. "గంధర్వా! నీవు ఇష్టపడియో కాక ప్రాణాలను రక్షించుకొనగోరియో విద్యనూ, ధనాన్నీ, శాస్త్రాన్నీ నాకు ఇవ్వదలచుకొన్నావు. కానీ నా కది ఇష్టంలేదు." గంధర్వుడిలా అన్నాడు. "మహాత్ములతో చెలిమి ప్రీతిని పెంపొందింపజేయగలది. నాకు జీవితాన్ని ప్రసాదించి నందువలన ఆనందించి, నీకు విద్యను కానుకగా ఇస్తున్నాను. నీనుండి నేను ఉత్తమమయిన ఈ ఆగ్నేయాస్త్రాన్ని స్వీకరిస్తాను. భరతశ్రేష్ఠా! అర్జునా! ఇది మన మన సౌహార్దాన్ని శాశ్వతంగా నిలుపగలదు." అర్జునుడిలా అన్నాడు. 'గంధర్వా! నీవు చెప్పినట్లే నేను ఆగ్నేయాస్త్రాన్ని ఇచ్చి చాక్షుషీవిద్యను గ్రహిస్తాను. మన మైత్రి చిరస్థాయి కాగలదు.

మిత్రమా! చెప్పు మీరంటే మానవులకు భయమెందుకు? గంధర్వా! మేమందరమూ వేదవేత్తలం. శత్రుసంహారం చేయగలవారం. అయినా రాత్రిపూట ప్రయాణించే సమయంలో గంధర్వులు మాపై ఆక్రమణ చేయటానికి కారణమేమిటి? చెప్పు."

"పాండుకుమారులారా! మీరు త్రేతాగ్నులను అర్చించటం లేదు. అనుదినమూ అగ్నికి ఆహుతుల నివ్వటం లేదు. కనీసం పురోహితుడు అయినా మీ ముందులేడు. ఆ కారణాల వలన నేను మిమ్ములను ఆక్రమింపగలిగాను. అందువలననే నేను మీ తేజస్సునూ, వంశప్రతిష్ఠనూ ఎరిగి కూడా మీపై ఆక్రమణ చేయదలచాను. మూడు లోకాలలోనూ మిమ్మెరుగని వారెవరున్నారు? మీరు మీ గుణసంపత్తితో ప్రకాశవంత మయిన విస్తృతయశస్సును పొంది ఉన్నారు. మేధావులైన యక్షులు, రాక్షసులు, గంధర్వులు, పిశాచాలు, నాగులు, దానవులు కురువంశయశస్సును విస్తృతంగా ప్రస్తావిస్తుంటారు. నారదుడు మొదలగాగల దేవమునులు కూడా మీ పూర్వీకుల గుణాలను గానం చేస్తుంటే నేను విన్నాను. సాగరాలు చుట్టుముట్టి ఉన్న ఈ సమస్త భూమండలంలో సంచరిస్తూ స్వయంగా నేను కూడా మీ కులప్రతిష్ఠను చూచి ఉన్నాను. అర్జునా! వేదవిద్యలోనూ, ధనుర్విద్యలోనూ మీకు ఆచార్యుడై త్రిలోకాలలో కీర్తిప్రతిష్ఠలుగల ద్రోణుడు కూడా నాకు తెలుసు. ధర్మరాజును, వాయుదేవుని, ఇంద్రుని, అశ్వినీదేవతలను, పాండురాజును కూడా నేనెరుగుదును. వారు ఆరుగురూ కురువంశాన్ని వర్ధిల్లజేస్తున్నవారు. అర్జునా! దేవమానవ శ్రేష్ఠులయిన ఈ ఆరుగురూ మీ తండ్రులని కూడా తెలుసు. సోదరు లయిన మీరందరూ దేవస్వరూపులు, మహాత్ములు, సమస్తశస్త్రధారులలో శ్రేష్ఠులు, శూరులు, చక్కని బ్రహ్మచర్య దీక్షగలవారు. అర్జునా! మీ అంతఃకరణం, మనస్సు, బుద్ధి ఉత్తమ మయినవి. అదంతా తెలిసికూడా మీపై దురాక్రమణ చేశాను. కురునందనా! తన బాహుబలసంపదను నమ్ముకొనిన ఏ మగవాడూ స్త్రీల సమక్షంలో తాను తిరస్కరింపబడటాన్ని సహించడు. కౌంతేయా! అంతేకాదు. రాత్రివేళలో మాబలం బాగా పెరుగుతుంది. అందువలనా, స్త్రీ సాన్నిధ్యం వలనా నాలో క్రోధావేశం కలిగింది. తపతీ వంశవృద్ధికరా ! అర్జునా! అటువంటి నన్ను నీవు యుద్ధంలో ఓడించావు. అది ఎలా సాధించగలిగావో కూడా చెపుతా విను.

బ్రహ్మచర్యం శ్రేష్ఠధర్మం. అది కూడా నీ యందున్నది. ఆ కారణం వలన యుద్ధంలో నీవు నన్ను ఓడించగలిగావు. పరంతపా! కామప్రవృత్తి గల ఏ క్షత్రియుడైనా రాత్రివేళ యుద్ధం చేస్తే ఎట్టిపరిస్థితిలోనూ అతను ప్రాణాలతో బయటపడలేడు. అర్జునా! కామప్రవృత్తి గలవాడైనా క్షత్రియుడు బ్రాహ్మణుని ముందుంచుకొని యుద్ధం చేస్తే

రాక్షసుల నందరినీ జయించగలడు. అది పురోహితుని వలన సంక్రమించే శక్తి. తాపత్యా! కాబట్టి మానవులు ఈ లోకంలో ఏ మంచిపనినైనా చేయదలిస్తే నియతాత్ము లైన పురోహితులను ఆ పనికై నియోగించాలి. రాజుల పురోహితులు వేదవేదాంగాలపై ఆసక్తిగలవారు, శుద్ధవర్తనులు, సత్యవాదులు, ధర్మస్వరూపులు, జితేంద్రియులూ అయి ఉండాలి. ధర్మవేత్త, వాగ్మి, శీలవంతుడు, పరిశుద్ధుడూ అయిన పురోహితుని నియమించుకొనిన రాజుకు ముందు జయమూ, ఆ తరువాత స్వర్గమూ తప్పక కలుగుతాయి. **అప్రాప్తమైన దానిని పొందాలన్నా, లభించిన దానిని రక్షించుకోవాలన్నా రాజు గుణవంతుడైన పురోహితుని ఏర్పాటు చేసికోవాలి.* సాగరాంబర అయిన సమస్తభూలోకం మీదా అధికారాన్నీ, తనకు ఐశ్వర్యాన్నీ కోరుకొనే రాజు పురోహితుని ఆజ్ఞానువర్తియై ఉండాలి.** తాపత్యా! ఏ రాజైనా పురోహిత సహకారం లేక కేవలం తనబలంతో కానీ, వంశప్రతిష్ఠతో కానీ ఇహలోకంలో గెలువలేడు. కాబట్టి కురువంశవర్ధనా! ఈ విషయాన్ని గ్రహించు. బ్రాహ్మణులకు ప్రాధాన్యమిచ్చిన రాజే చిరకాలం రాజ్యపాలన చేయగలుగుతాడు."

170. తపతిని చూచి సంవరణుడు మోహించుట.

అర్జునుడు ఇలా అన్నాడు. "నన్ను తపతీనందనా అని సంబోధించి నాతో మాటాడావు. తాపత్య పదానికి స్పష్టమైన అర్థాన్ని తెలియగోరుతున్నాను. తపతి అంటే ఎవరు? ఆ కారణంగానే గదా మమ్ములను తాపత్య్య లంటున్నావు. సాధుస్వభావా! మమ్ము మేము కౌంతేయుల మనుకొంటున్నాం. కాబట్టి వాస్తవికమైన తాపత్యపదం అర్థాన్ని తెలియగోరుతున్నాను." ఆ మాటలు విని ఆ గంధర్వుడు మూడులోకాలలోనూ ప్రసిద్ధి కెక్కిన ఆ కథను కౌంతేయుడైన అర్జునునకు వినిపించాడు.

గంధర్వు డిలా అన్నాడు. "అర్జునా! మనోహరమైన ఈ కథనంతా ఉన్నదున్నట్లు నీకు చెపుతాను. నిన్ను నేను తాపత్యుడని వ్యవహరించాను గదా! దానికి సంబంధించిన కథను నీకు చెపుతాను. సావధానమనస్కుడవై విను. ఆకాశంలో పుట్టి, తన తేజస్సుతో స్వర్గలోకం వరకూ వ్యాపించగలవాడు సూర్యుడు. ఆయన కొక పుత్రిక. ఆమెయే తపతి. ఆమె తండ్రికి తగిన కూతురు. ప్రభూ! ఆమె సావిత్రికి చిన్నచెల్లెలు. తన తపస్సువలన ఆమె మూడులోకాలలో ఖ్యాతినంది తపతి అయినది. ఆమెవంటి రూపవతి దేవతలలో

* లాభం లబ్ధుమలబ్ధం వా లబ్ధం వా పరిరక్షితుమ్ ।
పురోహితం ప్రకుర్వీత రాజా గుణసమన్వితమ్ ॥ 17

కానీ, అసురులలో కానీ, యక్షులలో కానీ, రాక్షసులలో కానీ, అప్సరసలలో కానీ, గంధర్వులలో కానీ లేదు. ఆమె శరీరం పొందిక గలది. నిర్దుష్టమైన శరీరావయవాలతో నల్లని విశాలనేత్రాలతో ఆమె శోభిల్లేది. ఆమె సువేషం, సదాచారం, సాధుస్వభావం గలది. ఆమె రూప, శీల, గుణ, జ్ఞానాలను బట్టి ఆమెకు తగిన వరుడు మూడులోకాలలోనూ లేడని సూర్యుడు భావించాడు. ఆమె యౌవనంలో అడుగుపెట్టింది. వివాహకాలం సంప్రాప్తమైంది. ఆ స్థితిలో ఆమెను చూచి సూర్యుడు తగిన వరుని గురించి ఆలోచించసాగాడు. ఆ ఆలోచనతో అశాంతికి గురి అయ్యాడు. కౌంతేయా! ఆ రోజులలో ఋక్షుని కొడుకైన సంవరణుడు కురుకుల శ్రేష్ఠుడు, బలిష్ఠుడు. ఆయన సూర్యుని ఆరాధించసాగాడు. పౌరవనందనా! ఆ సంవరణుడు శుద్ధుడూ, అహంకారం లేనివాడూ. మనస్సునూ, ఇంద్రియాలను అదుపులో నుంచుకొని పవిత్రుడై అర్ఘ్య, మాల్య, గంధ, నివేదనాదులతో, నియమాలతో, ఉపవాసాలతో, వివిధ తపశ్చర్యలతో, భక్తితో, సేవాతత్పరతతో ఉదయభానుని పూజించాడు.

ఆ తరువాత లోకంలో సాటిలేని రూపసి, కృతజ్ఞుడూ, ధర్మజ్ఞుడూ అయిన సంవరణుని తపతికి తగిన భర్తగా భావించాడు సూర్యుడు. కౌరవ్యా! లోకప్రసిద్ధిగల వంశానికి చెందిన, రాజశ్రేష్ఠుడైన సంవరణునకు కూతురు నివ్వాలని ఇష్టపడ్డాడు. సూర్యుడు తన తేజస్సుతో ఆకాశంలో వెలుగులు నింపినట్లు భూలోకంలో సంవరణమహారాజు తన తేజస్సును ప్రసరింపజేశారు. బ్రహ్మవాదు లయిన మహర్షులు ఉదయించే సూర్యుని ఆరాధిస్తున్నట్లు బ్రాహ్మణాది సర్వప్రజలూ సంవరణుని ఆరాధిస్తున్నారు. ఆ సంవరణుడు కాంతిలో చంద్రునీ, తేజస్సులో సూర్యునీ మించినవాడు. మిత్రమండలిలోనూ, శత్రుసమూహంలోనూ దివ్యశోభతో వెలుగొందేవాడు. ఇటువంటి ఉత్తమగుణాలు, మంచినడవడి గల ఆ సంవరణునకు తపతి నివ్వాలని సూర్యుడు స్వయంగా నిర్ణయించుకొన్నాడు. అర్జునా! శ్రీమంతుడు, పరాక్రమవంతుడు అయిన సంవరణమహారాజు ఒక రోజు పర్వతపార్శ్వంలో ఉన్న ఉపవనంలో వేటాడసాగాడు. కౌంతేయా! ఆ సంవరణుడు వేటాడుతున్నప్పుడే ఆయన గుఱ్ఱాలలో ఒకటి ఆకలిదప్పులతో ఆ కొండపై మరణించింది. అర్జునా! గుఱ్ఱం చనిపోయినందువలన ఆ రాజు ఆ కొండపై నడక సాగిస్తూ విశాలాక్షి అయిన ఒక కన్యను చూచాడు. లోకంలో ఆమెకు సాటివచ్చే స్త్రీలు లేరు. శత్రుసేనల సంహరింపగల ఆ రాజశ్రేష్ఠుడు-సంవరణుడు-ఒంటరియై ఒంటరిగా ఉన్న ఆమెను తదేకదృష్టితో చూస్తూ నిలిచాడు.

ఆమె రూపాన్ని చూచి, ఆ రాజు ఆమెను సాక్షాత్తు లక్ష్మిగా భావించాడు. మరల ఆలోచిస్తూ సూర్యమండలం నుండి జారిపడిన సూర్యప్రభగా భావించాడు. ఆమె శరీరం, తేజస్సు అగ్నిజ్వాలవలె ఉన్నాయి. తనలోని ప్రసన్నత, కాంతి వలన ఆమె చంద్రరేఖవలె కనిపిస్తోంది. అందమయిన, నల్లని కన్నులు గల ఆమె పర్వతశిఖరంపై నిలిచి బంగారు బొమ్మలాగా ప్రకాశిస్తోంది. విశేషించి ఆమె రూపంవలన, వేషం వలన వెలుగొందుతున్న ఆ కొండ చెట్లు, పాదలు, లతలతో సహా స్వర్ణమయంగా కనిపించింది. ఆమెను చూచిన తరువాత సంవరణుడు లోకంలోని సమస్తస్త్రీలను తక్కువగా తలచాడు. తనకు కన్నులున్నందులకు ఫలితం లభించిందని కూడా భావించాడు. తాను పుట్టిన నాటినుండి చూచిన ఏ రూపమూ ఆమె రూపానికి కొంచెమయినా సాటిరాదని ఆ రాజు అనుకొన్నాడు. అప్పుడు ఆమె ఉత్తమగుణా లనే పాశాలు ఆ సంవరణుని కళ్ళను, మనస్సును బంధించాయి. ఆయన అక్కడ నుండి కదలలేకపోయాడు. ఆయన కేమీ తెలియటం లేదు. బ్రహ్మదేవుడు స్వర్గమర్త్యపాతాళ లోకాలను మధించి విశాలాక్షి అయిన ఆ కాంతరూపాన్ని ఆవిష్కరించి ఉంటాడని ఆయన భావించాడు. ఆ సమయంలో సంవరణుడు రూపసంపదలతో ఆకన్య లోకంలో సాటిలేనిదని వితర్కించాడు. సద్వంశంలో పుట్టిన ఆ సంవరణరాజు కళ్యాణస్వరూపిణి అయిన ఆమెను చూడగానే మదనబాణాలచే పీడింపబడి మనస్సులో చింతించసాగాడు. తీవ్రమయిన మన్మథాగ్ని తనను దహిస్తుంటే సంవరణుడు లజ్జావతియై మనోహరంగా ఉన్న ఆమెతో నిస్సంకోచంగా ఇలా అన్నాడు.

"శుచిస్మితా! నీవెర్తెవు? ఎవరి కూతురువు? ఇక్కడెందు కున్నావు? జనసంచారంలేని ఈ అడవిలో ఒంటరిగా ఎందుకు తిరుగుతున్నావు. నీ శరీరావయవాలు నిర్దోషంగా ఉన్నాయి. సర్వాభరణాలను ధరించిన నీవు ఈ భూషణాలన్నీ మక్కువపడిన ఆభరణంవలె కనిపిస్తున్నావు. నీవు దేవకాంతవూ, గంధర్వస్త్రీవి, మానవకాంతవూ కావని నేననుకొంటున్నాను. మత్తకాశిని! నేనింతవరకు అందగత్తెల నెందరినో చూచాను. చాలామందిని గురించి విన్నాను. కాని వారిలో ఏ ఒక్కరు కూడా నీకు సాటిరాలేరని భావిస్తున్నాను. చంద్రునిమించిన వెలుగులతో తామరరేకుల వంటి కన్నులతో వెలుగొందుతున్న నీ ముఖాన్ని నేను చూడగానే మన్మథుడు నన్ను మథిస్తున్నట్లుంది." ఈ ప్రకారంగా ఆ రాజు ఆమెతో మాట్లాడినా కానీ ఆమె కామార్తుడైన ఆ రాజుకు ఆ నిర్జనారణ్యంలో ఏ సమాధానమూ చెప్పలేదు. ఆ రాజు అలా ప్రలాపిస్తున్నప్పుడే విశాలనేత్రాలు గల ఆ తపతి మేఘాలలో మెరుపు లీనమైనట్లు అక్కడే అంతర్ధాన మైంది. అప్పుడు తామరరేకులవంటి కన్నులు గల

ఆమెను వెతుకుతూ ఆ రాజు ఉన్మత్తునివలె ఆ వనమంతటా తిరిగాడు. ఆమె కనిపించనందువలన ఆ రాజశ్రేష్ఠుడు - సంవరణుడు- ఆమెను గూర్చి బహుధా విలపించి నిశ్చేష్టుడై కొంతకాలం అక్కడే నిలిచాడు.

171. తపతీ సంవరణుల సంభాషణము.

ఆ రీతిగా ఆమె కనిపించకుండా పోవటంతో కామమోహితుడైన సంవరణమహారాజు శత్రుసమూహాలను పడగొట్టగల శక్తిగలవాడై కూడా తానే నేలపై పడ్డాడు. రాజు ఆ విధంగా నేలపై పడగానే విశాలమైన శ్రోణిభాగం గల ఆ తపతి అందంగా నవ్వుతూ మళ్లీ ఆ రాజుకు కనిపించింది. కురువంశవర్ధనుడైన ఆ రాజు కామాగ్నితప్తుడై అచేతనుడయ్యాడు. ఆ సమయంలో మాటాడదగిన మధురవచనాలతో ఆ తపతి నవ్వుతూ సంవరణునితో ఇలా అన్నది- "అరిందమా! లే లే, నీకు మేలు గలుగుతుంది. రాజశ్రేష్ఠుడవుగా విశ్వవిఖ్యాతి నందిన నీవు ఈ ప్రకారంగా మోహావిష్టుడవు కారాదు." ఆమె ఆ రీతిగా మధురంగా పలికిన తరువాత రాజు కళ్ళు తెరిచాడు. ఎదురుగా విశాల నితంబంగల ఆ సుందరి కనిపించింది. రాజు అంతఃకరణంలో కామాగ్ని ప్రజ్వరిల్లుతోంది. ఆ రాజు నల్లని కనుకొనలు గల ఆ సుందరితో అస్పష్టంగా ఇలా అన్నాడు.

"అసితాపాంగీ! మత్తకాశినీ! మంచిది. కామార్తుడనై నిన్ను సేవిస్తున్నాను. నన్ను స్వీకరించి సేవించు. లేనిచో నా ప్రాణాలు పోయేటట్లున్నాయి. విశాలనేత్రా! నీకోసం మదనుడు నన్ను నిశితబాణాలతో గాయపరుస్తున్నాడు. అయినా శాంతించటం లేదు. కళ్యాణీ! కామసర్పం కాటువేయగా రక్షణకై ఆక్రోశిస్తున్నాను సుశ్రోణీ! నాదగ్గరకు రా! నా ప్రాణాలు నీ వశమై ఉన్నాయి. అందమై, నిర్దుష్టమైన శరీరావయవాలు కలిగి పద్మంవలె చంద్రునివలె ప్రకాశించే ముఖంగల నీవు లేకుండా నేను జీవించలేను. కమలపత్రాక్షీ! మదనుడు నన్ను గాయపరుస్తున్నాడు. విశాలాక్షీ! నాపై దయచూపు. అసితాపాంగీ! నీకు నేను భక్తుడను. నన్ను విడువదగదు. ప్రీతిపూర్వకంగా నీవు మాత్రమే నన్ను రక్షించగలవు. నిన్ను చూచినప్పుడే నామనస్సు నీపై మరులుగొన్నది. నిలకడను కోల్పోయింది. కళ్యాణీ! నిన్ను చూచిన తరువాత మరెవ్వరినీ చూడా లనిపించటం లేదు. దయచూపు! నేను నీకు లోబడినవాడను. నీ భక్తుడను. నన్ను అంగీకరించు. విశాలాక్షీ! నేను నిన్ను చూసినప్పుడే మదనుడు నా మనస్సును బాణాలతో గాయపరిచాడు. కమలాక్షీ ! మన్మథు డనే అగ్నినుండి పుట్టిన తాపాన్ని ప్రీతి సంగమాలతో కూడిన నీటితో చల్లబరుచు. పుష్పశరుడు

చాలా కఠినుడు. ప్రచండుడు. నీదర్శనంతోనే పుట్టాడు. సహింపరాని బాణాలతో కొడుతున్నాడు. అందుచేత ఆత్మ ప్రదానంతో శమింపజెయ్యి. వరాంగనా! గాంధర్వవివాహంతో నాకు దగ్గరకావచ్చు. రంభోరూ! వివాహాలన్నింటిలో గాంధర్వం శ్రేష్ఠమైనది.

తపతి అన్నది- "రాజా! నేను స్వతంత్రురాలను కాను. నేను కన్యను. నాతండ్రి జీవించి ఉన్నాడు. నామీద మక్కువ కలిగితే మా తండ్రి నడుగు. నరేశ్వరా! చూచీ చూడగానే నేను నీప్రాణాలను లోబరుచుకొన్నట్లు నీవు కూడా నాప్రాణాలను అపహరించావు. రాజశ్రేష్ఠా! నా శరీరానికి నేను యాజమానిని కాను. కాబట్టి నీ దగ్గరకు రాలేను. స్త్రీలు స్వతంత్రులు కాదు. సర్వలోక ప్రసిద్ధిగల వంశంలో పుట్టిన భక్తవత్సలుడైన మహారాజును ఏ కన్య భర్తగా కోరుకొనదు ! కాబట్టి ఈ స్థితిలో నమస్కారాలతో, తపస్సుతో, నియమాలతో నాతండ్రి అయిన సూర్యభగవానుని యాచించు. శత్రుసూదనా! రాజా! ఆయన నన్ను నీకు ఇవ్వటాని కిష్టపడితే ఆనాడే నీకు శాశ్వతంగా వశ మవుతాను. క్షత్రియోత్తమా! నాపేరు తపతి. లోకప్రదీపకుడైన సూర్యునకు సావిత్రి తరువాత పుట్టిన కుమార్తెను."

172. వసిష్ఠుని సహాయముతో తపతీ సంవరణుల వివాహము జరుగుట.

ఈ రీతిగా పలికి అనింద్య అయిన ఆ తపతి గగనతలానికి వెళ్ళిపోయింది. ఆ రాజు మరల అక్కడే నేలపై పడిపోయాడు. సేనతో అనుచరులతో కలిసి నరశ్రేష్ఠుడైన ఆ సంవరణమహారాజును వెదకుతూ ఆయన మంత్రి మహారణ్యంలో ఆ రాజును చూచాడు. కూలిపోయిన ఇంద్రధ్వజంవలె ఆ రాజు నేలపై పడిఉన్నాడు. తపతిచే తిరస్కరింపబడి, నేలపై పడిఉన్న ఆ మేటి విలుకానిని చూచి ఆ అమాత్యుడు మండిపోయాడు. వేగంగా ఆయనను సమీపించాడు. స్నేహంకారణంగా ఆయన మనస్సు కలతపడింది. ఆ అమాత్యుడు జ్ఞానవయోవృద్ధుడు. బుద్ధి, యశస్సు, రాజనీతిలో కూడా పెద్దవాడే. అటువంటి అమాత్యుడు కామమోహితుడై నేలగూలిన ఆ సంవరణ మహారాజును తండ్రి బిడ్డను ఎత్తుకొన్నట్టు నేలమీదనుండి లేపాడు. రాజు పైకి లేచి స్వస్థుడయిన తరువాత అమాత్యుడు నెమ్మది వహించాడు. 'నరోత్తమా! భయపడవద్దు. అనఘా! నీకు మేలే జరుగుతుంది' అని శుభప్రదంగా, మధురంగా పైకి లేచిన ఆ మహారాజుతో అన్నాడు. యుద్ధంలో శత్రువులను నేలగూల్చే మహారాజు తానే నేలబడి ఉండటానికి ఆకలిదప్పులతో అలసిపోవటమే కారణమై ఉంటుందని అమాత్యుడు భావించాడు. రాజుమస్తకంపై కిరీటం చెదరిపోలేదు. (కాబట్టి యుద్ధంలో గాయపడలేదని భావించి) అమాత్యుడు కమలసుగంధం కలిపిన చల్లని నీటితో రాజు

శిరస్సును తడిపాడు. దానితో రాజు మరల స్పృహలోనికి వచ్చాడు. బలిష్ఠుడైన ఆ రాజు అమాత్యుని తప్ప మిగిలిన పరివారాన్నంతా వెనక్కు పంపాడు. రాజు ఆనతితో ఆ విశాలసేన వెను దిరిగింది. ఆ రాజు మాత్రం మరల ఆ గిరిశిఖరంపై కూర్చున్నాడు.

ఆ తర్వాత ఆ మహాగిరిపై సూర్యుని ఆరాధింపగోరి శుచియై, చేతులు జోడించి తలపైకెత్తి నేలపై నిలిచాడు. అప్పుడు సంవరణనరపాలుడు ఋషిసత్తముడూ, తన పురోహితుడూ అయిన వసిష్ఠుని మనస్సులో తలచాడు. ఆ రాజు పగలూ, రేయీ కూడా ఒకే తావున నిలిచి తపస్సు చేయసాగాడు. తర్వాత పండ్రెండవరోజు బ్రహ్మర్షి అయిన వసిష్ఠుడు వచ్చాడు. తపతి సంవరణుని మనస్సును దోచినదని నిర్మలాంతఃకరణంగల వసిష్ఠమహర్షి దివ్యజ్ఞానంతో ముందుగానే గ్రహించాడు. ఆ విధంగా ఇంద్రియాలనూ, మనస్సునూ అదుపులో నుంచుకొని తపోదీక్షితుడైన ఆ సంవరణునితో ఆ రాజు పనిని సాధించటానికే ధర్మాత్ముడైన వసిష్ఠుడు ఆయనతో మాటాడాడు. సూర్యతేజస్సుగల పూజ్యుడు వసిష్ఠమహర్షి ఆ సంవరణ నరేంద్రుడు చూస్తూండగానే సూర్యుని కలవాలని పైకి పయనించాడు. తరువాత వసిష్ఠుడు చేతులు జోడించి సూర్యసన్నిధిలో నిలిచి "నేను వసిష్ఠుడను" అంటూ ప్రసన్నంగా తనను తాను పరిచయం చేసికొన్నాడు.

(వసిష్ఠ డిలా అన్నాడు. అజుడు, లోకత్రయపావనుడు, సర్వ ప్రాణిస్వరూపుడు, కిరణాధిపతి, ధర్మరూపుడు, సర్గప్రళయాశ్రయుడు, పరమదయామయులలో ఉత్తముడు అయిన సూర్యునకు నమస్కారం. జ్ఞానుల అంతరాత్మ, జగత్ప్రదీపం, లోకహితకాంక్షి, స్వయంభువుడు, వేయివెలుగుల కన్నులవాడు, దేవతాశ్రేష్ఠుడు, అమితతేజస్వి అయిన సూర్యునకు నమస్కారం. జగత్తున కంతటికి కన్నువంటివాడు, లోకాల పుట్టుకకూ, స్థితికీ, ప్రళయానికీ కారణమైనవాడు, వేదత్రయస్వరూపుడు, త్రిగుణాలను ధరించి బ్రహ్మ, విష్ణు, మహేశ్వరరూపాలతో ప్రసిద్ధుడూ అయిన సవితకు నమస్కారం.)*

మహాతేజస్వి అయిన సూర్యుడు మునిశ్రేష్ఠునితో ఇలా అన్నాడు. మహర్షీ! తమకు

---

* అజాయ లోకత్రయపావనాయ భూతాత్మనే గోపతయే వృషాయ ।
సూర్యాయ సర్గప్రలయాలయాయ నమో మహాకారుణికోత్తమాయ ॥
వివస్వతే జ్ఞానభృదంతరాత్మనే జగత్ప్రదీపాయ జగద్ధితైషిణే ।
స్వయంభువే దీప్తసహస్రచక్షుషే సురోత్తమాయామితతేజసే నమః ॥
నమః సవిత్రే జగదేకచక్షుషే జగత్ప్రసూతి స్థితి నాశహేతవే ।
త్రయీమయాయ త్రిగుణాత్మధారిణే విరించ నారాయణ శంకరాత్మనే ॥

స్వాగతం. తమ కోరిక ఏమిటో చెప్పండి. మహాభాగా! నా నుండి తమకేమి కావాలి? తమరు కోరినది ఎంత దుష్కరమైనా సరే నేనివ్వగలను.

(సువ్రతా! తమరు నన్ను స్తుతించారు. తమకు వరమిస్తాను. కోరుకోండి. తమరు చేసిన నా స్తుతి భక్తులు నిరంతరమూ జపించదగినది నేను తమకు వరమివ్వదలచాను.)

సూర్యు డిలా పలుకగానే మహాతపస్వి అయిన వసిష్ఠమహర్షి తేజస్వి అయిన సూర్యునకు నమస్కరించి ఇలా అన్నాడు.

'విభావసూ! నీ కుమార్తె, సావిత్రి చెల్లెలు అయిన తపతిని సంవరణుని కోసం నిన్ను అడుగుతున్నాను. సూర్యా! ఆ సంవరణుడు గొప్ప కీర్తి గలవాడు. ధర్మార్థాల నెరిగినవాడు. ఉదారబుద్ధిగలవాడు. నీ కుమార్తెకు తగిన భర్త.' వసిష్ఠుడిలా చెప్పగానే కుమార్తెనివ్వాలని మనస్సులో నిశ్చయించుకొని సూర్యుడు వసిష్ఠుని అభినందించి ఇలా అన్నాడు. 'మహర్షీ! సంవరణుడు రాజశ్రేష్ఠుడు. నీవు ముని శ్రేష్ఠుడవు. తపతి వనితలలో శ్రేష్ఠురాలు. ఇవ్వటం తప్ప మరొకటే ముంది?' ఆ తరువాత సూర్యుడు స్వయంగా అనవద్యాంగి అయిన తపతిని సంవరణునకోసం వసిష్ఠమహాత్మున కిచ్చాడు. అప్పుడు వసిష్ఠమహర్షి ఆ కన్యను- తపతిని-స్వీకరించి సూర్యుని దగ్గర సెలవు తీసికొని మరల సంవరణుని దగ్గరకు వచ్చాడు. కురువంశశ్రేష్ఠుడూ, విఖ్యాతకీర్తి అయిన సంవరణమహారాజు మదనావిష్టుడై తపతిని గూర్చియే తలపోస్తూ ఉన్న ప్రదేశానికి వసిష్ఠమహర్షి తపతిని తీసికొని వచ్చాడు. మనోహరంగా నవ్వుతూ, వసిష్ఠునితో సహా వస్తున్న ఆ దేవకన్యను- తపతిని-చూచి సంవరణుడు ఆనందంతో పొంగిపోతూ, మరీ అందంగా కనిపించాడు. అందమైన కనుబొమలుగల ఆ తపతి గగనతలం నుండి క్రిందకు వస్తూ జారిపడిన మెరుపుతీగెవలె దిక్కులను ప్రకాశింపజేస్తూ, మిక్కిలిగా వెలుగొందింది. ఆ రాజు క్లేశాలను సహిస్తూ, ఏకాగ్రచిత్తుడై పండ్రెండు రాత్రులు గడిపాడు. అప్పుడు పవిత్రాంతఃకరణుడైన పూజనీయుడు, వసిష్ఠమహర్షి వచ్చాడు. లోకపాలకుడు, వరదాయకుడు, కిరణాలకు అధిపతి అయిన సూర్యుని తపస్సుతో ఆరాధించి, సంవరణుడు వసిష్ఠ ప్రభావంతో తపతిని భార్యగా పొందాడు. ఆపై ఆ మానవోత్తముడు దేవగంధర్వసేవితమైన ఆ పర్వతంపై శాస్త్రానుసారంగా తపతిపాణిగ్రహణం చేశాడు.

ఆ తరువాత వసిష్ఠుని అనుమతి తీసికొని ఆ రాజర్షి ఆ పర్వతం మీదనే భార్యతో సహ విహరించాలని ముచ్చటపడ్డాడు. సంవరణమహారాజు నగర, రాష్ట్ర, వన, ఉపవన సంరక్షణకై ఆ మంత్రినే ఆదేశించి నియమించాడు. వసిష్ఠుడు రాజు దగ్గర

సెలవు తీసికొని నిష్క్రమించాడు. సంవరణుడు ఆ కొండపై అమరునివలె విహరించాడు. ఆ రాజు ఆ పర్వతంపైనున్న అడవులలో, వనాలలో తన భార్యతో సహా అదేవిధంగా పండ్రెండు సంవత్సరాలు క్రీడించాడు. సజ్జనశ్రేష్ఠా! అర్జునా! ఆ రాజు నగరంలోనూ, దేశంలోనూ పండ్రెండుసంవత్సరాల పర్యంతం ఇంద్రుడు వానలు కురిపించలేదు. అరిందమా! అనావృష్టి సంభవించగా స్థావరజంగమ రూపధారు లయిన సమస్తప్రజలు క్షీణించిపోయారు. తీవ్రమైన అనావృష్టికాలంలో ఒక్క మంచుబొట్టుకూడా నేలపై పడలేదు. దానితో మొక్కకూడా మొలవలేదు. ప్రజలందరి మనసులు క్షోభకు గురి అయ్యాయి. ఆకలిభయంతో వారందరూ ఇళ్ళను విడిచిపెట్టి దిక్కులలో, మూలలలో తిరుగసాగారు. ఆ సమయంలో ఆ నగరప్రజలూ, దేశప్రజలూ సనాతన మర్యాదలను పరిత్యజించి, ఆలుబిడ్డలనూ బంధువులనూ విడిచి ఆకలితో ఒకరినొకరు చంపుకొనసాగారు. ఆకలిచే పీడింపబడి, ఆహారం దొరకక శవాలవలె ఉన్న ప్రజలతో ఆదేశం ప్రేతాలతో నిండిన నరకంలా తయారైంది.

అప్పుడు ఆ ప్రజల ఆ దుస్థితిని చూచి పూజ్యుడు, మునిశ్రేష్ఠుడు, ధర్మస్వరూపుడు అయిన వసిష్ఠమహర్షి వర్షాన్ని కురిపించాడు. రాజా! దానితోపాటు చాలా సంవత్సరాలు రాజ్యానికి దూరంగా ఉన్న సంవరణుని తపతితో సహా రాజ్యానికి రప్పించాడు. అప్పుడు దేవేంద్రుడు అంతకుముందు వలెనే వాన కురిపించాడు. రాజశ్రేష్ఠుడైన ఆ సంవరణుడు నగరంలో ప్రవేశించిన తర్వాత ప్రభు వయిన దేవేంద్రుడు సస్యానుకూలంగా పెనువాన కురిపించాడు. రాజశ్రేష్ఠుడు, పవిత్రాంతఃకరణుడు అయిన ఆ సంవరణుని పాలనలో ఆ నగరంలోనూ, ఆదేశంలోనూ ఉన్న ప్రజలు పరమానందాన్ని అనుభవించారు. తరువాత సంవరణుడు భార్య అయిన తపతితో కలిసి శచితోకూడిన ఇంద్రునివలె ప్రకాశిస్తూ పండ్రెండుసంవత్సరాల పర్యంతం యజ్ఞం చేశాడు.

గంధర్వుడిలా అన్నాడు– అర్జునా! ఈ ప్రకారంగా భాగ్యశాలిని అయిన సూర్యసుత తపతి మీ పూర్వీకుడైన సంవరణునకు భార్య అయినది. అందువలన నేను 'తాపత్యా' అని నిన్ను సంబోధించాను. తాపసశ్రేష్ఠా! అర్జునా! ఆ తపతియందు సంవరణ మహారాజు కురువును కన్నాడు. అందువలన నీవు తాపత్యుడవయ్యావు.

(భరతశ్రేష్ఠా! కురువు వంశంలో పుట్టారు కాబట్టి మీరు కురువులు, కౌరవులూ అయ్యారు. పురువంశంలో పుట్టారు కాబట్టి పౌరవులు, అజమీఢ వంశంలో పుట్టినందువల్ల ఆజమీఢులు, భరతవంశంలో పుట్టి భారతులు అయ్యారు. తపతికి సంబంధించిన ప్రాచీన వృత్తాంతమంతా నీకు చెప్పాను. పురోహితుని ముందుంచుకొని మీరు భూమిని అనుభవిస్తూ, పరిపాలించండి.)

173. క్షత్రియులకు బ్రాహ్మణబలము కావలెననుట.

అప్పుడు ఆ రీతిగా పలికిన ఆ గంధర్వుని మాట విని అర్జునుడు పరమభక్తితో పూర్ణచంద్రునివలె ప్రకాశించాడు. మేటి విలుకాడైన అర్జునుడు గంధర్వునితో ఇలా అన్నాడు. 'వసిష్ఠుని తపోబలాన్ని గురించి వినటానికి నాలో ఎంతో కుతూహలం కలుగుతోంది. నీవు ఆ మహర్షి పేరు వసిష్ఠ డన్నావు. ఆ పేరెలా వచ్చిందో వినాలనుకొంటున్నాను. ఉన్నదున్నట్లుగా నాకు చెప్పు. గంధర్వరాజా! మా పూర్వీకులకు పురోహితుడైన పూజ్యుడు, వసిష్ఠమహర్షి ఎవరు? ఇది నాకు చెప్పు.' గంధర్వ డిలా అన్నాడు. 'వసిష్ఠుడు బ్రహ్మమానస పుత్రుడు, అరుంధతి భర్త. దేవతలకు కూడా జయింపరాని కామక్రోధాలను తన తపస్సుతో జయించాడు. అవి శాశ్వతంగా ఆయన పాదసేవ చేస్తున్నాయి. ఇంద్రియాలను అదుపులో నుంచినవాడు కాబట్టి ఆయన వసిష్ఠుడు. విశ్వామిత్రుడు చేసిన అపరాధం వలన తీవ్రకోపం వచ్చినా ఆ వసిష్ఠుడు ఉదారబుద్ధి గలవాడు కాబట్టి కుశికవంశ నాశనానికి ఒడిగట్టలేదు. విశ్వామిత్రుడు తనకుమారులను సంహరించినా, దానికి ప్రతీకారం చేయగల శక్తి ఉండికూడా అశక్తుని వలె నిలిచి విశ్వామిత్ర వినాశానికి ఎటువంటి ఘోరకృత్యాన్నీ చేయలేదు. చనిపోయిన తన కుమారులను యమసదనం నుండి తిరిగి తీసికొనిరాగల శక్తి కలవాడైనా, సముద్రం హద్దు నతిక్రమించనట్లు యమధర్మరాజశాసనాన్ని తాను ఉల్లంఘించలేదు. విజితాత్ముడు, మహాత్ముడూ అయిన ఆ వసిష్ఠుని పురోహితునిగా పొందియే ఇక్ష్వాకు రాజులు ఈ భూమిని పరిపాలించారు. ఆ రాజులు ఋషిశ్రేష్ఠు డైన వసిష్ఠుని పురోహితునిగా స్వీకరించిన తరువాత ఎన్నో యజ్ఞాలు కూడా చేశారు. బృహస్పతి దేవతలచే యాగాలు చేయించినట్టు ఆ బ్రహ్మర్షి-వసిష్ఠుడు- సమస్తరాజవరులచేతా యాగాలు చేయించాడు. కాబట్టి నీవు కూడా ధర్మానికే ప్రాధాన్యమిచ్చేవాడు, వేదధర్మమెరిగినవాడు, గుణవంతుడు అయి నీకు నచ్చిన ఎవరినైనా పురోహితునిగా ఏర్పాటు చేసుకో. పార్థా! **భూమండలాన్ని జయించదలచుకొనే ఉత్తమ క్షత్రియుడు రాజ్యాభివృద్ధి కోసం ముందుగా పురోహితుని నియోగించుకోవాలి. భూమిని గెలవదలచినరాజు బ్రాహ్మణుని ముందు నిలుపుకోవాలి.** కాబట్టి జితేంద్రియుడు, గుణవంతుడు, పండితుడు అయి ధర్మకామార్థాల నెరిగిన విప్రుని ఎవరి నయినా పురోహితునిగా చేసుకో.'

174. వసిష్ఠుని క్షమాశక్తి - విశ్వామిత్రుని పరాభవము.

అర్జునుడిలా అన్నాడు. 'తమతమ పవిత్రాశ్రమాలలో నివసించే విశ్వామిత్ర వసిష్ఠులకు ఏ కారణంగా వైరం ఏర్పడింది? అది మాకు సవిస్తరంగా చెప్పు.' గంధర్వు డిలా అన్నాడు. "అర్జునా! ఈ వాసిష్ఠోపాఖ్యానం సమస్తలోకాలలోనూ చాలా పురాతనమైనదిగా చెప్పబడుతోంది. ఉన్నదున్నట్లు చెపుతా విను. భరతర్షభా! కాన్యకుబ్జంలో గొప్ప రాజుండేవాడు. గాధి అన్న పేరుతో అతడు లోకవిఖ్యాతుడు. ఆయన కుశికుని కొడుకు. ధర్మస్వరూపు డైన ఆయనకు ఒక కొడుకు. పేరు విశ్వామిత్రుడు. ఆ విశ్వామిత్రుడు సేన, వాహనాలు మిక్కిలిగా కలిగి శత్రువులను అణచివేసేవాడు. నరోత్తమా!ఒకమారు అమాత్యులతో కలిసి ఆ విశ్వామిత్రుడు కీకారణ్యంలో వేటాడుతున్నాడు. మరుప్రదేశంలోని అందమైన వనాలలో మృగాలను, వరాహాలను వేటాడుతూ ఒక మృగాన్ని వెంటాడి, అలసిపోయి, దప్పికగొని వసిష్ఠాశ్రమానికి వచ్చాడు. గొప్పవారిని పూజింపగల ఆ వసిష్ఠమహర్షి తన ఆశ్రమానికి వచ్చిన విశ్వామిత్రుని- సత్కరించి ఆతిథ్యాన్ని అందుకోవటానికి ఆహ్వానించాడు. అర్ఘ్య, పాద్య, ఆచమనీయ స్వాగతవాక్యాలతోనూ, ఆరణ్యకమైన హవిస్సులతోనూ విశ్వామిత్రుని సత్కరించాడు. మహాత్ముడైన వసిష్ఠునకు కోరికల తీర్చగల ఒక ఆవు ఉన్నది. "ఇది కావాలి" అంటే ఆ ఆవు ఎప్పుడైనా ఆ కోరిక తీర్చుతుంది.

అర్జునా!ఆ ఆవు గ్రామీణుల అన్నాన్ని, ఆటవికుల ఫలమూలాలను, పాలనూ, షడ్రసోపేత భోజనాలను, అమృత మధురాలయిన ఉత్తమపానీయాలను వివిధభక్ష్యాలను, లేహ్యాలను, అమృతాయమానాలయిన చోష్యాలను (పచ్చడి పులుసు మొ।), విలువయిన రత్నాలను, వివిధ వస్త్రాలను ఆ కామధేనువు అందజేసింది. సర్వవిధాలా సంపూర్ణమైన ఆ పదార్థాలతో విశ్వామిత్రుని పూజించాడు వసిష్ఠుడు. అప్పుడు ఆ విశ్వామిత్రుడు, ఆయన అమాత్యులు, పరివారం అందరూ చాలా తృప్తిపడ్డారు. ఆ కామధేనువు తల, మెడ, పిక్కలు, గంగడోలు, తోక, పొదుగు. ఉన్నతమైనవి. దాని ప్రక్కలు, తొడలు అందమైనవి. లలాటం, కళ్ళు, చెవులు విశాలమైనవి. కప్పలవంటి కళ్ళు, మంచిరూపమూ, నిర్దుష్టమైన పెద్దపొదుగు, అందమైన తోక, శంకుల వంటి చెవులు, అందమైన కొమ్ములు గలిగి మనోరమంగా ఉంది. బలిష్ఠాలై, విశాలంగా ఉన్న దాని శిరస్సును మెడను చూచి ఆశ్చర్యపడిన ఆ విశ్వామిత్రుడు ఆ ఆవును-నందినిని- అభినందించాడు. పరమానందపడిన ఆ రాజు అప్పుడు వసిష్ఠునితో ఇలా అన్నాడు. 'బ్రహ్మర్షీ! తమకు పదికోట్ల ఆవులను ఇస్తాను. లేదా నారాజ్యాన్నే ఇస్తాను. నందినిని

నాకిచ్చి రాజ్యాన్ని అనుభవించండి.' వసిష్ఠుడిలా అన్నాడు. 'అనఘా! ఈ నందిని దేవ, అతిథి, పితృ కార్యాలను నిర్వహించటానికి యాగహవిస్సుగా వినియోగించటానికి పాలనిస్తూ ఇక్కడున్నది, నీ రాజ్యమంతా ఇచ్చినా నందినిని ఇవ్వలేను.' విశ్వామిత్రుడిలా అన్నాడు. 'నేను క్షత్రియుడను. తమరు తపస్సును, స్వాధ్యాయాన్ని సాధనచేసే విప్రులు. బ్రాహ్మణులు ప్రశాంతచిత్తులు, జితేంద్రియులును. అటువంటి మీలో పరాక్రమానికి అవకాశమేది? నేను కోటి ఆవులను ఇస్తానన్నా నందినిని నాకివ్వనంటున్నారు. నా ధర్మాన్ని నేను విడువను. బలపూర్వకంగా ఆవును కొనిపోతాను.

(నేను క్షత్రియుడనే కానీ బ్రాహ్మణుడను కాను. ధర్మానుసారంగానే నేను బాహుపరాక్రమాన్ని ప్రదర్శించవచ్చు. కాబట్టి తమరు చూస్తుండగానే భుజబలంతో దీనిని కొనిపోతాను.')

వసిష్ఠుడిలా అన్నాడు. 'నీవు క్షత్రియుడవు. బాహుపరాక్రమం గలవాడవు. సైన్యం కూడా నీ వెంట ఉన్నది. నీ ఇష్టం వచ్చినట్టు వెంటనే చేయవచ్చు. ఆలోచించనవసరం లేదు.' వసిష్ఠుడలా అనగానే విశ్వామిత్రుడు హంసవలె, చంద్రునివలె తెల్లగా ఉన్న ఆ నందినీధేనువును కొరడాలతో, కర్రలతో కొడుతూ ఇటూ అటూ అదిలిస్తూ బలవంతంగా అపహరించాడు. అర్జునా! అప్పుడు కళ్యాణప్రద అయిన ఆ నందిని బెదురుతూ వచ్చి వసిష్ఠుని ఎదుట నిలబడింది ఆయనవైపే చూస్తూ. విశ్వామిత్రుడు ఎంత కొట్టినా అది ఆశ్రమం నుండి కదలలేదు.

వసిష్ఠుడిలా అన్నాడు. 'అమ్మా! మాటిమాటికీ నీవు చేస్తున్న ఆర్తనాదాలను వింటూనే ఉన్నాను. విశ్వామిత్రుడు నిన్ను బలవంతంగా కొనిపోతున్నాడు. నందినీ! నేనేమి చేయగలను. సహనశీలుడ నయిన బ్రాహ్మణుడను నేను.' నందిని విశ్వామిత్రుని చూచి ఉద్వేగానికి లోనైంది. ఆయన సేనను చూచి భయపడి వసిష్ఠుని దగ్గరకు వచ్చింది. గోవు ఇలా అన్నది. 'స్వామీ!విశ్వామిత్రుని సేనలు నన్ను కొరడాలతో, కర్రలతో తీవ్రంగా కొడుతున్నారు. దిక్కులేని దానవై నేను ఆక్రోశిస్తున్నాను. మీరెందుకు ఉపేక్షిస్తున్నారు? నందిని ఈ విధంగా పరాభవింపబడి ఆక్రోశిస్తున్నా వసిష్ఠమహర్షి కలత పడలేదు. ధైర్యాన్ని కోలుపోలేదు. వసిష్ఠుడిలా అన్నాడు. **'క్షత్రియులకు తేజస్సు బలం. బ్రాహ్మణులకు సహనమే బలం.** క్షమ నన్ను ఆశ్రయించింది. కాబట్టి నీకిష్టమయితే వెళ్ళవచ్చు.' నందిని ఇలా అన్నది. 'స్వామీ! నన్ను మీరు త్యాగం చేశారా? ఇలా అంటున్నారేమిటి? బ్రహ్మర్షీ! మీరు నన్ను త్యాగం చేయకుంటే బలపూర్వకంగా నన్నెవ్వరూ కొనిపోలేరు.' వసిష్ఠుడిలా అన్నాడు. 'కళ్యాణి! నేను నిన్ను విడవటం లేదు. శక్తి ఉంటే ఇక్కడే నిలు. నీ దూడను గట్టిత్రాళ్ళతో కట్టి బలపూర్వకంగా తీసుకొనిపోతున్నారు.' 'నిలు' అన్న వసిష్ఠుని మాట విని ఆ నందిని

తలను మెడను పైకి చాపి భయంకరంగా కనిపించింది. ఆ నందిని కోపంతో కళ్ళెర్రజేసి పెద్ద పెద్దగా అంబారవాలు చేస్తూ విశ్వామిత్రుని సేననంతా నాలుగు దిక్కులకూ పారద్రోలింది.

అంతకుముందే కొరడాలతో కర్రలతో కొట్టినందువలనా, అటు ఇటు అదిలించటం వలన కోపంతో కన్నెర్రజేసిన ఆ నందిని ఇంకా కోపాన్ని తెచ్చుకొంది. మధ్యాహ్నకాలపు సూర్యునివలె కోపంతో దాని శరీరం ప్రజ్వరిల్లింది. తోకనుండి మాటిమాటికి నిప్పులవాన కురిపిస్తూ తోకనుండి పహ్లవులను, పొదుగునుండి ద్రవిడులను, శకులను, యోని ప్రదేశం నుండి యవనులను, గుదం నుండి ఎంతోమంది శబరులను వెలువరించింది. మూత్రం నుండి కొందరు శబరులను, ప్రక్కలనుండి పౌండ్రులను, కిరాతులను, యవనులను, సింహళులను, బర్బరులను, ఖసులను సృష్టించింది. అదే విధంగా నురుగునుండి చిబుకులను, పులిందులను, చీనులను, హూణులను, కేరళులు మొదలుగాగల వివిధ మ్లేచ్ఛజాతులను సృష్టించింది. ఆ నందిని సృష్టించిన వివిధమ్లేచ్ఛగణాలు వివిధ కవచాలను కప్పుకొని, వివిధాయుధాలను ధరించి ఉన్నారు. అందరు క్రోధావిష్టులై ఉన్నారు. వారు విశ్వామిత్రుడు చూస్తుండగానే ఆయన సేనను చెల్లాచెదరు చేశారు. ఒక్కొక్క సైనికుని చుట్టూ అయిదుగురేసి, ఏడుగురేసి చుట్టుముట్టారు. అప్పుడు తీవ్రబాణవృష్టి వలన గాయపడుతున్న విశ్వామిత్రుని సేన చెదరిపోయి, బెదిరిపోయి విశ్వామిత్రుడు చూస్తుండగానే అన్ని దిక్కులూ పరుగెత్తింది. కోపించిన ఆ వసిష్ఠసేనలు విశ్వామిత్రుని సైనికుల నెవ్వరినీ చంపలేదు. ఆ నందిని సకలసేనను దూరంగా తరిమికొట్టింది. విశ్వామిత్రుని సేన మూడు యోజనాల మేర నిలిచిపోయింది. భయంతో ఉద్విగ్నమై ఆక్రోశిస్తున్న సేనను రక్షించే వాడెవ్వడూ లేడు.

(అదిచూచి విశ్వామిత్రుడు క్రోధావిష్టుడై మునిశ్రేష్ఠుడైన వసిష్ఠుని లక్ష్యంగా చేసి నేలపైనా, నింగిపైనా బాణవర్షం కురిపించాడు. అయితే ఆ విశ్వామిత్రుడు ప్రయోగించిన ఘోరనారాచాలను, క్షురాలను, భల్లాలను వెదురుకర్రతో నివారించాడు వసిష్ఠుడు. యుద్ధంలో ఆ వసిష్ఠుని కార్యకౌశలాన్ని చూచి విశ్వామిత్రుడు మరల కుపితుడై వసిష్ఠమహర్షిపై కోపంతో దివ్యాస్త్రాలను ప్రయోగించాడు. ఆగ్నేయ, వారుణ, ఇంద్ర, యామ్యాస్త్రాలను మహానుభావుడు, బ్రహ్మసుతుడైన వసిష్ఠునిపై ప్రయోగించాడు విశ్వామిత్రుడు. అవి ప్రళయకాలంలోని సూర్యుని తీక్ష్ణ జ్వాలలవలె అన్ని దిక్కులా మంటలను క్రక్కుతూ వసిష్ఠుని సమీపించాయి. మహాతేజస్వి అయిన వసిష్ఠుడు బ్రాహ్మబలంతో ప్రేరేపించిన బ్రహ్మదండంతో ఆ అస్త్రాల నన్నింటినీ నవ్వుతూ నివారించాడు. అప్పుడ వన్నీ బూడిదై నేలగూలాయి. ఆ దివ్యాస్త్రాల నన్నింటినీ తప్పించి వసిష్ఠ డిలా అన్నాడు. 'గాధికుమారా! మహారాజా! ఓడిపోయావు. ఇంకా నీకు శక్తి ఉంటే నేను నిలిచే ఉన్నాను. నాపై చూపించు.' వసిష్ఠుడలా అనగానే విశ్వామిత్రుడు సిగ్గుపడి ఏమీ అనలేకపోయాడు. ఆయన సేన అంతా పారిపోయింది.)

అప్పుడు బ్రహ్మతేజస్సు నుండి కల్గిన ఆ ఆశ్చరకర సన్నివేశాన్ని చూచి విశ్వామిత్రుడు

తాను క్షత్రియుడ నైనందుకు బాధపడి ఇలా అన్నాడు. క్షత్రియ బలం నిరుపయోగం, బ్రహ్మతేజోబలమే బలం. బలాబలాలు పరిశీలించి తపోబలమే మిన్న అని నిర్ణయించుకొన్నాడు విశ్వామిత్రుడు. విశాల సామ్రాజ్యాన్ని, రాజ్యశ్రీని వీడి వైభోగాలనన్నింటిని కాదని తపస్సు మీదనే మనస్సును లగ్నం చేశాడు. వెళ్లి తపస్సు చేసి, ఆ తపస్సులో సిద్ధిని పొంది, తన తేజస్సుతో లోకాలను స్తంభింపజేసి, తపింపజేశాడు. కడకు తేజస్వియై బ్రాహ్మణత్వాన్ని పొందాడు. తర్వాత ఇంద్రునితో కలిసి సోమపానం చేశాడు.

175. విశ్వామిత్రుని ప్రోత్సాహము - కల్మాషపాదుడు వసిష్ఠపుత్రులను భక్షించుట.

గంధర్వు డిలా అన్నాడు. 'అర్జునా! ఇక్ష్వాకు వంశంలో పుట్టిన రాజు ఒకడుండేవాడు. కల్మాషపాదుడు అన్న పేరుతో ఆయన లోక ప్రసిద్ధుడు. సాటిలేని తేజస్సు గలవాడు. ఒకసారి ఆ రాజు వేటకై నగరం నుండి వెళ్ళాడు. శత్రుసంహర్త అయిన ఆయన జింకలను, వరాహాలను వేటాడుతూ సంచరించసాగాడు. మహాభీకర మయిన ఆ అరణ్యంలో ఖడ్గమృగాలను కూడా చాలా సంహరించాడు. ఎంతోసేపు వేటాడి అలసిపోయిన ఆ రాజు నగరానికి మరలాడు. ప్రతాపశాలి అయిన విశ్వామిత్రుడు ఆ కల్మాషపాదుని తన యజమానుని చేసికోవాలని అనుకొన్నాడు. యుద్ధంలో ఓటమి నెరుగని ఆ రాజు ఆనాడు ఆకలిదప్పులచే పీడింపబడి, ఒక ఇరుకు బాటలో నడుస్తూ ఒక మునిని చూచాడు. ఆయన ఋషి శ్రేష్ఠుడు, వసిష్ఠుని నూరుగురు కొడుకులలో పెద్దవాడు. వసిష్ఠ వంశ వర్ధకుడైన ఆ మహానుభావుని పేరు శక్తి. ఆయనను చూచి రాజు 'నాబాట నుండి తప్పుకో' అని అన్నాడు. అప్పుడు శక్తి మధురవాక్కులతో ఇలా అన్నాడు. 'మహారాజా! దారిని నాకివ్వాలి. ఇది సనాతనధర్మం. ఏ ధర్మం ప్రకారం చూచినా రాజే బ్రాహ్మణునకు దారినివ్వాలి.' ఈ ప్రకారం వారిద్దరూ బాటకోసం 'నీవు తప్పుకో' 'నీవు తప్పుకో' అని పరస్పరం వాగ్యుద్ధం చేస్తూ పలుకసాగారు. ధర్మమార్గానువర్తి అయిన ఆ శక్తిముని దారినివ్వలేదు. రాజు కూడా అభిమానం, కోపం అడ్డుతగిలి మునిబాటనుండి తప్పుకోలేదు. రాజశ్రేష్ఠుడైన కల్మాషపాదుడు మోహవశుడై రాక్షసునివలె దారివదలని శక్తిమహర్షిని కొరడాతో కొట్టాడు. వసిష్ఠసుతుడై, మునిశ్రేష్ఠుడైన ఆ శక్తి కొరడా దెబ్బతిని కోపంతో రాజునిలా శపించాడు- 'రాజా! రాక్షసునివలె తాపసుని కొట్టావు. కాబట్టి ఇప్పటినుండి నీవు రాక్షసుడి వవుతావు. నరమాంసంపై ఆసక్తితో ఈ భూమిపై తిరుగుతుంటావు. రాజాధమా! వెళ్ళు.'

ఆ రోజుల్లో యజమానికొరకై వసిష్ఠ విశ్వామిత్రులలో వైరం సాగుతోంది. ఆ

సమయంలో విశ్వామిత్రుడు కల్మాషపాదుని దగ్గరకు వెళ్ళాడు. పార్థా! కల్మాషపాదుడూ, తపస్వి అయిన శక్తి పై రీతిగా వాదన పడుతున్న సమయంలోనే ప్రతాపవంతుడైన విశ్వామిత్రుడు దగ్గరకు వచ్చాడు. శాపాన్ని పొందిన తరువాత కల్మాషపాదుడు వసిష్ఠునివలె తేజోమూర్తి అయిన ఆయనను వసిష్ఠుని కుమారునిగా గ్రహించాడు. భారతా! విశ్వామిత్రుడు అదృశ్యుడై తన మేలు కోసం వారిద్దరినీ అతిక్రమించి పోయాడు. శక్తి ఆ రీతిగా శపించగా ఆ రాజశ్రేష్ఠుడు -కల్మాషపాదుడు- ఆయనను ప్రస్తుతించి అనుగ్రహించవలసినదిగ అభ్యర్థిస్తూ శక్తిమునిని శరణుకోరాడు. కురుసత్తమా! ఆ మహారాజు భావాన్ని గ్రహించి విశ్వామిత్రుడు ఆ రాజులో ప్రవేశించ వలసినదిగ ఒక రాక్షసుని ఆదేశించాడు. బ్రహ్మర్షిశాపం కారణంగా విశ్వామిత్రుని ఆదేశం మేరకు కింకరుడనే రాక్షసుడు అప్పుడు ఆ రాజులో ప్రవేశించాడు. విశ్వామిత్రుడు కల్మాషపాదునిలో రాక్షసుడు ప్రవేశించాడని గ్రహించి అక్కడి నుండి నిష్క్రమించాడు. అప్పుడు కల్మాషపాదునిలో ప్రవేశించిన రాక్షసుడు ఆయనను కలవరపరచాడు. ఆ రాజుకు ఏమీ తెలియటం లేదు. ఒకనాడు ఒకానొక బ్రాహ్మణుడు ఆకలిగొని, అరణ్యంవైపు వెళ్తున్న కల్మాషపాదుని చూచి మాంససహితంగా భోజనం కావాలని అభ్యర్థించాడు. అప్పుడు రాజర్షి అయిన మిత్రసహుడు (కల్మాషపాదుడు) బ్రాహ్మణునితో ఇలా అన్నాడు- 'బ్రాహ్మణా! ఇక్కడే కూర్చో, రెండు గడియలు నిరీక్షించు. నేను మరలివచ్చి నీవు కోరిన భోజనాన్ని అందజేస్తాను.' ఆ మాట చెప్పి కల్మాషపాదుడు వెళ్ళిపోయాడు. బ్రాహ్మణుడు అక్కడే నిలిచాడు.

అర్జునా! ఆ తరువాత గొప్ప మనస్సుగల కల్మాషపాదుడు సుఖంగా, స్వేచ్ఛగా తిరిగి వచ్చి అంతఃపురంలో ప్రవేశించాడు. ఆపై అర్ధరాత్రి లేచి, బ్రాహ్మణున కిచ్చిన మాటను తలచుకొని వంటలవానిని పిలిపించి ఇలా అన్నాడు- 'వెళ్ళు! అరణ్యంలో ఈ ప్రాంతంలో ఒక బ్రాహ్మణుడు నాకోసం ఎదురుచూస్తుంటాడు. ఆయనకు అన్నంపెట్టాలి. సమాంసమైన భోజనాన్ని ఆయన కందించు.' కల్మాషపాదుడు ఆ రీతిగా ఆదేశించిన తరువాత వంటవాడు మాంసం కోసం వెదకి ఎక్కడా దొరకక బాధపడుతూ ఆ విషయాన్ని రాజుకు తెలియజేశాడు. రాజుపై రాక్షసావేశమున్నది. అందువలన ఆయన నిశ్చింతగా "అయితే ఆ బ్రాహ్మణునకు నరమాంసాన్నే పెట్టు" అని మాటిమాటికి వంటవానితో అన్నాడు. అలాగే అని వంటవాడు తలారుల నివాసస్థానానికి పోయి, నిర్భయంగా నరమాంసాన్ని తీసికొని త్వరగా వచ్చాడు. దానిని పద్ధతి ప్రకారం వండి అన్నంతో పాటు తీసికొనిపోయి ఆకలిగొన్న ఆ బ్రహ్మర్షికి అందించాడు. ఆ ద్విజోత్తముడు దివ్యదృష్టితో ఆ అన్నాన్ని చూచి కోపం నిండిన కళ్ళతో చూస్తూ "ఇది తినరానిది" అని చెప్పాడు. బ్రాహ్మణుడిలా

అన్నాడు. 'ఆ నృపాధముడు తినటానికి వీలుకాని అన్నాన్ని ఇచ్చాడు. కాబట్టి ఆ మూడునికే ఇటువంటి అన్నానికై నోరూరుతుంది. శక్తిముని చెప్పినట్లుగా మానవ మాంసంమీద ఆసక్తిగొని, సమస్తప్రాణులకూ భయాన్ని కలిగిస్తూ ఈ భూమిపై తిరుగుతాడు.' రెండుసార్లు ఒకేవిధంగా శపింపబడటంతో ఆ శాపం బలవత్తరమైంది. ఆ రాజు తనలో రాక్షసబలం ప్రవేశించగా వివేకాన్ని పూర్తిగా కోలుపోయాడు. ఆ రాజశ్రేష్ఠుని మనస్సును, ఇంద్రియాలను అన్నింటిని రాక్షసుడు లొంగదీసికొన్నాడు. కొద్దిరోజుల తరువాత ఒకనాడు శక్తిముని కనిపించగా కల్మాషపాదుడిలా అన్నాడు. 'నీవు నాకు తగని శాపాన్ని ఇచ్చావు కాబట్టి నరభక్షణాన్ని నేను నీతోనే ప్రారంభిస్తాను.' ఆ మాటలు అంటూనే శక్తిముని ప్రాణాలు తీసి, శక్తిమునిని తినివేశాడు.

శక్తి మరణించటాన్ని గమనించి విశ్వామిత్రుడు వసిష్ఠుని కుమారుల మీదికే ఆ రాక్షసుని రెచ్చగొట్టాడు. రెచ్చిపోయిన ఆ రాక్షసుడు సింహం క్షుద్రమృగాలను తిన్నట్లు తనకన్న బలహీనులైన వసిష్ఠమహాత్ముని కుమారులను తినివేశాడు. విశ్వామిత్రుడు తన కుమారులను చంపించినట్లు విని కూడా వసిష్ఠుడు మేరు పర్వతం భూమిని ధరించినట్టు ఆ శోకాన్ని భరించాడు. ఆ మునిసత్తముడు దేహత్యాగాన్ని చేయాలని కూడా అనుకొన్నాడు. కానీ కౌశికుని (విశ్వామిత్రుని) నాశనం చేయాలని భావించలేదు. ఆ వసిష్ఠుడు బుద్ధిమంతులలో శ్రేష్ఠుడు. పూజ్యుడైన ఆ వసిష్ఠమహర్షి మేరుపర్వతశిఖరం నుండి పర్వతశిలలపైకి దూకాడు. కాని ఆయన దూదికుప్పపై పడ్డట్లు అయినది. పాండవా! దూకటం వలన మరణించక పోవటంతో ఆ వసిష్ఠుడు దావాగ్నితో తగులబడుతున్న మహారణ్యంలో ప్రవేశించాడు. అరిందమా! ఆ అగ్ని తీవ్రంగా మండుతున్న ఆ వసిష్ఠుని తగులబెట్టలేదు. మండుతున్నా నిప్పు కూడా ఆయనకు చల్లగానే ఉన్నది. ఆపై శోకావిష్టుడైన ఆ ముని సముద్రాన్ని చూచి, మెడకు ఒక గండశిలను కట్టుకొని, నీటిలోనికి దుమికాడు. సముద్రపుటలల వేగం ఆ మహర్షిని ఒడ్డుకు నెట్టేసింది. దీక్షితు డయిన ఆ బ్రాహ్మణుడు ఏ రీతిగానూ మరణించలేదు. దానితో బాధపడి ఆయన మరలా ఆశ్రమానికే బయలుదేరాడు.

176. కల్మాష పాదుని శాపవిమోచనము - అశ్మక జననము.

ఆ తరువాత వసిష్ఠుడు తన బిడ్డలు లేని ఆశ్రమపదాన్ని చూచి, తీవ్రశోకంతో ఆ ఆశ్రమం నుండి మళ్లీ వెళ్ళిపోయాడు. అర్జునా! అది వర్షాకాలం. ఆ కాలంలో ఆ వసిష్ఠుడు క్రొత్తనీటితో నిండుగా వున్న ఒక నదిని చూచాడు. అది తీరంలోని వివిధవృక్షాలను లెక్కకు మిక్కిలిగా తనతో తీసికొనిపోతోంది. అర్జునా! అది చూచి మరల దుఃఖించాడు.

'ఈ నీటిలో మునిగిపోతాను' అని ఆలోచించాడు. తరువాత మహర్షి త్రాళ్ళతో తనను తాను గట్టిగా కట్టుకొని దుఃఖిస్తూనే నీటిలో మునిగాడు. అరిందమా! ఆపై ఆ నది ఆ ముని పాశాలను ఛేదించి, ఆ వసిష్ఠమునిని ఒడ్డుకు చేర్చి, త్రాళ్ళను విప్పి వదలివేసింది. అప్పుడు పాశవిముక్తుడైన ఆ మహర్షి నీటినుండి బయటపడి ఆ నదికి విపాశ అని పేరుపెట్టాడు. శోకబుద్ధియై అప్పుడు ఎక్కడా ఒకచోట నిలువలేకపోయాడు. పర్వతాలపై నదీతీరాలపై, సరస్సుల గట్లపై తిరగసాగాడు. ఆ సందర్భంలో ఆ మహర్షి హైమవతీనదిని చూచాడు. అది భయంకరమైనది. భీకరమైన మొసళ్ళతో కూడినది. మరల ఆ ప్రవాహంలోని కురికాడు. సరిద్వర అయిన ఆ హైమవతి వసిష్ఠుని అగ్నిసమానునిగా భావించి వందల పాయలుగా చీలి పరువులెత్తింది. అందువల్ల శతద్రువు అని పేరు పొందింది. మరల తాను ఒడ్డుమీదనే ఉన్నట్టు గ్రహించి, ఆత్మహత్య చేసికొని మరణించటం అసాధ్యమని భావించి, వసిష్ఠుడు మరల ఆశ్రమానికి వెళ్ళాడు.

ఈ ప్రకారంగా వివిధపర్వతాలకు, వివిధ ప్రదేశాలకూ వసిష్ఠుడు వెళ్ళాడు. ఆ ప్రయాణాలలో 'అదృశ్యంతి' అను పేరుగల కోడలు ఆయనను వెన్నంటి ఉండేది. ఆపై తన వెనుక నుండి స్వరబద్ధమైన వేదాధ్యయన శబ్దాన్ని విన్నాడు. అది షడంగాలతో అలంకరింపబడి స్పష్టంగా అర్థమవుతోంది. "నా వెనుక వస్తున్నదెవరు?" అని వసిష్ఠుడు ప్రశ్నించాడు. అప్పుడు "మహాభాగా! నేను తపోదీక్షతో ఉన్నదానను, శక్తిభార్యను" అని ఆ కోడలు అదృశ్యంతి వసిష్ఠునితో అన్నది. వసిష్ఠుడిలా అన్నాడు 'కుమారీ! సొంగమైన ఈ వేదాధ్యయన ధ్వని ఎవరిది? గతంలో శక్తి వేదాధ్యయనం చేస్తున్న స్వరంలా నాకు వినిపిస్తోంది.' అదృశ్యంతి ఇలా అన్నది. 'నీ కుమారుడైన శక్తి కొడుకు నా గర్భంలో నున్నాడు. ఇప్పటికి పండ్రెండు సంవత్సరాల నుండి నా గర్భంలోనే వేదాభ్యాసం చేస్తున్నాడు.' గంధర్వుడిలా అన్నాడు 'అర్జునా! ఆ మాటవిని ఆనందించి పరమాత్మను సేవించే వసిష్ఠ మహర్షి "సంతానప్రాప్తి ఉన్నది" అనుకొని మరణాలోచననుండి వెనుదిరిగాడు. అనఘా! ఆ తరువాత కోడలితోపాటు మరలివస్తూ ఒక నిర్జనారణ్యంలో కూర్చొని ఉన్న కల్మాషపాదుని చూశాడు. భారతా! భీకరుడైన రాక్షసుడు ఆవేశించిన కల్మాషపాదుడు వసిష్ఠుని చూడగానే కోపంతో లేచి ఆయనను తినాలని ఉద్యమించాడు.

క్రూరకర్ముడైన ఆ రాక్షసుని ఎదురుగా చూచి అదృశ్యంతి భయోద్విగ్నమైన గొంతుతో వసిష్ఠునితో ఇలా అన్నది. 'స్వామీ! ఆ రాక్షసుడు పెద్ద కర్ర తీసికొని ఇటే వస్తున్నాడు. దండాన్ని చేతబట్టి ఉన్న యమధర్మరాజులా కనిపిస్తున్నాడు. మహాభాగా!

నీవు తప్ప ఈ లోకంలో మరెవ్వరూ ఆ రాక్షసుని నిలవరించలేరు. స్వామీ! దారుణంగా కనిపిస్తున్న ఈపాపాత్ముని బారినుండి నన్ను రక్షించు. ఈ రాక్షసుడు మనలను తినాలనుకొంటున్నాడు.' వసిష్ఠుడిలా అన్నాడు. 'కుమారీ! భయపడవద్దు. ఈ రాక్షసుని నుండి ఏ విధంగానూ భయపడనవసరం లేదు. నిన్ను భయపెడుతున్నవాడు వాస్తవానికి రాక్షసుడే కాదు. భూలోకంలో పరాక్రమంలో ప్రసిద్ధి కెక్కిన రాజు కల్మాషపాదుడు ఆయన. అతిభీషణరూపాన్ని ధరించి ఈ అరణ్య ప్రాంతంలో నివసిస్తున్నాడు, మీదికి వస్తున్న ఆ రాక్షసుని చూచి తేజస్వి, పూజ్యుడైన వసిష్ఠమహర్షి హుంకారమాత్రంతో ఆయనను నివారించాడు. ఆపై మంత్రజలాన్ని ఆయనపై చల్లి, తనయోగశక్తితో ఆ రాజును ఆ శాపం నుండి విముక్తుని చేశాడు. ఆ కల్మాషపాదుడు పండ్రెండు సంవత్సరాలు వసిష్ఠుని కొడుకైన శక్తి తేజస్సుచే గ్రహణసూర్యుని వలె మ్రింగబడ్డాడు. రాక్షసుని బారినుండి విముక్తుడైన ఆ కల్మాషపాదుడు సంధ్యాకాలంలో భాస్కరుడు ఆకాశాన్ని ప్రకాశింపచేసినట్లు ఆ మహావనాన్ని తన తేజస్సుతో రంజింపచేశాడు.

పిమ్మట ఆ రాజు వివేకాన్ని పొంది, చేతులు జోడించి నమస్కరించి, ఋషి శ్రేష్ఠుడైన వసిష్ఠునితో ఇలా అన్నాడు. 'మహాభాగా! నేను తమ దాసుడను. మునిశ్రేష్ఠా! తమరు యాగాలు చేయించదగినవాడను. ఈ సమయంలో తమకిష్టమైనది చెప్పండి. నేనేం చేయాలి తమకు?' వసిష్ఠుడిలా అన్నాడు. 'నా కోరికను కాలమే తీర్చింది. వెళ్ళు! రాజ్యాన్ని పరిపాలించుకో! నరోత్తమా! బ్రాహ్మణుని ఎప్పుడూ అవమానించవలదు.' రాజు ఇలా అన్నాడు. 'మహాభాగా! ఎప్పుడూ నేను బ్రాహ్మణులను అవమానించను. తమ ఆజ్ఞానువర్తినై ద్విజులను చక్కగా పూజిస్తాను. ద్విజోత్తమా! ఇక్ష్వాకువంశస్థులైన పితరుల ఋణం నుండి విముక్తి పొందటానికి మీ కారణంగా ఒక పుత్రుని పొందాలనుకొంటున్నాను. ఇక్ష్వాకు వంశవృద్ధికై నాకు శీలరూపగుణాలు గల అభీష్టసంతానాన్ని దయచేయవలసినది.' సత్యసంధుడు, ద్విజోత్తముడు అయిన ఆ వసిష్ఠుడు 'అలాగే ఇస్తాను" అని మేటివిలుకాడైన కల్మాషపాద మహారాజుతో అన్నాడు. నరోత్తమా!ఆ తరువాత తగిన వేళలో వసిష్ఠుడు రాజుతో కలిసి లోకవిఖ్యాతమైన రాజధానీ నగరానికి - అయోధ్యకు- వెళ్ళాడు.

పాపరహితుడు, మహాత్ముడు అయిన తమరాజు రాకకు సంతోషిస్తూ అయోధ్యాపుర ప్రజలు అందరు దేవతలు దేవేంద్రునకెదురేగినట్లు ఆయనకు ఎదురేగారు. చాలాకాలం తర్వాత రాజు పుణ్యలక్షణాలుగల ఆనగరిలోనికి వసిష్ఠమహర్షితో సహా ప్రవేశించాడు. అయోధ్యానివాసు లయిన ప్రజ లందరూ పురోహితునితో కలిసి వస్తున్న రాజును ఉదయభానుని

చూచినట్లుగా చూశారు. శరత్కాలపు చంద్రుడు ఆకాశాన్ని వెన్నెలతో నింపివేసినట్టు లక్ష్మీసంపన్నులలో శ్రేష్ఠుడైన ఆ రాజు అయోధ్యను శోభతో నింపివేశాడు. నగరమార్గాల నన్నింటిని తడిపి శుభ్రంగా ఊడ్చి (చిమ్మి) పెట్టారు. పతాకధ్వజాలు శోభాకరంగా ఉన్నాయి. ఆ అలంకరణతో ఆ శ్రేష్ఠ నగరం మనస్సును ఆహ్లాదపరిచింది. కురునందనా! ఆ నగరంలోని ప్రజలు తుష్టి , పుష్టిగలవారు. ఆ రాజు రాకతో అటువంటి జనులతో నిండిన ఆ పురి దేవేంద్రునిచే అమరావతి శోభిల్లినట్టు శోభిల్లింది. ఆ రాజర్షి ఆ నగరంలో ప్రవేశించగానే మహారాజు ఆదేశాన్ని అనుసరించి మహారాణి(మదయంతి) వసిష్ఠమహర్షి దగ్గరకు వచ్చింది. ఆ తర్వాత ఋతుకాలంలో భగవద్భక్తుడైన ఆ వసిష్ఠమహర్షి దివ్యవిధానంతో ఆ మహారాణితో కలిశాడు. ఆ తర్వాత ఆ రాణి గర్భం నిలిచిన తర్వాత మునిశ్రేష్ఠుడైన వసిష్ఠుడు రాజవందనాలు స్వీకరించి, తన ఆశ్రమానికి వెళ్ళిపోయాడు. ఆ రాణి దీర్ఘకాలం గర్భాన్ని ధరించింది కానీ ప్రసవించలేదు. అప్పుడు ఆ యశస్వినీ రాతితో తన గర్భాశయంపై కొట్టుకొన్నది. ఆ తరువాత పండ్రెండు సంవత్సరాలకు కొడుకు పుట్టాడు. అతడు పురుషోత్తముడు, రాజర్షి అయి అశ్మకుడను పేర ప్రసిద్ధి పొందాడు. పౌదాన్యనగరంలో తాను నివసించేవాడు.

177. పరాశరుని జననము - ఔర్వోపాఖ్యానము.

గంధర్వుడిలా అన్నాడు. 'అర్జునా! ఆశ్రమంలో నున్న అదృశ్యంతి శక్తివంశవర్ధనుడైన కుమారుని కన్నది. ఆ బాలుడు రూపంలో రెండవ శక్తి వలె ఉన్నాడు. భరతశ్రేష్ఠా! మునిశ్రేష్ఠుడైన ఆ వసిష్ఠుడు పౌత్రునకు జాతకర్మ మొదలుగా గల సంస్కారకర్మలను స్వయంగా జరిపాడు. ఆ బాలుడు గర్భంలో పడి మరణేచ్ఛ గల వసిష్ఠమహర్షిలో మరల జీవనోత్సాహాన్ని కల్గించాడు. కాబట్టి పరాశరుడన్న పేరుతో ప్రసిద్ధికెక్కాడు. ధర్మాత్ముడైన ఆ పరాశరుని వసిష్ఠుని తండ్రిగా భావించాడు. చిన్ననాటి నుండి తండ్రితో ప్రవర్తించినట్లే వసిష్ఠునితో మెలిగాడు. కౌంతేయా! పరంతపా! ఆ విప్రర్షి పరాశరుడు తల్లి అయిన అదృశ్యంతి సమక్షంలో తండ్రీ అని వసిష్ఠుని సంబోధించాడు. ఆ బాలుని నోటి నుండి పరిపూర్ణార్థ బోధకమైన 'తండ్రీ' అన్న మధురవచనాన్ని విని అదృశ్యంతి కన్నుల నీరు నింపుకొని అతనితో ఇలా అన్నది. 'నాయనా! ఈయన మీ తండ్రికి తండ్రి. 'తండ్రీ' అని ఈయనను పిలువరాదు. మీ తండ్రిని అరణ్యంలో రాక్షసుడు తినివేశాడు. నీవు తండ్రి అని భావిస్తున్న ఈయన నీ తండ్రి కాదు. నీ తండ్రికి తండ్రి.' ఆ మాట విని దుఃఖ

ఖార్తుడై, మహామనస్కుడు, సత్యవచనుడైన ఆ ముని శ్రేష్ఠుడు– పరాశరుడు – సర్వలోకాలను నాశనం చేయాలని భావించాడు. పరాశరుని మనస్సులోని నిశ్చయాన్ని గ్రహించి మహాత్ముడు, మహాతపస్వి, బ్రహ్మజ్ఞానుల్లో శ్రేష్ఠుడు, మిత్రావరుణకుమారుడు అయిన వసిష్ఠమహర్షి అతనిని వారించాడు. ఏ కారణంగా వారించగలిగాడో చెపుతా విను.

వసిష్ఠుడిలా అన్నాడు. 'కృతవీర్యుడని ప్రసిద్ధిచెందిన రాజు ఉండేవాడు. ఆ రాజశ్రేష్ఠుడు వేదవేత్త లయిన భృగువంశస్థులకు యజమాని. ఆ రాజు బ్రాహ్మణులను సోమయాగసమాప్తివేళలో విస్తారమైన ధనంతో, ధాన్యంతో, తృప్తి పరిచాడు. ఆ రాజు స్వర్గస్థుడైన తరువాత ఒకసారి ఆ వంశస్థులకు ఏ కారణం చేతనో ధనం అవసరమైంది. భృగువంశస్థుల దగ్గర ధన మున్నదని తెలిసి, ఆ రాజకుటుంబీకులందరు భార్గవుల దగ్గరకు యాచనకై వెళ్ళారు. ఆ భార్గవులలో కొందరు అక్షయమైన తమ ధనాన్ని భూమిలో దాచి ఉంచారు. కొందరు భార్గవులు క్షత్రియభయంతో తమధనాన్ని బ్రాహ్మణులకు దానం చేశారు. కొందరు భృగువంశస్థులు మాత్రం ఇష్టపూర్తిగా ఆ రాజులకు ధనమిచ్చారు. నాయనా! వేరు వేరు కారణాలను చూచి మరికొందరు అప్పుడు ధనమిచ్చారు. ఆ తర్వాత ఆ రాజులలో ఒకడు దేనికోసమో భూమిని త్రవ్వుతూ ఒక భృగువు ఇంటిలో పాతి ఉంచిన ధనాన్ని చూశాడు. అప్పుడు రాజశ్రేష్ఠులంతా ఒక్కటై అక్కడ చేరి ఆ ధనాన్ని చూశారు. అప్పుడు వారు కోపంతో భృగువంశస్థులు శరణువేడినా వారిని తిరస్కరించారు. ఆ మేటి విలుకాండ్రు అందరు వాడి బాణాలతో వారి నందరినీ చంపివేశారు. అటు పిమ్మట భృగువంశంలోని గర్భస్థ శిశువులను కూడా చంపుతూ ఆ క్రోధాంధులు భూమిపై తిరుగసాగారు. భృగువంశవిచ్ఛిత్తి ఆరంభమైనదన్న భయంతో భృగుపత్నులు హిమాలయాలలోని దుర్గమ గుహలలో దాగారు. వారిలో ఒకస్త్రీ తేజస్వంతమైన తన గర్భాన్ని భయంతో ఒక తొడలో దాచుకొన్నది. ఆమె భర్త వంశవృద్ధిని కోరి ఆ పని చేసింది. ఆ గర్భ సమాచారాన్ని తెలిసికొని మరొక బ్రాహ్మణస్త్రీ భయపడి ఒంటరిగా క్షత్రియుల దగ్గరకు వెళ్ళి ఆ విషయాన్ని చెప్పింది. అప్పుడు క్షత్రియులంతా ఆ గర్భవిచ్ఛేదన చేయాలని బయలుదేరారు. తన తేజస్సుతో వెలిగిపోతున్న ఆ బ్రాహ్మణిని వారు చూశారు. ఆపై గర్భస్థ శిశువు తొడలు బ్రద్దలు చేసి తనంత తానే బయటకు వచ్చాడు. మధ్యాహ్నసూర్యుని వలె ఆ శిశువు క్షత్రియుల దృష్టిని దొంగిలించాడు. అప్పుడు కన్నులు కోల్పోయిన వారందరూ పర్వతప్రాంతాల్లో తిరుగసాగారు. మోహానికి లోనయి తమ దృష్టిని కోలుపోయిన ఆ రాజులందరూ దృష్టికోసం మరల అనిందిత అయిన ఆ బ్రాహ్మణిని శరణుకోరారు.

కనుచూపు కోల్పోయి దుఃఖార్తులై జ్వాలలులేని అగ్నులవలె అచేతనులై ఉన్న క్షత్రియులు ఆ మహాభాగతో ఇలా అన్నారు- దేవీ! నీవు అనుగ్రహిస్తే కనుచూపును పొంది మేమంతా నిష్క్రమిస్తాం. కొద్దిసేపు విశ్రాంతి తీసికొని పాపాత్ములమైన మేమంతా కలిసి వెళతాం. శోభనా!నీవు నీ కుమారునితో పాటు మమ్ము అనుగ్రహించాలి. మరల దృష్టిని అనుగ్రహించి' రాజపుత్రులను మమ్మందరినీ కాపాడాలి.

178. ఔర్వుని కోపమును పితరులు నివారించుట.

బ్రాహ్మణి ఇలా అన్నది. 'నాయనలారా! నేను మీ దృష్టిని అపహరించలేదు. నాకు కోపమూ లేదు. ఊరువుల నుండి పుట్టిన ఈ భార్గవుడే ఇప్పుడు కోపించి ఉన్నాడు. నాయనలారా! ఆ మహాత్ముడే మీరు చంపిన తన బంధువులను తలచుకొని కోపంతో మీ కంటిచూపును పోగొట్టినట్టుంది. సందేహం లేదు. పుత్రులారా! మీరు భార్గవుల గర్భస్థ శిశువులను కూడా చంపారు. అప్పటినుండి నేను ఈ గర్భాన్ని నా తొడలో వందసంవత్సరాలు దాచి ఉంచాను! భృగువంశానికి మరల మేలు చేయాలన్న కోరికతో షడంగసహితమైన వేదం ఇతనికి గర్భంలో నున్నపుడే సంక్రమించింది. అటువంటి ఈ బాలుడు పితృవధకు కోపించి, మిమ్ములను చంపదలచినట్టు అనిపిస్తోంది. అతని దివ్యతేజస్సే మీ కంటి చూపు నపహరించింది. కాబట్టి నా కుమారరత్న మయిన ఈ ఔర్వునే మీరు యాచించండి. మీరు శిరస్సు వాల్చితే తృప్తిపడి ఇతడే మీకు దృష్టి ననుగ్రహించగలడు.' ఇలా చెప్పగానే ఆ రాజులంతా ఊరువులనుండి పుట్టిన ఆ ఔర్వుని అనుగ్రహించమని కోరారు. అతడు అప్పుడు అనుగ్రహించాడు. సజ్జనశ్రేష్ఠుడైన ఆ విప్రర్షి తండ్రి తొడలు చీల్చుకొని పుట్టాడు కాబట్టి ఔర్వుడనే పేరుతో లోకంలో ప్రసిద్ధిపొందాడు. ఆపై రాజులంతా తిరిగి చూపును పొంది వెళ్ళిపోయారు. సర్వలోకాలకూ పరాభవాన్ని చేయాలని భార్గవముని భావించాడు.

నాయనా! పరాశరా! మహాత్ముడైన ఆ ముని సర్వలోకాలనూ పూర్తిగా నాశనం చేయాలన్న ఆలోచనలో మనస్సును లగ్నం చేశాడు. భృగువంశనందనుడైన ఆ కుమారుడు భృగువుల వధకు ప్రతిక్రియ చేయనెంచి సర్వలోకాలనూ నాశనం చేయదలచి ఘోరతపస్సుతో ఎదిగాడు. పితరులకు ఆనందాన్ని కల్గించాలని తీవ్రంగా తపిస్తూ ఆ కుమారుడు దేవతలతో, అసురులతో, మానవులతో నిండిన సర్వలోకాలను తపింపజేశాడు. నాయనా! అటు పిమ్మట అతనిని తమ వంశవర్ధనునిగా గ్రహించి పితరులు అందరు పితృలోకం నుండి వచ్చి

ఇలా అన్నారు– 'కుమారా! ఔర్వా! నీ తీవ్రతపః ప్రభావాన్ని చూశాం. లోకాలను అనుగ్రహించు. క్రోధాన్ని నియంత్రించుకో. నాయనా! క్షత్రియులంతా మమ్ము హింసించినప్పుడు పవిత్రాంతఃకరణులమైన మేము– భృగువంశ బ్రాహ్మణులం– అసమర్థులమై వంశవధను ఉపేక్షించామని భావించరాదు. నాయనా! మా ఆయువు బాగా మించిపోయింది. ఆ దశలో మేమంతా భేదానికి గురి అయ్యాం. దానితో మేమే స్వయంగా క్షత్రియులు మమ్ము సంహరించటానికి అంగీకరించాం. ఒకానొక భృగువు ఇంటిలో త్రవ్వి ధనాన్ని దాచిపెట్టడం కూడా శత్రుత్వాన్ని పెంచటానికే చేశాము. మాపై క్షత్రియులకు కోపం కలగాలన్నదే మా అభీష్టం. ద్విజోత్తమా! స్వర్గానికి వెళ్ళదలచుకొన్న మాకు డబ్బుతో పనేమిటి? సాక్షాత్తు కుబేరుడే మాకు ధనరాశిని తెచ్చి ఇచ్చాడు. మమ్ములను ఏ రీతిగానూ మృత్యువు వశం చేసికొన లేకపోయినందువలన మేమంతా కలిసి అందరి సమ్మతితో ఈ ఉపాయాన్ని అవలంబించాం. నాయనా! ఆత్మహత్య చేసికొన్న వాడు పుణ్యలోకాలకు పోలేడు. కాబట్టి బాగా ఆలోచించియే మమ్ము మేము చంపుకొనలేదు. నాయనా! నీవు ప్రస్తుతం చేయదలచుకొన్న పని మాకిష్టమైనది కాదు. సర్వలోకాలను పరాభవించటం పెద్దపాపం. దానినుండి మనస్సును మరల్చుకో. నాయనా! క్షత్రియులను చంపవద్దు. సప్తలోకాలనూ సంహరించవద్దు. తపోజనితమైన నీ తేజస్సును దూరంచేసే క్రోధం నీలో కలిగింది. దానిని విడిచిపెట్టు."

179. ఔర్వుడు తన కోపమును బడబాగ్నిలో విడచుట.

"తండ్రులారా! కోపంతో సర్వలోకవినాశం చేస్తానని నేను చేసిన ప్రతిజ్ఞ వ్యర్థం కారాదు. వ్యర్థంగా కోపించి ప్రతిజ్ఞలు చేసే వాడినిగా నేను కాలేను. కోపాన్ని సఫలం చేయకపోతే అది అగ్ని అరణిని దహించినట్లు నన్ను దహిస్తుంది. సకారణమైన కోపాన్ని సహించేవాడు ధర్మార్థకామరూపమైన త్రివర్గాన్ని చక్కగా రక్షించుకోలేడు. అందరినీ జయింపగోరిన రాజులు తగిన సమయంలో రోషాన్ని ప్రదర్శించగలిగినప్పుడే దుర్మార్గులను శిక్షించి సజ్జనులను కాపాడగలరు. నేను తల్లితొడలో గర్భశయ్యపై నున్నప్పుడు క్షత్రియులు భార్గవులను సంహరించినపుడు వారి ఆర్తనాదాలను నేను విన్నాను. ఈ క్షత్రియాధములు గర్భస్థశిశువులను కూడా విడువక భృగువులను సంహరించటం ప్రారంభించినప్పుడే నన్ను కోపం ఆవేశించింది. అప్పుడు నా తల్లులు పూర్ణగర్భవతులు. నా పితరులు వారితో భయంతో సర్వలోకాలలోనికి పరువెత్తారు. కానీ శరణు దొరకలేదు. భృగువంశస్థుల పత్నులకు రక్షకు లెవ్వరూ దొరకలేదు. అప్పుడు కళ్యాణరూపిణి అయిన నా తల్లి నన్ను

తొడలో దాచి ఉంచింది.

పాపకర్మలను నిరోధించగలవాడు లోకాల్లో ఉంటే ఏ లోకంలో కూడా పాపకర్మలు చేసే వాడుండడు. పాపిని నిరోధించగలవా డెవ్వడూ లేకపోతే లోకులలో చాలామంది పాపకృత్యాలను చేస్తూనే ఉంటారు. **పాపకృత్యమని తెలిసి, కూడా నిరోధించగల శక్తి కలిగి కూడా నియంత్రించని వానికి కూడా ఆ పాపకర్మ ఫల మంటుతుంది.*** తమ జీవితాన్ని ప్రియంగా భావించి అందరిని పరిపాలించవలసిన రాజులు కూడా రక్షింపసమర్థులై ఉండి కూడా నాపితరులను రక్షించలేదు. అందువలన నాకు వారిపై కోపం వచ్చింది. వారిని దండించగల శక్తి నాకున్నది. నేను కూడా సమర్థుడనై ఉండి పాపకృత్యాలను చూస్తూ ఊరుకుంటే నాకూ ఈ లోకుల పాపాలవలన తీవ్రభయం కలుగుతుంది. క్రోధం వలన నాలో పుట్టిన అగ్ని తన జ్వాలలతో లోకాలను మ్రింగదలచుకొన్నది. నేను దానిని నిరోధిస్తే అది తన తేజస్సుతో నన్నే తగులబెడుతుంది. మీరు సర్వలోకాల హితాన్ని కోరుతున్నారని కూడా నేనెరుగుదును. కాబట్టి పితరులారా! లోకాలకూ, నాకూ కూడా మేలు కలిగేటట్లు మీరు ఆదేశించండి."

పితరు లిలా అన్నారు. "క్రోధంవలన నీలో పుట్టిన అగ్ని లోకాలను గ్రసించగోరుతోంది కదా! దాన్ని నీటిలో వదలిపెట్టు. నీకు మేలు కలుగుతుంది. లోకాలు నీటిలోనే ప్రతిష్ఠింపబడి ఉన్నాయి. ద్విజశ్రేష్ఠా! సర్వరసాలు జలమయాలు. సమస్తజగత్తు జలమయమే. కాబట్టి నీ క్రోధాగ్నిని నీటిలో విడిచిపెట్టు. విప్రుడా! నీకు నచ్చితే ఈ అగ్నిని సముద్రంలో నిలుపు. కోపం నుండి పుట్టిన అగ్ని నీటిని దహిస్తుంది. లోకాలు జలమయా లనే కదా వ్యవహారం. ఈ రీతిగా నీ ప్రతిజ్ఞ యథార్థమవుతుంది. దేవతలతో సహా ఈ లోకాలన్ని నష్టపోకుండా ఉంటాయి." వసిష్ఠుడిలా అన్నాడు. "నాయనా! అప్పుడు ఔర్వుడు క్రోధం నుండి పుట్టిన ఆ అగ్నిని సముద్రంలో వదలివేశాడు. ఇప్పటికీ ఆ అగ్ని పెద్దదిగా ఉన్న అశ్వముఖాకృతితో సాగరజలాలను త్రాగుతూనే ఉంది. వేదవేత్తలకు అది తెలుసు. ఆ బడబ తననోటినుండి ఆ అగ్నిని క్రక్కుతూ మహోదధి జలాన్ని త్రాగుతూ ఉంటుంది. జ్ఞానులలో శ్రేష్ఠుడా! నీకు మేలు కలుగుతుంది. పరాశరా! నీకు పరలోకాలను గురించి కూడా తెలుసు. ఆ లోకాలను నశింపచేయదగదు."

---

* జానన్నపిచ యః పాపం శక్తిమాన్ననియచ్ఛతి ।
ఈశస్సన్ సోపి తేనైవ కర్మణా సంప్రయుజ్యతే ॥ 11

180. పరాశరుడు రాక్షసయాగము చేయుట - సమాప్తి.

గంధర్వుడిలా అన్నాడు. 'మహాత్ముడైన ఆ పరాశరబ్రహ్మర్షి సర్వలోకపరాభవసంకల్పం నుండి తన క్రోధాన్ని నియంత్రించుకొన్నాడు. సర్వవేదవేత్తలలో శ్రేష్ఠుడు, మహాతేజస్వి, శక్తినందనుడు అయిన పరాశరముని రాక్షసయాగాన్ని అనుష్ఠించాడు. ఆ తరువాత శక్తివధను మనస్సులో పెట్టుకొని ఆ పరాశరముని విస్తృత యజ్ఞంలో రాక్షసులను బాలవృద్ధులతో సహా దహింప జేయసాగాడు. ఆ సమయంలో వసిష్ఠమహర్షి కూడా పరాశరుని రెండవ ప్రతిజ్ఞను కూడా భంగపరచటమిష్టం లేక రాక్షసవధ నుండి పరాశరుని వారించలేదు. ఆ యాగంలో మండుతున్న మూడు అగ్నుల ఎదురుగా నాల్గవ అగ్నిలాగా ఆ పరాశరమహర్షి నిలిచాడు. ఆ పరాశరుని యాగం నిర్మలమైనది, పవిత్రమైనది. పరాశరుడు హోమాన్ని ప్రారంభించగానే ఆ తేజస్సుతో మేఘాల మాటునుండి సూర్యుడు బయటపడి ఆకాశాన్ని దీపింపజేసినట్లుగా గగనతలం ప్రకాశించింది. అక్కడున్న వసిష్ఠాది మహర్షులందరూ తేజస్సుతో వెలుగుతున్న ఆ పరాశరుని మరొక సూర్యునిగా భావించారు. ఆ తరువాత ఇతరులు ఆ యాగాన్ని నివారించగలగటం చాలా కష్టమని భావించి ఉదారబుద్ధిగల అత్రి ఆ యాగాన్ని ఆపించాలని పరాశరుని దగ్గరకు వచ్చాడు. అదే విధంగా పులస్త్యుడు, పులహుడు, క్రతువు, మహాక్రతువు రాక్షసుల జీవితాలను రక్షించాలని అక్కడకు వచ్చి చేరారు.

అర్జునా! రాక్షసులు ఆ విధంగా నశించటం చూచి పులస్త్యుడు అరిందముడైన పరాశరునితో ఇలా అన్నాడు. 'నాయనా! నీ యాగానికి ఏ విఘ్నమూ కలుగలేదు కదా! మీ తండ్రి హత్యగురించి ఏమీ తెలియని, నిర్దోషులయిన ఈ రాక్షసులను చంపటం ద్వారా నీవు ఆనందిస్తున్నావు గదా! నాయనా! నా సంతతిని నీవు ఇలా నాశనం చేయదగదు. ఇటువంటి హింస తపస్సంపన్నులయిన బ్రాహ్మణులకు ఎప్పుడూ ధర్మం కాదు. పరాశరా! శాంతి ఒక్కటే పరమ ధర్మం. దానిని పాటించు. నీవు శ్రేష్ఠబ్రాహ్మణుడవై కూడా పాపకృత్యాన్ని చేస్తున్నావు. మీ తండ్రి అయిన శక్తి ధర్మజ్ఞుడు. ఇటువంటి పనిని చేసి ఆయనను ఉల్లంఘించరాదు. నా సంతతిని నాశనం చేయదగదు. వసిష్ఠవంశజా! శక్తి ఇచ్చిన శాపంవలననే అప్పుడు అటువంటి సంఘటన జరిగింది. తాను చేసిన తప్పువలననే శక్తి ఈ లోకాన్ని వీడి స్వర్గలోకానికి వెళ్ళవలసివచ్చింది. మహర్షీ! ఏ రాక్షసుడూ కూడా ఆయనను తినలేడు. తన శాపంవలననే తానప్పుడు మృత్యువును సందర్శించాడు. పరాశరా! ఆ విషయంలో విశ్వామిత్రుడు కానీ, కల్మాషపాద మహారాజు కానీ నిమిత్తమాత్రులే. నీ తండ్రి స్వర్గస్థుడై

ఆనందంగా ఉన్నాడు. మహామునీ! శక్తికన్న చిన్నవారైన వసిష్ఠకుమారులు కూడా దేవత లందరితో కలిసి ఆనందంగా సుఖాల ననుభవిస్తున్నారు. మహామునీ! ఇదంతా వసిష్ఠునకు తెలిసినదే. నాయనా! శక్తినందనా! రాక్షస వినాశంకోసం సంకల్పించిన ఈ యజ్ఞంలో నీవు కూడా నిమిత్తమాత్రుడవే. కాబట్టి ఇప్పుడీ యాగాన్ని విడిచిపెట్టు. నీకు మేలు జరుగుతుంది. ఈ యజ్ఞాన్ని ముగించు.' పులస్త్యుడు, ధీమంతుడైన వసిష్ఠుడూ ఆ రీతిగా చెప్పిన తరువాత పరాశరమహాముని ఆ యాగాన్ని ముగించాడు. అప్పుడు సర్వరాక్షస సంహారం కోసం ప్రోదిచేసిన ఆ అగ్నిని ఉత్తరదిక్కున హిమాలయాలకు దగ్గరగా ఉన్న మహారణ్యంలో విడిచిపెట్టాడు. ఆ అగ్ని ఇప్పటికీ అక్కడ ప్రత్యేకమైన పర్వవేళలో రాక్షసులను, చెట్లను, రాళ్ళను మండిస్తూ కనిపిస్తుంది.

181. బ్రాహ్మణి ఆంగిరసుని శపించుట.

అర్జునుడిలా అడిగాడు. "కల్మాషపాదనరపాలుడు బ్రహ్మవేత్తలలో శ్రేష్ఠుడైన తన గురువు - వసిష్ఠునితో ఏ కారణం చేత తన భార్యను నియోగించాడు. మహాత్ముడై ధర్మపారమ్యం తెలిసిన ఆ వసిష్ఠమహర్షి ఏ కారణం చేత అగమ్యాగమనానికి అంగీకరించాడు? మిత్రమా! వసిష్ఠుడు గతంలో ఆ అధర్మకార్యానికి ఎలా అంగీకరించాడు. నాకు సందేహం కలిగి అడుగుతున్నాను. దీన్ని తొలగించాలి?" గంధర్వు డిలా అన్నాడు. "అర్జునా! వసిష్ఠమహర్షివిషయంలో, కల్మాషపాద మహారాజ విషయంలో నీవడిగిన దానికి సమాధానం చెపుతా విను. భరతశ్రేష్ఠా! వసిష్ఠకుమారుడు, మహాత్ముడూ అయిన శక్తి ఆ రాజును శపించటం మొదలయిన విషయమంతా నీకు ముందే చెప్పాను. పరంతపుడైన ఆ రాజు శాపానికి లొంగి, కోపంతో కలతపడిన కన్నులతో భార్యతో సహా నగరం నుండి నిష్క్రమించాడు. అనేకమృగగణాలతోనూ, వివిధప్రాణి సముదాయాలతోనూ క్రిక్కిరిసి ఉన్న నిర్జనారణ్యంలో భార్యతో సహ ప్రవేశించి సంచరించసాగాడు. ఆ అరణ్యం రకరకాల పొదలతో, లతలతో ఆచ్ఛాదింపబడి ఉంది. వివిధ వృక్షజాతులు దాని నావరించి ఉన్నాయి. దానినుండి భయంకర శబ్దాలు వినవస్తుంటాయి. శాపగ్రస్తుడైన కల్మాషరాజు ఆ అరణ్యంలో తిరుగసాగాడు. ఆయన ఒకనాడు ఆకలిగొని తనకు తగిన ఆహారాన్ని అన్వేషిస్తూ అలసిపోయిన తర్వాత ఒక నిర్జనవనంలో ఒక బ్రాహ్మణుల జంటను చూచాడు. వారు మైథునానికి ఉపక్రమించి ఉన్నారు. వారు కల్మాషపాదుని చూచి భయపడి వారి కోరిక తీరకముందే పారిపోయారు. వారు పరుగెడుతుంటే ఆ కల్మాషపాదుడు ఆ బ్రాహ్మణుని బలంవంతాన పట్టుకొన్నాడు. భర్తను రాజు పట్టుకోవటం చూచి ఆ బ్రాహ్మణి ఇలా అన్నది. 'సువ్రతా! రాజా! నీవు

సూర్యవంశంలో పుట్టినవాడవు. లోక ప్రసిద్ధి గలవాడవు. నేను చెప్పబోయే మాట విను. శాపోపహతా! నీవు ధర్మాన్ని సావధానంగా పాటించేవాడవు. గురుశుశ్రూషయందు ఆసక్తి గలవాడవు. పాపకర్మలు చేయదగదు. రాజశ్రేష్ఠా! నాకు ఋతుకాలం సమీపించింది. భర్తకష్టాలవలన దుఃఖంలో ఉన్నాను. నేను సంతానార్థినినై భర్తదగ్గరకు వచ్చాను. నా కోరిక ఇంకా తీరలేదు. నాపై ప్రసన్నుడవై నా భర్తను వదిలిపెట్టు.' ఆమె ఆ రీతిగా ఆక్రోశిస్తున్నా పులి తాను తినదలచుకొన్న మృగాన్ని తినివేసినట్లు ఆ రాజు ఆమె భర్తను భక్షించాడు. ఆ సమయంలో క్రోధావిష్ట అయిన ఆమె కన్నులనుండి నీళ్లు కారాయి. అవి మండే అగ్నిగా మారి ఆ ప్రాంతాన్ని దహించాయి. అప్పుడు భర్తృవియోగంతో శోకసంతప్త అయిన ఆమె కోపంతో కల్మాషపాదరాజర్షిని ఇలా శపించింది. 'క్షుద్రుడా! నా కోరిక తీరకమునుపే నేను చూస్తుండగానే కీర్తిమంతుడయిన నా భర్తను భక్షించావు. కాబట్టి దుర్మతీ! నీవు కూడా నా శాపం వలన ఋతుకాలంలో భార్యతో కలిస్తే వెంటనే ప్రాణాలు పోగొట్టుకుంటావు. వసిష్ఠ మహర్షి కుమారులను నీవు నాశనం చేశావు. కాబట్టి నీ భార్య వసిష్ఠునితో సంగమించి కొడుకును కంటుంది. రాజాధమా! ఆ కొడుకే నీ వంశాభివృద్ధికి కారణమవుతాడు.' ఈ విధంగా రాజును శపించి సాధ్వి అయిన ఆ అంగిరసి ఆ రాజసన్నిధిలోనే ప్రజ్వలితాగ్నిలో ఆత్మార్పణ చేసింది. పరంతపా! మహాభాగుడైన వసిష్ఠుడు తన మహాతపస్సుచేత ఇదంతా తెలిసికొన్నాడు. ఆపై చాలాకాలం తర్వాత ఆ రాజు శాపాన్ని విస్మరించి ఋతుకాలంలో భార్య దగ్గరకు పోయాడు. ఆమె ఆయనను నివారించింది. కామమోహితు డయిన ఆ రాజునకు శాపవిషయం గుర్తుకు రాలేదు. మహారాణి మాటలు విని ఆ రాజోత్తముడు కలవరపడ్డాడు. నరోత్తమా! ఆ శాపాన్ని మాటిమాటికీ తలచుకొని చాలా దుఃఖించాడు. ఈ కారణంవలననే శాపదోషం తగిలిన ఆ కల్మాషపాదమహారాజు తన భార్యతో వసిష్ఠుని నియోగించాడు.'

182. పాండవులు ధౌమ్యుని తమ పురోహితునిగా వరించుట.

అర్జును డిలా అన్నాడు. 'గంధర్వా! మాకు పురోహితుడుగా నుండదగిన వేద పండితులు ఎవరైనా ఉంటే చెప్పు. నీకంతా తెలుసుగదా!' గంధర్వు డిలా అన్నాడు. 'ఈ వనంలో ఉత్కోచకతీర్థంలో దేవలమహర్షి కనిష్ఠ సోదరుడు ధౌమ్యుడు తపస్సు చేస్తున్నాడు. మీకు నచ్చితే ఆయనను పురోహితుని చేసికోండి.' అప్పుడు అర్జునుడు ప్రీతమనస్కుడై యథావిధిగా ఆగ్నేయాస్త్రాన్ని ఆ గంధర్వున కిచ్చాడు. ఇచ్చి ఈ మాట చెప్పాడు. 'గంధర్వోత్తమా! గుఱ్ఱాలను నీ దగ్గరే ఉంచు. అవసరం కలిగినపుడు స్వీకరిస్తాం. నీకు

శుభం కలుగుగాక' అని అన్నాడు. ఆ గంధర్వుడు, పాండవులు పరస్పరం పూజించుకొని రమ్యమయిన ఆ భాగీరథీతీరం నుండి ఎవరిదారిన వారు వెళ్ళిపోయారు.

తరువాత పాండవులు ఉత్కోచక తీర్థంలోని ధౌమ్యుని ఆశ్రమానికి పోయి పురోహితునిగా ఆయనను వరించారు. సర్వవేదవేత్తలలో శ్రేష్ఠుడైన ధౌమ్యుడు వారిని అడవిలో దొరికే ఫలమూలాలతో సత్కరించి, పౌరోహిత్యాన్ని అంగీకరించాడు. ధౌమ్యుని పురోహితునిగా చేసికొన్న తర్వాత రాజ్యం, సంపద అన్నీ పొందినట్లు పాండవులు భావించారు. స్వయంవరంలో పాంచాలికూడా లభించినట్లే అని కూడా భావించారు. భరతశ్రేష్ఠులు ధౌమ్యుని పురోహితునిగా, గురువుగా స్వీకరించి తమను తాము సనాథులనుగా భావించారు. పాండవుల పురోహితు డయిన ధౌమ్యుడు వేదార్థతత్త్వం తెలిసినవాడు. ఉదారబుద్ధిగలవాడు. ధర్మజ్ఞుడైన ఆయన ధర్మవేత్త లయిన పాండవులను తన యజమానులను చేసికొన్నాడు. ధౌమ్యుడు కూడా బుద్ధి, పరాక్రమం, బలం, ఉత్సాహం కలిగి దేవతాసమానులైన ఆ వీరులు స్వధర్మాన్ని ఆశ్రయించి, తమ రాజ్యాన్ని పొందగలరని విశ్వసించాడు. ధౌమ్యుడు పాండవులకు స్వస్తివాచన చేశాడు. ఆపై నరోత్తము లయిన ఆ పాండవులు పాంచాలీ స్వయంవరానికి వెళ్లాలని నిశ్చయించుకొన్నారు.

183. పాండవులు పాంచాలదేశమునకు వెడలుట.

నరోత్తములైన పాండవులు అయిదుగురు సోదరులు ద్రౌపదిని చూడటానికి మహోత్సవభరితమైన పాంచాలదేశానికి బయలుదేరారు. తల్లితో కలిసి ప్రయాణం చేస్తున్న పాండవులు దారిలో చాలామంది బ్రాహ్మణులను చూశారు. బ్రహ్మచారులైన ఆ బ్రాహ్మణులు పాండవులతో 'మీరు ఎక్కడనుంచి వస్తున్నారు? ఎక్కడకు వెళుతున్నారు?, అన్నారు. ధర్మరాజు "బ్రాహ్మణోత్తములారా! మేము అన్నదమ్ములం. ఏకచక్రపురం నుంచి తల్లిని వెంటబెట్టుకొని వస్తున్నాం. మీ సమాచారం చెప్పండి." అన్నాడు. బ్రాహ్మణులు పలికారు- 'పాంచాలదేశానికి వెళ్లండి. ద్రుపదమహారాజు భవనంలో సుసంపన్నమైన గొప్పస్వయంవరం జరుగబోతోంది. అందరం కలిసి వెళదాం. మేమూ అక్కడికే వెళుతున్నాం. అక్కడ అద్భుతమైన గొప్ప ఉత్సవం జరుగబోతోంది. తామరరేకుల వంటి కన్నులుకల అమ్మాయి యజ్ఞకుండంలో నుండి యజ్ఞసేనుడైన ద్రుపదుని కుమార్తెగా జన్మించింది. ఆమె చూడచక్కనిది. సుకుమారి. మనస్విని. ద్రోణశత్రువు, అయిన ధృష్టద్యుమ్నునికి చెల్లెలు. మహావీరుడైన ధృష్టద్యుమ్నుడు కూడ కవచం, ఖడ్గం, విల్లు అమ్ములతో అగ్నివలె ప్రకాశిస్తూ యజ్ఞకుండంలోనుండి జన్మించాడు.

అతని చెల్లెలు ద్రౌపది. సన్నని నడుముగల సుందరాంగి. ఆమె ఉన్నచోటునుండి క్రోసెడు దూరం నల్లకలువల సువాసన వ్యాపిస్తుంది. స్వయంవరం ఏర్పాటుచేయబడిన ద్రౌపదిని, ఆ మహోత్సవాన్నీ చూడటానికి మేము వెళుతున్నాం. రాజులు, రాజపుత్రులు, అధికదక్షిణలిచ్చే యజ్ఞకర్తలు, స్వాధ్యాయపరులు, శౌచం, వ్రతదీక్ష కల మహాత్ములు, చూడచక్కని యువకులు, మహారథులు, మహావీరులు ఎందరో మహారాజులు అక్కడకు వస్తారు. ఆ రాజులు విజయంకోసం అనేకవిధాలయిన కానుక లిస్తారు. ధనమూ, ఆవులూ, భక్ష్యభోజ్యాలను అంతటా దానం చేస్తారు. ఆ దానాలన్నీ అందుకొని, స్వయంవరాన్ని, ఉత్సవవైభవాన్ని తనివితీరా చూచి వెళదాం. అక్కడికి దేశదేశాలనుండి నటులు, వైతాళికులు, నర్తకులు, సూతులు, మాగధులు, బలవంతులైన యోధులు వస్తారు. ఈ విధంగా ఆసక్తికరమైన వానిని చూచి దానాలు పుచ్చుకొని మహాత్ములయిన మీరు మాతో కలిసి తిరిగిరావచ్చు.. మీరు అయిదుగురు అందంగా దేవతలవలె ఉన్నారు. మిమ్మల్ని చూచి ద్రౌపది వరిస్తుంది. ఈడూ జోడూ బాగుంటుంది. నీ ఈ తమ్ముడు (అర్జునుడు) కళగా, అందంగా, మహావీరుడుగా ఉన్నాడు. ఇతనిని స్వయంవరానికి పంపిస్తే వివాహంతోపాటు గొప్పసంపదను తీసుకొని వచ్చి మీకు తప్పకుండా సంతోషాన్ని కలిగిస్తాడు.' ధర్మరాజు అన్నాడు- 'బాహ్మణులారా! ఆ కన్యాస్వయంవరమహోత్సవాన్ని చూడటానికి మనం అందరం కలసివెళదాం.'

184. స్వయంవర సభావర్ణనము - ధృష్టద్యుమ్నుని ప్రకటన.

బ్రాహ్మణులతో ఇలా పలికిన పాండవులు ద్రుపదమహారాజు పరిపాలిస్తున్న దక్షిణపాంచాలదేశానికి ప్రయాణమైనారు. ఆ తరువాత పాండవులు మహాత్ముడు, శుద్ధాత్ముడు, అకల్మషుడు అయిన వ్యాసమహర్షిని దర్శించారు. వ్యాసమహర్షిని యథావిధిగా సత్కరించి, ఆయన చేసిన సత్కారాలను అందుకొని, అనుమతి తీసుకొని పాండవులు పాంచాలదేశానికి ప్రయాణం సాగించారు. పాండవులు అందమైన వనాలను, సరస్సులను, చూస్తూ, అక్కడక్కడ ఆగుతూ నెమ్మదిగా ప్రయాణించారు. స్వాధ్యాయం చదువుకొంటూ, పవిత్రులై, మధురంగా ప్రియంగా మాట్లాడుకొంటూ పాండవులు క్రమంగా పాంచాలదేశానికి చేరుకొన్నారు. పాండవులు కాంపిల్యనగరాన్నీ, సైన్యాలుండే చోటునూ చూచి ఒక కుమ్మరి ఇంటిలో ఆశ్రయం పొందారు. అక్కడ బ్రాహ్మణధర్మంగా భిక్షాటనం చేశారు. ఆ వీరులను ఎవరూ, ఎక్కడా గుర్తుపట్టలేదు. ద్రుపదుని మనసులో ద్రౌపదిని అర్జునునకు ఇవ్వాలని ఉంది. కాని దానిని పైకి చెప్పటం లేదు. ద్రుపదుడు అర్జునునికోసం వెతుకుతూ వంచరాని బలమైన

ధనుస్సును చేయించి అక్కడ ఉంచాడు. ఆకాశంలో కృత్రిమమైన యంత్రాన్ని నిర్మించి దానిలో లక్ష్యాన్ని ఏర్పాటు చేశాడు. ద్రుపదుడు ఇలా పలికాడు- ఈ ధనుస్సును ఎక్కుపెట్టి, సిద్ధంగా ఉన్న ఈ బాణాలతో లక్ష్యాన్ని గురిచూచి కొట్టినవానికి నాపుత్రిక లభిస్తుంది." ఈవిధంగా ద్రుపదమహారాజు స్వయంవరాన్ని ప్రకటించాడు. అది విని రాజులందరు అక్కడికి చేరుకొన్నారు.

స్వయంవరాన్ని చూడటానికి ఋషులు, మహాత్ములు, దుర్యోధనుని వెంట కర్ణునితో కలిసి కౌరవులు అంతా వచ్చారు. మహానుభావులైన బ్రాహ్మణులు అనేకదేశాలనుండి వచ్చారు. ద్రుపదమహారాజు వచ్చిన రాజులందరిని పూజించాడు. స్వయంవరాన్ని చూడాలనే కోరికతో పౌరులందరూ సముద్రఘోషవలె కలకలంచేస్తూ వచ్చి ఆసనాలపై కూర్చున్నారు. నగరానికి ఈశాన్యభాగంలో సమతలమైన శుభప్రదేశంలో స్వయంవరమంటపం నిర్మింపబడింది. దానిని ఎన్నోభవనాలు అన్ని దిక్కులా చుట్టి ఉన్నాయి. స్వయంవరానికి వచ్చిన రాజులంతా ఆ మంటపం యొక్క ఈశాన్యభాగంలో కూర్చున్నారు. ప్రాకారం, అగడ్త, తోరణాలు కట్టిన ద్వారాలు, విచిత్రమైన చాందినీ- వీటితో మంటపం అంతటా అలంకరించ బడింది. వివిధమంగళవాద్యఘోషలతో, సుగంధభరితమైన అగురుధూపాలతో, మంచిగంధపు నీటి చిలకరింపులతో, పూలమాలల వరుసలతో ఆ మంటపం ప్రకాశిస్తోంది. కైలాసశిఖరాలవలె ఆకాశాన్ని తాకుతూ చక్కగా అలంకరించబడిన శుభ్రమైన మేడలతో అన్నివైపులా విరాజిల్లుతోంది మంటపం. బంగారు రంగు చాందినీలతో, మణులు పొదిగిన కుట్టిమస్థలాలతో, భూషణాలతో, సుఖంగా ఎక్కగల మెట్లతో, పెద్ద పెద్ద సింహాసనాలతో ఆ సభ విలసిల్లుతోంది. పూలమాలికలు, దండలతో కప్పబడి, అగరువాసనలతో నిండి రెక్కలవలె పలురంగులతో చాలాదూరం సువాసనలు వెదజల్లుతున్నది మంటపం. అనేకద్వారాలతో, మంచెలు, కుర్చీలతో శోభిస్తూ, రకరకాల రంగుల పూలతో హిమాలయశిఖరాలవలె ఎత్తుగా ఉన్నాయి. సభామంటపంలోని పలురకాల ఆసనాలలో రాజులందరు చక్కగా అలంకరించుకొని ఒకరితో ఒకరు పోటీపడుతూ కూర్చున్నారు.

అందులో మహాబలపరాక్రమాలు కల రాజశ్రేష్ఠులు కృష్ణాగురుసువాసనాభరితులై, సౌభాగ్యసంపన్నులై కూర్చొని ఉన్నారు. తమ మంచిపనులతో, శుభకర్మలతో సర్వలోకానికి హితులై తమ దేశాన్ని రక్షించుకొనే ప్రసన్నహృదయులైన బ్రాహ్మణభక్తులు కూడ అక్కడే కూర్చున్నారు. పౌరులు, జానపదులు ద్రౌపదీ దర్శనం కోసం ఎత్తైన మంచెల మీద కూర్చున్నారు. అత్యున్నతమైన పాంచాలరాజ్యవైభవాన్ని తిలకిస్తూ బ్రాహ్మణులతో పాటు పాండవులు కూర్చున్నారు. ఈవిధంగా నటులు, నర్తకులు, అనేకరత్న ప్రదానాలతో

రాజులసముదాయం చాలారోజులుగా వర్ధిల్లుతోంది. రాజసమూహం ఇలా ప్రకాశిస్తూ ఉండగా పదహారవరోజున పుష్పమాలికను పట్టుకొని ద్రౌపది స్వయంవరరంగానికి వచ్చింది. మంత్రవేత్త అయిన సోమకవంశపురోహితుడు యథావిధిగా అగ్నిహోత్రాన్ని ఏర్పరచి, నేతితో హోమం చేశాడు. అగ్నిసంతర్పణ, బ్రాహ్మణుల స్వస్తివచనాలు అయిన తరువాత మంగళవాద్యధ్వనులన్నీ ఆపివేయబడ్డాయి. రాజా! నిశ్శబ్దమైన స్వయంవరమండపంలోనికి అన్నగారు ధృష్టద్యుమ్నుడు ద్రౌపదిని తీసుకొనివచ్చి, రంగమధ్యంలో నిలబడి, గంభీరమైన కంఠస్వరంతో స్పష్టంగా, చక్కగా అర్థమయ్యేటట్లుగా, పెద్దగా ఇలా చెప్పాడు. "రాజులారా! నేను చెప్పేది వినండి. ఇదిగో లక్ష్యం, ధనుస్సు, బాణాలు. అయిదు బాణాలను పైన ఏర్పాటుచేసిన ఒక యంత్రంలోని లక్ష్యంలోకి గురితప్పకుండా కొట్టాలి. ఈ గొప్పపనిని ఎవడు చేస్తాడో కులం, రూపం, బలం కలిగిన ఆ వ్యక్తికి నాచెల్లెలు ద్రౌపది భార్య అవుతుంది. నేను అబద్ధం చెప్పను." ధృష్టద్యుమ్నుడు సభలోనివారితో ఇలా మాట్లాడి ఆయారాజుల గోత్రనామాలు, గొప్పదనాలను తన సోదరి ద్రౌపదికి ఇలా తెలియజేశాడు.

185. ధృష్టద్యుమ్నుడు స్వయంవరాగత రాజులను ద్రౌపదికి పరిచయము చేయుట.

ధృష్టద్యుమ్నుడు పలికాడు- "దుర్యోధనుడు, దుర్విషహుడు, దుర్ముఖుడు, దుష్ప్రధర్షణుడు, వివింశతి, వికర్ణుడు, సహుడు, దుశ్శాసనుడు, యుయుత్సువు, వాయువేగుడు, భీమవేగరవుడు, ఉగ్రాయుధుడు, బలాకి, కరకాయువు, విరోచనుడు, కుండకుడు, చిత్రసేనుడు, సువర్చుడు, కనకధ్వజుడు, నందకుడు, బాహుశాలి, తుహుండుడు, వికటుడు మరెందరో మహావీరులైన ధృతరాష్ట్రకుమారులు కర్ణునితో కలిసి నీకోసం వచ్చారు. శకుని, వృషకుడు, బృహద్బలుడు వచ్చారు. వీరంతా గాంధారరాజకుమారులు. ఉత్తమయోధులైన అశ్వత్థామ, భోజుడు నీకోసమే విచ్చేశారు. బృహంతుడు, మణిమంతుడు, దండధారుడు, సహదేవ జయత్సేనులు, మేఘసంధి, కుమారులైన శంఖుడు, ఉత్తరులతో కలిసి విరాటరాజు, వార్ధక్షేమి, సుశర్మ, సేనాబిందువు, కుమారుడైన సువర్చసునితో కలసి సుకేతువు, సుచిత్రుడు, సుకుమారుడు, వృకుడు, సత్యధృతి, సూర్యధ్వజుడు, రోచమానుడు, నీలుడు, చిత్రాయుధుడు, దండుడు, పౌండ్రకవాసుదేవుడు, భగదత్తుడు, కాళింగతామ్రలిప్తుడు, పత్తనాధిపతి, మహారథుడైన మద్రరాజు శల్యుడు, అతనిపుత్రులు రుక్మాంగద రుక్మరథులు, భూరి, భూరిశ్రవసుడు, శలుడు అనే తన ముగ్గురు పుత్రులతో కలసి కౌరవ్యుడైన సోమదత్తుడు, కాంబోజరాజు సుదక్షిణుడు, పౌరవుడైన దృఢధన్వుడు-----

బృహద్బలుడు, సుషేణుడు, ఔశీనరుడైన శిబి, దోపిడి దొంగలను సంహరించిన కారూషాధిపతి సంకర్షణుడు, వాసుదేవుడు, రౌక్మిణేయుడు, సాంబుడు, చారుదేష్ణుడు, ప్రద్యుమ్ని, గదుడు, అక్రూరుడు, సాత్యకి, మహామతి ఉద్ధవుడు, ఆత్మీయుడైన కృతవర్మ, పృథువు, విపృథువు, విదూరథుడు, కంకుడు, గవేషణునితో కూడిన శంకుడు, ఆశావహుడు, అనిరుద్ధుడు, శమీకుడు, సారిమేజయుడు, వీరుడైన వాతపతి, ఝిల్లి, పిండారకుడు, ఉశీనరుడు, విక్రాంతుడు వీరందరు ప్రసిద్ధమైన వృష్ణివంశంలో పుట్టినవారు. భగీరథుడు, బృహత్క్షత్రుడు, సింధుదేశపురాజు జయద్రథుడు, బృహద్రథుడు, బాహ్లికుడు, మహారథుడైన శ్రుతాయువు, కైతవుడైన ఉలూకుడు, చిత్రాంగద శుభాంగదులు, వత్సరాజు, కోసలాధిపతి, శిశుపాలుడు, జరాసంధుడు, వీరేకాక మరెందరో సుప్రసిద్ధులైన క్షత్రియులు వివిధదేశాధిపతులు నీకోసం వచ్చారు. అమ్మా! నీకోసం వీరు లక్ష్యాన్ని భేదిస్తారు. ఎవడు ఈ లక్ష్యాన్ని భేదిస్తాడో వానిని వరింతువు గాక!'

186. స్వయంవరాగతులైన రాజులు లక్ష్యమును భేదింపలేక పోవుట.

ఒకరితో ఒకరు పోటీపడుతూ చక్కగా కుండలాదులతో అలంకరించుకొన్న యువకులైన రాజులందరు ఎవరి అస్త్రబలాన్ని వారు ఊహించుకొంటూ ఆయుధం పట్టి కదిలారు. రూపం, బలం, కులం, శీలం, ధనం, యౌవనం మొదలైన దర్పాలతో రాజులు మంచుకొండల్లోని మదపుటేనుగుల్లాగా రకరకాల నడకలు నడిచారు. రాజులు ఒకరినొకరు స్పర్ధతో చూసుకొంటూ, మన్మథునికి వశులై, నాదే ద్రౌపది అంటూ, ఒక్కసారిగా సింహాసనాల నుండి లేచి, నిలిచారు. ఆ రాజులు ద్రౌపదిని గెలుచుకోవాలని స్వయంవర రంగంలో కలిశారు. వారంతా హిమవత్పుత్రి అయిన పార్వతి కోసం కూడిన దేవగణాల వలె ప్రకాశిస్తున్నారు. ద్రౌపదినే భావించే మనుసులలో మన్మధుని బాణాలతో పీడింపబడుతూ అక్కడకు వచ్చిన రాజులంతా పూర్వం స్నేహితులయినా అక్కడ మాత్రం ఒకరినొకరు ద్వేషించుకోసాగారు. అంతలోనే విమానాలెక్కి రుద్రులు, ఆదిత్యులు, వసువులు, అశ్వినీదేవతలు, సాధ్యులు, మరుత్తులు, యముడు, కుబేరుడు అంతా వచ్చారు. దైత్యులు, సుపర్ణులు, ఉరగులు, దేవర్షులు, గుహ్యకులు, చారణులు, విశ్వావసువు, నారదుడు, పర్వతుడు, అప్సరసలతో కలిసి గంధర్వులు మొ వారంతా వచ్చారు.

బలరాముడు, వృష్ణివీరులు, అంధకవీరులు, యదువీరులు అంతా కృష్ణుని ఇష్టానికి లోబడి ప్రేక్షకపాత్ర వహించి కూర్చుండిపోయారు. విల్లు ఎక్కుపెట్టదలచుకోలేదు. లక్ష్మీదేవికి అభిముఖంగా ఉన్న అయిదు మదపుటేనుగుల్లా, నివురు గప్పిన నిప్పులవలె ఉన్న పాండవులను

కృష్ణుడు చూసి, గ్రహించాడు. కృష్ణుడు బలరామునికి ధర్మరాజును, భీముని, అర్జునుని, కవలలను మెల్లమెల్లగా వరుసగా చెప్పాడు. బలరాముడు చాలా సంతోషంతో చూస్తూ అలాగే కృష్ణుని వైపు చూశాడు. ఇతరరాజులకూ, వారిపుత్రపౌత్రులకూ, ద్రౌపదివైనే కనులూ, మనస్సులూ, నిలిచిపోయాయి. వారు పెదవులు కొరుకుతూ ఎట్టని నేత్రాలు పెద్దవి చేసికొని చూస్తున్నారు కాని పాండవులనూ,రామకృష్ణులనూ చూడనే లేదు. అలాగే దీర్ఘభుజులైన కౌంతేయులూ, మహానుభావులైన కవలలూ ద్రౌపదిని చూసి అందరూ మన్మథబాణాలకు వశమైపోయారు. అపుడు ఆకాశంలో దేవర్షులూ, గంధర్వులూ, సుపర్ణులూ, నాగులూ, అసురులు, సిద్ధులూ ప్రత్యక్షమయ్యారు. దివ్యపుష్పవృష్టి కురిసింది. సభ, ఆకాశమూ అంతా పరిమళభరిత మయింది. ఆకాశమంతా దుందుభిధ్వనులతో నిండిపోయింది. విమానాల రద్దీ ఎక్కువైపోయింది. వేణునాదాలు, వీణానాదాలు, పణవనాదాలు మిన్నుముట్టాయి.

తరువాత రాజులంతా ద్రౌపదికోసం తమ బలపరాక్రమాలు ప్రదర్శించారు. వారిలో కర్ణుడు, దుర్యోధనుడు, శాల్వుడు, శల్యుడు, అశ్వత్థామ, క్రాథుడు, సునీథుడు, వక్రుడు, కళింగరాజు, వంగరాజు, పాండ్యరాజు, పౌండ్రదేశాధిపతి, విదేహరాజు, యవనదేశాధిపతి ఉన్నారు. ఇంకాచాలామంది రాజుల కొడుకులూ మనుమలూ కూడా ఉన్నారు. వారంతా కిరీటాలు, హారాలు, అంగదాలు ధరించి పద్మనేత్రులై విరాజిల్లుతున్నారు. బలపరాక్రమాలతో మోగిపోతూ, దీర్ఘభుజులై ఉన్నారు. మిగిలిన రాజులు దృఢమైన ఆ ధనుస్సును మనసా కూడా ఎక్కుపెట్టలేకపోయారు. కొంతమంది దృఢమైన వింటిని ఎక్కుపెట్టబోయి విసరివేయబడ్డారు. కొందరు చేష్టలుడిగి నేలమీద పడ్డారు. వారి వారి బలాలకూ, శిక్షణలకూ, గుణాలకూ తగినట్లు ప్రయత్నిస్తున్నా శక్తులుడిగి కిరీటాలు పడిపోయాయి కొందరికి. మరికొందరికి ఆభరణాలు జారిపడిపోయాయి. ఇంకా కొందరు రొప్పుతూ క్రిందపడి శాంతించారు. రాజసమూహమంతా ఆ దృఢధనుస్సు వలన హారాలు, అంగదాలు, కేయూరాలు జారిపడిపోయి హాహాకారాలు చేశారు. ద్రౌపదిమీది అభిలాష వదలుకొని అంతా ఆర్తులై మిగిలిపోయారు. ఆ రాజులందరినీ చూసి ధనుర్ధారులలో ఉత్తముడయిన కర్ణుడు లేచి వెళ్లి వెంటనే ఆ ధనుస్సును ఎత్తి, ఎక్కుపెట్టి బాణాలు సంధించాడు. అగ్ని కంటె, చంద్రసూర్యులకంటె తేజస్వి అయిన కర్ణుడు ఆసక్తితో ప్రతిజ్ఞ చేస్తూ లేవడం చూసి ధనుర్ధరులైన పాండవులు "ఈతడు లక్ష్యాన్ని భేదించి నేలకూలుస్తాడు" అని భావించారు.

కర్ణుని చూచి వెంటనే ద్రౌపది పెద్దగా "నేను సూతుని వరించను" అంది. ఇదంతా చూసి కోపంతో నవ్వుతూ సూర్యుని వైపు పైకి చూసి, కర్ణుడు వెంటనే వెలుగులు చిమ్మే ఆ ధనుస్సు వదిలేశాడు. ఇలా రాజులంతా వెనుదిరిగారు. అపుడు బలంలో యమునితో

సమానుడయిన చేదిరాజు, శిశుపాలుడు ధనుస్సు గ్రహించాడు. పట్టుకొంటూనే (ఎత్తలేక)మోకాళ్ల మీద పడిపోయాడు. తరువాత జరాసంధుడు వింటిదగ్గరకు వచ్చి, చలించని పర్వతంలా నిలిచాడు. అతడు కూడా వింటిచేత పీడితుడై ఎత్తలేక మోకాళ్లమీద పడిపోయాడు. వెంటనే లేచి అతడు తనదేశానికి వెళ్లిపోయాడు. మద్రరాజు శల్యుడు కూడ వింటి నెక్కుపెడుతూ మోకాళ్లమీద వాలిపోయాడు.

(తరువాత అభిమానధనుడు దుర్యోధనుడు లేచాడు. అతడు అస్త్రవిద్యాసంపన్నుడు- రాజలక్షణాలు పుష్కలంగా ఉన్నాయి అతడికి. సోదరుల మధ్యనుండి లేచి ధీవిగా ద్రౌపదిని చూస్తూ వింటి దగ్గరకు వచ్చాడు. ధనుస్సును గ్రహించి అతడు ధనుస్సుపట్టిన ఇంద్రునిలా ప్రకాశించాడు అతడు ధనుస్సు ఎత్తి ఎక్కుపెడుతూ వ్రేళ్లమధ్య వింటి నారి దెబ్బతగిలి ఎత్తయిన శయ్యమీద పడిపోయాడు. దెబ్బతిని, సిగ్గుపడుతూ దుర్యోధనుడు అక్కడ నుండి నిష్క్రమించాడు.)

ఆ సభలో రాజులు అంతా సంభ్రాంతులైనారు. అపుడు వీరు డయిన అర్జునుడు ఆ ధనుస్సును ఎక్కుపెట్టేందుకు బయలుదేరాడు.

(అపుడు దేవదానవుల్లో శ్రేష్ఠుడూ, వృష్ణివంశోత్తముడూ అయిన కృష్ణుడు బలరాముని చేతిని పట్టి, ఊపి, సంతోషం వెలిబుచ్చాడు. "ద్రౌపది అర్జునుని చేతికి వచ్చింది" అని వారు సంతోషించారు. ఇతర రాజులు ఎవరూ పాండవులు మారువేషాల్లో ఉన్నట్లు గమనించలేదు.)

187. అర్జునుడు లక్ష్యమును భేదించి ద్రౌపదిని పొందుట.

వింటిని ఎక్కుపెట్టలేక రాజులు వెనుదిరిగిన తరువాత బ్రాహ్మణుల మధ్యనుండి ఉదారబుద్ధి కల అర్జునుడు లేచాడు. ఇంద్రధ్వజ సమాన కాంతితో లేచి నిలుచున్న అర్జునుని చూసి బ్రాహ్మణోత్తములు తమతమ కృష్ణాజినాలు ఊపుతూ కోలాహలం చేశారు. కొంతమంది కిది నచ్చలేదు. మరికొంతమంది సంతోషించారు. బుద్ధిజీవులయిన నిపుణులు కొందరు ఒకరితో ఒకరు ఏవో చెప్పుకొన్నారు. "లోకప్రసిద్ధులయిన ధనుర్వేత్తలు కర్ణుడు, శల్యుడు మొదలయిన వారు. అంత బలవంతులకే సాధ్యంకాని ఈ వింటి నెక్కుపెట్టడం అస్త్ర విద్యయే తెలియని బలహీనుడయిన బాలవిప్రునికి సాధ్యమా? బాల్యచాపల్యంతో పరిశీలించకుండా ముందుకు వెళ్తున్నాడు. ఈ పని చేయలేక పోతే రాజులందరిలో బ్రాహ్మణులు అపహాస్యం పాలవుతారు. ఇతడు గర్వంతోనో, ఉబలాటంతోనో, బ్రాహ్మణ చాపల్యంతోనో లేచి వింటినెక్కుపెట్టాలనుకొంటున్నాడు. రావద్దని వారిస్తే మంచిది" అన్నారు. బ్రాహ్మణులు ఇలా అన్నారు – 'మేము అపహాస్యంపాలు కాము, చిన్నతనం కూడా పొందము. రాజులచే ద్వేషింపబడము.' కొందరు ఇలా అన్నారు. 'ఇతడు ఏనుగు తొండం వలె బలిసిన ఆజానుబాహువు. ధైర్యంలో హిమవత్పర్వతంలా ఉన్నవాడు.

యౌవనసంపద కలవాడు. శుభలక్షణాలున్న ఈతని నడక సింహపునడకలా రీవిగా ఉంది. మదించిన ఏనుగు వంటి పరాక్రమం కలవాడు. ఈపని చేయగలడని అతని ఉత్సాహమే చెపుతోంది.

అతని శక్తి ఉత్సాహభరితంగా ఉంది. అశక్తుడయితే స్వయంగా రాడు. సామాన్యంగా లోకంలో కనిపించే అశక్తత ఇతనిలో కనపడదు. ఆస్థానాల్లో తిరిగే బ్రాహ్మణులకు అసాధ్యమంటూ ఉండదు. నీళ్లుత్రాగి, గాలిమాత్రం పీలుస్తూ, పళ్లు తింటూ కఠిననియమాలు ఆచరించే బ్రాహ్మణులు శారీరకంగా బలహీనులయినా తమ తేజస్సుతో బలవత్తరులు. అందుకే బ్రాహ్మణులు మంచిపని చేసినా చెడ్డపనిచేసినా, సుఖం కలిగించినా, దుఃఖం కలిగించినా, పెద్దపనిచేసినా చిన్నపని చేసినా వారిని అవమానించరాదు.

(ధనుర్వేదంలో కాని, వేదంలోకాని, వివిధయోగాల్లో కాని బ్రాహ్మణుని మించిన వారిని కానం. మంత్రబలంలోకాని యోగబలంలోకాని, ఆత్మబలంలో కాని వారు సాటిలేనివారు. ఈలోకమంతటినీ కూడా వారు కుదిపివేయగలరు. పరశురామునిచేత రాజులంతా యుద్ధంలో జయింపబడ్డారు.)

బ్రహ్మతేజస్సుకల అగస్త్యుడు అగాథమయిన సముద్రమే త్రాగివేశాడు. అందుచేత ఈ గొప్ప వింటిని ఈ వటువే ఆరోపించునుగాక.' ఈమాట విని బ్రాహ్మణులంతా "తథాస్తు" అన్నారు. ఇలా విప్రులంతా అనేక విధాలుగా అంటూ ఉండగానే అర్జునుడు వింటి దగ్గరకు వచ్చి, పర్వతంలా నిలిచాడు. అతడు ఆ ధనువుకు చుట్టూ ప్రదక్షిణం చేశాడు. **వరప్రదాత, అయిన ఈశానునికి శిరసు వంచి నమస్కరించి, కృష్ణుని మనసా ధ్యానించి, అర్జునుడు ధనువును(వింటిని) అందుకొన్నాడు.*** ధనుర్వేదం అభ్యసించిన పురుషసింహులు రుక్ముడు, సునీథుడు, వక్రుడు, కర్ణుడు, దుర్యోధనుడు, శల్యుడు, శాల్వుడు మొదలయినవారు ఎంతో ప్రయత్నించినా ఎక్కుపెట్టలేని ఆ ధనుస్సును విష్ణుప్రభావుడయిన అర్జునుడు ఒక్కనిమిషంలో ఎక్కుపెట్టి అయిదు బాణాలనూ గ్రహించాడు. వెంటనే లక్ష్యాన్ని కొట్టాడు. అది నేలమీద పడిపోయింది. మరుక్షణంలో సభలోనూ, ఆకాశంలోనూ పెద్దధ్వని వినపడింది. శత్రుసంహారకు డయిన అర్జునుని శిరస్సుపై దేవగణాలు దివ్యమైన పుష్పవర్షం కురిపించాయి. బ్రాహ్మణులు వేలకొలదీ ఉత్తరీయాలు ఊపారు. అంతటా హాహాకారాలు వినవచ్చాయి. ఆకాశం నుండి అంతటా పుష్ప వృష్టి కురిసింది. వాదకులు తూర్యనాదాలు చేశారు. చక్కని కంఠధ్వనితో సూతులు, మాగధుల సమూహాలు ప్రశంసలు కురిపించారు. ఆ దృశ్యం చూసి శత్రుసూదనుడైన

* ప్రణమ్య శిరసా దేవమ్ ఈశానం వరదం ప్రభుమ్ ।
కృష్ణం చ మనసా కృత్వా జగృహే చార్జునో ధనుః ॥ 18

ద్రుపదుడు ఎంతో సంతోషించాడు. అర్జునునికి సాయం కోసం అతడు సైన్యంతో వచ్చాడు. ఆ శబ్దం అలా కోలాహలంగా ఉంది. ఇంతలో ధర్మజ్ఞులలో ఉత్తముడయిన ధర్మరాజు నకులసహదేవులతో కలిసి, సభనుండి లేచి, వెంటనే తమ నివాసానికి వెళ్లాడు. లక్ష్యం భేదింపబడటాన్నీ, ఇంద్రుని వంటి అర్జునునీ చూసి ద్రౌపది తెల్లని పూలమాల గ్రహించి అర్జునుని సంతోషపెడుతూ బయలుదేరింది.

(నిత్యమూ చూసేవారికి కూడా ఆమె కొత్తగా కనిపిస్తోంది. నవ్వకపోయినా ఆమె ముఖం నవ్వుతున్నట్లు ఉంది. మద్యసేవ లేకుండానే తలపులు తొణికిసలాడుతున్నాయి. మాట్లాడకపోయినా చూపులతోనే మాట్లాడుతున్నట్లు ఉంది ఆమె. ఆమె అర్జునుని చేరి, రాజులందరి సమక్షంలో అందరినీ వదలి, అర్జునుని మెడలో ఆ కళ్యాణమాలవేసి వినయంతో నిలిచింది. ఆమె అపుడు దేవేంద్రుని వరించిన శచీదేవివలె, అగ్నిహోత్రుని వరించిన స్వాహాదేవి వలె, గోవిందుని వరించిన లక్ష్మీదేవి వలె, సూర్యుని వరించిన ఉష వలె, మన్మధుని వరించిన రతీదేవి వలె, రాముని వరించిన సీత వలె, నలుని వరించిన దమయంతి వలె శోభిల్లింది.)

అర్జునుడు బ్రాహ్మణుల ఆశీర్వాదాలు, ప్రశంసలూ పొందుతూ, వెంట ద్రౌపది వస్తూ ఉండగా రంగం నుండి నిష్క్రమించాడు.

188. ద్రుపదుని రక్షించుటకై భీమార్జునులు రాజుల నెదుర్కొనుట.

ద్రుపదుడు తన కన్యను బ్రాహ్మణునికి ఇవ్వాలని అనుకొంటున్నట్లు తెలిసి రాజులంతా ఒకరిమొగాలు ఒకరు చూసుకొన్నారు. వారందరికీ చాలా కోపం వచ్చింది. స్వయంవరానికి వచ్చిన మనల నందరినీ తృణీకరించి, కాదని ఒక బ్రాహ్మణునికి కన్యారత్నాన్ని ఇవ్వాలనుకొంటున్నాడు. చెట్టును చాలాకాలం పెంచి ఫలించే సమయానికి పడగొట్టినట్లు ఉంది. వీడు మనలను లెక్కచేయటం లేదు. ఈ దురాత్ముని చంపివేద్దాం. గుణాలను బట్టి కాని, పెద్దతనంచేత గాని వీరికి గౌరవం ఇవ్వనక్కరలేదు. రాజద్వేషి అయిన ఈ ద్రుపదుని పుత్రునితో సహా చంపివేద్దాం. ఇతడు అందరినీ పిలిచాడు. రాజు లందరినీ సత్కరించాడు. మృష్టాన్నభోజనం పెట్టాడు. చివరికి మనలను లెక్కచేయటం లేదు. దేవసభలా ఉన్న ఈరాజసభలో అర్హుడయిన రాజే కనపడలేదా వీడికి? అసలు స్వయంవరంలో విప్రులకు అధికారం లేదు. రాజులకు స్వయంవరం అని కదా వేదం చెపుతోంది. లేక ఈ కన్య రాజులనెవరినీ వరించకపోతే మనమంతా ఈమెను అగ్నిలో పడవేసి మనదేశాలకు పోదాం. ఒకవేళ ఈ బ్రాహ్మణుడు చాపల్యంచేతనో, లోభంచేతనో రాజులకు అప్రియం చేసి ఉంటాడు. అపుడు అతడు వధింపతగినవాడు కాదు. మనరాజ్యం, జీవితం, సంపద,

పుత్రపౌత్రాదులూ, ఇంకా ఇతరధనాలూ బ్రాహ్మణుల కోసమే కదా! అవమానభయంవల్ల కాని, స్వధర్మరక్షణవల్ల కాని, స్వయంవరానికి వచ్చిన ఇతరులకు మరోసారి అయినా ఇటువంటి గతి పట్టకూడదు.' ఇలా అనుకొని రాజులంతా ఉత్సాహంతో ద్రుపదుని సంహరించటానికి సాయుధులై బయలుదేరారు.

ధనుర్బాణాలు ధరించి, కోపంతో ఎంతోమంది రాజులు మీద పడటాన్ని చూసి భయంతో ద్రుపదుడు బ్రాహ్మణుల శరణుజొచ్చాడు. మదించిన ఏనుగుల వలె వేగంగా మీద పడుతున్న రాజులను మహాధనుర్ధారులయిన భీమార్జునులు ఎదిరించి అడ్డుకొన్నారు. రాజులంతా కవచాలూ, శిరస్త్రాణాలు ధరించి ఆయుధాలు సైకెత్తుకొని కోపంతో భీమార్జునులను చంపాలని మీద పడ్డారు. వెంటనే మహాబలుడైన భీముడు వజ్రసమాన మయిన బలంతో గజేంద్రునివలె ఒకచెట్టును పెకలించి ఆకులు దూశాడు. శత్రుసంహారకు డయిన భీముడు దండం ధరించిన యమునివలె ఉగ్ర డయ్యాడు. నరోత్తము డయిన అర్జునుని సమీపంలో ఆ చెట్టును పట్టుకొని దీర్ఘబాహు వయిన భీముడు నిలిచాడు. మానవాతీత మయిన తెలివికల అర్జునుడు భీముని అద్భుతకృత్యం చూసి ఆశ్చర్యపడ్డాడు కాని భయం లేకుండా ధనుస్సు గ్రహించి, ఇంద్రుని వలె నిలిచాడు. దివ్యజ్ఞానంతో ఊహింపరాని కృత్యాలు చేసే కృష్ణుడు అర్జునునీ, భీమునీ చూసి ఉగ్రపరాక్రము డయిన బలరామునితో ఇలా అన్నాడు. 'సింహంలా, వృషభంలా విలాసంగా రీవిగా నడుస్తూ తాటి చెట్టంత వింటిని లాగుతున్న వాడే అర్జునుడు. సందేహం లేదు బలరామా! ఒక్కపెట్టున చెట్టును పెల్లగించి రాజులనెదిరించి సాహసంతో నిలిచిన వాడే భీమసేనుడు. ఈ భూమిమీద అలా చేయగలవాడు భీముడు తప్ప మరొకడు లేడు. ఇంతకుముందు అక్కడ విశాలనేత్రాలూ, సింహంలాంటి శరీరంతో నడకతో వినయంతో కూర్చున్నాడే... పచ్చగా/తెల్లగా ఉండి పొడవైన అందమైన ముక్కు ఉన్నవాడు-అతడే ధర్మరాజు. ఇపుడు వెళ్లిపోయాడు. అతని ప్రక్కనే ఉన్న వాళ్లిద్దరూ నకులసహదేవులని నా భావం. లాక్షాగృహదహనం నుండి ఎలాగో పాండవులూ, కుంతీ బయటపడ్డారని విన్నాను.'

(రాజులంతా యుద్ధంలో అర్జునునితో ఏమన్నారో కృష్ణుడు బలరామునితో చెప్పాడు. కృష్ణునికి అర్జునుని బలం తెలుసును గనుక అతడు బలరామునితో "నీవు తొందరపడనవసరం లేదు. అర్జునుడు ఒక్కడే సురాసురులంతా ఎత్తివచ్చినా జయిస్తాడు. ఈ మానవమాత్రులొకలెక్కా? ఒకవేళ అర్జునుడే మనలను సాయం అడిగితే చేద్దాం-అయినా పాండుసుతునికి పరాజయం కల్గదు ఎప్పుడూ"..... .....అన్నాడు కృష్ణుడు.)

అపుడు నీరులేని మేఘంలా ఉన్న బలరాముడు కృష్ణునితో ఇలా అన్నాడు - "మన మేనత్త కుంతి, కొడుకులతో సహా లాక్షాగృహం నుండి బయటపడిందని తెలిసి చాలా ప్రీతి చెందాను."

189. భీమార్జునులు కర్ణశల్యాదులను జయించి ద్రౌపదిని తీసికొని పోవుట.

బ్రాహ్మణులు తమ కృష్ణాజినాలూ, కమండలాలూ విసురుతూ "మేము శత్రువులతో యుద్ధం చేస్తాం. భయపడవలసిన పనిలేదు" అంటూన్నారు. అలా అంటున్న విప్రులతో అర్జునుడు నవ్వుతూ "మీరు ప్రేక్షకులై నా ప్రక్క నిలవండి చాలు. బుసకొట్టే పాములని మంత్రాలతో నివారించినట్లు నేను వందలకొద్దీ సూటి, వాడి బాణాలు ప్రయోగించి వీరిని వారిస్తాను." అన్నాడు. ఇలా అని మహాబలు డయిన అర్జునుడు శుల్కంగా పొందిన ఆ ధనుస్సును వంచి, భీమునితో కూడి చలించని పర్వతంలా నిలిచాడు. రెండు ఏనుగులు ఏనుగులపై పడ్డట్లు భీమార్జునులు కర్ణుడు మొదలయిన వారిపై పడ్డారు. యుద్ధానికి వచ్చిన రాజులు ఇలా పరుషంగా మాట్లాడారు- "యుద్ధానికి వచ్చిన ద్విజులను కూడా చంపవచ్చు" అన్నారు. ఇలా అని రాజులంతా బ్రాహ్మణులను పారద్రోలారు. అంతలో మహాతేజస్వి కర్ణుడు అర్జునునితో యుద్ధానికి వెళ్లాడు. ఆడ ఏనుగు కారణంగా ఒక ఏనుగు మరో ఏనుగుతో పోరాడినట్లు యుద్ధార్థి అయిన మద్రరాజు- శల్యుడు- భీముని ఎదిరించాడు. ఆ యుద్ధంలో దుర్యోధనాదులంతా బ్రాహ్మణులతో అప్రయత్నంగా, మృదువుగా యుద్ధం చేశారు. అర్జునుడు ధనుస్సును బాగా లాగి, వంచి మీదపడుతున్న కర్ణుని వాడిబాణాలతో కొట్టాడు. తీక్ష్ణమయిన తేజస్సు కల బాణాల వేగంతో ఒడలు తెలియక కర్ణుడు అతికష్టంమీద అర్జునుని ఎదిరిస్తున్నాడు. వారిద్దరూ వర్ణింపరాని నేర్పు కలవారు. ఒకరినొకరు జయించాలని క్రోధంతో యుద్ధం చేస్తున్నారు. 'నీబాణానికి సమాధానం చూశావా' 'నాబాహుబలం ఎంతటిదో చూడు' అంటూ వీరోక్తులు పల్కుతూ వారు యుద్ధం చేస్తున్నారు. అర్జునుని భుజపరాక్రమం ఈ భూమిమీద సాటిలేనిదని గ్రహించి, కర్ణుడు కోపంతో యుద్ధం చేశాడు. అర్జునుడు ప్రయోగించిన వేగవంతాలయిన బాణాలను కర్ణుడు ఖండించి బిగ్గరగా అరిచాడు. దానిని సైనికులు ప్రశంసించారు.

కర్ణుడు ఇలా అన్నాడు. "విప్రోత్తమా! యుద్ధంలో నీ భుజపరాక్రమానికి సంతోషిస్తున్నాను. దుఃఖం చెందకుండా శస్త్రాస్త్రాలతో విజయం పొందుతున్నందుకు కూడా సంతోషిస్తున్నాను.

విప్రోత్తమా! నీవు సాక్షాత్తు ధనుర్వేదవేత్త అయిన పరశురాముడివా? లేక ఇంద్రుడవా? లేదా సాక్షాత్తు ఉపేంద్రుడివా? నిన్ను కప్పిపుచ్చుకొనటానికి విప్రరూపం ధరించి బాహుపరాక్రమంతో నాతో యుద్ధం చేస్తున్నావను కొంటున్నాను. కోపించిన నన్ను యుద్ధంలో ఎదిరించాలంటే సాక్షాత్తు ఇంద్రుడైనా కావాలి, లేదా అర్జునుడయినా కావాలి. అంతేకాని మరొకనికి సాధ్యంకాదు." ఇలా అంటున్న కర్ణునితో అర్జునుడిలా అన్నాడు. "కర్ణా! ధనుర్వేత్త, ప్రతాపవంతుడూ అయిన పరశురాముడిని కాను. యుద్ధంలో శ్రేష్ఠుడనై శస్త్రాలు తెలిసిన బ్రాహ్మణుడను. బ్రహ్మాస్త్రం, ఐంద్రాస్త్రం, నిష్ఠగా గురూపదేశంతో పొందాను. నిన్ను జయించడానికి యుద్ధంలో నిలిచాను. వీరా! స్థిరపడు." అర్జునుడు ఇలా అనగానే కర్ణుడు "బ్రాహ్మతేజస్సు జయింపశక్యం కాని"దని భావించి, యుద్ధం నుండి వెనుదిరిగాడు.

మరోచోట వీరులయిన శల్య భీమసేనులు తలపడ్డారు. ఇద్దరూ బలవంతులు. యుద్ధం బాగా తెలిసినవారు. విద్యా, బలమూ రెండూ పుష్కలంగా కలవారు. వారిద్దరూ ఒకరినొకరు ఆహ్వానించుకొని మదపుటేనుగులవలె తలపడ్డారు. పిడికిళ్లతో, మోకాళ్లతో ఒకరినొకరు పొడుచుకొంటూ, లాక్కుంటూ, విసురుకుంటూ, త్రోసుకుంటూ, పీక్కుంటూ యుద్ధం చేస్తున్నారు. ఒకరినొకరు లాక్కున్నారు-పిడికిళ్లతో పొడుచుకొన్నారు - దానితో భయంకరంగా ఛట్‌ఛట్‌మని ధ్వని వస్తోంది. పెద్ద బండరాయి పడినంత దెబ్బలతో పరస్పరం కొట్టుకొన్నారు. అలా కొంతసేపు ఒకరినొకరు కొట్టుకొన్నారు. అంతలో భీముడు చేతులతో శల్యుని ఎత్తిపట్టి నేలమీద కొట్టాడు. బ్రాహ్మణులంతా నవ్వుకొన్నారు. ఇందులో ఆశ్చర్యమేమంటే-పురుషశ్రేష్ఠుడయిన భీముడు బలిష్ఠుడయిన శల్యుని నేలకు కొట్టాడే కాని చంపలేదు. భీమసేనుడు శల్యుని నేలకు కొట్టేసరికి శల్యునికీ, కర్ణునికీ, అనుమానం కలిగింది. శంకించిన రాజులంతా భీముని చుట్టుముట్టారు. అందరూ కలిసి ఇలా అన్నారు- "ఈ విప్రోత్తములిద్దరూ సాధువులు. వీరు ఎవరిపుత్రులో, ఎక్కడ ఉంటారో తెలుసుకోండి. పరశురాముడు, ద్రోణుడూ, అర్జునుడూ తప్ప ఎవరయినా యుద్ధంలో కర్ణునిఎదిరించగలరా? కృష్ణుడు, కృపుడు తప్ప దుర్యోధనుని ఎదుట యుద్ధంలో నిలవగల వాడెవడు? బలవంతులలో ఉత్తముడయిన మద్రరాజు శల్యుని యుద్ధంలో పడగొట్టడానికి బలరాముడో, భీముడో, దుర్యోధనుడో కావాలి. ఇతరులకు సాధ్యంకాదు. బ్రాహ్మణులతో యుద్ధం ముగించండి. అపరాధం చేసినా బ్రాహ్మణులు నిత్యమూ రక్షింపదగినవారు. అందుచేత ముందు వారిని ప్రసన్నులను చేసికొని మళ్లీ కావాలంటే వారితో సంతోషంగా

యుద్ధం చేద్దాం." అలా అంటున్న రాజులను మిగిలిన వారందరినీ చూసి, యుద్ధంలో వారి పరాక్రమాన్నీ చూసి భీమార్జునులు ప్రసన్న లయ్యారు.

భీముని అద్భుతకృత్యం చూసి వారిద్దరినీ కుంతీసుతులని ఊహిస్తున్న కృష్ణుడు ఆ రాజులను "ధర్మపూర్వకంగా లభించింది ఆమె" అని అనునయించి యుద్ధం నివారించాడు. ఇలా నివారింపబడిన యుద్ధవిశారదులైన రాజులు ఆశ్చర్యంతో తమతమ నివాసాలకు వెళ్లారు. "బ్రహ్మోత్తరంగా రంగం సమాప్తమయింది (బ్రాహ్మణప్రధానంగా). ద్రౌపది బ్రాహ్మణులచేత వరింపబడింది" అని అక్కడకు వచ్చిన వారంతా చెప్పుకొంటూ వెళ్లారు. రౌరవాజినాలు దాల్చిన బ్రాహ్మణులతో పరివేష్టింపబడి భీమార్జునులిరువురూ కష్టంమీద వెళ్లారు. జనసమ్మర్దం నుండి విముక్తులై, శత్రువులు చూస్తూ ఉండగా ఆ భీమార్జును లిరువురూ ద్రౌపదిని వెంట తీసుకొని వెళ్లారు. అపుడు వారిద్దరూ పూర్ణిమనాడు మేఘాలనుండి విడవడి ఉదయించిన చంద్రసూర్యుల్లా శోభించారు. కాని వారితల్లి భిక్షాకాల మయినా పుత్రులు రాకపోయేసరికి కీడును శంకిస్తూ పరిపరివిధాల చింతించింది. కౌరవులు వీరిని తెలుసుకొని చంపివేయలేదుకదా! మాయావు లయిన రాక్షసులు చంపలేదుకదా! మహాత్ముడైన వ్యాసుని మాటలు కూడా విపరీతా లయ్యాయా?" కొడుకుల మీది ప్రేమతో అలా అనుకొంటోంది. మేఘాలతో నిండిన దుర్దినం లాగా ప్రజలంతా సద్దుమణిగి నిద్రపోసాగారు. అపుడు మధ్యాహ్న మేఘాలతో ఆవరింపబడిన సూర్యునివలె బ్రాహ్మణులతో పరివృతుడై, అర్జునుడు కుమ్మరియింటిలో ప్రవేశించాడు.

190. ద్రౌపదిని అయిదుగురు వివాహమాడుటను గురించిన సమాలోచనము.

మహానుభావులూ, నరోత్తములూ అయిన భీమార్జునులు కుమ్మరియింటికి వెళ్లి తల్లితో "అమ్మా ! భిక్ష తెచ్చాం" అన్నారు. కుటీరంలో ఉన్న కుంతి కొడుకులను చూడకుండానే "అందరూ కలిసి భుజించండి" అంది. వెంటనే ద్రౌపదిని చూసి "అయ్యో ఇలా అన్నానేమిటి?" అని బాధపడింది. పరమప్రఖ్యాతి వహించిన ద్రౌపది యొక్క చెయ్యి పట్టుకొని, కుంతి ధర్మలోపభయంతో చింతిస్తూ ధర్మరాజుతో ఇలా అంది. "ఈమె ద్రుపదమహారాజు యొక్క కుమార్తె. నీ తమ్ములు నాదగ్గరకు తీసుకొని వచ్చి 'భిక్ష తెచ్చా'మన్నారు- వెంటనే నేను "కలిసి భుజించండి" అన్నాను ప్రమాదపడి. కురువంశోత్తమా! నేను మాట్లాడినది సత్యంగా ఎలా అవుతుంది! పాంచాలరాజు కుమార్తె దరిదాపులకు అధర్మం ఎలా రాకుండా ఉంటుంది? అధర్మవిలాసాలు ఆమెను పొందకుండా ఎలా ఉంటాయి?"

వైశంపాయనుడు చెపుతున్నాడు. కుంతి ఇలా అనేసరికి తెలివైన ధర్మరాజు కొద్దిసేపు ఆలోచించి కుంతిని ఊరడించి అర్జునునితో ఇలా అన్నాడు. "అర్జునా! యాజ్ఞసేనిని నీవు జయించుకొన్నావు. నీతోనే రాజకుమారి శోభిస్తుంది. అగ్నిహోత్రం చేసి ఆమెను శాస్త్రోక్తంగా పాణిగ్రహణం చేసుకో." అపుడు అర్జునుడు రాజా! నన్ను అధర్మాచరణపరుని చేయకు. పెద్దలు ఎవరూ చేయలేదీ అధర్మం. ముందుగా నీవు వివాహం చేసుకోవాలి. తరువాత ఈ అద్భుతపరాక్రము డయిన భీముడు చేసుకోవాలి. తరువాత నేను. నాతరువాత నకులుడు- ఆ తరువాత చురుకైన సహదేవుడు చేసుకోవాలి. భీముడు, నేను, నకుల సహదేవులూ, ఈ రాజకుమారి అంతా నీ ఆజ్ఞావర్తులమే. ఇపుడు చేయదగిన ధర్మమేదో, ఏది యశస్కరమో ఆలోచించి చెయ్యి. పాంచాల రాజుకు హితమైనది చెయ్యి. మేమంతా నీకు వశులమై ఉన్నాం. ఆజ్ఞాపించు."

భక్తి స్నేహాలతో కూడిన అర్జునుని మాట విని పాండవులందరూ పాంచాలి మీద దృష్టులు నిలిపారు. పాండవులంతా యశస్వినీ అయిన ద్రౌపదిని చూస్తూ తమ హృదయాల్లో ఆమెను ధరించారు. అమిత తేజస్వులయిన పాండవులంతా ఆమెను చూస్తుంటే వారి ఇంద్రియా లన్నింటినీ మథిస్తూ వారి హృదయాల్లో మన్మథుడు ఉద్భవించాడు. విధాత స్వయంగా పాంచాలి రూపాన్ని కోరదగినట్లుగానూ, ఇతర స్త్రీలకంటె అధికంగానూ, సర్వప్రాణుల మనస్సులనూ హరించేదిగానూ సృష్టించాడు. తమ్ముళ్ల ఆకారాన్ని, మనసులనూ ఎరిగిన ధర్మరాజు వ్యాసమహర్షి మాటలన్నిటినీ తలచుకొన్నాడు. తమలో తమకు పరస్పరం భేదం వస్తుందనే భయంతో "ఈ కల్యాణి ద్రౌపది మన అందరికీ భార్య అవుతుంది" అన్నాడు.

పెద్ద అన్నగారి మాట విని పాండవులంతా ఆ విషయాన్నే భావిస్తూ ఉదారహృదయంతో మిన్నకుండిపోయారు. వృష్ణి వీరుడయిన కృష్ణుడు బలరామునితో సహా పాండవులను పలుకరించటానికి పాండవులున్న కుమ్మరి యింటికి వెళ్లాడు. అక్కడకు వెళ్లి కృష్ణబలరాములు ఆజానుబాహువయిన ధర్మరాజును అతని చుట్టూరా అగ్నిహోత్రాలవలె ప్రకాశిస్తున్న మిగిలిన పాండవులనూ చూశారు. కృష్ణుడు వెళ్లి ధార్మికోత్తముడూ, అజమీఢ వంశజుడూ అయిన ధర్మరాజు పాదాలు పట్టుకొని "కృష్ణుణ్ణి నేను" అని నమస్కరించాడు. బలరాముడు కూడ వెళ్లి తనపేరు చెప్పుకొని ధర్మరాజును అభినందించాడు. వారిద్దరినీ పాండవులూ సంతోషంతో అభినందించారు. బలరామకృష్ణులిద్దరూ తమ మేనత్త కుంతీదేవికి పాదాభివందనం చేశారు. అజాతశత్రువైన ధర్మరాజు కృష్ణుని చూసి కుశలమడిగి వెంటనే "కృష్ణా! ప్రచ్ఛన్నంగా నివసిస్తున్నమేము నీకు ఎలా తెలిశాము?" అని అడిగాడు. కృష్ణుడు చిరునవ్వి నవ్వి

"రాజా! గూఢంగా ఉన్నా అగ్ని తెలుస్తూనే ఉంటుంది. అంతటి పరాక్రమం పాండవులను మించి మానవులు ఎవరిలో ఉంటుంది? అదృష్టవశాత్తు శత్రువులను సహించగల మీరంతా భయంకరమైన లాక్షాగృహం మంటలనుండి తప్పించుకొన్నారు. అమాత్యునితో కూడిన పాపి అయిన దుర్యోధనుని కోరిక అదృష్టవశాత్తు తీరలేదు. మా అంతరంగంలో నింపుకున్న మీకందరికీ కల్యాణమగుగాక. అగ్నిహోత్రాల వలె వృద్ధిపొందుతూ వ్యాపించండి. ఇపుడు ఏ రాజులూ మిమ్మల్ని గుర్తుపట్టలేదు. ఇక మేము శిబిరానికి వెడతాము. అంటూ కృష్ణుడు ధర్మరాజు యొక్క అనుజ్ఞ తీసికొని బలరామునితో సహా వెంటనే వెళ్లిపోయాడు.

191. పాండవు లెరుంగకుండ ధృష్టద్యుమ్నుడు వారిని పరిశీలించుట.

కుమ్మరి ఇంటికి వెడుతున్న భీమార్జునులను ధృష్టద్యుమ్నుడు వెనుకనుండి అనుసరించి వెళ్లాడు. (భీమార్జునులకు) తెలియకుండా చాలామంది సేవకులను అంతటా పెట్టి ధృష్టద్యుమ్నుడు తాను భార్గవుని ఇంటి దగ్గర అజ్ఞాతంగా ఉన్నాడు. సాయంకాలం అయ్యాక భీమార్జునులూ, నకులసహదేవులూ భిక్షాటనం చేసికొని వచ్చి ధర్మరాజుకు నివేదించారు. అపుడు కుంతి ద్రౌపదితో ఇలా అంది. "ముందు నీవా అన్నం తీసికొని ఒక భాగం దేవతలకు బలిగా నివేదించు. మరొక భాగం విప్రులకు భిక్షగా పెట్టు. అన్నంకోసం మన చుట్టూ ఆశ్రయించుకొని ఉన్నవారికి కొంత భాగం పెట్టు. మిగిలిన దానిలో సగం ఒక ప్రక్క పెట్టు. ఇంకా మిగిలిన సగం ఆరుభాగాలు చెయ్యి. నాలుగుభాగాలు కొడుకులకూ, నాకు ఒకటి, నీకు ఒకటి మొత్తం ఆరు. మొదటచేసిన సగభాగం- అడుగో ఏనుగులా, వృషభంలా తెల్లగా పెద్దశరీరంతో ఉన్న యువకుడు ఉన్నాడే వాడు కాస్త ఎక్కువ తినగలడు. వాడికి పెట్టు." ద్రౌపది ఆ మాటలు విని ఏమీ శంకించకుండా సంతోషంతో ఆమె చెప్పినట్లు అక్షరాలా చేసింది. ఆ అన్నం వారంతా భుజించారు. భోజనానంతరం మాద్రి కొడుకు సహదేవుడు నేలమీద దర్భలతో శయనం ఏర్పాటు చేసేశాడు. వాటిపై వీరులంతా తమతమ కృష్ణాజినాలు పరుచుకొని నేలమీద పడుకొన్నారు. పాండవులంతా దక్షిణ దిక్కుకి తలపెట్టి పండుకొన్నారు. వారి తలల దగ్గర కుంతి, పాదాల దగ్గర ద్రౌపది పండుకొన్నారు. ద్రౌపది పాండవుల కాలిదిండులాగా నేలమీద పరిచిన దర్భలపై పరుండినది. అపుడు అది ఆమె మనసుకు ఏమాత్రం కష్టం అనిపించలేదు. పాండవులను ఆమె కించిత్తు కూడ తిరస్కరించలేదు.

అక్కడ పండుకొని పాండవులు, సేనాధికారులనుగూర్చి, దివ్యాస్త్రాలగురించి, రథాలు ఏనుగులు ఖడ్గాలు గదలు, పరశ్వధాలు మొదలయిన వాటిని గురించి విచిత్రమయిన

కథలు చెప్పుకొన్నారు. వారు చెప్పుకొన్న కథలన్నీ పాంచాలమహారాజపుత్రి అయిన ద్రౌపది విం‌ది-అక్కడ ఉన్న మనుష్యులంతా అలా నేలపై పడుకొన్న ద్రౌపదిని చూశారు. రాజకుమారుడయిన ధృష్టద్యుమ్నుడు వారు రాత్రి చెప్పుకొన్నదంతా విని మహారాజు ద్రుపదునికి చెప్పాలని త్వరగా తండ్రి దగ్గరకు వెళ్లాడు. ద్రుపదుడు విషాదంతో వారు పాండవులని తెలియక ధృష్టద్యుమ్నుని ఇలా అడిగాడు-"ద్రౌపది ఎక్కడకి వెళ్లింది? ఎవరు తీసుకు వెళ్లారు? నాపుత్రిని శూద్రుడు గ్రహించలేదుకదా! హీనకులజుడు గ్రహించలేదు కదా! కప్పం కట్టే వైశ్యుడు గ్రహించలేదుకదా! నానెత్తిమీద బురదపాదం ఎవడూ పెట్టలేదుకదా! పూలమాల శ్మశానంలో పడలేదు కదా! నాపుత్రికను నావర్ణం వాడే గ్రహించాడా? లేక అగ్రవర్ణం వాడు గ్రహించాడా? ద్రౌపదిని గ్రహించి హీనవర్ణస్థుడు ఎవడూ నానెత్తిని తనపాదం పెట్టలేదుకదా! ప్రసిద్ధ డయిన నరోత్తముడు అర్జుననుకు పిల్లనివ్వకుండా ఇలా ఎవడయినా పరితపిస్తాడా? నిజం చెప్పు-నాపుత్రికను గెల్చుకొన్నవాడెవడు? విచిత్రవీర్యపుత్రు డయిన పాండురాజు యొక్క కొడుకులు బ్రతికి ఉన్నారా? ఈ రోజు పాండుని చిన్నకొడుకు అర్జునుడే ధనుస్సు పట్టి లక్ష్యం భేదించాడంటావా?"

192. ద్రుపదపురోహితుడు యుధిష్ఠిరాదులను కలియుట.

ద్రుపదమహారాజు పలికిన మాటలు విని ధృష్టద్యుమ్నుడు పరమానందపడి 'ద్రౌపదిని చేపట్టినవారెవరు'? మొదలైన వృత్తాంతమంతా చెప్పనారంభించాడు. ధృష్టద్యుమ్నుడిలా అన్నాడు.' వింటినెక్కు పెట్టి లక్ష్యాన్ని నేలపడగొట్టిన ఆ యువకుడు విశాలనేత్రుడు. కృష్ణాజినాన్ని ధరించాడు. దేవతలతో సమానమైన రూపం గలవాడు. ఆ వీరుడు ఇతరులతో ఎవ్వరితోనూ కలియక బ్రాహ్మణశ్రేష్ఠులు చుట్టు ముట్టి అభినందిస్తూ ఉండగా సర్వదేవతల, మహర్షుల మధ్యలో నిలిచిన దేవేంద్రుని వలె కనిపిస్తూ వేగంగా నిష్క్రమించాడు. అప్పుడు ద్రౌపది మిక్కిలి ప్రసన్నురాలై గజరాజును అనుసరించే హస్తినివలె వారి ననుసరించింది. సహించలేని రాజులందరూ కోపించి నాలుగువైపుల నుంచి వారిని ముట్టడించారు. వారిలో రెండవవాడైన వీరుడు పెద్దచెట్టును పెఱికి, రాజమండలంలోనికి దుమికి, యముడు కోపంతో సమస్తప్రాణులను సంహరించేటట్లు ఆ రాజసమూహాలన్నింటిని యముని వద్దకు పంపసాగాడు. చంద్రసూర్యులవలె ప్రకాశిస్తున్న వారిరువురూ నరశ్రేష్ఠులు. వారు రాజులందరూ చూస్తూ ఉండగానే ద్రౌపదితో కలిసి నగరానికి వెలుపల ఉండే కుమ్మరి వాని యింటిలోనికి ప్రవేశించారు. ఆ ఇంటిలో అగ్నిశిఖతో సమంగా వెలుగుతున్న ఒక స్త్రీ కూర్చుని ఉన్నది.

బహుశః ఆమె ఆ వీరుల తల్లి కావచ్చు. ఆమె సమీపంలో అగ్ని జ్వాలవలె ప్రకాశించే ముగ్గురు వీరపురుషులు కూర్చొని ఉన్నారు. వారిద్దరు వీరులూ స్వయంగా తల్లిపాదపద్మాలకు నమస్కరించి, ద్రౌపదిని నమస్కరింపమని ఆజ్ఞాపించారు. నమస్కరించిన పిమ్మట ద్రౌపదిని తల్లికి అప్పగించి వారు భిక్షాటనకు వెళ్ళిపోయారు. వారు భిక్షాటనం ముగించి తిరిగివచ్చిన తర్వాత ద్రౌపది ఆ భిక్షాన్నాన్ని వారితల్లి ఆజ్ఞానుసారం దేవతలకు బలిగా, బ్రాహ్మణులకు తృప్తిగా నిచ్చి, వారి తల్లికి, వారికి ప్రత్యేకంగా వడ్డించి చివరగా తానూ తిన్నది.

రాజా! భోజనమయినపిమ్మట వారందరు నిద్రించసాగారు. ద్రౌపది వారి పాదాలదగ్గర నిద్రించింది. భూమిపైనే ఆమె పాన్పును ఏర్పరచుకొన్నది. క్రింద దర్భలు పఱచి, పైన లేడి చర్మాన్ని పరచుకొన్నది. వారు వర్షాకాలపు మేఘాలవలె గర్జిస్తూ మధ్యమధ్యలో చిత్రవిచిత్రాలైన కథలను చెప్పుకొంటున్నారు. అయిదుగురు వీరుల మాటలను బట్టి వారు వైశ్యులు, బ్రాహ్మణులు,శూద్రులు కారు. రాజా! వారు చేసే యుద్ధవర్ణనలను బట్టి వారు క్షత్రియపుంగవులే ! సందేహం లేదు. కుంతీపుత్రులైన పాండవులు లాక్షాగృహదహనం నుండి తప్పించుకొన్నారని వినియున్నాం గదా! పాండవులతో సంబంధం కలుపుకొన వలెననే మనకోరిక తప్పక సఫలం కాగల దనిపిస్తోంది. బలంగా నారి బిగించి ధనుస్సు సిద్ధం కావింపబడిన తీరూ, దుర్భేద్యమైన లక్ష్యం భేదింపబడిన తీరూ చూస్తే, వారి మాటలను బట్టి, కుంతీపుత్రులైన పాండవులు బ్రాహ్మణవేషాలలో దాగిఉన్నారని నిశ్చయమవుతోంది." ఈ సమాచారం విని ద్రుపదుడు ప్రసన్నుడై వారిని గురించి తెలుసుకోవాలని "మీరు పాండుపుత్రులైన పాండవులేనా" అని అడిగి రమ్మని తన పురోహితుని పంపాడు.

రాజాజ్ఞననుసరించి ద్రుపదపురోహితుడు వారివద్దకు పోయి వారి గుణగానం చేసి రాజైన ద్రుపదుని మాటగా ఒక్కొక్కరిని క్రమంగా పలుకరించి ఇలా అన్నాడు. "వీరులారా! వరాలనివ్వగల పాంచాలరాజైన ద్రుపదుడు మీ పరిచయాన్ని కోరుతున్నాడు. లక్ష్యాన్ని అవలీలగా ఛేదించగల వీరపురుషుని చూచి హద్దులేని ఆనందాన్ని పొందాడు. మీరు మీజాతిని, కులాన్ని తెలపండి. శత్రురాజుల శిరస్సులపై కాలుమోపండి. నాహృదయాన్ని, అనుచరులతోకూడిన ద్రుపదమహారాజు హృదయాన్ని ఆనందసంభరితం చేయండి. పాండుమహారాజు ద్రుపదునికి ఇష్టసఖుడు, ప్రాణసముడు. పాండు మహారాజునకు ప్రియమైన కోడలిగా తన పుత్రికను సమకూర్చాలని ఆ ద్రుపదుని చిరకాలవాంఛ. సర్వాంగసుందరులారా! మహారాజైన ద్రుపదుని హృదయంలో "పొడవైన, బలమైన చేతులుగల అర్జునుడు నాకుమార్తె

ద్రౌపదిని ధర్మపురస్సరంగా వివాహమాడునుగాక" అన్న కోరిక చిరకాలం నుండి ఉన్నది. 'నాకోరిక తీరితే నాపూర్వశుభకర్మల ఫలితాన్ని నేను పొందినట్లే' అని ద్రుపదుని భావన. ఇది తనకు కీర్తిని, పుణ్యాన్ని, మేలును కలుగజేస్తుంది." ద్రుపదపురోహితుని మాటలను విని అతనిని వినయశీలునిగా గుర్తించి యుధిష్ఠిరుడు 'వీరు ద్రుపదుని పురోహితులూ, మాననీయులు. కాబట్టి ఈయనకు ఆదరసత్కారాలు విశేషంగా జరపాలి;' అంటూ అర్ఘ్యపాద్యాలు సమర్పించవలసినదిగ దగ్గరనే ఉన్న భీముని ఆదేశించాడు. రాజా! వెంటనే భీమసేనుడు అర్ఘ్యపాద్యాదులు ద్రుపద పురోహితున కిచ్చి, అర్చించాడు. ఆ పురోహితుడు ఆనందంగా దానిని స్వీకరించి, సుఖంగా కూర్చున్న తరువాత యుధిష్ఠిరుడు ఆ బ్రాహ్మణునితో ఇలా అన్నాడు.

'పాంచాలరాజైన ద్రుపదుడు తనకోరికననుసరించి ఈ కన్యక నీయలేదు. లక్ష్యాన్ని భేదించినవానికే కన్యనిస్తానని శుల్కాన్నికూడా నిశ్చయించాడు. ఈ వరపురుషుడు నియమానుసారం లక్ష్యాన్ని భేదించి ఈ కన్యను పొందాడు. రాజు ఆవిషయంలో వర్ణ, శీల, గోత్ర వివక్షను పాటించలేదు. వింటిని ఎక్కుపెట్టి లక్ష్యాన్ని ఛేదించినవానికే కన్య నిస్తా నన్నాడు. ఆ విధంగా రాజులసమక్షంలో ఈ మహనీయుడు ద్రౌపదిని గెలుచుకొన్నాడు. ఈ స్థితిలో మీరాజు బాధపడవలసినదో, కష్టపడవలసినదో ఏదీలేదు. ద్రుపదుని మనస్సులో ఉన్న కోరిక కూడా ఇప్పుడు సిద్ధిస్తుంది. ఈ రాజకన్యకను పొంది అన్నివిధాలుగా మేము యోగ్యులమూ, ఉత్తములమూ కాగలగటం వాస్తవం. బలహీనుడు ఆ ధనుసుకు వింటినారిని తొడగలేడు. అస్త్రవిద్యాబలం పూర్తిగా లేనివాడు, హీనవంశంలో పుట్టినవాడు ఆ విధంగా లక్ష్యాన్ని-(మత్స్యాన్ని)- పడగొట్టగలగటం అసాధ్యం. కావున పాంచాలరాజునకు తనకుమార్తె విషయంలో చింతించటం యుక్తంకాదు. అలా జరగకుంటే ఈ లోకంలో మరే నరుడూ ఆ లక్ష్యాన్ని ఛేదించలేడు.' యుధిష్ఠిరు డిలా ద్రుపదపురోహితునితో మాట్లాడుతూ ఉండగానే పాంచాలరాజైన ద్రుపదుని వేరొక దూత అక్కడకు వచ్చాడు. ద్రుపదమహారాజు మీకొరకు విందును సిద్ధంచేసినా డని అతడు విన్నవించాడు.

193. పాండవులు, కుంతి ద్రుపదునిచే సమ్మానితులగుట - వారి శీలపరీక్ష.

దూత చెప్పాడు. 'ద్రుపదమహారాజు వివాహనిమిత్తంగా జ్ఞాతులకు విందుచేయటానికి భోజనం సిద్ధంచేశాడు. మీరు కూడా పనులు ముగించుకొని దయచేయండి. ద్రౌపదిని కూడా శాస్త్రోక్తంగా అక్కడే పొందవచ్చు. ఆలస్యం చేయవద్దు. ఈ రథాలు బంగారుకమలాల

చిత్రాలు గలవి. శ్రేష్ఠాశ్వాలు పూన్చబడి, రాజశ్రేష్ఠుల కర్హాలై ఉన్నాయి. మీరందరూ కలసి వీటినధిరోహించి ఆద్రుపదుని రాజమందిరంలోనికి ప్రవేశించండి, ఆ కురుశ్రేష్ఠులు ద్రుపదపురోహితుని బయలుదేరతీసి విశాలమైన రథాలపైన అధిష్ఠించి రాజభవనానికి బయలుదేరారు. అప్పుడు కుంతి, ద్రౌపది ఒకే రథంలో కూర్చున్నారు. ద్రుపదుడు, ధర్మరాజు పురోహితునితో పల్కినమాటలను పురోహితుని ద్వారా విని కురుశ్రేష్ఠులను, వారి స్వభావంద్వారా గ్రహించాలని అనేకవిధాలైన వస్తుసామగ్రిని తెప్పించాడు. రాజా! వివిధ ఫలాలు, సుందరంగా కూర్చినమాలలు, కవచాలు, డాలులు, ఆసనాలు, గోవులు, త్రాళ్ళు, వ్యవసాయాని కుపయోగించే గింజలు, వివిధకర్మల నిమిత్తమైన వస్తువులు సమకూర్చాడు. క్రీడల కొరకుపయోగించే క్రీడాసామగ్రిని పూర్తిగా తెప్పించి అక్కడ సిద్ధపరిచాడు. రెండవవైపున కవచాలు, మెరిసిపోయే డాళ్ళు, కత్తులు, పెద్దపెద్ద విచిత్రరథాలు, గుఱ్ఱాలు, శ్రేష్ఠమైన విచిత్రాలైన బాణాలు, సువర్ణభూషితాలైన శక్త్యాయుధాలు, ఋష్టులు, ప్రాసాలు, వేల్చేసామగ్రులు, పరశ్వథాలు, యుద్ధసామగ్రి, ఉత్తమాసనాలు, పాన్పులు, చాలారకాల వస్త్రాలు అన్నీ ఏర్పాటుచేశాడు.

కుంతీదేవి సాధ్వియైన ద్రౌపదిని తీసికొని ద్రుపదుని అంతఃపురంలో ప్రవేశించింది. అక్కడి ఉదారమనస్కులైన స్త్రీలు కౌరవరాజపత్ని కుంతిని ఆదరసత్కారాలతో అర్చించారు. రాజా! సింహగమనం, ఋషభనేత్రాలు, నల్లలేడి చర్మాలు, బలిష్ఠమైన ఎగుబుజాలు, పాముపడగలవంటి బాహువులు గల ఆ పురుషోత్తములను చూచి ద్రుపదుడు, అతని మంత్రులు, పుత్రులు, స్నేహితులు, సేవకులు, అందరూ మిక్కిలి సంతసించారు. వీరులైన పాండవులు పాదపీఠాలతో కూడిన ఆసనాలపై సందేహింపక, మనస్సునందు ఆశ్చర్యాన్ని పొందకుండా కూర్చున్నారు. సుందరవేషధారులై వంటయింటి పరిచారకులు, పరిచారికలు, బంగారుపాత్రలలో బహువిధాలైన భోజనసామగ్రిని తెచ్చి వడ్డించారు. రాజా! వీరశ్రేష్ఠులైన పాండవులు తమతమ ఆసక్తికనుగుణంగా భోజనపదార్థాలను తిని ప్రసన్నులై భోగసామగ్రి కాదని, యుద్ధసామగ్రి కల ప్రదేశానికి చేరారు. మహారాజా! అది గుర్తించిన ద్రుపదుడు, ధృష్టద్యుమ్నుడు, మంత్రులు అందరు ప్రసన్నులయ్యారు. వారి వద్దకు చేరి కుంతీపుత్రులైన వారిని రాజకుమారులుగా భావించారు.

194. ద్రుపద యుధిష్ఠిర సంవాదము, వ్యాసాగమనము.

భోజనాలైన పిదప ద్రుపదుడు తేజస్వి అయిన ధర్మజుని పిలిచి బ్రాహ్మణోచితసత్కారాలతో సమ్మానించి తనవానిగా చేసికొని ఇలా అడిగాడు-"మిమ్ము

నేనెలా తెలిసికొనగలను? మీరు బ్రాహ్మణులా, క్షత్రియులా, గుణసంపన్నులైన వైశ్యులా, శూద్రులా? లేక మాయనాశ్రయించి విప్రరూపంలో అన్ని దిక్కులా సంచరిస్తున్న వారా? ద్రౌపది కారణంగా భూలోక సందర్శనార్థులై వచ్చిన దేవతలా? మీరు సత్యాన్ని చెప్పండి. మీవిషయంలో నాకు పెద్ద సందేహం కలిగింది. మీనుంచి ఈ రహస్యాన్ని విన్నప్పుడు నా మనస్సు తేలికపడుతుంది. మాకు దీనివలన భాగ్యోదయం కావాలి. మీరు స్వేచ్ఛగా సత్యం చెప్పండి. రాజులకు ఇష్టా పూర్తాలకంటే సత్యమే మహిమగలది. కాబట్టి సత్యాన్నే పలుకు. అసత్యం పలుకవద్దు. తేజస్వీ! నీమాటలను విని నిశ్చయంగా విధిపూర్వకంగా వివాహం చేయటానికి సిద్ధపడతాను." యుధిష్ఠిరుడు అన్నాడు - "నీవు కలవరపడవద్దు. ప్రసన్నుడవు కమ్ము. నీమనసులో కోరిక నేడు తీరినదనుకో. ఇది సత్యం. ద్రుపదమహారాజా! మేము క్షత్రియులం. పాండుపుత్రులం. నన్ను జ్యేష్ఠుడైన ధర్మజునిగా తెలుసుకో. వీరు భీమసేనార్జునులు. రాజా! వీరే నీకుమార్తెను రాజసభలో జయించారు. వారు నకులసహదేవులు. ద్రౌపదికి దగ్గరగా ఉన్నది మాతల్లి కుంతి. నరశ్రేష్ఠా! నీమానసిక చింత తొలగునుగాక! మేము క్షత్రియులం. తామరతీగవలె నీకుమార్తె ఒక సరస్సు నుండి మరో సరస్సుకు చేరిన దనుకో. మహారాజా! జరిగినదంతా యథాతథంగా మీకు చెప్తున్నాను. మీరే మాకు పెద్దలు, ఆశ్రయింపదగినవారు కూడా."

యుధిష్ఠిరుని మాటలు విన్న ద్రుపదుని కన్నులనుండి ఆనందాశ్రువులు రాలాయి. అతడు ఆనందంలో మునిగి వెంటనే ధర్మజునకు సమాధానమియలేకపోయాడు. ద్రుపదుడు ప్రయత్నపూర్వకంగా సంతోషాన్ని నిలువరించుకొని యుధిష్ఠిరునికి అతని మాటలకు అనుగుణంగా బదులిచ్చాడు. తిరిగి ద్రుపదుడు "మీరెట్లు ఆ నగరం నుండి తప్పించుకొన్నారు" అని అడిగాడు. ధర్మజుడాతనికి క్రమంగా సర్వవృత్తాంతాన్నీ వివరించాడు. ద్రుపదుడు కుంతీపుత్రునిమాటలు పూర్తిగా విని ధృతరాష్ట్రమహారాజును అప్పుడు మిక్కిలిగా నిందించాడు. అదేసమయంలో ద్రుపదుడు ధర్మజుని ఊరడించి, రాజ్యాన్ని సాధించటంలో సహాయపడగలమని ప్రతిజ్ఞచేశాడు. రాజా! కుంతి, ద్రౌపది, భీమసేనార్జునులు, నకులసహదేవులు ద్రుపదుడు నిర్దేశించిన గొప్పభవనంలో ప్రవేశించారు. యజ్ఞసేనుడు(ద్రుపదుడు) వారిని సన్మానించాడు. ఈవిధంగా పాండవులపై విశ్వాసాన్ని ప్రకటించి ద్రుపదుడు కుమారులతో కలిసివచ్చి ధర్మరాజుతో ఇలా అన్నాడు. "కురువంశ నందనుడూ, మహాబాహువూ అయిన అర్జునుడు నేడు పుణ్యదినమున నాకుమార్తెను శాస్త్రోక్తవిధానంతో పరిణయమాడాలి. మా కులోచితమైన ఈ ఉత్సవం ప్రారంభం కావాలి." ధర్మాత్ముడైన యుధిష్ఠిరుడు ద్రుపదునితో ఇలా అన్నాడు. "నరేశ్వరా! నాకూ పెండ్లి కావలసిఉన్నది." ద్రుపదుడిలా అన్నాడు! "అట్లైన

నీవు నాకుమార్తెను విధి ప్రకారం వివాహం చేసికో. లేకపోతే నీతమ్ములలో ఎవరినైనా వివాహానికి నియోగించు."

యుధిష్ఠిరుడు పలికాడు - "రాజా! ద్రౌపది మాకందరకు పట్టమహిషి కాగలదు. మా తల్లి మా అందరిని ఆ విధంగా ఆదేశించింది. నేను, భీమసేనుడు కూడ అవివాహితులమే. రత్నం వంటి నీకుమార్తెను అర్జునుడు రాజసభలో మత్స్యయంత్రాన్ని కొట్టి గెలుచుకొన్నాడు. మహారాజా! రత్నాన్ని మేమందఱం కలిసి అనుభవించటం మా నియమం. ఈ నియమాన్ని భంగపరచటానికి మేము ఇష్టపడం. కావున మాకందఱకు ద్రౌపది ధర్మబద్ధంగానే పట్టమహిషి అవుతుంది. ప్రజ్వలించే అగ్నిసాక్షిగా ఆమె మా అందఱితో పాణిగ్రహణం చేస్తుంది." ద్రుపదుడు అన్నాడు - "కురునందనా! ఒకరాజునకు చాలామంది రాణులు ఉండవచ్చు. కాని ఒక రాణికి అనేకులు భర్తలుగా ఉండటం ఎక్కడా వినబడదు. నీవు ధర్మవేత్తవు, పవిత్రుడవు. లోకవేద విరుద్ధమైన అధర్మాన్ని అంగీకరింపవు. కుంతీపుత్రా! నీబుద్ధి ఈ విధంగా ఎందుకు పెడదారిని పోతోంది?" యుధిష్ఠిరుడు చెప్పాడు - "రాజా! ధర్మం మిక్కిలి సూక్ష్మమైంది. దాని మార్గాన్ని మన మెఱుగలేము. కాని పూర్వీకుల మార్గాన్నే ఈ విషయంలో అనుసరిద్దాం. నామాట ఎన్నడూ పొల్లుపోదు, అధర్మంపైన నాబుద్ధి ఎన్నడూ నిలువదు. నాతల్లి ఈ విషయంలో ఇలాగే ఆజ్ఞాపించింది. నామనస్సుకూడ ఇదే సరియైనదని తెల్పుతోంది. రాజా! ఇది నిశ్చయంగా ధర్మమే. ఇంక ఆలోచింపక అనుసరించు. ఈ విషయంలో మీకు ఏవిధమైన సంకోచమూ వద్దు." ద్రుపదుడు - "నీవు, కుంతి, నాసుతుడైన ధృష్టద్యుమ్నుడూ కలిసి ఆలోచించి కర్తవ్యాన్ని నిర్ణయించండి. ధర్మరాజా! రేపు సరియైన సమయంలో దీని నాచరించుదాం." అన్నాడు మరునాడు వారందరు కలిసి ఈ విషయాన్ని గూర్చి మాటాడుకొనే సమయంలో అనుకోకుండా కృష్ణద్వైపాయనమహర్షి అక్కడికి వచ్చాడు.

195. వ్యాసునిఎదుట ద్రౌపదీవివాహచర్చ.

కీర్తిమంతుడైన ద్రుపదుడు,పాండవులందరు కలిసి ఎదురేగి, వ్యాసునికి భక్తిపూర్వకంగా నమస్కరించారు. వ్యాసమహర్షి వారి పూజను స్వీకరించి, ప్రసన్నుడై కుశలప్రశ్న లడిగి, పవిత్రమయిన కాంచనపీఠంపై కూర్చున్నాడు. అమితతేజస్వియైన ద్వైపాయనుని ఆజ్ఞతో నరశ్రేష్ఠులైన వారందరు విలువైన పీఠాలపై ఆసీను లయ్యారు. ఆసీను లయ్యాక కొద్ది సేపటికి ద్రుపదుడు మధురమైన కంఠస్వరంతో ద్రౌపదీభర్త విషయమై ద్వైపాయనుని

ఇలా ప్రశ్నించాడు. "మహాత్మా! భగవంతుడా! సాంకర్యదోషం లేకుండా ఒకతె చాలమందికి భార్య ఎలా కాగలదు? ఉన్నది ఉన్నట్లుగా నాకు స్పష్టంగా చెప్పండి." వ్యాసుడు అన్నాడు - "మిక్కిలి గహనమవటంచేత లోకవేదవిరుద్ధంగా కన్పట్టే ఈ విషయంలో మీ మీ అభిప్రాయాలను" వినాలనుకొంటున్నాముంది. ద్రుపదుడు చెప్పాడు- "విప్రోత్తమా! నాకిది ఆధర్మమనిపిస్తోంది. అంతేగాక ఇది లోక వేదాలకూ విరుద్ధం. చాలమంది పురుషులకు ఒకతే భార్యకావటం లోకంలో ఉండదు. పూర్వులైన మహాత్ము లీ ధర్మాన్ని పాటించలేదు. విద్వాంసులైన పురుషులు ఇటువంటి అధర్మాన్ని ఎప్పుడూ ఆచరించరాదు. అందువలన లోకవిరుద్ధమైన ఈపనిని నేను ఆచరించను. ఈ ధర్మం ఎప్పుడూ సందేహాస్పదమే అని నాకనిపిస్తోంది." ధృష్టద్యుమ్నుడు అన్నాడు "తపోధనా! మీరు బ్రాహ్మణులు. మీరే ఈ సంశయాన్ని తీర్చగలరు. సదాచారవంతుడైన జ్యేష్ఠసోదరుడు తమ్ముని భార్యయందెట్లు ప్రవర్తింపగలడు? ధర్మస్వరూపమే అత్యంతసూక్ష్మం. దాని గతిని ఎవరూ తెలుసుకోలేరు. మా వంటివారికి ధర్మాధర్మనిశ్చయం అశక్యం. అందువలన మేము ఇటువంటి వ్యవహారాలను అనుమతింపలేము. ద్రౌపది అయిదుగురికి భార్య కావటం ఏ విధంగానూ కుదరదు." యుధిష్ఠిరుడు చెప్పాడు - "నామాటలెన్నడూ అసత్యాలు కావు. అధర్మంపై నాబుద్ధి ప్రవర్తించదు. ఈ వివాహాన్ని నామనస్సు అంగీకరిస్తోంది. కాబట్టి ఇది ఎన్నడును అధర్మంకాదు. పురాణాలలో జటిల అనే గౌతమగోత్రకన్య ఏడుగురు ఋషులను వివాహం చేసికొన్నది. అట్లే కండుమహర్షి పుత్రికయైన వార్షి తపస్సులచే పవిత్రాలైన అంతఃకరణాలు కల ప్రచేతసుని పుత్రులను ఒకేపేరుగల వారిని పదిమందిని వివాహమాడింది. గురుజనుల ఆజ్ఞ ధిక్కరింప వీలుకానిది. ధర్మబద్ధమైనది. సమస్త గురుజనులలో తల్లియే ఉత్కృష్టమైన గురువు. అట్టి మాతల్లి మీరందరు ఈమెను భిక్షవలె అనుభవించం డని పల్కింది. కావున మా అయిదుగురితో ఈ ద్రౌపది వివాహం ధర్మయుక్తమే." కుంతి పలికింది - "ధర్మాచరణపరుడైన ధర్మజుడు పలికినది సత్యమే. నేను అట్లే నిర్దేశించాను. నాకు అసత్యం వలన భయమేర్పడింది. నన్నెట్లైనను అసత్యదోషం నుండి దూరం చేసే ఉపాయం చెప్పండి."

వ్యాసుడు చెప్పాడు - "కల్యాణీ! అసత్యదోషం నీకంటదు. ఇది సనాతమైన ధర్మమే. కాని ఇది అందరికీ (వర్తిస్తుందని) చెప్పను. పాంచాలరాజా! నీవు ఏకాంతంగా విను. ధర్మజుడు పల్కినట్లే ఇది ధర్మబద్ధం, సనాతనం. ధర్మజుడు పల్కినట్లిది నిస్సందేహంగా ధర్మవివాహమే." తర్వాత ద్వైపాయనుడు ఆసనం నుంచి లేచి ద్రుపదుని చేయిపట్టుకొని,

రాజభవనంలోనికి ప్రవేశించాడు. పాండవులు, కుంతి, ద్రౌపది, ధృష్టద్యుమ్నుడు అక్కడనే కూర్చుండి వారిరువురికోసం వేచి చూడసాగారు. భవనంలోపలకు ప్రవేశించి ద్వైపాయనుడు మహాత్ముడు, నరశ్రేష్ఠుడైన ద్రుపదునితో చాలామంది పురుషులు ఒకే భార్యను కలిగి ఉండటం ఎలా ధర్మమవుతుందో వివరించాడు.

196. ద్రౌపదీపాండవుల పూర్వజన్మవృత్తాంతము.

వ్యాసుడు చెప్పనారంభించాడు. 'రాజా! పూర్వం నైమిశారణ్యక్షేత్రంలో దేవతలందరు ఒక యజ్ఞం చేస్తున్నారు. ఆసమయంలో సూర్యపుత్రుడు యముడు శామిత్రమనే యజ్ఞం నిర్వహిస్తున్నాడు. రాజా! యముడు దీక్షితుడైన కారణాన ప్రజలను చంపటంలేదు. ఈవిధంగా మృత్యువుకు సమయం గడవటంతో మరణం లేక జనసంఖ్య పెరగసాగింది. చంద్రుడు, ఇంద్రుడు, వరుణుడు, కుబేరుడు, సాధ్యులు, రుద్రులు, వసువులు, అశ్వినీదేవతలు అందరూ కలిసి బ్రహ్మనివాసమైన సత్యలోకానికి పోయి "భగవంతుడా! మనుష్యుల సంఖ్య అధికమౌతోంది. మాకు తీవ్రమైన భయం కలుగుతోంది. మేమందఱమూ ఆ భయంతో కుమిలిపోతూ సుఖాన్ని కోరి, నిన్ను శరణువేడుకొంటున్నాం." బ్రహ్మ అన్నాడు - 'మీరు అమరులు. మీకు మనుష్యుల వల్ల భయమా! మీకు మనుష్యుల వల్ల ఎన్నడూ భయం కల్గదు." దేవతలు అన్నారు "మనుష్యులు అమరులైరి. మామధ్య భేదమే లేదు. అంతరం తొలగటంతో మా ప్రత్యేకతకై మీవద్దకు వచ్చాం." బ్రహ్మ అన్నాడు - సూర్యపుత్రుడైన యముడు దీక్షితుడవటంచేత మనుజులకు మరణం లేదు. అతని యజ్ఞం పూర్తికాగానే మనుజులకు మరణం సంభవిస్తుంది. మీ వీర్యంతో యముని శరీరాన్ని రెండుగా చేస్తే వాటిలో ఒకటి మారణకార్యాన్ని కొనసాగిస్తుంది. మనుజులకు మరణం కల్గుతుంది. వారికి అమృతత్వం తొలగిపోతుంది."

వ్యాసుడు చెప్పాడు - రాజా! వారు బ్రహ్మమాటలు విని దేవతలు యజ్ఞం చేసే చోటికి వెళ్ళారు. ఒకనాడు వారందరూ గంగానదికి స్నానానికి పోయి, అక్కడ ఒడ్డుపై కూర్చుండి గంగలో ఒక పద్మాన్ని చూచారు. అది చూచి వారందరూ ఆశ్చర్యపడ్డారు. ఆ కమలం జాడకై శూరుడైన ఇంద్రుడు వెళ్ళాడు. గంగాప్రవాహం ఆగినచోట అగ్ని తేజస్సుగల ఒక కాంతను చూశాడు. జలంకోసం వచ్చిన ఆమె గంగలో మునిగి ఏడ్చింది. ఆమె కన్నీటిబొట్లు ఒక్కొక్కటిగా నీటిలో పడి బంగారుకమలాలు అయ్యాయి. ఆ అద్భుతాన్ని చూచి ఇంద్రుడు ఆమెను సమీపించి "కల్యాణీ! నీవెందులకు ఏడుస్తున్నావు? యథార్థం చెప్పు. వినాలని ఉంది." అన్నాడు. ఆ కాంత ఇలా అన్నది 'ఇంద్రా! నేను భాగ్యహీనురాలను.

నేనెవరినో, ఎందుకు ఏడుస్తున్నానో నీకు తెలుస్తుంది. నీవు నావెనుక రా. నా రోదనకారణం నీవు స్వయంగా తెలిసికొనవచ్చు.' ఆమెను అనుసరించిపోయి ఇంద్రుడు హిమాలయశిఖరం మీద సిద్ధాసనస్థుడై ఒక యువతితో క్రీడిస్తున్న అందమైన యువకుని చూచాడు. వారు అక్షక్రీడాసక్తులై ఉండగా ఇంద్రుడు దగ్గరకు చేరి ఆ యువకునితో "మహానుభావా! నేనీలోకానికి రాజును. ఈలోకం నాఅధీనంలో ఉంది" అని అన్నాడు. ఇంద్రునిక్రోధాన్ని చూచిన ఆ దేవపురుషుడు నవ్వి, మెల్లగా ఇంద్రుని వైపు చూచాడు. అతని చూపు పడగానే ఇంద్రుడు కొయ్యబారి స్థాణువై పోయాడు.

వారి క్రీడ ముగిసిన తర్వాత ఏడుస్తున్న ఆమెను పిలిచి "ఆ ఇంద్రుని నా వద్దకు తీసికొనిరా. ఇతనిలో తిరిగి గర్వం ప్రవేశించకుండా చేస్తాను" అని ఆ యువకుడు అన్నాడు. అతనిమాటలను విని ఆమె ఇంద్రునిశరీరాన్ని తాకగానే అతడు అవయవ సామర్థ్యాన్ని కోల్పోయి భూమిపై పడినాడు. అతనిని చూచి రుద్రుడు ఇక 'ఎప్పుడూ ఇలా చేయవ'ద్దని పలికాడు. "నీలో అమితమైన బలం, పరాక్రమం ఉన్నాయి. ఈ గుహా ద్వారానికి అడ్డమైన ఈ పెద్దకొండను తొలగించు. లోనికి ప్రవేశించు. నీతో సమానులైన ఇంద్రులు అక్కడ ఉన్నారు"అన్నాడు. అతడు ఆ పర్వతబిలంలో ప్రవేశించి తనతో సమానులైన నల్గురు ఇంద్రులను చూశాడు. నేనూ వీరివలె దుర్దశలో పడగలనని భావించాడు. అప్పుడు శంకరుడు కళ్ళు పెద్దవి చేసి కోపంతో ఇంద్రుని చూచి "నీవు మూర్ఖత్వంతో నన్ను అవమానించావు. ఈ గుహలో ప్రవేశించు" అన్నాడు. పర్వతశిఖరంపై శంకరు డా విధంగా అంటే ఇంద్రుడు శిథిలమైన అవయవాలతో గాలికి ఊగిసలాడే రావిఆకువలె కంపించిపోయాడు. ఇంద్రుడు కంపిస్తూ వెంటనే చేతులు జోడించి 'బహురూపుడవై, ఉగ్రుడవైన నీవు ఈ లోకానికంతకు ఆదిపురుషుడవు' అని స్తుతించాడు. భయంకరమైన తేజస్సు గల రుద్రుడు నవ్వి ఇలా అన్నాడు - 'నీవంటివారు ప్రసాదానికి అర్హులుకారు. వీరూ నీవలె పూర్వం ప్రవర్తించారు. నీవు అట్లే గుహలో ప్రవేశించి శయనించు. మీరు నేను చెప్పినట్లే కార్యాలను నిర్వహిస్తారు. మీరందరు మానవులుగా పుడతారు. ఆజన్మలో దుస్సహకర్మల నాచరించి చాలమంది రాజులను మృత్యువుకు ఎరచేసి తిరిగి మీశుభకర్మలచే పవిత్రులకు నిలయమైన స్వర్గానికి వస్తారు. నేను చెప్పిన పనులేకాక సార్థకమైన వేరు పనులు కూడా చేస్తారు.'

పూర్వపు నల్గురు ఇంద్రులు అన్నారు - 'భగవంతుడా! మీఆజ్ఞను శిరసావహించి మేము దేవలోకాన్ని వీడి మనుష్యలోకానికి పోతాం.అక్కడ దుర్లభమైన మోక్షం సాధిస్తాం.

మీరు మమ్మల్ని యముడు, వాయువు, ఇంద్రుడు, అశ్వినీ దేవతలతో కలిపి తల్లి గర్భంలో ప్రవేశపెట్టండి. దివ్యాస్త్రాలతో మానవులతో పోరు సలిపి తిరిగి ఇంద్రలోకం వస్తాం.జ వజ్రధారి ఇంద్రుడు పూర్వేంద్రుల మాటలను విని దేవతాశ్రేష్ఠుడైన శంకరునితో ఇలా పలికాడు "పూజ్యుడా! నావీర్యంతో ఐదవవాడవుతాడు. సృజించి వీరికిస్తాను. వీరితో కలిసి అతడు ఐదవవాడగును. వారిపేర్లు వరుసగా విశ్వభుక్కు, భూతధామ, శిబి, శాంతి, తేజస్వి". శంకరుడు వారి కోర్కెను విని సాధుస్వభావంతో ఆనందించి వరమిచ్చాడు. ఆ సౌందర్యరాశిని(స్వర్గలక్ష్మి) మానవలోకంలో వారి భార్యను చేశాడు. దేవదేవుడైన శంకరుడు వారితో కలిసి అనంతుడు, అవ్యక్తుడు, అప్రమేయుడు, అజుడు, ప్రాచీనుడు, సనాతనుడు, అనంతుడు, విశ్వరూపుడూ ఐన శ్రీహరి వద్దకు వెళ్ళాడు. అతడూ ఆ మాటలకు అంగీకరించాడు. పిమ్మట అందరు భూమిపై జన్మించారు. అదే సమయంలో శ్రీహరి తనకేశపాశం నుండి రెండు వెంట్రుకలను బయటకు తీశాడు. వాటిలో ఒకటి తెల్లనిది, మరొకటి నల్లనిది. ఆ రెండు వెంట్రుకలు యదువంశస్త్రీలైన దేవకీరోహిణుల గర్భంలో ప్రవేశించాయి. తెల్లటికేశం బలరాముడు, నల్లటికేశం శ్రీకృష్ణుడు అయ్యారు. ఉత్తరహిమాలయ గుహలో బందీలైన నల్గురూ పరాక్రమవంతులైన పాండవులైరి. ఇంద్రాంశ గల పాండుపుత్రుడు సవ్యసాచి(అర్జునుడు). రాజా! పూర్వం ఇంద్రులైనవారు పాండవులు. స్వర్గలక్ష్మి ద్రౌపది అయింది. దైవయోగం లేనప్పుడు యజ్ఞవేదినుండి దివ్యకాంత ఎలా ఉదయిస్తుంది? ఆమె రూపం చంద్రసూర్యులవలె ఎలా ప్రకాశిస్తుంది? క్రోసు దూరం నుండి ఆమె దివ్య గంధమెలా వ్యాపిస్తుంది?

ద్రుపదమహారాజా! నేను నీకు ప్రసన్నతతో దివ్యదృష్టినిస్తాను. నీవు కుంతీపుత్రుల అలనాటి దివ్యరూపాలను చూస్తావు." వెంటనే తన తపశ్శక్తిచే వ్యాసమహర్షి ద్రుపదునకు దివ్యచక్షువు లిచ్చాడు. అతడు పాండవుల పూర్వదేహాలను చూచాడు. స్వర్ణకిరీటధారులై, బంగారుమాలలు ధరించి, ఇంద్ర సమవర్చస్కులై, అగ్ని సూర్యాది దేవతల కాంతి కలవారై, యువకులై, విశాలవక్షఃస్థలులై, తాటిచెట్టు ప్రమాణం గల ఇంద్రాదులు కనిపించారు. వారు నిర్మలవస్త్రాలు, ఉత్తమగంధాలు, సుందరమైన మాలలు ధరించి మహాదేవ, వసు, రుద్ర, ఆదిత్య గణంగా ప్రకాశిస్తున్నారు. నల్గురు పాండవుల పూర్వరూపాలనూ, ఇంద్రాత్మజుడైన అర్జునుని రూపాన్ని చూచి, ప్రసన్నుడైన ద్రుపదుడు ఊహకందని ఆ మాయతో ఆశ్చర్యపోయాడు. ద్రుపదుడు త్రిలోకసుందరీ, సోమవహ్ని తేజస్వినీ, రూప తేజో యశస్వినీ అయిన ద్రౌపదిని వారికి అన్నివిధాల తగినదానినిగా భావించాడు. ఆశ్చర్యకరమైన దృశ్యాన్ని

చూచిన ద్రుపదుడు వ్యాసుని పాదాలపై పడ్డాడు. "మహర్షీ! మీలో ఈ అద్భుతశక్తికి ఆశ్చర్య మేమున్నది ?" అని ద్రుపదుడు పలుకగానే వ్యాసుడు ప్రసన్నుడై ఇలా అన్నాడు.

"ఒకానొక తపోవనంలో ఒక ఋషికి ఒక కుమార్తె కలదు. ఆమె సౌందర్యసౌశీల్యాలు గలది అయినా పెండ్లి కుదరలేదు. ఆమె కఠినమైన తపస్సుచే శంకరుని మెప్పించింది. ఈశ్వరుడు సంతసించి ప్రత్యక్షమై వరం కోరుకొమ్మని ఆమెతో అన్నాడు. వరదుడైన శంకరుని మాట విని ఆమె పదేపదే అన్ని గుణాలు గల పతిని వరంగా కోరింది. ప్రీతమనస్కుడైన శంకరుడు "కల్యాణీ! నీకు అయిదుగురు భర్తలు ఉంటారు" అని ఆమె కోరిన వరాన్నిచ్చాడు. ఆమె శంకరుని బ్రతిమాలుతూ తిరిగి అంది - "సర్వగుణ సంపన్నుడైన భర్త ఒక్కడు చాలు." ప్రసన్నుడైన శంకరుడు ప్రియంగా ఆమెతో ఇలా చెప్పాడు- "నీవు తొందరలో అయిదుసార్లు పతినిమ్మని కోరావు. అది అట్లే అవుతుంది. నీకు మంగళం. మరో జన్మలో ఈ వరాన్ని పొందుతావు." ద్రుపదమహారాజా! ఆ ఋషికన్యకయే నీకు కుమార్తె అయింది. ఐదుగురు వీరులకు పత్నిగా పూర్వమే నిర్ణీత మయింది. ఈ స్వర్గలక్ష్మి నీ యజ్ఞశాలలో పాండవపత్నిగా జన్మించింది. ఆమె ఘోరమైన తపస్సు చేసి నీకు కుమార్తె అయింది. ద్రుపదరాజా! ఆ సుందరియే ఐదుగురికి తనతపస్సుచే పత్ని అయింది. బ్రహ్మయే ఈమెను దేవపత్నిగా చేయతలపెట్టాడు. ఇది గ్రహించి నీఇష్టం వచ్చినట్లు చేయి."

197. పంచపాండవులతో ద్రౌపది వివాహము.

ద్రుపదుడు చెప్పాడు - "మహర్షీ! మీమాటలు వినక పూర్వం ద్రౌపదికి ఒకనితోనే వివాహం చేయాలని సంకల్పం. విధాత విధానాన్ని ఎదిరించగల శక్తి ఎవరికీలేదు. అయిదుగురితో వివాహమే ఉచితం. అదృష్టాన్ని ఎవ్వరూ తప్పించలేరు. స్వయంగా ప్రయాసపడి ఏమీ చేయలేరు. ఒకవరునికై చేసిన యత్నం అయిదుగురు వరుల నిచ్చింది. కాబట్టి ముందు చేసిన నిర్ణయమే ఉచితం. పూజ్యుడా! పూర్వజన్మలో ద్రౌపది శంకరునితో చాలాసార్లు పతిని కోరగా అతడట్లే వరమిచ్చాడు. ఇందు దాగిన రహస్యం పరమాత్మకే తెలుసు. శంకరుని అనుశాసనమే అయితే ధర్మాధర్మప్రసక్తి, నా అపరాధమూ లేవు. ఈమె వీరిదే కావున విధివిధానంగా పాండవులు ఈమెను పరిగ్రహిస్తారు." పిమ్మట భగవంతుడైన వ్యాసుడు ధర్మజునితో పలికాడు. "ధర్మరాజా! నేడు ద్రౌపదిని వివాహమాడు." ఇంద్రుడు పుష్యమీనక్షత్రంతో కలుస్తాడు. కావున నీవు ముందుగా ద్రౌపదిని వివాహమాడు. వ్యాసాదేశానుసారం యజ్ఞసేనుడు పుత్రులతో కలిసి వధూవరుల కవసరమైన ద్రవ్యాలను

తెప్పించి స్నానాదులు చేయించి ద్రౌపదిని విలువైన రత్నమాణిక్యాలతో అలంకారం చేయించాడు. రాజు స్నేహితులు, మంత్రులు, బ్రాహ్మణులు, పౌరులు అందరు మిక్కిలి ప్రసన్నులై పెద్దలను ముందు ఉంచుకొని కూర్చున్నారు. ద్రుపదరాజభవనం ఉత్తమపురుషులతో ప్రకాశిస్తోంది. అతని భవనప్రాంగణం కలువలతో, పద్మాలతో వెలిగిపోతోంది. అక్కడ చతురంగసేనలు చిత్రంగా అమరి ఉన్నాయి. ఆ రాజభవనం నిర్మలనక్షత్రాలతో వెలిగే ఆకాశంవలె ఉంది. అక్కడ యువకులు, అలంకృతులు, కుండలాలంకృతులు. స్నానాలు చేసి విలువైన పట్టుబట్టలు కట్టుకొని, చందనం పూసికొని, మంగళక్రియలు ఆచరిస్తూ పాండవు లున్నారు. క్రమంగా ప్రసన్నతతో పాండవులు గోశాలలోనికి వృషభాలు చేరినట్లు అగ్నివలె వెలిగే తమపురోహితుడు ధౌమ్యునితో కలిసి శాస్త్రప్రకారంగా సదస్సులో ప్రవేశించారు. వేదపారంగతుడు, విద్వాంసుడు, మంత్రజ్ఞుడు, పురోహితుడు అయిన ధౌమ్యుడు అగ్నిలో వ్రేల్చి మంత్రాహుతుల నిచ్చి యుధిష్ఠిరుని పిలిచి ద్రౌపది వేదనిధి అయిన ధౌమ్యుడు వారిద్దరిచే పాణిగ్రహణం చేయించి, అగ్నికి ప్రదక్షిణం చేయించాడు. ధర్మజుని ఆజ్ఞపై పురోహితుడు రాజభవనం వదలినాడు.

కౌరవకులోన్నతికై మహారథులైన నలువురు పాండవులూ క్రమంగా ఒక్కొక్కరోజున ఒక్కొక్కరు ద్రౌపదిపాణిగ్రహణం చేశారు. దేవర్షి అచటి అద్భుతమూ, ఉత్తమమూ, అతిమానుషమూ అయిన సంఘటనను తెలిపాడు. మహానుభావురాలు, సన్ననినడుముగల ద్రౌపది ప్రతిదినమూ వివాహానంతరం కన్యగానే ఉందట. వివాహానంతరం ద్రుపదుడు మహారథులైన పాండవులకు వివిధవస్తుసామగ్రిని, సువర్ణమాలలు కల నూరు రథాలను కానుకలుగా ఇచ్చాడు. పద్మమూ, శంఖమూ గల నూరు ఉత్తమ గజాలను, బంగారు తొడిగిన కొమ్ములు గల వంద ఏనుగులను, యౌవనవతులైన వందమంది దాసీజనాన్ని, విలువైన వస్త్రాలను, ఆభరణాలనూ కానుక చేశాడు. చంద్రవంశజుడు, మహానుభావుడైన ద్రుపదుడు దివ్యమైన చూపులు గల పాండవులందరికి వేరువేరుగా అగ్నిసాక్షికంగా ధనాన్ని, వస్త్రాలనూ, అధికారసూచకాలయిన ఆభరణాలనూ అర్పించాడు. వివాహానంతరం మహాబలశాలులూ, ఇంద్రసమానులూ అయిన పాండవులు అనంతరత్నరాశులతో పాటు లక్ష్మివంటి ద్రౌపదిని పొంది ఆ పాంచాలరాజునగరంలో విహరించసాగారు రాజా! పాండవులందరూ ద్రౌపది యొక్క ఏకాగ్రత, సచ్ఛీలం, సదాచారాలతో సంతుష్టులయ్యారు. ఈవిధంగా ద్రౌపది తన సద్వ్రతాలతో పాండవుల ఆనందాన్ని పెంచసాగింది.

198. కుంతి ద్రౌపదిని ఆశీర్వదించుట, శ్రీకృష్ణుడు పాండవులకు కానుకలు పంపుట.

పాండవులతో సంబంధం కలిగిన ద్రుపదునికి దేవతలవల్లకూడా భయంలేదు. ఇక మనుష్యుల విషయం చెప్పనవసరం లేదు. ద్రుపదుడు పంపిన దాసీజనం కుంతి పేరును కీర్తిస్తూ, కుంతికి సాష్టాంగ ప్రణామం చేశారు. ద్రౌపది పట్టువస్త్రాలు ధరించి వివాహమంగళం పూర్తి కావించి, అత్తకు వంగి, దోసిలి ఘటించి, వినయంతో నమస్కరించింది. అందం, శుభలక్షణాలు, శీలాచారాలు గల కోడలు ద్రౌపదిని కుంతి ప్రేమతో ఆశీర్వదించి పలికింది. "ద్రౌపదీ! ఇంద్రాణి ఇంద్రుని, స్వాహాదేవి అగ్నిని, రోహిణి చంద్రుని, దమయంతి నలుని, భద్ర కుబేరుని, అరుంధతి వసిష్ఠుని, లక్ష్మీదేవి నారాయణుని, సేవించినట్లు నీభర్తలను ప్రేమతో సేవించు. మంగళకరమైనదానా! నీవు సౌఖ్యాలతో కూడి చిరంజీవులు, వీరులూ అయిన కొడుకులను పొందు. సౌభాగ్య, భోగాలను పొంది యజ్ఞపత్నివి, పతివ్రతవు అగుము. ఇంటికి వచ్చిన అతిథులను, అభ్యాగతులను, వృద్ధులను, పెద్దలను తగినట్లు సేవిస్తూ అనేకవత్సరాలు గడిపెదవు గాక! ధర్మవత్సలవైన నీవు కురుజాంగలం మొదలయిన రాష్ట్రాలకు, నగరాలకు భర్తతో కలిసి అభిషిక్తురాలవై పట్టపురాణివి కాగలవు. మహాబలులైన నీభర్తలు పరాక్రమంతో భూమి నంతటిని జయిస్తారు. అశ్వమేధయాగంలో ఆ భూమిని నీవు బ్రాహ్మణులకు ఇయ్యి. కల్యాణీ! గుణవంతురాలవైన నీవు భూమిమీది విలువైన రత్నాలన్నింటిని పొంది చిరకాలం సుఖాలు అనుభవించు! పట్టువస్త్రాలు కట్టిన నిన్ను ఇపుడు అభినందిస్తున్నట్టే నీకు పుత్రులు కల్గినప్పుడు తిరిగి అభినందిస్తాను." వివాహం చేసికొని వచ్చిన పాండవులకు కృష్ణుడు వైడూర్యాలు పొదిగిన ఆభరణాలు, విలువైనవస్త్రాలు, వివిధదేశీయాలైన కంబళీలు, లేడిచర్మాలు, రత్నాలు, తల్పాలు, వాహనాలు, వైడూర్యాలు పొదిగిన పాత్రలు పంపాడు. రూపయౌవనదాక్షిణ్యాలు గలిగి, చక్కగా అలంకరింపబడిన వేర్వేరు దేశాల దాసీజనాన్ని పాండవులకు శ్రీకృష్ణుడు ఇచ్చాడు. అప్రమేయుడైన హరి మాటవినే ఏనుగులు, అలంకరింపబడిన గుఱ్ఱాలు, దంతనిర్మితాలైన రథాలు, బంగారు నాణాలు, కోట్ల కొలది స్వర్ణరాశులను బారులు తీర్చి పంపాడు. ధర్మరాజైన యుధిష్ఠిరుడు మిక్కిలి సంతసించి శ్రీకృష్ణుని సంతోషం కోసం వాటినన్నింటిని స్వీకరించాడు.

199. దుర్యోధనుని చింత, దురాలోచన.

రాజులందరకు విశ్వసనీయులైన దూతలద్వారా ఈసమాచారం తెలిసింది. "శుభలక్షణయైన ద్రౌపది వివాహం పంచపాండవులతో జరిగింది. ధనుస్సుతో లక్ష్యభేదం చేసిన అతడే సవ్యసాచియైన అర్జునుడు. మద్రరాజైన శల్యుని ఎత్తి పడవేసినవాడు, శత్రువులను కోపించి చెట్టుతో బెదిరించినవాడు, ఎంతమాత్రం తొట్రుపాటు లేకుండా శత్రుసేనను పడగొట్టిన భయంకర స్పర్శ గల అతడే భీముడు. బ్రాహ్మణవేషధారులై ప్రశాంతంగా కూర్చున్నవారే పాండవులు" అని తెలిసిన రాజులందరకు ఆశ్చర్యం కల్గింది. పుత్రులతో కూడి కుంతి లక్కయింటిలో కాలిపోయిందని విన్న రాజులకు వారు తిరిగి బ్రతికివచ్చినట్లు తోచింది. పురోచనునిచే చేయబడిన ఈ క్రూరకర్మను తెలుసుకున్న రాజులందరు భీష్ముని, కురురాజైన ధృతరాష్ట్రుని అధిక్షేపించారు. ధృతరాష్ట్రుడు ధార్మికులు, ధర్మాత్ములు, తల్లిమేలు కోరేవారు అయిన పాండవులను చంపింపగోరాడు. స్వయంవరమైన పిమ్మట కర్ణ, శకునుల వశమైన ధార్తరాష్ట్రులు వారితో మంత్రాంగం సాగించారు. శకుని చెప్పాడు. "ఒకశత్రువు దుర్బలుడుగా చేయతగినవాడు, మరొకడు పీడింపతగినవాడు, పాండవులు మాత్రం సమస్త క్షత్రియులకు నాశనం చేయతగినవారని నామతం. ఇట్లు మీరు పరాజితులై పాండవ వినాశానికై ఏదయినా యుక్తి పన్నకపోతే మీరంతా నిస్సందేహంగా బాధపడవలసివస్తుంది. సమూలంగా పాండవనాశాని కిదే సమయం, ఇదే తగిన ప్రదేశం. ఇప్పుడు ప్రతిక్రియ చేయకపోతే నలుగురిలో నవ్వులపా లవుతారు. పాండవులు ఏ ద్రుపదుని ఆశ్రయం కోరుతున్నారో అతడు నా అభిప్రాయంలో బలపరాక్రమాలలో మిక్కిలి అల్పుడు.

యదువీరులు, పురుషశ్రేష్ఠుడు, ప్రతాపవంతుడైన శిశుపాలుడు ఈవిషయాన్ని గ్రహింపకముందు పాండవులను చంపాలి. రాజా! శ్రేష్ఠులైన రాజులందరు ద్రుపదునితో చేరితే వారు జయింపశక్యం కాని వారవుతారు. సంశయం లేదు. నరశ్రేష్ఠులు అంతా కలియకముందే పాండవులను చంపటానికి ప్రయత్నం చెయ్యాలి. భయంకరమైన కాలసర్పం నుండి బయటపడినట్లు పాండవులు లక్కయింటినుండి బయటపడ్డారు. మళ్లీ ఇపుడు మననుండి చేజారిపోతే వారివలన మనకు గొప్ప భయం కలుగుతుంది. వృష్ణివంశీయులు, చేదివంశీయులు ఇక్కడకు వచ్చి, నాగరికులతో కలిస్తే వీరిమధ్య చేరిన మన పరిస్థితి పాట్టేళ్ళమధ్య చేరినట్లు అవుతుంది. వరిచేలో మిడుతలదండు పడినట్లు బలరామునిసేనలు తమయోధులతో మనలను చేరుతాయి. అంతలోనే ఈనగరాన్ని ముట్టడించి నాశనం

చేయాలి. ఇదే మనకు ముఖ్యకర్తవ్యం." దుర్బుద్ధియైన శకుని మాటలు విని భూరిశ్రవుడు తెలివిగా ఇలా అన్నాడు.

"ఉభయపక్షాల్లోని సప్తప్రకృతులను తెలిసి; దేశమూ, కాలమూ తెలిసికొని ఆరు రకాల నీతిని శత్రువుపై ప్రయోగించాలి. స్థానం, వృద్ధి, క్షయం, భూమి, మిత్రులు, పరాక్రమం వీనిపై దృష్టినుంచి శత్రువు ఆపదలో ఉన్నప్పుడు దాడి చెయ్యాలి. పాండవులిప్పుడు మిత్రకోశాలతో కూడియున్నారు. వారు బలవంతులు, పరాక్రమవంతులు, తమ చేష్టలతో రాజులందరికి ఇష్టులైనారు. సహజంగా అందమైన అర్జునుడు ఇతరుల నేత్ర, హృదయాలను దోచుకొన్నాడు. మధురమైన వాక్కులతో చెవులకు కూడ తృప్తినిచ్చాడు. ప్రారబ్ధం చేత మాత్రమే ప్రజలు అర్జునుని సేవింపలేదు. అర్జునుడు వారి మనస్సులకు ఇష్టమైన పనులుచేసి వారిని వశపరచుకొన్నాడు. సుందరంగా మాట్లాడే అర్జునుని మాటలు వారిపట్ల ఎన్నడూ అయుక్తంగా ఉండేవి కావు. ఆసక్తిరహితంగా, అసత్యంగా, అప్రియంగా ఎన్నడూ లేవు. ఇలా గుణవంతులై, రాజలక్షణాలతో కూడిన పాండవులను నాశనం చేయగల వారిని నేనింతవరకు చూడలేదు. వారిలో ప్రభుశక్తి విస్తరించి ఉంది. మంత్రశక్తి పుష్కలం, ఉత్సాహశక్తి సదా అధికం. యుధిష్ఠిరుడు సామ, దాన, భేద, దండ ప్రయోగాలలో నిపుణుడు. సమయోచితంగా స్వాభావిక బలాన్ని, మిత్రులను ప్రయోగిస్తాడు. రోషాన్ని విడచి శత్రువును జయిస్తాడు అని నా నమ్మకం. ధనంతో శత్రువులను, మిత్రులను, బలాన్ని గ్రహించి తన ఉనికిని దృఢపరచి, శత్రుసంహారం చేయడంలో దిట్ట ధర్మరాజు. ఇంద్రాది దేవతలందరు కలిసినా పాండవులను ఏమీ చేయలేరు. శ్రీకృష్ణబలరాము లిద్దరూ వారి పక్షాన్నే అనుసరిస్తారు అని నేను భావిస్తాను.

మీరందరు నాహితవచనాలను అంగీకరించి, ఆమోదిస్తే పాండవులతో సంధిచేసుకొని ఎలా వచ్చామో అలాగే వెనుదిరిగిపోదాం. ఈ శ్రేష్ఠనగరం గోపురాలతో, అట్టాలకాలతో, చుట్టూ నీటితో సంరక్షింపబడింది. నాలుగు వైపుల గడ్డి, ధాన్యం, ఇంధనాలు, రసాలు, యంత్రాలు, ఆయుధాలు, ఔషధాలు, తలుపులు,ద్రవ్యాగారాలు, ఊకమొదలగు వాటితో నింపబడి ఉంది. భయంకరాలై విశాలాలైన చక్రాలతో, పెద్దపెద్ద అట్టాలకాలతో, దృఢమైన చీలలు, ఘడియలు, శతఘ్నులతో కూడి ఉంది. ఆ పురానికి ఇష్టకం, దారవం, మానుషం అని మూడు ప్రాకారాలు ఉన్నాయి. మానుషాన్నే నృ(నర)గర్భం అంటారు. ఇది లోపల ఉంటుంది. ప్రాకార కర్తలు దీన్ని శ్రేష్ఠమయిన ప్రాకారంగా భావిస్తారు. ఈ విధంగా ఈ నగరం తెల్లని నరగర్భంతో ప్రకాశిస్తోంది. ఎన్నో తాటిచెట్ల ప్రమాణం గల సాలవృక్షాలతో

సంరక్షింపబడుతోంది. ప్రజలు, ప్రకృతులు ద్రుపదునిపట్ల అనురక్తులయి ఉన్నారు. బయటి, లోపలి కర్మచారులు అందరు దానమానాలచే పూజింపబడ్డారు. పాండవులు ముట్టడింపబడినారని విని యాదవ- శ్రేష్ఠులందరు ప్రచండ శస్త్రాస్త్రాలతో మనమీద పడతారు. ఈ మాటలు మీకిష్టమైతే దుర్యోధనునికి పాండవులతో సంధిచేసి మన దేశానికి పోదాం. ఈ నా అభిప్రాయం అందరూ ఆదరించాలి. రాజుల కందరకు క్షేమమని భావించి ఈ ఉత్తమకర్తవ్యాన్ని ప్రబోధించాను.

స్వయంవరం పూర్తికాగా రాజులందరు "ద్రౌపది పాండవులను వరించింది" అని తెలిసి వచ్చినవారు వచ్చినట్లే వెనుకకు తిరుగసాగారు.

అర్జునుని ద్రౌపది వరించటం చూచి దుర్యోధనుని మనస్సు వికలమై అశ్వత్థామ, శకుని, కర్ణుడు, కృపులతో రాజధానికి తిరిగివచ్చాడు. అక్కడ దుశ్శాసనుడు అతనిని చూచి సిగ్గుపడి మెల్లమెల్లగా ఇలా పలికాడు. "సోదరా! అర్జునుడు బ్రాహ్మణవేషం ధరించినందున ద్రౌపదిని పొందగలిగాడు. రాజా! అతనిని ధనంజయుడని ఎవ్వరూ గుర్తింపలేదు. నేను అదృష్టమే గొప్పదని భావిస్తాను. పౌరుషం దైవం యెడల నిరర్థకం. ఇంతవరకు పాండవులు బ్రతికినందున మన పౌరుషాన్ని నిందించాలి." ఇలా మాట్లాడుతూ, పురోచనుని నిందిస్తూ దీనులై దుఃఖంతో హస్తినకు చేరారు. లాక్షాగృహాగ్ని నుండి బయటపడిన పాండవులకు ద్రుపదునితో సంబంధం ఏర్పడిందని తెలిసి; ధృష్టద్యుమ్నుని, శిఖండిని, ఇతర ద్రుపద కుమారులను తలచుకొని కౌరవులు ఎంతో భయపడ్డారు. పాండవులు ద్రౌపదిని వివాహమాడారు అని విని, సిగ్గుపడుతూ గర్వభంగం పొందిన ధార్తరాష్ట్రులను చూచి ప్రీతితో విదురుడు ధృతరాష్ట్రుని చేరి ఇలా అన్నాడు. "మహారాజా! మనభాగ్యవశాన కౌరవవంశం వృద్ధి పొందుతోంది." ధృతరాష్ట్రుడు విదురుని మాటలు విని ప్రసన్నుడై అదృష్టం, భాగ్యం అన్నాడు. గుడ్డివాడైన ధృతరాష్ట్రుడు అజ్ఞానవశుడై ద్రుపదకన్యచే తన పుత్రుడు దుర్యోధనుడు వరింపబడినాడని భావించాడు. వెంటనే "ద్రౌపదికి ఆభరణాలను తెమ్ము" అని ఆజ్ఞాపించాడు, ద్రౌపదిని తీసుకొనిరమ్మని దుర్యోధనునితో పలికాడు. వెనుకనుంచి విదురుడు ద్రౌపది పాండవులను వరించింది అనీ అందరు క్షేమమనీ, ద్రుపదునిచే గౌరవింపబడ్డారనీ తెలిపాడు. ఆ స్వయంవరంలో వారి బంధువులను, సైనికశక్తిని, కలుసుకొనుటకు వచ్చిన వారిని గూర్చి ధృతరాష్ట్రునికి విదురుడు తెలిపాడు. విదురుని మాటలు విని ధృతరాష్ట్రుడు తన ఇంగితాన్ని కప్పిపుచ్చటానికి అదృష్టం, అదృష్టం అన్నాడు.

"పాండవులు జీవించి ఉన్నారన్న వార్త విన్పించిన నీకు శుభం కలుగుగాక. కుంతి

పరమసాధ్వి. ద్రుపదునితో సంబంధం మనం కోరతగినదే. అతడు మాననీయమైన వసువు వంశంలో జన్మించాడు. వ్రతం, విద్య, తపస్సులలో వృద్ధుడు, రాజులలో అగ్రగణ్యుడు. అతని పుత్ర పౌత్రులందరు నియమపాలనం చేసేవారు. అతని బంధువులందరు మహాబలులు. పాండురాజుకున్న పుత్రప్రేమకంటె పాండవులపై నాకు ప్రీతి ఉంది. వారిపట్ల నామనస్సులోని మొగ్గును పూర్తిగా విను. విదురా! సంపదలను కోల్పోయిన రాజయినా, బంధుసహితుడైన ద్రుపదుని మిత్రునిగా పొందితే చక్కగా జీవించగలడు." అలా మాటలాడే ధృతరాష్ట్రునితో విదురుడు 'రాజా! నీకు పెక్కేండ్లు ఇట్టి బుద్ధి నిలుచుగాక!' అని పలికి తన భవనానికి వెళ్లిపోయాడు. తరువాత దుర్యోధనుడు, కర్ణుడు కూడ ధృతరాష్ట్రుని చేరి ఇలా మాట్లాడారు. "విదురుని ఎదుట మీతో మేము దోషాలను చెప్పలేం. ఇది ఏకాంతం. మిమ్ములను చేరాం. మీ అభీష్టం తెల్పండి. తండ్రీ! మీరు మా శత్రువులవృద్ధిని మన అభివృద్ధిగా భావిస్తున్నారు. పైగా విదురుని ఎదుట వారిని ప్రశంసిస్తున్నారు. పుణ్యాత్ముడా! మనం చేయతగినది వేరు. మీరు ఆచరించేది వేరు. పాండవుల శక్తిని తగ్గించటమే మనం ఎల్లప్పుడూ చేయదగినది. సమయానికి తగిన కర్తవ్యం మనం ఆచరించాలి. ఆ విషయమే మాట్లాడాలి. వారు మనలను బంధు, పుత్ర, బలసహితంగా నాశనం కావించకుండా చేయాలి."

200. దుర్యోధన, ధృతరాష్ట్ర సంభాషణ.

ధృతరాష్ట్రుడు అన్నాడు – "నేనూ మీవలె ఈ విషయాన్నే చేయగోరుతాను. నా ఇంగితం విదురునికి తెలియకుండా జాగ్రత్తపడతాను. ప్రత్యేకించి విదురుని ఎదుట వారి గుణాలను కీర్తిస్తాను. నా అభిప్రాయాన్ని విదురుడు గ్రహింపకుండా నా చేష్టలను అదుపుచేస్తాను. దుర్యోధనా! నీ వనుకొన్నదేదో నాకు చెప్పు. కర్ణా! ఇపుడు నీవనుకొన్నదీ నాకు త్వరగా చెప్పు. దుర్యోధను డిలా అన్నాడు. తండ్రీ! మనకు విశ్వాసపాత్రులను మన మీకార్యానికి నియోగించాలి. వారిద్వారా కుంతీపుత్రులను మాద్రీపుత్రుల నుంచి విడదీయాలి. లేదా ధనరాశులతో ద్రుపదుని, అతనికుమారులను, మంత్రులను ప్రలోభపెట్టాలి. ధర్మజుని వారందరు విడిచిపెట్టేటట్లు చేయాలి. వారిని ద్రుపదుడు తన నగరం నుంచి తరిమివేయాలి. లేదా బ్రాహ్మణులద్వారా పాండవులు అక్కడే ఉండటం మంచిదని చెప్పించాలి. ఆ బ్రాహ్మణులు ఒక్కొక్కరితో విడివిడిగా హస్తినాపురనివాసం మీకు హానికరం అని చెప్పాలి. పాండవులు భయపడి పాంచాలదేశనివాసమే మంచిదని తలంచేటట్లు చేయాలి. ఉపాయనిపుణులు నేర్పరులైన, కొందరిని నియమించి వారు ప్రేమతో పాండవులను

చేరి పాండవులలోనే భేదభావం కలిగించేలా చేయాలి. లేకపోతే ద్రౌపదియే పాండవులను మరచేలా చేయాలి. భర్తలెక్కు వైనందువల్ల అది తేలిక. లేదా పాండవులకు ఆమెపై విరక్తి కల్గించాలి. అప్పుడు ఆమెకు వారిపై విరక్తి కలగాలి. రాజా! సమర్థులైన యోధులు రహస్యంగా భీముని వధించాలి. వారందరిలో అతడే బలశాలి. ఆ భీమసేనుని అండతోనే ధర్మజుడు మనలను పూర్వంనుంచి లెక్కపెట్టలేదు. భీముడు వీరుడు, శూరుడు. పాండవుల కతడే దిక్కు. రాజా! భీముని చంపితే పాండవులు ఉత్సాహపరాక్రమాలు కోల్పోతారు. అప్పుడు రాజ్యానికై ప్రయత్నించరు. అతడే గదా వారికి సహాయకారి. భీముని సహాయం ఉంటే యుద్ధంలో అర్జునుడు తిరుగులేనివాడు. భీముడు మరణిస్తే అర్జునుడు కర్ణునకు నాల్గవవంతుకు కూడా సాటిరాడు.

భీమసేనుడు లేనప్పుడు వారి బలహీనతను వారు తెలిసికొని, మనలను బలవంతులనుగా గుర్తించి యుద్ధానికి సిద్ధంకారు. రాజా! వారు హస్తినకే చేరి మన ఆజ్ఞావశులై ఉంటే వారిని నీతిశాస్త్రానుసారం నాశనమయ్యేట్లు చేద్దాం. అందమైన స్త్రీలను ప్రయోగించి వారిని ప్రలోభపరచాలి. అప్పుడు ఒక్కొకరిపట్ల ద్రౌపది విరక్తి చెందాలి. పాండవులను తీసుకొనిరావటానికి రాధేయుని పంపాలి. వచ్చిన తర్వాత సన్నిహితుల చేతనే పాండవులను చంపించాలి. ఈ ఉపాయాల్లో నిర్దోషమైన దాన్ని ప్రయోగిస్తే మీరు నిర్దోషులవుతారు. సమయం మించిపోతోంది. ద్రుపదునిపై మిగిలిన రాజులందరికీ విశ్వాసం కలుగకపూర్వమే ఈపని ఆచరించాలి. లేకపోతే వారిని చంపడం కష్టసాధ్యం. శత్రువుల నాశానికి ఈ ఉపాయం నాబుద్ధికి తోచింది. గుణదోషవిచారం మీరు చేయాలి. కర్ణా! ఈ పనిలో నీ అభిప్రాయం కావాలి."

201. పాండవులపై పరాక్రమమే ఉచితమని కర్ణుడు చెప్పుట.

కర్ణుడు ఇలా అన్నాడు - "దుర్యోధనా! నాఅభిప్రాయంలో నీసలహా ఉచితమైంది కాదు. కురువర్ధనా! నీవు చెప్పిన ఉపాయాలలో దేనితోనూ పాండవులను వశపరచుకోలేము. వీరుడా! పాండవులను వశపరచుకొనటానికి నీవు గతంలోనే అనువైన ఉపాయాలన్నీ ప్రదర్శించావు. కాని వారు నీకు లొంగలేదు. ఇక్కడ ఉన్నపుడు వారు రెక్కలు రాని పక్షిపిల్లలు. అయినా నీవు వారిని బాధించలేకపోయావు. ఇప్పుడు వారు రెక్కలు వచ్చినవారు. విదేశీయులు. సహాయకులతో అభివృద్ధిని పొందారు. కౌంతేయులు ఏ ఉపాయానికీ లొంగరు. ఇది నా నిశ్చయం. వారినిప్పుడు ఆపదల్లో పడవేయలేం. అదృష్టం వారిని శక్తియుక్తులుగా చేసింది. వారిలో తాతతండ్రుల రాజ్యం పొందాలనే కాంక్ష పుట్టింది.

వారిమధ్య భేదం పుట్టించటం సాధ్యం కాదు. వారు ఒకే భార్యను వివాహమాడినవారు. ఆ కారణంగా వారి మధ్య కలహం రాదు. ద్రౌపదిని పాండవులనుంచి వేరు చేయటం పరులకు అసాధ్యం. భిక్షాటన చేస్తున్నపుడే పాండవులను వరించిన ఆమె సంపన్నులైనప్పుడు ఎలా విరక్తిని పొందుతుంది? స్త్రీలకు అనేకులను భర్తలుగా పొందటం ఇష్టమైన గుణం. ఆమెకిది అప్రయత్నంగా లభించింది. కాబట్టి ఆమె వారిపట్ల విరక్తి పొందటం కష్టం.

పాంచాలరాజు ద్రుపదుడు నియమాలను ఆచరిస్తాడు. ధనమంటే ఇష్టంలేనివాడు. నీవు నీరాజ్యాన్ని పూర్తిగా ద్రుపదునకిచ్చినా అతడు పాండవులను విడువడు. అట్లే ద్రుపదకుమారుడు ధృష్టద్యుమ్నుడు గుణవంతుడు. పాండవులపై ప్రేమ కలవాడు. క్షుద్రోపాయాలకు అతడు లొంగడు. రాజా! మనకొక ఉపాయం ఉంది. పాండవుల బలం గట్టిపడకముందే వారిని నాశనం చెయ్యాలి. మనసైన్యం బలమైంది. ద్రుపదుడు చిన్నరాజు. ఆలోచింపక వెంటనే వారిని సమూలంగా పెకలించివేయాలి. రాజా! గాంధారీనందనా! పాండవులు వాహనాలను, మిత్రులను, బంధువులను పోగుచేసికొనటానికి ముందే మనం వారిపై దాడి జరపాలి. రాజా! మహావీరులైన తన పుత్రులతో కలిసి మనమీద దాడిచెయ్యాలి అనే ఆలోచన ద్రుపదునకు కలిగేలోపు నీవు అతనిపై విక్రమించాలి. కృష్ణుడు యాదవసైన్యం తీసుకొని పాండవుల రాజ్యంకోసం ద్రుపదుని భవనానికి రాకపూర్వమే నీవు పరాక్రమించాలి. కృష్ణుడు పాండవులకై ధనం, భోగాలు, రాజ్యం యావత్తూ ఏ సంకోచం లేకుండా త్యాగం చేయటానికి వెనుకంజవేయడు. పరాక్రమంతో భూమినంతటిని భరతుడు తన అధీనంలోకి తెచ్చుకొన్నాడు. ఇంద్రుడు కూడా పరాక్రమం చేతనే ముల్లోకాలనూ జయించాడు. రాజా! క్షత్రియులకు పరాక్రమమే అలంకారం. శూరులకు విక్రమం స్వకీయధర్మం. చతురంగబలాలతో పాంచాలదేశానికి పోయి ద్రుపదుని ఓడించి పాండవులను బందీలుగా తీసికొనిరావాలి. సామదానభేదోపాయాలు పాండవులను బాధించలేవు. దండోపాయాన్ని ఆశ్రయించి పరాక్రమంతో వారిని లొంగదీయాలి. పరాక్రమంతో శత్రువులను జయించి భూమినంతటిని అనుభవించు. రాజా! కార్యసిద్ధికి వేరొక ఉపాయం లేదు." కర్ణుని మాటలు విని ధృతరాష్ట్రుడు అతనిని అభినందించి ఇలా అన్నాడు. "కర్ణా! నీవు బుద్ధిమంతుడవు. శస్త్రాస్త్రవిశారదుడవు. సూతకులానందకారకుడవు. నీకే పౌరుషయుక్తాలైన మాటలు తగినవే. మీరిద్దరు భీష్మ, ద్రోణ, విదురులతో కలిసి ఆలోచించి మనకు సుఖ మే విధంగా కలుగుతుందో నిర్ణయించాలి." తరువాత మంత్రులు, భీష్ముడు, ద్రోణుడు మొదలైనవారిని రప్పించి ధృతరాష్ట్రుడు వారితో మంత్రాంగం చేశాడు.

202. పాండవులకు అర్ధరాజ్యమిమ్మని భీష్ముడు దుర్యోధనునకు చెప్పుట.

భీష్ముడు చెప్పాడు – "పాండవులతో యుద్ధం చేయటం నాకు ఏ విధంగానూ ఇష్టంలేదు. నాకు ధృతరాష్ట్రుడెంతో పాండురాజూ నిస్సంశయంగా అంతే. ధృతరాష్ట్రా! గాంధారిపుత్రులు, కుంతీపుత్రులు నాకు, నీకు సమానమైనవారు. వారు నాకెట్లు రక్షింపతగినవారో నీకూ అట్లే. రాజా! నీకు, నాకు పాండవుల రక్షణం అవశ్యకర్తవ్యం. దుర్యోధనునికి మిగిలిన కురురాజులకు వారి రక్షణ ముఖ్యం. పాండవులతో యుద్ధం నా కిష్టం లేదు. వారికి అర్ధరాజ్యం ఇవ్వాలి. సంధి చేసుకోవాలి. ఈ రాజ్యం వారి తాతతండ్రులకు కూడ చెందిందే. తండ్రీ! దుర్యోధనా ! ఈ రాజ్యాన్ని నీవు నీ తండ్రిదని, భావించావు. అట్లే వారు తమ తండ్రిదని తలంచారు. కీర్తినొందిన పాండవులు ఈ రాజ్యాన్ని పొందలేనప్పుడు భరతసంతతికి చెందిన మీరైనా ఈ రాజ్యాన్ని పొందలేరు. భరతకుల శ్రేష్ఠా! అధర్మంగా ఈ రాజ్యాన్ని నీవు పొందావు. నీకంటె ముందు వారు ఈ రాజ్యం పొందారని నా అభిప్రాయం. పురుషశ్రేష్ఠా! ప్రేమతో వారికి అర్ధరాజ్యం ఇయ్యి. ఇది అందరికి శ్రేయస్కరం. దీనికి భిన్నంగా చేస్తే అది మనకు హితం కాదు. నీకు నిస్సందేహంగా అపకీర్తి కలుగుతుంది. నీకీర్తిని నీవే కాపాడుకో. **కీర్తియే మానవులకు గొప్పబలం. కీర్తి నశించినవాని జీవితం నిష్ఫలం. మనుజులకీర్తి నశించనంతవరకు వారు జీవించినట్లు భావించాలి. కీర్తి నశించిన వారు చచ్చిన వారితో సమానం.**

కురుకులానికి తగిన ధర్మం ఆచరించు. నీ పూర్వులకు తగిన పనులు చెయ్యి. అదృష్టవశాత్తు పాండవులు, కుంతి బ్రతికి బయటపడ్డారు. వారి అదృష్టంవల్లనే పురోచనుడు కోరిక తీరకుండా నశించాడు. గాంధారనందనా! కుంతి, పాండవులు లక్క్యింటిలో దగ్ధమైనారని విన్న తర్వాత నేను ఏ ప్రాణిని ఈ లోకంలో కన్నెత్తి చూడలేదు. నరశ్రేష్ఠ! జనులు ఈపనిలో నిన్ను నిందించినంతగా పురోచనుని నిందించటంలేదు. కావున మహారాజా! పాండవులు జీవించి ఉండటమూ, వారి దర్శనమూ నీ పాపం తొలగిస్తుందని భావించు. కురునందనా! పాండవులు బ్రతికి ఉండగా వారి రాజ్యాన్ని స్వయంగా ఇంద్రుడైనా అపహరింప శక్యం కాదు. వారు ధర్మపరులు. వారిది ఒకే మనస్సు, ఒకే ఆలోచన, ఈరాజ్యంపై మీఇద్దరికి సమానభాగం ఉంది. కాని అధర్మపరుడవైన నీచే పాండవులు తరిమివేయబడ్డారు. **నీకు ధర్మంగా నడవాలని ఉన్నా, నాకు ప్రియం చేయాలని**

ఉన్నా, జనులు క్షేమంగా ఉండాలన్నా, వారి అర్ధరాజ్యం వారికి ఇయ్యి."*

203. ద్రోణుడు పాండవులను పిలిపించుమనుట, కర్ణుని తిరస్కారము.

ద్రోణుడు అన్నాడు - "ధృతరాష్ట్రా! మంత్రాంగానికి పిలచిన వారు హితైషులై ధర్మకరం, అర్థకరం, కీర్తికరం అయిన అంశాలను ప్రతిపాదించాలి. అది మాకు గురుపరంపరచే లభించింది. దుర్యోధనా! నా అభిప్రాయం భీష్ముని అభిప్రాయంతో సమానం. కుంతీపుత్రులకు అర్ధరాజ్యం ఇవ్వడం సనాతనధర్మం. భరతశ్రేష్ఠా! ద్రుపదుని దగ్గరకు మాటకారి అయిన దూతను శీఘ్రమే పంపు ఆ దూత మణులను, రత్నాలను పాండవులకు సమర్పించాలి. ధృతరాష్ట్రుని నుండి ధనాన్ని, కానుకల్ని గ్రహించి ఆ దూత ద్రౌపదికి ఇవ్వాలి. అతడు ద్రుపద, ధృష్టద్యుమ్నుల ఎదుట మాటిమాటికి వారి బాంధవ్యాన్ని ధృతరాష్ట్ర దుర్యోధనులు తమ వృద్ధిగా భావించారు అని, వారివిషయంలో ప్రసన్నతతో ఉన్నారని తెలపాలి. అతడు కుంతీపుత్రులను, మాద్రీపుత్రులను ఊరడిస్తూ ఉచితమైన, ప్రియమైన ప్రసంగాలు చెయ్యాలి. రాజేంద్రా! మీ ఆజ్ఞగా ద్రౌపదికి సువర్ణాభరణాలు, సుందరాభరణాలు అందించాలి. ద్రుపదునికుమారులకు, పాండవులకు, కుంతికి ఉపయోగించే ఆభరణాలు విడివిడిగా పంపాలి. ఈ విధంగా కానుకలిచ్చి పాండవులను, ద్రుపదుని ఊరడించి పాండవుల హస్తినాపురాగమనాన్ని ఆ దూత ప్రస్తావించాలి. ద్రుపదుని ఆజ్ఞతో పాండవులరాక నిశ్చయమైన పిమ్మట పెద్దసేనతో దుశ్శాసన, వికర్ణులను పాండవులను తీసుకొని వచ్చుటకు పంపాలి. ఇక్కడకు వచ్చినపిమ్మట శ్రేష్ఠులైన పాండవులు నీచే గౌరవసత్కారాన్ని పొందుతూ ప్రజలకోరిక ననుసరించి తండ్రి రాజ్యంపై ప్రతిష్ఠింపబడాలి. భరతవంశజుడా! నీవు పాండవులపట్ల, నీ పుత్రులపట్ల పైన చెప్పినదాన్ని ఆచరించు. ఇది నాకూ, భీష్మునికీ సమ్మతమైన అంశం."

అపుడు కర్ణుడు - "మహారాజా! మీరు భీష్మద్రోణులను పనులు పూర్తయినపిదప ధన, సన్మానాలతో గౌరవించారు. వారు మీ ఆంతరంగికులని భావించారు. వారు, మీకు సరియైన మార్గాన్ని నిర్దేశించనప్పుడు ఇంతకంటె ఆశ్చర్యం ఏముంది? దుష్టసంకల్పంతో, దోషహృదయంతో హితవును నమ్మపలికిన వారిని ఎలా విశ్వసించాలి? వారిని నమ్మినవారికి ఎలా శుభం కలుగుతుంది? కష్టం కలిగినప్పుడు, ధనసంకటాలయందు, మిత్రులు శుభాన్ని ఉపదేశించకపోతే ఆ రాజులకు అదృష్టానుసారం సుఖదుఃఖాలు కలుగుతాయి.

---

* యది ధర్మ్యమ్యయా కార్యః యది కార్యం ప్రియం చ మే ।
క్షేమం చ యది కర్తవ్యం తేషామర్ధం ప్రదీయతామ్ ॥ 19

మానవుడు మూర్ఖుడైనా, బుద్ధిమంతుడైనా; బాలుడైనా, వృద్ధుడైనా, సహాయకులు ఉన్నా లేకున్నా దైవయోగం వల్లనే అన్ని ప్రదేశాల్లోను అన్నిటిని పొందుతాడు. పూర్వకాలంలో అంబుపీచుడు అనే ప్రసిద్ధి గలరాజు మగధవంశీయుడు రాజ్యపరిపాలన చేశాడు. అతడు శ్వాసరోగపీడితుడై, ఇంద్రియబలం లేక మంత్రుల అధీనంలో ఉండి కార్యాలను నడిపించాడు. అతనిమంత్రిపేరు మహాకర్ణి. అతడే రాజై సైనికబలాన్ని కూడదీసికొని రాజును అవహేళన చేయసాగాడు. మహాకర్ణి రాజనుభవింపతగిన స్త్రీ, రత్న ధనాల్ని మూడుడై స్వయంగా అనుభవించసాగాడు. ఆ లోభి దుర్గుణాలు రోజురోజుకు పెరిగాయి. సమస్త వస్తువులను అపహరించి, రాజ్యాన్ని అపహరింపగోరాడు. శ్వాసరోగపీడితుడైన అతని రాజ్యాన్ని, ఇంద్రియబలం లేని కారణంగా అపహరించాలని ప్రయత్నించినా ఆ మహాకర్ణి అపహరించలేకపోయాడన్నది మనకు తెలిసిందే. రాజు అదృష్టం చేత రక్షింపబడ్డాడు. భాగ్యంకంటె వేరు సహాయం లేదు. అదృష్టం నీదైతే రాజ్యం వృద్ధిని పొంది నీ అదుపులో ఉంటుంది. తారుమారైతే ప్రయత్నించినా నీ అధీనంలో ఉండదు. రాజా! మీరు మాటలను విని మీ మంత్రుల మంచి, చెడులను తెలుసుకోండి. దోషులను, నిర్దోషులను వారి మాటలచే గుర్తించాలి."

ద్రోణుడు అన్నాడు - "దుష్టుడా! నీవు ఎందుకు ఇట్లా మాట్లాడావో మాకు తెలుసు. పాండవుల మీది ద్వేషంతో ప్రేరితుడవై నా మాటలలో లేని దోషం కల్పించావు. కర్ణా! నేను నా తెలివిని ఉపయోగించి, కౌరవుల వృద్ధిని కోరి, హితం ఉపదేశించాను. ఇది నీవు తప్పని అనుకొంటే కౌరవులకు దేనివలన హితం కలుగుతుందో దానిని ఉపదేశించు. నేను ఆలోచించి హితాన్ని చెప్పాను. దీనికి భిన్నంగా ఆచరిస్తే కౌరవులు శీఘ్రంగా నాశనం పొందుతారని నా నమ్మకం."

204. భీష్మ, ద్రోణుల మాటలను విదురుడు సమర్థించుట.

అపుడు విదురుడిలా అన్నాడు. "రాజా! మీహితైషుల కర్తవ్యం , శ్రేయస్సును సందేహించక పలుకుటయే. మీరు విననిచో ఆ హితవాక్యాలకు విలువ ఎంత మాత్రం లేదు. రాజా! భీష్ముడు నీకు ప్రియహితవాక్యాలు చెప్పాడు. కాని ఆ వచనాల్ని మీరు గ్రహించటంలేదు. ద్రోణుడు కూడ హితమే చెప్పాడు. రాధానందనుడు కర్ణుడు ఆ వాక్యాలు మీకు మేలు కలిగించవని భావించాడు. మహారాజా! ఈ పురుషశ్రేష్ఠులకంటే విచారణలో అధికులు, మీమేలు కోరేవారు ఎంత విచారించినా నాకు కనపడలేదు. రాజేంద్రా! వయస్సు, ప్రజ్ఞ, శాస్త్రాలలో వీరిద్దరు ఒకరికొకరు తీసిపోరు. వీరు మీమీద,

పాండుపుత్రులమీద సమానమైన ప్రేమ కలవారని చెప్పాలి. ధర్మంలో, సత్యంలో వీరిద్దరు దశరథరామునికంటె, గయునికంటె అధికు లనటంలో సంశయం లేదు. మీకు అనిష్టం కల్గించే మాటలు వీరెప్పుడూ మీ ఎదుట పలుకలేదు. అదేవిధంగా నాకు తెలిసి మీకు వీరు అపకారం చేసిన గుర్తులేదు. మహారాజా! మీకు వారి విషయాన అపరాధ చింత అవసరంలేదు. ఆ పురుషశ్రేష్ఠులు మీకు హితం చేసేవారే. రాజా! వీరు లోకంలో నరశ్రేష్ఠులు, బుద్ధిమంతులు. కావున మీకు వంచనతో కూడిన మాటలను చెప్పరు. కురునందనా! ధర్మం తెలిసిన వారు స్వార్థంకోసం ఏదో ఒకపక్షాన లాభం పొందాలనే ఆలోచన చేయనివారు అని నా విశ్వాసం.

భరతశ్రేష్ఠా! వీరి అభిప్రాయం నీకు కళ్యాణకారకం. దుర్యోధనాదులవలె పాండవులు నీ పుత్రులే. సందేహం లేదు. దీనిని తెలియని ఇతరమంత్రులు మీ శ్రేయస్సును గుర్తింపలేరు. మీకుమారులపై మీకున్న పక్షపాతం వీరిమాటల్లో తెలిసినందున వారు మీకు కీడే చేస్తారు. కావున వీరిద్దరు తేజస్వులూ, మహాత్ములు; కించిత్తు కూడా తగని సలహా ఇవ్వలేదు. కాని మీరు వీరి ఆలోచనను అంగీకరించలేదు. పాండవులు అజేయులని వీరు ప్రశంసించిన మాటలు సత్యాలు. పురుషశ్రేష్ఠా! మీకు కళ్యాణం కలగాలి. రాజా! ధనంజయుడు శ్రీమంతుడు. అతనిని యుద్ధంలో ఇంద్రుడైనా జయించలేడు. వేయి ఏనుగుల బలం కల బాహుబలశాలి భీమసేనుని సమరంలో అమరులైనా గెలువలేరు. అలాగే యముని సుతులతో సమానులు, కవలలు, నకులసహదేవులను యుద్ధంలో జీవితాశ గలవారు ఎవరు ఎదుర్కొంటారు? యుధిష్ఠిరునిలో ధైర్యం, దయ, ఓర్పు, సత్యం, పరాక్రమం సదా ఉంటాయి – యుద్ధంలో అతనిని జయించటం అసాధ్యం. బలరాముడు, ఉపాయశాలిలా శ్రీకృష్ణుడు, అతని తమ్ముడు సాత్యకి ఎవరి పక్షంలో ఉన్నారో వారిని ఓడించటం చాల కష్టం. పాండవులు ద్రుపదుని అల్లుళ్లు. ధృష్టద్యుమ్నుని బావలు. వారిని జయించటం అసంభవం. భరతశ్రేష్ఠా! ధర్మబద్ధంగా పాండవులు ఈ రాజ్యానికి ఉత్తరాధికారులు. ఈ విషయాన్ని మరువకుండా తగిన దానిని చెయ్యి. రాజా! పురోచనుని పనివల్ల మీ అపకీర్తి అన్నివైపులకు పాకింది. పాండవులను అనుగ్రహించి ఈ మచ్చ పోగొట్టుకో. పాండవులపై చూపే ఈ అనుగ్రహం మన కులాన్ని రక్షిస్తుంది. హితాన్ని చేకూరుస్తుంది. క్షత్రియజాతి కంతటికి మేలు చేస్తుంది. రాజా! ద్రుపదుడు చాలా బలశాలి. మనకు అతనితో పూర్వం వైరం ఉంది. ఆయన్ని మనపక్షంలో చేర్చుకోవటం మనకు అభ్యుదయకరం. మహారాజా! యదువంశీయుల సంఖ్య అధికం. పైగా బలవంతులు. కృష్ణుని పక్షమే వారి పక్షం. కృష్ణుడే పక్షాన ఉంటాడో వారికే జయం కలుగుతుంది. సామోపాయం చే సాధ్యమయ్యే

కార్యాన్ని దైవోపహతుడు యుద్ధంతో సాధించాలని చూస్తాడు. కుంతీపుత్రులు మరణించలేదని విని పౌరులు, జానపదులు వారిని చూసి సంతోషించారు. రాజా! వారికందరికీ ప్రియాన్ని ఆచరించు. దుర్యోధనుడు, కర్ణుడు, శకుని అధర్మపరాయణులు, బాలురు. ముందువచ్చే ఆపదలను తెలుసుకోలేరు. వారి మాటలను ఆచరింపవద్దు. భూపాలా! గుణవంతులు మీరు. మీకు పూర్వమే దీనిని వివరించాను. దుర్యోధనుని తప్పుల వల్ల సమస్త ప్రజలు నశిస్తారు."

205. పాండవులను తీసికొనివచ్చుటకు విదురుడు ద్రుపదుని కడకేగుట.

ధృతరాష్ట్రుడు చెప్పాడు - "విదురా! భీష్ముడు జ్ఞాని. ద్రోణుడు ఋషి. వారి మాటలు మేలు చేస్తాయి. నీ మాటలు చాలా హితం కలిగిస్తాయి. ఇంకా సత్యాలు. పాండవులు ధర్మంగా నాకూ పుత్రులే అన్నది సందేహంలేని మాట. నా పుత్రులకు ఈ రాజ్యం ఎలా చెందుతుందో పాండవులకూ అలాగే చెందుతుంది. ఈ మాట నిస్సందేహం. విదురా! నీవు ఇప్పుడే పోయి, కుంతిని, పాండవులను, దైవాంశగల ద్రౌపదిని తోడ్కొని రమ్ము. కుంతి కూడా అదృష్టవశాన జీవించి ఉంది. కుంతీపుత్రులు బ్రతికి ఉండటం మన అదృష్టం, మహారథులైన పాండవులు ద్రుపదకన్యను స్వీకరించటం మరీ అదృష్టం. తేజస్వీ! అదృష్టం కొలది మనం వృద్ధి పొందాం. పురోచనుడు దూరమయ్యాడు. నా దుఃఖమంతా తొలగిపోయింది. అన్నాడు. తరువాత "ధృతరాష్ట్రుని ఆజ్ఞానుసారం విదురుడు ద్రౌపదికి, పాండవులకు, ద్రుపదునికి కానుకలను తీసికొని పాండవులను చేరాడు. పాంచాల రాజధానికి పోయి ధర్మజ్ఞుడైన విదురుడు పెద్దలనుంచి పిన్నలవరకు క్రమం అనుసరించి నమస్కరించాడు. రాజైన ద్రుపదుడు ధర్మంగా విదురుని ఆదరించాడు. పిమ్మట ఇరువురు ఒకరినుంచి వేరొకరు కుశలప్రశ్నలడిగి క్షేమం తెలుసుకొన్నారు. విదురుడు పాంచాలరాజ్యంలో శ్రీకృష్ణుని, పాండవులను చూశాడు. ప్రేమతో కౌగిలించుకొని వారిని కుశలమడిగి సంతృప్తి పడ్డాడు. వారందరు బుద్ధిమంతుడైన విదురుని తగిన రీతిలో ఆదరించారు. ధృతరాష్ట్ర వచనానుసారం పాండవులను ఒక్కొక్కరిని క్షేమం, అడిగి తెలుసుకొన్నాడు. పాండవులకు, కుంతికి, ద్రుపదునికి అతనిపుత్రులకు కౌరవులిచ్చిన ఆభరణాలు, రత్నాలు, ధనాలు ఇచ్చాడు. అమితబుద్ధి గల విదురుడు, శ్రీకృష్ణపాండవుల ఎదుట వినయంతో నమ్రతతో ఇలా పలికాడు.

"ద్రుపదమహారాజా! పుత్రులు, మంత్రులతో కలిసి మీరు నా మాటలు వినండి. చక్రవర్తి ధృతరాష్ట్రుడు పుత్ర, మిత్ర, బంధు, మంత్రి గణసహితులైన మిమ్ములను

క్షేమం అడిగాడు. మీపై ప్రసన్నత చూపాడు. మహారాజా! మీసంబంధం మాకు ప్రీతినిస్తోంది అని చెప్పమని నన్ను పంపాడు. భీష్ముడు కౌరవులందరితో గూడి మీక్షేమాన్ని అన్నివిధాల కాంక్షించాడు. నీ ప్రియస్నేహితుడు, ద్రోణుడు నిన్ను కౌగిలించుకొని కుశలప్రశ్నలను అడిగాడు. ధృతరాష్ట్రమహారాజు మీతో సంబంధం కలియటం వల్ల తనను ధన్యునిగా భావించాడు. కౌరవులందరు కూడ ఇట్లే భావించారు. యజ్ఞసేనా! వారికి రాజ్యప్రాప్తి కూడా అంతప్రీతిని కలిగించలేదు. మీసంబంధం వారిని అన్నివిధాల ప్రసన్నులను చేసింది. దీనిని తెలిసికొని మీరు పాండవులను హస్తినకు పంపాలి. కురువంశీయులు అందరూ చచ్చి బ్రతికిన వారిని చూడాలి అని ఆకాంక్షిస్తున్నారు. చాలాకాలం నుంచి వీరు పరదేశాలలో జీవించారు. పాండవులు, కుంతి కూడ తమ పూర్వనగరాన్ని చూడాలనే కుతూహలంతో ఉంటారు. కౌరవకులంలోని శ్రేష్ఠులైన స్త్రీలు గాంధారి మొదలగువారు, హస్తినాపురప్రజలు పాంచాలరాజ పుత్రిని చూడాలనే కోరికతో ఆమె రాకకై ఎదురు చూస్తున్నారు. అందుచే మీరు పాండుపుత్రులను భార్యతో హస్తినకు రమ్మని ఆజ్ఞాపించాలి. ఇది నాకూ ఇష్టం. వారిని హస్తినాపురానికి వెళ్లమని మీరు ఆజ్ఞాపిస్తే నేను వారి రాకను తెల్పటానికి తొందరగా చేరే దూతలను హస్తినకు పంపుతాను. కుంతి, ద్రౌపది, పాండవులు హస్తినకు వస్తున్నారని ధృతరాష్ట్రునకు వారు తెల్పుతారు."

206. పాండవులు అర్ధరాజ్యమును పొంది ఇంద్రప్రస్థనిర్మాణము చేయుట.

ద్రుపదుడు అన్నాడు – "విదురా! నీవు చెప్పినదంతా సత్యం. కౌరవుల ఈ సంబంధంతో నాకు చాలా ఆనందం కల్గింది. పాండవులు హస్తినకు చేరటం ఉచితమే. కాని నేను వెళ్ళమని చెప్పటం సరైందికాదు. యుధిష్ఠిరుడు, భీమసేనుడు, అర్జునుడు, నకులసహదేవులు, బలరామకృష్ణులు ఎక్కడకువెళ్లటం తగినదని భావిస్తారో అక్కడికే వెళ్లాలి. బలరామకృష్ణులు వీరిపట్ల మిక్కిలి ప్రీతికల్గి ఉన్నారు." యుధిష్ఠిరుడు అన్నాడు. "రాజా! మేము అందరం నీ వశంలో ఉన్నాం. ప్రసన్నుడవై ఉచితానుచితాలు నిర్ణయిస్తే అట్లే చేస్తాం." తరువాత వాసుదేవుడు ఇలా అన్నాడు. "సర్వధర్మాలూ తెలిసిన ద్రుపదుడు అనుకొన్నట్లుగా వెళ్లడమే నాకూ ఇష్టం". ద్రుపదుడు అపుడు ఇలా అన్నాడు – "దాశార్హుడైన కృష్ణుని అభిప్రాయమే నాకూ సమ్మతం. కుంతీపుత్రులు ఇప్పుడు నాకు ఎట్టి బంధువులో శ్రీకృష్ణునకూ వారు అలాంటివారే అనే మాట సత్యం. పురుషోత్తముడు ఎల్లప్పుడూ పాండవుల హితం ఎంతగా కోరుకుంటాడో అంతగా కుంతీపుత్రుడు ధర్మజుడు కూడ

తమ హితాన్ని కోరడు."

(తేజస్వి అయిన విదురుడు కుంతిభవనాన్ని చేరాడు. అతడు భూమిని శిరస్సుతో తాకి, కుంతి పాదాలకు నమస్కరించాడు. కుంతీదేవి మరిదిని చూచి మిక్కిలి విలపించింది. కుంతి అన్నది - "విదురా! నీ పుత్రులైన పాండవులు ఎలాగో నీ అనుగ్రహంతో లక్క్యింటినుండి బయటపడి తిరిగి వచ్చారు. తాబేలు తన పిల్లల్ని గురించి ఆలోచన చేయడమే వాటిని పెంచటం, పోషించటం అవుతుంది. అవి తెలివితేటలు సంపాదిస్తాయి. అదేవిధంగా పాండవులు నీ ఆలోచనతో పెరిగి మంచివారయ్యారు. నీవే వీరి రక్షకుడవు. కోకిలపుత్రులను కాకి సంరక్షించినట్లు నీ పుత్రుల్ని నేను పెంచాను. ఇప్పటివరకు ప్రాణాంతకాలైన కష్టాలను అనుభవించాను. ఇకపై కర్తవ్య నిర్ణయం నీవే చెయ్యాలి. నాకెంతమాత్రం తెలియదు." విదురుడు అన్నాడు - "యాదవ వంశనందినీ! నీ పుత్రులు, బలవంతులు. ఇతరులచే నాశం పొందరు, అచిరకాలంలో వారు బంధుమిత్రులతో కలిసి రాజ్యాధికారం పొందుతారు. నీవు దుఃఖించకు.")

వైశంపాయనుడు అన్నాడు - రాజా! ద్రుపదుని అంగీకారంతో పాండవులు, ద్రౌపది, కుంతి, శ్రీకృష్ణుడు, విదురుడు సుఖంగా హస్తినకు బయలుదేరారు.

(ఆ సమయాన ద్రుపదుడు కంరాన బంగారు ఆభరణాలు, బంగారు అంబారీ పీరాలు ఉన్న వెయ్యి ఏనుగులను ఇచ్చాడు. వాటి శరీరం నుండి మదధారలు స్రవిస్తున్నాయి. మావటి వాండ్రు వాటిని నడపుతున్నారు. వారు అస్త్రశస్త్రాలలో ఆరితేరినవారు. నాలుగేసి గుఱ్ఱాలు పూన్చిన వేయి రథాలను ఇచ్చాడు. ఐదువందల ఉత్తమజాతి గుఱ్ఱాలు ఇచ్చాడు. వాటి బంగారు ఆభరణాల కాంతులు అన్నివైపులా ప్రసరించాయి. పదివేల దాసీజనాన్ని ఇచ్చాడు. వెయ్యిమంది సమర్థులైన ధానుష్కులను ఇచ్చాడు. బంగారు పాత్రలు, పాన్పులు, ఆసనాలు ఇచ్చాడు. విడివిడిగా కోటి సంఖ్యలో గోధనం కూడా పంపాడు. ద్రుపదుడు వంద పల్లకీలను, అయిదు వందల బోయీలను తనకుమార్తెకు కానుకగా ఇచ్చాడు. ఈ విధంగా పాంచాలరాజు ద్రౌపదికి సమస్తవస్తువులనూ, ధనాన్నీ, అరణంగా ఇచ్చాడు. ధృష్టద్యుమ్నుడు స్వయంగా ద్రౌపది చేయిపట్టుకొని రథమెక్కించాడు. అప్పుడు అక్కడ వేలకొలది మంగళవాద్యాలు మ్రోగాయి.)

ధృతరాష్ట్రుడు పాండవుల రాక విని వారి ముందుకుపోయి స్వాగతం చెప్పటానికి కౌరవులను పంపించాడు. భారతా! ధానుష్కుడైన వికర్ణుని, చిత్రసేనుని, ధనుర్విద్యావిశారదుడు ద్రోణుని, గౌతమవంశీయుడు కృపుని పంపాడు.

ఆ వీరులతో కలిసి మహాబలులు, వీరులు అయిన పాండవులు మెల్లమెల్లగా హస్తినలో ప్రవేశించారు.

(పాండవుల రాక విని పౌరులు నగరాన్ని అన్నివైపుల అలంకరించారు. పూలు చల్లారు. నీళ్ళతో తడిపారు. దివ్యధూపాలు వెలిగించారు. పుష్పహారాలతో, జెండాలతో, శంఖభేరీనాదాలతో, నానావాద్యాలతో మారుమ్రోగుతూ నగరం కుతూహలంతో దేదీప్యమానంగా ఉంది.)

'పాండవులు పురుషశ్రేష్ఠులు. ప్రజల శోకదుఃఖాలను నివారించేవారు.' ప్రియంచేసే పౌరులు పలికిన హృదయంగమాలైన పలుకులు పాండవులు విన్నారు. 'ధర్మవేత్త యుధిష్ఠిరుడు తిరిగి వచ్చాడు. మనలను తన కన్నబిడ్డలవలె ధర్మంగా పరిరక్షిస్తాడు. నేడు జనప్రియుడైన పాండుమహారాజు మనకు ప్రియం చేయాలని వనం నుంచి తిరిగి వచ్చాడు అన్నది సత్యం. కుంతీపుత్రులు పాండవులు నగరప్రవేశం చేస్తే మనకు ఏ శుభం సిద్ధింపదు? మనం పూర్వం దానం, హోమం, తపస్సు చేసి ఉంటే పాండవులు మన నగరంలో సంవత్సరాలకొద్దీ ఇక్కడేఉంటారు.' ఇంతలో పాండవులు ధృతరాష్ట్ర, భీష్మ, ద్రోణాదులకు పాదాభివందనం చేశారు. నగరవాసులందరినీ కుశలమడిగి ధృతరాష్ట్రుని ఆజ్ఞానుసారం పాండవులు తమతమ భవనాల్లోకి ప్రవేశించారు.

(దుర్యోధనుని రాణి తోడికోడండ్రతో కలిసి ఎదురేగి రెండవలక్ష్మివలె ఉన్న ద్రౌపదికి స్వాగతం పలికింది. శచీదేవియే అడుగుపెట్టినట్లు తోచింది. కుంతి, ద్రౌపదీ గాంధారికి నమస్కరించారు. గాంధారి ఆశీర్వదించి ద్రౌపదిని కౌగలించుకుంది. ఈ పాంచాలి నా పుత్రుల మృత్యుదేవతవలె ఉంది అని తలంచి విదురుని పిలిపించి తెలివిగా మాట్లాడింది. గాంధారి అన్నది – 'విదురా! నీకిష్టమైన రాజకుమారి కుంతిని, ద్రౌపదిని శీఘ్రంగా పాండురాజ భవనానికి చేర్చు. సామగ్రి ఆ భవనానికి చేర్పించు. కరణం, ముహూర్తం, నక్షత్రం, తిథి శుభం అయిన కారణంగా భవనంలోకి ప్రవేశపెట్టు. కుంతి తన పుత్రులతో ఆ గృహంలో క్షేమంగా ఉండాలి."

మంచి సూచనను గమనించి విదురుడు వెంటనే వారిని భవనంలో ప్రవేశపెట్టాడు. బాంధవులు పాండవులను సత్కరించారు. పౌరులు, శ్రేష్ఠులు పాండవులను పూజించారు. భీష్ముడు, ద్రోణుడు, కర్ణుడు, కుమారునితో కలిసి బాహ్లీకుడు ధృతరాష్ట్రుని ఆజ్ఞానుసారం పాండవులపై ఆదరసత్కారాలను చూపారు. ఇలా విహరించే పాండవులకు అప్పుడు విదురుడే సర్వకార్యాలకు నాయకుడై ఉన్నాడు. ధృతరాష్ట్రుని ద్వారా ఆజ్ఞను పొందాడు.)

కొంతకాలం విశ్రాంతిని పొందిన తరువాత మహాత్ములైన పాండవులను ధృతరాష్ట్రుడు, భీష్ముడు పిలిపించారు. ధృతరాష్ట్రుడు అన్నాడు. – "యుధిష్ఠిరా! నీతో చెప్పే మాటలను నీ సోదరులతో కలిసి శ్రద్ధగా వినుము.

(పాండురాజు ఈ రాజ్యాన్ని వృద్ధి చేశాడు పరిపాలించాడు. నా సోదరుడు పాండురాజు బలవంతుడు. అతడు నా ఆజ్ఞపై అసాధ్యాలను సాధ్యం చేశాడు. నీవును నా ఆజ్ఞను పాలించు. ఆలస్యం చేయకు. నా పుత్రులు గర్వం, అహంకారం కల చెడ్డవాళ్లు. వారు నా ఆజ్ఞలు పాలింపరు. స్వార్థసాధనలో లగ్నమై వారు మీతో యుద్ధం చేయకుండా ఉండాలంటే)

మీరు ఖాండవప్రస్థం ప్రవేశించాలి. అక్కడ నివసించే మిమ్మల్ని ఎవరూ బాధింపలేరు. ఇంద్రుడు దేవతలను రక్షించినట్లు అర్జునుడు మిమ్మల్ని రక్షిస్తాడు. అర్ధరాజ్యంగా ఖాండవప్రస్థాన్ని పొంది అక్కడ సోదరులతో నివసించు.

(విదురా! నీవు రాజ్యాభిషేకానికి సామగ్రిని తెప్పించు. ఆలస్యం వద్దు. నేనీరోజున కురుకుల నందనుడైన యుధిష్ఠిరుని అభిషేకిస్తాను. వేదవేత్తలయిన బ్రాహ్మణులను, వ్యాపారులను, బంధువులను, పౌరులను విశేషంగా రప్పించు. పుణ్యాహవాచనం చేయించి బ్రాహ్మణులకు భూరిదక్షిణలు ఇమ్ము. గోవులు, గ్రామాలు దానం చెయ్యి. ముత్యాలహారాలు, కోటి సూత్రం, ఉదరబంధం తెప్పించు, బ్రాహ్మణుల స్వారీకి వీలైన వెయ్యి ఎనిమిది ఏనుగులను సిద్ధంచెయ్యి, పురోహితులు, ఏనుగులు పోయి గంగాజలం తేవాలి. యుధిష్ఠిరుని సర్వాభరణాలతో అలంకరించాలి. అంబారీ ఏనుగు, సువర్ణాభరణాలు, శ్వేతచ్ఛత్రం, చామరాలతో సిద్ధం చెయ్యాలి. బ్రాహ్మణులు, రాజులు జయశబ్దాలు పలకాలి. ప్రసన్నులై ప్రజలు ఆజమీఢ వంశజుడైన యుధిష్ఠిరుని ప్రశంసించాలి. పాండురాజు చేసిన ఉపకారానికి బదులుగా ఈ రాజ్యాభిషేకం చెయ్యాలి. ఇందులో సందేహం లేదు." అనగానే భీష్ముడు, ద్రోణుడు, కృపుడు, విదురుడు బాగుందని ప్రశంసించారు. వాసుదేవుడు అన్నాడు - మహారాజా! నీ ఆలోచన ఉత్తమం. కౌరవులకు అభివృద్ధికరం. వెంటనే నీ వచనాలను నేడే ఆచరించు."

శ్రీకృష్ణుడు ఈ విధంగా చెప్పి పట్టాభిషేకానికి తొందరపెట్టాడు. విదురుడు ధృతరాష్ట్రుడు చెప్పినట్లు కార్యాలన్నీ పూర్తిచేశాడు. అదే సమయంలో కృష్ణద్వైపాయనమహర్షి అక్కడకు చేరాడు. కౌరవు లందరూ బంధుసమేతంగా ఆయనను పూజించారు. శ్రీకృష్ణుని ఆజ్ఞానుసారం వేదపండితుల సహాయంతో యథావిధిగా వ్యాసభగవానుడు పట్టాభిషేకం పూర్తికావించాడు. కృపుడు, ద్రోణుడు, భీష్ముడు, ధౌమ్యుడు, వ్యాసుడు, శ్రీకృష్ణుడు, బాహ్లీకుడు, సోమదత్తుడు, చతుర్వేద విశారదులైన బ్రాహ్మణులను ముందు ఉంచి విధిపురస్సరంగా భద్రపీఠంపై నిగ్రహంతో ఉన్న ధర్మజుని అభిషేకించారు. 'రాజా! నీవు సమస్త భూమిని జయించి, నీ అధీనంలో ఉంచి రాజసూయాదియాగాలు గొప్ప దక్షిణలిచ్చి నిర్వహించి, అవభృథస్నానం చేసి బంధుమిత్రులతో సుఖంగా ఉండు' అని ఆశీర్వదించారు. అలంకారసహితుడై ధర్మజుడు మూర్ధాభిషిక్తుడై అక్షయదక్షిణలు అందరికీ ఇచ్చాడు. సరిగ్గా అదే సమయాన అందరు జయజయ ధ్వనులు చేశారు. రాజులందరు యుధిష్ఠిరుని అభినందించారు. ఏనుగును అధిరోహించిన ధర్మజుడు ఇంద్రుని వలె ప్రకాశించాడు. శ్వేతచ్ఛత్రంతో వెలిగిపోయాడు. హస్తినాపురానికి ప్రదక్షిణం చేసి నాగరికుల అనుసరణంతో నగరంలోకి ప్రవేశించాడు. బంధుమిత్రు లందరు పట్టాభిషిక్తుడైన ధర్మజుని అభినందించారు. గాంధారీదేవి పుత్రులందరు ఈ వైభవాన్ని చూచి దుఃఖించారు. ఇది తెలిసిన ధృతరాష్ట్రుడు శ్రీకృష్ణుని, కౌరవుల సమక్షంలో యుధిష్ఠిరునితో ఇలా అన్నాడు. "నీవు పొందిన పట్టాభిషేకం అజితాత్ములైన పురుషులకు అసాధ్యం. రాజా! నీవు పూర్వుల రాజ్యాన్ని పొంది కృతార్థుడవు అయ్యావు. నీవు నేడే ఖాండవ ప్రస్థానికి పోయి నివసించు. అది పూర్వం పౌరవుల రాజధానీనగరం. ఖాండవప్రస్థాన్ని బుధపుత్రుని కారణంగా ఋషులు నాశనం చేశారు. నీవు మరల ఖాండవ ప్రస్థాన్ని వృద్ధి చెయ్యాలి. బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు, ఇతరులు నీమీది భక్తితో నిన్ను అనుసరించడానికి సిద్ధంగా ఉన్నారు. ఆ నగరం ధనధాన్య సమృద్ధి కలది. నీ తమ్ములతో వెంటనే బయలుదేరు.")

ధృతరాష్ట్రుని మాటను గౌరవించి పాండవులు అతనికి నమస్కరించి, అర్ధరాజ్యం పొంది, భయంకర వనమైన ఖాండవప్రస్థానికి మెల్లమెల్లగా చేరారు. పిమ్మట మర్యాదను అతిక్రమింపని పాండవులు కృష్ణుని ముందు ఉంచుకొని, ఆ ప్రదేశం చేరి స్వర్గం వలె ప్రకాశించేటట్లు దాన్ని అలంకరించారు.

(భగవంతుడైన వాసుదేవుడు ఇంద్రుని మనస్సులో భావించాడు. అది గుర్తించిన ఇంద్రుడు విశ్వకర్మను ఆదేశించాడు. మహేంద్రుడు అన్నాడు – "విశ్వకర్మా! బుద్ధిశాలీ! నీవు పోయి ఖాండవప్రస్థాన నగర నిర్మాణం చెయ్యాలి! అది ఇంద్రప్రస్థం అనువేర ప్రసిద్ధి చెందాలి. మహేంద్రుని ఆజ్ఞానుసారం విశ్వకర్మ శ్రీకృష్ణునికి నమస్కరించి 'మీఆజ్ఞను పాలిస్తాను'. అనగానే శ్రీకృష్ణుడు ఆ మాటవిని విశ్వకర్మతో చెప్పాడు. విశ్వకర్మా! కురురాజైన యుధిష్ఠిరునకు ఇంద్రనగరం వంటి నగరాన్ని నిర్మించు. అది శ్రీకృష్ణవచనానుసారం రాబోయే కాలంలో ఇంద్రప్రస్థమని పేరు పొందాలి.")

పిమ్మట పవిత్రం, మంగళం అయిన ప్రదేశంలో ద్వైపాయనుని ముందుంచుకొని, మహారథులైన పాండవులు శాంతికర్మను చేసి, నగరనిర్మాణం చేయటానికి కొలిపించారు. ఆ నగరానికి నలువైపుల సాగరసదృశాలు, అగాధాలు అయిన పరిఖలు త్రవ్వించారు. ప్రాకారాలతో ఆ నగరం ఆకాశాన్ని తాకేలా ఉంది. తెల్లని మేఘాలకాంతిని, చంద్రకిరణాల శోభను వ్యాపించేలా చేస్తోంది. నాగనగరం భోగవతిలా నాలుగువైపుల గోడలతో ఆ నగరం ప్రకాశిస్తోంది. ఆ నగరం ద్వారాలు, గరుడుని రెక్కల్లా ఉన్నాయి. గదులు విశాలంగా ఉన్నాయి. మేఘచయం వలె శోభిస్తూ మందరపర్వతంలా ఎత్తైన గోపురద్వారాలతో ఆ నగరం సురక్షితమై ఉంది. నానావిధాలైన అభేద్య, శస్త్రాస్త్రాలతో నాలుగువైపుల నింపబడి సురక్షితంగా ఉంది. నగరం నాలుగువైపుల చేతులతో విసరటానికి వీలైన లోహశక్తులు నిండి ఉన్నాయి. అవి రెండు నాల్కల సర్పాలవలె భయంకరంగా కనపడుతున్నాయి. అస్త్రశస్త్రాభ్యాసం చేసే యోధులతో ఆ నగరం ప్రకాశించింది. పదునైన అంకుశాలు, శతఘ్నులు, యంత్రజాలాలతో, యుద్ధసామాగ్రితో ఆ నగరం ప్రకాశిస్తోంది. లోహ నిర్మిత చక్రాలతో ఆ శ్రేష్ఠనగరం ఎంతో శోభకలిగి ఉంది. చాలావిశాలాలైన వీథులతో నాల్గువైపులకూ వెళ్లటానికి వీలైన మార్గాలు ఉన్నాయి. ఆ నగరం దైవికమయిన ఆపదలకు దూరంగా ఉంది. అనేక విధాలైన, తెల్లనిభవనాలతో ఆ నగరం నిండి కనపడుతోంది. స్వర్గంలా ప్రకాశించే ఆ నగరం పేరు ఇంద్రప్రస్థం. ఇంద్రప్రస్థనగరాన సుందర, పవిత్ర ప్రదేశాల్లో యుధిష్ఠిరుని నివాసగృహం నిర్మించారు. ఆకాశంలో విద్యుత్ కాంతితో వ్యాప్తమైన మేఘమండలంవలె దేదీప్యమానంగా ఉంది అది. అనంతధనరాశితో నిండి యుధిష్ఠిరభవనం కుబేరుని నివాసంలా ఉంది. రాజా! వేదవేత్తల్లో శ్రేష్ఠులయిన బ్రాహ్మణులు ఆ నగరాన

నివసించేందుకు వచ్చారు. అన్నిభాషలూ తెలిసిన వారు ఇక్కడ నివసించటానికి ఇష్టపడ్డారు. ధనార్థులై వ్యాపారులు నానాప్రదేశాలనుండి ఆ నగరానికి చేరారు. శిల్పకళ తెలిసినవారు అనేకులు ఆ ఇంద్రప్రస్థంలో నివసించటానికి వచ్చారు. నగరానికి నాలుగువైపుల అందమైన ఉద్యానవనాలు ఉన్నాయి. తియ్యమామిడి, కదంబం, అశోకం, చంపకం, పున్నాగం, నాగపుష్పం, లకుచం, పనస, మద్ది, తాడి, చీకటి చెట్లు, పొగడ, మొగలి మొదలైన మనోహర పుష్పాల శోభతో, ఫలభారంతో వంగిన పండ్ల చెట్లతో ఆ నగరం మిక్కిలి ప్రకాశిస్తోంది. పెద్ద ఉసిరి, లొద్దుగు, అంకోలం, నేరేడు, పాటలం, కుంజకం అతిముక్తకం, కరవీరం, పారిజాతం--మొదలైన చెట్లతో, ఎల్లప్పుడూ పుష్పఫలాలు గల చెట్లతో, పక్షుల కిలకిల ధ్వనులతో ఆ ఉద్యానశోభ వెలుగుతోంది. మదించిన మయూరాల కేకారవాలతో, ఎల్లప్పుడు మదించిన కోకిలలతో, అద్దాలవంటి స్వచ్ఛగృహాలతో, క్రీడాలతాగృహాలతో ఆ ఉద్యానం నిర్మితమై ఉంది. మనోహరాలైన చిత్రశాలలు, విహారార్థం కృత్రిమపర్వతాలు అన్నిచోట్ల ఉన్నాయి. మంచినీటితో నిండిన దిగుడు బావులు కనపడ్డాయి. తామరలు, కలువల గంధం కలిగి, హంసలు, కారండవాలు, చక్రవాకాలతో ప్రకాశించే సరస్సులు అన్నివైపుల వ్యాపించాయి. వనవ్యాప్తమైన వివిధ సుందర పుష్కరిణులు అక్కడ విస్తరించి ఉన్నాయి. సుందర, విశాలమైన పెద్దపెద్ద చెరువులు వ్యాపించాయి.

(ఆ నగరం నాలుగువర్ణాల జనాలతో నిండి ఉంది. మాన్యులైన వారు ఉన్నారు. ఉపభోగార్హమైన సామగ్రి కలిగి ఉంది. శ్రేష్ఠపురుషులు, అసంఖ్యాకులైన స్త్రీ, పురుషులు ఉన్నారు. మదించిన ఎనుగులు, గోవులు, ఒంటెలు, ఎద్దులు, గాడిదలు, మేకలు మొదలైన పశుసంపద సమృద్ధంగా ఉంది. విశ్వకర్మనిర్మితమైన ఆ నగరం మహాత్ములకు, సత్పురుషులకు నిలయమై భాసిస్తోంది. ఇంద్రనగర తుల్యంగా ఉంది. విశ్వకర్మ నిర్మితం అయిన ఆ నగరంలో పౌరవవంశీయుడై, మంగళసత్కారాలు పొందిన యుధిష్ఠిరుడు వేదవేత్తలైన బ్రాహ్మణులు, సోదరులతో కలిసి శ్రీకృష్ణుడు, ధౌమ్యుడు, వేదవ్యాసుడు మొదలైన వారి అంగీకారంతో ముప్పదిరెండు ద్వారాలుగలిగి వర్ధమాన మనుపేర ప్రసిద్ధి పొందిన నగరద్వారం నుంచి లోనికి ప్రవేశించాడు. అదే సమయాన శంఖ, దుందుభినాదాలు ఒక్కసారిగా మార్మ్రోగాయి. బ్రాహ్మణుల జయజయ శబ్దాలు వ్యాపించాయి. వంది మాగధ, సూతులు, మునులు స్తోత్రాలు చేశారు. పట్టాభిషిక్తుడైన యుధిష్ఠిరుడు ఏనుగును అధిరోహించాడు రాజమార్గాన్ని దాటి, పవిత్రమైన శ్రేష్ఠభవనాన్ని యుధిష్ఠిరుడు ప్రవేశించాడు. సమ్మానితుడైన యుధిష్ఠిరుడు పూజ్యుని శ్రీకృష్ణుని, విప్రులను యథాక్రమంగా సత్కరించాడు. ఆ నగరం నరనారీజనంతో గోవులతో ప్రకాశిస్తోంది. సస్యసమృద్ధిని పొంది ఉంది.)

మహారాజా! పవిత్రహృదయం గల మనుష్యప్రవేశంతో ఆ నగరం పాండవుల ప్రసన్నత కారణంగా నిరంతరం అభివృద్ధిని చెందసాగింది. భీష్మునిచే, రాజైన ధృతరాష్ట్రునిచే ధర్మంగా అర్ధరాజ్యం ఇచ్చి పంపబడిన పాండవులు ఖాండవప్రస్థవాసులు అయ్యారు.

ఇంద్ర సమానశక్తిగల ఆ పంచపాండవులతో ఆశ్రేష్ఠనగరం నాగులతో భోగవతీనగరం ప్రకాశించినట్లు ప్రకాశిస్తోంది.

(ముందుగా యుధిష్ఠిరుడు ఇంద్రప్రస్థనగర నిర్మాత విశ్వకర్మను పూజించి వీడ్కోలు పలికాడు. పిమ్మట కృష్ణద్వైపాయనుని పూజించి వీడ్కోలు పలికాడు. రాజా! ఈమహోత్సవానికి కారణభూతుడైన, శ్రీకృష్ణుడు తిరిగివెళ్ళటానికి సిద్ధపడగా యుధిష్ఠిరుడు ఈవిధంగా అన్నాడు. యుధిష్ఠిరుడు పలికాడు - "పుణ్యాత్మా! యదునందనా! నీదయవల్ల నేను రాజ్యాన్ని పొందాను. నీ అనుగ్రహంతో దుర్గమం, నిర్జనం అయిన ఈ ప్రదేశం ధనధాన్యసమృద్ధిని పొందింది. మీ కరుణ కారణంగా మేము సింహాసనం అధిరోహించాం. మాధవా! నీవే మాకు చివరికి దిక్కు, నీవే మాకు తల్లివి, తండ్రివి. మేము పాండుమహారాజును ఎఱుగం. మాచే చేయవలసిన పనులన్నీ నీవే చేయించు. పాండవుల ఇష్టానుసారం కార్యనిర్వహణానికి అనుజ్ఞ ఇమ్ము.' శ్రీకృష్ణుడు ఇలా అన్నాడు - "మహాభాగా! నీసామర్థ్యం చేత నీ రాజ్యాన్ని స్వధర్మానుసారం పొందావు. తండ్రి, తాతలరాజ్యం నీకెందుకు రాదు? దురాచారులైన ధార్త రాష్ట్రులు పాండవులను ఏమీ చేయలేరు. ధర్మభారం వహిస్తూ స్వేచ్ఛగా రాజ్యపాలన చెయ్యి. కురురాజా! బ్రాహ్మణులను సేవించు, శీఘ్రంగా నేడు నారదమహర్షి వస్తాడు. అతని వాక్యాలు శ్రద్ధగా విని రాజ్యపాలనం చెయ్యి." ఈ విధంగా పలికి శత్రుపీడకుడైన హరి కుంతికి నమస్కరించిమధురమైన వచనాలతో "నమోస్తు" అని పలికి వెళ్లటానికి అనుమతి కోరాడు. కుంతి అన్నది - "కేశవా! లాక్షాగృహంలో పడిన కష్టాలు నాతండ్రి కుంతిభోజునికి కూడా తెలియవు. గోవిందా! నీ సహాయంచే గొప్ప సముద్రం వంటి కష్టాన్ని దాటాను. ప్రభూ! నీవు దీనులకు రక్షకుడవు. విశేషించి దరిద్రులకు గొప్ప రక్షకుడవు. నీదర్శనంతో మా దుఃఖాలన్నీ శమించాయి. బుద్ధిమంతుడా! పాండవులను నీవెప్పుడూ మరువకు. నీ చింతనతోనే వారు జీవించి ఉంటారు." వైశంపాయనుడు అన్నాడు-జనమేజయా! ఆవిధంగానే చేస్తాను అని పలికి, మేనత్త కుంతికి నమస్కరించి వాసుదేవుడు సేవకులతో కలసి బయలుదేరాడు.)

రాజా! యుధిష్ఠిరుని ఇంద్రప్రస్థంలో చేర్చి, బలరామునితో కలిసి కేశవుడు పాండవుల అనుమతి పొంది, ద్వారకానగరానికి బయలుదేరాడు.

207. నారదుని రాక, సుందోపసుందుల కథ చెప్పుట.

జనమేజయుడు అన్నాడు - 'తపోధనా! ఇంద్రప్రస్థరాజ్యాన్ని పొంది పాండవులు పిమ్మట ఏ కార్యాలను సాధించారు. మా పూర్వపితామహులైన పాండవులు మహాబలశాలులు, మనోబలం కలవారు. వారి ధర్మపత్ని ద్రౌపది ఎలా సేవించింది. పాండవులు ఆమె ఒక్కతెపట్ల ఎలా ప్రవర్తించారు? పాండవులు ఆమె విషయంలో ఒకరితో ఒకరికి భేదం కలగకపోవటానికి కారణమేమి? నేనీ వృత్తాంతాన్ని పూర్తిగా వినగోరుతున్నాను. పరస్పరం కలిసి వారు ద్రౌపదితో ఆచరించిన విధానం తెలుపు.' వైశంపాయనుడు చెప్పాడు. రాజా!

ధృతరాష్ట్రుని ఆజ్ఞానుసారం ఖాండవప్రస్థంలో రాజ్యాన్ని పొంది శత్రునాశకులైన పాండవులు ద్రౌపదితో కలిసి ఆనందించారు. తేజశ్శాలి, సత్యసంధుడు అయిన ధర్మజుడు రాజ్యాన్ని పొంది సోదరులతో కలిసి ధర్మంగా భూమిని పరిపాలించాడు. శత్రువులను జయించి సత్యధర్మపరాయణులుగా, ప్రజ్ఞావంతులుగా కీర్తింపబడుతూ పాండవులు ఆనందంతో అక్కడ నివసించారు. పాండవులు పౌరకార్యాన్ని సమర్థంగా నిర్వహిస్తూ విలువైన, రాజోచితాలైన ఆసనాలపై కూర్చొని ఉండగా అనుకోకుండా దేవర్షి నారదుడు అక్కడికి వచ్చాడు.

(తాపసులు కాని వారికి పొందశక్యం కానిదై, నక్షత్రాలతో వ్యాపించి, గరుడుని సంచారంతో, చంద్రసూర్యకాంతితో, మహర్షులచే సేవింపబడే ఆకాశమార్గాన నారదుడు అక్కడికి చేరాడు. అందరిచే పూజింపబడే తాపసి-నారదుడు-పెద్దపెద్దనగరశోభలను, వాటిలో నివసించే ప్రాణులను చూస్తూ అక్కడికి వచ్చాడు. వేదాంతశాస్త్రవేత్త నారదుడు సర్వవిద్యలలో ఆరితేరిన గొప్పతాపసుడు, బ్రహ్మతేజస్వి నీతిసహితాలైన మంచి మాటలను చెప్పటంలో ప్రసిద్ధుడు. నారదుడు ధర్మబలంతో పరమార్థజ్ఞానం తెలిసికొన్నవాడు. అతడు శుద్ధహృదయంతో రజోగుణంలేని, శాంతుడు, మృదుస్వభావం కల బ్రాహ్మణుడు. దేవదానవమనుష్యులకు ధర్మంచేత మాత్రమే పొందగలవాడు. సంసారభయం లేనివాడు. అన్నివిధాల లోకంలో వైదికధర్మమర్యాదను నెలకొల్పిన వేదాలలో నిష్ణాతుడు. న్యాయశాస్త్రపారంగతుడు. ఋజుస్వభావం, శుక్లవర్ణం గలవాడు, పాపరహితుడు. చాలా సమయం యాత్రలో గడుపుతాడు. స్వచ్ఛమైనశిఖ కలవాడు. సూక్ష్మాలు, సుందరాలు, పవిత్రాలు, ఇంద్రదత్తాలైన వస్త్రాలు ధరిస్తాడు. అనితరసాధ్యమైన బ్రహ్మవర్చస్సు గల నారదుడు ఇంద్రుని భవనంలో బృహస్పతి ప్రవేశించినట్లు ధర్మజుని భవంతిలో ప్రవేశించాడు. సంహితాశాస్త్రాల్లో మానవులకు చెప్పబడిన ధర్మాలన్నింటిలో పారంగతుడైన విద్వాంసుడు. గాధాఛందం, సామవేదాల్లోని ధర్మాలు తెలిసినవాడు. మధురంగా సామగానం చేస్తాడు. ముక్తిని కోరేవారికి స్వయంగా ఉపాయాలు తెలుపుతాడు. బహువిధమయిన ధర్మశాస్త్రంలో మనస్సు నిలుపుతాడు. శాస్త్రజ్ఞానం తెలిసి వాటివిషయంలో సమబుద్ధితో ఉంటాడు. వేదసంశయాన్ని తీర్చి, అర్థవ్యాఖ్యానాలను చేస్తాడు. స్వభావంతో ధర్మంమీద ఆసక్తికలవాడు. లోపాలు, ఆగమాలు మొదలైన వాటితో ప్రయోగాలు చేసి చూపుతాడు. ఒకే అర్థం గల శబ్దాలను, అనేకార్థకశబ్దాలను వింగడించగలడు. అనేకశబ్దాలను ఒకే అర్థంలో, ఒకేఅర్థాన్ని విభిన్న శబ్దాలతో చెప్పగల మహాప్రతిభాశాలి. సర్వవర్ణాల మార్పువిషంలో, అన్ని అధికరణాల్లో లోకంలో ప్రమాణభూతుడు, అందరకు అన్నివేళల పూజ్యుడు. అచ్చులు, హల్లులు, ఛందస్సులు, నిఘంటువులు, వాని అవయవాల స్మరణ చేస్తూ నిజతత్త్వాన్ని తెలుపుతాడు. మానవులలోని హృదయాంతరాళాల దాగిన అంశాలను వెలికి తీస్తాడు. వైకల్పిక వచనాలు, నిశ్చయాంశాలను బాగా గుర్తిస్తాడు. తనకు, ఇతరులకు స్వరసంస్కారాలను ఆచరిస్తాడు. మాట్లాడే వచనాల్లో ఏకత్వ, బహుత్వ సాధన చేయు నైపుణ్యం చూపుతాడు. పరమార్థాన్ని వెంటనే గ్రహిస్తాడు. అపరాధాల్ని గుర్తిస్తాడు. తద్ధితప్రయోగాల్లో నిపుణుడు. స్వర, వర్ణ, అర్థాలతో తన మాటలను అలంకరింపచేస్తాడు. ధాతువులలో పరిపూర్ణజ్ఞాని. అయిదురకాల్లో అక్షరాలను, స్వరాలను

విభాగం చేసి ప్రదర్శిస్తాడు.)

వచ్చిన నారదుని చూచి, ఎదురేగి, నమస్కరించి యుధిష్ఠిరుడు సుందరమైన తన ఆసనాన్ని ఆయనకిచ్చాడు. ఆసీనుడైన నారదమహర్షికి స్వయంగా యథావిధిగా అర్ఘ్యాదులనిచ్చి ధర్మజుడు వినయంగా తన రాజ్యాన్ని నివేదించాడు. ఆ పూజగైకొని నారదుడు ఆనందంలో మునిగిపోయాడు. యుధిష్ఠిరుని అభ్యుదయాన్ని ఆకాంక్షించి, ఆశీర్వదించి, ఆసీనుని కమ్మని నారదుడు ఆజ్ఞాపించాడు. ఆయన ఆజ్ఞపై యుధిష్ఠిరుడు కూర్చుని, నారదుని రాకను ద్రౌపదికి వినిపించాడు. విన్న ద్రౌపది పవిత్రత, ఏకాగ్రచిత్తాలతో పాండవులతో నారదుడున్న ప్రదేశానికి వెళ్ళింది. ఆమె నారదముని పాదాలకు నమస్కరించి వినయంతో నిలిచింది. నారదుడు అనేకమైన ఆశీర్వచనాలిచ్చి సాధ్వి ద్రౌపదిని లోపలికి వెళ్ళమని ఆదేశించాడు. ఆమె వెళ్ళిన తరువాత నారదుడు ఏకాంతంలో పాండవులతో ఇలా అన్నాడు. "కీర్తిని ఇవ్వగల ద్రౌపది మీకు ఒక్కతే ధర్మపత్ని. మీలో మీకు ఆ కారణంగా వైరం పెరగకుండా ఉండండి పూర్వకాలం నాటి గాథ ఒకటి ఉంది. సుందోపసుందు లిద్దరూ సోదరులు. వారెల్లప్పుడు ఒకచోటే కలిసి ఉంటారని, చంపవీలుకాని వారని ముల్లోకాల్లో ప్రసిద్ధి. వారికొకటే రాజ్యం, ఇల్లు, పాన్పు, ఆసనం. ఆహారం వారు కలిసే తింటారు. కాని వారిరువురు తిలోత్తమ అనే అప్సరస ప్రేమలో పడి ఒకరినొకరు చంపుకొన్నారు. యుధిష్ఠిరా! మీరు మీ మధ్యలో ప్రేమభావాన్ని పెంచుకొంటూ సౌహార్దంతో ఉండండి. మీలో మీకు విరోధం రాకుండా జాగ్రత్త వహించండి." యుధిష్ఠిరుడు అడిగాడు - "మహామునీ! సుందోపసుందులు ఎవరికుమారులు? వారిమధ్య వైరం కలగటానికి కారణమేది? ఒకరినొకరు ఎలా చంపుకొన్నారు? మీరు పలికిన ఈ తిలోత్తమ అప్సరసయా? దేవకన్యయా? తెలుపండి. ఏ కోరికచే వారిర్వురు సోదరులు ఒకరినొకరు చంపుకొన్నారు? ఈకథను జరిగిన దాన్ని జరిగినట్లుగా విస్తరంగా వినగోరుతున్నాం. బ్రహ్మవాదీ! అది వినాలని మాకు చాల ఆసక్తిగా ఉంది."

208. సుందోపసుందుల తపస్సు, వరప్రాప్తి.

నారదుడు అన్నాడు - "యుధిష్ఠిరా! ఈవృత్తాంతం ఎలా జరిగిందో విస్తరంగా వినిపిస్తాను. సోదర సహితుడవై వినుము. ప్రాచీనకాలాన హిరణ్యకశిపుని వంశంలో నికుంభుడు అనే పేరుగల మహారాక్షసుడు పుట్టాడు. అతడు మిక్కిలి బలవంతుడు. తేజస్వి. అతనికి మహాపరాక్రమం, బలం గల ఇద్దరు కొడుకులు పుట్టారు. సుందోపసుందు లను పేర్లుగల

వారిరువురు క్రూరమనస్కులు, భయంకరమైనవారు. వారిరువురు ఒకే నిశ్చయంతో, ఒకే పనిని ఆచరిస్తారు. వారికి సుఖం, దుఃఖం వేరుగా లేవు. ఎల్లప్పుడు కలిసే ఉంటారు. ఒకరిని విడిచి ఒకరు ఉండలేరు. ఒకరు లేకుండా వేరొకరితో మాట్లాడరు. ఒకరికొరకు ఒకరు ప్రియం ఆచరిస్తారు. తీయనిమాటలు మాట్లాడుతారు కూడ. ఒకే శీలం, ఆచరణ కల వారి జీవాత్మ రెండుగా విడిపోయి ఇద్దరైనారు. వారు మహాపరాక్రమవంతులుగా ఎదిగారు. ఒకే నిశ్చయంతో కార్యాలను ఆచరించారు. ముల్లోకాలు జయించాలని సంకల్పించి, దీక్ష వహించి, వింధ్యపర్వతం చేరి, వారిద్దరు తపస్సు చేశారు.

క్షుత్పిపాసలతో అలసి, శిరసుపై జటలు, శరీరంపై నారబట్టలు ధరించి వారిద్దరు తపస్సు చేశారు. మాలిన్యంతో నిండిన ఆవయవాలతో వారు వాయుభక్షకు లయ్యారు. తమ శరీరమాంసాన్ని అగ్నికి ఆహుతి చేసి బొటనవ్రేలిపై నిలబడి, చేతులుపైకెత్తి కనురెప్ప వేయక చాలకాలం నియమంతో తపస్సు చేశారు. వారి తపస్సుకి చాలకాలం వేడెక్కి వింధ్యపర్వతం పొగలు చిమ్మింది. అది చాల అద్భుతమైన విషయం. వారి తీవ్రమైన తపస్సు చూచి దేవతలు మిక్కిలి భయపడ్డారు.వారి తపస్సును భగ్నం చేయటానికి ఎన్నో విఘ్నాలను కల్పించారు. దేవతలందరు వారిరువురిని స్త్రీలతో, రత్నాలతో మాటిమాటికీ ప్రలోభపెట్టారు. కాని వారు తమతపస్సు విడువలేదు. వారిపై దేవతలు మాయను ప్రయోగించారు. మాయచే కల్పింపబడిన సోదరీగణం, తల్లులు, భార్యలు, ఆత్మీయులు భయంతో పరుగులిడుతూ వచ్చారు. వారిని శూలధారి అయిన రాక్షసుడొకడు తరుముతూ భూమిపై దొర్లింపసాగాడు. వారి ఆభరణాలు, వస్త్రాలు జారిపోయాయి. వారందరు కలిసి వారిరువురికి నమస్కరించి రక్షించమని వేడుకున్నారు. వారు, ఈ రోదనలు విన్నా వ్రతధారులైన కారణంగా తపస్సు వీడలేదు. వ్రతభంగం చేయలేదు. ఇద్దరిలో ఒక్కరైనా కలతచెందకపోవటం వలన, బాధపడక పోవటం వలన, అందరూ అక్కడికక్కడే మాయం అయ్యారు.

లోకహితాన్ని కోరే బ్రహ్మ ప్రత్యక్షమై వారిని వరాలు కోరుకోమన్నాడు. దృఢవిక్రములయిన ఆ సోదరులిరువురు తమ ఎదుట నిలిచిన బ్రహ్మను చూచి చేతులు జోడించి ఒక్కసారిగా "భగవానుడా! మీరు మా తపస్సుకు ప్రసన్నులైతే మమ్ములను మాయావేత్తలనుగా అస్త్రశస్త్రవిశారదులు, బలవంతులనుగా, కామరూపులనుగా, అమరులనుగా చేయండి" అన్నారు. బ్రహ్మ అన్నాడు - అమరత్వం తప్ప మిగిలిన మీ కోరికలన్నీ తీరుతాయి. మీరు దేవతలతో సమానంగా మృత్యువిధానం వేరొకలా కోరండి.

ముల్లోకాలకు ప్రభువులు కావాలని మీరు తపస్సు చేశారు. మీసంకల్పం అమరత్వం కాదు. కావున మీరు అమరులు కాలేరు. దైత్యశ్రేష్ఠులారా! త్రిలోక్యవిజయం కొరకు మీరు తపస్సు ఆచరించారు. మీ అమరత్వసిద్ధిని నేను ఈయలేను." సుందోపసుందులు పలికారు - "పితామహా! మాలో మేము తప్ప ఇతరులు ముల్లోకాల్లో ఎవరూ మమ్ము చంపలేనట్లు వరాన్ని ఇమ్ము." బ్రహ్మ అన్నాడు - "మీ ప్రార్థనకు అనుగుణంగా మీలో పరస్పరం కలహం ఏర్పడగా మరణం కలిగేటట్లు వరమిస్తున్నాను. ఏదో ఒకరూపంలో మృత్యువు కలుగుతుంది." అని వారిద్దరికి ఇలా వరాన్ని ఇచ్చి, తపస్సు నుంచి మరల్చి, పితామహుడు తనలోకానికి చేరాడు.

ఆ సోదరులిద్దరూ బ్రహ్మనుంచి వరాన్ని పొంది ముల్లోకాలకు అవధ్యులై తమ భవనాలకు సంతోషంగా వెళ్ళారు. వరాలు పొంది కృతకృత్యులై తిరిగివచ్చిన అభిమానవంతులైన వారిరువురుని చూచి స్నేహితులు మిక్కిలి సంతోషించారు. వారిరువురు జడలను తొలగించి కిరీటాలు ధరించారు. విలువ గల ఆభరణాలు, వస్త్రాలు ధరించి కాలంకాని కాలంలో వచ్చిన వెన్నెల శోభలను స్థిరం చేశారు. వారి స్నేహితు లందరు సంతోషంలో మునిగిపోయారు. ప్రతిగృహంలోను తినండి, అనుభవించండి, క్రీడించండి, పాడండి, త్రాగండి, కొల్లగొట్టండి అనేమాటలే వినిపింపచేశారు. అక్కడక్కడ తాళధ్వనులు మ్రోగిస్తూ ఆ దైత్యుల నగరం హర్షంలో, ఆనందంలో మునిగిపోయింది. కామరూపాలు దాల్చి రాక్షసులిరువురు క్రీడిస్తూ చాలాసంవత్సరాలు గడిచినా వారికి తెలియకుండా పోయింది. ఒక్కరోజే గడిచినట్లు వారు భావించారు.

209. సుందోపసుందులు ముల్లోకాలను బాధించుట.

ఉత్సవానంతరం త్రిలోకవిజయాన్ని కాంక్షించి వారిరువురు దైత్యులు సేనలను సిద్ధం కమ్మని ఆజ్ఞాపించారు. స్నేహితులు,వృద్ధులైన రాక్షసమంత్రుల ఆజ్ఞను గైకొని మఘా నక్షత్రాన రాత్రి యుద్ధయాత్రను ప్రారంభించారు. గదలు, తోమరాలు, శూలాలు, ముద్గరాలు, కవచాలతో దైత్యసేన బయలుదేరింది. సేనతో వారిరువురు బయలుదేరారు. వందిమాగధులు, చారణులు స్తోత్రాలు, మంగళపాఠాలు పాడుతూ ఉంటే వారు మిక్కిలి సంతోషంతో యుద్ధయాత్రకు వెళ్లారు. యుద్ధదుర్మదులైన వారిరువురు కామగమనంతో ఆకాశానికి ఎగిరి, దేవతాభవనాలపై దాడిచేశారు. వారి దండయాత్రను గురించి విని, వారి వరబలాన్ని తెలిసికొని, దేవతలు స్వర్గం విడిచి బ్రహ్మలోకానికి చేరారు. వారు

తీవ్ర పరాక్రమంతో స్వర్గాన్ని జయించి యక్షులను, రక్షోగణాలను, ఆకాశగాములైన వారిని చంపారు. మహారథులు వారిరువురు పాతాళంలో చరించే నాగులను జయించి సముద్రపు ఒడ్డున నివసించే మ్లేచ్ఛులను జయించారు. భయంకరంగా శాసించే వారు భూమినంతటిని జయించాలని నిశ్చయించి, సైనికులను పిలిచి, ఇలా అన్నారు. ఈ భూమిపై రాజర్షులు, బ్రాహ్మణులు హవ్యకవ్య నివేదనలతో దేవతల తేజస్సు, బలం, సంపదలూ పెంచారు. యజ్ఞాదులు చేసేవారు మనకు శత్రువులు. మనమందరం ఏకమై వారందరిని అన్నివిధాల చంపివేయాలి. తూర్పు సముద్రతీరాన సైనికులను ఇలా ఆదేశించి కఠినమైన సంకల్పంతో వారిని పంపి అన్నివైపులకు ఆక్రమణకు బయలుదేరారు. యజ్ఞాలు చేసే, చేయించే బ్రాహ్మణులను బలవంతంగా చంపి, బలిష్ఠులై ముందుకు సాగారు. శుద్ధాత్ములైన మునుల ఆశ్రమాలలోని అగ్నిహోత్రాలను, సామగ్రిని స్వేచ్ఛగా ఆ సైనికులు నీటిలోకి విసిరేశారు. మహాత్ములు, తాపసులు కోపించి పలికిన శాపాలు వారి వరబలం వలన వారిని ఏమీ బాధించలేదు.

రాళ్ల మీదికి వదిలిన బాణాలు వ్యర్థమైనట్లు శాపాలు వ్యర్థమైపోయాయి. బ్రాహ్మణులందరు భయంతో పారిపోయారు. గరుత్మంతునికి పాములు భయపడినట్లు జితేంద్రియులు, శాంతి పరాయణులు, తపస్సిద్ధులైన బ్రాహ్మణులందరు భయపడి పరుగుతీశారు. ఆశ్రమాలు భగ్నం చేశారు. కలశాలు, స్రువాలు విసిరి వేశారు. లోకమంతా కాలమహిమచే నాశనమైనట్లు జగమంతా శూన్యం చేశారు. రాజా! అదృశ్యరూపం దాల్చి ఆ రాక్షసు లిరువురూ ఋషులను చంపనిశ్చయించి, భయంకర జంతువుల రూపాలను స్వీకరించారు. మదం స్రవించే మత్తేభాల రూపాన్ని దాల్చి చొరశక్యం కాని చోటనున్న ఋషులను కూడ యమపురికి పంపారు. సింహాలు, పులులరూపాలు ఎత్తి, అదృశ్యంగా ఉండి క్రూరులై ఋషులను ఆయా జంతువుల మాదిరిగా వధించారు. వారెప్పు డేరూపాన్ని దాలుస్తారో ఋషులకు తెలియలేదు. భూమిపై యజ్ఞాలు, స్వాధ్యాయాలు తగ్గిపోయాయి. రాజర్షులు, బ్రాహ్మణులు నశించారు. యాత్రలు, వివాహాలు చాలవరకు కనిపించకుండా పోయాయి. అన్నిచోట్ల హాహాకారాలు వ్యాపించాయి. ప్రజలు భయవిహ్వలులు అయ్యారు. అంగళ్లలో, క్రయవిక్రయాలు లేవు. దేవకార్యాలు నశించాయి. పవిత్ర, వివాహాది కర్మలు లోపించాయి. వ్యవసాయం, పశురక్షణం లేనే లేదు. నగరాలు, ఆశ్రమాలు ధ్వంసం చేశారు. ఎముకలు, అస్థిపంజరాలతో భూమి భయంకరంగా తయారయింది. పితృకార్యాలు లోపించాయి. వషట్కారమంగళాలు అదృశ్య మయ్యాయి. లోకమంతా భయంతో విహ్వలం

అయ్యింది. భూమివైపు చూడలేకపోతున్నారు. సుందోపసుందుల భయానకాలైన కర్మలను చూచి చంద్రుడు, సూర్యుడు, మిగిలిన గ్రహాలు, తారలు, నక్షత్రాలు, దేవతలు అందరు దుఃఖాన్ని పొందారు. ఈ విధంగా సుందోపసుందులు తమ క్రూరకర్మలచే అన్నిదిక్కులు జయించి, శత్రురహితం చేసుకొని, కురుక్షేత్రంలోని తమభవనంలోనికి ప్రవేశించారు.

210. తిలోత్తమ సుందోపసుందులను మోహింపజేయుట.

నారదుడు అన్నాడు – యుధిష్ఠిరా! దేవర్షులు, సిద్ధులు, మహర్షులు ఆ హత్యాకాండను చూచి మిక్కిలి దుఃఖించారు. జితేంద్రియులు, జితక్రోధులు, ఆత్మజయం సాధించినవారు అందరూ కలిసి లోకులపై దయతో బ్రహ్మ యొక్క సత్యలోకానికి వెళ్ళారు. అక్కడకు చేరి దేవతాగణంతో, సిద్ధులతో, బ్రహ్మర్షి గణంతో పరివేష్టితుడైన బ్రహ్మను చూశారు. అక్కడ మహాదేవుడు, వాయుసహితుడైన అగ్ని, చంద్రుడు, సూర్యుడు, ఇంద్రుడు, బ్రహ్మమానసపుత్రులు, వైఖానసులు, వాలఖిల్యులు, మరీచిపులు, తేజోగర్భులు మొదలయిన వారు ఉన్నారు. మహర్షు లందరు వారివద్దకు పోయి దైన్యంతో బ్రహ్మతో సుందోపసుందుల వృత్తాంతాన్ని చెప్పారు. వారు చేసిన అకృత్యాలన్నీ వివరించారు. దేవతలు, మహర్షులు బ్రహ్మను కర్తవ్యోపదేశాన్ని కోరారు. వారి ప్రార్థనను విని, బ్రహ్మ కొద్దిసేపు ఆలోచించాడు. వారి మరణాన్ని నిశ్చయించి, విశ్వకర్మను పిలిపించాడు. మహాతపస్వి బ్రహ్మ విశ్వకర్మ వచ్చిన పిదప "నీవు సుందరస్త్రీని వారి వధకొరకు తయారు చేయు" మని ఆజ్ఞాపించాడు. పితామహునికి నమస్కరించి, ఆ మాటలను శిరసావహించి విశ్వకర్మ బాగా ఆలోచించి దివ్యమైన ఒక సుందరిని సృష్టించాడు. ముల్లోకాల్లో చరాచరాల్లో ఏపదార్థం శ్రేష్ఠమైందో దానిని తీసి విశ్వకర్మ ఆ సుందరిశరీరంలో కూర్చాడు. ఆ యువతి అవయవాల్లో రత్నాలనేకం చేర్చాడు. రత్నకిరణాలు వెదజల్లేటట్లు ఆ దేవరమణిని నిర్మించాడు. విశ్వకర్మచే విశ్వప్రయత్నంతో తయారు చేయబడిన ఆమె ముల్లోకాల్లోని నారీమణులలో సౌందర్యాల్లో సాటిలేనిదయింది. ఆమె శరీరంలో చూసేవారి దృష్టిని ఆకర్షించని రూపసంపద నువ్వగింజంత అయినా లేదు. లక్ష్మి శరీరం దాల్చినట్లు ఆ కామరూపిణి సర్వప్రాణుల చూపులను, మనస్సులను ఆకర్షించింది. ఉత్తమరత్నాలను నువ్వగింజ పరిమాణంలో తీసి నిర్మించటం చేత ఆమెకు బ్రహ్మ తిలోత్తమ అన్నపేరును నిశ్చయించాడు. తిలోత్తమ బ్రహ్మకు నమస్కరించి, దోసిలిఘటించి పలికింది. 'ప్రజాపతీ! నాపై ఏకార్యభారాన్ని మోపదలచి ఈ శరీరనిర్మాణం చేయించావు?'

బ్రహ్మ పలికాడు - "కల్యాణీ! తిలోత్తమా! నీవు సుందోపసుందుల వద్దకు పోయి, ఆకర్షణీయమైన రూపంతో వారిని ప్రలోభపెట్టు. నిన్ను చూస్తుండగనే నీరూపసంపదను పొందాలి అనే కోరిక వారికి కలిగించు. వారికి పరస్పరం విరోధం ఏర్పడేట్లు చెయ్యి" అన్నాడు - ఆమె అంగీకరించి బ్రహ్మకు నమస్కరించి ప్రతిజ్ఞచేసింది. అక్కడనున్న దేవతలకు ప్రదక్షిణం చేసింది. బ్రహ్మ దక్షిణానికి, శివుడు తూర్పుకు అభిముఖంగా ఆసీనులైనారు. దేవతలు ఉత్తరంగా కూర్చున్నారు. ఋషులు అన్నివైపులా ఆసీనులైనారు. తిలోత్తమ దేవసముదాయానికి ప్రదక్షిణం చేసేటప్పుడు ఇంద్రుడు, ఈశ్వరుడు తమతమ స్థానాలలో ధైర్యంగా ఆసీనులై ఉన్నారు. ఆమె శంకరుని దక్షిణపార్శ్వానికి పోగా శంకరునికి ఆమెను చూడా లనిపించింది. ఆయనకు పద్మంవలె ప్రకాశించే వేరొక ముఖం ఏర్పడింది. వెనుక తిరిగేటప్పుడు పశ్చిమముఖం, ఉత్తరానికి పోయినప్పుడు ఉత్తరముఖం ఏర్పడినాయి. మహేంద్రునికి కూడ ముందు, వెనుక, ప్రక్కన అన్నివైపుల విశాలాలు, ఎఱని కాంతులు గల వేయికన్నులు బహిర్గతం అయ్యాయి. పూర్వం స్థాణువైన శంకరుడు చతుర్ముఖుడు అయ్యాడు. బలుని చంపిన ఇంద్రుడు సహస్రనేత్రు డయ్యాడు. అలా మహర్షులకు, దేవసంఘాలకు ఏవైపుకు తిలోత్తమ వెళ్ళుతున్నదో ఆ వైపునకు వారి వారి ముఖాలు తిరుగసాగాయి. అప్పుడు దేవాధిదేవుడైన బ్రహ్మను విడచి మహోత్ములైన దేవతలందరి చూపులు ఆమెశరీరంపై మరలమరల లగ్నం అయ్యాయి. ఆమె బయలుదేరగా, రూపసంపదచే సుందోపసుందుల నాశనం జరిగిపోయినట్లు దేవతలు, ఋషులు భావించారు. లోకాల్ని సృజించే శీలం గల బ్రహ్మ ఆమెవెళ్ళిన పిదప దేవతలు, ఋషులు, మొదలైనవారిని వారి వారి ప్రదేశాలకు పంపాడు.'

211. సుందోపసుందుల మరణము; ద్రౌపది పట్ల పాండవుల నియమము.

నారదుడు అన్నాడు - 'యుధిష్ఠిరా! సుందోపసుందు-లిరువురు భూమండలాన్ని అంతటిని జయించి శత్రువులు, పీడలు లేనివారై ముల్లోకాలను వశపరచుకొని కృతకృత్యత పొందారు. దేవతలు, గంధర్వులు, యక్షులు, నాగులు, రాక్షసులు, మానవులనుంచి రత్నాల నపహరించి మిక్కిలి సంతుష్టి చెందారు. ముల్లోకాల్లోను వారిని ఎదుర్కొనేవారు లేనికారణంగా వారు దేవతలవలె కర్మలు విడచి భోగలాలసులు అయ్యారు. సుందరస్త్రీలు, మృదుమాలలు, భక్ష్యాలు, భోజ్యాలు, సుగంధద్రవ్యాలు, హృద్యాలైన పానాలతో మిక్కిలి ప్రీతిని అనుభవించారు. అంతఃపురాలలోని వనాలు, ఉద్యానాలు, పర్వతాలు మొదలైన

మనసుకు నచ్చిన ప్రదేశాలలో దేవతలవలె విహరించారు. పిమ్మట ఒకనాడు సమతలమైన వింధ్యపర్వతశిఖరాన పుష్పించిన శాలవృక్షశోభగల ప్రదేశాలకు విహారం కోసం వెళ్ళారు. వారిరువురు దివ్యసర్వభోగాలు సమకూర్చగా శ్రేష్ఠాసనాలపై స్త్రీలతో కలిసి కూర్చుని ఆనందంలో మునిగారు. చాలామంది స్త్రీలు వారివద్దకు వచ్చి నృత్యవాద్యాలతో, స్తుతిపాఠాలతో వారిని ఆనందపెట్టారు. అదేసమయాన తిలోత్తమ ఒకేఒక ఎఱ్ఱటి వస్త్రం ధరించి పూలు కోస్తూ వారిని ఉన్మత్తులను చేసింది. నదీ తీరాలలోని కర్ణికారపుష్పాలను కోస్తూ రాక్షసులు ఇరువురూ ఉన్న ఆ ప్రదేశానికి వచ్చింది. వారిరువురు మధుసేవ చేశారు. వారికన్నులు మదంతో ఎఱ్ఱబడ్డాయి. అందమైన తిలోత్తమను చూచి వ్యథను పొందసాగారు.

వారు వారి ఆసనాల్ని విడచి, ఆమె ఉన్న ప్రదేశానికి చేరారు. ప్రమత్తులై ఇరువురూ ఆమెను కోరారు. సుందరమైన కనుబొమలుగల ఆమె కుడిచేతిని సుందుడు పట్టుకొన్నాడు. ఉపసుందుడు ఆమె ఎడమచేతిని గ్రహించాడు. వారు ఇరువురు మొదట వరగర్వితులు, తరువాత బలసంపన్నులు. ఆపై ధన, రత్న, సురాపాన మత్తులై ఉన్నారు. మదగర్వితులైన సుందోపసుందులు ఒకరిపై ఒకరు కళ్ళు ఎఱ్ఱజేశారు. ఆ రాక్షసులను మాటిమాటికి తిలోత్తమ ఆకర్షించింది. కుడిక్రీగంటి చూపుతో సుందుని, ఎడమక్రీగంటి చూపుతో ఉపసుందుని వశపరచుకుంది. ఆమె గంధ, ఆభరణ, రూపాలతో వ్యామోహం చెంది వారిరువురు మద, కామాలతో పీడితులై ఒకరితో ఒకరు ఇలా పలికారు. సుందుడు ఉపసుందునితో "ఈమె నాభార్య నీకు తల్లితో సమానం" అన్నాడు. ఉపసుందుడు సుందునితో "ఈమె నాభార్య నీకు కోడలితో సమానం" అన్నాడు. ఈమె నీది కాదు, నాది అని పలుకుతున్న వారిలో క్రోధం పెరిగింది. తిలోత్తమ సౌందర్యంతో మోహితులైన వారిలో స్నేహం, సౌహార్దం నశించాయి. ఆమెను పొందాలనే సంకల్పంతో ఇరువురూ భయంకర గదలు చేతుల్లోకి తీసుకొన్నారు. వారిద్దరు ఆమె విషయంలో కామమోహితులు అయ్యారు. ఆమెను పొందటంలో నేను ముందంటే, నేను ముందని పలుకుతూ పరస్పరం గదలతో మోదుకొన్నారు. గదాఘాతాలతో వారు ఇద్దరు భూమిపై పడ్డారు. వారి సర్వాంగాలు రక్తసిక్తాలయ్యాయి. ఆకాశం నుంచి జారిన ఇద్దరు సూర్యులవలె ప్రకాశించారు. వారు మరణించాక స్త్రీలు, రాక్షసులు భయపడి విషాదంలో మునిగి పాతాళంలో చొరబడ్డారు. విశుద్ధమైన అంతరాత్మతో భగవంతుడైన బ్రహ్మ దేవతలతో, ఋషులతో కలిసి తిలోత్తమను ప్రశంసించాడు. వరమివ్వటానికి కూడా సంసిద్ధత వ్యక్తం చేశాడు.

వరం ఇవ్వాలని ప్రసన్నుడై బ్రహ్మ ఆమెతో పలికాడు. "తిలోత్తమా! ఎక్కడివరకు

సూర్యుడు సంచరిస్తాడో అక్కడివరకు నీవు సంచరిస్తావు. నీతేజం ఇతరులు చూడలేరు." ఇట్లు తిలోత్తమకు వరాన్ని ఇచ్చి త్రిలోకరాజ్యం ఇంద్రునిపై ఉంచి బ్రహ్మ తనలోకానికి వెళ్ళాడు. నారదుడు అన్నాడు – "ఈవిధంగా అన్నివిషయాల్లో కలిసి ఉన్నా ఒకే నిశ్చయం గలవారిరువురు కోపించి, ఒకరినొకరు తిలోత్తమ కారణంగా చంపుకొన్నారు. భరతశ్రేష్ఠులారా! మీ అందరిపై ప్రేమతో ఆదేశిస్తాను. మీలో మీకు భేదంలేకుండ నియమాలు నిర్ణయించాలి. ద్రౌపది కారణంగా మీరు మరణించకూడదు. మీకు శుభమగుగాక! మన అయిదుగురి భవనాల్లో పాపంలేని ద్రౌపది ఒక్కొక్క సంవత్సరం నివసించాలి. ఏకాంతంలో ద్రౌపదితో కలిసి ఉన్నవానిని వేరొక సోదరుడు చూస్తే అతడు పండ్రెండు సంవత్సరాలు వనవాసం చెయ్యాలి. ధర్మచారులు, పాండవులు ఈనిర్ణయం అంగీకరించి పిమ్మట నారదుడు స్వేచ్ఛగా తాను కోరిన చోటికి వెళ్ళాడు. నారదప్రేరణచే పాండవులు ఈనియమం పాటించారు. కావున వారిలో వారికి విరోధం కలుగలేదు.

212. అర్జునుడు నియమభంగమొనర్చుట.

జనమేజయా! ఈనియమాన్ని అనుసరించి పాండవులక్కడ నివసించారు. వారు తమ శస్త్రాస్త్రాలతో మిగిలిన రాజులందరినీ తమ వశంలో ఉంచుకొన్నారు. మనుజశ్రేష్ఠులు, అమితతేజస్వులు అయిన వారి ఆజ్ఞకు అధీనమై ఎల్లప్పుడూ ద్రౌపది సంచరించసాగింది. నాగుల నివాసంచే భోగవతి ప్రకాశించినట్లు పాండవులు ద్రౌపది విషయంలో, ప్రీతి పొంది ఉన్నారు. ద్రౌపది పాండవుల విషయంలో ప్రసన్నురాలై ఉంది. మహాత్ములైన పాండవులు ధర్మం ప్రకారం జీవిస్తూ ఉండగా కురువంశీయులు సుఖశాంతులతో, దోషరహితులై వృద్ధిపొందారు. పిమ్మట కొంతకాలానికి ఒక బ్రాహ్మణుని గోవులను దొంగలు కొందరు అపహరించి పారిపోయారు. గోధనం అపహరణకు గురికాగా క్రోధవివశుడైన ఆ బ్రాహ్మణుడు ఖాండవప్రస్థానికి వచ్చి పాండవులవద్ద దుఃఖించాడు. "మాగ్రామంలో నీచులు, క్రూరులు, పాపాత్ములైన కొందరు చోరులు గోధనం అపహరించారు. వాటిని మళ్ళించటానికి మీసాయం అవసరమైంది. ప్రశాంతమనస్కు డయిన బ్రాహ్మణుని హవిస్సును కాకులు దొంగిలించాయి. నీచమైన నక్క పెద్దపులి శూన్యగుహను ఆక్రమించింది. తపస్సు లోని ఆరవవంతు గైకొని లోకాన్ని రక్షించని రాజును పాపచారి అని అన్నిలోకాలు కీర్తిస్తాయి. బ్రాహ్మణుని ధనాన్ని చోరులు అపహరించారు. ధర్మార్థాలు లోపించిపోయాయి. దుఃఖించే నన్నుచూసి మీరు శస్త్రాస్త్రాల్ని దాల్చి వాటిని సంరక్షించండి." ఆ బ్రాహ్మణుడు

అర్జునుని వద్దకు వచ్చి ఇలా రోదించాడు. ఆ వాక్యాలు అర్జునుడు విన్నాడు. ఆ ద్విజుని అర్జునుడు 'భయం వలదు' అని ఊరడించాడు. పాండవుల ఆయుధాలు ఉన్నచోట ధర్మరాజు ద్రౌపదితో ఏకాంతంగా ఉన్నాడు. భవనప్రవేశానికి శంకించాడు అర్జునుడు.

ఆర్తుడైన ఆ బ్రాహ్మణునిమాటలు మాటిమాటికి అర్జునుని ప్రేరేపించాయి. అతని దుఃఖానికి కొంతేయుడు చలించిపోయి ఇలా అనుకొన్నాడు. "దీనతాపసి అయిన బ్రాహ్మణుని గోధనం అపహరించపబడితే అర్జునుడు అతని కన్నీరు తుడవాలి' అని నిశ్చయించాడు. 'రాజద్వారాన విలపిస్తున్న బ్రాహ్మణుని రక్షణ నేడు చేయలేకపోతే యుధిష్ఠిరునికి ఉపేక్షాజనితమైన పాపం వస్తుంది' అని ఆలోచించాడు. 'మేమందరం కలిసి ఆర్తుని రక్షించకపోతే ధర్మపాలనంలో అశ్రద్ధ ఏర్పడింది అని జనులు భావిస్తారు. దీనితో అధర్మఫలం మాకు కలుగుతుంది. నేను రాజును గౌరవించక, భవనంలో ప్రవేశిస్తే నిస్సందేహంగా అజాతశత్రుని ముందు నేను చేసిన ప్రతిజ్ఞ వ్యర్థం అవుతుంది. రాజు అక్కడ ఉన్నవేళ ప్రవేశిస్తే వనవాసం చేయాలి. మహారాజుని తిరస్కరించినట్లై నామాటలు తుచ్ఛాలై నమ్మశక్యం కానివి అవుతాయి. రాజ తిరస్కారంచే నియమభంగమై అధర్మదోషం, లేదా వనంలో మరణం సంభవిస్తాయి. శరీరనాశం కంటె గోబ్రాహ్మణరక్షారూప ధర్మమే గొప్పదవుతుంది." ఈ నిర్ణయంగైకొని ధనంజయుడు రాజును అడిగి, లోనికి ప్రవేశించి, ధనుస్సు తీసికొని, ప్రసన్నంగా బ్రాహ్మణునితో అన్నాడు. "బ్రాహ్మణా! మీరు నాతో రండి. పరధనాన్ని కోరే క్షుద్రులైన దొంగలు దూరంగా పోయేలోపల మనం అక్కడకు చేరాలి. నేను ఇప్పుడు ఆ అపహరింపబడిన సొత్తును నీకప్పగిస్తాను." అని పలికి అర్జునుడు, ధనుస్సు, కవచం ధరించి ధ్వజంతో కూడిన రథాన్ని అధిరోహించి, దొంగల్ని వెంబడించి, బాణాలతో వారిని నాశనం చేసి, గోధనాన్ని జయించి, మళ్ళించాడు. బ్రాహ్మణునకు ఆ ధనమంతా అప్పగించి కీర్తిని పొంది, సవ్యసాచి అయిన అర్జునుడు తననగరానికి తిరిగివచ్చాడు. పెద్దలకు నమస్కరించి, వారి అభినందనలు పొందాడు.

అర్జునుడు ధర్మజునితో పలికాడు - "ప్రభూ! నేను (మిమ్ములను ద్రౌపదితో కలిసియుండగాచూసి) ఇంతకుముందు ఏర్పరిచిన నియమాన్ని భంగంచేశాను. మన నియమానుసారం వనవాసానికి వెడతాను." అర్జునుని ముఖం నుంచి వెలువడిన అప్రియవచనాలు విని ధర్మజుడు శోకాతురుడై గద్గదస్వరంతో అన్నాడు. 'ఈవిధంగా ఎందుకు నిర్ణయించావు?' అంటూ యుధిష్ఠిరుడు ధర్మమార్యాదను పాటించే తమ్మునితో దీనంగా పలికాడు. 'నీవు నామాటల్ని ఆచరించదలిస్తే ఈ విషయాన్ని విను. వీరుడా!

నీవు నాభవనంలోనికి ప్రవేశించి నాకు ప్రియాన్ని చేశావు. దానిని నేను సమ్మతించాను. నా హృదయంలో ఏవిధమైన అప్రియమూ లేదు. అన్న భార్యతో నున్న సమయాన చిన్నవాని ప్రవేశం ధర్మమే. తమ్ముడు భార్యతో నున్న సమయాన పెద్దవాని భవనప్రవేశం అధర్మం. నీబుద్ధిని వనగమనం నుంచి మరలించే నామాటలను ఆచరించు. నీలో ధర్మలోపమూ లేదు, నీవు నన్ను తిరస్కరించనూ లేదు' అపుడు అర్జునుడు అన్నాడు - 'ప్రభూ! ధర్మాచరణం నిష్కపటంగా చేయాలని పెద్దల నుంచి విన్నాను. శస్త్రాలపై ఒట్టువేసి సత్యంనుంచి చలించనని విన్నవిస్తున్నాను. కీర్తివర్ధనుడా! నీచే ఆజ్ఞ నేను పొందాలి. నీ ఆజ్ఞకు భిన్నంగా ఏ పనీ నేచేయను.' ఇలా అర్జునుడు వనవాసానికి అనుజ్ఞ పొంది, వనవాసదీక్ష పొంది, పండ్రెండు సంవత్సరాలు వనవాసానికి బయలుదేరాడు.

213. అర్జునుడు ఉలూపిని కలియుట.

అర్జునుని వేదజ్ఞులు, మహాత్ములు, బ్రాహ్మణులు అనుసరించారు. వేదవేదాంగవేత్తలు, ఆధ్యాత్మచింతనాతత్పరులు, బ్రహ్మచారులు, పురాణజ్ఞులు, భక్తులు, పౌరాణికులు, సన్యాసులు, వానప్రస్థులు, కథకులు, దివ్యకథలను మధురంగా శ్రావ్యంగా చెప్పగల ద్విజులు కూడ అతనిని అనుసరించి వెళ్ళారు. ఇంద్రుని దేవతలు అనుసరించినట్లు అర్జునుని మధురభాషణులైన కథకులంతా అనుసరించి వెళ్లారు. అర్జునుడు సుందరాలైన వనాలు, సరస్సులు, సముద్రతీరాలు, దేశాలు, నదులు, పవిత్రతీర్థాలు చూశాడు. గంగాద్వారం(హరిద్వార్) చేరి అక్కడ విడిది చేశాడు. విశుద్ధాంతఃకరణం గల అర్జునుడు గంగాద్వారాన ఆచరించిన అద్భుత కర్మను విను. భారతా! కౌంతేయుడు బ్రాహ్మణులతో కూడి గంగా ద్వారాన ఆగిన తరువాత బ్రాహ్మణులందరూ తమతమ అగ్నిహోత్రాలను వెలిగించారు. వారి అగ్నిహోత్రాలు ఆ ప్రదేశంలో వెలుగుతూ ఉంటే సన్మార్గులు, జితేంద్రియులు, పూలకానుకలు సమర్పించారు. తీరంలో ఉన్న బ్రాహ్మణులతో ఆ గంగాద్వారం మిక్కిలి శోభించింది. ఇలా విద్వాంసులతో ఆ ప్రదేశం నిండిపోయింది. అపుడు అర్జునుడు స్నానానికై గంగానది లోకి దిగాడు.

స్నానమాచరించి, పితృదేవతలకు తర్పణాలిచ్చి, అగ్నికార్యం చేయటానికి గట్టుఎక్కుతున్నపుడు కామరూపిణి అయిన నాగరాజకన్యక ఉలూపి అతనిపై ఆసక్తితో అర్జునుని లోపలికి లాగుకొనిపోయింది. నాగరాజైన కౌరవ్యుని మందిరంలో అర్జునుడు ఏకాగ్రచిత్తుడై ప్రజ్వరిల్లుతున్న అగ్నిని చూశాడు. వెంటనే అర్జునుడు అక్కడే నిర్భీకుడై,

అగ్నికార్యాన్ని పూర్తిచేశాడు. ఈ హవనంతో అగ్ని బాగా సంతోషించాడు. అగ్నికార్యం పూర్తిచేసి అర్జునుడు నాగరాజకన్య ఊలూపితో నవ్వుతూ ఇలా పలికాడు. 'ఈసాహసం ఎందుకు ఆచరించావు? నీవు ఎవరివి? ఇది ఏ దేశం? నీవెవరికుమార్తెవు?' అని అడిగాడు. ఉలూపి చెప్పింది. "ఐరావత వంశానికి చెందిన నాగరాజు కౌరవ్యుడు. అతని కుమార్తె ఊలూపి అనే నాగకన్యకను. పురుషశ్రేష్ఠా! మీరు స్నానానికి గంగానదిలో దిగినప్పుడు మిమ్ములను చూచి కామపరవశనయ్యాను. కురునందనా! నేను మీకారణంగా మన్మథబాధకు లోనయ్యాను. నేను మీకు నాహృదయాన్ని అర్పించాను. మీరు నాకు ఆత్మదానం చేసుకొని నన్ను ఆనందపెట్టండి." అర్జునుడు చెప్పాడు – "కల్యాణీ! నేను నా అన్న ధర్మజునిచే ఆజ్ఞాపింపబడి పరాధీనుడనై ఉన్నాను. పన్నెండు సంవత్సరాలు బ్రహ్మచర్యం పాటించాలి. నేను నీకూ ప్రియంచేకూర్చాలనుకొంటున్నాను. నేనింతవరకు అసత్యం పలుకలేదు. నాకు అసత్యదోషం లేకుండా, నీకు ప్రియం కలిగేట్లుగా, అది నాధర్మలోపం కాకుండేటట్లు చేయగలిగినదాన్ని చెప్పు." ఉలూపి పలికింది – "పాండుకుమారా! నీవు ఎవరి ఆజ్ఞానుసారంగా బ్రహ్మచర్యం పాటిస్తూ లోకంలో సంచరిస్తున్నావో అది నాకు తెలిసిందే. ద్రుపదపుత్రి కారణంగా పరస్పరం మీరు ఏర్పరచుకున్న నియమం, ఉల్లంఘిస్తే పన్నెండు సంవత్సరాలు అరణ్యవాసం, బ్రహ్మచర్యం చేయాలనుకోవటం నేను ఎఱిగిందే. ద్రౌపది కారణంగా పరస్పరం ఈ వనవాసం ధర్మవృద్ధికై ధర్మరాజు విధించాడు. ఇక్కడ ధర్మలోపానికి తావు లేదు. ఆర్తసంరక్షణం క్షత్రియకర్తవ్యం. నారక్షణ విషయంలో ధర్మలోపంలేదు. దీన్ని కొద్దిపాటి ధర్మాతిక్రమణం అనుకొంటే నాప్రాణదానంతో అది గొప్పధర్మం అవుతుంది. నేను నీభక్తురాలిని. స్వీకరించు. ఆర్తరక్షణం సత్పురుషుల ప్రధమకర్తవ్యం. ఈప్రార్థన మన్నింపకపోతే నన్ను చనిపోయినట్లు భావించు. ప్రాణదానం చేసి ఉత్తమధర్మాన్ని అనుష్ఠించు. పురుషశ్రేష్ఠుడా! నేను నీకు శరణాగతురాలను. ఎల్లప్పుడు నీవు దీనులను, అనాధలను రక్షిస్తూనే ఉన్నావు. నేను గొప్ప ఆశతో నీశరణు వేడాను. మిక్కిలిగా వ్యథచెందుతూ ఉన్నాను. నీపట్ల అనురక్తనై నీసమాగమాన్ని కాంక్షించాను. నాకు ప్రియం చెయ్యి." సర్పరాజకన్య ఇలా విన్నపం చేస్తే అర్జునుడు ధర్మబద్ధంగా ఆమె చెప్పినట్లుగా ఆచరించాడు. వ్రతాపవంతుడైన అర్జునుడు నాగులభవనంలో ఆరాత్రి గడిపి ప్రాతఃకాలాన సూర్యోదయ మయ్యాక ఆ కౌరవ్యుని భవనం నుండి బయటపడి పైకివచ్చాడు. ఉలూపితో కలసి అర్జునుడు గంగాద్వారానికి రాగా ఆమె అతనిని అక్కడ విడచి తనభవనానికి తిరిగి వెళ్ళింది. నీటిలో అజేయుడ వవుతావనీ, జలచరాలన్నీ వశమయి

ఉంటాయని, ఇందులో సంశయం లేదనీ వరమిచ్చి వెళ్లింది ఉలూపి.

(ఆమె యందు అర్జునుడు మనోహరుడూ, మహాబలవంతుడూ, అదృష్టవంతుడూ అయిన ఇరావంతు డనే పుత్రుని కన్నాడు.)

214. అర్జునుడు చిత్రాంగదను వివాహమాడి పుత్రుని పొందుట.

జరిగిన వృత్తాంతమంతా బ్రాహ్మణులకు నివేదించి ఇంద్రకుమారుడైన అర్జునుడు హిమాలయం దిశగా బయలుదేరాడు. అగస్త్యవటం, వసిష్ఠపర్వతం, భృగుతుంగం మొదలైన ప్రదేశాల్లో అర్జునుడు శౌచస్నానాదికర్మలు ఆచరించాడు. ఆయాతీర్థాలలో అర్జునుడు బ్రాహ్మణు లందరికీ నివాసగృహాలను, అనుష్ఠానానికి వేలకొలది గోవులను సమకూర్చాడు. దివ్యమైన హిరణ్యబిందుతీర్థంలో స్నానమాచరించి అర్జునుడు అనేక పవిత్రస్థలాలను దర్శించాడు. అటుపిమ్మట హిమాలయపర్వతం నుంచి దిగిన అర్జునుడు బ్రాహ్మణులతో కలిసి తూర్పుదిశగా బయలుదేరాడు. తరువాత కురుశ్రేష్ఠుడైన అర్జునుడు క్రమంగా అనేక తీర్థాలను నైమిశారణ్యంలోని ఉత్పలినీనది, నంద, అపరనంద, కౌశికి, మహానది, గయాతీర్థం, గంగానదులను ఆసక్తిగా చూశాడు. ఈ విధంగా అన్నితీర్థాలను, ఆశ్రమాలను సందర్శిస్తూ తనను పవిత్రం చేసుకొంటూ బ్రాహ్మణులకు అనేకగోదానాలు చేశాడు. అంగ,వంగ,కళింగ దేశాల్లోని కొన్ని పవిత్రతీర్థాలను, పుణ్యమందిరాలను దర్శించాడు. అక్కడ తీర్థాలన్నింటిని దర్శించి శాస్త్రవిధిగా బ్రాహ్మణులకు దానాలు సమర్పించాడు. బ్రాహ్మణులందరు అర్జునుడు కళింగనగరద్వారం చేరగానే అతని అనుమతి గైకొని వెనుకకు తిరిగారు.

అర్జునుడు వారి అనుమతి గైకొని కొద్దిమంది అనుచరులతో సముద్రతీరానికి చేరాడు. కళింగదేశాన్ని దాటి శక్తిశాలి అయిన అర్జునుడు అనేకదేశాల్ని, మందిరాలను, మేడలను చూస్తూ ముందుకు సాగాడు. తాపసులచే ప్రకాశించే మాహేంద్ర పర్వతాన్ని చూసి సముద్రతీర్థయాత్ర చేస్తూ మెల్లగా మణిపురం చేరాడు. అక్కడ అన్ని తీర్థాలను, పవిత్రప్రదేశాలను దర్శించి గల అర్జునుడు మణిపురరాజుదర్శనం కోసం వెళ్ళాడు. మణిపురనగర రాజు చిత్రవాహనుడు ధర్మవేత్త. అతని కుమార్తె సౌందర్యరాశి చిత్రాంగద. స్వేచ్ఛగా ఆ పురంలో తిరిగే చిత్రాంగదను అందాన్ని చూసి మనస్సులో ఆమెను చేపట్టాలని ముచ్చటపడ్డాడు. చిత్రవాహనుని చేరి తనకోరికను అతనికి వెల్లడించాడు. 'మహారాజా! నేను ఉత్తమక్షత్రియుణ్ణి. నాకు మీకుమార్తెను దానం చెయ్యండి' అన్నాడు. రాజు అది విని అతనితో 'మీరు ఎవరి కుమారులు' అని అడిగాడు – అర్జునుడు, 'నేను పాండురాజు పుత్రుడను,' అని సమాధానం

చెప్పాడు. ఆ రాజు అర్జునునితో మృదువుగా ఇలా అన్నాడు. 'మావంశాన ప్రభంజనుడు అనే సమర్థుడైన రాజు ఉద్భవించాడు. అతనికి సంతానం లేదు. ఉత్తమమైన తపస్సు ఆచరించాడు. తనతపస్సుతో శివుని మెప్పించాడు. ఉమాపతి మెచ్చి నీవంశంలో ఇకపై ఒక్కొక్క సంతానం కలుగునని వరమిచ్చి ఆశీర్వదించాడు. అటుపైన మావంశంలో ఒక్కొక్క సంతానమే కలిగింది. నాపూర్వులందరికి పుత్రసంతానం కలిగింది. నాకుమాత్రం ఒకే ఒక కులవర్ధకురాలైన పుత్రిక కలిగింది. పురుషశ్రేష్ఠా! నాదృష్టిలో ఈమె నాకు పుత్రునితో సమానం. ఈ కుమార్తె కారణంగా పుట్టినకుమారుడు నాకు కూడా మొదటికుమారుడు(దౌహిత్రుడు) కాగలడు. నీవలన ఈమెకు కలిగిన కుమారుడు మాకులపరంపరను వృద్ధిచేస్తాడు. ఈమె వివాహంలో నాకు నీవిచ్చే శుల్కం ఇదే అవుతుంది. ఈనియమానుసారం ఈమెను పరిగ్రహించు. "అర్జునుడు 'అట్లే' అని ఆ కన్యకను పరిగ్రహించాడు. మూడు సంవత్సరాలు ఆమెతో అక్కడ నివసించాడు. ఆమెకు పుత్రోదయం కాగానే ఆ సుందరిని విడచి, చిత్రవాహనుని అనుమతి గైకొని, అర్జునుడు మళ్ళీ యాత్రలకు బయల్దేరాడు.

215. వర్గ యను అప్సరసకు అర్జునుడు శాపమోక్షమిచ్చుట.

పిమ్మట అర్జునుడు పరమపావనులైన ఋషులతో ప్రకాశించే దక్షిణసముద్ర తీరంలోని తీర్థ లన్నింటిలో స్నానాలు చేశాడు. అక్కడ తాపసు లందరు అయిదు తీర్థాలను విసర్జించారు. పూర్వం ఆ తీర్థాలు తాపసులతో నిండిఉండేవి. అగస్త్యతీర్థం, సౌభద్రతీర్థం, పరమపవిత్రమైన పౌలోమ తీర్థం, అశ్వమేధయాగాచరణఫలం ఇచ్చే కారంధమతీర్థం, సకలపాపాలను పోగొట్టే భారద్వాజతీర్థం, వీటన్నింటిని అర్జునుడు దర్శించాడు. ఈ తీర్థాలన్ని జనులు లేక ఏకాంతప్రదేశాల్లా ఉన్నాయి అది చూచి 'ధర్మబుద్ధిగల తాపసులచే విడువబడ్డాయి' అని గ్రహించాడు అర్జునుడు. రెండుచేతులు జోడించి అక్కడి తాపసులను అడిగాడు- 'వేదవాదులైన తాపసులు ఈ తీర్థాలను ఎందుకు విడిచిపెట్టారు?' తాపసులు పలికారు- 'ఇక్కడ ఐదు మొసళ్ళు చేరాయి. తాపసులను జలంలోకి లాగి తినివేస్తున్నాయి. ఈ కారణంగా ఈ ఐదుతీర్థాలను తాపసులు త్యజించారు.' అన్నారు - వారి మాటలద్వారా వృత్తాంతాన్ని గ్రహించి, అర్జునుడు తపోధనులు వారిస్తున్నా వాటిని చూడటానికి వెళ్ళాడు. శూరు డయిన అర్జునుడు సౌభద్రతీర్థంలో దిగి స్నానం చేయసాగాడు. ఇంతలో నీటిలోని పెద్ద మొసలి ఒకటి కుంతీపుత్రుడైన ధనంజయుని పాదాన్ని పట్టి గట్టిగా లాగింది. బలవంతులలో శ్రేష్ఠుడైన అర్జునుడు తన బాహుబలాన్ని

ఉపయోగించి మొసలిని గట్టిగా లాగి భూమిపై పడవేశాడు. అర్జునునిచే బయటపడ్డ ఆ మొసలి సర్వాలంకార భూషితురాలు అయిన స్త్రీగా మారింది. ఆ దివ్యకాంత తన శరీరసౌందర్యంతో, ఆభరణాలతో ప్రకాశిస్తోంది. అర్జునుడు ఆశ్చర్యపడి ప్రసన్నుడై ఇలా పలికాడు. 'కల్యాణీ! నీవెవరివి? ఏకారణాన మొసలిరూపు దాల్చావు? నీ ఈ దుర్గతికి నీవు చేసిన ఘోరమైన తప్పు ఏమిటి?'

అప్సర పలికింది - "మహాబాహూ! నేను నందనవనాన సంచరించే అప్సరసను. మహాబలుడా! నేను కుబేరునికి సదా ఇష్టమైన దాన్ని. నాపేరు వర్గ'' నా స్నేహితురాండ్రు నలుగురు. స్వేచ్ఛాసంచారం గల సుందరీమణులు. వారితో కలిసి ఒకనాడు కుబేరుని మందిరానికి బయలుదేరాను. అక్కడ దారిలో జితేంద్రియుడైన ఒకానొక బ్రాహ్మణుని మేమందరం చూశాం. అతడు రూపవంతుడు. ఒంటరి. ఒక్కడే వేదం అభ్యసిస్తున్నాడు. అతని తేజస్సుతో, తపస్సుతో ఆ వనం ప్రకాశిస్తోంది. సూర్యునివలె అతడు ఆ ప్రదేశాన్నంతటిని వెలిగిస్తున్నాడు. అతని అద్భుతమైన ఆ తపస్సును చూసి తపస్సుకు విఘ్నం చేయాలనే తలపులతో ఆ ప్రదేశంలో మేము అయిదుగురం దిగాం. భారతా! నేను, సౌరభేయి, సమీచి, బుద్బుద, లత అనే మేమంతా ఒక్కసారిగా ఆ బ్రాహ్మణుని సమీపంలో దిగి పాటలతో, నవ్వులతో, అతనిని ప్రలోభపెట్టాం. అతడు మామీద ఏవిధంగాను మనస్సు పెట్టలేదు. ఆ మహాతేజస్వి నిర్మల మయిన తపస్సులో ఉండి చలించలేదు. మామీద కోపం వచ్చి ఆ బ్రాహ్మణుడు 'అప్సరసలారా! మీరు వందేండ్లు మొసళ్ళై ఈతీర్థంలో నివసించండి' అని శపించాడు.

216. అర్జునుడు నలుగురు అప్సరసలను విడిపించుట.

"ఆబ్రాహ్మణుని శాపం పొంది మేము తల్లడిల్లిపోయాం. మేమందరం తపోధనుని శరణువేడాం. మేము సౌందర్య, యౌవన, మదాలతో గర్వపడ్డాం. మీపట్ల అనుచితంగా ప్రవర్తించాం. మమ్ములను క్షమించండి. తపోధనా! మాకు మీ శాపమే మరణంతో సమానం. మేము మీవంటి జితేంద్రియులను మోహపరచాలని ప్రయత్నించాం. స్త్రీలను చంపరాదని ధర్మపరాయణుల అభిప్రాయం. మీరు ధర్మంతో ఉన్నతిని పొందండి. మమ్ములను హింసించటం మీకు ఉచితం కాదు. ధర్మజ్ఞా! ప్రాణులందరి పట్ల బ్రాహ్మణుడు మైత్రితో ఉంటాడు. లోకంలో విద్వాంసుల ఈ అభిప్రాయాన్ని యథార్థం చేయండి. శ్రేష్ఠులైన మహాత్ములు శరణాగతులను రక్షిస్తారు. మేము మీశరణు కోరాం. మమ్ములను ఐదుగురిని రక్షించండి' అన్నారు. ధర్మాత్ముడై, సత్కర్మలు చేస్తూ, సూర్యచంద్రులతో

సమానకాంతికల ఆ బ్రాహ్మణుడు వారిప్రార్థనను మన్నించి ఇలా అనుగ్రహించాడు.

'శతం, శతసహస్రం అనే పదాలు లోకంలో అనంతసంఖ్యను తెలుపుతాయి. కాని నేనన్న శతం అనే పదానికి వందేండ్లనియే అర్థం అగుగాక, అక్షయ్య వాచకం కాకుండుగాక! మొసళ్ళుగా ఉండి పురుషులను నీటిలోకి లాగే మిమ్ములను ఒక నరోత్తముడు నీటినుండి బయటకు లాగుతాడు. అప్పుడు మీకు మీమీ పూర్వరూపాలు వస్తాయి. నవ్వులాటకు కూడ నేనెన్నడు ఆబద్ధం చెప్పలేదు. మిమ్ములను బయటకు లాగినపిదప ఆ తీర్థాలకు నారీ తీర్థాలని పేర్లు స్థిరపడతాయి. విద్వాంసులైన పురుషులకు పవిత్రాలు అవుతాయి.' అన్నాడు. మేము ఆ మహర్షికి నమస్కరించి ప్రదక్షిణం చేసి దుఃఖంతో ఆ ప్రదేశం నుండి వేరొక చోటికి బయలుదేరాం. మాకు మా పూర్వరూపాన్ని చేకూర్చగల ఆ నరోత్తముని ఎంత స్వల్పవ్యవధిలో, ఎక్కడ కలుసుకొనగలమా అని ఆలోచించసాగాం. మేము రెండు ఘడియలు ఈవిధంగా ఆలోచిస్తుండగా దేవర్షి నారదుని చూశాం. చూచి మిక్కిలిగా సంతోషించాం. ఆయనకు నమస్కరించి సిగ్గుతో ముఖాలు దించుకొని నిలిచాం. నారదమహర్షి మా దుఃఖకారణం అడిగాడు. మేము చెప్పాం. ఆ వృత్తాంతాన్ని విని నారదుడు మాతో ఇలా పలికాడు. 'దక్షిణ సముద్రతీరాన ఐదు తీర్థాలు ప్రసిద్ధంగా ఉన్నాయి. అవి పుణ్యజనకాలు, రమణీయాలు, మీరందరు ఆలస్యం చేయక అక్కడికి చేరండి. అక్కడకు పురుషశ్రేష్ఠుడు, పాండునందనుడు, అయిన అర్జునుడు పరిశుద్ధాంతఃకరణంతో వచ్చి మిమ్ములను ఈ దుఃఖం నుంచి దూరం చేస్తాడు.' నారదుని మాటలువిని మేము అయిదుగురం ఇక్కడికి వచ్చాం. ఆ వృత్తాంతం సత్యం. నీచే మేము శాపవిముక్తి పొందాం. ఈ నా నలుగురు సఖురాండ్రు వేరువేరు తీర్థాల్లో ఉన్నారు. వీరా! ఈ పుణ్యకర్మ ద్వారా వారిని కూడ విడిపించు." అనగానే అర్జునుడు వీర్యం, ధైర్యంతో వారిని మునిశాపం నుండి విడిపించాడు. నీటినుండి బయటకు వచ్చి పూర్వపుదేహాన్ని పొందిన ఆ అప్సరసలు పూర్వంవలె సుందరీమణులై ప్రకాశించారు. ఇలా తీర్థాల్ని స్నానయోగ్యాలుగా చేసి వారినుండి అనుమతి పొంది అర్జునుడు మరల మణిపురంలోని చిత్రాంగదను చూడటానికి వెళ్ళాడు. మణిపురంలో చిత్రాంగదయందు బభ్రువాహనుని కన్నాడు. తన కుమారుణ్ణి చూచి అర్జునుడు చిత్రవాహనునితో ఇలా అన్నాడు. "చిత్రాంగదకు శుల్కంగా నాకుమారుడు, వంశవర్ధనుడైన బభ్రువాహనుని స్వీకరించు. ఈ సమర్పణచే నేను ఋణవిముక్తుడను అయ్యాను." పిమ్మట అర్జునుడు చిత్రాంగదను ఉద్దేశించి ఇలా పలికాడు - "ప్రియురాలా! శుభమస్తు. నీవు ఇక్కడే ఉండి బభ్రువాహనుని పాలన, పోషణ చూడు.

సమయం వచ్చినప్పుడు ఇంద్రప్రస్థానికి చేరి సుఖిస్తావు. అక్కడ కుంతీదేవిని,

ధర్మజుని, భీముని, కవలలను, ఇతరబంధువుల్ని చూస్తావు. పుణ్యశీలా! బంధువులందరితో ఇంద్రప్రస్థంలో ఆనందాన్ని పొందుతావు. ఎల్లప్పుడు ధర్మాన్ని పరిపాలించే కొంతేయుడు, యుధిష్ఠిరుడు సత్యశీలుడై భూమినంతటిని జయించి రాజసూయయాగం చేస్తాడు. ఆ సమయాన భూమండలంలో రాజసంజ్ఞ గలవారందరు అక్కడకు వస్తారు. నీతండ్రి కూడ చాల ధనసంపద, రత్నాలను తీసుకొని వస్తాడు. చిత్రవాహనుని సేవకై నీవు రాజసూయానికి రాగలవు. నేను నిన్ను అక్కడనే కలుస్తాను. పుత్రుని పాలన, పోషణ చూసుకొంటూ దుఃఖాన్ని విడచిపెట్టు. బభ్రువాహనుని పేరుతో నాప్రాణాలు ఇక్కడే సంచరిస్తాయి. కావున వంశవర్ధనుడైన కుమారుని పెంచి పెద్ద చెయ్యి. ధర్మానుసారం ఇతడు చిత్రవాహనుని పుత్రుడు. పూరువంశానందకారకుడు. పాండవులప్రియపుత్రుడైన బభ్రువాహనుని పరిపాలించు. సాధ్వీ! నావియోగంచే దుఃఖింపకు." అని చిత్రాంగదతో పలికి అర్జునుడు గోకర్ణతీర్థం వైపుగా బయలుదేరాడు. గోకర్ణ క్షేత్రం ఈశ్వరుని మొదటి నివాసస్థానం. దర్శనం వల్లే ముక్తి కలుగుతుంది. పాపాత్ముడైనా ఈ క్షేత్రాన అభయపదాన్ని అధిరోహిస్తాడు.

217. ప్రభాసతీర్థమున కృష్ణార్జునుల కలయిక, ద్వారకానగరాగమనము.

పిమ్మట పరాక్రమవంతుడైన అర్జునుడు క్రమంగా పశ్చిమసముద్రతీరంలో ఉన్న పుణ్యతీర్థాలకు, మందిరాలకు వెళ్ళాడు. పశ్చిమసముద్రతీరాన ఉన్న అన్ని తీర్థాలను, మందిరాలను చూసి అర్జునుడు ప్రభాస తీర్థానికి చేరాడు.శ్రీకృష్ణుడు చారులద్వారా "అర్జునుడు ప్రభాసతీర్థానికి చేరాడు" అని విని అతనిని కలియటానికి వెళ్ళాడు. కృష్ణార్జును లిరువురు ప్రభాసతీర్థాన ఒకరిని ఒకరు సందర్శించారు. ప్రియసఖులైన ఆ నరనారాయణులు ఇరువురు ఒకరినొకరు గాఢంగా కౌగిలించుకొని, క్షేమాలు పరస్పరం తెలిసికొని ఒకచోట ఆసీనులయ్యారు. ఆ తరువాత శ్రీకృష్ణుడు "అర్జునా! ఈ తీర్థయాత్ర నెందుకు చేస్తున్నావు" అని అర్జునునితో తీర్థయాత్ర ప్రస్తావన చేశాడు. ఆ ప్రశ్నను విని అర్జునుడు జరిగిన వృత్తాంతాన్ని శ్రీకృష్ణునికి తెలిపాడు. విన్న శ్రీకృష్ణుడు "ఓహో అదా విషయం" అని పలికి అభినందించాడు. శ్రీకృష్ణార్జును లిరువురు స్వేచ్ఛగా ప్రభాసతీర్థంలో విహరించి రాత్రివేళకు రైవతకపర్వతానికి చేరారు. శ్రీకృష్ణుని ఆజ్ఞానుసారం ఆయన సేవకులు ముందుగా అక్కడకు చేరి ఆ ప్రదేశం అలంకరించి, భోజనాదులను తయారుచేసి ఉంచారు. అర్జునుడు శ్రీకృష్ణునితో కలిసి సిద్ధం కావించిన భోజనాలను తన ఇష్టానుసారం భుజించి, నటనర్తకుల నృత్యాలను చూశాడు. పిమ్మట వారినందరినీ కానుకలతో సత్కరించి,

పంపించి, అర్జునుడు పాన్పుపై నిద్రించాడు.

అందమైన పాన్పుపై పడుకొని మహాబాహువైన అర్జునుడు శ్రీకృష్ణునికి తాను చూచిన తీర్థాలు, కుండాలు, పర్వతాలు, నదులు, వనాల విశేషాలను వివరించాడు. జనమేజయా! అర్జునుడు ఆ విశేషాలను వినిపిస్తూనే స్వర్గతుల్యమైన ఆ పాన్పుమీద నిద్రలోకి జారాడు. ప్రాతఃకాలాన మధురగీతాలు, మంగళవాద్యాలు, స్తోత్రపాఠాలు విని, అర్జునుడు నిద్రలేచాడు. అతడు కాలకృత్యాల నాచరించి శ్రీకృష్ణుని అభినందనలతో బంగారురథంపై ద్వారకకు బయలుదేరాడు. కుంతీకుమారుని స్వాగతానికి ద్వారకానగరం అంతా తోటలతో సహా అలంకరింపబడింది. కౌంతేయుని చూడటానికి ద్వారకావాసులు అందరు లక్షలకొలది ప్రధానమార్గాల్లో(రాజవీథుల్లో) చేరారు. అర్జునుని దర్శనం వీలైనచోట వేలకొలది స్త్రీలు నిలిచియున్నారు. భోజ, వృష్ణి, అంధకవంశ పురుషుల గుంపులు ఒకచోటికి చేరాయి. వృష్ణి, భోజ, అంధకవంశపురుషుల ఆదరసత్కారాలను పొందిన అర్జునుడు పెద్దవారికి నమస్కరించాడు. వారందరు అర్జునునికి స్వాగతవచనాలు పలికారు. యదువీరు లందరు అర్జునుని ఎంతో ఆదరించారు. అర్జునుడు సమవయస్కులు అయిన వారిని కౌగిలించుకొని మరీ మరీ ఆనందించాడు. నవరత్నాలు, వివిధ భోజ్యపదార్థాలు అందుబాటులో గల శ్రీకృష్ణుని మందిరాన అర్జునుడు చాలా రాత్రులు శ్రీకృష్ణునితో కూడి నివసించాడు.

218. అర్జునుడు సుభద్రను అపహరించుట.

కొన్నిరోజులు గడిచిన తరువాత వృష్ణి, అంధక వంశీయులకు రైవతకపర్వతాన గొప్ప ఉత్సవం వచ్చింది. పర్వతంమీద జరిగే ఉత్సవంలో బ్రాహ్మణులకు చాలమందికి భోజ, వృష్ణి, అంధకవంశీయులు దానాలు చేశారు. పర్వతానికి నాలుగువైపుల విచిత్రమైన రత్నఖచితభవనాలు, కల్పవృక్షాలు ఉన్నాయి. వాటితో ఆ ప్రదేశం అందగించింది. వాదకుశలులైన వాద్యకులు వివిధ రకాల వాద్యాలను మ్రోగించారు. నర్తకులు నాట్యం చేశారు. గాయకులు గీతాలు పాడారు. తేజస్వులైన యాదవకుమారులు అలంకరించుకొని బంగారుతాపడం చేసిన వాహనాలపై ఇటు అటు తిరగసాగారు. ద్వారకాపురవాసులు తమతమ భార్యలతో గూడి కొందరు, కాలినడకన కొందరు; చిన్న, పెద్ద వాహనాలలో ఉత్సవంలో పాల్గొన్నారు. పూజ్యుడు బలరాముడు మధుపానమత్తుడై రేవతితో కలిసి విహరించాడు. గంధర్వ లతనిని అనుసరించారు. వృష్ణివంశీయుడు, యాదవరాజు అయిన ఉగ్రసేనుడు అక్కడ సంచరించాడు. గంధర్వులు గానంతో మైమరపింపచేశారు. వేలకొద్దీ స్త్రీలు అతనిని

సేవింపసాగారు. వీరశ్రేష్ఠులు సాంబప్రద్యుమ్నులు దివ్యమాలలు ధరించి, మత్తులై అమరులైన దేవతలవలె ఆనందంతో సంచరింపసాగారు. అక్రూరుడు, సారణుడు, గదుడు, బభ్రువు, విదూరథుడు, నిశఠుడు, చారుదేష్ణుడు, పృథువు, విపృథువు, సత్యకుడు, సాత్యకి, భంగకారుడు, మహారవుడు, హార్దిక్యుడు(కృతవర్మ), ఉద్ధవుడు ఇంకా మిగిలిన యదువంశీయులూ తమ తమ భార్యలతో గంధర్వులతో విడివిడిగా తిరిగారు. రైవతంమీద ఉత్సవశోభను వృద్ధిచేశారు. అద్భుతమూ, కుతూహలజనకమూ అయిన ఆ ఉత్సవంలో కృష్ణార్జును లిరువురూ కలిసి సంచరించారు. అలా సంచరిస్తూ వారిరువురు వసుదేవుని ప్రియపుత్రిక అయిన సుభద్రను చూశారు. ఆమె అలంకరించుకొని సఖురాంద్ర మధ్యలో తిరుగసాగింది.

ఆమెను చూస్తూనే అర్జునునికి హృదయంలో మన్మథుడు ఆవిర్భవించాడు. ఆమె పట్ల ఆసక్తమైన అర్జునుని తీరు శ్రీకృష్ణుడు గుర్తించాడు. శ్రీకృష్ణుడు పరిహసిస్తూ అర్జునునితో ఇలా అన్నాడు. 'వనవాసియైన నీమనస్సు ఇలా మన్మథునిచే సంక్షోభ పడుతోంది ఏమిటి? కుంతీనందనా! ఈమె నాసోదరి. సారణుని సహోదరి. ఈమె పేరే సుభద్ర. ఈమె నాతండ్రికి ప్రియపుత్రిక. నీకు మంగళమగుగాక! నీబుద్ధి ఈమెను వివాహం చేసుకోవాలని అనుకొంటే నాతండ్రికి స్వయంగా చెపుతాను.' అర్జునుడు అన్నాడు "సాక్షాత్తుగా వాసుదేవుని చెల్లెలు, వసుదేవుని కుమార్తె, చక్కని రూప సంపదతో ఎవరిని మోహపెట్టదు? మిత్రమా! వృష్ణివంశజ అయిన నీ సోదరి సుభద్ర నన్ను వివాహం చేసుకొంటే యింతకంటె నాకు వేరొక మంగళప్రదమైన విషయం ఏముంటుంది. జనార్దనా! చెప్పు. ఈమెను పొందుటకు సులభం అయిన ఉపాయం ఏది? నరుడు చేయగలిగిన దాన్ని తప్పక చేయగలను." వాసుదేవుడు అన్నాడు - "పార్థా ! క్షత్రియులకు స్వయంవరం ధర్మమే కాని ఆ మార్గం సందేహం. స్త్రీ స్వభావం అనిశ్చితమై ఉంటుంది. బలవంతంగా అపహరించి వివాహం చేసుకోవటం కూడ శూరులకు ఉత్తమం అని ధర్మవేత్తలు తెలిపారు. కావున నా అభిప్రాయంలో ఈమెను అపహరించి వివాహం చేసుకోవడమే తగినది. అపహరించి తీసుకొని వెళ్ళు. స్వయంవరంలో ఈమె ఎవరిని వరిస్తుందో ఎవరికి తెలుసు?" శ్రీకృష్ణార్జునులు ఇలా నిశ్చయించుకొని శీఘ్రంగా పోగల దూతలను ఇంద్రప్రస్థపురానికి ధర్మజుని అనుజ్ఞకై పంపారు. అది విన్న ధర్మరాజు తన సమ్మతిని తెలియజేశాడు.

ఈ విషయం విని భీముడు కృతకృత్యుల మైనాము అని భావించి ఆ చారులతో కూడా ఈవిషయం చెప్పి సంతోషించాడు.

219. యాదవులతో యుద్ధము, బలరాముని క్రోధవచనములు.

వివాహ విషయంలో యుధిష్ఠిరుని ఆజ్ఞపొందిన అర్జునుడు సుభద్ర రైవతకపర్వతానికి వెళ్ళినట్లు తెలిసికొని శ్రీకృష్ణుని అభిప్రాయం అడిగాడు. శ్రీకృష్ణుడు అర్జునునికి ఆచరించవలసిన మార్గాన్ని ఆదేశించాడు. సుభద్ర వివాహవిషయంలో శ్రీకృష్ణుని అనుమతి గ్రహించి బయలుదేరాడు అర్జునుడు. ఇంతలో దారుకుడు శ్రీకృష్ణుని ఆజ్ఞానుసారం సువర్ణరథాన్ని యథావిధిగా సిద్ధపరచాడు. చిరుమువ్వలు, జాలరులు గల ఆ రథానికి శైబ్యం, సుగ్రీవం అనే గుఱ్ఱాలను పూన్చాడు. ఆ రథంలో వివిధ శస్త్రాస్త్రాలు సమకూర్చాడు. వాటి ఒరపిడిచే మేఘగర్జన వంటి ధ్వని వస్తోంది. అది శత్రువుల హర్షం ఒక్కసారిగా దిగజార్చేలా ఉంది. కవచం, ఖడ్గం, వ్రేలి తొడుగులు ధరించిన అర్జునుడు వేట మిషతో రైవతానికి బయలుదేరినట్లుగా వెళ్లాడు. సుభద్ర రైవతకపర్వతాన్ని పూజించి, దేవతాగణాన్ని ఆరాధించి, బ్రాహ్మణుల స్వస్తివచనాలను గ్రహించి, పర్వతానికి ప్రదక్షిణం చేసి, ద్వారకానగరానికి బయలుదేరింది. కాముని బాణాలచే పీడితుడైన అర్జునుడు సుందరి సుభద్రను బలవంతంగా రథంపై కూర్చుండబెట్టుకొని బయలుదేరాడు. అర్జునుడు చక్కని చిరునవ్వు లొలికే సుభద్రను సువర్ణరథంపై ఎక్కించుకుని తన నగరంవైపు బయలుదేరాడు. సుభద్ర అపహరణం చూచిన సైనికగణం పెడబొబ్బలు పెడుతూ, ద్వారకానగరం వైపు పరుగులు తీసింది. వారందరు ఒక్కసారిగా సుధర్మ అనే సభలోనికి ప్రవేశించి సభాపాలకునితో పార్థుని విక్రమాపహరణవృత్తాంతం చెప్పారు.

వెంటనే సభాపాలకుడు అదివిని యుద్ధభేరిని మ్రోగింపచేశాడు. ఆ ధ్వని విని భోజ, వృష్ణి, అంధకాది యదువీరులు కలవరపడ్డారు. అన్నపానాలు విడిచి ఒక్కుమ్మడిగా అన్నివైపుల నుండి వచ్చిచేరారు. ఆ సభాభవనంలో బంగారు సింహాసనాలు, వాటిపై విలువైన కంబళ్ళు ఉన్నాయి. మణులు, పగడాలు పొదగటంతో అవి అగ్నివలె ప్రకాశించాయి. భోజ, వృష్ణి, అంధక యదువీరులు ఆయా ఆసనాలపై ఆసీను లయ్యారు. ఆ మహారథులంతా యజ్ఞవేదికలలో ప్రకాశించే అగ్నులవలె భాసించారు. దేవతలవలె ప్రకాశించే యదువీరులందరు ఆసీనులు కాగానే సభాపాలకుడు అర్జునుని సుభద్రాపహరణ వృత్తాంతమంతా వారికి వినిపించాడు. అది విని వృష్ణి వీరులు యుద్ధోన్మాదంతో ఎఱ్ఱబడ్డ కన్నులతో అర్జునుని చేష్టను సహింపలేక గర్వంతో ఎగిరిపడ్డారు. 'తొందరగా రథాలుసిద్ధం చేయండి. ప్రాసాయుధాలను బయటకు తీయండి. గొప్పగొప్ప ధనుస్సులను, పెద్దపెద్ద కవచాలను తీసుకురండి' అని పలికారు. కొందరు సారథులను పిలిచి 'రథాలను సిద్ధంచేయండి'

అన్నారు. కొందరు స్వయంగానే బంగారు ఆభరణాలతో కూడిన గుఱ్ఱాలను పూన్చారు. రథాలు, కవచాలు, ధ్వజాలు తెచ్చేటప్పుడు నాలుగువైపులా ఆ యాదవవీరుల కోలాహలంతో సంకులమైన ధ్వని వ్యాపించింది. అపుడు కైలాసశిఖరంవలె తెల్లగా ప్రకాశిస్తూ, నీల వస్త్రాలు. వనమాల ధరించి బలరాముడు ఇలా పలికాడు. "మూర్ఖులారా! శ్రీకృష్ణుడు మాటాడటం లేదు. ఈ కోలాహల మెందులకు? వాని అభిప్రాయం తెలుసుకోకుండా వ్యర్థంగా క్రోపాన్ని ప్రదర్శిస్తున్నారు. ముందు బుద్ధిమంతుడైన శ్రీకృష్ణుడు తన అభిప్రాయాన్ని తెలియజేస్తాడు. అటుపై కర్తవ్య నిర్ణయం మనం చేద్దాం. ఆలసించకుండా ఆయన మాటలు వినండి." బలరాముని మాటలను విని యాదవులందరు నిశ్శబ్దాన్ని పాటించారు. అందరు బాగుంది అన్నారు. బుద్ధిమంతుడైన బలరాముని మాటల్ని విని, వెంటనే సభలోని యాదవవీరు లందరు శ్రీకృష్ణుని మాటలు వినటానికి మౌనంగా కూర్చున్నారు.

బలరాముడు వెంటనే శ్రీకృష్ణునితో 'జనార్దనా! ఏమియు మాటాడక మౌనంగా చూస్తూ ఊరకున్నావేమి? అచ్యుతా! నీ కోసం అర్జునుని మేము గౌరవించాం. అల్పబుద్ధిగల అర్జునుడు ఆ పూజకు అర్హుడు కాడు. అన్నం తిన్న పాత్రను అచటనే పగులగొట్టడం సద్వంశజులకు ఉచితం కాదు. మన సంబంధాన్ని కోరుతూనే పూర్వపు ఉపకారాన్ని స్మరింపకుండా కళ్యాణాన్ని కోరే వాడు ఎవడయినా ఇలా సాహసాన్ని చూపుతాడా? అర్జునుడు మనను అవమానించి, శ్రీకృష్ణుని లక్ష్యపెట్టక, తన మృత్యువును తెచ్చిపెట్టే సుభద్రాదేవిని బలవంతంగా అపహరించాడు. సర్పం నరునిపాదాన్ని సహించనట్లు నా తలపై నుంచిన అర్జునుని పాదాన్ని బలవంతుడనైన నేను ఎలా సహిస్తాను. అర్జునుని ఈ ధిక్కారాన్ని నేను సహింపలేను. ఇప్పుడే నేనొక్కడినే ఈ భూమినంతటినీ అకౌరవం చేసి చూపిస్తాను.' మేఘ, దుందుభులతో పోటీ పడే కంఠస్వరంతో బలరాముడు ఇలా గర్జిస్తే భోజ, వృష్ణి, అంధక యదువీరులంతా ఆ మాటలను సమర్థించారు.

220. సుభద్రవివాహము, అభిమన్యుని పుట్టుక, విద్యాభ్యాసము.

యాదవులందరు ఆసమయంలో తమతమ శక్త్యనుసారం ప్రతీకారేచ్ఛతో అర్జునుని లొంగదీయాలని విన్నవించారు. శ్రీకృష్ణుడు మాత్రం ధర్మంతో, అర్థంతో నిండైన వాక్యాలను ఇలా పలికాడు. "అర్జునుడు మన కులాన్ని అవమానించలేదు. మనయాదవులపై గౌరవభావాన్ని ప్రకటించాడు. ఈ విషయంలో సందేహం లేదు. సాత్వతులకు ధనలోభం లేదు కావున ధనమిచ్చి కన్యకను పరిగ్రహింప వీలుకాదు. స్వయంవరంలో కన్యను గెలిచినా ఆమె

అభిప్రాయం తెలుసుకోలేం. ఈ అంశాలన్ని అర్జునుడు ఆలోచించాడు. కన్యాదానం చేయించుకొన్న పౌరుషహీనుడు పరాక్రమహీనుడై, పశుతుల్యుడు అవుతాడు. ధనం గ్రహించి తన సంతానాన్ని అమ్ముకొనేవాడు అధముడుగా పరిగణింపబడతాడు. ఈ దోషాలను అర్జునుడు మనస్సులో ఆలోచించాడు. అందుకే బలవంతంగా ఈ కన్యను క్షత్రియధర్మానుసారం అపహరించి తీసుకుపోయాడు. నా అభిప్రాయంలో ఈ సంబంధం ఉచితమైంది. యశస్వినీ సుభద్రను యశస్వి అర్జునుడు పరిగ్రహించాడు. కావున 'రత్నహారీ తు పార్థివః' అనే న్యాయాన్ని పాటించి బలవంతంగా ఆమెను హరించాడు. భరతవంశంలో జన్మించి, కీర్తి గడించిన శంతను వంశజుడై, కుంతిభోజుని దౌహిత్రుడైన అర్జునుని సంబంధాన్ని ఎవడు కోరడు? అర్యుడా! ఇంద్రరుద్రలోకాలలో శంకరుడు తప్ప మరొకడు అర్జునుని జయించగలవాడు నాకు కన్పించటంలేదు. యుద్ధంలో అర్జునుని గెలవడం అసాధ్యం. ఈ సమయంలో అర్జునుని వద్ద నారథం, గుఱ్ఱాలు ఉన్నాయి. అంతేగాక వాటిని సమర్థంగా నడిపించగలిగిన యోధుడు అర్జునుడు. ఈ దశలో అర్జునునికి సమానుడు లేడు. మీరు ప్రసన్నులై తొందరగా అతనిని అనుసరించి సాంత్వనతో మరల్చటమే ఉచితం. ఇది నాకు సమ్మతం. అర్జునుడు మనల్ని జయించి తన నగరానికి వెళ్లితే మనకీర్తి నశిస్తుంది. సాంత్వనంలో పరాజయ శంకలేదు." వాసుదేవుని మాటలను విని వారు అదేవిధంగా ఆచరించారు.

పరాక్రమవంతుడైన అర్జునుడు ద్వారకకు తిరిగి వచ్చి, సుభద్రను వివాహం చేసికొని సంవత్సరం పైన అక్కడనే గడిపాడు. ద్వారకలో స్వేచ్ఛగా విహరించి యాదవవంశీయులచే పూజలందుకొని అక్కడనుండి బయలుదేరి పుష్కర తీర్థంలో మిగిలిన కాలాన్ని గడిపాడు. పండ్రెండు సంవత్సరాలు పూర్తికాగానే ఖాండవప్రస్థానికి తిరిగివచ్చాడు. పురోహితుడైన ధౌమ్యుని వద్దకు వెళ్ళి నమస్కరించి అటుపైన తల్లికి కూడ నమస్కరించాడు.

(అర్జునుడు ధర్మజ. భీములకు నమస్కరించి, నకులసహదేవుల నమస్కారాలు పొంది వారిని కౌగిలించుకొని, మిక్కిలి ప్రసన్ను డయ్యాడు.)

ధర్మరాజును చేరి ఏకాగ్రచిత్తుడై విధిపూర్వకంగా బ్రాహ్మణులను అర్చించాడు. పిమ్మట ద్రౌపది సమీపానికి చేరాడు. ప్రణయకోపంతో ద్రౌపది కురునందనునితో అంది. 'ఇక్కడి కేల వచ్చావు? సాత్వత కుమార్తె సుభద్ర ఉన్నచోటికే పొమ్ము. రెండవసారి బంధం బిగించేటపుడు పూర్వబంధం వదులవడం లోకసహజం.' ఇలా ద్రౌపది అనేకరకాలుగా విలపించసాగింది. ధనంజయుడు ఆమెను ఊరడించాడు. మరలమరల ఊరుకోబెట్టాడు.

అర్జునుడు ఎట్టటి పట్టువస్త్రాలు ధరించిన సుభద్రను గోపాలికావేషం ధరింపజేసి ఇంటిలో ప్రవేశపెట్టాడు. వీరపత్ని, వీరాంగన, యశస్విని సుభద్ర ఆ వేషంలో మిక్కిలి శోభించింది. విశాలమయిన ఆమె కళ్లు ఎట్టగా ఉన్నాయి. సుభద్ర కుంతీదేవికి నమస్కరించింది. ఆమె సుభద్రను దగ్గరకు తీసికొని నుదుటిపై చుంబించి ఆశీర్వదించింది. మిక్కిలి ప్రసన్నురాలై కుంతి ఆ సౌందర్యవతికి ఎన్నో ఆశీర్వచనా లిచ్చింది. పూర్ణచంద్రబింబం వంటి ముఖంతో ఆమె ద్రౌపదిదేవి చరణాలకు నమస్కరించి "నేను మీదాసిని" అంది. ద్రౌపదీ దేవి వెంటనే లేచి శ్రీకృష్ణుని చెల్లెలు సుభద్రను కౌగిలించుకొని ప్రసన్నతతో "నీభర్త శత్రురహితు డగుగాక" అని దీవించింది. సుభద్ర ఆనందంలో మునిగి "మీ ఆశీర్వాదం ఫలించాలి" అని అంది.

పాండవులు, కుంతి మిక్కిలి ఆనందించారు. అర్జునుడు ఇంద్రప్రస్థనగరానికి చేరాడని పుండరీకాక్షుడు విన్నాడు. శ్రీకృష్ణుడు విశుద్ధాత్ముడై బలరామ, వృష్ణి, అంధక వంశప్రధానులైన మహారథులతో కలిసి అక్కడికి చేరాడు. శ్రీకృష్ణుడు సోదరులతో, పుత్రులతో, యోధులతో, గొప్పసైన్యంతో ఇంద్రప్రస్థనగరానికి వచ్చాడు. అక్కడకు యాదవ వీరులసేనాపతి అక్రూరుడు కూడ వచ్చాడు. తేజస్వి, కీర్తిమంతుడు, బుద్ధిమంతుడు, మనస్వి, బృహస్పతి శిష్యుడు అయిన ఉద్ధవుడు, తేజోవంతుడైన అనాధృష్టి అక్కడకు వచ్చారు. సత్యకుడు, సాత్యకి, కృతవర్మ, ప్రద్యుమ్నుడు, సాంబుడు, నిశరుడు, శంకువు, చారుదేష్ణుడు, ఝిల్లి, విపృథువు, సారణుడు, విద్వాంసుడు గదుడు, ఇతరులైన యాదవులందరు ఖాండవప్రస్థానికి అరణం తీసుకొని ఎంతో వేడుకగా వచ్చారు. మహారాజు యుధిష్ఠిరుడు మాధవుని రాక విని, ఆదరపూర్వకంగా తీసుకొని రావటానికి నకుల సహదేవులను పంపాడు.

నకుల సహదేవులతో స్వాగతపూర్వకంగా ఆహ్వానింపబడిన యాదవగణం పతాక, ధ్వజాలతో అలంకరింపబడిన ఖాండవప్రస్థంలో ప్రవేశించింది. ఇంద్రప్రస్థంలోని మార్గాలు శుభ్రంచేసి నీటితో కళ్ళాపి చల్లారు. పూలు చల్లారు. చల్లని చందన, సుగంధద్రవ్యాలతో పరిమళభరితాలు చేశారు. ప్రతిప్రదేశంలో అగరుగంధాలు వ్యాపించాయి. నగరమంతా ఆనందభరితులైన జనులతో నిండిపోయింది. వ్యాపారులు ఆ నగరశోభలను పెంచారు. కేశవుడు బలరామునితో వృష్ణి, అంధక, భోజ, యాదవ వీరులతో కలిసి ఆ నగరిలోకి ప్రవేశించాడు. పురవాసులచే, బ్రాహ్మణులచే గౌరవింపబడిన శ్రీకృష్ణుడు ఇంద్రభవనసౌందర్యం గల ధర్మజుని భవనంలో ప్రవేశించాడు. యుధిష్ఠిరుడు బలరాముని యథావిధిగా కలిసి,

శిరస్సుపై శ్రీకృష్ణుని చుంబించి కౌగిలించుకున్నాడు. శ్రీకృష్ణుడు ప్రసన్నుడై వినయభావంతో యుధిష్ఠిరుని సమ్మానించాడు. నరశ్రేష్ఠుడైన భీమునికూడ విధిప్రకారం సమ్మానించాడు. వృష్ణి, అంధక యదువీరు లందరికి కుంతీనందనుడు ధర్మరాజు యథాయోగ్యంగా, యథావిధిగా స్వాగతసత్కారాలు కల్పించాడు.

కొందరిని గురువునువలె పూజించాడు. కొందరిని స్నేహితునివలె కౌగిలించుకొన్నాడు. కొందరిని ప్రేమతో పలుకరించాడు. కొందరు ధర్మజునికి నమస్కరించారు. యశస్వి శ్రీకృష్ణుడు పాండవులకు వధూధనాన్ని అర్పించాడు. కుటుంబీకులకు సుభద్రకారణంగా ఈయతగిన అరణాన్ని అంతటినీ సమర్పించాడు. శ్రీకృష్ణుడు చిరుమువ్వలు, జాలరులతో అలంకరింపబడిన, నాల్గేసి గుఱ్ఱాల్ని పూన్చిన వేయి రథాలను నేర్పరులైన సారథులతో సహా అప్పగించాడు. మాధురదేశంలోపుట్టిన పదివేల గోవులను కానుకగా ఇచ్చాడు. చంద్రకాంతితో వెలిగే, మంచి లక్షణాలుగల, బంగారు ఆభరణాలతో కూడిన వేయి గుఱ్ఱాలను ప్రేమతో జనార్దనుడు పాండవులకు ఇచ్చాడు. గాలితో సమానవేగంకల్గి, అదుపులో ఉండే వంద కంచర గాడిదలను, ఐదువందల కాటుకరంగు గుఱ్ఱాలను, ఐదువందల తెల్లగుఱ్ఱాలను కానుకగా అప్పగించాడు. స్నాన, పానోత్సవాలలో ఉపయోగపడే పడుచులు, సుందర వేషధారిణులు, మంచి కాంతిగల వంద వంద బంగారు ఆభరణాలు దాల్చి, రోమాలు కనపడని వేయిమంది దాసీజనాన్ని పుండరీకాక్షుడు కృష్ణుడు కానుకగా ఇచ్చాడు. శ్రీకృష్ణుడు బరువుమోయగల లక్ష బాహ్లీకదేశపు అశ్వాలను కన్యాధనంగా అర్పించాడు. జనార్దనుడు అగ్ని వర్చస్సుగల మొహరీలను, పదిమంది మనుష్యుల బరువున్న విశుద్ధమైన బంగారాన్ని ఇచ్చాడు. సాహసప్రియుడు, హలధరుడైన బలరాముడు ప్రసన్నుడై నూతన బంధుత్వాన్ని పురస్కరించుకొని పెండ్లికానుకగా మదించిన వేయి ఏనుగులను ఇచ్చాడు. అవి మూడు అవయవాలనుంచి మదస్రావం కలవి. పర్వత శిఖరాలవలె ఉన్నతాలు. యుద్ధంలో వెనుకకు తిరగనివి. వాటి పార్శ్వాలందు ఘంటలు వ్రేలాడదీయబడ్డాయి. మెడలో బంగారు హారాలు ఉన్నాయి. వాటన్నింటిపైన మావటివాండ్రు ఉన్నారు.

నదులన్నీ సాగరంలో కలిసినట్లు ఆ గొప్పగొప్ప ధనరాసు లనే ప్రవాహాలు, వస్త్రకంబళ మనే నురుగుముద్దలు, గొప్పగజాలనబడే మొసళ్లు, జెండాలనే నాచు సమూహాలు పాండవమహాసాగరాన చేరాయి. ఇదివరకే సమృద్ధమైన పాండవసాగరం వీటికలయికతో పూర్ణతరమై ప్రకాశిస్తూ శత్రుశోకానికి కారణం అయింది.

యుధిష్ఠిరుడు ఆ ధనమంతా స్వీకరించి, యాదవశ్రేష్ఠులను ఆదరసత్కారాలతో

పూజించాడు. ఇంద్రుని నగరాన పుణ్యాత్ములు చేరినట్లు యాదవ వీరులందరూ పాండవులతో కలిసి విహరించారు. కురువంశీయులు, వృష్ణివంశీయులు అక్కడక్కడ గొప్పగానాలతో, వాద్యాలతో, సమయానుకూలంగా, ఆనందంతో కలిసి విహరించారు. యదువీరులు కురువంశీయులతో కలిసి చాలారోజులు గడిపి సమ్మానితులై ద్వారకకు చేరారు. వృష్ణి, అంధకవీరులందరు కురుశ్రేష్ఠులిచ్చిన ఉత్తమ రత్నాలు గ్రహించి, బలరాముని తోడ్కొని, ద్వారకవైపు ప్రయాణం సాగించారు. శ్రీకృష్ణుడు మాత్రం మహాత్ముడైన అర్జునునితో కలిసి ఆ నగరమందే కొంతకాలం వసించాడు. యశస్వి శ్రీకృష్ణుడు అర్జునునితో వేటకు వెళ్ళి యమునాతీరాన మృగాలను, అడవిపందులను వధిస్తూ ఆనందించాడు. కొంతకాలానికి శ్రీకృష్ణుని ప్రియసోదరి సుభద్ర సౌభద్రుని కన్నది. ఈసంఘటన శచీదేవి జయంతుని కన్న తీరును తలపించింది. సుభద్రాదేవి వీరవరుడు, దీర్ఘభుజుడు, విశాలవక్షఃస్థలం గలవాడు, వృషభనేత్రుడు, శత్రుమర్దనుడు అయిన అభిమన్యుని ప్రసవించింది. నిర్భయంగా, క్రోధంతో యుద్ధంచేసేవాడు కనుక అభిమన్యుని పేరు సార్థకమైందే అని నిర్దేశింపబడింది. యజ్ఞంలో మధిస్తే శమీగర్భాన తేజోవంతమైన అగ్ని ఏర్పడినట్లు అర్జునుని వలన సుభద్ర యందు తేజోవంతుడు పుట్టాడు. అతడు పరాక్రమంలో అతిరథుడు. అతడు పుట్టినవెంటనే కుంతీనందనుడు యుధిష్ఠిరుడు బ్రాహ్మణులకు పదివేలగోవుల్ని, బంగారు నాణాలను దానం చేశాడు. ప్రజలకు చంద్రుడు ప్రియమైనట్లు బాల్యంనుంచి అభిమన్యుడు తన తండ్రులకు వలె శ్రీకృష్ణునికి ప్రీతిపాత్రుడైనాడు.

పుట్టినది మొదలు శ్రీకృష్ణుడు జాతకర్మాదిక్రియల్ని అభిమన్యునికి స్వయంగా చేయించాడు. అతడు శుక్లపక్షచంద్రునివలె దినదిన ప్రవర్ధమానుడు అయ్యాడు. శత్రునాశకుడు, వేదవేత్త అయిన అభిమన్యుడు దివ్యమానుషమైన ధనుర్వేదాన్ని అంతటిని నాలుగుభాగాలుగా, పది అంగాలుగా అర్జునునివద్ద నేర్చుకొన్నాడు.

మహాబలవంతుడైన అర్జునుడు అస్త్రవిజ్ఞానంలో, ప్రయోగపాటవంలో, సంపూర్ణయుద్ధక్రియలలో అభిమన్యునికి ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చాడు. ధనంజయుడు ఆగమప్రయోగవిషయాల్లో తనపుత్రుని తనతో సమంగా చేశాడు. అతడు తన కుమారుని అభ్యాసాన్ని చూచి, మిక్కిలి సంతోషించాడు. అభిమన్యుని స్కంధాలు వృషభంవలె గెలువశక్యం కావు. సద్గుణాలలో, ఉత్తమలక్షణాల్లో ఇతరులను మించినవాడు, నోరుతెరిచిన సర్పంవలె భయంకరుడై గోచరిస్తున్నాడు. సింహతుల్యగర్వం, మదించిన ఏనుగు పరాక్రమం, మేఘ, దుందుభి సమానకంఠస్వరం, పూర్ణచంద్రునివంటిముఖ శోభలతో గొప్ప ధానుష్కుడై

ప్రకాశించాడు. రూపం, శౌర్యం, వీర్యం, ఆకృతుల్లో అన్నివిధాలా శ్రీకృష్ణునితో సమానుడై భాసించాడు. ఇంద్రుడు తనను చూచి ప్రసన్నుడైనట్లు అర్జునుడు అభిమన్యుని చూచి ప్రసన్నత పొందాడు.

శుభలక్షణవతి అయిన పాంచాలి తన ఐదుగురు భర్తల నుండి వీరులు, శ్రేష్ఠులు, అయిన ఐదుగురు పుత్రులను పొందింది. వారు వీరులు, పర్వతాలవలె ఆచంచలులు. ధర్మరాజు వలన ప్రతివింధ్యుని, వృకోదరుని వలన సుతసోముని, అర్జునునివలన శ్రుతకర్మను, నకులుని వలన శతానీకుని, సహదేవుని వలన శ్రుతసేనుని ప్రసవించింది. వారందరు మహారథులు. అదితి ఆదిత్యులను ప్రసవించినట్లు ద్రౌపది వారిని కన్నది. శాస్త్రానుసారం బ్రాహ్మణులు ప్రతివింధ్యుడని నిర్దేశించి యుధిష్ఠిరునితో అన్నారు. 'ప్రహారజనితవేదన సహించటంలో వింధ్యపర్వతంతో సమానుడు కనుక ప్రతివింధ్యుడు అగుగాక!' భీమసేనుడు వేయి సోమయాగాలు ఆచరించిన పిదప చంద్రసూర్యుల తేజస్సు గల పుత్రుడు జనించుటచే అతనికి సుతసోముడు అన్నపేరు నిర్ణయించారు. అతడు గొప్ప ధానుష్కుడై వెలిగిపోసాగాడు. ఇంద్రకిరీటం దాల్చిన అర్జునుడు ప్రసిద్ధకర్మలను ఆచరించిన పిదప పుట్టుటచే శ్రుతకర్మ అన్నపేరు ఆ పుత్రునికి ఏర్పడింది. కౌరవవంశజుడు, రాజర్షి అయిన శతానీకుని పేరు నకులుడు తనకీర్తిని పెంచే కుమారునికి పెట్టాడు. అగ్నిదేవతప్రధానంగా గల కృత్తికానక్షత్రాన ద్రౌపది అయిదవ పుత్రుని కనుటచే శ్రుతసేనుడు అని నామకరణం చేశారు. అగ్నికి మరొకపేరు శ్రుతసేనుడు. రాజా! కీర్తిమంతులైన ఈ ఆయిదుగురు ద్రౌపదీపుత్రులు ఒక్కొక్క సంవత్సరం వ్యవధిలో పుట్టారు. వీరందరు పరస్పరం ఒకరిహితం ఒకరు కోరుకొనేవారు. పురోహితుడైన ధౌమ్యుడు వారందరికి శాస్త్రప్రకారం జాతకర్మ, చూడ, ఉపనయనాది సంస్కారాలను క్రమంగా చేయించాడు. వేదాధ్యయనం పూర్తిచేసి, వారు పరిపూర్ణంగా బ్రహ్మచర్యవ్రతాన్ని పాటించి అర్జునునివలన దివ్యమానుషాలయిన శస్త్రాస్త్రాలన్నింటిని, ధనుర్వేదాన్ని గ్రహించారు. రాజా! దేవతల పుత్రులతో సమానులైన మహారథులు, విశాలవక్షంగల ఆ పుత్రులను పొంది పాండవులు అయిదుగురు మిక్కిలి ప్రసన్నత పొందారు.

221. కృష్ణార్జునులు ఖాండవవనమున అగ్నిదేవుని చూచుట.

శాంతనవుడు అజ్ఞాపించగా ఇంద్రప్రస్థనగరంలో నివసిస్తూ పాండవులు శత్రురాజులందరినీ జయించారు. జీవాత్మ పుణ్యకర్మలఫలంగా సుందరదేహాన్ని పొంది

ఆనందించినట్లు పుణ్యకర్మలను మాత్రమే ఆచరించే ధర్మరాజు పాలనలో లోకమంతా సుఖానుభవాన్ని పొందింది. నీతిపరు డయిన పురుషుడు ధర్మార్థకామాలు మూడింటినీ సమంగా సేవించినట్లు ఆత్మసములైన బంధువులవలె గౌరవిస్తూ ధర్మరాజు ధర్మార్థకామాలను సేవించాడు. ఆయన పాలనలో ధర్మార్థకామపురుషార్థాలు శరీరం దాల్చినవా అన్నట్లు ప్రకాశించాయి. నాల్గవ పురుషార్థం మోక్షం సాక్షాత్తుగా ధర్మజుడై ప్రకాశించింది.

ప్రజలందరు ధర్మజుని పొంది పరబ్రహ్మ చింతన చేసేవానిగా, యాగాల్లో వేదాంశాలు ఉపయోగించే వానిగా, శుభలోకాలు రక్షించేవానిగా గుర్తించారు. చంచల అయిన లక్ష్మి యుధిష్ఠిరుని కారణంగా రాజులలో స్థిరనివాసాన్ని ఏర్పరచుకొన్నది. బుద్ధి, ఉత్తమనిష్ఠ కలిగిన దయింది, ధర్మం దినదినం ప్రవర్ధమయ్యేలా మారింది. అవసరసమయాన సోదరుల నుపయోగించే ధర్మరాజు నాలుగువేదాలు యజ్ఞంలో ఉపయోగించేటట్లు వారిని తీర్చిదిద్దాడు. వారందరు అతని ఆజ్ఞావశులై చరింపసాగారు. బృహస్పతిసములైన దేవతాశ్రేష్ఠులు ప్రజాపతిని సేవించినట్లు ధౌమ్యాదులైన బ్రాహ్మణులందరు ఎల్లవేళలా ధర్మజుని అన్నివైపులచుట్టి సంరక్షింపసాగారు. నిర్మల చంద్రునిపై ప్రజలు ప్రీతిని చూపినట్లు ప్రజలందరి నేత్రాలు, హృదయాలు ధర్మజుని మీది ప్రేమతో ఆనందించాయి. ధర్మరాజు దైవికంగా ఏర్పడిన రా జని ప్రజలు సంతోషించలేదు. మనస్సుతో, భక్తిభావంతో సంతసించారు. ప్రజల మనోభీష్టాలకు అనుగుణంగా ధర్మరాజు సత్కృత్యాలను ఆచరించాడు. సదా మంచినే మాట్లాడే కుంతీనందనుని ముఖం నుండి అసత్యం, అయుక్తం, అసహ్యం, అప్రియం అయిన వచనాలు ఎన్నడూ వెలువడలేదు. భరతశ్రేష్ఠా! తేజోవంతుడైన ధర్మజుడు ప్రజలందరి హితం తన హితంగా భావించి వారిని ఆనందపరిచి తాను ఆనందించాడు. ఆ విధంగా పాండవు లందరు తమతేజస్సుచే శత్రురాజులను లొంగదీసికొని నిశ్చింతగా, సంతోషంతో ఇంద్రప్రస్థంలో జీవించారు.

కొన్నిరోజులకు అర్జునుడు శ్రీకృష్ణునితో "వేసవి కాలం వచ్చింది. యమునానదికి వెళ్దామా". మధుసూదనా! మిత్రులతో కలిసి సాయంకాలం వరకు విహరించి తిరిగి వద్దాం. మీ అనుమతిని తెల్పండి" అన్నాడు. వాసుదేవుడు పలికాడు - "కుంతీనందనా! నాకూ ఈకోరిక ఉంది. మనం స్నేహితులతో కలిసి యమునానదికి వెళ్లి జలవిహారం చేసి సుఖంగా తిరిగివద్దాం." వారిలా అభిప్రాయపడి, ధర్మజుని అనుమతిగైకొని, స్నేహితులతో యమునావిహారానికి వెళ్ళారు. ఆ విహారప్రదేశం ఎన్నో చెట్లతో, చిన్న,పెద్దభవనాలతో ఇంద్రుని నగరంలా ఉంది. అంతఃపురస్త్రీలతో బాటు ఆ ప్రదేశం పరిమళభరితం అయింది.

రత్నాలతో,ఉత్తమస్త్రీలతో శ్రీకృష్ణార్జునులు క్రీడాభవనం వెలుపలికి వచ్చారు. అచట ఎవరికివారు యమునాతీరంలో తమ స్వేచ్ఛానుసారం జలక్రీడలు ఆచరించారు. ఆకర్షణీయమైన వక్షఃస్థలం, విశాలనితంబాలు గలిగి మందగామినులై సుందరస్త్రీలంతా క్రీడించారు. శ్రీకృష్ణార్జునుల ప్రీతికి అనుగుణంగా కొంతమంది స్త్రీలు వనంలో, కొంతమంది జలంలో, కొంతమంది భవనాల్లో సముచితంగా క్రీడించారు. ద్రౌపది, సుభద్రకూడ ఆ పరవశించే వాతావరణంలో వస్త్రాలు, అభరణాలు, దాసీజనులకు సమర్పించారు. కొంతమంది సంతోషంతో నృత్యం చేశారు. కొంతమంది కోలాహలం చేశారు. కొంతమంది స్త్రీలు విరగబడినవ్వారు. కొంతమంది ఆ విహారంలో గానం చేశారు. కొందరు మిగతాస్త్రీలను అడ్డగించారు. పరస్పరం బాధించుకొన్నారు. కొందరు మంత్రాంగాలు చేశారు. రహస్యాల్ని ఒకరికొకరు చెప్పుకొన్నారు. ఆ భవనం, ఆ యమునా తీరవనం అందంగా మ్రోగే వేణు, వీణా, మృదంగవాద్యాల ధ్వనులతో అన్నివైపులా మారుమ్రోగాయి. ఈ విధంగా యమునాతీరంలో క్రీడావనవిహారం జరుగుతూ ఉంటే శ్రీకృష్ణార్జునులు ఇరువురూ సమీపాన ఉన్న ఒక అందమైన ప్రదేశానికి చేరారు. అక్కడకు చేరిన శ్రీకృష్ణార్జునులు విలువైన సింహాసనాలపై అసీనులు అయ్యారు. పూర్వం ఆచరించిన వీరవిహారాలనూ, పరిహాసప్రసంగాలనూ చాలా చెప్పుకొంటూ ఆ ప్రదేశంలో ఆనందించారు. స్వర్గలోకంలో అశ్వినీదేవతలవలె ఉండి ఆసీనులై సంతోషిస్తున్న కృష్ణార్జునుల సమీపానికి బ్రాహ్మణు డొకడు వచ్చాడు. ఆ బ్రాహ్మణుడు పెద్దమద్దిచెట్టు వలె పొడుగుగా ఉన్నాడు. మెరిసే బంగారంరంగులో వెలిగిపోతున్నాడు. నీలం, ఎరుపురంగులతో అతని అవయవాలు మెరుస్తున్నాయి. ఎత్తుకు తగిన బలం కలిగి ఉన్నాడు. ప్రాతఃకాలసూర్యకాంతితో సమాన తేజస్సు కలిగి ఉన్నాడు. జటాధారియై పట్టుబట్టలు ధరించాడు. ముఖం పద్మపత్రకాంతితో ఉంది. పింగళవర్ణ తేజస్సుతో వెలిగిపోతున్నాడు. ఆ తేజస్వి ద్విజశ్రేష్ఠుడు సమీపానికి రాగానే కృష్ణార్జునులు ఆసనాలనుంచి లేచి, నిలబడి, స్వాగతం పలికారు.

222. అగ్ని ఖాండవవనము దహించుట, శ్వేతకి కథ.

ఆ విప్రుడు కృష్ణార్జునులతో ఇలా అన్నాడు. "నేను ఎక్కువగా భుజింపశక్తి గల బ్రాహ్మణుడను. ఎల్లప్పుడు అపరిమితంగా భోజనం చేస్తాను. శ్రీకృష్ణార్జునులారా! నేను మిమ్ములను నాకు తృప్తి కలిగేటట్లు భిక్షను ఇమ్మని యాచిస్తున్నాను." అపుడు కృష్ణార్జునులు అతనితో పలికారు. "బ్రాహ్మణుడా! నీకు ఏ అన్నంతో తృప్తి కలుగుతుందో చెప్పు. దాన్ని

సంపాదించటానికి ప్రయత్నిస్తాం." వారిరువురు వీరులు అలా అడిగితే ఆ బ్రాహ్మణదేవత శ్రీకృష్ణార్జునులకు ఇలా బదులు చెప్పాడు. బ్రాహ్మణుడు అన్నాడు – "వీరులారా! నాకు అన్నంమీద ఆకలిలేదు. ముందు మీరు నన్ను అగ్నిదేవునిగా తెలుసుకోండి. మీరిరువురు నాకు తగిన దానినే సమర్పించండి. ఇంద్రుడు ఎల్లప్పుడు ఈ ఖాండవవనాన్ని పరిరక్షిస్తున్నాడు. నేను ఆ మహాత్ముని రక్షణలోని ఈ వనాన్ని దహింపలేకున్నాను. ఈ ఖాండవవనంలో ఇంద్రుని మిత్రుడు తక్షకుడు తన పరివారంతో నివసిస్తున్నాడు. ఆ తక్షకగణంకోసం ఇంద్రుడు ఈ వనాన్ని కాపాడుతున్నాడు. తక్షకుని కారణంగా ఇక్కడ ఇంకా అనేకప్రాణులను కాపాడుతున్నాడు. ఇంద్రుని ప్రభావంతో ఈవనాన్ని దహించాలనే తలంపు ఉన్నా దహింపలేకపోతున్నాను. మండిపోయే ఈ వనాన్ని ఇంద్రుడు జలధారతో ఆర్పివేస్తున్నాడు. ఈ వనాన్ని దహించాలనే నాకోరిక. కాని ఇంద్రుని ప్రభావంచే దహించలేకపోయాను. అస్త్రవేత్తలు మీరు సహాయంగా వస్తే ఖాండవవనాన్ని దహిస్తాను. ఈ అభిప్రాయంతో మీ దగ్గరకు వచ్చాను. ఇదే నాకు కావలసిన అన్నం. అస్త్రవిద్యావిశారదులు మీరువురూ నేను ఈవనాన్ని దహిస్తున్నపుడు కురిసే వర్షధారలనూ, ఈ వనం నుంచి నలుదిక్కులకు పోయే ప్రాణులనూ నివారించగలరు."

జనమేజయుడు అడిగాడు – "ఇంద్రుడు రక్షించే నానాప్రాణులను, ఖాండవవనాన్ని అగ్ని ఎందుకు దహించాలని భావించాడు? ఇది నానా ప్రాణులకు ఆశ్రయమిస్తోంది గదా! కోపించిన అగ్నిదేవుడు ఈ ఖాండవాన్ని దహిస్తాను అనటంవలన ఇందులకు బలమైన కారణమే ఏదో ఉండాలి. పూర్వకాలంలో జరిగిన ఖాండవవనదాహాన్ని గురించి నేను పూర్తిగా వినగోరుతున్నాను." అన్నాడు. వైశంపాయనుడు అన్నాడు – 'జనమేజయా! పూర్తివృత్తాంతాన్ని ఉన్నది ఉన్నట్లుగా వివరిస్తాను. ఏ కారణంగా అగ్ని ఖాండవదహనం కోరినాడో విను. ఖాండవవన వినాశరూపమైన గాథ పూర్వం ఋషులచే చెప్పబడింది. దాన్ని నేను నీకు వివరంగా చెబుతాను.

ఇంద్రసమప్రభావమూ, బల, పౌరుషాలూ గల శ్వేతకి అనేరాజు పూర్వకాలంలో ప్రసిద్ధి పొంది ఉన్నాడు. అతనితో సమానమైన దానశీలి, బుద్ధిమంతుడు, యజ్ఞకర్త మరొకడు లేడు. సమగ్ర దక్షిణలు ఇచ్చి గొప్పగొప్ప యజ్ఞాలు ఎన్నింటినో చేశాడు. ప్రతిదినం అతని ఆలోచనలో యజ్ఞాలు, వాటికి తగిన దానాలు మాత్రమే ఉంటాయి. యజ్ఞకర్మల నారంభించటం, వాటికి కావలసిన దక్షిణలు సమకూర్చటమే అతనికి ఇష్టం. ఈవిధంగా ఋత్విజులతో కలిసి శ్వేతకి యజ్ఞాలలో నిరంతరం దీక్షితుడై ఉన్నాడు.

అతని యజ్ఞాలలో ఋత్విక్కులందరి కళ్ళు పొగచే ఆవరింపబడి కనపడకుండా పోతున్నాయి. దీర్ఘకాలం ఆహుతిప్రదానంచే అందరు ఖిన్నులై రాజును విడచిపెట్టారు. అప్పుడు రాజు మరల వారిని యజ్ఞాలకోసం ప్రేరేపించాడు. నేత్రాల చూపుకోల్పోయి వారు యజ్ఞాలకు రాలేదు. రాజు వారి అనుమతి గైకొని ఇతరులతో క్రతువుల్ని పూర్తిచేశాడు. ఈ విధంగా యజ్ఞపరాయణుడైన రాజు ఒక సంకల్పం చేసి, వంద సంవత్సరాలు సత్రయాగం చేయ నిశ్చయించాడు. కాని ఆ మహాత్ముని యజ్ఞాన్ని సమాప్తి చేయగల ఋత్విజులు దొరకలేదు.

మహాయశస్వి శ్వేతకి అతనిస్నేహితులతో కలిసి ఈయజ్ఞంకోసం గొప్ప ప్రయత్నం చేశాడు. ఋత్విక్కుల పాదాలపైపడి, సాంత్వవచనాలతో, దానంతో అలసత్వం విడిచి యజ్ఞం చేయడం కోసం వారిని ప్రార్థించాడు. వారు అతని మనోరథాన్ని సఫలం చేయలేదు. అప్పుడు రాజర్షి శ్వేతకి కోపించి ఆశ్రమంలోని మహర్షులతో అన్నాడు. "బ్రాహ్మణులారా! నేను పతితుడనై మీ శుశ్రూష చేయలేనివాడనైతే మీరు నన్ను విడువచ్చు. నా ఈ క్రతుశద్ధ విషయంలో మిమ్ములను బాధించటం నాకు ఇష్టం లేదు. అపరాధం చేయకుండానే మీరు నన్ను విడచిపోవటం యుక్తంకాదు. నేను మీశరణు కోరాను. మీరు దయతో నాపై ప్రసన్నులు కండి. ద్విజోత్తములారా! నేను కార్యార్థినై సాంత్వవచనాలతో, దానాలతో మిమ్ములను బ్రతిమాలుకొంటున్నాను. మీసేవతో ఈకార్యక్రమాన్ని పూర్తి చేయ సంకల్పించాను. మీరు ద్వేషభావంతో నన్ను పరిత్యజించాలని అనుకొంటే నేను యజ్ఞం చేయించటానికి ఇతరఋత్విక్కులను వేడుకొంటాను." అని పలికి శ్వేతకి ఊరుకున్నాడు. యజ్ఞం చేయించే సామర్థ్యం లేని ఆ ఋత్విక్కులు కోపించి రాజుతో ఇలా అన్నారు. "రాజా! నీ యజ్ఞకర్మలు ఎల్లప్పుడు కొనసాగుతూ ఉన్నాయి. నిత్యం కర్మలలో లగ్నమయి మేము పూర్తిగా అలసి పోయాం. అలసిన మమ్ములను నీవు విడవటం యుక్తమైంది కాదు. ఈదశలో బుద్ధి మందగించి నీవు తొందరపడితే శివుని దగ్గరకు పోయి యాజకత్వం ఆచరింపమని ప్రార్థించు." బ్రాహ్మణుల నిందావాక్యాల్ని విని శ్వేతకి కోపించాడు. కైలాసపర్వతానికి పోయి గొప్ప తపస్సు చేశాడు.

కఠినంగా నియమాల్ని పాటిస్తూ, జితేంద్రియుడై, ఉపవాసంతో శివుని ఆరాధిస్తూ చాలాకాలం తపస్సు చేశాడు. పన్నెండవ రోజున ఒక్కొక్కసారి, పదహారవరోజున ఒక్కొక్కసారి ఆ రాజు కందమూలఫలాలను భుజించేవాడు. అతడు రెండుచేతులు పైకెత్తి, కనురెప్ప పాటులేక, కొయ్యవలె కదలక, ఏకాగ్రచిత్తంతో ఆరునెలలు ఉన్నాడు. గొప్ప తపస్సు చేస్తూ నియమపాలనాతత్పరుడైన ఆ రాజు పట్ల ప్రసన్నుడై శంకరుడు ప్రత్యక్షమయ్యాడు.

వాత్సల్యం ప్రదర్శిస్తూ గంభీరమైన కంఠస్వరంతో శివుడు రాజును ఉద్దేశించి అన్నాడు. 'రాజశ్రేష్ఠుడా! నీ తపస్సుకు మిక్కిలి సంతసించాను. నీకు శుభం జరుగుతుంది. నీకు ఏ వరం కావాలో అది కోరుకో.' అమిత తేజస్వి అయిన శంకరుని ఆ మాటలు విని, పరమాత్మ అయిన శివునికి నమస్కరించి శ్వేతకి ఇలా చెప్పాడు. "దేవదేవేశ! సర్వలోకాలకు వంద్యులైన మీరు నాపట్ల ప్రసన్నులైతే స్వయంగా మీరు నాచే యజ్ఞాలు చేయించండి." రాజవచనాలు విని శివుడు ప్రసన్నుడై చిరునవ్వుతో ఇలా పలికాడు. "రాజా! యజ్ఞం చేయించటం నా కర్తవ్యం కాదు. కాని ఈవరం కోసం నీవు గొప్ప తపస్సు చేశావు. ఒక నియమంపై నీకు నేను యాజకత్వాన్ని ఆచరిస్తాను. ఏకాగ్రచిత్తంతో బ్రహ్మచారివై పండ్రెండు సంవత్సరాలు ఎడతెగని ఆజ్యధారలతో అగ్నిని తృప్తిపరిస్తే నీ కోరికను నేను తీర్చగలను." ఇలా రుద్రుడు చెపితే మనుజాధిపుడైన శ్వేతకి శూలపాణి చెప్పినట్లు చేశాడు. పండ్రెండు సంవత్సరాలు పూర్తి అయ్యాక శంకరుడు తిరిగి వచ్చాడు. లోకాలను సృజించగల శంకరుడు మిక్కిలి ప్రీతితో ప్రత్యక్షమై శ్వేతకిని చూస్తూనే ఇలా అన్నాడు. "రాజా! నీవు వేదోక్తమైన కర్మచే నన్ను సంతృప్తిపరచావు. శాస్త్రవిధిగా యజ్ఞాలను చేయించే అధికారం బ్రాహ్మణులకే ఉంది. కావున నేను నీకు యజ్ఞాన్ని చేయింపలేను. భూమిపై నా అంశతో అవతరించిన ఒక ద్విజశ్రేష్ఠుడు ఉన్నాడు.

ఆయన నామధేయం దుర్వాసుడు. అతడే నీచే యజ్ఞాలను నా ఆజ్ఞానుసారం చేయిస్తాడు. నీవు సామగ్రిని సిద్ధం చేసుకో." రుద్రుడు చెప్పిన మాటలు విని శ్వేతకి సంతోషంతో తన నగరానికి తిరిగి వచ్చి యజ్ఞసామగ్రినంతా సిద్ధం చేశాడు. రాజు శ్వేతకి యజ్ఞసామగ్రిని సిద్ధం చేసికొని రుద్రుని వద్దకు పోయి సామగ్రి, సాధనాలు సిద్ధం అయినాయని, నీ అనుగ్రహంతో రేపే దీక్షితుడను అగుదును అని విన్నవించాడు. ఆ రాజవచనాలు విని రుద్రుడు దుర్వాసుని పిలిపించి అతనితో ఇలా అన్నాడు. 'ఈరాజు దోషరహితుడు, నామధేయం శ్వేతకి, నాఆజ్ఞానుసారం ద్విజోత్తమా! ఇతనిచే యజ్ఞాలు చేయించు.' అదివిని దుర్వాసుడు 'చాలా బాగున్నది, అట్లే' అని అంగీకరించాడు. యథాకాలంగా విధిపూర్వకంగా యజ్ఞం ప్రారంభం అయింది. శాస్త్రానుసారం కార్యక్రమం పూర్తి అయింది. దక్షిణలు బాగుగా ఇవ్వబడ్డాయి. శ్వేతకి చేసిన యజ్ఞం పూర్తి అయింది. మహాతేజస్వులైన ఋత్విజులందరు దుర్వాసుని అనుమతి పొంది వారివారి నివాసాలకు బయలుదేరి వెళ్ళారు. అదృష్టవంతుడైన శ్వేతకి వేదపారగులైన బ్రాహ్మణోత్తముల పూజలందుకొంటూ వందిమాగధుల స్తోత్రాలు వింటూ, పౌరుల అభినందనలతో నగరంలో ప్రవేశించాడు. ఆ రాజర్షి శ్వేతకి

చాలాకాలం పరిపాలన చేసి సదస్యులతో, ఋత్విజులతో కూడి స్వర్గానికి చేరాడు. ఆ సత్రయాగంలో అగ్ని పండ్రెండు సంవత్సరాలు నిరంతరం హవిస్సును త్రాగాడు. అద్వితీయమైన ఆ యజ్ఞంలో ఎల్లప్పుడు నేతిధారలను ఆస్వాదించటంతో అగ్నికి చాలా తృప్తి కలిగింది. తరువాత యజ్ఞకర్తలిచ్చే హవిస్సును గ్రహించే శక్తి నశించింది. అగ్నిరంగు తెల్లబడి పూర్వవర్ణాన్ని కోల్పోయాడు. అప్పుడు అగ్నిలో పూర్తిగా మార్పు వచ్చింది. తేజస్సు తగ్గింది. మానసికశ్రమ అతనిని క్రుంగదీసింది. ఆ అగ్ని తనను తేజోహీనునిగా తెలిసికొని లోకపూజ్యుడైన బ్రహ్మయొక్క నివాసానికి వెళ్ళాడు. అక్కడ ఆసీనుడైన బ్రహ్మను చూచి ఇలా పలికాడు – 'భగవంతుడా! శ్వేతకి మహారాజు తన యజ్ఞంతో నన్ను ఎక్కువగా తృప్తిపరచాడు. నాకు హవిస్సులను గ్రహించటంలో అరుచి కలిగింది. దానిని తొలగించుకొనే శక్తిలేదు. తేజస్సు కోల్పోయాను. బలహీనుడ నయ్యాను. నీ అనుగ్రహంతో పూర్వపు శక్తిని స్థిరంగా పొందాలని భావిస్తున్నాను.'

అగ్నిదేవుని మాటలు విని బ్రహ్మ చిరునవ్వుతో ఇలా అన్నాడు. 'హవ్యవాహనా! నీచే పండ్రెండు సంవత్సరాలు పూర్తిగా వసుధారరూపంలో నేతి ధారలు గ్రోలబడ్డాయి. కావున నీకు వైవర్ణ్యం, మానసికశ్రమ, అశక్తత ఏర్పడ్డాయి. నీవు తేజస్సును కోల్పోయావని విచారింపకు. నీవు తిరిగి పూర్వపుస్థైర్యాన్ని పొందుతావు. నేను సమయం వచ్చినపుడు నీ అరుచిని పోగొడతాను. పూర్వం దేవతల ఆజ్ఞానుసారం నీచే రాక్షసనివాసమైన ఖాండవవనం దహింపబడింది. ఇప్పుడు అక్కడ అన్నిరకాల జీవజంతువులు నివసించసాగాయి. వాటిని దహించడం ద్వారా వారి క్రొవ్వుచే నీవు స్వస్థుడవు కాగలవు. ఆ ఖాండవవనాన్ని దహించడానికి శీఘ్రంగా పో. నీ వీ అరుచి నుండి బయటపడతావు." పరమేష్ఠిముఖం నుండి వెలువడ్డ ఈమాటలు విని అగ్ని వేగంతో ఆ ప్రదేశానికి చేరాడు. ఖాండవవనానికి చేరి తన బలమంతా కూడదీసుకుని, వాయు ప్రేరణచే కోపించి దహించే యత్నం చేశాడు. భగభగమండుతున్న ఖాండవాన్ని చూచి అక్కడి ప్రాణులందరు అగ్నిని చల్లార్చటానికి తమతమ ప్రయత్నాలు చేశారు. వందల, వేలకొద్దీ ఏనుగులు తమ తొండాలతో తొందరగా జలాన్ని నింపుకొని, కోపించి అగ్నిని ఆర్పివేశాయి. ఎన్నో పడగలున్న సర్పాలన్నీ క్రోధంతో వడిగా తమశిరస్సులతో జలధారలను అగ్నిపై విడచాయి. ఈవిధంగా అక్కడి మిగిలిన ప్రాణులన్నీ తమ తమ శక్త్యనుసారం ధూళిని చిమ్మటం మొదలైన పనులద్వారా అగ్నిని ఆర్పివేశాయి. ఈ ప్రకారంగా మరలమరల ప్రజ్వలితుడై అగ్ని ఎడు పర్యాయాలు ప్రజ్వలింపచేసినా ఖాండవాన్ని దహించలేకపోయాడు.

223. అర్జునుడు అగ్నినుండి దివ్యధనుస్సు, రథము పొందుట.

నిరాశచే ఆవరింపబడి, మానసికక్షోభ పొంది, కోపంతో అగ్నిదేవుడు బ్రహ్మమందిరానికి చేరాడు. అక్కడ బ్రహ్మతో అన్నివిషయాలు జరిగినవి జరిగినట్లు నివేదించాడు. ఆ బ్రహ్మ కొద్దిసేపు ఆలోచించి ఇలా అన్నాడు. 'పుణ్యాత్మా! నీవు ఖాండవవనాన్ని దహింపచేయడానికి తగిన ఉపాయం తెలిసింది. కొంతసమయం నీవు ఎదురు చూడాలి. అటుపైన ఖాండవవనాన్ని దహిస్తావు.' ఆ దహించేసమయంలో నరనారాయణ ఋషులిరువురు నీకు సహాయపడతారు. వారితో కూడి నీవు ఖాండవవనాన్ని దహిస్తావు. అగ్ని సంతసించి 'అలాగే కానివ్వండి' అని బ్రహ్మతో పలికాడు. కొంతకాలం పిమ్మట నరనారాయణులు భూమిపై అవతరించారని తెలిసి బ్రహ్మగారిచ్చిన మాట గుర్తుకువచ్చింది. తిరిగి అగ్ని బ్రహ్మ సమీపానికి వెళ్ళాడు. ఆ సమయంలో బ్రహ్మ అగ్నితో అన్నాడు - అగ్నీ! ఇంద్రుడు చూస్తూ ఉండగానే ఖాండవవనాన్ని నీవెలా దహిస్తావో ఆ ఉపాయాన్ని ఇపుడే చెబుతాను. విను. 'అగ్నీ! ఆదిదేవులైన నరనారాయణులిరువురు దేవతల కార్యనిర్వహణకై మనుష్యలోకంలో అవతరించారు. అక్కడి జనులు వారిని అర్జునుడని, వాసుదేవుడని పిలుస్తుంటారు. వారు ఇప్పుడు ఖాండవవనానికి సమీపాన ఉన్నారు. ఆ వీరులిద్దరినీ ఖాండవనదహనంలో సహాయం చేయుమని అర్థించు. అప్పుడు నీవు ఇంద్రాదిదేవతలను కూడ ఎదిరించి వనదహనం చేయగలవు. వారిరువురు వీరులు ఒక్కటై ప్రయత్నంతో వనమందలి ప్రాణులను నివారించగలరు. ఇంద్రుడు దేవతల రాజైనా సరే! వారు ఎదుర్కొంటారు. సందేహం లేదు.'

ఇది విని హవ్యవాహనుడు వెంటనే కృష్ణార్జునుల సమీపానికి వెళ్లి నివేదించిన కార్యాన్ని నీకు ముందే నేను వినిపించాను. అగ్నిప్రార్థన విని అర్జునుడు ఇంద్రుని కోరికకు విరుద్ధంగా ఖాండవవనం దహించాలనే అభిలాషగల అగ్నితో ఆ సమయానికి అనుకూలంగా మాట్లాడాడు. అర్జునుడు పలికాడు - 'నావద్ద దివ్యాస్త్రాలు చాలా ఉన్నాయి. వాటితో నేను ఎందరు ఇంద్రులు వచ్చినా ఎదిరించగలను. నా బాహువీర్యానికి తగిన ధనుస్సు లేదు. సమరభూమిలో నా వేగానికి తగిన యుద్ధసామగ్రి లేదు. శీఘ్రగాములయిన అక్షయబాణాలు నాకు చాలా కావాలి. అన్ని బాణాలను మోయగల రథం నాదగ్గర లేదు. వాయుసమానవేగం కల తెల్లటి గుర్రాలు కావాలి. మేఘధ్వని సూర్యతేజస్సు కల రథం కావాలి. అలాగే కృష్ణుని పరాక్రమానికి తగిన ఆయుధం లేదు. దానితో ఈ యుద్ధంలో నాగులనూ, పిశాచాలను అతడు సంహరించాలి. భగవంతుడా! ఈకార్యసిద్ధిలో ఉపాయం

అవసరమై ఉంది. అది నీవు చెప్పాలి. ఖాండవవనంలో వర్షించే ఇంద్రుని నివారించే రథం, బాణాలు అవసరం. అగ్నిదేవా! పౌరుషంతో సిద్ధించే దానిని మేము చేయటానికి సిద్ధంగా ఉన్నాం. దీనికి తగిన సాధనాలను నీవు ఇవ్వవలసి ఉంది.'

224. అగ్ని శ్రీకృష్ణార్జునులకు ఆయుధము లిచ్చుట, ఖాండవ దహనము చేయుట.

అర్జునుని మాటలు విన్న అగ్ని లోకపాలకుడైన వరుణుని చూడాలని ధ్యానించాడు. అదితికుమారుడు, జలంలో నివసించేవాడు, జలస్వామి అయిన వరుణుడు తనను అగ్ని ధ్యానించాడని తెలిసి ప్రత్యక్షమయ్యాడు. నలుగురు లోకపాలురలో సనాతనుడూ, జలేశ్వరుడూ అయిన వరుణుని చూచి అగ్ని అతనితో ఇలా అన్నాడు. 'వరుణదేవా! రాజైన సోముడు మీకిచ్చిన ధనుస్సును, అక్షయతూణీరాన్ని, కపిధ్వజంతో ప్రకాశించే రథాన్ని నాకోసం అర్పించండి. ఈ పార్థుడు ఆ గాండీవంతో గొప్పసాధనకు పూనుకొన్నాడు. వాసుదేవుడు చక్రంతో నాకు సహాయపడాలి. కావున ఆ రెండింటిని నాకు ఇమ్ము.' అప్పుడు వరుణుడు "ఇప్పుడే ఇస్తున్నాను" అని అగ్నితో అన్నాడు. అద్భుతమైన గాండీవాన్ని, అక్షయతూణీరాన్ని ఇచ్చాడు. ఇతరుల శస్త్రాస్త్రాలకు నశించదు. సర్వశస్త్రాస్త్రాల్ని నశింపచేస్తుంది గాండీవం. ప్రమాణంలో మిగతా ధనుస్సుల కంటె పెద్దది. పదివేల ధనుస్సుల పెట్టు. అది ధరించిన వారి దేశాన్ని వృద్ధి చేస్తుంది. చిత్రవిచిత్రవర్ణాలతో ప్రకాశిస్తూ ఛిద్రాలు లేనిది. అనేకవేల సంవత్సరాలు దేవ, దానవ, గంధర్వ గణాలచే పూజింపబడింది. ఆ ధనుస్సును, అక్షయతూణీరాల్ని అగ్నికి ఇచ్చాడు. దివ్యాశ్వాలు పూన్చి కపిరాజు జెండాపైగల రథాన్ని సమర్పించాడు. ఆ గుఱ్ఱాలు శ్వేతవర్ణం కలవి. గంధర్వదేశంలో పుట్టి బంగారు మాలలు ధరించాయి. ఆ గుఱ్ఱాల కాంతి తెల్లని మేఘాల రంగువలె ఉంది. మనోవాయువేగాలు కలది. ఈ రథం ఆవశ్యకాలైన యుద్ధ సామగ్రితో నిండి దేవదానవులకు అజేయమై ఉంది. ఆ రథం తేజోమయకిరణాల్ని ప్రసరింపజేస్తోంది. గొప్ప ధ్వనికలిగింది. రత్నాలు పొదిగి మనోహరంగా ఉంది. తపస్సుచే విశ్వకర్మ ఆ ధనుస్సును నిర్మించాడు. 'దానిరూపం ఇది' అని వర్ణించటం చాలాకష్టం. పూర్వకాలం చంద్రుడు ఈ రథాన్నే అధిరోహించి దానవులను జయించాడు. నూతనమేఘంవలె ఆ రథం ప్రకాశిస్తోంది. దివ్యశోభలతో వెలిగిపోతోంది. ఆ శ్రేష్ఠరథాన్ని ఇంద్రధనుస్సువలె ప్రకాశించే కృష్ణార్జునులు సమీపించారు.

ఆ రథంధ్వజదండం సుందరమైంది. సువర్ణనిర్మితమైంది. దానిపై సింహ, శార్దూల

సమానాకారంగల వానరు డొకడు కూర్చుని ఉన్నాడు ఆ వానరుడు శత్రునాశనానికి సంసిద్ధంగా ఉన్నట్లు ఉన్నాడు ఆ ధ్వజంపై వివిధ భయంకర జంతువు లున్నాయి. వాటినాదం వింటే శత్రుసైనికుల ప్రాణాలు పైనుంచి పైకే ఎగిరిపోతాయి ఆ రథం వివిధపతాకలతో ప్రకాశిస్తోంది దానికి ప్రదక్షిణం చేసి దేవతలకు నమస్కరించి కవచం ఖడ్గం వ్రేళ్ళకు తొడుగులు దాల్చి పుణ్యాత్ముడైన అర్జునుడు దివ్యవిమానం అధిరోహించినట్లు రథాన్ని ఆధిరోహించాడు పూర్వం బ్రహ్మ నిర్మించిన ఆ శ్రేష్ఠమైన గాండీవాన్ని పొంది అర్జునుడు సంతోషించాడు. అగ్నిదేవుని ఎదుట పరాక్రమవంతుడైన అర్జునుడు ఆ ధనుస్సుకు నారి బిగించాడు ఆ సమయంలో ఉత్పన్నమైన ధ్వని విన్న ప్రాణులమనస్సు ఒక్కసారిగా వ్యాకులమైపోయింది ఆ దివ్యరథాన్ని అక్షయతూణీరాన్ని గాండీవాన్ని పొందిన అర్జునుడు ప్రసన్నుడై అగ్నికి సహాయం చేయటానికి సమర్థుడు అయ్యాడు అగ్నిదేవుడు ఇంతలో వజ్రంతో సమానమైన మధ్యబలం (నాభి) గల చక్రాన్ని శ్రీకృష్ణునికి ఇచ్చాడు అగ్నిదత్తమూ ప్రియమూ అయిన చక్రాన్ని పొంది సహాయపడటానికి శ్రీకృష్ణుడు సమర్థుడు అయ్యాడు శ్రీకృష్ణునితో అగ్నిదేవుడు అన్నాడు - అమానుషులైన రాక్షసులు పిశాచాలు, నాగులు దైత్యులు దేవతలను కూడ యుద్ధంలో నీవు గెలుస్తావు వీరందరినీ సంహరించి సర్వశ్రేష్ఠుడవు అవుతావు మాధవా! యుద్ధంలో శత్రువులపై నీవు విసిరినప్పుడల్లా శత్రువులను చంపి ఈ చక్రం తిరిగి నీచేతికి చేరుతుంది పిడుగువలె ధ్వనిస్తూ శత్రునాశనం చేసే కౌమోదకి అనేపేరు గల గదనుకూడ వరుణుడు శ్రీకృష్ణునికి ఇచ్చాడు మిక్కిలి సంతుష్టులైన కృష్ణార్జునులు శస్త్రాస్త్రాలు రథం కేతనం పొంది సురాసురులందరితో పోరాడగల సమర్థులు అయ్యారు ఇక పన్నగాలకై యుద్ధం చేసే వజ్రాయుధునితో ఎందుకు యుద్ధం చెయ్యలేరు? అర్జునుడు పలికాడు - అగ్నిదేవా! అందరి ఇంద్రియాలను ప్రేరేపించగల ఈ జనార్దనుడు చక్రాన్ని తీసుకొని యుద్ధం చేస్తే ముల్లోకాల్లోను భస్మంకాని వస్తు వనేదే ఉండదు అగ్నిదేవా! గాండీవాన్ని రెండు అక్షయతూణీరాలనూ తీసికొని నేనుకూడ అన్నిలోకాలను యుద్ధంలో గెలవాలనే ఉత్సాహంలో ఉన్నాను. మహాత్మా మీరిప్పుడు ఈ వనాన్ని నాలుగు వైపులనుంచి దహించండి మేమిద్దరం మీకు సహాయపడడానికి సిద్ధంగా ఉన్నాం

శ్రీకృష్ణార్జునుల పలుకులు విని అగ్నిదేవుడు తేజోరూపాన్ని స్వీకరించి ఖాండవదహనానికి పూనుకొన్నాడు ఎడుజ్వాలలు గల అగ్ని ఖాండవవనాన్ని అన్నివైపుల నుంచి యుగాంతమని భ్రమింపచేస్తూ దహిస్తున్నాడు అగ్నిదేవుడు ఆ వనాన్ని నాలుగు వైపుల నుంచి చుట్టుముట్టి లోపల బాగా వ్యాపించి మేఘ గర్జనతో సమంగా ప్రాణులన్నిటిని కంపింపచేశాడు అగ్నిచే

దహింపబడే ఆ ఖాండవవనం సూర్యకిరణాలచే వ్యాప్తమైన మేరుపర్వత సంపూర్ణస్వరూపం ప్రకాశిస్తున్నట్లుగా కనిపించింది

225. ఖాండవమున ప్రాణులగగ్గోలు, ఇంద్రుడు వర్షము కురిపించుట.

రథికులలో శ్రేష్ఠులైన కృష్ణార్జునులు ఖాండవవనానికి రెండువైపుల నిలబడి, అన్నిదిక్కులా సంచరిస్తూ అక్కడి ప్రాణులతో గొప్ప యుద్ధం సాగించారు ఖాండవవనంలోని ప్రాణులు దిక్కుతోచక ఎటువైపు పరుగులు తీస్తున్నాయో ఆ వైపు వీరిరువురూ వారిని అనుసరించారు. శీఘ్రంగా సంచరించే ఖాండవవనప్రాణులకు తప్పించుకొనటానికి చిన్న సందుకూడ చిక్కలేదు రథశ్రేష్ఠులైన శ్రీకృష్ణార్జునులు రెండువైపుల కాలే క్షురవలె అటుఇటు తిరుగసాగారు ఖాండవవనాన్ని అగ్ని దహిస్తూఉంటే లక్షలకొలదీ ప్రాణులు అన్నివైపుల నుంచి భయంకరంగా ఆక్రందనలు చేశాయి కొందరికి శరీరం తగులబడిపోయింది కొందరు ఉడికిపోయారు కొందరికి కన్నులు చిట్లిపోయాయి ఇంద్రియవైకల్యం పొంది తలో దిక్కుకూ పరుగులు తీశారు కొన్ని పుత్రులను కొగలించుకొని విడువలేక కొన్ని తల్లిదండ్రులను సోదరులను విడవలేక ప్రేమతో అక్కడే ఉండి చనిపోయాయి. కొందరు పళ్ళు కొరుకుతూ అనేకప్రదేశాలకు దూకి అటూఇటు దిక్కులు కానక సంచరిస్తూ తిరిగి అగ్నిలో పడ్డారు కొన్ని పక్షులు రెక్కలు కళ్ళు పాదాలు తగులబడి భూమిపైపడి కొట్టుకుంటున్నాయి కొన్ని శరీరాలు తగులబడిపోయి కనపడ్డాయి జలశయాలు వేడెక్కిపోయాయి సలసలమరుగుతున్న నీటితో అందులో నివసించే ప్రాణులు తాబేళ్లు చేపలు చనిపోయి కనిపించాయి. ప్రాణుల సంహార స్థలమైన ఖాండవవనంలో శరీరాలు తగులబడుతుంటే ప్రాణులన్ని రూపుదాల్చిన అగ్నిదేవతవలె కనబడ్డాయి ఎగిరి పారిపోయే పక్షులను అర్జునుడు ముక్కలుగా ఖండించి భగభగమండే అగ్నిలో పడేటట్లు చేశాడు ఆ పక్షులన్ని బాణాలతో అవయవాలు తెగి భయంకరంగా నినాదాలు చేస్తూ పైకివేగంగా ఎగిరి తిరిగి ఖాండవవనంలో పడిపోయాయి బాణాలచే గాయపడి గుంపులు గుంపులుగా ఉన్న ప్రాణుల ఆక్రందనలు మధించే సముద్రం యొక్క ఘోషలాగా వినపడ్డాయి

మండుతున్న అగ్నిజ్వాలలు ఆకాశానికి ఎగిసి దేవతలకు కూడా భయాన్ని కలిగించాయి ఆ జ్వాలచే ఉడికిపోయిన దేవతలందరు ఋషులతో కూడి దేవేశుడు అసురనాశకుడు సహస్రాక్షుడు అయిన ఇంద్రుని దగ్గరకు చేరి ఇలా పలికారు - 'దేవేశ్వరా అగ్ని ఏ కారణంగా మనుష్యులను దహిస్తున్నాడు? ప్రపంచానికి ప్రళయం రాలేదు కదా! వారి

మాటలు విన్న దేవేంద్రుడు స్వయంగా చూచి ఖాండవవనాన్ని అగ్నినుంచి రక్షించడానికి బయలుదేరాడు. ఇంద్రుడు తనతో అనేకరధసముదాయాలను తీసుకొని వెళ్ళి ఆకాశమంతా వ్యాపించి వర్షధారలను కురిపించాడు ఇంద్రుడు పంపిన మేఘాలు రధపుటిరుసుల ప్రమాణంలో వేలకొద్దీ ధారలను ఖాండవంలో కురిపించాయి కాని అగ్ని తేజోబలంచే ఆ ధారలన్నీ భూమిని చేరకముందే ఆకాశంలోనే ఇంకిపోయాయి ఎ ఒక్కటీ అగ్నిని చేరలేక పోయింది. అప్పుడు ఇంద్రుడు కోపించి పెద్దజ్వాలలు కల అగ్నిపై తిరిగి పెద్దపెద్ద మేఘాలద్వారా ఎంతో జలాన్ని కురిపించాడు అగ్నిజ్వాలలచే వ్యాప్తమై జలధారలు కురియటంతో ఒక్కసారిగా ఆ ఖాండవవనం పొగను ఎగచిమ్మి మేఘగర్జనలతో మార్మ్రోగిపోయింది

226. దేవతలతో శ్రీకృష్ణార్జునుల యుద్ధము.

జలాన్ని వర్షించే ఇంద్రుని జలధారను అర్జునుడు తన ఉత్తమాస్త్రాలను ప్రదర్శిస్తూ శరవర్షంతో నివారించాడు ఆత్మబలసంపన్నుడైన అర్జునుడు బాణవర్షం కురిపించి మంచు చంద్రుని ఆవరించినట్లు ఖాండవవన మంతటిని కప్పివేశాడు సవ్యసాచి విడచిన బాణాలు ఆకాశమంతా కప్పివేశాయి. అందుచే ఏ ఒక్కప్రాణీ ఖాండవవనం నుంచి బయటకు రాలేకపోయింది అగ్ని ఖాండవవనాన్ని దహిస్తూండగా బలసంపన్నుడైన నాగరాజు తక్షకుడు అక్కడలేడు కురుక్షేత్రానికి చేరాడు కాని బలవంతుడైన తక్షకుని కుమారుడు అశ్వసేనుడు అగ్నిజ్వాలల నుండి బయటపడటానికి తీవ్రప్రయత్నం చేశాడు అర్జునుని బాణాలతో కప్పబడి అతడు బయటకు రాలేకపోయాడు అతని తల్లి సర్పిణి అతనిని తన శరీరంతో కప్పి విడిపించింది ఆమె ముందుగా అతని తలను తరువాత మెల్లమెల్లగా తోకవరకు బయటకులాగింది సర్పిణి అశ్వసేనుని రక్షించాలని ఆకాశంలోకి ఎగిరింది వాడి అంచు గల తీక్ష్ణబాణంతో అర్జునుడు ఆమె శిరస్సును ఖండించాడు. శచీపతి ఇంద్రుడు ఈమె దురవస్థను తన కళ్ళారా చూశాడు ఇంద్రుడు అశ్వసేనుని విడిపించాలని గాలి వర్షంతో అర్జునుని మభ్యపెట్టాడు - ఆ సమయంలో అశ్వసేనుడు తప్పించుకొన్నాడు ఆ భయానకమాయను చూచి సర్వవంచితుడైన అర్జునుడు ఆకాశగతులైన ప్రాణులను రెండుగా, మూడుగా ఖండించాడు. అర్జునుడు కోపించి వక్రగామి అయిన సర్పాన్ని ఆశ్రయహీనుడ వగుము' అని శపించాడు అగ్ని వాసుదేవులు ఆ వచనాలను అంగీకరించారు

జయశీలి అర్జునుడు కోపించి ఇంద్రుని మోసాన్ని మాటిమాటికి స్మరిస్తూ శీఘ్రగాములైన బాణాలతో ఆకాశాన్ని కప్పి ఇంద్రునితో యుద్ధానికి దిగాడు యుద్ధంలో

కోపించిన అర్జునుని చూచి, ఇంద్రుడు ఆకాశాన్ని అంతటిని కప్పివేయగల ఐంద్రాస్త్రాన్ని ప్రయోగించాడు పిమ్మట మహాధ్వనితో వాయువు సర్వసాగరాలను కల్లోలపరిచే జలధారలతో నిండిన మేఘాలను ఆకాశంలో పుట్టించసాగాడు ఇంద్రుడు భయంకరాలైన మెరుపుల తళతళలు గల ఘోరమైన వజ్రాయుధాన్ని అర్జునునిపై విడచాడు అర్జునుడు కూడ ప్రతీకారనిపుణుడై వాయవ్యాస్త్రాన్ని అభిమంత్రించి వదిలాడు ఆ అస్త్రం ఇంద్రుడు పంపిన మేఘాలబలాన్ని వేగాన్ని నాశనం చేసింది. జలధారలు ఇంకిపోయి మెరుపుతీగలు నశించాయి క్షణకాలంలో ఆకాశం ధూళి అంధకారాలకు దూరమై స్వచ్ఛంగా కనిపించింది సుఖం కలిగించే గాలి వీచసాగింది. సూర్యమండలం స్వాభావికస్థితిని పొందింది ఎదురు లేకపోవటంతో అగ్ని సంతసించి వివిధరూపాలలో వెలిగిపోతూ ప్రాణుల దేహాన్నుంచి బయటకు వచ్చిన క్రొవ్వుతో మరింత ప్రజ్వలించాడు. అదే సమయంలో తన ధ్వనులను లోకాలన్నిటా వ్యాపింపచేశాడు. కృష్ణార్జునులు రక్షిస్తున్న ఆ ఖాండవాన్ని చూచి అహంకరించిన గరుడజాతికి చెందిన పక్షులన్నీ ఆకాశంలోకి ఎగిరాయి. ఒక గరుడ పక్షి వజ్రంవంటి తన రెక్కలు తుండం నఖాలతో శ్రీకృష్ణార్జునులను బాధించాలని అనుకొని ఆకాశంనుంచి ఒక్కసారిగా వారిపై పడింది అదేవిధంగా పాముల సముదాయాలన్నీ మండిపోయే ముఖాలతో ఘోరమైన కాలకూట విషాన్ని అర్జునుని దగ్గర విడిచిపెట్టాయి ఇదిచూచి అర్జునుడు క్రోధాగ్నిదీపితుడై బాణాలతో వాటిని ముక్కలు ముక్కలు చేశాడు. దేహనాశంకోసం అవి అన్నీ ప్రకాశించే అగ్నిలో ప్రవేశించాయి.

అటుపైన రాక్షసులు, గంధర్వులు యక్షులు అసురులు నాగులు యుద్ధం మీది ఉత్సుకతతో పోల్చరాని ధ్వనులు చేస్తూ వారిరువురిపై పడ్డారు ఇనుపచక్రాలతో వదలే లోహపు ఉండలుగల ప్రేలుడు సామగ్రి చేతిలో దాల్చి శ్రీకృష్ణార్జునులను చంపాలని క్రోధం పరాక్రమం ప్రదర్శించారు పెద్దగా కోలాహలం చేస్తూ బాణవర్షం కురిపించే వారి శిరస్సులను అర్జునుడు నిశితాలైన శరాలతో హింసించాడు శత్రుసంహారశీలి అయిన శ్రీకృష్ణుడు కూడ దైత్యదానవుల గుంపులతో యుద్ధంచేసి చంపివేశాడు. మరికొందరు శరపీడితులై చక్రవేగప్రేరితులై మహాతేజస్సు లయినా సముద్రం ఒడ్డునుచేరి ఆగిపోయినట్లు ముందుకు సాగలేకపోయారు. ఇంద్రుడు మిక్కిలి కోపించి తెల్లని ఏనుగును ఎక్కి వారిరువురివైపు వచ్చాడు రాక్షససంహారి ఇంద్రుడు వేగంగా పిడుగులాంటి వజ్రాయుధాన్ని తీసి విడుస్తూ దేవతలతో వీరిద్దరూ చచ్చారులే అన్నాడు దేవేంద్రునిచే పైకెత్తబడిన వజ్రాయుధాన్ని చూచి దేవతలందరూ అదే రీతిలో తమతమ ఆయుధాలన్నీ పైకి తీసి

పట్టుకొన్నారు రాజా! యముడు కాలదండాన్ని కుబేరుడు గదను వరుణుడు పాశాన్ని విచిత్రమైన వజ్రాన్ని చేతితో తీశారు స్కందుడు శక్తిని తీసుకొని మేరు పర్వతంలా నిశ్చలంగా నిలిచాడు అశ్వినీదేవతలు ప్రకాశించే ఓషధుల్ని గ్రహించారు ధాత ధనుస్సును జయుడు రోకలిని, మహాబలసంపన్నుడైన త్వష్టప్రజాపతి పర్వతాన్ని తీసికొని యుద్ధానికి దిగారు అంశుడు శక్తిని మృత్యుదేవత గండ్రగొడ్డలిని అర్యముడు భయంకరమైన పరిఘను తీసికొని యుద్ధంలో సంచరించారు మిత్రుడు వాడిఅంచుల చక్రాన్ని గ్రహించి ఎదురువచ్చాడు పూష, భరుడు కోపించిన సవిత ధనుస్సులు గ్రహించి శ్రీకృష్ణార్జునులను ఎదుర్కొన్నారు రుద్రులు వసువులు బలసంపన్నులైన వాయువులు విశ్వేదేవులు సాధ్యులు ఇంకా ఇతరులైన దేవతలు తమ తమ తేజస్సులతో వెలిగిపోతూ శ్రీకృష్ణార్జునులను చంపాలని వివిధాయుధాలను గ్రహించి వారివైపు వచ్చారు ఆ మహాసంగ్రామంలో ప్రళయకాలంలో ప్రాణులను మోహపరవశులను చేసే అపశకునాలు గోచరించాయి. దేవతాసహితుడైన ఇంద్రుని క్రోధాగ్నికి భయపడని కృష్ణార్జునులు జయింపశక్యం కాని ధనుస్సులు దాల్చి యుద్ధసన్నద్ధులయ్యారు.

అనంతరం యుద్ధవిశారదులైన వారిద్దరు కోపించి వజ్రసదృశాలైన బాణాలతో అక్కడి దేవతలందరినీ గాయపరిచారు దేవతలు అనేకవిధాలుగా పదేపదే ప్రయత్నించినా ఫలించలేదు. భయంతో యుద్ధం విడచి మరల ఇంద్రుని ఆశ్రయించారు శ్రీకృష్ణార్జునులు దేవతలను నివారించటం చూచి ఆకాశంలోని ఋషులందరు మిక్కిలి ఆశ్చర్యపోయారు ఇంద్రుడు కూడ యుద్ధంలో వారి పరాక్రమాన్ని పదేపదే చూచి మిక్కిలి ప్రీతుడై తిరిగి వారితో యుద్ధం చేశాడు అర్జునుని పరాక్రమం తెలుసుకొనటానికి ఇంద్రుడు మళ్లీ రాళ్ళవర్షాన్ని కురిపించాడు అర్జునుడు మిక్కిలి అమర్షతో ఆ వర్షాన్ని బాణాల సహాయంతో నష్టపరిచాడు విఫలమయిన రాళ్ళవర్షాన్ని ఇంకా పెంచి ఇంద్రుడు అర్జునునిపై కురిపించాడు ఇంద్రకుమారుడు అర్జునుడు అది చూచి తండ్రికి సంతోషాన్ని కల్గిస్తూ, వేగవంతమైన బాణాలతో ఆ రాళ్ళవర్షాన్ని నశింపచేశాడు తరువాత అర్జునుని చంపాలని ఇంద్రుడు స్వయంగా తన చేతులతో మందరపర్వతశిఖరాన్ని చెట్లతోసహా పెకలించి అర్జునునిపై విసిరాడు ఇది చూచి అర్జునుడు వేగంగా, సూటిగా పోయే బాణాలతో ఆ పర్వతశిఖరాన్ని వేయి ముక్కలుగా చేశాడు చీల్చబడిన ఆ పర్వతశిఖరరూపం ఆకాశం నుంచి విడి క్రింద పడే సూర్య చంద్ర గ్రహాల వలె ప్రకాశించింది క్రిందికి పడిపోయే ఆ పర్వతశిఖరం వల్ల ఖాండవ వనంలోని ప్రాణులెన్నో చనిపోయాయి

227. దేవతల పరాజయము, ఖాండవవనవినాశము, మయాసురరక్షణ.

అలా పర్వతశిఖరంపడటంతో ఖాండవ వనంలోని దానవులు రాక్షసులు, ఏనుగులు తరక్షులు భల్లూకాలు భయభ్రాంతాలయ్యాయి. మదాన్ని స్రవించే ఏనుగులు పెద్దపులులు, సింహాలు సివంగులు మృగాలు దున్నపోతులు అనేకరకాలైన పక్షులు మిగిలిన ప్రాణులు అన్నీ భయవిహ్వలాలై ఇటు అటు పరుగులు తీశాయి మండే వనాన్ని ఆయుధాలు పైకెత్తి నిలుచున్న కృష్ణార్జునులను ఆ ప్రాణులన్నీ చూశాయి ఉత్పాత ఆర్తనాదాలతో భయపడినట్లు ఉన్నాయి అనేకవిధాలుగా దహింపబడ్డ ఆ వనాన్నీ ఉద్యతాయుధుడైన శ్రీకృష్ణునీ చూచి ఆర్తనాదాలు చేశాయి భయంకరమైన ఆ ఆర్తనాదాలచే అగ్ని గర్జనలచే ఆకాశంలో ప్రళయ కాలమేఘాలు గర్జించినట్లు ధ్వని పుట్టింది అపుడు శ్రీకృష్ణుడు వారి వినాశనం కోసం తన తేజంతో ప్రకాశించే చక్రాన్ని వదిలాడు ఆ చక్రప్రహారంచే దానవ నిశాచర క్షుద్రప్రాణులన్నీ ఖండఖండాలుగా తెగి క్షణకాలంలో అగ్నిలో పడ్డాయి శ్రీకృష్ణుని చక్రం చీల్చివేయగా క్రొవ్వు రక్తంతో కూడిన ఆ రాక్షసులు సంధ్యాకాలంలోని ఎఱ్ఱటి మేఘాల్లా కనిపించారు శ్రీకృష్ణుడు అక్కడ పిశాచాలను, పక్షులను సర్పాలను పశువులను వేలకొద్దీ చంపుతూ యమునివలె సంచరించాడు శత్రుసంహారకుడు శ్రీకృష్ణుడు మాటిమాటికి చక్రం విసురుతున్నాడు అనేక ప్రాణులను చంపి చక్రం మళ్ళీ మళ్ళీ చేతికి చేరుతోంది ఆ విధంగా పిశాచ, రాక్షస సర్పాలను చంపే సర్వభూతాత్మకుడైన శ్రీకృష్ణుని రూపం భయంకరంగా మారిపోయింది. ఆ దానవగణం అంతలోను శ్రీకృష్ణార్జునులను గెలిచే విజేత ఎవడూ కానరాలేదు దేవతలందరు వారి బలంతో ఖాండవ వనాన్ని రక్షించలేక, దావాగ్నిని ఆర్పలేక ఓడిపోయి వెనుకకు తిరిగారు వెనుతిరిగిన దేవతలను పరికించి చూచి ఇంద్రుడు శ్రీకృష్ణార్జునుల్ని ప్రశంసిస్తూ మిక్కిలి సంతోషించాడు

దేవతలందరూ తిరుగుముఖం పట్టిన పిదప అశరీరవాణి గంభీరస్వరంతో ఇంద్రునితో ఇలా అంది ఇంద్రా! నీ స్నేహితుడు తక్షకుడు ఖాండవవన దహనసమయంలో ఇక్కడ లేడు కురుక్షేత్రానికి చేరాడు వాసవా కృష్ణార్జునులిరువురు యుద్ధంలో జయింపశక్యం కాని వారు అని నా మాటగా తెలుసుకో వీరు పూర్వదేవతలైన నరనారాయణులు వీరి ఖ్యాతి స్వర్గందాకా వ్యాపించింది వీరి పరాక్రమం బలం నీకూ తెలుసు వీరిని ముల్లోకాలలో జయింపగల వారు లేరు వీరిరువురు పురాతనులైన ఋషిశ్రేష్ఠులు. సుర అసుర యక్ష రాక్షస కిన్నర పన్నగ నర సముదాయాలకు పూజ్యులు దేవతలతో కలిసి ఇక్కడినుంచి వెళ్లటం నీకు ఉచితం. ఖాండవవనదహనాన్ని దైవసంకల్పం అనుకో ఆకాశవాణి మాటలను

విని అది నిజమని గుర్తించి క్రోధాసూయలను వీడి ఇంద్రుడు స్వర్గానికి అప్పుడే బయలుదేరాడు. మహాత్ముడైన ఇంద్రుడు బయలుదేరగా చూచి దేవతలందరు సేనలతో సహా అతనిని అనుసరించారు. సేనలతో బయలుదేరిన ఇంద్రుని చూచి వీరశ్రేష్ములైన శ్రీకృష్ణార్జునులు సింహనాదం చేశారు. ఇంద్రుడు ఆ ప్రదేశాన్ని వీడి స్వర్గానికి బయలుదేరాడు. ఆనందించిన కృష్ణార్జునులు అత్యంతప్రసన్నులై అడ్డులేకుండా ఖాండవాన్ని దహింపచేశారు. బలమైన వాయువు మేఘాలను చెల్లాచెదరు చేసినట్లు అర్జునుడు దేవతలందరినీ ఖాండవవనప్రాణులనూ తన బాణాలతో చంపసాగాడు. సవ్యసాచి బాణాలు వేసేటప్పుడు అతని బాణాల నుండి ఎ ప్రాణీ బయట పడలేకపోయింది.

మహాప్రాణులుకూడా అమోఘాస్త్రాలు గల అర్జునుని యుద్ధంలో చూడనే లేకపోయాయి ఇక యుద్ధం ఎలా చేయగలవు ఒక్కొక్కసారి అర్జునుడు ఒకే బాణంతో వందలకొద్దీ ప్రాణులను చంపేవాడు ఒక్కొక్కప్రాణిని వందలకొద్దీ బాణాలతో తుత్తునియలు చేసేవాడు. ఆ ప్రాణులన్నీ విగతజీవులై యమునిచే ప్రత్యక్షంగా చంపబడినట్లు అగ్నిలో పడ్డాయి. దుర్గమస్థానాలలో ఉన్నా వనం సమీపాన ఉన్నా శాంతిమాత్రం వాటికి లభించలేదు పితృ దేవలోకాలలోనికి ఖాండవవనదాహంచే పుట్టిన వేడి ప్రవేశించింది ప్రాణి సంఘాలన్నీ భయంతో దీనంగా ఆక్రోశించసాగాయి ఎదిరింప శక్యంకాని ఎనుగులు, మృగాలు అన్నీ రోదించసాగాయి ఆ గగ్గోలుతో గంగలోను సముద్రాల లోను సంచరించే చేపలన్నీ భయపడ్డాయి. ఆ వనంలో నివసించే విద్యాధరులు కూడ భయపడ్డారు. ఆ సమయాన అర్జునుని శ్రీకృష్ణుని ఎవ్వరును కన్నెత్తి చూడలేకపోయారు. ఇంక యుద్ధానికి శక్తి ఎక్కడుంది? రాక్షస దానవ సర్పజాతులతో ఎవరైనా గుంపుకట్టి బయటకు వస్తుంటే శ్రీకృష్ణుడు వారినందరిని చక్రంతో ఖండించాడు పెద్దపెద్ద శరీరాలు గల ఆ ప్రాణులు అన్నీ చక్రవేగం వల్ల ప్రాణాలు కోల్పోయి శరీరం ముక్కలై అగ్నిలో పడ్డాయి ఆ జీవుల క్రొవ్వు రక్తం, మాంసాలతో తృప్తి నొందిన అగ్నిదేవుడు ఆకాశచారియై ధూమం లేకుండా ప్రకాశించాడు ఆయన కన్నులు నాలుక ముఖం గొప్పతేజంతో వెలిగిపోయాయి పైకిలేచిన కేశాలతో అగ్ని ప్రకాశించాడు పింగళవర్ణనేత్రు డయ్యాడు ప్రాణులక్రొవ్వును త్రాగాడు కృష్ణార్జునులిచ్చిన ఆ భోజనరూపమైన అమృతం గ్రోలి అగ్ని మరింతగా తృప్తిచెందాడు. గొప్ప శాంతిని పొందాడు.

ఆ సమయంలో తక్షకుని ఇంటదాగి బయటకు పారిపోయే మయుడనే రాక్షసుని శ్రీకృష్ణుడు చూశాడు గాలి సారధిగా గల అగ్ని మూర్తిమంతుడై జటలు దాల్చి మేఘంతో

సమానంగా గర్జిస్తూ వానిని దహిస్తానని ప్రార్థించాడు. మయుడు దానవేంద్రుల ఉత్తమశిల్పి అని గుర్తించి వాసుదేవుడు చక్రం చేతిలోకి తీసుకొని చంపాలని నిలబడ్డాడు. ఒకవైపున శ్రీకృష్ణుని మరియొకవైపున బూదిచేయసిద్ధమైన అగ్నిని మయుడు చూశాడు. వెంటనే అర్జునుని శరణువేడి రక్షింపుమని ప్రార్థించాడు. భయయుక్తమైన కంఠస్వరాన్ని విన్న అర్జునుడు అతనికి ప్రాణదానం చేస్తూ, భయపడవద్దు' అని అన్నాడు అర్జునుని మనస్సులో దయకలిగింది నీవు భయపడవల దని తిరిగి అర్జునుడు అతనిని ఊరడించాడు. అర్జునుని శరణులో చేరిన నముచిసోదరుడైన మయుని శ్రీకృష్ణుడు చంపటానికి ఇష్టపడలేదు అగ్నికూడ దహించలేదు శ్రీకృష్ణార్జునులచే రక్షింపబడి ఇంద్రుని ఆక్రమణకు దూరమైన ఆ ఖాండవవనాన్ని అగ్ని పదిహేను రోజులు దహించాడు ఈ ఖాండవ దహనంలో అగ్ని ఆరుగురిని దహించలేదు-అశ్వసేనుడు మయుడు నాలుగు శార్ఙ్గకాలు

228. మందపాలజరితల వృత్తాంతము, అగ్నిస్తుతి.

జనమేజయుడు అడిగాడు - వనాన్ని పూర్తిగా తగులబెట్టిన అగ్ని ఎందుకు ఈ నాలుగు శార్ఙ్గకాలను దహించలేదో చెప్పండి విప్రవర్యా! అశ్వసేనునీ రాక్షసుడైన మయునీ దహింపకపోవటానికి కారణాలు చెప్పారు శార్ఙ్గకాల్ని దహింపకపోవటానికి కారణం చెప్పలేదు. అగ్నిదాహంలో ఈపక్షిపిల్లలు నాలుగూ క్షేమంగా ఉండటం ఆశ్చర్యకరం. దయతో దానికి కారణం చెప్పండి వైశంపాయనుడు అన్నాడు - ఆ భయంకరమైన అగ్ని దాహంలో పక్షులు దహనం కాకపోవటానికి తగిన కారణం అంతటినీ వివరంగా చెపుతాను. వినుధర్మజ్ఞులలో ఉత్తముడు, తపస్వి కఠోరనియమాలను పాలించే మందపాలుడనే మహర్షి ఒకడు ఉన్నాడు అతడు ఊర్ధ్వరేతస్కుల (బ్రహ్మచారుల) మార్గాన్ని ఆశ్రయించి స్వాధ్యాయపరుడై, ధర్మమందు ఆసక్తితో తాపసియై ఇంద్రియాలను జయించి జీవించాడు అతడు తపస్సు పూర్తిచేసి దేహం విడచి పితృలోకానికి వెళ్ళినా ఆ తపస్సుకు సత్కర్మలకు తగిన ఫలాన్ని అక్కడ పొందలేకపోయాడు తపస్సుచేత జయించినా నిష్ఫలాలైన లోకాలను చూచి ఆ మహర్షి యమధర్మరాజు సమీపానికి పోయి దగ్గరలోని దేవతలను ఇలా అడిగాడు నేను తపస్సుచే సంపాదించిన ఆ లోకాలు ఏకారణంచే మూసివేయబడ్డాయి నేను సత్కర్మలను చేసినా తగిన ఫలితాన్ని ఇక్కడ ఎందుకు పొందలేదు? దేవతలారా. ఎలోపంచేత ఈలోకం మూసివేయబడిందో ఆ కర్మను తిరిగి ఆచరిస్తాను. మీరా సత్కర్మను నాకు ఉపదేశించండి దేవతలు పలికారు - బ్రాహ్మణుడా! మానవులు ఋణగ్రస్తులై

భూలోకంలో పుడతారు. దానిని గూర్చి చెబుతాను యజ్ఞకర్మలు బ్రహ్మచర్యం సంతానం వీటిచే ఆ మూడు ఋణాలూ తీరిపోతాయి సంశయంలేదు యజ్ఞం తపస్సు వేదాధ్యయనాలచే ఆ ఋణమంతా తీరుతుంది నీవు తాపసివి యజ్ఞకర్తవు అయ్యావు సంతానం మాత్రం నీకు లేదు నీకు సంతానం లేకపోవడం వల్ల కర్మలచే సాధింపబడిన ఈ లోకాలు మూసివేయబడ్డాయి ముందు సంతానాన్ని కని ఆపై పుష్కలభోగాలను అనుభవించు పున్నామనరకం నుంచి తండ్రిని రక్షించేవానిని పుత్రుడని వేదాలు ఘోషించాయి కావున బ్రాహ్మణోత్తమా! సంతానం కోసం ప్రయత్నించు

ఆ దేవతల మాటలు విని మందపాలుడు ఎక్కడ శీఘ్రంగా ఎక్కువ సంతానం కలుగునా అని ఆలోచించాడు ఈవిషయాన్ని ఆలోచిస్తూ ఎక్కువ సంతానాన్ని ఇవ్వగల పక్షులను చేరాడు జరిత అనే శారికతో శారికుడై సంబంధాన్ని పెంచుకొన్నాడు ఆమెయందు సంస్కారంచే బ్రహ్మవాదులైన నలుగురు కుమారులను జనింపచేశాడు అండదశలోనే వారిని తల్లితో అక్కడనే విడచి లపిత అనే పక్షివద్దకు మందపాలుడు చేరాడు మహానుభావుడైన మందపాలుడు లపితను చేరేసరికి సంతానంపై మిక్కిలిప్రేమగల జరిత చాల ఆలోచనలో పడింది అండాలలో నున్న (గ్రుడ్లు) బిడ్డలను విడువలేక పుత్ర శోకపీడితయై ఖాండవ వనమందే ఉండిపోయింది. ఆమె తనస్నేహ ప్రవృత్తితో అప్పుడే గ్రుడ్లను వీడి బయటకు వచ్చిన పిల్లలను పెంచిపోషించసాగింది పిమ్మట ఆ వనంలోనే లపితతో సంచరిస్తున్న మందపాలుడు ఖాండవవనాన్ని దహించడానికి వచ్చిన అగ్నిదేవుని చూశాడు. అగ్ని మనోనిశ్చయమెరిగి పుత్రుల బాల్యావస్థను తలచుకొని మందపాలుడు భయపడి తేజోవంతుడు, లోకపాలకుడు అయిన అగ్నిని తన పుత్రులను రక్షించమని ఇలా ప్రార్థించాడు అగ్నీ నీవు సర్వలోకాలకు ముఖస్వరూపుడివి. దేవతలకు హవిస్సును చేరుస్తావు నీవు ప్రాణులదేహాలలో రహస్యంగా సంచరిస్తున్నావు నిన్ను కవులు అద్వితీయుడని పిలుస్తారు దివ్య భౌమ జరర అనలరూపంగల త్రివిధమూర్తిగా నిన్ను కొలుస్తారు నిన్ను అష్టవిధమూర్తిగా ప్రశంసించి (భూమి జలం, తేజస్సు వాయువు ఆకాశం సూర్యుడు చంద్రుడు యజమాన స్వరూపం) యజ్ఞవాహనుడని చెపుతారు విశ్వం నీచేతనే సృష్టింపబడిందని ఋషులు అందరు చెపుతారు నీవు లేకపోతే లోకమంతా నశిస్తుంది నీకు నమస్కరించి బ్రాహ్మణులు వారి కర్మలచే పత్నీపుత్రులతో ఉత్తమ శాశ్వతగతిని చేరుతున్నారు అగ్నీ ఆకాశంలో మెరుపుతీగలతో కూడి విహరించే మేఘపంక్తి నీవే అని కొనియాడుతున్నారు. ప్రళయకాలంలో నీనుంచి బయటపడిన ఆయుధాల

వంటి జ్వాలలు సర్వప్రాణులను నశింపచేస్తున్నాయి నీనుంచే ఈజగత్తు అంతా పుట్టింది నీచేతనే సత్కర్మలవిధానం లోకంలో ప్రసరించింది చరాచరప్రాణులు నీనుంచే ఉత్పన్నం అవుతున్నాయి పూర్వం నీనుంచి జలాలు వచ్చాయి. నీయందే ఈజగత్తు సుప్రతిష్ఠితమై ఉంది. హవ్యకవ్యాలు నీయందు స్థిరంగా ప్రతిష్ఠింపబడ్డాయి నీవు అగ్నివి నీవే బ్రహ్మవు నీవే బృహస్పతివి అశ్వినీకుమారులు కూడ నీవే చంద్రసూర్యులు వాయువు కూడ నీస్వరూపాలే. రాజా మందపాలునిచే అలా పొగడబడిన అగ్ని అమితతేజస్వి అయిన మందపాలుని విషయంలో ప్రసన్నుడై 'నేను మీకు ఏమి చేయుదును ? అన్నాడు అంజలి ఘటించి మందపాలుడు అగ్నితో 'ఖాండవదహన సమయంలో నాపుత్రులను విడిచిపెట్టు అన్నాడు అట్లే అని అగ్ని ప్రతిజ్ఞ చేసి, వారిని విడచి ఖాండవవనాన్ని మాత్రం దహించాలనే తలంపుతో ఉన్నాడు

229. జరిత తన పిల్లలకొరకు విలపించుట.

అగ్ని మండుతుండగా మిక్కిలి దుఃఖితులై వ్యధతో ఉద్విగ్నమైన పక్షులు తమ రక్షకుని కానలేకపోయాయి ఆ చిన్నపిల్లలను గూర్చి విన్న దీనురాలైన తల్లి - జరిత శోకంతో దుఃఖంతో విలపించసాగింది జరిత చెప్పింది - భయంకరుడైన ఈ అగ్ని వనాన్ని దహిస్తూ ఇటువైపు వస్తున్నాడు. అతడు జగత్తును భస్మంచేసి నా దుఃఖాన్ని పెంచుతాడు. సాంసారికజ్ఞానం లేని ఈ చిన్న చిన్న పక్షిపిల్లలు నన్ను ఆకర్షించాయి రెక్కలు రాలేదు కాళ్ళుకూడ సరిగా ఎర్పడలేదు ఈ పిల్లలే మాపితృదేవతలకు దిక్కు అందరినీ భయపెడుతూ చెట్లనికూడ ఆస్పాదిస్తూ ఈ అగ్ని ఇటే వస్తున్నాడు రెక్కలురాని ఈ పిల్లలు నాతో ఎగరలేవు ఈ పిల్లల్ని తీసుకొని నేను ఎగురలేను విడిచిపోలేను నాహృదయం చాలా కలవరపడుతోంది నేను ఏ పిల్లను విడుస్తాను? ఏ పిల్లను తీసుకుని ఎగురుతాను? ఎంది చేసి కృతకృత్యురాల నవుతాను? పిల్లలారా ఆలోచన చెప్పండి ఎంతసేపు ఆలోచించినా మిమ్ము విడిపించే ఉపాయమేదీ కనపడటం లేదు నారెక్కలతో మిమ్మల్ని కప్పుతాను. మీతో సహా మరణిస్తాను పుత్రులారా నిర్దయుడైన మీతండ్రి ఇదివరకే చెప్పి వెళ్లాడు జరితారి కులంలో పెద్ద కావున కులరక్షణ అతనిపై ఉంటుంది సారిస్వక్కుడు రెండవవాడు పితృదేవతల కుల వృద్ధి ఇతనిచే జరుగుతుంది స్తంబమిత్రుడు తపస్సు చేస్తాడు ద్రోణుడు బ్రహ్మవాదులలో శ్రేష్ఠుడు అని నాపై గొప్పకష్టమైన ఆపద వచ్చిపడింది ఈనలుగురి పిల్లలలో ఎవరిని తీసుకొని బయటపడగలను ఎంచేస్తే పని

నెరవేరుతుంది. ఈ విధంగా ఆలోచిస్తూ జరిత భయవిహ్వల అయింది కాని తన పిల్లలను రక్షించుకొనే ఉపాయం ఏదీ ఆమెబుద్ధికి తోచలేదు

ఈ విధంగా భయవిహ్వల అయిన తల్లిని చూచి పిల్లలు తల్లితో అన్నాయి 'అమ్మా! నీవు మాపై ప్రేమను వదలి అగ్నిలేనిచోటికి ఎగిరిపో అమ్మా మేం నశించినా నీకు పిల్లలు కలగడానికి అవకాశం ఉంది కాని నీవు నశిస్తే మన కులపరంపర మిగలదు అమ్మా! ఈ రెండు పక్షాలను బాగా ఆలోచించి ఎది మనకులానికి శ్రేయస్కరమో దానిని గురించి ఆలోచించు దానిని ఆచరించటానికి నీకు ఇది తగిన సమయం నీవు మా అందరి పుత్రులపై ప్రేమను విడు లేకపోతే అందరం నశిస్తాం ఉత్తమలోకాలను కాంక్షించే నాతండ్రి సత్కర్మ వ్యర్థం చేయకుండా ఆలోచించు అపుడు జరిత అన్నది - "భూమిపై ఈవృక్షం దగ్గర ఎలుక కన్నం ఉంది. దీనిలోకి త్వరగా ప్రవేశించండి అగ్నివలన మీకు ఇక్కడ భయం ఉండదు మీరు ప్రవేశించాక ధూళితో ఈరంధ్రాన్ని మూసివేస్తాను పుత్రులారా! మండే అగ్నివలన రక్షణ పొందటానికి ఇదే ఉపాయం అని నానమ్మకం. అగ్ని చల్లార్చిన తర్వాత ధూళిని తొలించి మిమ్ములను విడిపిస్తాను అగ్నినుండి రక్షింపబడటానికి ఈ ఉపాయం మీకు నచ్చుతుంది అని అనుకొంటున్నాను ' పక్షులు పలికాయి - "రెక్కలు లేని, మాంసపు ముద్దలైన మమ్ములను ఆ ఎలుక తినివేస్తుంది. ఈ భయంతో మేమీ బిలంలో ప్రవేశింపలేము అగ్ని మమ్ము ఎలా దహింపడో, ఎలుక మమ్ములను ఎలా నాశంచేయదో, మాతండ్రి సత్కర్మ ఎలా వ్యర్థంకాదో ఎట్లు మాతల్లి జీవింపగలదో అని దాన్ని ఆలోచిస్తున్నాం. బిలంలో ఉన్న ఎలుకవల్లనూ నాశం కలుగుతుంది. ఆకాశంలోకి ఎగిరితే అగ్నివల్లనూ నాశం కలుగుతుంది ఈరెంటిని పర్యాలోచిస్తే అగ్నిలో మరణించటమే శ్రేయస్కరం. ఎలుకకు చిక్కి మరణించడం హీనం ఒకవేళ మమ్ములను బిలంలోని ఎలుక తినివేస్తే అపుడు మామృత్యువు నింద్య మవుతుంది. అగ్నిలో పడి మరణిస్తే అది శిష్టాచారం అవుతుంది.

230. జరిత - ఆమె పిల్లల సంవాదము.

జరిత పలికింది - పిల్లలారా! ఈ బిలంనుండి బయటకు వచ్చిన ఎలుకను డేగ తన్నుకుపోయింది డేగ తన కాళ్ళతో గట్టిగా పట్టి ఎగిరింది. అందువల్ల మీ కీ బిలంలో భయం ఉండదు పక్షులు పలికాయి - "డేగ తన్నుకుపోయిన ఎలుకను గూర్చి మాకు తెలియదు అయినా ఇక్కడ ఇంకా ఎలుకలు ఉండవచ్చు. వాటివల్ల భయం ఉండనేఉంది అగ్ని ఇంతవరకు వస్తుందనే విషయం సందేహం వాయువేగంతో అగ్ని మరొకవైపుకు

పోవచ్చు బిలంలోనున్న ప్రాణులచే మాకు మృత్యువు కలగటంలో సందేహంలేదు. తల్లీ! సంశయరహితమైన చావుకంటె సంశయాత్మకమైన చావు మంచిది. కావున నీవు ఆకాశంలోనికి ఎగురు నీవు తిరిగి మంచి పుత్రులను పొందగలవు జరిత అంది – "నేను వేగంగా పోతూ బిలం నుంచి ఎలుకను తీసుకొని పోయే ఆ డేగను అనుసరించి వెళ్లాను. బిలం నుండి ఎలుకను తీసికొని పోయినందున ఆశీర్వాదిల్చాను శ్యేనరాజా! మాకు శత్రువైన ఎలుకను తీసికొనిపోతూ ఉన్నందున నీకు స్వర్గప్రాప్తి కలిగి శత్రువులు లేనివాడవై బంగారు శరీరం కలవాడవు అవుతావు అపుడా డేగ ఎలుకను తినివేసింది పిమ్మట ఆ డేగకు వీడ్కోలు చెప్పి తిరిగి ఇంటికి వచ్చాను పిల్లలారా! బిలంలో ప్రవేశించండి. నిస్సంశయంగా మీకు భయం లేదు. నేను చూస్తుండగనే డేగ ఎలుకను చంపింది. పక్షులు పలికాయి – తల్లీ డేగచే చంపబడిన ఎలుకను గూర్చి మేము ఎఱుగం అది తెలియక కన్నంలో ప్రవేశించలేం.'

జరిత పలికింది – "పిల్లల్లారా! డేగ చంపిన మూషికాన్ని గురించి నేను తెలుసుకొన్నాను. మీకు భయంలేదు నామాటలను పాటించండి ' పక్షులు పలికాయి – "నీవు అసత్యవృత్తంతో మమ్మల్ని భయంనుంచి దూరం చేయాలని ప్రయత్నం చేయవద్దు. సందిగ్ధకార్యాలు చేయటం బుద్ధిమంతుల పనికాదు మేం నీకు ఉపకారం చేయలేదు ముందు మేమెవరమో కూడ నీకు తెలియదు ఈవిషయం నీవు గుర్తించలేదు. నీవు కష్టాలను సహించి ఎందుకు మమ్ములను రక్షించాలి అని తలంచావు? నీవు మాకు ఏమవుతావు? మేము నీకు ఏమవుతాం? అమ్మా నీవు యౌవనంలో ఉండి, చూడముచ్చటగా ఉన్నావు. పతిని అన్వేషించటంలో సమర్థురాలివి నీవు నీపతిని అనుసరించు మేమీ అగ్నిలో పడి దగ్ధులమై ఉత్తమలోకాలను పొందుతాము మేం ఒకవేళ అగ్నిలో దహనం కాకుంటే నీవు మాదగ్గరకు రా. వైశంపాయనుడు అన్నాడు – పిల్లలమాటల్ని విన్న జరిత వేగంగా ఖాండవవనాన్ని వీడి అగ్ని చొరబడని కుశలమైన ప్రదేశానికి చేరింది అటుపైన తీక్ష్ణజ్వాలలు గల అగ్ని వేగంగా మందపాలుని పుత్రులైన పక్షులు ఎక్కడ ఉన్నాయో అక్కడికి చేరాడు మండే అగ్నిని చూచి ఆ పక్షులు పరస్పరం వార్తాలాపాలు సాగించాయి జరితారి అగ్నిదేవునితో ఇట్లు పలికాడు

231. శార్ఙ్గకములు అగ్నిదేవుని పాగడి అభయము పొందుట.

జరితారి చెప్పాడు – "బుద్ధిమంతుడైన పురుషుడు ఆపత్కాలానికి ముందే మేల్కొంటాడు. కష్టకాలం వచ్చాక వ్యథ చెందడు. మూఢచిత్తుడు రాబోయే ఆపదను తెలుసుకోకుండా కష్టకాలం వచ్చాక బాధపడినా శ్రేయస్సును పొందలేడు."

సారిస్పక్కుడు పలికాడు - నీవు ధీరుడవు తెలివైన వాడివి. ఇది మాప్రాణాలు ఆపదలో పడిన సమయం చాలామందిలో ప్రాజ్ఞుడు శూరుడు ఒక్కడే ఉంటాడు అనటంలో సందేహం లేదు. స్తంబమిత్రుడు అన్నాడు - పెద్ద అన్న తండ్రితో సమానం పెద్ద అన్న కష్టాల నుంచి విడిపిస్తాడు పెద్దఅన్న రాబోయే ఆపదను గుర్తించలేకపోతే చిన్నవాడు ఎంచేస్తాడు? ద్రోణుడు పలికాడు - అగ్ని మండిపడుతూ మనబలాల వైపు వేగంగా వస్తున్నాడు ఏడు జిహ్వాలు కల ముఖంతో క్రూరుడై చెట్లనన్నింటిని దహిస్తూ, వ్యాపిస్తున్నాడు ఇట్లు మందపాలుని పుత్రులు వారిలో వారు మాట్లాడుకొని ఎకాగ్రచిత్తంతో అగ్నిదేవుని స్తుతించారు-రాజా! అది విను

అగ్నిదేవా! మీరు వాయుదేవుని ఆత్మస్వరూపులు, లతలకు శరీరం మీవీర్యమే జలాలకు కారణం భూమికి కూడ మీరే కారణభూతులు మీ జ్వాలలు సూర్యకిరణాలతో సమానంగా పైకి క్రిందకి, ముందుకి వెనక్కి ప్రక్కలకు ప్రసరిస్తాయి.' సారిస్పక్కుడు పలికాడు - ధూమకేతూ మాతల్లి మమ్మల్ని విడచిపోయింది తండ్రిజాడ తెలియదు రెక్కలు రానివాళ్లం నీకంటె వేరొక రక్షకుడు మాకు లేడు బాలురమైన మమ్ములను మీరే రక్షించాలి నీ మంగళకరమైన స్వరూపం ఎడు జ్వాలలు కలది అన్నిటితో నీశరణువేడిన దీనులమైన మమ్ము కాపాడు. అగ్నీ మీరొక్కరే అన్నిచోట్ల తపిస్తున్నారు దేవా సూర్యకిరణాలలోని తపించేశక్తి మీరే హవ్యవాహనా. మేము చిన్న ఋషులం. మమ్ము రక్షించండి. మానుంచి దూరానికి తొలగండి స్తంబమిత్రుడు పలికాడు - నీవొక్కడివే సర్వస్వం. నీవు సమస్తజగత్తుకు అధిష్ఠాతవు భూతాల్ని నీవే పాలిస్తున్నావు. జగత్తును పరిపాలిస్తూ భారం మోస్తున్నావు నీవు అగ్నివి హవ్యం తీసికొనిపోయేవాడవు శ్రేష్ఠమైన హవిస్సువు నీవే శ్రేష్ఠపురుషులు నిన్ను అనేకరూపాలతోను ఎకరూపంతోనూ కూడా భావిస్తారు అగ్నీ మూడులోకాలను సృజించి తగినసమయంలో దహించి సంహరిస్తున్నావు. సమస్తలోకానికి నీవే ఉత్పత్తి స్థానం నీవే లయస్థానం అవుతున్నావు ' ద్రోణుడు పలికాడు 'జగత్పతీ! నీవు ప్రాణులశరీరాల్లో ఉండి ప్రాణులు తిన్న అన్నాన్ని సదా పచనం చేస్తున్నావు నీయందే విశ్వం సుప్రతిష్ఠితం సర్వజ్ఞుడా నీవే సూర్యుడవై కిరణాలతో భూమినుంచి జలాలను రసాలను గ్రహించి తగినసమయంలో తిరిగి వర్షాలద్వారా భూమిపై జలాలను రసరూపంగా విడుస్తున్నావు మంచిరంగు గలవాడా! నీనుంచే పచ్చటి ఆకులు గల వనస్పతులు నదులు మంగళకరమైన మహోదధి ఏర్పడుతున్నాయి ప్రచండ కిరణాలు గలవాడా శరీర రూపమైన ఈ మా ఇంటికి రసాధిపతి వరుణుడు దిక్కు నీవు శీతలుడవై

మమ్ము రక్షించు నాశం చేయవద్దు పింగాక్షా! ఎర్రటికంరం కలవాడా! కృష్ణవర్త్మా అగ్నీ! సముద్రుని ఇళ్ళనువలె మమ్ము విడువుము ఇంకొక మార్గంలో వెళ్లు.

ద్రోణుని మాటలు విన్న అగ్ని ప్రసన్నుడై మందపాలుని కిచ్చిన మాటను గుర్తు తెచ్చుకొని ద్రోణునితో అన్నాడు నీవు ద్రోణుడవనే ఋషివి బ్రహ్మతత్వాన్ని వ్యాఖ్యానించావు. నీకోరికను తీరుస్తాను. నావలన నీకు భయం ఉండదు. మందపాలుడు అనే ఋషి మీ వృత్తాంతం ముందే నివేదించాడు ఖాండవవనదహనంలో నాపుత్రులను విడచిపెట్టు అని ద్రోణా నీతండ్రికిచ్చిన మాటను నీవు చెప్పిన దానిని విచారిస్తే రెండూ విశిష్టమయినవే నీకు నేనేం చేయగలనో చెప్పు నేను మిక్కిలి తృప్తిని పొందాను. నీకు మంగళం అగుగాక నీ ఈస్తోత్రంచే మిక్కిలి ప్రసన్నుడను అయ్యాను ' ద్రోణుడు పలికాడు శుక్ల స్వరూపుడా! అగ్నీ ఈ పిల్లి పిల్లలు ప్రతినిత్యం మమ్ము బాధిస్తున్నాయి వీటిని బంధుమిత్రసహితంగా నాశనం చెయ్యి వైశంపాయనుడు అన్నాడు - శార్ఙ్గకాల అనుమతితో అగ్ని అట్లే ఆచరించాడు. అధికంగా ప్రజ్వలించి పూర్తిగా ఖాండవవనాన్ని దహించాడు

232. మందపాలుడు తన పిల్లలతో కలియుట.

మందపాలుడు కూడ తన పుత్రులను గూర్చి చింతించాడు వారి సంరక్షణ కోసం అగ్నిని ప్రార్థించినా అతనికి శాంతి లభించలేదు. పుత్రులకోసం పరితపిస్తూనే లపితతో ఇలా అన్నాడు 'లపితా నా పుత్రులు తమ గూళ్లలో ఎలా పరిరక్షింపబడతారో! అగ్ని ప్రజ్వలించి వాయువు శీఘ్రంగా వస్తుంటే ఆ సమయంలో నాకుమారులు అగ్ని నుండి రక్షించుకోలేని వారు అవుతారు వారి తల్లి దీనురాలై స్వయంగా వారిని రక్షించటంలో అసమర్థురాలై పుత్రుల సంరక్షణ చేయలేక శోకార్తురాలు అవుతుంది నాపిల్లలు ఎగరలేరు. రెక్కలు తపతపలాడించే శక్తి ఇంకా రాలేదు వారి అవస్థను చూచి, తపించి ఆక్రోశిస్తూ నలువైపులు పరుగులు తీసి ఉంటుంది నాజ్యేష్ఠపుత్రుడు జరితారి ఎట్లుండెనో? సారిసృక్కుడు స్తంబమిత్రుడు, ద్రోణుడు ఎట్లున్నారో? దీనురాలైన జరిత ఏబాధ పడుతోందో

మందపాల ఋషి ఈప్రకారంగా ఖాండవవనంలో విలపిస్తుంటే లపిత అసూయతో ఇలా బదులు పలికింది. 'నీకు పుత్రులను చూడాలి అనే చింత అవసరంలేదు తేజస్సులూ వీర్యవంతులూ అయిన ఏ ఋషులపేర్లు నీ పిల్లలకు పెట్టావో వారి మహిమచే నీపుత్రులకు కొంచెమైనా నాభయం లేదు నా సన్నిధిలో నీచే అగ్నిదేవునికి స్వయంగా పుత్రులు అర్పించబడ్డారు ఆ మహాత్ముడు వారి రక్షణవిషయంలో ప్రతిజ్ఞ చేశాడు లోకపాలకుడు

అగ్ని మాట ఇస్తే అది అబద్దం కాదు నీమనస్సు పిల్లలను రక్షించటం అనే బంధుకృత్యంలో ఉత్సుకం కాలేదు నాశత్రువైన జరితను చింతిస్తూ పరితపించావు నీకు నా విషయంలో పూర్వం ఆమెయందు ఉన్నట్లు ప్రేమ నిశ్చయంగా లేదు సహాయకుల శక్తి కల నీవు స్నేహితులమైన మాయందు ఉపేక్ష చూపటం ఉచితం కాదు. నీవు ఎ జరితకోసం బాధపడుతున్నావో ఆమెవద్దకే వెళ్ళు. నేను కూడ దుష్టుని ఆశ్రయించిన స్త్రీవలె ఒక్కతెనే చరిస్తాను.' మందపాలుడు పలికాడు - నీవెలా అనుకొంటున్నావో నేను అలా ఈ సంసారంలో సంచరించటం లేదు నా విచారమంతా సంతానం కోసమే. అట్టి నా సంతానం సంకటస్థితిలో ఉంది పుట్టిన పిల్లలను విడచి భవిష్యత్తులో పుట్టబోయే పిల్లలగురించి ఆలోచించేవాడు మూర్ఖుడు లోకమంతా అతనిని ఆదరించదు. నీకెలా తోస్తే అలా చెయ్యి. ఈ ప్రజ్వలితాగ్ని చెట్లనన్నింటినీ తన నాలుకలతో కబళిస్తూ ఉంటే ఉద్విగ్నమైన చిత్తంలో అమంగళకరమైన సంతాపం పుడుతోంది."

ఆ ప్రదేశం నుంచి అగ్ని తొలగిపోగానే తనపిల్లల మీది ప్రేమతో జరిత తిరిగి శీఘ్రంగా అక్కడకు చేరింది అగ్ని కరుణచే విముక్తులై క్షేమంగా ఉన్న పిల్ల లందరినీ చూచింది. కష్టంతీరి అరుస్తున్నట్లు తెలిసికొంది వారి దర్శనం వల్ల ఆమె మరలమరల కన్నీటి ధారలను విడచింది ఒక్కొక్కరిని విడివిడిగా పిలచి తన పిల్లలను కలిసి ఆనందించింది ఇంతలో మందపాలుడు కూడా శీఘ్రంగా అక్కడికి వచ్చాడు కాని ఆ పిల్లలలో ఎవ్వరూ ఆ మందపాలుని అభినందించలేదు. విలపిస్తున్నవారి నొక్కక్కరిని జరితను మరలమరల పలుకరించినా వారెవ్వరు ఆ ఋషితో మంచిగా గాని చెడుగా గాని మాట్లాడలేదు మందపాలుడు అన్నాడు - 'ప్రియా! వీరిలో నీ జ్యేష్ఠపుత్రుడు ఎవడు? చిన్నవాడెవడు ? మధ్యముడు ఎవడు? అందరికంటె చిన్నవాడు ఎవడో చెప్పు. నేను ఈ విధంగా దుఃఖంతో బాధపడుతుండగా నాకు సమాధానం చెప్పవేమి? నేను నిన్ను విడచిపెట్టినా శాంతిని పొందలేదు." జరిత పలికింది - నీకు జ్యేష్ఠునితో పని ఏముంది? తరువాతి వానితో ఏమిపని? మధ్యమునితో, కనిష్ఠునితో సిద్ధించే ప్రయోజనమేమి? పూర్వం నీవు నన్ను అందరికంటె హీనురాలిగా భావించి విడచిపెట్టావు ఆ సుందరమైన చిరునవ్వు యౌవనం గల లపితవద్దకే పొమ్ము మందపాలుడు అన్నాడు - స్త్రీలకు పరలోకంలో పరపురుషసంబంధం సవతి పోరు తప్ప మరే దోషం వారి పరమార్థాన్ని నాశం చెయ్యలేదు ఈ సవతిపోరు శత్రుత్వాగ్నిని వెలిగిస్తుంది ఎక్కువగా శరీరాన్ని బాధిస్తుంది ప్రాణు లందరిలో ప్రసిద్ధురాలు మంగళలక్షణాలు గల అరుంధతి వశిష్ఠుని శంకించింది. ఆయన

హృదయం నిర్మలం ఎల్లప్పుడు అరుంధతి ప్రియాన్ని హితాన్ని కోరేవాడు. సప్తర్షిమండలంలో ఆకాశంలో విరాజమానుడు. ఇట్టి మునిని సవతి కారణంగా అరుంధతి తిరస్కరించింది ఇట్టివానిని శంకించుటచే ఆమె శరీరకాంతి ధూమవర్ణంగా, ఆరుణునివలె మందంగా మారిపోయింది ఆమె ఒకసారి కనిపిస్తూ ఒకసారి కనిపించక ప్రచ్ఛన్న వేషధారిణి వలె నిమిత్తాలను ఆశ్రయించింది సంతానం కోసం వచ్చిన నన్ను నీవు తిరస్కరించావు అభీష్టవస్తువు లభించిన పిదప నాపట్ల నీవు ఏ సందేహాన్ని ప్రదర్శిస్తున్నావో లపిత కూడ అట్లే చేసింది. ఇది నా భార్య అని పురుషుడు ఎన్నడును స్త్రీపై విశ్వాసముంచరాదు సంతానవతి అయిన పిదప స్త్రీ భర్త సేవను విడచివేస్తుంది " వైశంపాయనుడు చెప్పాడు - పిమ్మట పుత్రులందరు వారి వారి రూపాలతో తండ్రివద్దకు వచ్చి కూర్చున్నారు మందపాలుడు కూడ వారిని ఊరడించటానికి ఉద్యుక్తుడు అయ్యాడు.

233. ఇంద్రుడు శ్రీకృష్ణార్జునులకు వరమిచ్చుట, మయాసురుని యమునాతటమునకు చేర్చుట.

మందపాలుడు పలికాడు - నేను అగ్నిని ఖాండవవనదహన సమయంలో నా పిల్లలను విడువుమనికోరాను అతడట్లే అని ప్రతిజ్ఞచేసి ఆ ప్రతిజ్ఞను పాటించాడు అగ్నివచనాలను స్మరించి మీతల్లి ధర్మజ్ఞతను తెలిసికొని మీ మీ శక్తియుక్తులను గుర్తించి పూర్వమే నేనిక్కడికి రాలేదు పుత్రులారా! మీరు నన్నుగూర్చి మీహృదయంలో బాధ పడవద్దు మీరు ఋషులని అగ్నికి తెలియును మీకు బ్రహ్మతత్త్వం పూర్తిగా తెలిసింది ఈ విధంగా భార్యాపుత్రులను ఊరడించిన మందపాలుడు ఆ ప్రదేశం నుండి వేరొక ప్రదేశానికి చేరాడు అక్కడ తీవ్రంగా ప్రజ్వలించే అగ్ని తన ప్రచండజ్వాలలతో లోకహితాన్ని కోరి శ్రీకృష్ణార్జునుల సహాయంతో ఖాండవవనాన్ని పూర్తిగా దహించాడు మజ్జ కొవ్వు కాలువలై ప్రవహిస్తుండగా వాటినన్నింటిని త్రాగి అగ్ని తృప్తిని పొంది అర్జునుని ముందు ప్రత్యక్షం అయ్యాడు

పూజ్యుడైన ఇంద్రుడు మరుద్గణాలతో ఆకాశం నుంచి దిగి వచ్చి శ్రీకృష్ణార్జునుల నుద్దేశించి ఇలా పలికాడు మీ ఇరువురిచే దేవతలకు అసాధ్యమైన కర్మ ఆచరింపబడింది ప్రసన్నుడను అయ్యాను ఈ లోకంలో మనుష్యులకు దుర్లభం అయిన వరాన్ని కోరుకోండి అర్జునుడు ఇంద్రుని మంచి శస్త్రాస్త్రాల నన్నింటిని కోరాడు తేజస్వి అయిన ఇంద్రుడు ఆ అస్త్రాలను ఇవ్వటానికి సమయం నిశ్చయించాడు. పాండుకుమారా! నీకు శంకరుడు

ప్రసన్నం అయినప్పుడు అన్ని అస్త్రాలను అందచేస్తాను. ఆ సమయం ఎప్పుడు ఆసన్నమవుతుందో అదీ నాకు తెలుసు. నీ తపస్సుకు ప్రసన్నుడనై, సంపూర్ణాలైన ఆగ్నేయ, వాయవ్య, ఐంద్రాస్త్రములను అనుగ్రహిస్తాను.'' వాసుదేవుడు 'అర్జునునిపై నా ప్రేమ నిరంతరం పెరుగుగాక' అని వరం కోరాడు. బుద్ధిమంతుడైన శ్రీకృష్ణునికి ఆ వరాన్ని ఇంద్రుడు ఇచ్చాడు. ఇలా వారిరువురికి వరాలు ఇచ్చి మరుత్తులతో కూడి, ఇంద్రుడు అగ్నిదేవుని ఆజ్ఞగైకొని స్వర్గానికి చేరాడు. అగ్నిదేవుడు కూడ మృగాలు పక్షులతో కూడిన ఆ వనాన్ని పూర్తిగా జ్వలించి, తృప్తిని పొంది ఆరురోజులు విశ్రాంతి తీసుకొన్నాడు. జీవజంతువుల మాంసాన్ని తిని, క్రొవ్వును, రక్తాన్ని త్రాగి ఆనందించిన అగ్ని వారిరువురితో ఇలా అన్నాడు. ''పురుషశ్రేష్ఠులైన మీచే సుఖం కలిగేటట్లు తృప్తి పొందాను. మీకు ఇష్టమైన చోటికి వెళ్లటానికి అనుమతిని ఇస్తున్నాను.'' అగ్నిదేవునిచే అనుమతిని పొంది అర్జునుడు, శ్రీకృష్ణుడు, మయుడు ఆయనకు ప్రదక్షిణం కావించారు. యమునానది సుందరతటంపై ముగ్గురూ ఒకచోట ఆసీనులు అయ్యారు.

ఇది ఆదిపర్వం


IAC No 96352

భారతం ఎందుకు చదవాలి ?

1. మనం భారతీయులం కనుక. భారతీయులుగా మెలగాలంటే భారతీయులుగా మిగలాలంటే భారతం చదివి తీరాలి.
2. నీవు - నేను అనే భేదం విడిచి మనం అనే భావం పెరగాలంటే... భారతం చదివి తీరాలి.
3. మనల్ని మనం చక్కగా పరిపాలించుకోవాలంటే... భారతం చదివి తీరాలి.
4. ప్రపంచంలో మన ఉనికిని నిలుపుకోవాలంటే... భారతం చదివి తీరాలి.
5. ప్రజలంతా నా బంధువులు, మిత్రులు అనే భావం పెరగాలంటే... భారతం చదివి తీరాలి.
6. దేవ, ఋషి, పితృఋణాలతో పాటు మనుష్యఋణం తీర్చుకోవాలంటే... భారతం చదివి తీరాలి.
7. పాలించడమంటే చెప్పుకిందకు తొక్కడం కాదనీ రక్షించడమనీ తెలియాలంటే... భారతం చదివి తీరాలి.
8. బుద్ధిజీవి అయిన మానవుడు వయసులో ఉన్నపుడే భారతం చదివితే ఇహపర శాస్త్రాలు రెండూ అందుకోగలడు. కనుక ముందుగా యువతరం భారతం చదివి తీరాలి.
9. తీవ్రబుద్ధి మనిషి మనస్సును చీలుస్తుంది - సద్బుద్ధి మనుషుల మనస్సులను బుద్ధులను కలుపుతుంది. ఆ భావన కోసం... భారతం చదివి తీరాలి.